
# ఆత్మీయ
# సత్యవాక్య పరిగెలు

## బంగారు పరిగె



సేకరణ : సిస్టర్ గ్రేస్ విజయ టి.యస్
సమకూర్పు : బ్రదర్ బి. శివాజి రాజు

# ఆత్మీయ సత్యవాక్య పరిగెలు

బంగారు పరిగె

మొదటి ముద్రణ

జనవరి 2023

ప్రతులు

1000 కాపీలు

సంకలనం :

సిస్టర్. గ్రేస్ విజయ

విజయవాడ, అమెరికా

సమకూర్పు :

పాస్టర్ బి. శివాజిరాజు

ఎడిటర్, స్వర్ణదీపిక

9392135100

ముద్రణ

స్వర్ణదీపిక, విజయవాడ.

7207207281

swarnadeepika1993@gmail.com

# సత్యవాక్య జుంటె తేనెపట్టు



సహోదరి గ్రేస్ విజయ

ప్రేమ నమ్మకము గల ప్రియ ప్రభువును సదా కీర్తించి ఆరాధిస్తూ...

ఆయన పాద పద్మములకు "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" (బంగారు పరిగె) అనే 53వ పుస్తకమును సవినయంగా సమర్పిస్తున్నాను.

తేనెటీగలు లక్షల పుష్పాల నుండి సేకరించిన మకరందాన్ని ఒక తుట్టెలో ఉంచి తేనెపట్టుగా మార్చిన చందంగా నేను చదివిన వివిధ పుస్తకాల నుండి దైవగ్రంథమైన బైబిల్ నుండి మనస్సును అహ్లాదపరచే జీవిత సత్యాలను అనేకం సేకరించాను. అమూల్య జీవిత సత్యసంపదను జుంటెతేనె ధారల వంటి "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు"గా 1500కు పైబడి ఈ పుస్తకంలో పొందుపర్చాను.

**మనిషికి డబ్బు ఇచ్చే ధైర్యం కంటే**
**మనిషి ఇచ్చే నమ్మకం చాలా గొప్పది.**
**వికసించే పువ్వు నేర్పింది తనలా అందంగా జీవించమని**
**రాలిపోతున్న ఆకు నేర్పింది జీవితం శాశ్వతం కాదని**
**ప్రవహించే వాగు నేర్పింది తనలా అవరోధాలు దాటి వెళ్ళమని**
**మెరిసే మెరుపు చెప్పింది తనలా క్షణం అయినా గొప్పగా ఉండమని**

ఈ ఆణిముత్యాల వంటి జీవిత సత్యాలు ప్రతి హృదయంలో స్థిరంగా నిలిచి ఆధ్యాత్మికంగా గొప్ప అభివృద్ధిని పెంపొందించి భౌతిక జీవనంలో నిబ్బరాన్ని ఇస్తాయి.

మనుషులతో సత్సంబంధం కలిగి ఉంటే అది చెరకు వలె తియ్యగా ఉంటుంది. దానిని ముక్కలు చేసినా, నలగగొట్టినా, పిండినా తీయని రసమే వస్తుంది.

ఈ "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" అదే పని చేస్తుంది. గతంలో యు.ఇ.సి.ఎఫ్ వారి ప్రోత్సాహంతో పి.డి.ఎఫ్ రూపంలో www.uecf.net వెబ్ సైట్‌లో ఉంచిన పుస్తకాలు అనేక దేశాలలో అనేకులకు చేరువగుట దేవుని కృప. జాషువ ఫణి గారి కృషి ఫలితంగా నాటి నుండి నేటి వరకు పుస్తక పరిచర్య సజీవంగా నిలిచినందున కృతజ్ఞతలు.

వివిధ పుస్తకాల నుండి ఏరిన ముత్యాలు ఈ పుస్తకంలో పొందుపర్చాను. దేవుడు నాకిచ్చిన రచనాసక్తికై కృతజ్ఞతలు. వాట్సప్‌లో దిన దినం అందుకుంటున్న నిత్య సత్యాలు సేకరించి తెలుగులో అనువదించే భాగ్యం పొందాను. ఆధ్యాత్మిక సత్యాలు నెలవారి మ్యాగజైన్ల నుండి సేకరించాను.

అనుదిన ధ్యానాంశాల సేకరణలో ఎన్నో జీవిత సత్యాలు, ఆత్మీయ మెళకువలు, విశ్వాసి జీవితానికి వనరులుగా ఉంటాయనే ఆకాంక్షతో "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" మీకందించే గొప్ప భాగ్యం ప్రభువు నాకిచ్చినందున ఆ దేవునికి నిండు కృతజ్ఞతలు.

స్వర్ణదీపిక క్రైస్తవ వార్తా పత్రిక ఎడిటర్, సహో॥ బెల్లంకొండ శివాజి రాజు గారితో నాకు చిరకాల పరిచయం ఉంది. స్వర్ణదీపిక ప్రారంభం నుండి నేను పాఠకురాలిని. వారు నేను ప్రచురించిన పుస్తకాలన్నింటిని చదివి నన్ను ఎంతగానో ప్రోత్సహించిన నా ఆత్మీయ సోదరులు. వారికి "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" చిందర వందరగా, ఒక పోగుగా ఆయనకు అప్పగించాను. ఈ పుస్తకం యొక్క ఉద్దేశ్యాన్ని ఆయన గ్రహించి పూర్తిగా ఎడిటింగ్, కూర్పు, ప్రూఫ్ రీడింగ్, ప్రింటింగ్ మొత్తం బాధ్యతలు వారికి అప్పగించగా సహృదయంతో స్వీకరించి ఈ పుస్తకాన్ని అత్యంత విలువైన పుస్తకంగా వన్నెతెచ్చారు. వారికి వారి సిబ్బంది కృషికి నా కృతజ్ఞతలు.

డి.టి.పి చేయుటకు సహకరించిన కుమారుడు మైఖెల్ డేవిడ్‌కు, తప్పు ఒప్పులు సరిచేయుటకు సహకరించిన ప్రియ సోదరి రెవరెండ్ జాయ్ పీటర్ గారికి నా నిండు కృతజ్ఞతలు. గతం నుండి నేటి వరకు ఈ పుస్తకములను ఆదరించి అభినందించి ప్రోత్సాహమిస్తున్న చదువరులందరికి నా వందనాలు.

నా శేష జీవితం క్రీస్తు ప్రభువు పాద సేవలో తరించాలనేదే నా ఆశయం. ప్రభువు నాకిచ్చిన ఆరోగ్యము, ఆయుష్షు కేవలం ఆయన సేవ కొరకు వినియోగించాలనే దృక్పథంతో, సాహసంతో ఈ పరిచర్య కొనసాగిస్తున్నాను.

నా కొరకు మీరు ప్రార్థించాలని కోరుకుంటూ...

సదా మీ సేవలో

**సోదరి గ్రేస్ విజయ.**

# అమూల్య జీవిత సత్యవాక్య పరిగెలు



*జ్ఞానుల మాటలను వారు చెప్పిన గూఢ వాక్యములను జనులు గ్రహించెదరు. బైబిల్ (సామెతలు 1:6)*

*వాటిని ఎల్లప్పుడు నీ హృదయమునందు ధరించుకొనుము. నీ మెడచుట్టు వాటిని కట్టుకొనుము. నీవు త్రోవను వెళ్లునప్పుడు అది నిన్ను నడిపించును, నీవు పండుకొను నప్పుడు అది నిన్ను కాపాడును. నీవు మేలుకొనునప్పుడు అది నీతో ముచ్చటించును. ఆజ్ఞ దీపముగాను ఉపదేశము వెలుగుగాను ఉండును. బైబిల్ (సామెతలు 6:21-23)*

**బెల్లంకొండ శివాజి రాజు**

త్యాగనిరతి, దేశభక్తి, వ్యక్తి వికాసం ప్రతి మనిషికి అత్యంత అవస్యం. ఏవ్యక్తి ఈ మూడు లక్షణాలు కలిగి ఉంటాడో ఆ వ్యక్తి భయభక్తులు కలిగి ఉంటాడు. అవినీతి, అక్రమం, స్వార్ధం లేకుండా ఉన్నప్పుడే సమాజం వర్ధిల్లుతుంది. ప్రతివ్యక్తి దేవుని భయభక్తులు కలిగి, నీతి నిజాయితీలతో సేవాభావం కలిగి బ్రతకాలి. యేసుక్రీస్తు చెప్పినట్లుగా నీ పొరుగువారిని ప్రేమించు. పొరుగు వారిని ప్రేమించటమంటే సమాజాన్ని ప్రేమించటం. ఇదేలా సాధ్యం? దీనికి వ్యక్తిత్వ వికాసం అవసరం.

ఈ వికాసం పెంపొందిచుకోవటంలో నిరంతర అభ్యాసం లేదా సాధన అవసరం. ఈ అభ్యాసం చేయటానికి దైవ గ్రంథం ద్వారా దేవుని ప్రబోధాలు, దైవ ప్రేరితులైన భక్తులు తెలిపిన అనేక విషయాలను చదివి గ్రహించి, పాటించే క్రమంలో మానవుడు దైవ భక్తిలోను, త్యాగనిరతిలోను తన సమాజ వికాసం వైపు అనగా చీకటి కోణం నుండి వెలుగువైపు ప్రయాణించటానికి దోహదపడుతుంది. అలా ప్రయాణించటానికి, సాధన చేయటానికి కొన్ని విలువైన విషయాలు పుస్తకాల రూపంలోనూ, కొంతమంది జీవిత సాక్ష్యాలు మనకు మార్గదర్శకాలవుతాయి.

ముఖ్యంగా పవిత్ర గ్రంథమైన బైబిల్ మరియు దైవభయం కలిగిన కొందరు మహా వ్యక్తులు వ్రాసిన, బోధించిన వాటిని ఏరి, ఒక చోటకు పేర్చి కూర్చి భావితరాలను వెలుగులోకి నడిపించాలనే ధృఢమైన కాంక్షతో... శ్రీమతి గ్రేస్ విజయ టి.యస్. గారిని దేవుడు బలంగా ప్రేరేపించిన కారణంగా "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" పేరుతో ఒక గ్రంథాన్ని అందించటం ఒక విధంగా దీప స్థంభంపై దీపాన్ని వెలిగించటమే. "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" దీపం భావి సమాజాన్ని వికాసం వైపు, వెలుగు వైపు తప్పక నడిపిస్తుంది.

ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను ఎదుగుదలకు ఈ పుస్తకం చాలా అవసరం. ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం. ప్రతి వాక్యం ప్రార్ధనలో మననం చేయగలిగితే భౌతిక, ఆధ్యాత్మిక జీవితం ధన్యం.

స్వార్ధం లేని మనిషి ఉండడు. కొంతవరకు అవసరం కూడా. ఆ స్వార్ధం వికృతాలకు పోయి విషమిస్తే జీవితం చీకటిమయమవుతుంది. స్వార్ధ చింతన ఆధ్యాత్మిక చింతనవైపు మళ్ళితే ఇహ పరలోకాల్లో ధన్యుడవు కాగలవు. ప్రాకారము లేని పురము ఇతరుల ఆక్రమణకు గురవుతుంది. కట్టలేని చెరువు ఊరుని ముంచేస్తుంది. అదుపు లేని నోరు ఇతరులను దూషిస్తుంది. స్థిరము లేని మనసు తననే మింగేస్తుంది. "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" వంటి పుస్తక పఠనం నిన్ను అదుపు ఆజ్ఞల్లో వుంచుతుంది. పై ప్రమాదాల నుండి తప్పిస్తుంది.

బైబిల్ గ్రంథంలో పాతనిబంధనలోని సామెతలు, ప్రసంగి వంటి గ్రంథాలు, క్రొత్త నిబంధనలోని యేసుక్రీస్తు ప్రబోధాలు, పౌలు సంఘం లేదా సమాజ నిర్మాణ సూచనలు మానవ వికాసం, వ్యక్తిత్వ విలువలు పెంపార జేయటానికి ఎంతగానో దోహదపడతాయి. భౌతిక, ఆధ్యాత్మిక విషయాలు క్లుప్తంగా క్రోడీకరించి "బంగారు పరిగె" గ్రంథం రూపంలోకి తెచ్చిన అమ్మ గ్రేస్ విజయ టి.యస్. గారికి దేవుడిచ్చిన తలంపే.

ఈ "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" పుస్తకం కారుచీకటిలో కాంతిరేఖ వంటిది.

**"కోపపడండి కానీ, పాపం చేయవద్దు"**

**"ఓడి పోయినా పర్వాలేదు, మోసం మాత్రం చెయ్యకు"**

**"మౌనంగా ఉన్నాడంటే అంతరంగ యుద్ధం జరుగుతున్నట్లే"**

ఈ మాటలు ఈ పుస్తకంలో కొన్ని మచ్చుకు మాత్రమే. దీపం వెలగాలంటే వత్తి కరగాలి, నూనె పోయాలి చుట్టూ గాలి స్థిరత్వం ఉండాలి. అప్పుడే దీపం నిటారుగా వెలుగుతూ తనచుట్టూ వెలుగు ప్రకాశిస్తుంది. ఆరోగ్యం, ఆర్ధికం, ఆత్మ వికాసం "అమ్మ విజయాగ్రేస్" గారికి దయచేయును గాక! కారణ జన్ములుగా దేవుడు కొంతమందినే ఎన్నుకుంటాడు. అందులో అమ్మ విజయాగ్రేసమ్మ కూడా ఉన్నారు అనటంలో ఎటువంటి అతిశయోక్తిలేదు.

గతంలో అమ్మ ముద్రించిన క్రీస్తులో మార్గదర్శక సాక్ష్యాల పుస్తకాలు, ఇప్పటి అమూల్య జీవిత సత్యవాక్య పరిగెలు ఈ "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" గ్రంథం అనేక మందిని ప్రభావితం చేసి ప్రభువువైపు మళ్ళించి భౌతికంగాను వికాసంవైపు నడిపించగలదని నా ప్రగాఢ విశ్వాసం. దేవుడు అమ్మకు ఆరోగ్యం, సంతోషం సదా చేయునుగాక!

దైవ సేవలో సహోదరుడు **బెల్లంకొండ శివాజి రాజు,** ఎడిటర్ స్వర్ణదీపిక

పాస్టర్ దైవసన్నిధి

# ఆధ్యాత్మిక, భౌతిక ఎదుగుదలకు వాక్యము ప్రార్థనల ప్రాముఖ్యత

1) వాక్యధ్యానం, ప్రార్ధన ఈ రెండు జీవిత గమనానికి, ఆధ్యాత్మిక పురోగమనానికి బండికి రెండు చక్రాలవంటివి.

2) వాక్యము దేవుని ప్రేమను తెలియజేస్తే ప్రార్థన ఆయనతో బాంధవ్యాన్ని ఏర్పాటు చేస్తుంది.

3) వాక్యము పరలోకం గురించి తెలియచేస్తే, ప్రార్థన పరలోకాన్ని కదిలిస్తుంది.

4) వాక్యము ఆదరణ కలిగిస్తే, ప్రార్థన ఆశ్చర్యకార్యాలను చేయిస్తుంది.

5) వాక్యం జీవితాన్ని వెలుగిస్తే ప్రార్థన ఆ వెలుగులో నడిపిస్తుంది.

6) వాక్యం పాపం అంటే ఏమిటో తెలియజేస్తే ప్రార్థన పాపం చేయకుండా సహాయం చేస్తుంది.

7) వాక్యం ఏ మార్గాన్ని తెలియజేస్తుందో, ప్రార్థన ఆ మార్గంలో నడిపిస్తుంది.

8) వాక్యం నిన్ను దేవునికి దగ్గర చేస్తే, ప్రార్థన ఆయనతో మమేకం చేస్తుంది.

9) వాక్యం ద్వారా ప్రభువు నీతో మాట్లాడితే, ప్రార్థన ద్వారా నీ అంతరంగాన్ని చూడగలవు.

10) వాక్యం మనకు కవచం అయితే ప్రార్థన మనకు ఆయుధము.

11) దేవుడు వాక్యం ద్వారా మాట్లాడతాడు. ప్రార్ధన ద్వారా వింటాడు. జవాబిస్తాడు.

12) వాక్య ధ్యానం, ప్రార్థనా జీవితం క్రైస్తవుని గీటు రాయి, నీటిలో దిగకుండా ఈత నేర్చుకోలేనట్లే వాక్యం చదువకుండా యేసుని గురించి తెలుసుకోలేము, పరుగు పందెంలో పరుగెత్తకుండా ఎలా గమ్యం చేరలేమో అదే విధంగా ఆత్మీయ పోరాటంలో ప్రార్థించకుండా దేవుని శక్తిని తెలుసుకోలేము

13) వాక్యమే శక్తి, వాక్యమే బలం, వాక్యమే మనకు ప్రామాణికం. ప్రార్థనే మన ఆత్మీయ పోరాటం, వాక్యమే మన మార్గము, వాక్యమే మన గమనము, వాక్య బలం ప్రార్ధనా శక్తి ఈ రెండు పరలోక గమ్యానికి మూలం.

# ఆత్మీయ సత్యవాక్య పరిగెలు

1. క్రీస్తును నమ్మినవారి జీవితాల్లో ఉన్నతమైన భావాలు, సహృదయత, సరళత, ఎదుటివారిలో మంచిని గుర్తించే నేర్పు, ప్రోత్సాహించే తీరు ఉంటాయి. వారు సదా బైబిలు పఠనము, ప్రార్థన విశ్వాస వీరుల సహవాసం కలిగి ఆనందంగా జీవిస్తారు.

2. క్రీస్తు హస్తము తనను నమ్మిన వారి వెంట ఎల్లప్పుడు ఉంటుంది. కొన్నిసార్లు జీవితపు కాన్వాసుపై అంధకారము పంచుకున్నప్పుడు, దారి తెన్ను తోచనపుడు, అడుగడుగున అవమానాలు, విడువని భయపు నీడలు, దారి తప్పించే ఆకర్షణలు ఎదురైనపుడు దేవుని హస్తము తోడుగా ఉంటుంది. మహోన్నతుని రెక్కలే ఆశ్రయమని, యెహోవా నా కాపరి అని పూర్తిగా నమ్మిన యెడల ఆయన కృపాక్షేమాలు వెంట వస్తాయి.

3. క్రీస్తు వెలుగైయున్నానన్నారు. దేవుని శక్తికి లోబడితే నీ జీవితంలో అలముకున్న చీకట్లను తరిమికొడుతూ వేల విద్యుద్దీపాల కాంతిని జీవితంలోకి ఆహ్వానించవచ్చు. పెను తుఫానులకు సైతం క్రుంగకుండా, లొంగకుండా క్రీస్తు అనే బండపై స్థిరంగా, ధృఢంగా నిలిచి జీవితయాత్రను కొనసాగించాలి.

4. మన జీవితంలో ఎందరో మనకు స్ఫూర్తినిస్తారు. సహాయపడతారు. మరికొందరికి మనమే సహాయం చేస్తూ స్ఫూర్తిని అందించాలి. పిడికెడు ధనము, పరిచయాలు ఆపదలో ఆదుకుంటాయి. జీవితాన్ని సుఖమయం చేసుకోవాలంటే మంచి స్నేహితుడైన క్రీస్తును సదా స్మరించాలి. యేసు మితిలేని దయ చేత హత్తుకొని ప్రేమిస్తాడని నమ్మి స్తుతించాలి.

5. నిత్య జీవితంలో ప్రేమ నిరీక్షణ ఆనందం సదా నిలిచి ఉండేలా జీవించాలి. కష్టాలను ప్రార్థన ద్వారా ఎదుర్కోవాలి. అసూయ ద్వేషాలకు స్థానమివ్వరాదు. దేవుని రాజ్యాన్ని నీతిని వెదకితే కోరినవన్ని మనకు దేవుడు దయచేస్తాడన్న వాగ్ధానము నమ్మాలి.

6. మనకు లభించిన జ్ఞానమంతా దేవుని వరం. దానికి కాస్త భయభక్తులు తోడైతే అది మన జీవితాన్ని సరైన దిశలో నడిపిస్తుంది. ఏదైనా ప్రగతి సాధించగానే భుజము తట్టి అందించే ప్రేమ, ప్రోత్సాహము, ఆప్యాయతలను పంచే మాటలు మన హృదయాన్ని తాకి ఆహ్లాదపరచగలవు.

7. కొందరు మనకు స్ఫూర్తిని ఇస్తారు. మరికొందరికి మనం స్ఫూర్తిని ఇవ్వాలి. కొందరు మనకు సహాయం చేస్తారు. మనం కొందరికి సహాయం చేయాలి. ఇక్కడ మానవ సంబంధం ఎంతో బలీయమైనది. మనం భౌతికంగా జీవించినంత కాలం మానవ సంబంధాలే మనకు ఆస్తి పాస్తులు. వస్తు పరమైన ఆస్తిపాస్తులు అక్కరకు రావు. అందుకే దేవుడంటాడు నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించు అని. పరలోక నిత్య నివాసానికి వాక్య ప్రార్థన ఆస్తిపాస్తులకై మానవుడు ప్రయాసపడాలి.

8. మన నిత్య జీవితంలో ప్రార్థించే ప్రతి ప్రార్థనకు జవాబు దారిలోనే ఉంటుందని నమ్మాలి. మన అవసరతలన్నీ మర్చిపోయి నమ్మదగిన దేవుని నమ్మాలి. ఈ ప్రపంచంలో దేవుడందించే వెల కట్టలేని అమూల్య సంపదలు రెండు ఉన్నవి. ఒకటి **మనశ్శాంతి.** మరొకటి **సంతృప్తి.** వీటినందుకున్న వారికి అవధులు లేని ఆనందం దాగి ఉంటుంది.
ఎవరి మనస్సు నీ మీద ఆనుకొనునో వానిని పూర్ణశాంతి గలవానిగా కాపాడుదువు. యెష 26:3.
ఆయన నామము బలమైన దుర్గము. సురక్షితముగా ఉండాలంటే ఆశ్రయించాలి. సామెతలు 18:10.

9. మన తల్లిదండ్రుల అపార ప్రేమ, ధైర్యము, పట్టుదల, సంకల్ప బలం గూర్చి బాల్యంకన్నా పెద్దవారమయ్యాక అవగాహన కలుగుతుంది. అమ్మ ఒకప్రక్క ఉద్యోగం చేస్తూ భర్తకు భార్యగా, ఇంటికి ఇల్లాలుగా అందరికి జీవనాధారమై ఎంతో ప్రయాస ఎదుర్కొంటుంది. ఇంత ప్రయాసలో నాలుగు మెప్పుకోలు మాటలు లేకపోగా నిందల మాటల తూటాలు విసిరే వారిని ఓరిమితో క్షమిస్తూ, దేవునికి కన్నీటి ప్రార్థనలు విన్నవించే తల్లి జ్ఞాపకాలు ప్రతి బిడ్డకు స్ఫూర్తినిస్తాయి. జీవితంలో కలిగించే బలురక్కసి వృక్షపు గాయాలను సహితం ప్రభువు తన ప్రేమహస్తాలతో తాకుతాడన్న అభయమే అమ్మకు స్ఫూర్తి.

10. క్రీస్తును ఆదర్శంగా ఉంచుకొని ఆయన లక్షణాలను అలవర్చుకోవాలి. జీవితం కొన్నిసార్లు మనపట్ల అన్యాయంగా ప్రవర్తిస్తుందని అనిపించినను ప్రయత్న

లోపం లేకుండా బ్రతకాలి. బాధలు, అవమానాలు జీవితంలో ఒక భాగము. దేవుడు మనలో ఉంచిన తలాంతులను గుర్తించుట అవసరం. దానిని దాచిపెట్టక రెట్టింపుగా మెరుగ్గా దేవునికే కనబర్చేలా ఎదురీదాలి. ఎవరిని వంచించకుండా ఉండాలి.

వ్యతిరేక భావాలు రానీయకుండా ఆశావాదంతో జీవించాలి. సోమరితనాన్ని దరిచేరనీయవద్దు. దేవుని యందలి భయభక్తులు బహు ధైర్యం కలిగిస్తుంది గనుక కష్టాలు వచ్చినా వాటికి లొంగకుండా మనం యుద్ధం చేయాలి. సర్వాంగ కవచం ధరించాలి. ఆ తరువాత ఎంతటి విపత్తు అయినా లొంగిపోయి విజయం మనతో స్నేహం చేస్తుంది.

11. బాల్యం నుండి తల్లిదండ్రులు, పెద్దలు వారు నడిచే మార్గం పట్ల అతి జాగ్రత్తగా నడుచుకోవాలి. నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నదని కీర్తనలు 119:105 వాక్యానుసారం ఎవరైతే అభ్యాసంతో నడుచుకుంటారో వారు నడిచే బాటలో ముళ్ళున్న, రాళ్ళున్న మలుపులున్న స్వశక్తితో సమర్థతో ముందుకు సాగిపోతారు.

12. బైబిలులో విశ్వాస వీరుల గాథలు అన్ని తరాల యువతకు గొప్ప స్ఫూర్తినిస్తాయి. దానియేలు యువకుడైననూ తను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడినవాడై మంచి సుగుణాలు, అలవాట్లు కలిగి రాజును ఆశ్చర్యపరిచాడు. అతని ధైర్యం తెగింపు, దృఢ చిత్తం, బుద్ధి బలం, వీరోచిత లక్షణాలు గల నాయకుడు. ఇటువంటివారిని అనుసరించాలి. ఎవరైతే దైవశక్తిని ప్రార్థన ద్వారా అనుసరించి పొందగలరో వారే జీవితంలో దృఢంగా ఉంటూ గొప్ప పనులకు కారణమవుతారు. రహస్య ప్రార్థన, ఏకాంత ప్రార్థన క్రమంగా చేస్తే ప్రార్థన సత్ఫలితాలనిస్తుంది.

13. ప్రతి జీవికి కలలుకనే (దర్శనం) కండ్లు ఉన్నాయి. కన్నకలలు నిజం చేసేందుకు కృషిచేయాలి. దృఢసంకల్పం, ఖచ్చితమైన ప్రణాళిక లేని కలలుకంటూ కూర్చుంటే అవి పగటి కలలుగా మిగిలిపోతాయి. దర్శనం లేనిచో జనులు నశిస్తారు. దర్శనాల ఫలితంగానే యోహాను ప్రకటన గ్రంథం వ్రాశాడు. భవిష్యత్తులో క్రీస్తు రాకడలో జరుగనైయుంటున్న సంఘటనలు ప్రతి విశ్వాసికీ మేలు కొల్పునిస్తూ నిత్య రాజ్యాన్ని అందుకునే కృషి ప్రకటనగ్రంథం చేయిస్తుంది.

14. **ఐశ్వర్యం అంటే ఏమిటి**

1. తల్లిదండ్రులను ప్రేమించడం
2. భార్యభర్తలు సమాధానం, ప్రేమ కలిగి ఉండడం
3. చెప్పిన మాట వినే సంతానం ఉండడం
4. ఋణాలు లేకపోవడం
5. మన అవసరాలకు తగిన ధనం ఉండడం
6. ఏదైనా తిని అరిగించుకొనే ఆరోగ్యం కలిగి ఉండడం
7. మన కోసం కన్నీరు కార్చే మిత్రులుండడం
8. పది మందిలో గౌరవించబడడం
9. ఇతరులకు సహాయం చేసే గుణం కలిగి ఉండడం
10. అన్నిటి కన్నా ముఖ్యంగా ప్రభువైన యేసుక్రీస్తులో భయభక్తులు కలిగి ఉండటం, ఆయన రక్తంలో కడుగబడి నిత్యత్వంలో జీవించగలనన్న స్థిరత కలిగియుండుట నిజమైన ఐశ్వర్యం.

15. ఏదో ఒక రోజు మనము ఈ జీవితాన్ని ముగించి పరలోకప్రయాణం చేయాలి. ఈ భౌతిక జీవితం దేవుని ద్వారా ఉచితంగా లభించింది. గనుక విమానం ఎక్కుటకు సకాలంలో సిద్ధంగా ఉంటాము. మనం చేసిన మంచి పనులే మన ప్రయాణంలో లగేజి అయితే మానవత్వం మన పాస్‌పోర్టు, ప్రేమ మన వీసా. మనం జీవించే మంచి జీవితంలో క్రీస్తు చిత్తంలో సరైన రీతిగా ప్రయాణించి బిజినెస్ క్లాస్‌లోనే పరలోకం చేరుట జీవిత ధర్మం.

16. ఈ జీవితంలో దేవుడేర్పచిన కుటుంబ వ్యవస్థపై ప్రేమ ఆప్యాయతలు చూపుతూ మంచి స్నేహితులచే అభిమానం పొందటం గొప్ప ఐశ్వర్యం. మనలను ప్రేమించి అభిమానించే వారి కొరకు సదా ప్రార్ధించే దివ్యానుభూతి గొప్పది.

17. ఎల్లప్పుడు "నేను" అనే స్వార్థం వీడి "మనం" అనే భావం నిలిపితే సర్వ సుఖాలు లభిస్తాయి. సమయం, మంచి స్నేహితులు ఈ రెండు అంశాలు వృద్ధులయ్యే కొలది విలువైన సంపద. ఈ సంపద భద్రపర్చుకోవాలి. గడిచిన జీవితం ఎన్నడూ తిరిగి రాదు. ప్రతి క్షణము ప్రేమతో, సంతోషంగా గడపడం నేర్చుకోవాలి.

18. జీవితంలో నిన్ను నీవు పనికి రాను అని దిగులు చెందరాదు. నాకంతా తెలుసు అని గర్వించరాదు. కాని నేను సామాన్యుడనే గానీ దేవుడిచ్చిన శక్తితో సమస్తము చేయగలననే భావించాలి.

19. ప్రతి దినము దేవుడిచ్చిన బహుమతిని కొరకు ప్రోత్సాహాన్నిచ్చిన వారి కొరకు ప్రార్థించాలి. మన జీవితానికి లక్ష్యం ఉండాలి. పౌలు భక్తుడు గురి చూచి పరుగెత్తాడు. పరుగు పందెంలో ఓపికతో పరుగెత్తానని ధైర్యంగా చెప్పి గొప్ప విశ్వాసిగా చరిత్రలో ప్రత్యేకంగా నిలిచాడు.

20. జీవితంలో ఏ మంచి పని తలపెట్టినా నిరుత్సాహ పరిచేవాళ్ళు ఎక్కువ ఉంటారు. గడ్డు పరీక్షలు ఎదురైనప్పటికి, తలపెట్టిన పని విజయవంతం కావటానికి, విమర్శలు కలవరం కలిగించినా చేపట్టిన తలంపు గమ్యం చేరేవరకు పట్టుదలతో వదలకూడదు. దైవశక్తి నీకు తోడుగా ఉంటుంది.

21. క్రైస్తవ విశ్వాసుల గుంపుతో కలసి చేసే పని, సమయం సంతృప్తి ఆనందం ఇస్తుంది. అది ఎంతో విలువైనది. మన వ్యక్తిత్వం రూపు దిద్దుకొనే క్రమంలో మన చుట్టూ ఉండే పరిసరాలు, వ్యక్తులు, స్నేహాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

22. మన జీవితం అభివృద్ధి పథంలో నడవాలంటే కేవలం ప్రశంశలు పొగడ్తలే కాకుండా విమర్శలు స్వీకరించే ధైర్యం ఉండాలి. శత్రువులను మిత్రులుగా చేయగల దేవుని ధృక్పథంలో ఆయన చిత్తానికి లోబడి జీవించాలి.

23. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించాలి. దేవునిని పూర్ణ హృదయంతో ఆత్మతో ఆరాధించాలి. దేవుని ఆజ్ఞలను పాటిస్తూ, ప్రక్కవారికి సహాయపడితే ఎన్నో రెట్లు తృప్తి పొందగలము. ఒక వేళ నోటి మాటల నైపుణ్యం కల్గిఉంటే ఆ వాక్చాతుర్యంతో నలుగురిలో నీ ప్రావీణ్యాన్ని ఉపయోగించి తోటివారిని ప్రేమిస్తూ వారి పురోభివృద్ధికై తోడ్పడి వారి ఆనందాన్ని పెంపొందించాలి.

24. నువ్వు చేసిన పనిని బట్టి నీకు ప్రతిఫలం లభిస్తుంది. ఎదుటివారు ఆశించినదాని కంటే అదనపు ఫలితం ఎక్కువగా అందిస్తే ఎక్కువ ఆనందం కలుగుతుంది.
మన శరీరానికి అద్దుకున్న సెంటు లేదా సువాసన మన ప్రక్కవారికి చేరినట్లే, మన హృదయం కాంతివంతమైతే ఆ కాంతి మన తోటివారికి దానంతటఅదే చేరువవుతుంది. ఆ కాంతిలో వారు పునీతులవుతారు.

25. జీవితంలో చాలా ఓర్పు తగ్గింపు అణుకువగా ఉండుట నేర్చుకోవాలి. గర్వము అతిశయం ఇతరులకే కాదు దేవునికి కూడ అయిష్టము. దీనుల పట్ల దయ కనికరాన్ని దేవుడు ఎక్కువగా చూపిస్తాడు. మనం ఎదిగే సమయంలో మన తలాంతులను ఇతరుల కోసం వాడాలి. నిర్లక్ష్యం, సోమరితనంతో అలక్ష్యం చేస్తే పట్టు తగ్గిన వేళ ప్రక్క వాళ్ళు ఏమి పట్టించుకోకుండా వదిలేస్తారు. తస్మాత్ జాగ్రత్త.

26. మన్‌డే మోర్న్‌డే గా మారిపోతుంది – విచారం నిండిన రోజవుతుంది. ట్యూస్ డే టీయర్ డే  గాఅయిపోతుంది – కన్నీటిమయం కాగలదు. వెడ్‌నస్ డే వేస్ట్ డే గా మారును – వృథా అయిపోతుంది.
థర్స్ డే థండర్ డే గా మారును – చల్లారిన స్థితిగా ఉంటుంది.
ఫ్రై డే చివరకు ఫైట్ డే గా మారును – పోట్లాటల రోజుగా మారిపోతుంది.
సాటర్ డే షాటర్ డే గా అవుతుంది – చికాకు చీత్కారాలతో నిండిపోతుంది.
సన్‌డే సిన్‌డే గా మారిపోతుంది–పాపపుఊబిలో కూరుకుపోయే రోజవుతుంది.
చివరకు వారమంతా దేవుడు లేని దయ్యాల కొంపగా మారుతుంది.
కాబట్టి ప్రతిరోజు దేవునిపై ఆధారపడి బ్రతకటం నేర్చుకోవాలి. నీ జీవితం సుఖమయమవుతుంది.

27. ఈ లోకం చీకటిమయం అయితే మనం మరింత వెలుగుగా మారాలి. దేవునికి ప్రతి నిధులం కావాలి. ఈ ప్రపంచమంతా మంచి వ్యక్తులతో నిండి ఉంది. నీవెవరినీ మంచివ్యక్తిని కనుగొనలేకపోతే నీవే ఆ మంచి వ్యక్తివి కావాలి. మంచిగా జీవించు విశ్వాసం నిలుపుకుంటే దేవుడే సమస్తం సమకూర్చగలడు. జీవితమంటే కష్ట సుఖాలు. మంచి వ్యక్తుల కలయిక నుండి మంచి పాఠాలు నేర్చుకోవాలి.

28. **కంప్యూటర్ మాటలలో జీవిత సత్యాలు**

దుఃఖాన్ని DELETE చేయండి – తీసివేసుకోవాలి

సంతోషాలను SAVE చేయండి – దాచుకోండి

బంధాలను RECHARGE చేయండి – బలపర్చుకోండి

మంచి స్నేహాన్ని DOWNLOAD చేయండి – భద్రపర్చుకోండి

శత్రువులను ERASE చేయండి – తొలగించండి

నిజాలను BROADCAST చేయండి – ప్రచురించండి
అతి నిద్రను SWICH OFF చేయండి – పరిమితం చేయండి
బాధలను, కష్టాలను NOT REACHBLE చేయండి – దరి చేరనీయకండి
ప్రేమను INCOMING చేయాలి – ఆహ్వానించాలి.
ఈర్ష్య ద్వేషాలను OUT GOING చేయాలి – దూరపర్చుకోవాలి.
చిరునవ్వును INBOX చేయాలి – నిలుపుకోవాలి
ఏడుపును OUT BOX చేయాలి – తరిమికొట్టండి
కోపాన్ని HOLD చేయాలి – అదుపులో ఉంచాలి.
మంచి విషయాలను SEND చేయాలి – అందరికి పంపాలి
హృదయాన్ని OK చేయాలి – సమ్మతించాలి.
అప్పుడే మీ జీవితం సదా ఆనందిస్తుంది.

29. రహదారికి అంతం ఉంది. బ్యాంకులో డబ్బుకు పరిమితి ఉంది. పరీక్షకు సమయం పరిమితి ఉంటుంది. కానీ నీ తలంపుకు సరిహద్దుల పరిమితి ఉండదు. కాబట్టి నీ తలంపు గొప్పగా ఉండాలి. నీవనుకున్నది సాధించాలి. జీవితానికి కావలసినంత శక్తి, డబ్బు లేకపోయినా మంచి స్వభావము మంచి అవగాహన ఆధ్యాత్మిక చింతనతో కూడిన భయభక్తులతో కూడిన జీవితం తప్పక సహాకరించి మంచి విలువలను ఇస్తాయి.

30. ఒక చెట్టుతో ఆరంభమైన మైదానం ఒకప్పటికి అడవి కాగలదు. చిన్న చిరునవ్వు స్నేహానికి ఆరంభం కాగలదు. చిన్న చేయూత ఆత్మకు ఆలంబన కాగలదు. చిన్న క్రొవ్వొత్తి చీకటిని పారద్రోలగలదు. చిన్న నవ్వు నిరాశను దూరం చేయగలదు. చిన్న నిరీక్షణ నీ మంచి స్ఫూర్తిని పెంచగలదు. చిన్న చేతి స్పర్శ భద్రతను ఇస్తుంది. చిన్న జీవితంలో గొప్ప కార్యాలను సాధించే ధన్యత దేవుడే ఇస్తాడు.

31. పరమాత్మునియందు సంపూర్ణ నిష్ఠ, ఆత్మలో ధృఢత, ఆలోచనలో పరిపక్వత, మనస్సులో సంతృప్తి, వ్యవహారంలో సరళత, సంస్కారంలో శ్రేష్టత, దృష్టిలో పవిత్రత, మాటలలో మాధుర్యం, కర్మలలో స్వచ్ఛత, వ్యక్తిత్వంలో రమణీయత, నిద్రలో నిశ్చింతత ఇవన్నీ కలబోసిన వ్యక్తి దేవునిలో సంపూర్ణత సంతరించుకుంటాడు.

32. నీ జీవితంలో అందరూ నీతో సంతోషంగా ఉన్నట్లయితే నీవు ఎన్నో విషయాలలో అందరితో రాజీ పడ్డావని అర్థం. నీవు అందరితో సంతోషంగా ఉన్నావంటే ఇతరులు చేసిన పొరపాట్లన్నీ క్షమించావని అర్థం. అందుకే జీవితంలో నీ నోటిని దేవుని మహిమపర్చుట కొరకు వాడాలి. ఇతరుల జీవితాలను కట్టుటకు ప్రోత్సహించుటకు క్షమాపణ ఉపయోగించి జీవితం ధన్యం చేసుకోవాలి.

33. సమయమనేది నది వంటిది ప్రవహించే నీటిని ఒక్కసారి మాత్రమే తాకగలము. రెండవ సారి తాకలంటే కుదరదు. ఆ ప్రవాహము దాటిపోతుంది. కాలము జారిపోతే మరల రాదు. సమయము సద్వినియోగం చేస్తూ దేవుని పట్ల అంచలంచల భక్తి కలిగి ఉండాలి. అప్పుడు దేవుడు నీ మాటలు వినడానికి ఇష్టపడతాడు. నీ ప్రార్థన ఆలకిస్తాడు. నీ విజ్ఞాపన వింటాడు. ప్రతి సమస్య నుండి నిన్ను విడిపిస్తాడు.

34. ఒక జ్ఞాని చెప్పిన మాటలలో నిన్ను నీవు ప్రేమించుకుంటావా?
నీకు నీవు విషం పుచ్చుకుంటావా?
ఇతరులపై పిర్యాదు చేయుట, లోలోపల దుఃఖం చెందుట, ఇతరులతో పోట్లాడుట, అధికంగా చిరాకు పడుట, కలవరంగా ఉండుట, విసుగుదలగా ఉండుట, కోపం, పగ ఉంచుకుంటే దానిని రోగం అంటారు. వాటిని వదిలిపెడితే ఆరోగ్యం నీ సొత్తు. 40 సం॥లుగా కోపం అనేది కేన్సరు కావచ్చు, 40 నెలల కోపం డయాబీటిస్ కావచ్చు. అది కీళ్ళవాతానికి దారి తీయవచ్చు. 40 వారాల కోపం గ్యాస్ ట్రబుల్, గొంతు నొప్పి రావచ్చు కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. నిన్ను నీవు ప్రేమించుకోవాలి. నిన్ను నీవు ప్రేమించుకుంటే ఏ రోగము నీ దరి చేరదు.

35. ఇగో గర్వం, అతిశయం దేవునికయిష్టం. అది సత్యాన్ని ఎన్నడు అంగీ కరించదు. చల్లని చిరునవ్వు మృధువైన మాట బ్యాంకులో డబ్బులు జమ చేసెంత విలువ గలది. దీనిలో లాభాలు దాగి ఉంటాయి. కోపము కఠినమైన మాటలు క్రెడిట్ కార్డు వంటివి. వాడుకొన్నాక తరువాత తీర్చుకోవచ్చు వడ్డీ చెల్లించి బాధపడవల్సి వస్తుంది.

36. **మనము నమ్మిన దేవుడు మహిమాస్వరూపి.**

ఎ) యోబును ఓడించి అతనిలో అవిశ్వాసాన్ని కల్గించాలని సాతాను కోరాడు గాని దేవుడు యోబులో అంచలంచల విశ్వాసాన్ని రెట్టింపు దీవెనను విశ్వాసాన్నిచ్చి సంతోషపెట్టారు.

బి) బిలాములో ఉన్న బుద్ధి హీనతను దేవుడు వాడుకోదలిచాడు గానీ దేవుడు గాడిదతో మాట్లాడి జ్ఞానోదయం కలిగించాడు.

సి) ఇశ్రాయేలీయులలో సనుగుడు పుట్టించి ఆటంకం కల్గించి మోషేను నిరూత్సాహ పరచదలిచాడు గాని దేవుడు అతని చేతి కఱ్రను దీవించి సముద్రాన్ని చీల్చివేసి ఆరిన నేలను నడిచే అద్భుతాన్ని చూపించి నెమ్మది కలిగించాడు.

డి) యూదా యిస్కరియోతు క్రీస్తుతో జీవించిననూ సైతాను శోధించగా క్రీస్తును శత్రువుల చేతికి అప్పగించిననూ అతని స్థానము కొల్పోగా సౌలును పౌలుగా మార్చి ఘనంగా వాడుకున్న దేవుడు స్తుతి పాత్రుడు నిరీక్షణ, విశ్వాసం, సహోదర ప్రేమ, నీతో ఉంటే అద్భుతాలు చేస్తారు.

37. నిజ జీవితంలో ఫిలాసఫీ ఏదనగా మన మనస్సు ఎల్లప్పుడు ఆనందంగా ఉంచుకోవాలి. మంచి విజయాలు సంతోషాన్ని ఇస్తాయో లేదో గాని సంతోషంగా ఉంచుకొనే మనస్సు నిశ్చయముగా మనలను విజయ పథంలోకి నడిపించి విజేతలను చేసి ఆనందములో నింపుతుంది.

38. మంచి హృదయం నుండి ఉద్భవించన ప్రార్ధన ప్రభువు వింటాడు. వారి దయగల కన్నులు ప్రభువు చూస్తాడు. ఎవరినైనా క్షమించే హృదయం కావాలి. చెడును మర్చిపోయే మనస్సు కావాలి. ఎన్నడు చెరగని విశ్వాసం గల ఆత్మ పూర్ణులుగా దీవించు ప్రభూ అని సదా ప్రార్థన చేయాలి.

39. జీవితంలో ఉత్తమ ఆశయాలు కలిగి ఉండాలి. నిన్ను మాటల తూటాలతో విమర్శించి గాయపర్చిన వారిని లక్ష్యపెట్టక, ఉపేక్షించి తోటివారిని ప్రోత్సహించుట నేర్చుకోవాలి. క్రికెట్, ఫుట్‌బాల్ మంచి ఆట జరుగుచుండగా ఆట ఆడేవారు మాట్లడరు గానీ ఆట వీక్షించేవారు గొప్ప శబ్ధాలు చేస్తూ అరుస్తూ ఉంటారు. దేవుని నమ్మినందున విమర్శకుల అరుపులకు కలవరం చెందక ఆట ఆడువారు మౌనం వహించినట్లు దేవుని బిడ్డలు మౌనంగా నిలిచి సాగిపోవాలి.

40. ఉదయాన్నే దైవ వాక్యధ్యానము హృదయాన్ని రంజింపచేస్తూ ఉత్సాహంతో ఆరంభించే ధన్యత ఇస్తుంది. అందరిని శుభోదయంతో పలకరించాలి. దేవుడిచ్చిన రోజును సంతోషంగా గడపాలి.
ఉదయమున నీ కృపతో మమ్ము తృప్తిపరచుము కీర్తన 90:14

41. నిజమైన దైవభక్తునికి జీవితం ఒక ప్రయోగశాల వంటిది. ప్రతి నిత్యం ఏదో ఒక పరీక్ష జరుగుతూనే ఉంటుంది. ఏదో ఒక సత్యం వెలుగు చూస్తుంది.

42. మన జీవితంలో ప్రాముఖ్యత సంతరించుకున్న వ్యక్తులు మన గుండె చప్పుడువంటివారు. మన గుండె చప్పుడు వింటాము అది మన జీవితాన్ని నిర్దేశిస్తుంది గానీ మనం దానిని చూడలేము. మంచి స్నేహితులు సహాయ సహకారాలు ప్రేమ ఆప్యాయతలు అందిస్తూనే ఉంటారు.

43. ప్రతి దినము ప్రతి స్పర్శలో దేవుని ఉనికిని చూస్తాము. ప్రతి సంతోషకరమైన ముఖంలో దేవుని ముఖం చూస్తాము. ప్రతి దినము ఆశీర్వాదకరమైనదని నమ్మాలి. కొన్ని వేల చెట్లు ఎలా మొలిచాయి ఉడతలు పండ్లను తినే సమయంలో రాల్చిన విత్తనాలే చెట్లు పెరుగుటకు అనుకూలిస్తాయి. ఉడతలకు తెలియదు వాటి ద్వారా చెట్లు వస్తాయని అవి మర్చిపోగలవు. అలాగే మనం ఇతరులకు మంచి చేసి మర్చిపోతే అవి ఫలితాన్నిస్తాయి. అందుకే బైబిలులో ఆహారం నీటిమీద వేయుము అది చాలా కాలానికి కనిపిస్తుంది.

44. మన జీవితంలో కొన్నిసార్లు కొన్ని దీవెనలు పొగొట్టుకున్నామని బాధపడతాము. కానీ దేవుడు మనలను ఆశ్చర్యకరంగా ఆ స్థానంలో గొప్ప కార్యాలు చేసి ప్రేమ చూపిస్తారు. అప్పుడు కలిగే ఆనందం అనంతమైనది

45. ప్రతి దినాన్ని ఆరంభించే ముందు మన హృదయాన్ని తేలిగ్గా ఉంచుకోవాలి. మన విచారాలన్నీ ప్రక్కకు నెట్టి వేయాలి. చిరునవ్వుతో ప్రతి క్షణము దేవుడు మన పట్ల శ్రద్ధ వహిస్తున్నాడనే ధైర్యంతో కృతజ్ఞతతో రోజంతా గడపాలి.

46. జీవితంలో నీవు ఎదుర్కొంటున్న వ్యక్తులలో నీ విలువను గుర్తించేవారు ఉన్నారంటే వారితో సన్నిహితంగా ఉండాలి. ఎక్కువ మందితో గడపగలిగితే ఆనందంగా ఉండగలమని తలంచరాదు. కానీ నిన్ను నిన్నుగా ప్రేమించి కష్టాలతో చేయుతనిచ్చే వారిని గుర్తించి వారిని ఎన్నడూ వదులుకోరాదు.

47. నిజంగా జీవితాన్ని ప్రేమించే వ్యక్తులు "ప్రతి రోజును" దేవుని బహుమతిగా స్వీకరిస్తారు. సణుగుట తగ్గిస్తారు. కృతజ్ఞత ఎక్కువగా చూపగలరు. ప్రకృతిలో దైవ హస్తాన్ని చూస్తారు.

48. ప్రతి వ్యక్తి యవ్వన కాలంలో డబ్బు కోసం ఆరోగ్యం పోగొట్టుకుంటాడు. వృద్ధాప్యంలో ఆరోగ్యం కోసం డబ్బును పోగొట్టుకుంటాడు. ఆరోగ్యం ఆస్తి కన్నా మిన్న. ఆరోగ్యం లేని ఆస్తి ఉన్న జీవితం గుండుసున్నా. ఆరోగ్యం విషయంలో స్వార్థంగానే ఉండాలి. ఆస్తి విషయంలో నిస్వార్థంగా ఉండాలి. అప్పుడే అందరి ప్రశంశలను పొందగలరు.

49. ఎ) వ్యాయమం చేయడానికి సమయం లేదనేవారు భవిష్యత్తులో జబ్బులకు సమయం కేటాయించవలసి వస్తుంది.
   బి) నాలుకను స్వాధీనంలో ఉంచుకొనగలిగినవాడు యోగి, నాలుకను అనుసరించేవాడు భోగి.

50. డబ్బు సంపాదించవచ్చు గాని నిద్రను సంపాదించలేము. పుస్తకం కొనవచ్చు గాని జ్ఞానమును కొనలేము. మందులు కొనవచ్చు గాని ఆరోగ్యం కొనలేము.

51. **జయించువారికి దేవుని దృష్టిలో వారి స్థానము విలువైనది.**
   1. గతంలో సోవియట్ విశ్వాసుల దృక్పథంలో జయించువారు మేకుల వంటివారు. ఎంత గట్టిగా కొడితే ఆ సుత్తె దెబ్బలకు అంత బలంగా లోతుగా దిగబడి పోతారు. స్థిరులుగా నిలుస్తారు.
   2. చైనా విశ్వాసులైతే వెదురు బొంగుతో పోలుస్తారు. ఎంత నరికితే అంత వేగంగా బలంగా ఆ చెట్టు పెరుగుతుంది.
   3. ఇరాన్ వారు రబ్బరు బంతివలె ఎంత వేగంగా నేలకు కొడితే తిరిగి అంత వేగంగా పైకి లేస్తారు. నిరూత్సాహపడరు.
   4. జయించువారు పువ్వుల వంటివారు. ఎంతగా నలిపితే అంతగా సువాసన వెదజల్లుతారు.
   5. పిలిప్పీయుల ధృక్పధంలో దేవాలయ కిటికీలపై ఉన్న అందమైన దృశ్యాలు వెలుగుతున్నప్పుడే అందంగా కాంతివంతంగా కనిపిస్తాయి.
   6. ఇండియా విశ్వాసులు అభిప్రాయంలో వేడి నీటిలో ఉంచబడిన టీ బ్యాగ్‌లు. స్ట్రాంగ్‌గా టీ ఇస్తుంది.

52. ఈ జీవితంలో మనము చేసే ప్రార్థనలకు జవాబు లభిస్తుందంటే మన విశ్వాసాన్ని బలపర్చి స్థిరపర్చుచున్నాడని నమ్మాలి. ఒకవేళ ఆలస్యంగా జవాబు లభిస్తే ఓర్పును పెంచుతున్నట్లు గ్రహించాలి. అసలు జవాబు రాకపోతే ప్రస్తుత పరిస్థితి కన్నా మెరుగైనది దాచాడని నమ్మాలి.

53. **ప్రాతఃకాల ప్రార్థనలకు విశ్వాసి ఎందుకు ఆసక్తి చూపుతున్నాడో కారణాలు**

1. సైతానును ఎదుర్కొనే ముందు మనం దేవునితో సంభాషించుట చాలా శ్రేయస్కరం.
2. మనకు అవసరమైన వ్యక్తులతో భాషించే ముందుగా దేవునితో సంభాషించుట అవసరం.
3. వాక్యం ద్వారా పరలోకం నుండి లభించే సందేశాలు ముందుగా వినటం ద్వారా లోక వార్తలు ఎలా ఉన్న చలించము.
4. విరామంగా దేవుని సన్నిధిలో గడపుట శ్రేష్టమనియు, లోకస్తులతో కాలయాపన చేయుట మంచిది కాదనియు స్వయంగా తెలిసికొనగలము.
5. లోక వార్తలు వినుట కన్నా పరలోక వార్తలు వినుట శ్రేష్టము.
6. మొదటి స్థానం దేవుని సన్నిధికి ఇవ్వాలి. ఇతరులకు రెండవ స్థానం ఇవ్వాలి.
7. మొదట దేవునినే ఘనపర్చాలి. రెండవదిగా ఇతరులను గమనించాలి.
8. మొదట ఆత్మను పోషించాలి. తదనంతరం శరీరాన్ని చూసుకోవాలి.
9. అద్దంలో మన ముఖాన్ని చూచే బదులు దేవుని వాక్యంలో మన ముఖాన్ని చూడటం మంచిది.
10. ఇల్లు తుడిచి శుభ్రపరిచే ముందు దేవునియెదుట నీ హృదయాన్ని ముందుగా శుభ్రపరచుకోవాలి.

54. ప్రార్థనా శక్తిని తక్కువగా అంచనా వేయరాదు. సందేహించరాదు. చిన్న ప్రార్థన నీ జీవితాన్ని గణనీయంగా మార్చగలదు. కోపం, పగ, కఠినమైన మాటలతో మీ చేతిలో కాఫీ కప్పు పగిలిపోగలదేమో! దాన్ని తిరిగి అతికించలేవేమో! నీలో సంతోషము, కృతజ్ఞత, శాంతి, వినయము ఏముందో ఆలోచించుకో? పగిలిన, విరిగిన జీవితాన్ని దేవుడు బాగు చేయగలడని నమ్మాలి. పగిలిన పాత్రను దేవుడు పారవేయడు.

55. ఎ) ఎవరికైనా ఎప్పుడైన అందించగల గొప్ప బహుమతి సమయమే కదా! ఎందువలననగా సమయాన్ని తిరిగి పొందలేము. ప్రతి సమయంలో దేవుడే మన పట్ల పని చేస్తూ మన కోరికను తీర్చుటయే కాదు శక్తితో నింపి జయ జీవితం ఇవ్వాలని సిద్ధంగా ఉంటాడు. ఆయనకిష్టంగా, ఆయన చిత్తంలో జీవించుట మన విధి. పుట్టిన వెంటనే మొదటి కేక నుండి చివరి శ్వాస వరకు దేవుని అవగాహనలో ఉంటాలి.

బి. మూడు విషయాలు మన జీవితంలో గతిస్తే తిరిగిరానిది ఏదనగా సమయం, నోటితో పలికిన మాటలు, ఎదుర్కొన్న అవకాశాలు పోగొట్టుకొని తిరిగి పొందలేము.

సి. స్థిరము కానివి మూడు కలవు. **భవిష్యత్తు, విజయాలు, కలలు** ఇవి నమ్మలేని నిజాలు.

డి. ఎక్కువ విలువగలవి మూడు కలవు. **ప్రేమ కుటుంబం, స్నేహితులు మరియు దయ.**

ఇ. త్రిత్వమైన దేవుడు తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మతో మన జీవితాలు బంధించబడ్డాయి.

ఎఫ్. మన జీవితాలను నాశనం చేయు మూడు విషయాలు కోపం, గర్వం, క్షమించలేని స్థితి.

జి. మంచి వ్యక్తిత్వాన్ని సిద్ధపరచేవి మూడు అంకిత భావం, నిజాయితీ, కృషి ఉండాలి.

హెచ్.జీవితంలో వదులుకోని మూడు విషయాలు నిరీక్షణ, శాంతి మరియు నిజాయితీ.

57. ఎవరు నీవెనుకనున్న బాధను గుర్తిస్తారో, నీ కోపం వెనుక ప్రేమను గుర్తిస్తారో, మౌనం వెనుక అర్థాన్ని గుర్తించగలరో, అతనే మనకు మంచి మిత్రుడని గుర్తించాలి.

57. ఉదయాన్నే అల్పాహారంగా తీసుకొనదగినవి ఒక ప్లేటు ప్రేమ, ఒక గిన్నె నిండా శాంతి, ఒక స్పూను నిరీక్షణ, గరిట శ్రద్ధ, ఒక గ్లాసు నిండా ప్రార్థన కావాలి. క్రీస్తుతో మన తలంపులన్నీ మిళితం కావాలి. అంతకన్నా విలువైనవి ఏమి ఉండవు. క్రీస్తు అపార కృప ప్రతి పరిస్థితికి సరిపడిన తృప్తిని ఇస్తుంది. ఆయన కృపాక్షేమాలు మన వెంట వస్తాయి.

58. దేవుని చిత్తానికి ఎల్లప్పుడు లోబడి ఆయన మాటలను ఆలకించి ఆయన నాయకత్వంలో సాగిపోవాలి. సత్యం ఒక గుహలాంటిది. దానిలో ఆశతో ప్రవేశిస్తాము గాని ఇతరుల సహాయం లేకుండా సంచరించలేము. లోపలకు వెళ్ళే కొలది మార్గదర్శకుడు కావాలి. సర్వ సత్యాన్ని పరిపూర్ణంగా ఎరిగిన పరిశుద్ధాత్ముడు నిజవిశ్వాసులకు మార్గదర్శి కాగలడు.

59. ఎంత మందికైనా ఎప్పుడైనా పంచగల్గేది సంతోషమే. ఏమనిషికైనా దేవుడు ప్రసాదించినది సంతోషం. తల నిండా జ్ఞానము గలవారు కాదు గాని గుండె నిండా ప్రేమ నింపుకున్నవారే కావాలి. దేవుడు కరుణా వాత్సల్యం గలవాడు. అందుకే దేవుని సందేశాలన్ని శ్రద్ధగా వినాలి. నోటితో ప్రకటించాలి. చేతులతో అవసరమైన వారికి చేయుతనివ్వాలి. నిన్ను నీవు ఉత్తమ వ్యక్తిగా రూపొందించుటకు ప్రయాసపడాలి. ఎవరు నిన్ను తృణీకరించకుండా చూచుకోవాలి.

60. **నిజమైన ఆశీర్వాదమేది?**

Begin the day with, Love in the heart, Expect blessings Share goodness, Shine like the sun, Inspire some one, Never forget that, God is with you all the time

నీ రోజు దేవునితోనే ప్రారంభించాలి. ప్రేమ నిండిన హృదయంతో ఆశీర్వాదాన్ని కోరుకుంటూ మంచిని పంచాలి. సూర్యునిలా వెలగాలి. ఇతరులను ప్రోత్సహించాలి. దేవుడు నీతోనే ఉంటాడని నమ్మాలి.

61. మానవుల ముందు మోకరిల్లుట కన్నా దేవుని ముందు మోకరిల్లుట మంచిది. ఆశీర్వాదం దేవుని నుండే వస్తుంది. దేవుని యందు భయభక్తులతో కలసి నడవడటం నీ మార్గానికి అత్యంత విలువైనది.

దేవుడు + నీవు + కేరీర్ = విజయము

దేవుడు + కుటుంబము = సంతోషము

దేవుడు + సేవ = ఆశీర్వాదము

దేవుడు + సవాలు = చాంపియన్

దేవుడు + ప్రార్థన = శక్తి

దేవుడు + దేవుని బహుమానం = నిజమైన ప్రేమ

దేవుడు మన జీవిత గమనానికి కేంద్రమయినపుడు ఎల్లప్పుడు జయం మనదే.

62. దేవునికి ప్రథమ స్థానం ఇవ్వాలి.
ఖరీదైన వస్త్రములు విలువ లేనివై విడువక తప్పదు.
పంచామృతములు తిన్ననూ విసర్జించక తప్పదు.
ఖరీదైన కారు ఎక్కిననూ దిగక తప్పదు.
ఎంత ఎత్తుకు వెళ్ళినా నేలపై దిగక తప్పదు.
ఎన్ని ప్రదేశాలు తిరిగినా గూడు చేరక తప్పదు.
ఎన్ని అనుభవాలు ఉన్నా చివరకు దేవుని చేరక తప్పదు.

63. దేవునితో ఎంత మాట్లాడిననూ మన ఊపిరి నష్టము కానేరదు.
దేవునితో ఎంత నడచినా శక్తి సత్తువ నష్టం కాదు
దేవుని కొరకు ఎంత ఓర్పుతో కనిపెట్టినా నీ కాలం వృథా కాదు
దేవునిని నమ్ముకుంటే నీవెన్నడూ నష్టపోవు అన్ని పొందుకుంటావు.

64. జీవితంలో సఫలత పొందాలంటే సహనంతో కొన్ని విషయాలు రాజీ పడాలి. మంచికి మాత్రమే చోటివ్వాలి.

మంచి విశ్వాసంలో గడిపిన సత్సంబంధాలు, సమయాలు మంచి జ్ఞాపకాలుగా గుండెల్లో భద్ర పర్చాలి. అందరినీ ప్రేమిస్తూ, చేయుతనిస్తూ ప్రోత్సహిస్తూ జీవితపు యాత్ర కొనసాగించాలి.

65. ఒక పక్షి ఆకాశంలో ఎగిరిన వేళ ఎందుకు అంత ఎత్తుకు ఎగురుతుందో చెప్పలేము. మనం ఎంత పైకి ఎగరాలో ఏ రీతిగా ఎగరాలో దేవుడు నేర్పిస్తాడు. యెహోవా కొరకు ఎదురుచూచువారు పక్షి రాజువలె పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు సొమ్మసిల్లక నడచిపోవుదురు. పక్షి రాజు ప్రార్థన వాక్యం అనే రెండు రెక్కలు చాచి పరిశుద్ధాత్మ అనే గాలి సహాకారంతో పైకి ఎగిరి తుఫానులను అధిగమించి ప్రశాంతంగా ఎగురు రీతిగా ప్రతి విశ్వాసీ ప్రార్థనలో పరిశుద్ధత ఆశీర్వాదాలున్నాయని నిరీక్షించి జీవించాలి.

66. సర్పము పక్షిరాజుకు విరోధి. సర్పము నేల మీద ఉండగా పోరాడుట కన్నా ఆకాశంలో శక్తిని కొల్పోతుంది గనుక బ్యాలెన్సు కూడ తప్పుతుంది. పక్షిరాజు సర్పముపై విజయము పొందగలదు. ప్రతి విశ్వాసీ పైకి దైవ శక్తిని ఆశ్రయించి సైతానుతో పోరాడి గెల్చును. ఎడతెగక వాక్యము ప్రార్థనలను ఆశ్రయించి ఎల్లప్పుడు విజేతలు కాగలము.

67. ఒక విత్తనము మొలకెత్తు వేళలలో మౌనంగానే ఉంటుంది. అది పెరిగి విరిగి పడినపుడు పెను గాలి శబ్ధంతో కలిసి చాలా గొప్ప శబ్ధం వినిపిస్తుంది. దీనిని బట్టి మానవ జీవితం కూడ మౌనంగానే ఆత్మీయంగా ఎదగాలి. పెద్ద శబ్దాలతో పడి కృంగి పోరాదు. విత్తనం నిర్జీవంగా కనిపించవచ్చు గాని తగిన సేద్యం చేయబడిన నేలపై నాటినపుడు ఎంతో అందంగా మొలకెత్తి చిగురించి పెరిగి పుష్పించి ఫలాలనిచ్చి సమాజానికి ఉపకారిగా జీవిస్తుంది. మన జీవితం అందరికీ ఉపయోగపడాలి.

68. దేవుని సేవను అవిరామంగా ఆపేక్షతో చేయుటకిష్టపడాలి. చాలాసార్లు సమస్యలు ఎదురవుతాయి. అయిననూ ప్రశాంతత ధైర్యము నిబ్బరము కలిగి ఉండాలి. దేవుడు సదా కాలము మనతో ఇమ్మానుయేలుగా ఉండి ఆయన మార్గము చూపి వెలుగు నిరీక్షణ ప్రేమతో నీకు సదా తోడుగా ఉంటాడు. ఊహించని ఆశీర్వాదాలనిస్తాడు.

69. బంధాలన్నీ మన జీవితంలో ఎగిరే పక్షిలాంటివి. వదులుగా పట్టుకుంటే అవి ఎగిరిపోతాయి. జాగ్రత్తగా కాపాడుకుంటే నిలుస్తాయి.

70. మెదడు గుండెను ప్రశ్నించిందంట.
శుభోదయమనే సందేశం పదే పదే పంపుటెందుకు?
నీకు కారణం కావాలి. నాకు ప్రేమ బంధం కావాలి అని జవాబిచ్చింది.

71. ప్రతి స్త్రీ జీవితం దేవుని సేవ పట్ల శ్రద్ధ కల్గి ఉండాలి. సేవలో మంచి గుర్తింపు పొంది ప్రశంసల నందుకోవాలి. బైబిలులో స్త్రీల ఔన్నత్యం కొనియాడదగినది.

1. **హవ్వ :** సకల మానవులకు మాతృమూర్తి.
2. **శారా :** గౌరవ ప్రధమైన రాజకుమారి. భర్తను యజమాని అని పిలిచి గౌరవించింది.
3. **రిబ్కా :** ఆతిథ్యమిచ్చుటలో దిట్ట, శక్తివంతమైన తల్లిగా నిలిచింది.
4. **రాహాబు :** విశ్వాసమునుబట్టి సహకారిగా ఉండి విశ్వాసుల జీవితాలలో చేరిన మహిళ.
5. **హన్నా :** దేవుని అవసరత ఎరిగి, గురిచూచి ప్రార్థించి గొప్ప ప్రవక్తను కన్నతల్లి.

6. **ఎస్తేరు :** తన ప్రజల కోసం ప్రాణం పెట్టుటకు తెగించిన యవ్వన స్త్రీ
7. **షునేమీయురాలు :** సృజనాత్మక ఆలోచనలు కల్గి నిబ్బరమైన మనస్సు గల స్త్రీ.
8. **సారెపతు విధవరాలు :** లేమిలో ఆతిథ్యమిచ్చి దేవుని సేవకునికి సేవ చేసి, విశ్వాసము విసిరిన బాణాలకు సమ్మతించిన స్త్రీ.
9. **షీబా రాణి :** జ్ఞానాన్ని ఆశించి గొప్ప దేవునిని ప్రశంసించి గుర్తింపు పొందిన రాణి.
10. **యూదురాలైన బాలిక :** కష్ట జీవితంలో నమ్మిన దేవుని గురించి సాక్ష్యం ఇచ్చిన బాలిక.
11. **లూదియా :** హృదయాన్ని తెరచి, తన గృహాన్ని దేవుని పరిచారకుల కిచ్చి ఫిలిప్పీ సంఘ సంస్థాపకురాలైన వీర వనిత.
12. **సమరయ స్త్రీ :** చేదు జీవితంలో జీవ జలాలను పొంది తన గ్రామాన్ని రక్షించుకొన్న గొప్ప విశ్వాసి.
13. **క్రీస్తు తల్లియైన మరియ :** స్త్రీలలో మహా భాగ్యాన్ని పొందిన ధన్యురాలు కొనియాడదగిన పూజ్యురాలు.
14. **ఎలిజబెతు :** గుణవంతురాలు, యదార్థత కల్గి ప్రేమ నిండిన మంచి భార్య మరియు తల్లి.
15. **అన్న :** భగ్న హృదయం కల్గిననూ పతనం కాక దేవుని స్తుతించుట నేర్చుకొన్న స్త్రీ.
16. **మార్త :** క్రీస్తుకు ఆతిథ్యమిచ్చి, ప్రేమించగల్గిన నిరీక్షణ కలిగిన స్త్రీ.
17. **మార్త సోదరి మరియ :** ఉత్తమమైన ప్రాధాన్యతను ఎన్నుకొని క్రీస్తుతో ప్రశంసలను అందుకున్న స్త్రీ.
18. **డోర్కా :** క్రీస్తు ప్రేమ బలవంతం చేయగా తోటి వారి నుండి పరిచర్య ద్వారా ప్రశంసలు పొందిన గొప్ప మనసు గల ధీర వనిత.
19. **ప్రిస్కిల్ల :** సువార్త ప్రకటనలో సాటియైన సహకారిగా భర్తకు తోడ్పడిన ఆత్మల జాలరి.
20. **యోకెబెదు :** మోషే జీవితాన్ని ఆత్మీయ నేత్రాలతో, విశ్వాసంతో వీక్షించిన ధీరవనిత.
21. **నయోమి :** తన చేదు అనుభవాలను మరచి కోడలిని కూతురుగా ప్రేమించి కుటుంబ వ్యవస్థకు గొప్ప విలువనిచ్చిన వృద్ధ స్త్రీ.

22. **రూతు :** అత్తను ప్రేమించి, అత్త ప్రేమించే దేవుని హత్తుకొని విశ్వాస వీర వనితల జాబితాలో నిలిచి క్రీస్తు వంశావళిలో పేరు నిలుపుకున్న గొప్ప మనసున్న స్త్రీ.

23. **హాగరు :** శారా పరిచారకురాలిగా దేవునిని నమ్మి అవసరత తీర్చు దేవునిని ప్రార్థించి జవాబు పొందిన భాగ్యురాలు.

24. **లేయా :** సంతోషంగా వివాహం అయిన భార్యగా ఉండి దేవుని దృష్టిలో దయను పొంది దేవుని స్తుతించి మానవ జీవితానికి ఆశీర్వాదాన్ని తెచ్చింది.

25. **అబీగయీలు :** గొప్ప అవగాహన గల ఉత్తమ వనితగా దైవ సేవకు మనస్సాక్షికి కాపలా కాచిన గొప్ప స్త్రీ.

26. **దెబోరా :** విశ్వాసంతో ప్రోత్సహించబడిన ధీర వనిత, మంచి స్నేహితురాలు.

27. **హుల్దా :** దైవ విరుద్ధమైన దేశాన్ని, ప్రజలను దేవుని వైపు మళ్ళించుటలో గొప్పగా సహాయపడిన శక్తిమంతురాలు.

28. **ఫీబే :** పౌలు పరిచర్యలో గణనీయమైన సేవలందించి ఒంటరి తనానికి విరుగుడు తెలిసికొన్న మనసున్న మగువ.

29. **సలోమి :** తన సంతాన క్షేమాన్ని కాంక్షించి శ్రేష్టమైన దానిని పొందు కున్న మాతృమూర్తి.

30. **మగ్ధలేనే మరియ :** తృణీకరింపబడిన తన జీవితాన్ని మార్చుకొని క్రీస్తును గొప్పగా వెండించుటలో నాయకత్వం పొందిన స్త్రీ.

31. **యెరూషలేములో మరియ :** తన గృహాన్ని ఆరాధనలతో నింపి దైవ గృహంగా మార్చుకొన్న ఉత్తమ విశ్వాసి.

32. **లోయి, యునీకే :** దైవ వాక్య శక్తిని తెలిసికొని సమర్థతతో తిమోతిని భక్తిలో పెంచి, దైవ సేవకునికి అండగా ఉండు ధన్యతనిచ్చిన స్త్రీలు.

72. జీవితంలో మనము ఎదుర్కొనే వ్యక్తులలో అవసరంలో నున్న వారికి తగిన ప్రోత్సాహాన్ని అందించాలి. విమర్శించరాదు. ఎవరో చేయుతనివ్వాలని కనిపెట్టే బదులు మనమే చేయూతనిచ్చి ఆదరించాలి. ఆలోచించి సమయస్ఫూర్తితో మంచి మాటలు పలకాలి. అప్పుడే తగిన గుర్తింపు లభిస్తుంది. అబద్దాల మాటలు, ఇచ్చకపు మాటలు, మోసకరమైన మాటల వల్ల పరువు ప్రతిష్ట, పేరును కొల్పోయి అవమానాలు పొందుతాము.

73. అహంకార మాటల వల్ల ప్రేమను కొల్పోతాము. అనవసర మాటల వల్ల అపార్ధములకు గురి కాగలము. అధికంగా మాట్లాడితే ప్రశాంతత కొల్పోతాము. కోపంగా మాట్లాడితే దయా గుణాన్ని కొల్పోతాము. జాగ్రత్తగా జీవించడానికి, మంచి పని చేయడానికి ప్రేమించుటకు దేవునిపై నిరీక్షణ ఉండాలి. దైవ ప్రీతి, పాప భీతి, సంఘ నీతి ప్రతి వ్యక్తికి కావాలి.

74. మనము జీవించే రోజులలో మంచి స్నేహితులుంటారు. నిజ స్నేహితులు దూతల వంటివారు. అపురూపంగా ఉంటారు. అరుదుగా ఉంటారు. కపట స్నేహితులు ఎక్కడైన ఎగురుతూ ఎండుటాకుల వంటివారు. గలగలలాడతారు. మంచి స్నేహితులుగా జీవిస్తున్నామని నిరూపించుకోవాలని శ్రమపడనవసరం లేదు. మనం చూపిన మంచి పనులే నిరూపిస్తాయి. పేరు తెస్తాయి.

75. చూచి నమ్మిన వారి కంటే చూడక నమ్మినవారు ధన్యులు అని బైబిలు సెలవిస్తుంది. సూర్య కాంతిని నమ్మగలము గాని మబ్బులలో కొన్నిసార్లు కాంతి కనబడక పోవచ్చు కాని సూర్యుని ఉనికి మారదు. ప్రేమను నమ్మగలము అది బాహ్యంగా కనబడక పోవచ్చు. దేవుడు మౌనంగా ఉంటాడు గాని సజీవుడై యధార్ధవంతులను కనుపాపగా కాపాడగలడనే వాగ్దానాన్ని నమ్మాలి. చిరునవ్వు చెరుగనియ్యరాదు. ఉదయకాల ప్రార్ధనలో నీ స్వరము వినిపించు ప్రభువా నీ దాసుడు ఆలకించుచున్నాడని ఆరంభించాలి.

76. పండుగలను దృష్టిలో ఉంచుకొని హాస్యంగా చెప్పిన విషయాలన్ని ఆసక్తికరంగా ఉంటాయి.

ఎ) సరియైన వ్యక్తిని పెండ్లాడితే రోజు వాలెంటెన్స్‌డే అవుతుంది.

బి) సరైన వ్యక్తి భర్తగా లభించనిచో హత సాక్షుల దినంగా మారుతుంది

సి) గొప్ప వాడిని చేసుకుంటే ప్రతి రోజు న్యూ ఇయర్ డే కాగలదు.

డి) అపరిపక్వ తత్వము గలవాడు భర్తయితే చిల్డ్రన్స్ డే కాగలదు.

ఇ) అబద్ధికుడిని చేసుకుంటే ఎప్రిల్ ఫూల్ డే కాగలదు.

ఎఫ్) పెండ్లి వద్దనుకునే వ్యక్తికి స్వాతంత్ర్య దినంగా మారుతుంది

77. కొన్నిసార్లు మన కలలను సఫలము చేసుకోలేక అపజయాలను ఎదుర్కొంటే మన మార్గాన్ని మార్చుకోవాలి. మన ఆశయాలను కాదు. ప్రకృతిలో చెట్లు తన ఆకులను రంగును కాలానుగుణంగా మార్చగలదు. గాని చెట్టు క్రింద వేళ్ళనుమార్చలేదు.

78. విజయానికి అసలు అర్థమేమనగా

ఎ) See your Goal గమ్యము ఎన్నుకొని దానిని చూడాలి.

బి) Under stand the obstacles ఎదుర్కొంటున్న అడ్డంకులను అర్థం చేసుకో

సి) Create positive and mental picture ఆశావాదంతో మనస్సులో మంచి పటాన్ని ముందుంచుకో

డి) Clear your mind of self doubt స్వంత ఆలోచనలలో సందేహాలన్నీ ప్రక్షాళన చేసుకో

ఇ) Embrace the challange సవాళ్ళను ఎదుర్కో, వాటిని కౌగిలించుకో

ఎఫ్) Stay on track సరైన మార్గంలో నిలిచి ఉండు.

జి) Show the world that you can do it నేను దేవుని శక్తితో సమస్తం చేయగలనని లోకానికి చూపించు కొన్ని వ్యక్తిగత త్యాగాలు చేస్తేనే మన బిడ్డలకు మంచి భవిష్యత్తునందించగలము.

79. సూర్యుని కాంతి వలె ప్రకాశించాలని ఆశిస్తే సూర్యుని వలె ఉండాలి. విజేతగా జీవించాలని ఆశిస్తే గమ్యం చేరే గురికై ఏకాగ్రతతో కృషి చేయాలి.

1. గొప్ప గురి కావాలి. 2. తగిన జ్ఞానం పొందాలి.

3. కష్టించి పని చేయాలి. 4. పట్టుదలతో సాధించాలి

80. ఎవరినోటివెంటైనా కూని రాగం (పద్యం) ఆలాపనగా పలుకుతుంటే అధిక సంతోషమైనా రావాలి లేదా అధిక దుఃఖమైనా రావాలి. ప్రతి వ్యక్తికి కష్టాలు అవసరమే, అప్పుడే విజయం ద్వారా పొందిన ఆనందం పరిపూర్ణమవుతుంది. శ్రమల్లో విభిన్నంగా ఆలోచించే ధైర్యము విచక్షణ అలవడుతుంది. గమ్యం తెలిసికొనే ప్రయత్నాలతో పయనించుట నేర్చుకోగలం. అసాధ్యమైన విషయాలు సమర్థతతో ధైర్యంతో సుసాధ్యం చేసుకోగలము. సమస్యలన్నీ జయించి విజయ పథంలో గమ్యం చేరగలం.

81. కలలు కనుట, అంకిత భావంతో జీవించుట. అనేవి శక్తిగల రెండు అంశాలు. ఒక దానితో ఒకటి పెనవేసికొనే ఉంటాయి. భయాన్ని పారద్రోలాలి. భయానికి రెండు నిర్వచనాలున్నాయి.

Forget Everything And Run సమస్తాన్ని మర్చిపోయి పరుగెత్తి పారిపోవాలి

Face Everything And Raise సమస్యలు ఎదుర్కొని లేచి పరుగెత్తాలి.

82. నీవెదుర్కొనే అపజయాలను బట్టి చింతించవద్దు. ప్రయత్నించకుండా పోగొట్టుకునే అవకాశాల కొరకు చింతించు. వర్షము వచ్చిన వేళలో ఇంద్ర ధనస్సుకై కనిపెట్టు. చీకటి ఉన్న వేళలో నక్షత్రాల కాంతికై వేచియుండు. నీ చిరునవ్వుతో ప్రపంచాన్ని మార్చు గానీ ఈ లోకం నీ చిరునవ్వును వృధా పర్చకుండా చూచుకో.

83. కష్టమైన దారి గుండా ప్రయాణం చేసిననూ అది చివరకు అందమైన గమ్యాన్ని చేర్చి ధన్యతనిస్తుంది. ఆ ప్రయాణంలో క్రింద పడి తిరిగి లేస్తే మరింత బలవంతులుగా లేస్తాము. అసలు పడని వారి కంటే పడి లేచిన వారు శ్రేష్టులు. అనుభవం గొప్పది.

84. నాణెములు శబ్ధము చేస్తాయి. గానీ, కరెన్సీ నోట్లు మౌనంగా ఉంటాయి. మన విలువ పెరిగే కొలది మనం మౌనంగా నిశ్చలంగా ఉండాలి. జీవితాన్ని ఆనందంగా ఉంచుకోగలిగితే అది సమర్ధవంతంగా కొనసాగుతుంది.

ఇతరులతో పోటీ పడుతూ ఉంటే దుర్భలంగా మారిపోతుంది. ఇతరులను విమర్శిస్తూ సణుగుతూపోతే చాలా క్లిష్టంగా మారుతుంది. నీ మనస్సు ఎట్లుందో నీ గతి అదే రీతిగా మారుతుంది. అందుకే ప్రతి దినం ప్రతి క్షణం ఆనందంగా, ఆశావాదంగా జీవించుటకు ప్రయాసపడాలి. అందరిలో మంచిని చూడడం నీ బలహీనత అయితే అంతటి బలవంతుడు ఎవడు ఉండడు.

85. నీ శారీరక సౌందర్యం ఉపయోగించే వనరులు బాహ్య సౌందర్యాన్ని అందిస్తాయి. ఆత్మ సౌందర్యం వృద్ధి పొందాలంటే నీ పెదవులకు సత్యమనే లిప్‌స్టిక్ రాసుకో, నీ పెదవులపై ఇతరుల పట్ల సానూభూతి కనబర్చు. నీ స్వరంలో సదా ప్రార్ధన ఉండాలి. నీ చేతులకు సహాయం సహాకారం చేసే పని ఉండాలి. నీ ముఖంపై సదా చిరునవ్వు ఉండాలి. నీ గుండెల్లో నిండుగా దేవుని పట్ల, ఇతరుల పట్ల ప్రేమ కలిగి ఉండాలి. రెండు విషయాలు నిన్ను నీవు అదుపులో ఉంచుకోవాలి. ఎవరూ లేనపుడు నీ ఆలోచనలను నలుగురిలో మెలిగే సమయాల్లో నీ మాటలు జాగ్రత్తగా ఉండాలి.

86. ఇంటి తలుపులు ఇంటి కంటె చిన్నవిగా ఉంటాయి. తాళం చూస్తే తలుపుల కంటె చిన్నదిగా ఉంటుంది. తాళపు చెవి తాళం కంటె చిన్నదిగా ఉంటుంది చిన్న తాళం చెవి ఇల్లంతటినీ తెరువగలదు. అలాగే ఒక చిన్న మంచి ఆలోచన పెద్ద సమస్యలకు పరిష్కారం అందించగలదని నమ్మాలి.

87. రోగంతో మరణిస్తే పరలోకం ఉంటుంది. కానీ పాపంలో మరణిస్తే పరలోకం ఉండదు. **రోగాలు పోయే ప్రసంగాలు కాదు గానీ పాపాలు పోయే ప్రసంగాలు కావాలి.** ఏ ఒక్క వ్యక్తి ఈ లోకంలో పరిపూర్ణుడు కాదు. తప్పులు చేస్తున్నారని అందరినీ వదులుకుంటూ పోతే ఒంటరిగా మిగిలిపోతావు. ఇతరులను విమర్శించక ప్రేమతో ఉండుటకు నేర్చుకోగలిగితే ఆనందంగా ఉండగలవు.

88. నీ కన్నులు మంచిని చూడాలని ఎల్లప్పుడు ప్రార్థించాలి. ఎవరినైనా క్షమించే హృదయం కావాలని ప్రార్థించాలి. చెడు చేసిననూ ఇతరుల చెడును కూడ త్వరగా మర్చిపోవాలని పశ్చాత్తాపం గల హృదయంతో శుద్ధి చేసుకోవాలని సదా ప్రార్థించాలి. ఎన్నడూ చెక్కు చెదరని విశ్వాసం కలిగి ఉండేలా ప్రార్థించాలి. విసుగక ప్రార్థించాలి. ఎడతెగక ప్రార్థించాలి.

89. జీవిత ప్రయాణంలో గమ్యం చేరాలని పయనించే సమయంలో ఈర్ష్యపడే కళ్ళుంటాయి. ఎత్తి చూపే వేళ్ళుంటాయి. వ్యంగంగా మాట్లాడే నోర్లు వుంటాయి. భయపడితే గమ్యం చేరము. నిర్భయంగా సాగిపోవాలి. మన స్థితి స్థిరమైనది కాదు. మన ప్రయాస ప్రభువు నందు ఎన్నటికీ వ్యర్థంకాదు.

90. ఆకాశం నుండి కురిసే ప్రతి వర్షపు చినుకును, నీ కంటి నుండి కారే బాష్ప బిందువును గౌరవించు. మన కన్నీరు కడలిలో బ్రతికించు దేవుడు మనకున్నాడు. మన బాష్ప బిందువులను తుడుస్తాడు. మన నిట్టూర్పులు వినే దేవుని సదా ఆశ్రయించాలి. మంచి సందేశాలు పంపు స్నేహితులకు కృతజ్ఞతలు తెలపాలి. వారి క్షేమము కోరి ప్రార్థన చేయాలి. కొన్నిసార్లు అభినందించాలి.

91. జీవితమనేది వేలాది స్వల్పమైన అద్భుతాల పరంపర. జీవితం అనేక తోరణములతో ఎన్నెన్నో శిఖరానుభవాలు, లోయానుభవాలు కలిగి ఉంటుంది. కొన్నిసార్లు ఎత్తైన స్థలము నుండి బలవంతంగా త్రోసివేసినపుడు, పరిస్థితులు అసహాయ స్థితికి చేరినపుడు నీవు నమ్మిన దేవుడు భద్రపరుస్తాడు. నీ సహజతత్వాన్ని నీవు మార్చుకునే ప్రయత్నం చేయకు. నీ పాత్ర ఎవరు పోషించలేరు. నీకు నీవుగా జీవించు. నీవే ఉత్తమ వ్యక్తివని నమ్ము. ఒంటరిగా ఉన్ననూ దేవుడు తోడుగా ఉంటే బలవంతులమే, కలిసి ఉంటే సహవాసం ద్వారా మరీ బలవంతులం కాగలము.

92. దావీదు హృదయానుసారుడని పేరు పొందాడు కానీ అతను గతంలో ఈర్ష్య, పగ, ద్వేషంతో ఉన్న సౌలు బాణాలన్నీ గురి తప్పించి దేవుడే కాపాడాడు. అతనిని సంరక్షించాడు. మనపై సాతాను విసిరే బాణాలన్నీ ఎన్నెన్నో రూపాలుగా ఉంటాయి. విచారాలు, శోధనలు, మరణాలు, లేమి, అశాంతి ఇవన్నీ దేవుడే తప్పిస్తాడని నమ్మాలి.

93. దేవుడు దయగలవాడు. ఈ లోకంలో మంచి వ్యక్తులను స్నేహితులుగా ఇస్తాడు. వారంతా అద్దంలాంటివారు నీడలాంటి వారు అద్దము అబద్ధమాడదు, నీడ వీడిపోదు, కొందరు సాధు స్వభావం కల్గి ఉంటారు.

94. ప్రేమ దయ ఎప్పటికీ  నిష్ఫలము కాదు. అవి అందుకున్న వారికే కాదు ఇచ్చే వారికి కూడ ఆశీర్వాదాన్ని కలిగిస్తుంది. గర్వము అహంకారము కలబోసి "ఇగో" (EGO) అనవచ్చు అది మూడక్షరాల మాట అయినను అది 12 అక్షరాల "రిలేషన్ షిప్" (RELATION SHIP) అనే బంధాన్ని నాశనము చేయగలదు గనుక జాగ్రత్త పడాలి. రిలేషన్ షిప్ అనే బంధము చాలా విలువైనది. దైవ ధ్యానము ప్రార్థన వల్ల వ్యక్తి విలువలున్న వ్యక్తిగా జీవించగలరు. ప్రపంచం శాసించగల వీరి ప్రార్థన ఎలా చేయాలో తెలిసిన వారై యుంటారు. ఆత్మ సంబంధులు అనుక్షణం దేవుని ఆరాధిస్తారు. ఆచార సబంధులు ఆదివారం మాత్రమే దేవుని ఆరాధిస్తారు.

95. మంచి విశ్వాసిగా జీవించదలచినవారు తక్కువగా మాట్లాడి ఎక్కువగా ప్రార్థిస్తే ఎంతో విలువ. తక్కువగా ప్రేమిస్తూ ఎక్కువ నిజాయితీగా జీవిస్తే అంత మనశ్శాంతి.

దుష్టులకు ఎంత దూరంగా ఉంటే అంత గౌరవము
మన హద్దులలో మనం ఉంటే అంత మర్యాద
ఎంత తక్కువ ఆశిస్తే అంత ప్రశాంతత
ఎంత నిగ్రహంగా ఉంటే అంత అగ్ర స్థానములో ఉంటాము.

96. మీరు ఏ మత శాఖకు చెందినవారు? ఏ సంఘానికి సభ్యులుగా ఉన్నారు? అన్నది కాదు ముఖ్యం. దేవునిని ప్రేమించి, ఆయనకు భయపడి, ఆయన శాసనాలను, కట్టడలను అనుసరించే సంఘ సభ్యుడనని చెప్పాలి. దేవుడు సదా మనలను మంచి సహవాసంలో తర్ఫీదు చేయుటకై కనిపెట్టి చూస్తాడు. ఆయన చిత్త స్వరూపంలో మార్చుటకు మనలను సృజించాడని గుర్తించాలి.

97. దేవుడు తన కొరకై ఎన్నుకున్న వ్యక్తులను సుధీర్ఘ కాలము ఓర్పు నేర్పించి తీరతాడు. యోసేపు తన ఉన్నత స్థాయి చేరుటకు కష్టాలలో 13 సంవత్సరాలు కనిపెట్టాడు. అబ్రహాము వాగ్ధాన ఫలం పొందుటకు 25 సంవత్సరాలు నిరీక్షించాడు. మోషే రెండుసార్లు 40 సంవత్సరాలు విభిన్న అనుభవాల తరువాత నాయకుడయ్యాడు. క్రీస్తు 30 సంవత్సరాల తరువాత సేవ ప్రారంభించి 3 1/2 సంవత్సరాలు చేశాడు. అన్ని తరాల వారికి స్ఫూర్తినిచ్చి నిత్య జీవానికి వారసులను చేస్తూనే ఉన్నాడు. కాబట్టి ఓర్పు, నేర్పు అవసరం.

98. సంతోషమనేది సెంటువలె సువాసనలను వెదజల్లుతుంది. ఇతరులపై సెంటు చల్లినపుడు అది చల్లిన వారికి వాసన వస్తుంది. ఆ వాసన ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఇతరులను సంతోషపరిస్తే నీకు కూడ ఆనందం మిగులుతుంది.

99. నీ ఆర్ధిక స్థితిని బట్టి, నీ బ్యాంకులో సొమ్మును బట్టి నీకు కలనివ్వడు. నీ యధార్థత, తగ్గింపు నీ విశ్వాసాన్ని బట్టి ప్రతి దినము తనిఖీ చేస్తాడు.

100. నీలో ఊపిరి దేవునిది గనుక ఊపిరి ఉన్నంత వరకు దేవుని కొరకే బ్రతకాలి. విశ్వాసము వలన సమస్తము సాధ్యము. నిరీక్షణ క్రియాత్మకంగా చేయుటకు సహకరిస్తుంది. ప్రేమ సమస్తము ఆనందంగా మార్చగలదు. ఇవి మూడు విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ జీవితంలో అత్యవసరాలు. ఆశీర్వాదం పొందుటకు ఇవి ప్రాధాన్యత వహిస్తాయి. మంచి విషయాలు తెలుసుకోవాలంటే చెవులు తెరచి వినాలి. నోరు మూసుకొని ఉంచాలి.

101. సమస్యల గుండా వెళ్ళే బలమైన విశ్వాస ప్రార్ధన ధైర్యాన్నిస్తుంది.

**అమ్మ నాన్న విలువలు**

1. అమ్మ మంచిదిగా, కని పెంచినదిగా పిల్లల దృష్టిలో ఉంటుంది. కానీ కనడము అమ్మ అయిన, కలలు కనడం నాన్న పని.
2. పెంచడం అమ్మే అయినా బాధ్యతతో పెంచడం నాన్న వల్ల సాధ్యం.
3. సేవ చేయడము అమ్మ వంతు, సరి చేయడం నాన్న వంతు.
4. అమ్మకు పిల్లలలో మంచి గుణాలు కనిపిస్తాయి, నాన్నకు దోషాలు కూడా కనిపిస్తాయి.
5. ప్రేమించడం అమ్మ వంతు, దీవించడం నాన్న వంతు.
6. ఆకలి తీర్చడం అమ్మ వంతు, ఆశ తీర్చడం నాన్న వంతు.

7. అమ్మ ప్రేమ బహిరంగంగా చూడగలం, నాన్న దీవెన అంతర్గతంగా ఉంటుంది.
8. అమ్మ ఆరాటము కన్నీళ్ళు చెప్తాయి, నాన్న ఆతృత కళ్ళు చెప్పుతాయి.
9. అమ్మ పిల్లల సుఖం గురించి ఆలోచిస్తుంది, నాన్న క్షేమం గురించి ఆవేదన చెందుతాడు.
10. అమ్మ పిల్లలకోసం కన్నీరు కారుస్తుంది. నాన్న పోరాటం చేస్తాడు.

102. ఈ ప్రపంచం, జీవితం చంచలమైనది. జీవితం ప్రశాంతమైనదై ప్రేమ కలిగి ఉండాలంటే ఓర్పు, దయ, వినయం, దాతృత్వం అనే గుణాలు ఉండాలి. అప్పుడు దేవుని ప్రశాంతత, ప్రేమ మనం పొందగలం.

103. అనుదినము ఆయనకు నూతనముగా వాత్సల్యత పుట్టుచున్నది నీవు ఎంతైన నమ్మదగిన వాడవు. విలాప 3:23.

దేవున్ని సదా ఆరాధించి స్తుతించుట ఎంతో మంచిది. యేసుక్రీస్తు మనకు ప్రభువు, రక్షకుడు, స్వస్థపర్చువాడు, బలమైన దేవుడు, ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, నిత్యుడగు తండ్రి, సమాధాన కర్త, శాంతి ప్రదాత, నా జీవిత సర్వస్వము అని నిత్యము ఆయనను సన్నుతించిన వ్యక్తి ధైర్యముగా సంతోషముగా జీవిస్తాడు.

104. ఈ లోకములో ఎవరిని ప్రేమించినా, ఆశించిననూ కోరిన ప్రేమ దొరకదు. యేసయ్యను ప్రేమిస్తే ఊహించని రీతిలో అద్భుతమైన నిత్య ప్రేమ దొరుకుతుంది. అబ్రహాము అచంచల విశ్వాసముతో ఆయన ఇచ్చిన వాగ్ధానాలను నమ్ముకొని బలమైన విశ్వాసంతో విశ్వాసులకు తండ్రి అయ్యాడు. దేవుని మహిమ పర్చాడు. వాగ్ధాన మిచ్చిన దేవుడు సమస్తమును నెరవేర్చునని నమ్మాడు.

దేనిన గూర్చి చింతపడకుడి ప్రతి విషయంలో ప్రార్థనా విజ్ఞాపనలతో మీ విన్నపములను దేవునికి తెలియజేయుడి. ఫిలిప్పీ 4:6

105. దేవుడు గద్దించు మనుష్యుడు ధన్యుడు. కాబట్టి సర్వ శక్తిమంతుడగు దేవుని శిక్షను తృణీకరింపరాదు. నోటి మాటల చేత కలుగు నొప్పి నీకు తగుల కుండ ఆయన నిన్ను చాటు చేయును. నీలోని ఊపిరి తండ్రియైన దేవునిదే. ఆ ఊపిరి ఉన్నంత వరకు దేవుని కొరకే బ్రతకాలి.

106. అన్ని సవ్యంగా ఉన్నప్పుడు ధైర్యంగా ఉండడం గొప్పకాదు. ఎన్ని సమస్యలు నిన్ను చుట్టు ముట్టినా ఆధైర్యాన్ని కోల్పోకుండా ఉండుట గొప్ప విషయం. కరోనా సమయంలో చేసిన పాపాలు కడుక్కోమని శానిటైజర్ ఇచ్చి హెచ్చరిస్తుంది. చెడు మాట్లాడకూడదని మాస్క్ హెచ్చరిస్తుంది. దుష్టులకు దూరంగా ఉండమని డిస్టెన్స్ అంటూ హెచ్చరిస్తుంది కాలము. దేవుడు కరోనా నుండి బ్రతికించినందుకు తగిన రీతిగా స్తుతించాలి.

107. క్షమాపణ జీవితంలో అందుకునే గొప్ప బహుమతి. వేల తప్పులు మనం చేస్తూ సమర్థించుకోగలము. యితరులు తప్పు చేస్తే క్షమించలేము. ఇతరుల తప్పులను క్షమించగలగటం మనిషికి నిజమైన ఆనందం.

108. స్వల్ప రూపంలో 10 ఆజ్ఞలు

1. Put God first

2. Worship Him only

3. No Bad words

4. Work Six days Rest One day

5. Obey your parents

6. Harm No one

7. Don't Cheat

8. If its not yours don't take it

9. Tell the truth

10. Don't be jealous of other people's stuff

109. సోమవారం ఆనందంగా ఆరంభించు.

మంగళవారం ఏ ఆటంకం రానీయకు.

బుధవారం ఏ ఒత్తిడికి గురికాకు.

గురువారం ఏ శ్రమ దరి రానీయకు.

శుక్రవారం చిరునవ్వులు చిందించు.

శనివారం హాయిగా విశ్రమించు.

ఆదివారం దేవున్ని ఆరాధించి సంతోషించు. వారమంతా ఆశీర్వాదమే నీ సొత్తు.

110. ఎ. ప్రపంచంలో మొదటి ఇంజనీర్ **నోవహు**

బి. ప్రపంచంలో మొదటి వ్యక్తి **ఏలియా** అగ్నితో అంతరిక్షంలో ఎగిరాడు

సి. ప్రపంచంలో భూ గర్భంలో ప్రయాణించిన మొదటి వ్యక్తి **యోనా**

డి. ప్రపంచంలో రాయిని బుల్లెటుగా వాడిన మొదటి వ్యక్తి **దావీదు**

ఇ. రాకేట్ లేకుండా అంతరిక్షంలో నడచిన వ్యక్తి **హనోకు**

111. నిజమైన సత్యముతో ఆరాధించినపుడు దేవునితో సరైన సంబంధం ఏర్పడుతుంది. అప్పుడు దేవుడు మనకు తండ్రిగా ఉంటాడు. ఆయన ప్రేమను సన్నిహితంగా అనుభవవిస్తాము. ఆయన మన అవసరాలన్నిటినీ బాధ్యతగా నిర్వహించుటకు శ్రద్ధ వహిస్తారు.

112. నీతిమంతుల కొరకు వెలుగును యాదార్ధ హృదయుల కొరకు ఆనందమును విత్తబడి యున్నవి. కీర్తనలు 97:11

పరిశుద్ధ జీవితము జీవించడం అనేది విత్తనాలు విత్తడముతో సమానం. వెలుగు విత్తేవారికి ప్రభువు వెలుగు పంట అనుగ్రహిస్తాడు. వ్యవసాయదారుడు శ్రేష్టమైన ఫలాల కొరకు నిరీక్షించేటట్లుగా నిరీక్షించాలి. ఆత్మలను సంపాదించాలి. మన ఆత్మలు వెలుగును ఆనందాన్ని స్వతంత్రించుకుంటాయి.

113. ప్రీతి గల మన యేసు ఎంతో గొప్ప మిత్రుడు. ప్రతి పరిస్థితిని మిత్రునితో చెప్పినట్లుగా, దేవునితో చెప్పు కుంటున్నామా? ఏ శ్రమ వచ్చినా, ఏ భయం ఎదుర్కొన్ననూ ఏ శోధన చుట్టు ముట్టినా, దేవునికే చెప్పుకోవాలి. ఆయన మన గోడు వింటాడు. సహాయము శ్రద్ధగా చేస్తాడు. ఏ బాధ గుండా వెళ్ళిననూ ఆయన నీకు సమీపంగా ఉండి అర్థం చేసుకోగలడు. నిన్న, నేడు, రేపు ఒకే రీతిగా ఉంటాడు. అందరితో మాట్లాడటానికాశించినట్లు దేవునితో మాట్లాడుట చాలా మంచిది.

114. యెహోవా నా ప్రభువా నీవు సెలవిచ్చియున్నావు నీ ఆశీర్వాదంనొంది నా కుటుంబం నిత్యం ఆశీర్వదించబడును గాక. ఇది విజ్ఞాపనగా మలచబడిన వాగ్ధానము. నమ్మకుండా ప్రార్థిస్తే మనం ఆశీర్వాదం పొగొట్టుకుంటాము. మన తరాల తరువాత వచ్చే తరాలకు కూడా దేవుని ఆశీర్వాదాలు అందేలా ప్రార్థన చేయాలి. భవిష్యత్తులో మన వంశాలకు చెందిన వారంతా నమ్మకమైన విశ్వాసులుగా ఉండే కృప కోసం ప్రార్థన చేయాలి.

115. ప్రార్థన అనేది దేవుని మనస్సు మార్చుటకు నిర్దేశించినది కాదు గాని దేవుడే మన దృక్పధాన్ని మార్చాలి. మన సమస్యలను దేవునితో చెప్పుకుంటే మారుస్తాడు. మన గుండెలో గాయాలను సరిచేయమని కోరాలి. మన మానసిక గాయాలను మార్చమని అడగాలి. భయాలు, దిగుళ్ళను తొలగించి నెమ్మది నిమ్మని సదా ప్రార్థన చేయాలి.

116. మూడు శక్తివంతమైన అలవాట్లు జీవితాన్ని సఫలం చేస్తాయి.

ఎ) ఇతరులను విమర్శించుటకు బదులుగా ప్రోత్సహించాలి.

బి) తీర్పు తీర్చుటకు బదులుగా అర్థం చేసుకొని సహనం వహించాలి.

సి) కనిపెట్టి కాలయాపన చేసే బదులు సత్కార్యాలను తలపెట్టి చేయాలి. నిర్లిప్తంగా ఉండరాదు. కాని నీవు ఏది కొరుకుంటే దానిని నెరవేర్చడానికి దేవుడు ఇష్టపడతాడు. యోగ్యంగా అడిగి సమస్తం పొంది అభివృద్ధి చెంది ఫలించాలని దేవుని ఆశ.

117. సముద్రంలో నీరెంత ఉందో శాస్త్రవేత్తలు కొలవలేరు. సముద్రపు ఒడ్డున ఇసుక ఎంత ఉందో తత్వవేత్తలు తూచలేరు. వాటిని అక్కడ ఉంచిన దేవుడెంతటి వాడో మత ఛాందసవాదులు గ్రహించలేరు.

118. ఎవరిని ప్రేమించినా ఆశించినంత ప్రేమ దొరకదు. యేసయ్యను ప్రేమిస్తే ఊహించని అద్భుతమైన నిత్య ప్రేమ దొరుకును. **కృప** అనేది దేవుడు మనకు అనుభవం, అర్హత లేకపోయినా ఇచ్చేది. మనము చెడు లక్షణాలు గలవారమైననూ తప్పించేది **దయ.** కృప, దయ సమృద్ధిగా పొందాలంటే దేవునికి కృతజ్ఞత చూపటంలో నిర్లక్ష్యం చేయరాదు.

119. నిపుణత కలిగిన పనివారు శ్రద్ధగా పనిచేస్తూ ఆహ్లాదంగా ఆపనిని స్వీకరిస్తారు. బద్ధకస్తులు విశ్రాంతిని కూడా పెద్ద పనిగా స్వీకరిస్తారు. ప్రపంచములో ఎన్నో పోరాటాలుంటాయి. మనస్సులో కలిగే పోరాటాలు బయట ప్రపంచానికి తెలియదు. మన నిట్టూర్పులు వినే దేవునికే ప్రార్థించి పరిష్కారం పొందాలి.

120. నిర్ణయము తీసుకున్నాక దారి ఎట్లున్నా గమ్యం చేరాలి. శ్రమ మన ఆయుధం కావాలి. విజయం మనసొత్తు కావాలి. శ్రద్ధ గలవాడు ఐశ్వర్య వంతుడగును. బిడ్డ పుడితే తల్లికి సంతోషము. బిడ్డ పెరిగితే తండ్రికి ఆనందం. యోగ్యుడైతే సమాజానికి సంబరం. మరణిస్తే పలువురు కన్నీరు పెట్టాలి అదే మన జీవితం.

121. ప్రార్థన, స్తుతి రెండు అనుభవాలు. పడవకు తెడ్లు వంటివి. ప్రార్థన, స్తుతులతో లోతైన జలములలో సాగిపోవాలి. క్రీస్తును గూర్చి జ్ఞానమే జలాలయితే ఆ జ్ఞానం సంపాదిస్తూ జీవిత నావను తెడ్లుతో నడిపిస్తూ సాగిపోవాలి. జీవితములో ఏది కోల్పోయినా ఎక్కువ బాధ పడరాదు. ఎందువలననగా చెట్టు ఆకులు రాలిన ప్రతిసారి క్రొత్త ఆకులు చిగురిస్తాయి. జీవితం తిరిగి చిగురించ గలిగి నూతన ఉత్సాహాన్ని పొందగలము.

122. మన జీవితంలో చేదు అనుభవాల జ్ఞాపకాలు తప్పవు. అందుకే గతాన్ని తలస్తూ చింతించవద్దు. కన్నీరు వృథా కానీయకు. భవిష్యత్తులో ఏదో మంచి జరుగనైయున్నదని ఉప్పొంగి భ్రమలో చిక్కుకొనకు. వాస్తవంలో జీవిస్తూ ప్రతి దినం దేవుడిచ్చిన బహుమతిగా భావించి ప్రశాంతంగా, ఆనందంగా అనుదినం దేవుని ప్రేమ నూతనంగా పుట్టునని నమ్మి భక్తితో జీవించు.

123. మనం విలువ గలవారము దేవుడు స్వరక్తంతో వెల పెట్టి కొన్నాడు. దేవుని చేతిలో ఉన్న మనం ఎంతో విలువైన యాజక సమూహ రాజులమని గుర్తెరిగి యుక్తిగా జీవించాలి. మనలోని ఓర్పు కుటుంబానికి మేలు. ఓర్పుతో ఇతరులను మన్నిస్తే అది గౌరవమగును. మనలో ఓర్పు ఉంటే అది ఆత్మ విశ్వాసం.

124. క్రీస్తు ఉన్న బాటలో తుఫానులు తప్పవు. విశ్వాసంతో యేసును ఆశ్రయిస్తే క్షేమంగా ఉంటావు. ప్రభువు నీకు తోడుంటాడు. జీవితంలోని సమస్యలు మనల్ని ముక్క చెక్కలు చేసినప్పుడు వాటిని ముక్కల్ని పేర్చి విలువైన పాత్రగా దేవుడు మనలను మార్చగలడు. పగిలిన పాత్ర అని పార వేయక పొంగి పొర్లే పాత్రగా మార్చగలడు నమ్ము నేస్తమా!

125. యవ్వన కాలంలో వృద్ధులను ప్రేమించాలి.
బలంగా ఉన్నప్పుడే బలహీనులకు సహాయం చేయాలి.
తప్పు చేసినపుడు నిజాయితిగా ఒప్పుకోవాలి.
నీవు వృద్ధుడవు, బలహీనుడవు తప్పులు చేస్తే తోట్రుపాటు కలిగి ఉండవచ్చు.
ఎప్పుడయినా అనుభవాలు గుర్తుంచుకోవాలి.

126. ఒక ప్రొఫెసర్‌గారు పెద్ద కెటిల్‌లో మంచి కాఫి తెచ్చి బల్ల మీద పెట్టారు. వివిధ ఖరీదులలో అందమైన కప్పులు పెట్టారట. ప్రతి కప్పులో కాఫీ పోసి తీసుకొని త్రాగమన్నారట. అందరూ అందమైన కప్పులలో కాఫీని

స్వీకరించారట. అప్పుడు ఆ ప్రొఫెసర్ జీవితం కాఫీ లాంటిది కాఫీ ముఖ్యంగాని కప్పు కాదని తెలుసుకోండి. ఏవి మాన్యమైనవో ఖ్యాతి గలవో అది మనస్కరించాలి. ఒక రాయి ఇచ్చిన తండ్రి తన కుమారునితో దీని విలువను వివిధ వ్యక్తులను దర్శించి కనుక్కొమన్నాడట. కూరగాయల వ్యాపారి, పూల కొట్టువాడు వివిధ ధరలు చెప్పారు. వజ్రాల వ్యాపారి రాయిని చూచి ఇది చాలా చాలా విలువైనది అని చెప్పాడు.

127. మనము ప్రార్థించునపుడు మనం చెప్పేదాని కన్నా ఎక్కువ వింటాడు అడిగిన దాని కన్నా ఎక్కువగా జవాబిస్తాడు. ఊహించని రీతిగా అధికముగా మనకు సమృద్ధినిస్తాడు, ఎదుటి వారికి అర్హత లేకున్నా సరే గౌరవించాలి. ఎందుకంటే మనమిచ్చే గౌరవము మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబింప చేస్తుంది.

128. గతాన్ని తలస్తూ కన్నీరు కార్చకు భవిష్యత్తును గూర్చి ఆలోచిస్తే భయం కలుగుతుంది, నవ్వుతూ వాస్తవంలో జీవించు ఆహ్లాదాన్నిస్తుంది. నిరాశలో నిరీక్షణ, చీకటిలో వెలుగు మన దేవుడు. నా బలహీనతలో బలము, నా దిగులు విచారణలో ఆదరణ, నా ప్రతి అడుగును స్థిరపరచువాడు ఆయనే. ప్రతి ఉదయము నూతనముగా వాత్సల్యము పుట్టించు ప్రేమ గలవాడు. యధార్థవంతులను బలపర్చుటకై దేవుని కనుదృష్టి లోకమంతా సంచారం చేస్తుంది.

129. చాలా సార్లు మన చుట్టూ ఉండే వారంతా అర్థము లేకుండా జీవిస్తూ స్వార్థంతో ఉన్నప్పుడు క్షమించాలి. నీవు దయగా ఉన్ననూ నిన్ను అకారణంగా నిలదీస్తే నీవు దయ చూపాలి. నీవు నిజాయితీగా ఉండగా నిన్ను మోసగిస్తే నీవు నిజాయితిని వదలకు. నీవు ఆనందంగా జీవిస్తున్నప్పుడు అసూయతో బాధిస్తే సంతోషం దూరం చేసుకోకు. నీవు ఇతరులకు మంచి చేస్తే వారు మర్చిపోయినపుడు మంచిని మరలా కనపరచు. ప్రపంచంలో పలు జీవితాలలో నీవు ఉత్తమమైన అనుభవాలను అందిస్తూనే ఉండాలి. అదే సరైన మార్గమైయున్నది.

130. కోపంగా ఉన్నప్పుడు జవాబివ్వరాదు, సంతోషంలో వాగ్దానం చేయరాదు, విచారంగా ఉన్నప్పుడు నిర్ణయాలు చేయరాదు. కష్టంలో తోడుగా ఉన్న వారితోనే స్నేహం చేయాలి.

131. నేటి క్రైస్తవ సంఘాలలో ఉజ్జీవము కనిపించుట లేదు. నామాకార్థ స్థితిలో ఉండుటకు కొన్ని కారణాలు

ఆరాధన ఉంది గాని అర్పించే మనస్సు లేదు.
ప్రార్థన ఉంది గాని పరిశుద్ధత లేదు.
అలంకరణ ఉంది గాని నిజమైన దీనమనస్సు లేదు.
ఉద్రేకము ఉంది గాని ఆత్మల భారం లేదు. భక్తి ఉంది గాని భక్తిలో శక్తి లేదు. వాక్చాతుర్యం ఉంది గాని ఆత్మ నడిపింపు లేదు. వాక్య జ్ఞానం ఉంది గాని క్రీస్తు మనస్సు లేదు.

132. దేవుని రాజ్యంలో 3 ఆశీర్వాదాలు ఉన్నాయి

1. క్రీస్తు దాసులుగా ఉండి సదా స్తుతించగలము
2. నిత్యం దేవుని ముఖ దర్శనం చేయగలము
3. మన పేర్లు జీవ గ్రంథంలో వ్రాయబడి ఉంటాయి.

133. దేవుని సముఖంలో మన ప్రవర్తన జాగ్రత్తగా చూచుకోవాలి. ఎంత ఆహారము ఉన్ననూ తృప్తి ఉండదు. దాహము తీరదు. చిల్లు పడిన సంచి కలిగి ఉన్నామా? ఆలోచించాలి.

నీతిమంతులుగా కనబర్చుకొనుచూ ఆవగింజ అంత విశ్వాసం లేకపోతే చిల్లు పడిన సంచి గల వ్యక్తులుగా కాగలము.

ఎంతో మృదువుగా మాట్లాడ గల సమర్థత కల్గిననూ, ద్వంద్వ మనస్కులమై ఆహ్వానించిన అతిథులకు మర్యాద చేసినను వారు నిష్క్రమించాక వారిని కఠినంగా విమర్శించినపుడు చిల్లు పడిన సంచిని పోలినవారమగుదము.

రాత్రి పగలు ఉపవాసముండినను, కుటుంబ ప్రార్థన లేక కలిసి చర్చికి రానిచో చిల్లు పడిన సంచిని పోలినవారము.

నీవే నా ప్రాణ మిత్రుడవని పొగడుచూ అవసరంలో సహాయం చేయనిచో చిల్లు పడిన సంచిని పోలినవారము.

గొప్పగా పాటలు పాడుచూ, సంఘ సేవ చేస్తూ, వీడియోలో సూక్తులు చెప్పినను, సువార్త వినయంతో చేయక, గొప్పలు చూపించుకొనుటకు చేసినచో చిల్లు పడిన సంచిని పోలినవారము. అందుకే నీ ప్రవర్తన సరిచేసుకో అని వాక్యం చెబుతుంది.

134. క్రీస్తు మన కొరకు ఏమి చేయగలడు? అని ఆలోచించనచో ప్రతి అవసరాన్ని సమకూర్చగలడు. మన కొరకు యుద్ధము చేయగలడు, కనిపెట్టి మనలను సంరక్షించ గలడు, నీ కుడి ప్రక్కన నిలిచి నడిపించగలడు, నీ శక్తిని పున రుద్ధరించగలడు, నీ కంటిలోని బాష్ప బిందువులను తుడచి ఆదరించగలడు.

135. అసూయ తగదు. దుష్టత్వ స్వభావం రానీయరాదు. అబ్రహాం లింకన్‌ని చెప్పులు కుట్టెవాడి కుమారుడవని ఒకడు అవమానించగా వినయం చూపాడు. ప్రార్థనా జీవితమే ఆయన శక్తికి తగ్గింపుకు ఆధారము. అదే బలాన్ని ఒత్తిడిలను అవమానాలను అధిగమిస్తుంది. ప్రార్థనా మందిరములో ఆనందింపజేసెదను. నా మందిరము సమస్త జనులకు ప్రార్థనా మందిరమనబడును యెషయా 56:7. గొప్ప భక్తులకు స్ఫూర్తినిచ్చే వాక్యం ఇదే.

136. ఆశావాదంతో ఆలోచించగలిగిన వ్యక్తికి శబ్ధాలన్ని చక్కని సంగీతాలుగా మారగలవు. ప్రతి కదలిక నృత్యమవుతుంది. ప్రతి చిరునవ్వు మనస్సు నిండా ధ్యానంతో నింపబడుతుంది. బ్రతుకుతున్న జీవితము వేడుకగా ప్రతి దినము రూపొందగలదు. అందుకే పౌలు చెప్పినట్లు ఆనందించుడి మరలా చెప్పుదును ఆనందించుడి అని చెప్పుకోవాలి.

137. మన జీవితంలో "ప్రార్థన" లోకంలో నుండి మనల్ని ప్రత్యేకించదు. లోకంలో ప్రతి బాధ నుండి సంరక్షించగలదు. కృపా కటాక్షాలనందిస్తుంది. ప్రతి దినం ప్రయోజనకరంగా గడపాలి. గడచిన రోజును మరలా తిరిగి పొందలేము. సమయాన్ని వృథా చేయరాదు.

138. నీ జీవితంలో విచారాలు పెరిగినపుడు, తీవ్ర దుఃఖంతో కృంగినపుడు, కన్నీరు ప్రవాహంగా కలత పెట్టినపుడు, నీ కన్నీరు దాచగలిగిన దేవుడు నీ ప్రతి బాష్పబిందువులను తుడిచివేయువాడు ప్రభువే. నిత్య జీవితంలో కార్డ్‌లెస్ ఫోను కనిపెట్టు జ్ఞానం దేవుడిచ్చినది కదా. ప్రార్థన ఏనాడు సిగ్నల్ కొల్పోదు. రిచార్జి చేయనవసం లేదు. ఎప్పుడైనా ఎక్కడైనా దేవునితో సంభాషించవచ్చు అవిరామంగా ప్రార్థన చేయాలి అదే ఎడతెగని ప్రార్థన.

139. జీవితం నిన్ను అందరికి పరిచయం చేస్తుంది. ఓటమిని నీకు పరిచయం చేస్తుంది. కాని నిద్ర ఎవరు పరిచయం చేయకుండానే వస్తుంది. ప్రశాంతంగా నిద్రించాలి. మెల్కొని స్తుతించాలి. నిద్రపోక ముందు రోజంతా గడిపిన రీతి మననం చేసుకొని పొరపాట్లు ఉంటే ఒప్పుకొని ప్రార్థించి నిద్రపోవాలి.

140. యేసుక్రీస్తు పాత నిబంధన ప్రవచనాలలో నిలిచాడు. సువార్తలలో కనుపరచుకున్నాడు. అపోస్తలుల కార్యాలలో ప్రబోధించాడు. పత్రికలలో యేసును గురించి వివరించబడింది. ప్రకటన గ్రంథంలో రాబోవు ప్రభువుగా సూచించబడ్డారు. బైబిలు చరిత్రలో క్రీస్తు ప్రాధాన్యత గురించి తెలుసుకోవాలి.

141. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. ప్రతి వ్యక్తి అందంగా సృష్టించబడినాడు. దేవుడు ఎన్నడూ పొరపాట్లు చేయడు. నీవు చేయవలసిన పనిని ఉత్తమముగా చేయగలగాలి. పనిలో నిపుణత గలవాడు గొప్పవారి సమక్షంలో ప్రశంశలు పొందును. దేవుడు శ్రద్ధ గలవానిని ఐశ్వర్యవంతునిగా చేస్తాడు.

142. నిజం గడప దాటేలోపు అబద్దము వేయి మైళ్ళు ప్రయాణం చేస్తుంది. నిజం గడప దాటిన మరుక్షణం అబద్ధం శూన్యమవుతుంది. సత్యమును అనుసరిస్తూ ఉంటే అన్ని వ్యాధులకు ఉపశమనం ప్రార్థన. వాక్యము మూడు పూటల చదువుతూ యేసు నామంలో ప్రార్థనాత్మతో జీవించటం శారీరక, ఆత్మీయ మేలుల కిటుకు.

143. “ఇది మొదలుకొని నేను మిమ్మును ఆశీర్వదించెదను” హగ్గ 2:19

ఈ లోకంలో ఒక వైద్యుడు వైద్యం ద్వారా రక్షించగలడు. లాయరు నీ సమస్యలను సమర్థించగలడు. ఒక సైనికుడు శాంతికరమైన జీవితాన్ని ఇతరులకు అందించగలడు కానీ యేసు క్రీస్తు ద్వారా మాత్రమే నిత్య జీవాన్ని పొందగలవు. క్రీస్తు మాత్రమే భయంకర పాపాల నుండి విడిపిస్తాడు. పెల్లుబికుతున్న అవిశ్వాసం, మోహపు చూపులు, గర్వపు ఆలోచనలు, ఇట్టి సాతాను దుష్ట సలహాల నుండి తప్పించు శక్తి దేవునికి కలదు. మనలో బంగారు, మట్టి విగ్రహాల వల్ల కలిగిన అపవిత్రతను తొలగిస్తాడు. దేవుని మాటలు యధార్థమైనవి. ఖచ్చితమైనవి, భరోసా ఇచ్చేవి క్రమ బద్దమైనవి అందుకే దేవుని సదా నమ్ముకోవాలి.

144. ఎ) ఎప్పుడైనా ఎవరినైనా విమర్శించుటకు కాస్త నిదానించాలి. ఏ వ్యక్తి గురించి అయినా యధార్థముగా ప్రార్థించకుండా విమర్శించరాదు.

బి) ప్రేమ లేని జీవితము కుటుంబమంతటిని బాధిస్తుంది. వివాహము లేని విచ్ఛలవిడి ప్రేమ సమాజాన్ని బాధిస్తుంది.

సి) దేవునికి ఇవ్వవలసిన సొమ్ము ఇవ్వకపోతే దానిని సైతాను స్వంతం చేసుకోగలడని తెలిసికో.

డి) యేసుక్రీస్తు ప్రతినిధిగా జీవించుట గొప్ప భాగ్యమని తలంచాలి.

ఇ) సోమరితనం భిక్షాటనకు తాళపుచెవి. సమస్త కీడులకు మూలము

ఎఫ్) నిరుత్సాహపరిచే మాట మాత్రలాగ పని చేస్తుంది. నిరుత్సాహం సాతాను పనిముట్టు దానికి లొంగరాదు.

జి) నిస్వార్థము మనిషిని గొప్పవాడిని చేస్తుంది. స్వార్థము మనిషిని మోసం చేస్తుంది.

హెచ్) దినమునకు రెండు గంటలు దేవునితో గడపుట విశ్వాసికి అవసరం. రోజులో 10వ భాగం 2గం॥40 నిమిషాలు దేవునివే కదా!

ఐ) తన పిల్లలకు ప్రార్థన నేర్పించే తల్లి ఉత్తమ స్త్రీ.

జె) అత్యుత్తమ ఆదర్శాలతో భక్తిని నేర్పిస్తూ లోటు లేని జీవితం నేర్పించే తల్లిదండ్రులు ఆదర్శప్రాయులు.

145. దేవుడు మన ప్రార్థనలను విన్నాడని నిశ్చయము కలిగే వరకు ప్రార్థించాలి. ఆయన నుండి జవాబు పొందే వరకు ప్రార్థన చేయాలి.

విరిగిన హృదయం గలవారికి యెహోవా ఆసన్నుడు, నలిగిన మనస్సు గలవారిని ఆయన రక్షించును. కీర్తన 34:18

జీవితమనేది ప్రేమతోను ఇతరులు మనల్ని చూసే విధానం బట్టి సుఖమయం కాగలదు.

146. నలిగిన, కృంగిన విశ్వాసులకు హెచ్చరిక ఏదనగా ఆందోళన చెందక ప్రశాంతంగా ఉండుటకు ప్రయత్నించాలి. కొన్ని తెగుళ్ళు సాతాను ద్వారా సేవకుల గృహాలను, మనుషుల హృదయాలను పాడు చేయగలవు. సాతానుకు నీకు దేవుడు విభజన రేఖను ఉంచాడు. నీ ఆత్మతోను, లక్ష్యంతోను, స్వభావంతోను, సహవాసంతోను ఆ విభజన రేఖను వెళ్ళకుండా జాగ్రత్తగా గమనించి ప్రవర్తించాలి.

147. దేవుడు మన జీవితాలలోనికి అడుగు పెట్టినపుడు అద్భుతాలు జరుగుతాయి. ఏ సమస్యలు వచ్చినా ధైర్యంగా చిరునవ్వుతో ఎదుర్కొవాలి. అప్పుడే భయం దూరమగును. బాధ నివారించబడుతుంది.

"ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖ దర్శనం చేయుదురు ఆయన నామము వారి నొసళ్లయందుండును. దేవుడు నమ్మిన వ్యక్తులు మూడు

విధాలుగా ఉందురు. సేవించుదురు, ముఖ దర్శనం చేయుదురు. ఆయన నామం వారినొసళ్ళ మీద ఉండును. ఆయనను సదా స్తుతించు బాధ్యత ఉన్నది. క్రీస్తు యేసు మన రాజు, ప్రభువు, రక్షకుడు, స్వస్థ పర్చువాడు. సమకూర్చువాడు, ఆశ్రయ దుర్గం, మన బలం, మన కేడెము, శాంతి, ఆనందము, జీవము, మనకు సర్వమైయున్నాడు.

148. మన రెండు చెవులను దగ్గరగా ఉంచగా గుండె ఆకారము వస్తుంది. Heart 5 అక్షరాలలో 2,3,4 అక్షరాలు ear చెవి ఇతరుల హృదయాన్ని దోచుకోవాలంటే శ్రద్ధగా వినాలి. దేవుని హృదయానుసారులు కావాలంటే దేవుని మాట వినాలి.

149. నా అంతరంగమందు హృదయం హెచ్చుగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగజేయుచున్నది. దేవుడిచ్చు ఆదరణ అతి శ్రేష్టమైనది. మోకాళ్ళపై ప్రార్థించే విశ్వాసి శక్తివంతుడై పైకి లేచును. నిన్ను విడువను, నిన్ను ఎడబాయను ధైర్యముగా ఉండుము యెహోషువ 1:6 ఈ వాగ్దానాలను శక్తివంతుడైన విశ్వాసి నమ్ముతాడు. దేవుని ప్రేమిస్తాడు. దేవుని ప్రేమ సముద్రము వంటిది. దాని ఆరంభాన్ని చూడగలవు గాని అంతాన్ని చూడలేవు.

150. **కొన్ని దైవ వాక్యాలు అవసరంలో ఆదరిస్తాయి.**

1. దుఃఖం కలిగినపుడు యోహాను 14
2. బాధ కలిగినపుడు మత్తయి 6:19
3. పాపంలో పడినపుడు కీర్తన 51
4. ప్రమాదంలో పడితే కీర్తన 91
5. విశ్వాసం బలపడాలంటే హెబ్రీ 11
6. విరోధులకు భయపడితే రోమా 8:31
7. విశ్రాంతి అవసరమయితే మత్తయి 11:28
8. అభయం కావాలంటే కీర్తన 33
9. నిరాశలో ఉన్నప్పుడు కీర్తన 37
10. ఒత్తిడికి లోనయినపుడు కీర్తన 27

యోహా.14, 15 అధ్యాయాలు దేవుని ఆదరణ కొరకు ఎంతో ఊరటనిస్తాయి.

151. దేవునితో సదా సత్సంబంధాలు ఏర్పరచుకో. శ్రమలు అందరికి తప్పవు. ప్రతి పరిస్థితికి అవసరాలు తీర్చుటకు ఏకైక ఆధారము యేసు ప్రభువే.

ఆయనే మన అండ. చాలాసార్లు సందేహంతో చేసిన పనులకు నేర భావనలు, భయాలు, కృంగ దీసినపుడు, క్రీస్తు నా దగ్గర లేడా అనే సందిగ్ధత తప్పదు. కరెంటు చార్జింగు కొరకు ప్లగ్ అమర్చినట్లు దేవుని శక్తితో మన బలహీనతలన్నీ ప్లగ్ చేస్తే పవరు లభిస్తుంది. క్షమించాలనే సమస్య విశ్వాసం కావాలనే నిరీక్షణ, ప్రేమకు నిలయమై ఉండే కాంక్ష, ఆరోగ్య అవసరాలకై తపన, ఓర్పు, శాంతి కావాలనుకొన్నప్పుడు దైవ శక్తితో ప్లగ్ కనెక్షన్ చేస్తే పవరు పొందగలము.

152. శ్రమలో ఆదరణ, నిరీక్షణ మనం నమ్మిన దేవునిలో లభిస్తుంది. క్రైస్తవుడు వాడదగిన పదాలున్నాయి. వాక్యం, విశ్వాసం, కృప, క్రీస్తు దయ మహిమ ఇవి రోజు వాడాలి.

153. ఒక గొప్ప దేవాలయం నిర్మాణం చేస్తున్న స్థలానికి ఒక వేదాంతి వెళ్ళి ముగ్గురు వ్యక్తులను పలుకరించి ఏం చేస్తున్నారు అని ప్రశ్నించాడు.

**మొదటి వ్యక్తి** విసుగ్గా భుక్తి కోసం ఇటుకలు మోస్తూ డబ్బు సంపాదించి నా కుటుంబాన్ని పోషించగలుగుతున్నాను అన్నాడు.

**రెండవ వ్యక్తి** నాకు బాగా తెలిసిన కార్పెంటరు పని చేస్తూ తగిన డబ్బుతో నేను నా కుటుంబం సంతోషంగా ఉన్నాము అన్నాడు.

**మూడవ వ్యక్తి** నన్ను ప్రేమించి, కాపాడి, ఆశీర్వాదాలనిచ్చే దేవునికి ఆలయాన్ని నిర్మిస్తున్నాను.

ఆరాధనకు యోగ్యంగా శ్రద్ధగా నా పని నమ్మకంగా చేసుకొని పరమానంద పడుచున్నాను. వీరి జవాబులను బట్టి మనం చేసే నిత్య కృత్యాలలో విసుగు తగదు. రెండవది స్వార్థముగా తృప్తి పడరాదు. మూడవదిగా ఇతరుల క్షేమం కొరకు దేవుని ప్రేమంచుటకై చేసే పని ఆనందం కలిగిస్తుంది. మన చేతికి లభించే ఏ పని అయినా దేవునికి ప్రాముఖ్యతనిస్తూ చేయుట విశ్వాసి కర్తవ్యం. జీవితంలో మెళకువలు తెలిసికొని ఆచరించాలి.

154. చాలాసార్లు మనం సన్నిహితుల, స్వకీయుల మాటల ద్వారా ఇతరుల మనస్సు గాయాలు చేస్తూ, మోసాలు చేస్తూ, ప్రేమ లేకుండా ప్రవర్తిస్తుంటారు. ఆ సమయంలో సహనం కొల్పోరాదు. వారంతా ఏమి చేస్తున్నారో వారికి తెలియదు గనుక క్షమించాలి. కలత పడుట, చింతించుట విశ్వాసి లక్షణం కాదు. అల్పకాల శ్రమలనుభవింప అనుదినము కృపనిచ్చితివి. నాథుడు యేసుని జాడలలో నడచుటకు ననుపిలిచితివి అని పాడుకొని ఆహ్లాదంగా ఆనందంగా జీవించాలి.

155. మన జీవితంలో జ్ఞానం సంపాదించుటకు చదువు అవసరమే, దానికి ఇవ్వవలసినంత ప్రాముఖ్యతే ఇవ్వాలి.

1. చదువు అవసరమైతే దేవుడు పండితులను ఎన్నుకొనేవాడు.
2. డబ్బు అవసరమైతే ధనవంతులను ఎన్నుకొనేవాడు.
3. భవనాలు కావాలిస్తే ఇంజనీర్లను ఎన్నుకొనేవాడు.
4. ఆరోగ్యం కావాలంటే వైద్యులను ఎన్నుకొనేవాడు.
5. న్యాయం అవసరమైతే న్యాయవంతులను ఎన్నుకొనేవాడు.
6. భద్రత అవసరమైతు రక్షక భటులను పంపేవాడు.
7. పాప క్షమాపణ ప్రాముఖ్యత గలది గనుక దేవుడు తన ప్రియ కుమారుని పంపాడు.

156. క్రైస్తవ విశ్వాసం సింహ గర్జనవలె ధీరత కలిగి ఉంటుంది. సందేహాలు కలిగించే మాటలు వినబడినా పట్టించుకోక ధైర్యంగా నిలవాలి. నిరంతరం ప్రార్థనాత్మతో దేవునితో సంప్రదిస్తూనే ఉండాలి. పరలోకమందున్న ప్రభువా మా ఇంటిలోకి ప్రవేశించండి. మా గుండెల్లో బాధలు వేదనలను తొలగించండి. అనారోగ్యాలు స్వస్థపరచండి. ఆశ్చర్యకరమైన సంగతులను తెలుసుకొను రీతిగా ఆత్మీయ నేత్రాలు తెరవండి. రోజంతా నీ సన్నిధి మాతోనే ఉంచండి.

157. బైబిలులో పెద్ద అధ్యాయం 199, చిన్న అధ్యాయం 117

మధ్య అద్యాయం 118 ఆ అధ్యానికి ముందు 594 వెనుక 594 అధ్యాయాలు ఉన్నాయి. మధ్య అధ్యాయం 118:8లో దేవునికి మానవుని పట్ల గల గొప్ప ఉద్దేశ్యం వివరిస్తుంది.

"మనుష్యులను నమ్ముకొనుటకంటె యెహోవాను ఆశ్రయించుట మేలు" కీర్తనలు 118:8

యెహోవాయే మన ఆశ్రయదుర్గం నమ్మదగిన దేవుడు ఏకైక దేవుడు.

158. ఆగష్టు సెప్టెంబరు, నవంబరు అక్షరాలలో దైవసందేశం దాగి వుంటుంది.

| **August** | **ఈ అక్షరాలలో దాగిన సారాంశం** |
|---|---|
| Ark | దేవునిని ఒకటి అడగాలి |
| Untill | జవాబు వచ్చేవరకు అడగాలి |
| God | దేవుడు మనకున్నాడు |
| Unveils | ఆయన సమస్తమును బయలుపర్చగలడు |

Something నీకు సరైన సమాధానం
Tangible అందించి సంతోషపర్చగలడు
**September సెప్టెంబరు**
Speak the truth సత్యం పలకాలి
Enter the gates with thanksgiging
సంతోషగానాలతో దేవునికి కృతజ్ఞతతో గుమ్మములలో ప్రవేశించాలి
Pray without ceasing ఎడతెగక ప్రార్థించాలి
Trust in the Lord దేవునిపై నమ్మకముంచాలి
Exalt the named God forever సదా దేవుని నామం మహిమపర్చాలి
Magnify the Lord లిప్రభువును ఘనపర్చాలి
Believe in God promises దేవుని వాగ్దానాలు నమ్మాలి
Expect to receive blessings దేవుని దీవెన పొందుతామని నమ్మాలి
Rest in the assurence of Victory విజయం వరిస్తుందని జీవించాలి
**November నవంబరులో సందేశం**
No weapon formed against you shall prosper
నీకు విరోధముగా ఏ ఆయుధం వర్థిల్లదు దీవెన ఉంటుంది
Oil of altation shall be your portion నూనెతో అభిషేకం ఉంటుంది
Venarable you shall be in this month
ఈ నెలలో ప్రశాంతంగా ఉంటావు
Elevation shall be your portion బాహ్యంగా ప్రకాశించు దీవెన లభిస్తుంది
Mourning shall be far away దు:ఖం దూరమగును
Because he lives you are untouchable
దేవుడు నీలో జీవిస్తున్నందుకు నిన్ను ఎవరు తాకరు
Every occusing thing dissaian Rejoice
నిన్ను నిందించే వారుండరు ఆనందంగా ఉండు

159. జీవితంలో ఎవరైనా ఇవ్వగల గొప్ప బహుమతి సమయమే. అది తిరిగి పొందలేని గొప్ప ధన నిధి. శ్రమలో నిజాయితిగా ఉండాలి. ఐశ్వర్యంలో ఉన్నప్పుడు చాలా సామాన్యంగా జీవించాలి. అధికారంలో ఉండగా సౌమ్యంగా ప్రవర్తించాలి. కోపంతో ఉన్నప్పుడు మౌనంగా ఉండాలి. ఇదే జీవితాన్ని సరిగ్గా నిర్దేశించుకోవడం సమర్థవంతంగా జీవించు రీతి ఇదే.

160. దేవుడు మన గురించి ఏమని చెప్పగలడో తెలిసికో

1. you are loved **Jermiah 31:3**

2. you are special **Ephesi 2:10**

3. you are created with purpose **Jermiah 29:11**

4. you are cared **Ephesi 3:17-19**

5. you are lovely **Daniel 12:3**

6. you are Precious **1Cor 6:20**

7. you are strong **Psalm 18:35**

8. you are Important **1Peter 2:9**

9. you are forgiven **Psalm 103:12**

10. you are new ocation **2Cor 5:17**

11. you are protected **Psalm 121:3**

మన దేవుని ప్రార్థించేటపుడు గట్టిగా ప్రార్థించరాదు. నిజాయితిగా మౌన ప్రార్థన వింటాడు.

161. స్తుతించి ఆరాధించు క్రైస్తవుడు శక్తి గల క్రైస్తవుడు కాగలడు. ఆయన నామములను ప్రస్తుతిస్తూ స్తుతిస్తే దానిలో గొప్ప శక్తి దాగి ఉంది. క్రీస్తును ఆరాధించుట ఎంతో మంచిది.

1. ఆశ్చర్యకరుడు **యెష 9:6**
2. నిత్యుడగు తండ్రి **యెష 9:6**
3. సమాధాన కర్త **1థెస్స 5:23**
4. ప్రధాన యాజకుడు **హెబ్రీ 5:9**
5. ప్రధాన కాపరి **1పేతురు 5:4**
6. క్రీస్తు నజరేయుడు **మత్తయి 2:23**
7. ఇమ్మానుయేలు **యెష 7:14**
8. శ్రీమంతుడు **1తిమోతి 6:15**
9. షారోను పుష్పము **పరమ 2:1**
10. విమోచకుడు **రోమా 11:26**
11. దేవుని క్రీస్తు **లూకా 9:20**

12. దేవుని వాక్యం ప్రక **19:13**

13. దేవుని గొర్రెపిల్ల **యోహా1:29**

14. యెహోవా చిగురు **యెష 4:2**

15. యెహోవా బాహువు **యెష 51:9**

16. రక్షణ కర్త హెబ్రీ **2:10**

17. రాజులకు రాజు **1తిమోతి 6:15**

18. బలవంతుడు **యెష 9:6**

19. నిజమైన దేవుడు **1యోహా 5:20**

20. అక్షయుడు **1తిమో 1:17**

21. ఆది సంభూతుడు **కొలొ 1:15**

22. నీతి సూర్యుడు **మలాకీ 4:2**

23. నీతిమంతుడు **అపొ 7:52**

24. అద్వితీయుడు **1తిమో 6:15**

25. యూదా గోత్రపు సింహం ప్రక **5:5**

దేవుని స్తుతించుటకు మరెన్నో నామములు గలవు.

162. జీవితంలో అవసరత అనేది రాక మానదు. ప్రతి మనిషికి ఏదో అవసరత రాక తప్పదు. మనసుకు గాయం కాక తప్పదు. ప్రతి అవసరత, ప్రతి గాయం దేవుడు తీరుస్తాడు. నీవు సంపూర్ణ విశ్వాసం, ప్రార్ధన కలిగివుండే దేవుడు నీకు భద్రతా ఇస్తాడు. కొన్నిసార్లు జీవితంలో గొల్యాతు వంటి సమస్యలెదురు కావచ్చు గాని ఆ సమయంలో దావీదు వడిశిలలో విస్పోటన శక్తినిచ్చి సమయోచిత జ్ఞానమిచ్చి ఘన విజయాలను సాధించుటకు కృపనిస్తాడు.

163. నీలో ఉన్న దేవుడు నీకిచ్చిన మంచి మనస్సును బట్టి పరిశుద్ధాత్మ ప్రబోధమును బట్టి నీకు సమాజంలో ఆదరభిమానాలు లభిస్తున్నాయని నమ్మి కృతజ్ఞతతో దేవుని స్తుతించాలి.

164. మూడు ముచ్చటైన విషయాలు మనతో ఉంచుకోవాలి.

1. ప్రయత్నం చేయాలి. 2. పని పట్ల నిజాయితి కలిగి ఉండాలి.

3. దేవునిపై విశ్వాసం ఉంచాలి. విజయం నీదే

165. ఎవరిని దేవుడు నిర్దోషిగా ఎంచునో వాడే ధన్యుడు. అట్టి ధన్యత కలిగినపుడు దేవుని అండ ఉంటుంది. బాధలు కలిగినపుడు వంద కారణాలు చూపితే, నవ్వుకోవడానికి వెయ్యి కారణాలు ఉంటాయని గ్రహించుకోవాలి. ఎదురు గాలిలోనే గాలి పటం పైకి లేస్తుంది.

166. జీవితంలో వెలుగే లేదని చీకటిలో ఉండిపోతామా?
చిరునవ్వు లేదని వేదనలో సర్దుకొనిపోతామా?
ప్రతి పనిలో కష్టం ఎదురవుతుందని వెనుకంజ వేస్తామా?
ప్రతి వ్యక్తి గెలవాలని ప్రయత్నిస్తూనే కొన్ని సార్లు ఓడిపోవచ్చు
ధైర్యంగా ప్రయత్నించడమే గొప్ప విజయం.
ఏ మంచి స్నేహాన్ని, నమ్మకాన్ని ఏ ప్రేమను మనం ఇతరుల నుండి ఆశిస్తామో అది మన నుండే ప్రారంభం కావాలి.

167. లోకంలో అందరిని నమ్మరాదు. ఎక్కువగా నమ్మితే మోసపోతాము. ఎక్కువగా ప్రేమించడం కూడ తగదు. కోరిన ప్రేమ అందకపోతే నిరాశపడతావు. దేవుని నమ్ముకొని ఆయనపై ఆశ పెట్టుకొని సహనంతో కనిపెట్టువాడే ధన్యుడు.

168. మన జీవితం, మన సత్క్రియలు దీపస్తంభముపై వెలుగుచున్న రీతిగా కనిపించాలి. ప్లాస్టిక్ పువ్వులు ఎంత అందంగా ఉన్ననూ తుమ్మెదలు వాలవు. మనిషి బాహ్యంగా ఎంత అందంగా ఉన్ననూ మంచి మనస్సు మంచి మాట లేకుంటే ఎవరు దగ్గరకురారు.

169. మనం ఎదుర్కొనే వ్యక్తులలో కొందరిని త్వరగా అర్థం చేసుకోలేక పోయినా పర్వాలేదు. అపార్థము చేసుకోరాదు. అవతలివాడు తప్పుచేస్తున్నాడని త్వరపడి విమర్శించకు నీవు తప్పు చేస్తే మాత్రం ధైర్యంగా ఒప్పుకోవాలి.

170. సాయం అడిగేవాడు భక్తుడు. సహాయం అందించేవాడు దేవుడు. నీవెన్నడు నిరుపేదవని తలంచరాదు. ధనం నిజమైన శక్తి కానేరదు. మనిషితో నిలిచియున్న మంచితనం, పవిత్రతలే నిజమైన శక్తి సంపద.

171. మన జీవితంలో మరుపురాని వ్యక్తులు సాధారణంగా మూడు విధాలుగా ఉంటారు.

1. నిన్ను కష్టాల నుండి విమోచించేవారు.
2. నీవు కష్టంలో ఉండగా పట్టించుకోకుండా వదిలివేసేవారు
3. నిన్ను కష్టాలపాలు చేసి సంతోషించేవారు.

172. ఎల్లప్పుడు ప్రశాంతంగా జీవించాలి. అహంకారివిగా జీవించక స్నేహితులతో కుటుంబంతో ప్రేమతో మెలగాలి. ఇతరులను గాయపర్చి మాటలతో దుఃఖపరచకు. మానవులంతా క్రీస్తు పోలికలో ఉన్నవారే. కేవలం ప్రేమించు వారి కొరకు ప్రార్థించు. ప్రశాంతంగా దేవునిని ధ్యానించు. తోటి మానవుల పట్ల, దేవుని పట్ల ఆసక్తిని కనబర్చు.

173. సెప్టెంబరు నెలలో దేవునిని ఆరాధించుట.

| | |
|---|---|
| కాపరిగా ఉన్న దేవుడు | Shephereding God |
| నిత్యుడగు తండ్రి | Everlasting God |
| సమాధానకర్త | Prince of peace |
| సత్యవంతుడు | Truthful God |
| ప్రేమామయుడు | Loving God |
| కనికరం, దయ గల దేవుడు | Mercyful God |
| పరమజీవమిచ్చే దేవుడు | Beautifical God |
| కష్టకాలంలో నమ్మదగిన దేవుడు | Ever present in times of trouble |
| నీతిగల దేవుడు | Righteous God |

174. జీవితంలో మనతో ఉండే వ్యక్తులలో క్షమించేవారుంటే వారు నిజమైన మనుష్యులు. తగ్గింపుతో క్షమ అడిగేవారే మంచి మనుషులు. మనం సేవించే క్రీస్తు సిలువలో శత్రువును క్షమించమని, వారేమిచేయు చున్నారో వారికి తెలియదని సహృదయత చూపిన క్రీస్తు కన్న గొప్ప వ్యక్తి ఎవ్వరూ లేరు. క్రీస్తు ఏకైక దైవము, ఆరాధనకు పాత్రుడు, స్తుతికి యోగ్యుడు.

175. **ఇంగ్లీషు అక్షరమాలలోని సందేశం ఆసక్తి గతది.**

Always Be Cool - ABC

Do not have Ego with Friends and family - DEF

Give up Hating Individuals - GHI

Just Keep Loving Mankind - JKLM

Never Omit Prayers - NOP

Quietly Remember God - QR

Speak Truth Use Valid Words - STUVW

Xpress Your Zeal - XYZ

ప్రశాంతంగా జీవించాలి, అహంకారం దరి చేరరాదు, స్నేహితులతో, కుటుంబంతో ప్రేమతో మెలగాలి. వ్యక్తిగంగా ఎవరిని నొప్పించరాదు, అందరిని ప్రేమించాలి, ప్రార్థనలు మరువరాదు, ప్రశాంతంగా దేవునిని ధ్యానించాలి. సత్యము పలకాలి, సమయోచితమైన విలువైన అర్థవంతమైన మాటలు మాట్లాడాలి. దేవుని పట్ల, మానవుల పట్ల ఆసక్తిగా ఉండాలి.

176. చిన్న గొడ్డలి పెద్ద వృక్షాలను కూల్చగలదు.

చిన్న సూది పెద్ద సూటును కుట్టగలదు.

చిన్న విత్తనం పెద్ద విత్తనంగా అవతరిస్తుంది.

చిన్న పనే అనిపించవచ్చుగాని రేపు అదే పెద్ద దీవెన కాగలదు.

చిన్న పరిచర్య రేపు పెద్ద గుర్తింపును ఇస్తుంది.

అందుకే కొంచెంలో నమ్మకముగా ఉంటే అనేక బాధ్యతలనిచ్చి భళా నమ్మకమైన మంచి దాసుడా అని గుర్తించగలరు.

177. నిన్ను నిజంగా ఇష్టపడేవారికి నీవెమిటో తెలియజేయనవసరం లేదు. నీవంటే ఇష్టం లేని వారికి ఎంత చెప్పుకున్నను అర్థం కాదు. బలహీన మనస్సు గలవారు ప్రతీకారం కోరుతారు. ఆత్మీయంగా బలవంతులు ప్రతి విషయం సహిస్తూ మౌనంగా ఉంటారు. బుద్ధిమంతులైతే త్వరగా ఇతరులను క్షమించి మర్చిపోయి ప్రశాంతంగా జీవించగలరు.

178. చెరువు నిండినపుడు చీమలే చేపలకు ఆహారం. చెరువు ఎండినపుడు చేపలే చీమలకు ఆహారం. కొన్ని లక్షల అగ్గిపుల్లల తయారీ కొరకు ఒక్క చెట్టు చాలు, కొన్ని లక్షల చెట్లను కాల్చడానికి ఒక్క అగ్గిపుల్ల చాలు. పరిస్థితులు తారుమారు కావచ్చు అందుకే మనమెదుర్కొనే వ్యక్తులు ఎవరైనా ఎటువంటి వారైనా చూడరాదు. ఎవరిని గాయపర్చరాదు. ఎవరిని తక్కువగా చూడరాదు. ఓడలు బండ్లు కాగలవు, బండ్లు ఓడలు కాగలవు.

179. ప్రపంచంలో "సమయం" జీవితం ఎలా జీవించాలో నేర్పుతుంది. సమయం జీవితము విలువలను నేర్పిస్తుంది. పువ్వులు లేని తోటలో సువాసన ఉండదు. ప్రార్ధన లేని ఇంట్లో సంతోషం ఉండదు. నీ జీవితం సువాసనతో నిండి వుండాలంటే నీ సమయాన్ని నీ ఇంట ప్రార్ధనలో గడుపు.

180. ఇనుము కంటె బలమైనది అగ్ని, అది ఇనుమును కరిగించగలదు అగ్ని కంటె బలమైనది నీరు. అది అగ్నిని ఆర్పగలదు. నీటి కంటె బలమైనవాడు మనిషి అతడు నీటినే త్రాగగలడు. మనిషి కంటె బలమైనది మరణం అది మనిషి ప్రాణాన్ని తీస్తుంది. మరణం కంటె బలమైనది ప్రార్థన అది మరణాన్ని జయిస్తుంది. అన్నిటిపై అధికారమున్న దేవుడు సర్వ సృష్టిని మాటచేత సృజించాడు. తన స్వరూపంలో చేతితో మనిషిని తయారు చేసి జీవాత్మ ఊదాడు. దేవుడు ఎంత ప్రేమ గలవాడో గుర్తించాలి.

181. ఐశ్వర్యమనేది డబ్బు సంపాదించుటలో లేదు. డబ్బు సంపాదించాలంటే శ్రమ పడాలి. అసలు సిసలైన ఐశ్వర్యం ఆత్మలు సంపాదించుట. పాఠశాలలో నేర్చుకునే అనుభవం ఇహలోక ఐశ్వర్యం.

182. కాలము గడిచే కొలది మనం కొందరు వ్యక్తులను మర్చిపోతాము. మరికొందరు చాలా కాలము గుండెలో నిలిచిపోతారు. వారితో కాలము ఎలా గడిచిపోతుందో తెలియని రీతిగా స్నేహాన్ని అందించి ఆహ్లాదాన్ని మిగిల్చి మంచి జ్ఞాపకాల నిస్తారు. అట్టివారిని గుర్తించాలి. వారిని ఎన్నటికీ దూరం చేసుకోరాదు. ఇనుప సంకెళ్లతో బంధించి ఆ స్నేహాన్ని నిలుపు కోవాలి. నేను మంచి స్నేహితుడనని క్రీస్తు తెలిపాడు. యోహాను 15వ అధ్యాయంలో నిలిచి ఫలించమన్నారు. మంచి స్నేహితుడు తన స్నేహితునికి ప్రాణం పెట్టునని తెలిపి క్రీస్తు సిలువపై మనకొరకు ప్రాణంపెట్టి మంచి స్నేహితునిగా నిరూపించాడు.

183. మన ఆశయాలను ఏకీభవిస్తూ మనలను ప్రేమించేవారికి దీవెన రావాలని రోజు ప్రార్థన చేయాలి. మనసు కలవని వారు విమర్శించే వారిని సరిచేయమని ప్రార్థించాలి. మంచి చిరునవ్వుతో ప్రశాంతతో ప్రతి దినం ప్రయోజనకరంగా గడుపుటకు ఆశించాలి. శాంతి, దయ నిండిన జ్ఞాన యుక్తంగా మనస్సు నెమ్మదితో మాట్లాడి ఆహ్లాదంగా ప్రతి దినం గడుపుటకు దేవుని సన్నిధికి మరువక ప్రతిదినం క్రమంగా ప్రార్థించుట అభ్యసించాలి.

184. నమ్మకంతో ఉంటే మౌనం కూడ అర్థమవుతుంది. నమ్మకం లేని చోట అపార్థాలు చెలరేగగలవు. నమ్మకంతో అన్ని బంధాలు కాపాడుటకు దేవుని సన్నిధి ఆధారం గనుక భక్తితో భయంతో రక్షణ కొనసాగించాలి. దేవుడు లేని చోట జీవనం శూన్యమని వినయంతో ఒప్పుకోవాలి. దేవుని సహకారంతో ఆయన అందించే అపార శక్తితో స్ఫూర్తితో బలముతో సమస్తము సాధించ గలమని నిరంతరం గొప్ప నిరీక్షణతో ఆత్మీయ జీవితం కొనసాగించాలి.

185. నిజ జీవితంలో మనం ఎదుర్కొనే కష్టాలు, శత్రువులు కాదు అవి మన బలాన్ని మనసులను తెలియజేసే నిజమైన మిత్రులుగా భావించాలి. మాటకు ప్రతి మాట సమాదానం కాక మౌనం వహించుట ఉత్తమం.

186. కొన్ని చింతలు ఒత్తిడిలు మన జీవితంలో ఎదుర్కొంటాము. అవి పక్షుల వంటివి. అవి అటూ ఇటూ ఎగురుతూ ఉంటాయి. అదే విధంగా మన జీవితంలోని ఒత్తిడులు ఎప్పటికప్పుడు మెదడులో నిలిచి గూడు కట్టుకొని ఉంచక వదిలి పెట్టాలి. క్రీస్తు వాగ్ధానం గుర్తుంచుకొని పక్షులను పోషించు దేవుడు మనలను సంరక్షించగలడు.

187. బోధించే పద్ధతులు చాలా విభిన్నంగా ఉంటాయని తెలిసి విలువైన బోధలను గుర్తించి ఆశ్రయించుటలో వివేకము పాటించుట విశ్వాసికి కర్తవ్యమైయున్నది.

1. **అల్లరి బోధ :** వాక్య పరిచర్యలో కొందరు అరుస్తూ కేకలు వేస్తారు పరిమితంగా అరవాలి.
2. **చిల్లర బోధ :** కొందరు వాక్యం బోధిస్తూ వారి అవసరాల కొరకు ఆర్థిక సహాయం కావాలని పదే పదే విసిగిస్తుంటారు. దేవుడు తన బిడ్డల అవసరాలు తీర్చగలడనే విశ్వాసం వారికి ఉండాలని శ్రోతలు ప్రార్ధన చేయాలి.
3. **తెలివి తక్కువ బోధలు :** వాక్యం తక్కువ, లోక వార్తలు, చరిత్ర ఎక్కువ బోధిస్తారు. ఆత్మల భారం గలవారుగా ఉండాలని వారికై ప్రార్థించాలి.
4. **అతిభక్తి బోధ :–** వాక్యాన్ని ధ్యానించి అమూల్యమైన సత్యాలు వివరించుటకు బదులు ఏఏ ప్రాంతంలో ఎవరెవరిని ఎలా గౌరవించారో చెప్పి అతిశయించుట సరి కాదు.

188. **సమర్థించుకొనే బోధలు :**

ఎ) **ఈ లోకంలో రాజీపడే బోధ :** బాప్తిస్మమిచ్చు యోహానువలె బోధించి పాపాన్ని ఖండిస్తూ సర్ప సంతానమా అని పాపాన్ని ఖండిస్తూ నరకం ఎట్టిదో వివరించి క్రీస్తు యొద్దకు నడిపే బోధలు కావాలి.

బి) **రుచి లేని బోధ :** ఉత్సాహంతో, ఆనందంతో బోధించుటకు బదులు నిర్జీవంగా, నీరసంగా ఆచారంగా బోధించుట నిరాసక్తిని కలిగించగలదని తెలిసికొని ఆత్మల భారంతో ప్రార్థించి బోధించుటకై ప్రార్థించాలి.

**సి) మిక్సింగు బోధ :** ఇంగ్లీషు తెలుగు, గ్రీకు భాష కలిపి అర్ధము కాని గొప్ప పదాలు వాడి చెప్పే బోధ సులువుగా గ్రహించలేరని తెలిసికొని స్పష్టంగా సువార్తను బోధించాలి.

**డి) కల్పిత బోధ :** క్రొత్త కథలు, పిట్ట కథలు, ఎక్కువగా చెప్పి స్వచ్ఛంగా క్రీస్తు మాటలు చెప్పుటకు బదులు నవ్వు పుట్టించుటకు వాక్యం నుండి దూరపర్చునని గ్రహించి బోధించాలి.

189. **పితృ పారంపర్య బోధ :** పాత కథలు, తాతల నాటి కథలు వివరాలు మాత్రమే ఆసక్తితో చెప్పి నిత్య రాజ్యానికి వారసులుగా ఎలా జీవించాలో చెప్ప కుండా క్రీస్తు రక్తము ద్వారా మన రక్షణ ఎలా కాపాడుకోవాలి, దేవుని రాకడ కొరకు ఎలా నిరీక్షించాలి అనే విషయాలు మరుగున పెడితే ఆశీర్వాదకరంగా ఉండదని తెలిసికోవాలి.

190. **కాపీ కొట్టే బోధ :-** అందరి బోధల సారాంశాలను సేకరించి స్వంత ఆలోచనలను సమకూర్చి ధైర్యంగా బోధించే బోధకులను గుర్తించగలరు. గొప్ప విలువను పొందలేరు.

**అపోస్తులుల బోధ :** ఏది చూచామో, ఏది విన్నామో, కన్నులారా చూచి ఉన్నదున్నట్లు స్వచ్ఛంగా బోధించే బోధలు శక్తి గలవి. ఒక్క ప్రసంగంలో మూడు వేల మంది రక్షింపబడుట పేతురు జీవితంలో సఫలమైనట్లు అట్టి భక్తి గల బోధలు హృదయాన్ని ఒప్పింపచేసి దైవరాజ్య వారసులుగా చేయును. గనుక అట్టి బోధలు విని ఆత్మీయంగా మేలు పొంది ఆత్మల జాలరిగా సాక్షులుగా జీవించాలి.

191. జీవితం ఒక త్రాడు వంటిది. అది ఊయ్యాల ఊగుటకు నిరీక్షణ ఇస్తుంది. ప్రతి రోజు నిన్నటి కంటె మెరుగైనది. రేపు ఈ రోజు కంటె మిన్నయినదనే ఆశా భావంతో జీవించాలి. అందుకే ప్రేమతో మాట్లాడాలి. తక్కువ మాట్లాడాలి. మంచిగా మాట్లాడాలి. తెలివిగా మాట్లాడాలి. నవ్వుతూ మాట్లాడాలి. ఆలోచించి మాట్లాడాలి. మనసు విప్పి మాట్లాడాలి, ఉన్నది ఉన్నట్లు మాట్లాడాలి. అర్థం చేసుకొని మాట్లాడాలి.

192. జీవితంలో పుట్టిన బిడ్డ కనీసం రెండు సంవత్సరాలకు మాటలు నేర్చుకుంటాడు. కాని ఎప్పుడు ఎక్కడ ఎవరితో ఎలా మాట్లాడాలో తెలిసికొనుటకు జీవితం చాలదు.

193. దేవునితోనే నడుస్తానని సదా తలంచినపుడు ఆయన సరైన దారిలో నడిపించగలరని నమ్మాలి. జీవితంలో ఎందరో విలువైన వ్యక్తులతో పరిచయం గొప్ప ఆశీర్వాదకరం. ఈ ప్రయాణంలో దేవుడిచ్చిన జీవితాన్ని బట్టి వందనాలు చెల్లించాలి.

194. విశ్వాసమనేది భవిష్యత్తులో ఏమి దాగిఉందో నమ్ముట కాదు గాని ఎవరి చేతిలో భవిష్యత్తు దాగి ఉన్నదో గ్రహించి ఆ దేవునిని ఆశ్రయించాలి. ఈ జీవిత ప్రయాణంలో సంతోషాలు, బాధలు మిళితమై యుంటాయి. అందుకే పౌలు చెప్పిన విధంగా ఆనందించుడి మరలా చెప్పుదును ఆనందించుడి. ఫిలి 4:4

195. ధనమును ప్రాణమును అధికంగా ప్రేమించకు. దైవ చిత్తమును గ్రహించి ఆయన చెప్పినట్లు అనగా ఆయన నడిపింపుపై ఆదారపడి జీవించు సత్యమునే అనుసరించాలి. జ్ఞానంగా ప్రవర్తించాలి. ప్రతి చోట దేవుని కొరకు నమ్మకమైన సాక్షిగా జీవించాలి.

196. స్వార్థంతో నిండిన అక్షరం మన జీవితంలో రాణించదు.

**SIN** లో దాగి ఉన్న మధ్య అక్షరం **I** (నేను) **RELATIONSHIP** అనే పన్నెండు అక్షరాల పదాన్ని దూరం చేస్తుంది. బంధాలు విడగొడుతుంది.

తృప్తిపడే రెండక్షరాల పదం **WE** (మనము) అనే మాట బంధాలను పెంచుతుంది. సరిగా వాడుకోవాలి. **I** పదాన్ని వదిలిపెట్టాలి. **WE** పదాన్ని వాడుకలో పెట్టాలి.

197. మూడక్షరాల మాట **EGO** అహంకార పూరితమైనది, విషపూరితమైనది. దానిని అణగద్రొక్కాలి.

జీవితంలో కోరదగినది అందరూ ఇష్టపడేది ఎక్కువగా వాడే పదం నాలుగు అక్షరాల మాట **LOVE** – ప్రేమ.

దేవుడు ఈ లోకమును ఎంతో ప్రేమించాడు. మనం కూడ దేవునిని ప్రేమించాలి. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించాలి. ప్రేమ విలువైనది శాశ్వతమైనది అనేక దోషములను కప్పుతుంది.

198. ఐదు అక్షరాల మాట **SMILE** ప్రతి రోజు వాడదగినది. స్నేహాన్ని బంధాన్ని పెంచేది. అపరిచితులను సన్నిహితులనుగా చేయగలిగింది. **SMILE** అతి మృధువైన మాట. చిరునవ్వు, ప్రశాంతత కలిగించేది. చిరునవ్వు చింతలను దూరపరుస్తుంది. దానిని నిరంతరము అభ్యాసం చేయాలి.

ఆరు అక్షరాల మాట **RUMOUR** ఈ మాట గాసిప్పు లేదా వదంతి. ఈ **RUMOUR** వ్యాపించకుండా చూడాలి. కారుచిత్తువలె కుటుంబాలను దహించి కుప్ప కూలే స్థితికి దిగజార్చగలదు. పౌలు పత్రికలలో వృద్ధులు ముసలమ్మలు **RUMOUR** (ముచ్చట్లు) మాని తెలివిగా జ్ఞానంగా మాట్లాడి మంచిగా ప్రవర్తించమన్నాడు.

199. **SUCCESS** ఏడక్షరాల విలువైన ప్రతి జీవితము ఆశతో ఎదురు చూస్తుంది. విజయమనేది ఎవరైనా కోరుకుంటారు. కష్టం చేసిననూ, శ్రమ పడిననూ లభించే విజయం ద్వారా విజేతలు గొప్ప ఆనందము అందుకోగలరు. విజయం సాధించే కృషి అందరూ కోరుకోవాలి.

200. అతి శక్తివంతమైన పదం తొమ్మిది అక్షరాలు గల **KNOWLEDGE.** జ్ఞానము ప్రతి మానవునికి అవసరం. అది సంపాదించుకోవాలి. వెండి బంగారం కన్నా కోరదగినది. దాని విలువ గ్రహించాలి. అది పొందాలని శ్రమించాలి.

దేవుడే మనకు మంచి స్నేహితుడు. మనకై ప్రాణము పెట్టుటకు ఇష్టపడ్డాడు. **FRIENDSHIP** అత్యంత తీయనిది. మధురమైనది. స్నేహం దైవికమైనది. ఈ పది అక్షరాల విలువైన మాటను నిలుపుకోవాలి. కాపాడుకోవాలి. బంధువులు వేరు, స్నేహితులు వేరు. దాపరికం లేకుండా మనసు విరిచి చెప్పుకొనగలిగినదే స్నేహ బంధం. దీనిని నిర్లక్ష్యం చేయరాదు. మనల్ని ప్రేమించి స్నేహమందించే వారి ప్రేమ స్నేహ భావానికి స్పందించి జీవితం సఫలం చేసుకోవాలి.

201. జీవితంలో ప్రతి సంఘటన జరుగుటకు కారణముంటుంది. సరిగా జీవించాలి, జీవితాన్ని ప్రేమించాలి. జీవితానుభవాల నుండి నేర్చుకోవాలి. నీ చిరునవ్వు ద్వారా ప్రపంచాన్ని ఆనందంగా మార్చాలి. నీ చిరునవ్వును ఏ పరిస్థితిలోనైన చెదిరిపోకుండా చూచుకో.

202. జీవితంలో ఏదైనా పొరపాటు చేసి అది గుర్తుంచుకోగలిగినపుడు సమర్పణతో ఒప్పుకున్నప్పుడు నిజాయితీ గల వాడవగుదువు. నీవు సంశయంలో ఉంటే నీవు తెలివైన వాడవనగలవు. నీవు సరిగ్గా నిర్ణయం తీసుకొని సమర్పించు కోగలిగితే దేవుని గౌరవించినట్లు భావించవచ్చు.

203. నీ శత్రువులు నిన్ను బాధించి నీకు నష్టం కలిగిస్తే దేవుడు తిరిగి నిన్ను కట్టగలడని నమ్ము. నిన్నుగా ఇష్టపడేవారికి నీవేమిటో చెప్పనవసరం లేదు. నీవంటే ఇష్టం లేని వారికి నీవేమి చెప్పినా అర్థం కాదు.

204. జరిగిపోయిన నిన్న తెలియని రేపటి కంటే గడుపుచున్న ఈ రోజు చాలా విలువైనది. జీవితంలో ఇబ్బందులు ఉన్నవారంతా దురదృష్టవంతులు కాకపోవచ్చు గాని బాధలను పంచుకోవడానికి ఎవరు లేనివారే అసలైన దురదృష్టవంతులు. నీ భారం నామీద వేయండి చింతించవద్దు, ప్రయాస, భారం నా మీద వేయండి నా దగ్గరకు రమ్మని పిలిచే యేసు దగ్గరకు వెళ్ళాలి.

205. ధైర్యం చేసి సుదూరాలకు నడిచేవారికి ఒక వ్యక్తి ఎంత దూరం వెళ్ళగలడో తెలుస్తుంది. మనలను మనం తక్కువ అంచనా వేసుకుంటే కొంత నష్టం కలుగుతుంది. కాని ఎదుటివారిని తక్కువగా అంచనా వేస్తే తలదించుకోవలసి వస్తుంది. నిన్ను అనుమానించేవారిని నీ దగ్గరకు రానీయకు. నిన్ను అవమానించే వారి దగ్గరకు నీవు వెళ్ళకు. జీవితంలో పది మందిని బాధపెట్టి ఎదగడం గొప్ప కాదు. పది మంది బాధను తీర్చి పైకి రావడం గొప్ప.

206. మనం నమ్మిన ప్రభువు మనం పడిపోయిన వేళలో, కృంగిన వేళలో ఆదుకుని లేవనెత్తగలడు. విచారాలలో బాధలలో కౌగిలిలో చేర్చుకొనగలడు. కన్నీరు తుడువగలడు. హృదయం గాయమై పగిలిన గుండెతో ఉన్నప్పుడు తిరిగి సరిచేసి నెమ్మదిని శాంతిని ప్రసాదించగలడు. విరిగి నలిగిన హృదయాన్ని అలక్ష్యం చేయని దేవుని చేరుకోవాలి.

207. 1. ప్రార్థనను నిర్లక్ష్య పెట్టడమంటే పరిశుద్ధ జీవితాన్ని నిర్లక్ష్య పెట్టడమే.
2. ప్రార్థనను అలక్ష్యం చేసే ఆలోచనను జయిస్తే అపవాదిని తెలిగ్గా జయించగలము.
3. లోకంలో పడకుండా ఉండాలంటే ఒకే మార్గం మోకాళ్ళ మీద ప్రార్థించాలి.
4. మన మోకాళ్ళు నేలను తాకితే మన ఆత్మీయ జీవితం ఆకాశాన్ని తాకుతుంది.
5. ప్రార్థనలో నలిగిపోయిన శరీరాలు దేవునికి నివాస స్థలాలు
6. మోకాళ్ళ మీద నిలబడగలిగినవారే దేవుని కొరకు రోషంగా నిలబడగలరు.
7. ప్రార్థన పాపానికి తలుపు మూస్తుంది. పరిశుద్ధతకు తలుపు తెరుస్తుంది.
8. ప్రార్థించనివాడు దేవుని సహాయానికి అడ్డుబండ.

208. మనము దేవుని చేతిలో అందంగా మలచబడిన శిల్పులము. ఆయన చేతి పనివారము. ప్రేమకు అర్హులము. ప్రత్యేకత గలవారము. విలువపెట్టి కొన్నవారము. చిరునవ్వు నిన్ను ఆహ్లాదపరుస్తుంది. ప్రార్థన నిన్ను బల

వంతునిగా శక్తివంతునిగా చేయగలదు. ప్రేమ నిన్ను జీవితాన్ని ఆనందంగా గడిపే అర్హత అవకాశాన్నిస్తుంది.

కొన్నిసార్లు మన జీవితం కంటే ఇతరుల జీవితం బాగుందని తలస్తాము ఇతరులకు మనం కూడ అలాగే కనిపిస్తాము.

209. దేవుడు మన ప్రార్థనలకు జవాబు ఇచ్చినపుడు మన విశ్వాసం అభివృద్ధి కాగలదు. జవాబు పొందుటకు ఆలస్యమైతే మనలో ఓర్పు కలిగించగలడని నమ్మాలి. అసలు జవాబురానప్పుడు దేవుని దృక్పథములో మరేదో మంచి దాచి యుంచాడని కృతజ్ఞత కలిగి నమ్మాలి. కీర్తన 69:30, 100:4, 75:1, 44:8, 86:12

210. **నిజాయితీ అనే విత్తనం నాటితే నమ్మకం అనే ఫలాన్ని కోస్తాము.**

1) మంచితనమనే విత్తనం నాటితే స్నేహితులు అనే ఫలం కోస్తాము.

2) నిరాడంబరత అనే విత్తనం నాటితే గొప్పతనం అనే ఫలం కోస్తాము.

3) క్షమాపణ అనే విత్తనం నాటితే అజాతశత్రువు అనే ఫలం కోస్తాము.

4) ఓర్పు అనే విత్తనం నాటితే అభివృద్ధి అనే ఫలం కోస్తాము.

5) సేవ అనే విత్తనం నాటితే పుణ్యం అనే ఫలం కోస్తాము.

6) సత్యాన్వేషణ అనే విత్తనం నాటితే జ్ఞానం అనే ఫలం కోస్తాము.

7) భక్తి అనే విత్తనం నాటితే దైవ సన్నిధి అనే ఫలం కోస్తాము.

అవకాశం కొరకు ఎదురుచూడవద్దు. మీ కలలు సాహసంతో కూడినవి వాటి కోసం కృషి చేయాలి.

జీవితంలో చిన్న చిన్న విషయాలు పూర్తిగా అనుభవించండి. కొంత కాలం తరువాత చాలా ఆనందం ఇస్తాయి. ఒక అందమైన గమ్యానికి చేరుకోవడానికి ఉపయోగపడుతుంది.

211. **బైబిలులో విశ్వా రహస్యాలు**

ఎ) యోబు 26:7 దేవుడు శూన్యంలో భూమిని వ్రేలాడదీసెను. ఐజక్ న్యూటను కన్న 3448 సం॥ క్రితమే దేవుడు వ్రాయించారు.

బి) యోబు 9:6  భూమి కదులుతందని వ్రాయించాడు. 1543లో నికోలస్ భూమి కదులుతుందని తెలిపాడు. 1800 సం॥ క్రితమే దేవుడు బైబిలులో వ్రాయించాడు.

సి) కీర్తనలు 74:17 దేవుడు కాలములను కలుగజేససినవాడు నికోలస్ కోపర్నికస్ సూర్యుని చుట్టు భూమి తిరుతుందని కనుగొన్నాడు. 2343 సం॥ క్రితమే దేవుడు బైబిలులో వ్రాయించాడు.

212. 2350 సం॥ క్రితం బైబిలు తెలిపింది. గలిలియో కాండిల్ లైటు చూస్తూ డోలనావర్తన కాలం కనుగొన్నాడు.

క్రీ.శ.56లో 1 కొరింథి 15:41లో సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు, నక్షత్రముల మహిమ వేరు అని వ్రాయబడియున్నది.

క్రీ.శ.1662లో రాబర్టు బోయిల్ గాలికి బరువు కనుగొన్నాడు. యోబు 28:25లో గాలికి ఇంత బరువు ఉండవలెనని దేవుడు నియమించాడు. 3462 సం॥ క్రితం దేవుడు బైబిలులో వ్రాయించాడు.

యోబు 37:12లో నరులకు భూమి నివాసయోగ్యమని వ్రాయబడి ఉంది. క్రీ.శ.1522లో పెర్టినండ్ భూమి నివాసయోగ్యం అని కనుగొనినట్లు 3322 సం॥ క్రితమే బైబిలులో వ్రాయించాడు.

213. అర్థము చేసుకొనుట జ్ఞాన సమూపార్జన కంటె గొప్పది. లోతైన భావం కలది. చాలా మందికి మనం తెలిసి ఉంటాము గాని సరిగ్గా అర్థం చేసుకునేవారు కొందరే ఉంటారు. చిన్న చిరునవ్వు ద్వారా హృదయాలను తాకి సంతోషం కలిగించే సమర్థత అందరూ కలిగి ఉంటారు.

జీవితం చాలా పెద్ద ప్రయాణం. మనిషిగా పుట్టడం వేరు, మనిషిగా జీవించడం వేరు. ప్రతి దినం ఒకొక్క అడుగు వేస్తూ సుదురాన్ని మెల్లగా ముగించి సాధించుట మన కర్తవ్యం.

214. నిరీక్షణతో ప్రతిదినం ఆశాభావం కలిగి ఉండాలి. అపుడే అద్భుతాలు చూడగలము. సాధు స్వభావం కలిగియుండుట బలహీనత కాదు. నీటి కంటే సాధుజలం మరేది ఉండదు కానీ దాని శక్తి, ఉధృతము సమయం వస్తే బలమైన బండలను బద్దలు చేయగలదు. మంచి వ్యక్తి నెమ్మది కలిగి జీవించుటకు ఇష్టపడ్డాడంటే అతని వెనుక బలమైన శక్తి దైవము ఉంటాడని నమ్మాలి.

215. మన జీవితం ఒక పుస్తకం. రెండు పేజిలు పూరించబడ్డాయి. మొదటి పేజి పుట్టుక. రెండవ పేజి మరణం. మధ్య పేజిలు ఖాళీగా ఉన్నాయి. సరిగ్గా జీవించి ఇతరులు చదివి నేర్చుకునే రీతిగా ఆ పేజీలు మంచి జ్ఞాపకాలతో ముగించుటకు ప్రయత్నించాలి.

216. గౌరవమనేది అద్దం వంటిది. అది ఇతరులకు ఎంత ఎక్కువగా ఇస్తే నీకు అంత ఎక్కువగా ప్రతిబింబింపచేస్తుంది. విశ్వాసం అనేది చిన్న పదం. చదవడానికి సెకను పడుతుంది. అర్థం చేసుకొనుటకు రోజు పడుతుంది. నిరూపించుకొనుటకు జీవిత కాలం పడుతుంది.

217. ఇతరులను ఓడించాలని ప్రయత్నించకు ఆశించకు. అందరిని ప్రేమతో గెలుచుకోవాలి. ఇతరులను చూచి హేళన చేయకు ఇతరులతో కలిసి ఆనందంగా కాలం గడుపు. దేవుడు నిన్ను కనిపెట్టి చూస్తున్నాడని నమ్ము. ఆయన దగ్గర సమస్యలకు తాళముంటుంది. ప్రతి నీడకు వెలుగుంటుంది. ప్రతి విచారానికి విరామం ఉంటుంది. ప్రతి రేపటిని ఎలా గడపాలి అనే నిర్ణయాలుంటాయి. నీ జీవితం నీ చేతిలో ఉందని నడిపించే దేవుని స్మరించు.

218. జీవితంలో జరిగే ప్రతి సంఘటనకు వెనుక సకారణముంటుంది. జీవించాలి. జీవితాన్ని ప్రేమించాలి. జీవితం నుండి నేర్చుకోవాలి. నీ చిరునవ్వు ప్రపంచాన్ని మార్చగలగాలి. కాని ప్రపంచం నీ చిరునవ్వును మార్చరాదని తెలిసికో.

219. మనం మనుషులను ప్రేమించగలము. గాని మన దేవుడు మరింత గాఢంగా ప్రేమించే దేవుడు. మనం స్నేహితులముగా ఉండగలము. మన దేవుడు క్రీస్తు గొప్ప స్నేహితుడు. తన ప్రాణం మన కొరకు పెట్టాడు. ఆయన మనలను కౌగిలించి ప్రేమిస్తాడు. మన కన్నీరు తుడుస్తాడు. మనం చేయూత ఇస్తాము గాని ఆయన మనలను ఎత్తుకొని మోస్తాడు. అంత మంచి దేవునిని మనం హత్తుకొని ఆశ్రయించి ప్రేమ చూపి సేవించాలి.

220. నిన్ను నిన్నుగా ప్రేమించేవారిని ఎన్నటికీ వదులు కోకూడదు. ఏదో ఒక రోజు తెలుస్తుంది. రాళ్ళను ప్రోగుచేసుకొని వజ్రాలను కోల్పోతున్నామని తెలుసుకొని బాధపడతాము. ప్రేమించి వెన్నుపోటు పొడిచేవారుంటారు. నమ్మించి మోసం చేస్తూ ఉంటారు. కళ్ళతో నవ్వుతూ నోటితో మోసం చేసేవారుంటారు జాగ్రత్త.

221. మనిషి అందంగా కనబడాలంటే ఎన్నో రకాల తెరలు తగిలించాలి కానీ మనసు అందంగా కనబడాలంటే అహం, అసూయ అనే అడ్డు పొరలు తొలగిస్తే చాలు. సంపద పెరిగే కొలది ధనవంతుడివి అవుతావు, వయసు పెరిగే కొలది ముసలివాడవు అవుతావు. మంచి తనం పెరిగే కొలది మనిషిగా మారుతావు.

222. నేను బ్రతుకు దినములన్నియు కృపా క్షేమములే నా వెంట వచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నివాసము చేసెదను. కీర్తన 23:6

బైబిలులో గొప్ప వాక్యాల సంపద మనస్సును ఉల్లాస భరితులను చేస్తుంది. నీ నామమును స్తుతించెదను, కృతజ్ఞాతాస్తుతులతో నేనాయనను ఘనపరిచెదను. కీర్తన 69:30 నా పూర్ణ హృదయవతో నేను నీకు కృతజ్ఞాతాస్తుతులు చెల్లించెదను. కీర్తన 86:12

సర్వ దేశములారా యెహోవాకు ఉత్సాహ ధ్వని చేయుడి. కీర్తన 100:1

యెహోవాను స్తుతించుడి ఆయన దయాళుడు ఆయనకు కృతజ్ఞాతాస్తుతులు చెల్లించుడి. కీర్తన 106:1

దేవా మేము నీకు కృతజ్ఞాతాస్తుతులు చెల్లించుచున్నాము. నీవు సమీపంగా ఉన్నావని నీకు కృతజ్ఞాతాస్తుతులు చెల్లించుచున్నాము.

223. ఒక చిన్న కథలో ఏనుగు పంది ఎదురవుతాయి. పంది బురదతో నిండిన శరీరంతో ఉంది. ఏనుగు జాగ్రత్తగా తప్పించుకొని పందికి హాని చేయలేదు. పంది ఏనుగు నాకు భయపడి వెళ్ళింది అన్నది. కానీ ఏనుగు జాగ్రత్తగా తప్పించుకొని వెళ్ళింది. కాళ్ళకు బురద అంటకుండా జాగ్రత్త వహించాను. కొందరు ఉత్తములు, అధములు ప్రవర్తించు తీరు ఇలాగే ఉంటుంది. మురికి అంటకుండా పవిత్రత కాపాడుకొనుట మంచిది. దుష్టులకు దూరంగా ఉండే విజ్ఞానం ప్రతి వ్యక్తికి అవసరం.

224. గెలవకపోవడం ఓటమి కాదు మళ్ళీ ప్రయత్నం చేయకపోవడం ఓటమి. సింహాన్ని ఆహ్వానించి ఎవరు అడవికి రాజును చేయలేరు. దాని శక్తి సామార్థ్యాలే దానికి ఆ ఘనతను తెచ్చి పెడతాయి. దేవుడు ఇచ్చిన తలంతాలు మనిషికి ఉంటాయి. దానిని అభివృద్ధి చేసుకున్నప్పుడు భళా నమ్మకమైన మంచి దాసుడా అనే ప్రశంశను అందుకొనేలా శ్రమించాలి.

225. ఓటమి అంటే అంతము కాదు గెలుపంటే ప్రారంభం కాదు. ఓటమి అనుభవంతో గెలుపు బాటను వెతికేవారే నిజమైన విజేతలు.

చేయడానికి ఒక పని, ప్రేమించడానికి ఒక వ్యక్తి, జీవించడానికి ఒక ఆశ ఉన్నవాళ్ళు నిత్యము సంతోషంగా ఉంటారు.

చేయలేమని కొన్నింటిని, కష్టమైనవని కొన్నింటిని చిన్న పనులను కొన్నింటిని వదిలేస్తే చివరకు ఏ పని చేయలేని చేతకాని వారిగా మిగిలి పోతారు.

226. ఒకరి హృదయంలో జీవించడం ప్రేమకు సాధ్యమైతే, ఒకరి హృదయంగా జీవించడం స్నేహానికి సాధ్యం. అందరికన్నా మంచి స్నేహితుడు యేసు. కృతజ్ఞత కలిగి ఉండి మంచి బైబిలు వాక్యాలు ధ్యానం చేయవచ్చు.

1. కీర్తనలు 107:1
2. 1దిన29:13
3. దాని. 2:23
4. కీర్తనలు 95:2-3
5. ఫిలి 4:6
6. ఫిలేమోను 1:4
7. కీర్తన 100:4
8. యెషయా 12:4
9. 1 థెస్స 5:18
10. కీర్తన 106:1
11. కొలొస్స 3:16
12. హెబ్రీ 12:28
13. కీర్తనలు 118:1, 105:1
14. కీర్తనలు 28:7

227. విశ్వాసమనేది అన్నింటిని సాధ్యపరుస్తుంది. నిరీక్షణ పని జరిగించు ధన్యత నిస్తుంది. ప్రేమ సమస్తము అందంగా మలుస్తుంది. ఇవన్నీ కలబోసి జీవితం అనుభవిస్తే ప్రేమ గెలుస్తుంది. మంచి ప్రవర్తన మంచి హృదయం గల వ్యక్తులను పరిచయం చేస్తుంది.

228. శరీర సంబంధ ఆకర్షణ లోకాన్ని దగ్గర చేస్తుంది. ఆత్మ సంబంధమైన ఆకర్షణ మనలను దేవునికి దగ్గర చేస్తుంది. మొదటిది మనుషులను ఆకర్షిస్తే, రెండవది దేవున్ని ఆకర్షిస్తుంది.

229. గతం గుర్తుకు వచ్చి బాధపడుతూ కూర్చోరాదు. గతంలో నేర్పిన పాఠాలతో భవిష్యత్తును నిర్మించుకోవాలి.

పని చేయాలనుకునేవారికి దారి దొరుకుతుంది. చెయ్యొద్దు అనుకునే వారికి సాకు దొరుకుతుంది. ఎవరైనా సరిగ్గా అర్థం చేసుకోలేకపోవచ్చు పర్వాలేదు. అపార్థం చేసుకోరాదు. మనస్సు అనే మొక్కకు అనురాగం అనే నీరుపోస్తే హృదయం అనే మొగ్గ పుట్టి ప్రేమ అనే పువ్వు పూస్తుంది. పువ్వు నన్ను చంపవద్దు అంటే ప్రేమ నన్ను మరువవద్దు అంటుంది.

230. అతిగా ఎవ్వరినీ ఇష్టపడకు, అతిగా ఎవ్వరినీ నమ్మకు. అతిగా ఎవ్వరిపై ఆశలు పెట్టుకోకు, ఎందుకంటే అతిగా అనేది మనలను అతిగా బాధ పెట్టవచ్చు.

జీవితం అనే పుస్తకంలో ఒక్కో పేజి ఒక్కొక్క అనుభవం నేర్పిస్తుంది. అందులో

కొన్ని తేలికైన మధురానుభూతులను ఇస్తాయి. మరికొన్ని చేదైన స్మృతులను మిగులుస్తాయి. మంచితో చేరిన సంతోషం పంచుకోవాలి. దు:ఖం ఒంటరిగా భరించాలి ఇదే జీవిత సత్యం.

231. **జీవితమంటే ఏమిటి?**

జీవితం ఒక బహుమానం – స్వీకరించాలి
జీవితం ఒక సాహసం – అనుభవించాలి
జీవితం ఒక దు:ఖం – ఎదుర్కోవాలి
జీవితం ఒక రహస్యము – చేధించాలి
జీవితం ఒక ఆట – ఆడాలి
జీవితం ఒక అవకాశం – అందుకోవాలి
జీవితం ఒక శూన్యం – పూరించాలి
జీవితం ఒక అందం – ప్రేమించాలి
జీవితం ఒక పోరాటము – గెలవాలి
జీవితం ఒక లక్ష్యం – సాధించాలి
జీవితం ఒక గందర గోళం – పరిష్కరించాలి
జీవితం ఒక ప్రశ్న – జవాబు పొందాలి
జీవితం ఒక ప్రయాణం – సాగించాలి
జీవితంలో కష్టములు – శక్తి సామార్థ్యాలను నిరూపిస్తాయి.
దేవుడు దావీదుతో ఇలా వ్రాయించాడు. శ్రమనొందుట నాకు మేలాయెను.

232. నిన్ను చూచి చప్పట్లు కొట్టే పది వేళ్ళ కన్నా, కన్నీరు తుడిచే ఒక్క వేలు మిన్న. ఆకలితో ఉన్న కడుపు, ఖాళీగా ఉన్న జేబు, ముక్కలైన మనసు ఈ మూడు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పుతాయి. నిన్ను భారంగా అనుకునే బంధాలలో బలవంతంగా జీవించడం కంటే వాటికి దూరంగా ఒంటరిగా ఉండడమే హాయి.

233. డబ్బు ఎవరికోసమైనా ఖర్చు చేయవచ్చు గాని అర్హత కలిగిన వారికోసం సమయాన్ని, డబ్బు ఖర్చు చేయాలి.

అమ్మతో ప్రేమగా మాట్లాడాలి. నాన్నతో మర్యాదగా మాట్లాడాలి.
సోదరితో ఆప్యాయంగా మాట్లాడాలి, సోదరుడితో మితంగా మాట్లాడాలి.
చిన్నారితో ముద్దుగా మాట్లాడాలి, దేవునితో మౌనంగా మాట్లాడాలి.

మిత్రులతో మనసు విప్పి మాట్లాడాలి, ఎవరిని నొప్పించకుండా మాట్లాడాలి. అన్నింటిని మించి మంచి వ్యక్తితో జీవించాలంటే దైవ ప్రీతి, పాప భీతి సంఘ నీతితో జీవించి దేవుని ప్రేమించాలి.

235. సమయోచితంగా పలుకబడిన మాట వెండి పళ్ళెంలో ఉంచిన బంగారు పళ్ళెం వంటిది. మాట చిన్నదైనా మనసును గాయపరుస్తుంది. ఓ చిన్న అబద్ధము అనుబంధాలను తెంచుతుంది. అపార్థము కొంచెమైనా మంచి స్నేహాన్ని కూలదోస్తుంది. చిన్న రంధ్రం పెద్ద ఓడను ముంచెస్తుంది. కారణము చిన్నది. ఫలితం జీవిత కాలం మనం ఏడ్చునపుడు భుజం తట్టి ఓదార్చువారు కావాలి. సంతోషంలో పాలు పొందేవారు కూడా కావాలి.

236. మనకు కష్టాలు వస్తే మంచి వాళ్ళకే వస్తాయి అంటారు తప్ప తాము ఏదైనా పాపం (తప్పు) చేశామేమో అనుకోరు. అదే కష్టాలు ఎదుటివారికి వస్తే చేసిన కష్టాలు ఊరికే పోతాయా? అని అంటారు. తమ కష్టాలకు కారణం తెలుసుకొని ఎదుటివారి కష్టాన్ని సానుభూతితో అర్థం చేసుకొనేవారే మంచి మనుషులు.

237. ప్రార్థనలకు ఆలస్యముగా జవాబు లభిస్తే, దానికి సరైన జవాబు చెప్పే సరైన సంఘటన.

ఒక పేదరాలు ద్రాక్షతోటకు వెళ్ళి బాగా పండిన పండ్లు చూస్తూ ఉండగా ఆ తోటమాలి పండ్లు కావాలా అమ్మా అని అడిగాడు. పెద్ద బుట్ట తెచ్చుకో అన్నాడు. చాలాసేపు కనిపెట్టినా పండ్లు తేనందుకు చాలా కోపంతో తిట్టుకుంటూ వెనుతిరిగే సమయంలో తోటమాలి శ్రేష్టమైన పండ్లతో వచ్చాడు. మంచి పండ్ల కొరకు ఆలస్యమయింది అని చెప్పాడు. సిగ్గుతో తలవంచుకొని కృతజ్ఞత తెలిపింది. ప్రార్థనలో కష్టాలు, నష్టాలు, ఆశలు కోరికలు అన్ని అడుగుతాము గానీ సమాధానం ఆలస్యం కావచ్చు. అధైర్యపడక మన కన్నీరు నాట్యంగా మార్చాలని, శ్రేష్టమైన ఈవుల కొరకు ఆలస్యం చేస్తాడని నమ్మాలి.

238. దేవుని సేవకులు ఎన్నో అవమానాలు ఎదుర్కొంటారు. వారు ఇతరుల కోసం జీవితం ధారపోసేవారు. తక్కువ సంపాదనతో స్వార్థం లేకుండా ఇతరులకు ఖర్చుపెట్టేవాడు. మోకాళ్ళు అరిగేలా ఇతరుల కొరకు ప్రార్థించేవాడు. దేవుని దగ్గర తప్ప ఇతరుల దగ్గర చేతులు చాపనివాడు. ధనాపేక్ష స్వార్థం దరి చేరనివ్వనివాడు. అటువంటి వారిని గౌరవించాలి.

239. వెండిని శుద్ధి చేసినట్లు దేవుడు మనలను పరిశుద్ధపరచునని బైబిలు వాక్యం చెప్పుచున్నదని తెలుసుకోవాలని ఒక స్త్రీ వెండి పని చేసే కంసాలి దగ్గరికి వెళ్లింది. కంసాలి వెండిని కాల్చినపుడు మలినము తీసివేసి శుద్ధిచేసిన వెండిని చూసి దేవుని వాక్యం ఎంత నిజమైందో అని ఆశ్చర్యానికి లోనైంది. బైబిల్ వాక్యం నిత్య సత్యంమని గ్రహించింది.

కాల్చిన రేకుతో తయారు చేసిన శుద్ధ రేకులో ప్రతిబింబం కనిపిస్తుంది. ఆ వేడిలోనే శుభ్రత కలుగుతున్నట్లు కష్టాలను అనుభవిస్తున్న సమయంలో దేవుని కళ్ళు మనలను చూస్తూనే ఉంటాయి. ధ్యాస మనపైనే ఉంటుంది. ఈ జీవితం మనలను కాల్చివేయుటకు కాదు, మెరిసే వెండిలా మార్చునని నమ్మి ధైర్యంగా ఉండాలి. కష్టాలను సహించాలి.

240. స్వార్ధపరులు మిమ్మల్ని తమ స్వార్ధానికి ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తే, వాళ్ళ పేర్లను మీ జాబితాలో నుండి తీసి వేయండి. పగ తీర్చుకోవటానికి ప్రయత్నిస్తే, అవతలి వ్యక్తికి కలిగే బాధకన్నా, మీకే ఎక్కువ బాధకలుగుతుంది. నీ శత్రువును 77మార్లు క్షమించమని యేసు ప్రభువు చెప్పినమాట జ్ఞాపకం చేసుకో, నీ జీవితం ఆనందం.

241. పౌలు చెప్పినట్లు మనము గురి యొద్దకే పరుగెత్తాలి. లక్ష్యము వేరు, కోరిక వేరు. కోరిక తీరాలని పరుగెడితే తగిలేవి ఎదురు దెబ్బలే. అదే లక్ష్యము నెరవేరాలని పరుగెడితే ఎదురోచ్చేది విజయాలే.

242. క్రీస్తు మీరు లోకానికి వెలుగైయున్నారు. ఉప్పుయిఉన్నారు అని పలికారు. నేనే మార్గాన్ని, సత్యాన్ని, జీవాన్ని అన్నారు. మార్గము తెలిపిన వాడు మేధావి. చూపించినవాడు నాయకుడు దాటినవాడు సమర్థుడు. కాని మార్గము తెలిసి చూపించక దాటనివాడు అసమర్థుడు.

243. కష్టాలు రాకుండా దేవుని ప్రార్థించకండి. కష్టాలు ఎదుర్కొనే ధైర్యం, సామర్థ్యం కొరకు ప్రార్థించండి. ప్రశాంతంగా జీవించాలి అనుకుంటే ఎదుటివారు మారాలి అని గాని, మార్చాలని ప్రయత్నించకండి. మీరే మారండి కాళ్ళు సరిగ్గా ఉండి ముళ్ళు గుచ్చుకోకుండా చెప్పులు వేసు కుంటాము. రోడ్డంతా తివాచీ వేయలేము.

244. దేవునికి ఎంత దూరంలో ఉంటే దేవుడు నీకు అంత దూరంలో ఉంటాడు. అందం అనేది ధరించే దుస్తులలో లేదు, మనిషిలో దాగిన

మానవత్వంలో దాగి ఉంది. అందం నవ్వే పెదవులలో లేదు, బాధను దాచుకొనే గుండెల్లో ఉంది. అందం అవమానించే గుండెలో లేదు. ప్రేమతో ఆదరించే మనసులో ఉంటుంది.

245. ప్రాణం ఉన్నంత వరకు మట్టి మన కాళ్ళ క్రింద ఉంటుంది. ప్రాణం పోయాక మట్టి మన శరీరంపైన ఉంటుంది. సంపాదించినది మనది కాదు, మంచితనం, మంచి పనులు మిగులుతాయి. ఎదుటివారి హృదయంలో ప్రేమ మిగులుతుంది.

మిత్రుడు ఆనందంలో ఉన్నప్పుడు ఆహ్వానిస్తే వెళ్ళాలి.
బాధలలో ఉన్నప్పుడు పిలువకున్న వెళ్ళాలి.

246. **జీవితంలో గుర్తించుకొనవలసిన ముఖ్యమైన విషయాలు :**

1. మనకున్నదానిలో ఇతరులకు సహాయం చేయాలి.
2. ఓటమిలో కృంగిపోకుండా ప్రయత్నం చేయాలి.
3. పేదరికంలో నిజాయితిగా ఉండాలి.
4. మాట తీరులో సరళత్వం ఉండాలి.
5. కోపంలో కూడ సహనం ఉండాలి
6. కష్టాలను తట్టుకునే శక్తి ఉండాలి.
7. ప్రతి మనిషిని గౌరవించే గుణం ఉండాలి.

247. ఒకరి సంస్కారం తెలియాలంటే వారి మాటలు వినాలి. ఒకరి ఆప్యాయత తెలియాలంటే వారు వడ్డించినపుడు తినాలి

ఒకరు మంచి మనిషో కాదో తెలియాలంటే ఎవరికైనా సాయం చేశారో లేదో తెలిసికోవాలి.

248. సమస్యలు పోవడం లేదా? అప్పులు పెరిగిపోతున్నాయా?

ఎంత ప్రార్థించినా ఫలితం లేదా? ఎవరిపైన అయినా ద్వేషం దాగి ఉందా? క్షమించలేకపోతున్నావా?

క్షమించే స్వభావం ఉంటే ఈ లోకంలో సంతోషం, పరలోకంలో సిహాసనం లభిస్తాయి. క్షమాపణ గొప్ప గుణమని తెలిసికో. సమస్యలు, అప్పులు దేవుడు తీరుస్తాడు.

249. ప్రపంచం మారాలని మనం కోరుకోవడం కాదు, మార్పు మనలో మొదలైతే ప్రపంచం అదే మారుతుంది. డబ్బు, శక్తి సమయం, శరీరం అన్నీ సంబంధం లేనివే కానీ మంచి స్వభావం, మంచి అవగాహన ఆత్మీయ మార్గము, సత్యమైన మనస్సు ఇవి బాగా సహకరిస్తాయి. మంచి జీవితం జీవించాలని ప్రయత్నించాలి. అది దైవభక్తితోనే సాధ్యం. ప్రార్థన, సహవాసంలోనే లభిస్తాయి.

250. పిల్లలకు వస్తువులు ఇవ్వకపోతే కొంతసేపు ఏడుస్తారు. కాని సంస్కారము ఇవ్వకపోతే జీవితాంతం ఏడుస్తారు.

కంటిలో నిరాశను గుర్తించగలవాడు, గుండెలో దిగులు గుర్తించగలిగినవాడు మనలను సృష్టించిన దేవుడు. నిట్టూర్పులు వినేవాడు, కన్నీరు తుడిచేవాడు, కుర్చుండుట లేచుట తెలిసినవాడు మన సృష్టికర్త ఆయనను ధ్యానించుటకు నిర్లక్ష్యం చేయరాదు. అందుకే ప్రార్థించుటకు ఆసక్తి కలిగి ఉండాలి. అడిగిన దానికంటే ఎక్కువ జవాబిస్తాడు. ఊహించిన దాని కంటే అత్యధికంగా ఆయన టైమ్‌లో ఆయన దయ చేస్తాడు. క్రీస్తు గొప్ప స్నేహితుడు గొప్ప దేవుడని ఆయనను వెంబడించాలి.

251. జీవితం చాలా స్వల్పమైనది. చేసిన పాపాలకు ప్రతి ఫలముంటుంది. మరణము అందరికి తప్పదు. నరకానికి ముగింపు లేదు. రక్షించేది దేవుడే. నీవు జీవించే జీవితంలో ప్రత్యేకత కలిగి జీవిస్తూ నీవు లేకపోతే లోటును గుర్తించే విధంగా ఉన్నట్లుగా జీవించాలి. ప్రవర్తనలో ప్రత్యేకంగా జీవించాలి.

252. ఏదో ప్రత్యేక ఘడియ రావాలని కోరుకొని కనిపెట్టుట కాదు. ఆ సమయాన్ని స్వీకరించి పర్‌ఫెక్టుగా నీవే మార్చుకొనే ప్రయత్నం చేయాలి. తృప్తి అనేది విజయం కన్నా మిన్న. విజయం ఇతరులపై ఆధారపడి నిర్ణయించబడేది. తృప్తి మన వ్యక్తిగతమైన భావం. నీకొక నిర్ణయం తీసుకోవాలనే ఆలోచన కన్న దేవుడే ప్రతి అనుభవాన్ని నిర్ణయించాడని నమ్మాలి.

253. మంచి వ్యక్తులతో రాజీపడుట శ్రేష్టము. కొందరే గొప్ప మనసున్న వ్యక్తులుగా ఉంటారు. వ్యర్థమైన వ్యక్తులతో వాగ్వాదం మంచిది కాదు. ఇతరులు ఊరికే మాట్లాడి విసిగిస్తారు.

254. ఎన్నో ఆరాటాలు, పోరాటాలు ఆవేశాలు, ఆక్రోషాలు, ప్రేమలు, పగలు, అనుబంధాలు, అవమానాలు, స్వార్థాలు, స్నేహాలు ఇవన్నీ దాటుకుంటూ జీవితాన్ని ముగించాలి.

255. ప్రతి దినము మన అవసరాలు దేవుడు తీర్చేలా కోరి ప్రార్థించాలి. తృప్తితో నింపాలని మన హృదయాలు, ప్రేమ, విశ్వాసంతో నిండిపోవాలని ఆదరణ సంతోషంతో ఉప్పొంగాలని శాంతితో నిండిపోవాలని ఆరోగ్యము కలిగి బరువులన్ని తీరిపోవాలని దినదినము వినయంతో ప్రార్థించుకోవాలి.

256. విశ్వాసం ప్రార్థన కనిపించవు గాని అసాధ్యాలను సుసాధ్యం చేస్తాయి. మిక్కిలి శక్తివంతమైన పేరు యేసు, మిక్కిలి శక్తి గల ప్రార్థనాత్మతో నిండిన మాట ఆశీర్వాదము. నేను నీ క్షేమం సదా కోరుకుంటాను.

257. చిన్న చిన్న మాటల వలన మనస్సు గాయపడితే మాటల్ని వదలాలి గాని వ్యక్తులను వదులుకోరాదు. భవిష్యత్తు గూర్చి ఎక్కువ ఆలోచించరాదు. అది భయము కల్గిస్తుంది. గతం గూర్చి ఎక్కువ ఆలోచిస్తే బాధవస్తుంది. అందుకే వర్తమానంలో జీవించాలి అది ఆనందం కల్గిస్తుంది.

258. దేవుని నమ్ముటకు ఆధారమైన దేవుని వాక్యములు

1. దేవునికి నీ పట్ల కొన్ని ఉద్దేశ్యాలు ఉన్నవి. **యిర్మీయా 29:11**
2. నీ గురించి చింతిస్తున్నాడు. **కీర్తన 139:17**
3. నీ పక్షమున యుద్ధం చేస్తాడు. **నిర్గమ 14:14**
4. నీ పేరును గుర్తుంచుకుంటాడు. **యెష 43:1**
5. నీతో సదాకాలముంటాడు. **మత్తయి 28:20**
6. నీకు ఆశ్రయ దుర్గమైయున్నాడు. **కీర్తన 62:6**

259. చిరునవ్వు నీ కండరాలను బలపరుస్తుంది. ప్రార్థన నీ భారాలను తేలిక చేస్తుంది. నవ్వుతూ కలకాలం గడిపేస్తే అది నీ గుండెకు బోలెడు బలమిస్తుంది. ఇవి మూడు జీవితంలో ఉపయోగించాలి.

260. ఉత్తమ వ్యక్తులతో సాంగత్యము జీవితాన్ని సుందరంగా మలుస్తుంది. వారి జీవిత సౌరభం నీ గుండెను ఆనందమయం చేసి నీ బాధలను తొలిచి నిత్యం సంతోషాన్ని ఇస్తుంది.

261. నీ జీవితంలో పొరపాట్లు నీకు అనుభవాలనిస్తాయి. అనుభవాలు పొరపాట్లు చేయకుండా జాగ్రత్తనిస్తాయి. నీ పొరపాట్ల నుండి మంచి నేర్చుకోగలిగితే నీ విజయాల నుండి వివేకాన్ని నేర్చుకుంటావు. నీ జీవితాన్ని త్యాగం చేయుట ద్వారా కొందరు ఆనందిస్తారు.

262. జీవితంలో ఏ అనుభవం నష్టం కాదు. నీ మనస్సును హృదయాన్ని క్రమ పరుస్తుంది. మనలో మనం ప్రశ్నించుకోవలసినవి

1) రోజుకు ఒక్కసారైనా ప్రార్థిస్తున్నామా? **దానియేలు 6:10**

2) రోజుకు ఒక్కసారైనా బైబిలు చదువుతున్నామా? **కీర్తన 1:3**

3) రోజుకు ఒక్కసారైనా సువార్త చెబుతున్నామా? **లూకా 21:37**

4) దేవుని కొరకు ఏమి చేస్తున్నావు? **ఫిలిప్పీ 1:21**

5) ఆయన కొరకు పరిచర్య చేస్తున్నావా? **ఫిలిప్పీ 4:3**

6) నీ ద్వారా ఒక్కరైనా మందిరానికి వచ్చారా? **జెకర్యా 8:23**

263. నిజమైన వ్యక్తిని వెదకుటకు ప్రయత్నించాను. సరైన వ్యక్తి కన్నా నిజమైన వ్యక్తి వాస్తవమైన వాడని గ్రహించు. నిజం జ్ఞానం కన్నా లోతైనది. ఎందరికో మనం తెలిసి ఉంటాము. గాని కొందరే మనలను అర్థం చేసుకోగలరు.

264. చేతి గోళ్ళు పెరిగితే గోళ్ళు మాత్రమే కత్తిరిస్తాము కాని వేళ్ళు కాదు. అలాగే అపార్థాలు పెరిగితే ఇగోను అహాన్ని తొలగించుకొని బంధాలను పెంచుకో. నిన్నటి వ్యక్తులంటే మార్పు చెందని వారెట్లుంటారు.

1) వారంతా గతం కొమ్మల్లో చిక్కుకున్న గాలిపటాలు.

2) పాతవి పారవేసి కొత్తవి హత్తుకోరు.

3) వెనుకున్నవి మరచి ముందుకు సాగిపోరు.

4) గతం చుట్టు తిరిగే గానుగ చక్రాలు

5) సంవత్సరాలు గడిచినా కోపాలను వదిలి క్షమించలేనివారు.

6) ఏళ్ళతరబడి పరాభవాల బరువును ప్రభువు పాదాల దగ్గర దించుకోరు

7) రూపాంతరం చెందని లార్వ దశలోనే ఉంటారు.

265. కలలన్ని నిజం చేసుకోవాలంటే యాధృచ్ఛికంగా ఋజువు కాదు. దానికి దృఢ సంకల్పం, కృషి, అంకిత భావం కావాలి.

266. హృదయం శుద్ధి కలిగి ఉన్నప్పుడే అది గొప్ప దేవాలయమంత పవిత్రంగా ఉంటుంది. పైకి నవ్వే ముఖం కన్నా లోపల నవ్వే హృదయం మిన్న. అవి చాలా అపురూపమైనవి. తప్పక యేసయ్య నామంలో విజయం పొందేవారు పట్టుదలగా ప్రార్థించగలరు.

267. విజేతలు కాని వారికి సామాన్యంగా ఉండే విలువైన సంపద 24 గంటల కాలమే. ఆ కాలాన్ని ఎలా వాడగలరో అది వారి చేతిలో ఆలోచనల ద్వారా గ్రహించగలము. ఇతరులను ఆనంద పరచడమనేది మన చేతుల్లో లేదు. సంతోషంగా ఉండుట మాత్రం అందరి చేతుల్లో ఉంటుంది.

268. క్రొత్త సంవత్సరంలో క్రొత్త అవకాశాలు, క్రొత్త సవాళ్ళు, క్రొత్త విధానంలో ప్రేమించుట, ఇచ్చుట అందరూ ఎదుర్కొనే అనుభవం. మనస్సు, గొడుగు ఇవి రెండు ఒకే విషయంలో సామాన్యంగా కలిసిన అనుభవాలుంటాయి. అవి తెరచుకొని ఉంటాయి. లేనిచో అవి భారం కాగలవు.

269. **మంచి ఆలోచనలు గల ప్రార్థనలు :**

ఎ) ప్రేమతో నిండుకొనుట కొరకు

బి) మంచి ఆరోగ్యము కొరకు

సి) శాంతి గల మనస్సు కొరకు

డి) అవసరతలు తీరుట కొరకు

ఇ) సంతోష వర్షం కురువాలని

ఎఫ్) బలహీనమైనపుడు బలవంతులము కావాలని

జి) బాధలను బాపి ఆరోగ్యం ఇవ్వాలని

హెచ్) పాపక్షమాపణ కొరకు

ఐ) శ్రమలు తప్పించుట కొరకు

జె) ఆశీర్వాదాల కొరకు

కె) అద్భుతాలను అనుభవించుట కొరకు

270. పరిమితమైన అవసరతలు, అత్యధిక సర్దుబాట్లు కలిగి ఉంటే అద్భుతమైన సోపానాలుగా విజయవంతమైన జీవితాన్ని అనుభవించగలము. అది ఆనందమయం కాగలదు. ప్రతి ఒక్కరి ఆలోచనలను వినాలి. ప్రతి అనుభవం నుండి మంచిని నేర్చుకోవాలి. అందరికి కొంత తెలియవచ్చు గానీ ఎవరికీ అన్ని తెలియవు.

271. ఏదో మంచి జరుగుతుందన్నది ఆశావాదం. ఏదో జరుగుతుందని ఆలోచించడం వలన ఏది సంభవించినా మన మంచికేనని భావించుట.

272. పాత సంవత్సరంలో అనుభవించిన చేదు అనుభవాలు. తదనంతర సంవత్సరాలలో ఉండరాదు. ప్రశాంతమైన, ఆరోగ్యమైన, విజయవంతమైన, శాంతియుతమైన అభివృద్ధిని చూపించేవిగా ఉండాలి. ఉత్తేజపూరితంగా ప్రేమ నిండిన, ప్రశాంతమైన ఆశాజనకమైన 12 నెలలు 12 క్రొత్త అధ్యాయాలు గా 365 రోజులు క్రొత్త అవకాశాల కోసం కనిపెడుతూ ఆనందంగా ఆశీర్వాదకరంగా జీవితాన్ని కొనసాగిద్దాం.

273. చిల్లర నాణేములు శబ్దం చేస్తాయి. కాని విలువ కల్గిన నోట్లు నిశబ్దంగా ఉంటాయి. అలాగే మన విలువ పెరిగే కొలదీ మనము నిశబ్దంగా అంటాము. అది నేర్చుకోవాలి మనిషి గొప్పతనము నమ్మకములోనూ, నమ్మించడంలోనూ ఉండదు. నమ్మకాన్ని నిలబెట్టుకొనుటలో ఉంటుంది. నిజం చెప్పి బాధపెట్టిన మంచి దేగాని అబద్ధం చెప్పి మోసం చేయరాదు. బైబిలు సత్యంలో యిది ముఖ్యమైనది.

274. ప్రార్థననేది మన దుఃఖాలను దేవుని సన్నిధిలో మార్పిడి చేసి ఆనందాలను అదిస్తుంది. అవి ఆశీర్వాదాలవుతాయి. స్వంత నిర్ణయాలు తగవు. ఒక చెట్టుకు పూసిన పూత దేవుని సన్నిధిలో కాపాడబడి పిందెలుగా మారి కాయలు దిగుబడిగా కాలగవు. దేవుని చిత్తం లేనిదే ఒక్క గాలి విసురుకు కొమ్మలో పూత రాలిపోతుంది. ప్రభువు వాగ్ధానాల మీద శాశ్వత కాలం ఆధారపడాలి. ఈ వాగ్దానాల చెక్‌బుక్ విశ్వాసుల కోసం సిద్ధపరచబడింది. ప్రభువు వాగ్ధానాలపై సంపూర్ణంగా ఆధారపడాలి.

275. నీ జీవితం ఇతరుల జీవితాలపై ప్రభావితం కావాలంటే నీవు అత్యంత తెలివైనవాడివి కానవసరం లేదు. అందంగా గొప్పగా ఉండనవసరంలేదు, ఫర్‌ఫెక్టుగా ఉండనవసరం లేదు కాని ఇతరులను జాగ్రత్తగా గమనించి ప్రేమించే ఆప్యాయత చూపగలిగేవారిగా ఉండి వారి ప్రేమకు నమ్మకంగా జీవించగలిగితే చాలు.

276. ఎక్కువ ధనికులెవరని అంచనా వేయగలిగామంటే ఎక్కువ సంపాదించేవారు కాదు. కానీ ఎక్కువగా ఇచ్చేవారు మాత్రమే. నీ ముందు వ్యక్తులు నమ్మకస్థులుగా ఉండవచ్చు కాని నీ వేనుక వారు నిజాయితిగా ఉంటేనే గుర్తింపు పొందగలరు. ఇతరుల విమర్శలకు కృంగిపోరాదు. ఇతరుల అభిమానాలకు పొంగిపోరాదు.

277. నిన్నటి నీడలు ఈ రోజు సూర్య కాంతిని పాడు చేయకుండా కాపాడుకోవాలి. మనిషికి డబ్బు ఇచ్చే ధైర్యంకంటే మనిషి ఇచ్చే నమ్మకం చాలా గొప్పది. నీ సమస్యలను దేవుడే సంప్రదించనీయాలి, నీ గుండె గాయాలన్నీ దేవుడే స్వస్థపర్చనివ్వు, నీ భయాలన్నీ తొలగించి దేవుని ప్రేమపై ఆధారపడాలి. నీవు దేవునిని ప్రార్థించాలంటే నీ ప్రార్ధన కృతజ్ఞతయై వుండాలి.

278. ఇతరులను సంతోషంగా ఉంచాలంటే జాగ్రత్తగా గమనించాలి. ఆప్యాయత చూపాలి, అభినందించాలి.

సూర్యస్తమయం సమయంలో సూర్యుడు నేను లేకపోతే వెలుగు ఎవరు ఇవ్వగలరు అని ప్రశ్నించగా అంతా మౌనం వహించగా ఒక క్రొవ్వొత్తి ఇలా చెప్పింది, నా ఆకారము స్టేటస్ ముఖ్యం కాదు గాని నా ప్రవృత్తిని బట్టి వెలుగునివ్వడం నా ధర్మం అని జవాబిచ్చింది. నీవున్నచోటునే జీవించి పుష్పించాలనేది దేవుని లక్ష్యం.

279. నీవంటే నాకు ఇష్టం అనే మాట నేను నిన్ను ప్రేమిస్తున్నాను అనే మాటకు తేడా చెప్పాలంటే మంచి ఉదాహరణ : ఒక పుష్పాన్ని ఇష్టపడితే దానిని కోసుకుంటావు, ప్రేమిస్తే రోజు ఆ చెట్టుకు నీరు పోస్తావు. ఈ తేడాను గ్రహిస్తే ప్రేమించుట ఎలాగో గ్రహిస్తావు.

280. జీవితం చాలా చిన్నది. అందుకే అహంకారము విడనాడి త్వరగా క్షమిస్తూ నెమ్మదిగా నమ్ముతూ, నమ్మకంగా ప్రేమిస్తూ హాయిగా నవ్వుతూ నవ్వడానికి అడ్డుగా ఉన్నవన్నీ తొలగించుకొని ప్రశాంతంగా జీవించు.

281. **దేవుడిచ్చే వాగ్ధానాలు గొప్పవి**

1) నిన్ను ప్రేమిస్తాను
2) నీకు జవాబిస్తాను
3) నీకు అన్నీ సమకూరుస్తాను
4) నీకు శాంతినిస్తాను
5) నీకు బలాన్నిస్తాను
6) నీకు భద్రతనిస్తాను
7) నీకు ఇమ్మానుయేలు వలె తోడుగా ఉంటాను.

282. విజయ బంధము గమనిస్తే మెదడు విజయంపై ఆధారపడకు. నీ ప్రవర్తన తలంపులపైనే విజయం ఆధారపడి ఉంటుంది. నీ చిరునవ్వు వెయ్యి మాటలంతా బలము కలది. దానిని పరిసరాలలో అందరితో పంచు.

283. కొందరు నిన్ను అభినందించవచ్చు లేదా విమర్శించవచ్చు. రెండు పరిస్థితులలో నిన్ను చలింపచేసి స్పందింపచేసేది ఒకటయితే విమర్శ ద్వారా నిన్ను సరిచేసి బాగు చేయగల సమర్థతనిచ్చి ఆశావాదంగా మార్చగలిగేది మరొకటి.

284. దేవునిపై నమ్మకం పెట్టినపుడు అద్భుతాలు సంభవిస్తాయి. నీ నిట్టూర్పులను వినే దేవుడు నీ గోడు వింటాడు. నిన్ను అర్థం చేసుకుంటాడు. నీ నిరీక్షణ దేవుడే, నీ భయాలు, నీ తలంపులు అన్ని పూర్తిగా తెలిసినవాడు దేవుడే.

285. **అత్యుత్తమ సౌందర్య సాధనాలు**

1. పెదవులకు సత్యము, కన్నులకు దయ, చేతులకు దానము, ముఖానికి చిరునవ్వు, హృదయానికి ప్రేమ వీటి ద్వారా జీవితాన్ని అందంగా ఆనందంగా మలచుకోగలము. జీవిత ధర్మాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1) ప్రార్థించే ముందు విశ్వసించాలి

2) మాట్లాడే ముందు వినాలి

3) ఖర్చు చేసే ముందు సంపాదించాలి.

4) ప్రతిస్పందించే ముందు ఆలోచించాలి

5) విమర్శించే ముందు వేచియుండాలి.

6) ఓడిపోయే ముందు ప్రయత్నించాలి

7) మరణించే ముందు జీవించాలి

286. మనిషి అందంగా కనబడాలంటే ఎన్నో రకాల తెరలు తొలగించాలి గాని మనసు అందంగా కనబడాలంటే అహం, అసూయ అనే అడ్డు తెరలు తొలగిస్తే చాలు.

287. తీర్పు తీరిస్తే సంతోషం రాదు, అందరిని క్షమిస్తే సంతోషం వస్తుంది. అందరిని ప్రేమిస్తే మరింత సంతోషం లభిస్తుంది.

**తెలుగు అక్షరమాలలో మంచిమాటలు**

అ : అన్వేషించడం మొదలు పెట్టు

ఆ : ఆత్మ విశ్వాసానికి పదునుపెట్టు

ఇ : ఇష్టపడడం నేర్చుకో

ఈ : ఈర్ష్య పడడం మానుకో

ఉ : ఉన్నతంగా ఆలోచించు

ఊ : ఊహకు అందేలా ఆచరించు

ఋ : ఋతువుల మాదిరిగా జీవితాన్ని అనుసరించు

ఎ : ఎదగడం కోసం ఒకరితో పోల్చుకోకు

ఏ : ఏకాగ్రతను కోల్పోకు

ఐ : ఐక్య మత్యం సాధించడం మర్చిపోకు

ఒ : ఒంటరి జీవితం ఎన్నో గుణ పాఠాలు నేర్పుతుంది

ఓ : ఓర్పు నేర్పిన అనుభవాలు ఏదో ఒక గెలుపు బాటలు వేస్తాయి

ఔ : ఔన్నత్యాన్ని పెంపొర చేసుకో

అం : అందని ఎత్తుకు ఎదగాలంటే

అః అహర్నిశలు క్షమించాలని తెలిసికో

క : కష్టపడి పని చేయడం నేర్చుకో

ఖ : ఖచ్చితత్వం అలవర్చుకో

గ : గమ్యాన్ని ఎంచుకొని పయనించు

ఘ : ఘాటుగా స్పదించడం నేర్చుకో

ఙ్ఞా : ఙ్ఞాపకాలను గుర్తుంచుకొని మసలుకో

చ : చతురతను ప్రతి విషయంలో నేర్పుగా వ్యవహరించు

ఛ : ఛత్రంలా (గొడుగులా) జీవితాన్ని మరొకరికి సార్థకం చేసుకో

జ : జగడాలకు దూరంగా ఉండు

ఝ : ఝుమ్మంది నాదంగా మారు

ణ : జనగణమన గీతాన్ని మరువకు

త : తారతమ్య బేధాలను అణగద్రొక్కు

థ : థదేకంగా ధ్యానించు

ద : దయాదాక్షిణ్యాలు కలిగియుండు

ధ : ధర్మము ఎల్లప్పుడు ఆచరించు

న : నటన జీవితం నేర్చుకోకు

ప : పరిహాసమాడకు

ఫ : ఫలితాలను సమంగా చూడు

బ : బలముతో అన్ని పనులు నెరవేరవు

భ : భయాన్ని దరిచేరనీయకు

మ : మర్యాదగా వ్యవహరించు

య : యవ్వనాన్ని అపహాస్యం చేయకు

ర : రంగు రంగుల జీవితంలో పడి మోసపోకు

ల : లక్షణమైన జీవితాన్ని ఏర్పరచుకో

వ : వంచనకు గురి కాకు

శ : శిరస్సు వంచుకొనే పని చేయకు

ష : షడ్రుచులను ఆహ్వానించు

స : సన్నిహితులను ఏర్పరచుకో

హ : హానికరమైన పనులు చేయకు

ళ : అవహేళన చేయకు

క్ష : క్షణికావేశానికి లోను కాకు

ఱ : ఱణానికి ఎదురు నిలువు

288. ప్రతి సంఘటన జీవితంలో యాదృచ్ఛికంగా జరగవు కాని దేవుని చిత్తంలోనే సంభవిస్తాయి. జీవితాన్ని ప్రేమించాలి, జీవితం నుండి నేర్చుకోవాలి, నీ చిరునవ్వు ప్రపంచాన్ని మార్చగలదని నమ్మాలి. కానీ లోకం నీ చిరునవ్వును చెరగనీయరాదు, ఆశావాదంతో దైవ భక్తితో జీవించాలి.

289. నా నీతి నిత్యము నిలుచును. నా రక్షణ తరతరములుండును. యెష 51:8 కృప పొందిన విశ్వాసులంతా మంచిగా సమీకృతంగా జీవించాలి. ద్వేషానికి దూరంగా ఉండాలి. ద్వేషించారని ద్వేషిస్తే ఇతరులకు మనకు తేడా లేదు. నిజంగా ప్రేమించే మనసే ఉంటే ప్రేమిస్తూనే ఉండాలి. ఏనాటికైనా మార్పు రాకపోదు. పోయేవారిని ఆపలేము గాని వచ్చే వారిని ఆపరాదు. జీవితం చాలా చిన్నది, యవ్వనం ఇంకా చిన్నది కోపతాపాలతో సమయం వృధా చేసుకోక హాయిగా కలిసిపోదాము.

290. ఏది శాశ్వతం కాదు గనుక నిన్ను నీవు ఒత్తిడికి గురి చేసుకోరాదు. ఎంతటి గడ్డు పరిస్థితి అయినా మారిపోక తప్పదు.

కోపం లివర్‌ను పాడుచేస్తుంది. బెంగ, దిగులు ఊపిరితిత్తులను పాడు చేస్తుంది. ఒత్తిడి గుండెను, మెదడును పాడు చేస్తుంది. చింత కడుపు నొప్పి కలిగిస్తుంది. భయం కిడ్నీలను పాడు చేస్తుంది. వ్యర్థమైన చింత, బాధ, ఒత్తిడి దూరం చేసుకొని మంచి తలంపులతో ఆశావాదంతో ప్రేమ గల మనస్సుతో జీవితాన్ని ఆరోగ్యవంతంగా కొనసాగించాలి.

291. రాపిడిలేని వజ్రం ప్రకాశించదు. కష్టాలు లేనిదే మానవుడు పరిపూర్ణత చెందదు. నీవు చేయు ప్రయత్నములన్నిటిలోను నీకు దీవెన కలుగునట్లు యెహోవా ఆజ్ఞాపించును. ద్వితీ 28:8

నీ జీవితంలో పాత స్నేహితులు బంగారం అయితే కొత్త స్నేహితులు వజ్రాలు. వజ్రాలను పొందినపుడు బంగారాన్ని మర్చిపోరాదు. బంగారంలోనే వజ్రాలు పొదగబడతాయి. అవి కూడ ముఖ్యం.

292. కొన్నిసార్లు తప్పుగా చేసిన నిర్ణయాలు అనుభాలను రెట్టింపు చేయగలవు. పాత సిద్ధాంతంలో చేయి లేదా చనిపో అని ఉంటే క్రొత్త సిద్ధాంతంలో చనిపోకముందే ఏదో ఒకటి చేయి.

293. ఎవరైనా నవ్వితే మీ వల్ల నవ్వాలి కానీ మిమ్మల్ని చూచి నవ్వరాదు

ఎవరైనా ఏడిస్తే మీ కోసం ఏడువాలి కానీ మీ వల్ల ఏడువరాదు.

సమయం, నోటి మాట, అవకాశాలు ఒకసారి పోగొట్టుకుంటే మరలా పొందలేము. విశ్వాసం, ప్రార్థన కనిపించవు అవి అసాధ్యాలను సుసాధ్యం చేస్తాయి.

294. చేయిపట్టుకొని నడిపించే దేవుడు మనకున్నాడు **యెష 43:13**

చేయి పట్టి నడిపించేవాడు **యిర్మీయా 31:32**

మనలను ముట్టి స్వస్థపరిచేవాడు **మార్కు 1:31**

చేయి పట్టి తప్పించే దేవుడు **ఆది 19:16**

295. **ఆశీర్వాదాలకు కొన్ని షరతులున్నాయి**

ఆశీర్వాదాలు దొరకు కాలములో వెదకాలి. **యెష 55:6**

ఆశీర్వాదాలు దొరికే వరకు వెదకాలి. **లూకా 15:8** వేకువనే వెదకాలి.

296. **ఆశీర్వాదాలు ఎలా వెదకాలి**

కానాను స్త్రీవలె గోజాడి వెదకాలి **మత్తయి 15:21**

విధవరాలి వలె విసుగక వెదకాలి **లూకా 18:1**

యెహోవాను వెదకువారు హృదయంనందు సంతోషించెదరు గాక.

నేనెంత, నా బ్రతుకు ఎంత అని ఆలోచించి తగ్గింపుతో జీవించాలి.

297. **హృదయశుద్ధి గలవారు ధన్యులు వారు దేవునిని చూచెదరు**

1. హృదయశుద్ధి, కనికరం, పరిశుద్ధత కావాలి.
2. ద్విమనస్కులుగా జీవించరాదు
3. వేషధారణకు దూరంగా జీవించాలి.
4. మన ఆదర్శాలు సరిగా ఉండాలి.
5. నిర్మలమైన మనసాక్షి కలిగి జీవించాలి.

దేవుడు నీతిమంతులను దీవిస్తాడు, క్షమిస్తాడు, శుద్ధీకరిస్తాడు. దేవునికి కళ్ళు, చెవులున్నాయి. మన గురించి గమనిస్తూ ప్రార్థన విని జవాబిస్తాడు.

298. వాక్య ధ్యానము ప్రార్థనా జీవితం క్రైస్తవునికి గీటురాయి. నీటిలో దిగకుండా ఈత నేర్చుకోవాలంటే రాదు. అలాగే వాక్యం చదువకుండా యేసును గురించి తెలుసుకోలేము. పరుగు పందెంలో పరుగెత్తకుండా ఎలా గమ్యం చేరలేమో, ఆత్మీయ పోరాటంలో ప్రార్థించకుండా దేవుని శక్తిని తెలిసికొనలేము.

299. వాక్యమే మన శక్తి. వాక్యమే మన బలం. వాక్యమే మన ప్రామాణికం. ప్రార్థనే మన ఆత్మీయ పోరాటము. వాక్యమే మన మార్గము, వాక్యమే మన గమ్యము. ఎంత గొప్ప పోరాటమో అంత గొప్ప విజయము.

మరియు దేనినైనా యోచన చేయగా అది నీకు స్థిరపరచబడును. నీ మార్గం మీద వెలుగు ప్రకాశించును. యోబు 22:28

300. వారానికొకసారి మీ ఎదుగుదలను లేదా మీ తప్పులను పరీక్షించుకోండి. "నేనెం తప్పులు చేసాను" అని మిమ్మల్ని మీరు పరిశీలించుకోంది. మీ భౌతిక, ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఏమి నేర్చుకున్నాను. నాలో ఏమైన మంచి మార్పులు వచ్చాయాలేదా అని మిమ్మల్ని మీరే అంతరంగ పరిశీలన చేసుకోండి. దేవుడు తప్పక మీతో మాట్లాడతాడు.

301. నీ ఆత్మ మండేంత వరకు ఆత్మీయ పరిచర్యకు నీవు అర్హుడ వయ్యేంతవరకు ఆ మంట వద్దనే ఉండు. దావీదు తన హృదయం మైనంలా కరిగేంత వరకు అలానే ఉన్నాడు.

302. క్రీస్తు ఒక్కసారి మరణించాడు, కానీ నిరంతరం జీవిస్తున్నాడు. పాపి యొక్క ప్రతి (పత్రం) పాపక్షమాపణ క్రీస్తుయేసు రక్తంతో వ్రాయబడింది.

303. మన తలంపులు పైనున్న సంగతులపైన ఉంటే మనం మధురమైన జీవితాన్ని జీవిస్తాం. పరలోకం నీ కళ్లల్లోను, క్రీస్తు నీ గుండెలోను ఉంటే, లోకం నీ క్రాళ్ల కింద ఉండదా?

304. ఇంకా నీ హృదయ లోతుల్లో అవినీతిచ్ఛాయలున్నాయి. హృదయంలోని పూర్తి కల్మషాన్ని గుర్తించడానికి ఇంకా నీకు జ్ఞానం కావాలని ప్రార్థించు.

305. అపవాది ఎల్లప్పుడూ మీ మనస్సులను పక్కత్రోవ పట్టించాలని ప్రశ్నలు, అనుమానాలతో ధ్యానం నుండి బయటకి లాగడానికి ప్రయత్నం చేస్తాడు.

306. (మత్త 9:9). మత్తయి ఒకప్పుడు లోకస్థుడే. ధనం విషయంలో పేరాశ గలవాడే అంటే మనందరిలాంటివాడే, క్రీస్తు పెదాల నుండి వచ్చిన ఒక మధురమైన మాట "నన్ను వెంబడించు" అతడిని సమస్తం విడిచిపెట్టేటట్లు చేసింది.

307. కొన్నిమార్లు దేవుడు మనం ప్రార్థించిన దానికంటే శ్రేష్ఠమైన జవాబిస్తారు. ఆయన అప్యాయత గల ఒక తండ్రి.

308. మీరు దేవునికి జ్ఞాపక కర్తలేనా? అయితే మీరు మౌనంగా ఉండరు. ఆయనను విశ్రాంతి తీసుకోనివ్వరు, మీరు విశ్రాంతిగా ఉండరు.

309. దైవభయం లేని ఈ లోకంలో యేసే నీ సమస్త బలం. మరణం వరకు నిన్ను కాపాడువాడు, మానవ ముఖాలకు భయపడవద్దు. నిత్యత్వంలోంచి చూస్తే వాళ్ల కోపం చాలా చిన్నదిగా కనిపిస్తుంది.

310. విశ్వాస నేత్రాలతో పరలోకంలోని ఆయన వైపు చూడు! విశ్వాస నేత్రాలు, అవి ఆకాశ నక్షత్రాల ఆవలి సంగతులను చూస్తాయి.

311. తప్పిపోయిన గొర్రె వేసారి అలసి ఉండగా, కాపరి భుజాలపైన నెమ్మదిగా పండుకొన్నట్లు భౌతిక సంబంధమైన పనుల భారమంతటిని ఆయన భుజాలపైన వేద్దాం.

312. పర్వత శిఖరంపై నిలబడాలంటే లోయల్లోనూ నిలబడాలి. మనం కోరదగిన ప్రశస్థ స్థానం ఒక్కటే, అది క్రీస్తుయేసు పాదాల చెంత ఉండటం.

313. క్రీస్తు ప్రేమకు అప్పగించుకున్న అంతరంగం దుఃఖానికి అతీతంగా జీవిస్తుంది.

314. ఒక మొక్కకు తనను తాను ఎలాగు సంరక్షించుకోవాలో తెలియదు, నీరు ఎప్పుడు ఎంత కావాలో, నీరు లేకుండా ఎప్పుడుండాలో దానికి తెలియదు. మనం ఆయనను తోటమాలిగా కలిగి ఉంటే, అన్నీ సవ్యంగా ఉంటాయి.

315. యేసుకంటే ప్రియమైనదిగా దేనిని చూడకు, అన్నింటా ఆయనే ప్రియమైనవాడు.

316. రేపటి గురించి చింతించకు. వర్తమానంలో ఏ రోజుకారోజు పరిమితమై జీవించటం నీ విజయానికి రహస్యం. ఏ రోగాలు లేని పరిపూర్ణ ఆరోగ్యం నీ సొంతం. అందుకే ప్రభువు ప్రార్థన నిరంతర ధ్యానం ఎంతో అవసరం. మీ అనుదిన ఆహారం మీకు దయచేయును.

317. స్పష్టంగా ఒకటి గుర్తించు, క్రీస్తులో ఉన్నదంతా విశ్వాసులు పొందారు. వారు ఆయనతో కూడా పరిపాలిస్తారు. ఆయన సంతోషంలో వాళ్లు పాలివారు. ఆయనలో అంగీకరించబడినవారు.

318. ఈ లోకంలో ఉన్న ప్రేమలన్నింటిని ఒక్కచోట కుప్పగా పోసినా ఆయన వస్త్రపు చెంగును తాకేందుకు గానీ, ఆయన చెప్పుల వారును విప్పేందుకు గానీ అవి అర్హమైనవి కావు.

319. నిజంగా పరలోకానికి యేసే మార్గమని మనం నమ్ముతున్నామా? ఆ నమ్మకానికి తగినట్టు జీవిద్దాం.

320. మన చుట్టు ఉన్నవారి ఆత్మల విషయమైన ఏ కొంచెం భారమున్నా దానికి మించింది లేదు.

321. మనమీద ఆ సిలువను ఆయన మోపకముందే దాని మోసే ప్రయత్నం చేయవద్దు.

322. అర్ధ హృదయంతో వెంబడించే క్రైస్తవుడు తన జీవిత సౌందర్యం ద్వారా ఎవరినీ ఆకర్షించడు, ఏ గౌరవాన్నీ పొందలేడు.

323. మనం మర్చిపోకూడనిది, ప్రభువు యొక్క మాదిరిని అనుసరించటం, ఇదొక్కటే మన అర్హత.

324. భక్తిహీనులు తమకంటే మంచిగా ఉండే ఎవ్వరినైనా ఓర్వలేరు. యేసును ద్వేషించిన లోకం నిజ క్రైస్తవులను కూడా ద్వేషిస్తుంది.

325. అన్ని ప్రేమలకు ఆయన ప్రేమ మించినది. అందులో నా కొరకైన కనికరం, ఓర్పు, క్షమించేందుకు సిద్ధమనస్సు ఉన్నాయి.

326. మనం మాట్లాడుకుంటున్నప్పుడు మన కళ్లు చూడలేకపోవచ్చు గానీ మన సంభాషణ వింటున్న ఆయన మనతోనే ఉన్నాడు. ఆయన కళ్లు మనల్ని చూస్తున్నాయి. మన హృదయాలను మండించటం ద్వారా మన సంభాషణను ఆశీర్వదిస్తాడు ఆయన.

327. మనుష్యుల దృష్టిలో అసాధ్యమైనవి క్రీస్తుతో సాధ్యం.

328. మన సహవాసానికి ముద్ర, సాక్ష్యం, ఔన్నత్యం, అభిషేకం ఆయనే.

329. ప్రభువైన యేసు మాటల్లో ఒకటి సరిచూసుకోవలసి రావటంగానీ, ఒక అడుగు వెనక్కు తీసుకోవలసి రావటంగానీ, ఒక ఆలోచనను సరిచేయవలసి రావటంగానీ ఉండదు. అన్నీ సంపూర్ణంగా ఖచ్చితమైనవి.

330. పరలోకంలోను, భూమ్మీదనున్న పరసంబంధమైన కుటుంబం ఆయన ఆధీనంలోనే ఉంది. దీనినిబట్టి ఆత్మీయత గల ప్రతి మనస్సు కృతజ్ఞత తెలియజేయాలి.

331. దేవుని వాక్యాన్ని హత్తుకోండి. ప్రశ్నించని సామాన్యమైన విశ్వాసాన్ని కలిగి ఉండండి, ఇదే స్థిరత్వానికి, సమాధానానికి నిజ రహస్యం.

332. భూసంబంధమైన ఏ స్నేహితుడు చేయజాలనంతగా ఆయన మన అనుభూతుల్లోకి ప్రవేశించగలడు. ఎవరూ అర్థం చేసుకోలేనంత పరిపూర్ణంగా ఆయన మనల్ని అర్థం చేసుకుంటారు.

333. ఇద్దరు దొంగల నడుమ వ్రేలాడే ఆ ఒక్కడు పరలోకానికి, భూమికి, నరకానికి దర్పణం. దేవుని విశ్వమంతటికి, ప్రతి ఒక్కనికి చాలినంతటివాడు.

334. ఏ స్థానిక సంఘం సువార్తను ప్రకటించకుండా ఉంటుందో అది మృతమైన స్థితిలోనే ఉంటుంది.

335. నేను ఒకటి కనుగొన్నాను, దేవుని సన్నిధిలో కేవలం ఆరాధనా మాటలు పలకటం మంచిదని.

336. యేసువైపు చూడడమే జయానికి రహస్యం. క్రీస్తు సింహాసనం మధ్యనున్న గొర్రెపిల్ల. కోట్లాది మందికి మహా సంతోషం ఇవ్వగలిగిన వాడాయన. ఆ రాజు ఎంత సౌందర్యం గలవాడు.

337. పని చేసేందుకు ప్రేమ అనేది హేతువు. పని చేసేందుకు సంతోషం అనేది బలం. నువ్వు కూడా పౌలులాగా అదెంతటిదైన " ఈ చులకనైన శ్రమ" అని చెప్పేందుకు ప్రయత్నించు, "ఇది కొంచెము కాలమే".

338. ఆయా సందర్భాల్లో మిణుకు మిణుకుమనే ఆయన స్వల్ప ప్రకాశమే నా హృదయాన్ని ఎంతగానో తాకుతుంది. ఆయనలోని కొంచెం మహిమ, గొప్పతనం, కొంచెం ప్రేమ ముందు నా స్వంతం అనుకునే అతిశయాలన్నీ అత్యంత అల్పమై ఎగిరిపోతాయి.

339. మనం చేసిన పనికి మాత్రమే కాదు, భరించిన భారాలకు కూడా బహుమానం పొందుతాం. నేను ఖచ్చితంగా అనుకున్నదేమంటే సణగకుండా ఎవ్వరు భరిస్తారో వారికి తప్పకుండా బహుమానం ఉంటుంది.

340. దేవుడు వూరికే పరిచయము చేయడు దాని వెనుక ఖచ్చితంగా ఏదో మంచి కారణము దాగి ఉంటుంది. నమ్మకమైనా, గౌరవమైనా, ప్రాణమైనా ఒక్కసారి పోతే తిరిగిరావు. బ్రతుకుట గొప్పకాదు, నిజాయితీగా బ్రతుకుట గొప్ప.

341. చేయగలిగిన దానిని నీవు నీ సొంత బలముతో చేసేందుకు ప్రయత్నిస్తున్నావు. నీవు నీ యందు నమ్మికయుంచావు. దేవుని యందు నమ్మకముంచినట్లయితే నీవు ఓడిపోయే వాడివి కాదు.

342. ఎంత కొంచెంగా ఈ సత్యం మీద నన్ను నేను కట్టుకుంటానో అంతే కొంచెంగా మరణంలోంచి లేస్తున్నట్లు.

343. ప్రభువు యొక్క ప్రేమ ఎంతగా నీలోనికి ప్రవహిస్తే అంతగా అది నీలో నుండి ప్రవహించి ఆయన చూపించిన మాదిరి చొప్పున గొప్ప సంతోషంతో నీవు ఇతరుల పాదాల వరకూ వంగుతావు.

344. **నిజక్రైస్తవుడు ఎలా వుండాలి.**

మదిలో క్రీస్తు వుండాలి.

గదిలో ప్రార్థన వుండాలి.

ఊరిలో సాక్ష్యము ఉండాలి.
చదువులో చురుకుదనం కలిగి ఉండాలి.
యింటిలో పొదుపు వుండాలి.
సంఘంలో అదుపు ఉండాలి.
ఉద్యోగంలో నీతి ఉండాలి.
వ్యవసాయంలో ఓర్పు ఉండాలి.
దైవసేవలో పిలుపు వుండాలి.
క్రీస్తురాకడలో ఎత్తబడాలి.

345. ఒక వచనాన్ని ఎన్నుకొని దానినే పదిసార్లు చదువు. దానిని నీ హృదయంలో భద్రపరుచుకో. నువ్వు వాక్యాన్ని ఎంతైనా వినవచ్చు, అయితే నిజంగా అంతరంగంలోనికి స్వీకరించిన వాక్యమే ఆత్మీయాహారం అవుతుంది.

346. దేవుడూ, నేను అనడం ఎంత ఆశీర్వాదకరమైన మాట. అయితే నాకింకా ప్రశస్తమైన మాట బైబిలులో కనిపించింది. అది "దేవుడే, నేను కాను", దేవుడు ముందు తరువాత నేను కాదు. దేవుడే అంతా నేనేమీ కాను అనడం.

347. నీవు దేవుని అధికంగా హత్తుకునే కొలది, ఆయన వాక్యానికి లోబడే కొలదీ స్థిరంగా నిలబడగలుగుతావు.

348. ధ్యానం అవసరం, అనుదినం పరిశుద్ధ పరచబడాలి. త్యాగం కూడా కావాలి, ఇది సిలువ వేయబడిన త్యాగ జీవితం.

349. "దేవుడు శక్తిమంతుడు, ఆయన సర్వశక్తి గలవాడు" అని వ్రాయబడి ఉండలేదా? ఆయన ఘనతలో ఈ రెండు సంపూర్ణతలున్నాయి.

350. ఓ నా స్నేహితులారా! "ప్రభువా నాకు ప్రార్థించడం" నేర్పు అని పదే పదే ప్రభువుని అడుగుదాం.

351. ఒకమాటలో చెప్పాలంటే పగలు, రాత్రి, నిరంతంరం ఆయనే ఇస్తున్నాను. ఇదో నిరంతరం సాక్ష్య ప్రవాహం.

352. ఆయన రక్తంలో కడుగబడిన ఏ పాపమైనా దేవుని యెదుట శాశ్వతంగా కొట్టివేయబడుతుంది.

353. చిన్న పిల్లలను యేసు నిర్లక్ష్యం చేయ్యలేదు. అంతే కాదు మిగిలిపోయిన రొట్టె ముక్కలను, చేపలను సహితం ఆయన నిర్లక్ష్యం చేయ్యలేదు.

354. ఆయన మచ్చలేని పరిశుద్ధుడు. దేవుని పరిశుద్ధతే ఆయనను భూమి మీదకు తెచ్చింది.

355. నేను క్రీస్తును తెలుసుకోవడంలో వివేకం, నేను దేవుని గురించి వెలిగించ బడటానికి నాలోకి ప్రవహించిన జీవం అవి నన్నెంతో ప్రకాశవంతంగా చేసాయి.

356. ఆచరించాలని తలంచేవి అవి ఏవైనా వాటిని క్రీస్తు యేసు అనే వ్యక్తిలో తెలుసుకోవటం గొప్ప ఆశీర్వాదం.

357. ఆయన నిజమైన దేవుడు. నిత్యజీవం. “చిన్న పిల్లల్లారా, విగ్రహాల నుండి మిమ్మల్ని దూరపర్చుకోండి”. మనకి దేవునికి మధ్య అడ్డు వచ్చేది ఏదైనా విగ్రహమే.

358. ఒక వ్యక్తి రొట్టె విరవడంలో పాలుపొంది, పలికిన మాటను నేనెన్నడు మచరచిపోలేను. “ఓ దేవా! మేమెంతో సంతోషిస్తున్నాం, దుఃఖం ఇక లేదని.

359. సత్యాన్ని గురించి తెలుపబడిన ప్రతి చిన్న సంగతి మనలో ఆరాధనను ఉత్పన్నం చేస్తుంది.

360. సత్య విషయమైన రెండు విషయాలు, దేవునిలోని సంతోషం, దేవుని చిత్తం చొప్పున దేవునిలోని జీవం.

361. నువ్వు దేవునికి సమీపంగా ఉంటే నీకు ఏది తప్పో అర్ధమౌతుంది, వచ్చే ప్రతి ఇబ్బంది నుండి నువ్వు తప్పించబడతావు.

362. ఇకపై నా పెదవులు, నా కలం ఆయన కీర్తినే వ్యాపింపజేస్తాయి.

363. క్రీస్తు యేసు యొక్క మహిమా సాక్ష్యం మన హృదయాల్లో ఉంటుంది. అందుకొరకే పరిశుద్ధాత్ముడు అనుగ్రమింపబడ్డాడు.

364. ఎక్కువ పరిచర్యలో ఉండడం అసూయలకు, చెడు మాట్లాడటానికి, అపార్ధాలకు తావులేకుండా, బేధాలకు దూరంగా ఉండటానికి కారణమౌతుంది.

365. ఒకానొకరోజు ఉమ్మి వేయబడిన ఆ ముఖం ఎదుట ఈ భూమి ఆకాశం కూడా ఎగిరిపోతాయి.

366. మనకు ముందుగా పరుగెత్తిన వానిలో మనం నిలబడటం, బ్యాంకులో మనకున్న డబ్బు లాంటిది.

367. ఈ సమయంలోనే నన్ను నేను నీకు సమర్పించుకుంటున్నాను. జీవంలో మరణంలో నీవానిగా ఉంటాను. సంపూర్తిగా నిరంతరం నీ కోసమే జీవిస్తాను.

368. ఒకవేళ మహిమాయుతంగా సత్యం బయలుపర్చబడితే నక్షత్రంలాగా నీ జీవితాన్ని ప్రకాశింపజేసేట్లు దానిని నీలో ప్రవేశింపనివ్వు.

369. ఈ పునరుత్థానం వలన నా తండ్రి, వారి తండ్రి అవుతాడని, నా దేవుడే వారి దేవుడౌతాడని చెప్పాడు.

370. తన సేవకులలో అల్పులైనవారు, ఈ లోకంలో ఘనులైనవారు ఎవరు ఆలక్ష్యం చేయ్యబడ్డారో, ఎవరు పొగడబడ్డారో, ఆయన కోసం వెర్రివారిగా పిలవబడిరో అట్టి జ్ఞానులైనవారి కోసం ఆయన రాబోతున్నాడు.

371. బైబిల్‌లో దేవుడు చూపిన దైవిక జ్ఞానం, తామే తెలివిగల వాళ్లమనుకునే వారి గర్వాన్ని సిగ్గుపరచింది, వారి తెలివితేటలు వట్టివని నిరూపించింది.

372. ప్రభువు ముందుకు వెళుతుంటే ఆయన సేవకుడు తప్పకుండా వెనువెంటే నడుస్తాడు.

373. క్రీస్తును ఎరుగుట అనే ఐశ్వర్యానికి మించి మరేదీ సంతోషం ఇవ్వలేదు.

374. గొర్రె కాపరిని వెదకదు, కాపరే గొర్రెను వెదుకుతాడు.

375. మేఘాలపైకి కొనిపోబడతాం, సదాకాలం ఆయనతో ఉంటాం. ప్రతి ఒక్కరం ఈ విషయం ధ్యానిద్దాం, అప్పుడు కష్టాల్లో ప్రత్యేకంగా మరణబాధలో ఆదరణను పొందుతాం.

376. నీ మేలుకోరే వారు ఎప్పుడూ నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటారు. నీకు కీడు కోరే వారు ఎప్పుడే పొగుడుతూనే నీ భజన చేస్తూనే ఉంటారు. నీ భజన చేసేవారి కంటే నిన్ను ప్రశ్నించిన వాడే నీకు నిజమైన స్నేహితుడు. నీ మేలుకోరి నీ స్నేహితుడు నిన్ను గాయం చేస్తాడు. బైబిల్ వచనం ఎంత నిజమో.

377. దేవుని వలననే యోసేపులో స్వచ్ఛత, మోషేలో సాత్వికత, యోబులో సహనం, సొలోమోనులో జ్ఞానం, మగ్ధలేని మరియలో అంకితభావం, పౌలులో త్యాగసహిత ప్రేమ పొందగలిగారు.

378. సాత్వికం అంటే బలం లేకపోవటం కాదు. బలం కంటే మించింది. అది దేవుని యొక్క సన్నిధి కలిగి ఉండటం.

379. జీవితం అనేది మనం నడిచే దారి లాంటిది. మనకు తోడుగా నడిచేవారు ఉంటారు గాని మనకు బదులుగా నడిచేవారుండరు. దేవుడు నిన్ను విడువడు, ఎడబాయడు.

380. చీకటి సమాధిలో కూడా ఆయన ప్రభువే. అక్కడ కూడా ఆయన ఒంటరివాడే. అక్కడ సైతం ఆయన మహిమను మనం వివేచించవచ్చు.

381. మొదటి ఆకాశం, మొదటి భూమి గతించిపోవటం. క్రొత్త ఆకాశం, క్రొత్త భూమి బయల్పర్చబడటం. ఎన్ని మార్పులు? కానీ ప్రభువైన యేసుక్రీస్తులో ఏ మార్పు లేదు.

382. ఆయనను వారు మరణించబోతున్న వ్యక్తిగా మాత్రమే చూశారు. అంతంలేని సమాధాన ప్రభుత్వాన్ని పరిపాలిస్తాడని ఎవరు ఊహించారు!

383. వీధి నా ఇల్లు, కరెంటు స్థంభం దీపం. అక్కడే నేను ధ్యానించాను. అవి నాకెంతో సంతోషకరమైన దినాలు.

384. ఆయనకు నమ్మకస్థునిగా ఉండు. ఎవ్వరూ చేయలేనంతగా ఆయన నీ కొరకు చేస్తారు.

385. మనం దేవునికి సమీపంగా జీవించే కొలదీ మరింతగా మనలో గల అవినీతిని, పాప స్వభావాన్ని చూడగల్గుతాం.

386. ప్రభువు మనలో జీవించాలి. మనలో ప్రతి స్పృహను, ప్రతి భాగాన్ని ఆయన ఆక్రమించించుకోవాలి.

387. ఆ బలిపీఠంపై అగ్నిమండుతూనే ఉండాలి, అది మండే జీవితం. ఒకే మరుగైన శక్తి యొక్క రహస్యం.

388. దైవిక శక్తి మానవ సానుభూతి నుండి విడిపించినా, మానవత్వం దాని పూర్తి నైజాన్ని చూపుతుంది.

389. ఆయన మన అలసట, ఆకలి, ప్రమాదం వద్ద సమీపంగాను, మన స్వార్ధం, ఉద్రేకాల వద్ద దూరంగాను ఉంటాడు.

390. ఆ మార్గంలో వారితో కలిసిన కొంచెం సేపటికే ఆయన వారిని గద్దించాడు. ఆయన మాటలు వారి హృదయాలను మండించాయి.

391. వడ్రంగి వాళ్ల అబ్బాయి పాండిత్యం నేర్చుకోకపోయినా, భాగ్యంతుడు కాకపోయినా ప్రజల మధ్య గొప్ప సంచలనం కలుగజేశాడు.

392. యేసు దోనెలో నిద్రించాడు. ఆయన మానవుడు యేసు. సముద్రాన్ని, గాలిని నిమ్మళపర్చాడు, ఆయన దేవుడు.

393. సిలువ కొరకు మునుపటి యుగాలన్నీ ఎదురు చూశాయి. రానున్న తరాలు వెనుదిరిగి చూశాయి. చరిత్ర శిఖరాగ్రంపై అది నిలిచింది.

394. క్రియాత్మకమైన, అనుభవ పూర్వకమైన పరిశుద్ధత లేకుండా "ఏ మానవుడైనా" సరే ప్రభువును చూడలేడు.

395. ప్రియ స్నేహితుడా అలసిపోయినప్పుడు భారంగా ఉన్నప్పుడు ఆయనను గురించి ఆలోచించు

396. మొదటి చిత్రం కేవలం జడత్వం, రెండవది విశ్రాంతి.

397. నిత్యత్వాన్ని గురించి ధ్యానించు, దాని యధార్ధతల కొసం ప్రార్థించు, కృప యొక్క మహోన్నత విషయాలను గురించి వెదకు, అప్పుడు నిత్యత్వానికి చెందినవానిగా ప్రవర్తిస్తావు.

398. సిలువ చేత దేవుని ఔన్నత్యం వెల్లడి అయ్యింది.

399. అబ్రహాము దేవుడు సర్వ శక్తిగలవాడు, మోషే దేవుడు ఉన్నవాడు, మార్పు చెందనివాడు.

400. క్రీస్తులో అంటుకట్టబడటం మన ఆధిక్యతను చూపుతుంది. అదే సమయంలో మన బాధ్యతను, ఆయనతో నిలకడగా నడవాలని చెబుతుంది.

401. బేతనీ మరియ కంటే ఏక హృదయంతో ఆయనను సేవించిన వారు, వాళ్లు సువార్తలో ఎవ్వరూ మనకు కనిపించరు.

402. విధేయత గల నమ్మకస్థుడైన శిష్యుడు "యేసు ఒక్కడే చాలు" అని ఆత్మ నిండిన స్వరంతో చెప్పగలడు.

403. స్నేహంలో ఏ దాపరికాలు ఉండవు. ఆయన చేతులకే మనలను మనం అప్పగించుకోవాలి. ఆయనే మనకు సన్నిహితుడు.

404. నన్ను మౌనంగా ఉంచిన అబద్ధపు నమ్రత నుండి, విలువ లేని గర్వం నుండి విడిపించుమని అడుగుతున్నాను.

405. నా నిమిత్తం సమస్తం అప్పగించిన ఆయనకు నన్ను నేను సమర్పించు కోవటం మినహా ఇంకేం చెయ్యగలను.

406. ఎవరి రథాలు మేఘాలో, ఎవరి కిరీటం నక్షత్రాలో అతడు పొత్తిగుడ్డలతో చుట్టబడి పశువులశాలలో ఉంచబడ్డాడు.

407. ఆయన నా కోసం మరణించాడు. నేనాయనను పొందటానికి ఆయన నాలో జీవిస్తున్నాడు. నేనాయనను నిరూపించటానికి నా ద్వారా చలిస్తున్నాడు.

408. నిరుత్సాహాల మధ్య సహనం, నిరీక్షణ గల వాళ్లంగాను, ప్రమాదం నడుమ ధైర్యంగాను, అలజడుల మధ్య నెమ్మదిగాను, యాంత్రికమైన పరిస్థితుల నడుమ, ఆహ్లాదం గల వాళ్లంగాను ఉంటాం. అప్పుడు ఎడారి గులాబీలాగా పుష్పిస్తుంది.

409. ఆహా! మనం ఇంకా కొన్ని అడుగుల దూరం మాత్రం ప్రయాణిస్తే ఈదగలిగేటంత లోతు. అది మన హృదయాలను నింపటం మాత్రమే కాదు. మనలో నుండి ప్రవహించి ఇతరులను కూడా నూతన పరుస్తుంది.

410. ఆయన సాత్వికంలో, నిర్దోషత్వం, నిష్కళంకస్థితి, పవిత్రత, సామాన్య జీవనశైలిలో నిజంగానే ఆయన "గొర్రెపిల్ల". ఆయన స్వభావంలో ఇసుమంతైనా మచ్చ కనిపించదు.

411. మనమెప్పుడైనా ఆలోచించామా? ఆయన ప్రేమకు కృతజ్ఞతా స్తుతి చెల్లించామా? అదెంత సరిపోతుంది?

412. నీతిమంతులనుగా తీర్చే పునరుత్థానం, అత్యున్నతమైన పరలోక విజ్ఞాపన, ప్రశస్థమైనవి.

413. ఆ ప్రకాశించే ఆత్మలలో కేవలం రెండే విభాగాలు – దేవదూతలు (ఎన్నడూ పాపం చెయ్యనివాళ్లు), అమూల్యమైన క్రీస్తురక్తంతో విమోచించబడిన పాపులు, ఎంత అద్భుత దృశ్యం!

414. పేదలు తమపై తాము ఆధారపడి జీవించలేరు. వాళ్లు ఇతరులపై ఆధారపడతారు, ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడతారు.

415. యేసు తానేమై ఉన్నాడో. తానేం చేసాడో పట్టించుకోడు కానీ తద్వారా క్రీస్తును సమున్నతపరుస్తున్నానో లేదో ఆలోచించండి.

416. కేవలం క్రీస్తు నందలి విశ్వాసం పాపంపై, సైతానుపై, నరకంపై, లోకంపై జయాన్నిస్తుంది.

417. సిలువపై వ్రేలాడింది, మరణించింది, తిరిగి లేచింది, ఆరోహణమైంది ఆత్మల కోసమే.

418. ఆత్మతో కలిసి ఆయన రాకడ కొరకు ఎదురు చూస్తూ "రమ్ము" అని భూమ్మీద చెప్పటం మనలను ఆయన పెండ్లిలో చూచుకోవటమే.

419. ఒకవేళ నా హృదయం బద్దలైతే మాత్రం నేను క్రీస్తును కలిగి ఉంటే నాకు అదెంత మాత్రం. ఏ తల్లీ తన బిడ్డను పట్టించుకోనంత ఆయన హృదయం మనలను పట్టించుకుంటుంది.

420. నీవు క్రీస్తుచే నింపబడితే నీ అంతరంగంలోకి ఆయనలో నుండి ఆశీర్వాదం కుమ్మరించబడటం చూస్తావు.

421. ఆయన ఉన్నట్లుగా ఆయనను చూస్తే ఆయన యందు నమ్మిక ఉంచకుండా ఉండగలవా?

422. ఆయన లేకుండా ఏమీ చేయలేననే అవగాహన ప్రశస్థమైనది.

423. రేపటిని గురించి నీ నిరీక్షణ ఏమిటి? ఆయనలా ఉండటమే నీ భవిష్యత్తు లక్ష్యమా?

424. “ఆయన సంపూర్ణత” అంతటా కుమ్మరించబడి ప్రతి హృదయాన్ని నింపుతుంటే దానితో ఏ కొదువ లేకుండా ప్రతి హృదయం నింపబడి, సంతృప్తి చెందుతుంటే భూమ్మీద పరలోకాన్ని మానవుడు రుచిచూస్తాడు.

425. క్రీస్తును వెంబడించే ప్రతి వ్యక్తి ఆయన కొరకు సాక్షిగా ఉండాలి.

426. ప్రతి మానవుని జీవితానికి సర్వశక్తిగల దేవునికి ఒక ప్రణాళిక ఉంది.

427. హృదయంలో క్రీస్తు ఉండాలి – చేతిలో బైబిలు వుండాలి.
ముఖంలో కాంతి ఉండాలి – మాటల్లో నిజము ఉండాలి.
చూపులో స్వచ్ఛత ఉండాలి – క్రియలలో యదార్ధత ఉండాలి.
పరిచర్యలో జాగ్రత్త ఉండాలి – పాటించుటలో ముందుండాలి.
ఈ నియమాలు పాటించగల్గిన వాడే నిజ క్రైస్తవుడు.

428. ఆత్మీయ జీవితాన్ని పతన స్థితికి చేర్చేది నిర్లక్ష్యము, అజాగ్రత్త, పొరపాట్లే నిర్యక్ష్యానికి కారణము. వాటికి భిన్నంగా చురుకుదనం కలిగి జాగ్రత్తతో పొరపాట్లు సవరించుకోవడం వల్ల విజయము వరిస్తుంది.

429. మనకున్నదాన్ని నిర్లక్ష్యం చేస్తూ లేనిదానికోసం ఆరాటపడుతూ ఉన్నంతకాలం సంతోషంగా ఉండలేం. ఉన్నదాన్ని సద్వినియోగం చేసుకుంటే సంతోషం మనసొంతం.

430. ఎవరు తలాంతులను వృద్ధి చేసుకునేందుకు నిర్విరామంగా కృషి చేస్తారో వారికి దేవుడు తలాంతులను ఇస్తాడు.

431. దేవుని తోటలో పూలు పూస్తాయి, రెట్టింపు కాదు ఏడంతలు పూలు పూస్తాయి. అవి నిరంతరం సువాసనను ఇస్తూనే ఉంటాయి.

432. మంచితనం మనవెంట ఉంటే మనం ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, మనం ఉన్నా లేకున్నా మన గురించి మంచిగా అనుకొనే వారు ఒకరైనా ఉంటారు. చెడు గురించి మాట్లాడుకోవటానికి వందమంది ఉన్నా ఒక్కరు మన గురించి మంచిగా మాట్లాడుకుంటే మన జీవితం ధన్యం.

433. ఎవరు ఆత్మలో రహస్యంగా దేవుని కుమారునిలోని యథార్థతలను ప్రతిరోజూ పరిశోధించి ఆచరిస్తారో వారు వాటి వలననే జీవిస్తారు.

434. ఆరాధించాలనే ఆశ విశ్వాసి జీవితంలో అవసరమైన అంశం.

435. ఆయనకు విధేయత చూపుటకు, ఆయనను కనుగొనుటకు ఇష్టపడాలి. అదే నీ సంతృప్తికి పరమావధి కావాలి.

436. పరలోకం మొదటిగా, చివరిగా ఏ ఆచ్ఛాదనాలేని ప్రభువు సన్నిధి.

437. నూనె లేని దీపానికి వెలుగుండదు. నీరు లేని బావి దాహము తీర్చలేదు. ప్రార్థన లేని జీవితానికి ఫలం లేదు. ఆరాధన లేని జీవితానికి ఉజ్జీవము ఉండదు.

438. నేను లేఖనాన్ని చదివేటప్పుడు నా హృదయం నాలో మండకపోతే యేసు వాగ్ధానాన్ని జ్ఞాపకం చేసుకుంటాను. "అడుగు ప్రతివానికి ఇవ్వబడును, వెదకు వానికి దొరకును, తట్టువానికి తియ్యబడును".

439. క్రైస్తవులు లోకానికి వెలుగైయున్నారు. వాళ్లు మండుచూ ప్రకాశించే దీపాలై యున్నారు.

440. దేవుడు ఆయన యందు బహుగా సంతోషించాడు. ఆయన ద్వారా మనయందు సంతోషిస్తున్నాడు.

441. క్రీస్తు ప్రేమ చేత నింపబడిన జీవితం ఎంతో సౌందర్యవంతమైనది.

442. యేసే నా సమస్త ఆహ్లాదం. ఆయన సేవ నా సమస్త ఆశ. ఆయనతో విశ్రాంతి నా నిరీక్షణ.

443. కోర్కెల వశం కావటం అన్ని పాపాలకు, బలహీనతలకు మూలం.

444. దేవుడు చెప్పేటప్పుడు దానిని వినకుండా నీ మనస్సాక్షి ఆటంకపర్చకుండా జాగ్రత్తపడు. నిన్ను గురించి ప్రజలు ఏమనుకున్నా పర్వాలేదు.

445. సువార్తలోని సత్యవాక్యాన్ని నేను ఒక దీన పాపికి వెల్లడిస్తే, పరిశుద్ధాత్మ తోడుగా ఉండి ఆ వాక్యాన్ని శక్తితో అతని అంతరంగంలో కార్యం జరిగిస్తే అతడు రక్షించబడతాడు.

446. ఆయన పని చేసేందుకు ఆయన కృప అవసరం. ప్రార్ధనా పూర్వకంగా ఆయన వాక్యం చదవటం అవసరం.

447. "ఆయనే నా నిరీక్షణ" ఈ లోకంలో ఉన్నదానంతటి కంటే అదే నాకెక్కువ.

448. శత్రువులు చిన్నవాళ్ళైనా, మోసం గొప్ప నష్టం కలిగిస్తుంది. చచ్చిన ఈగ చిన్నదే అయినా అత్తరు వాసనను పాడుచేస్తుంది.

449. నిన్నో సామాన్యమైన ప్రశ్నను అడగనివ్వు, మీలో ఎందరు హృదయంలో "ఈ రోజు ముగియకముందే యేసు ప్రభువు వచ్చెయ్యాలి" అని అనుకున్నారు?

450. మనం క్రీస్తును ఘనపర్చే కొలదీ పరిశుద్ధాత్మ పని చెయ్యటానికి సిద్ధంగా ఉంటాడు.

451. క్రీస్తు మీదే నీ కనుదృష్టి ఉంటే, నడిపింపు నీకెన్నడూ సమస్య కాదు.

452. ఉదయించే సూర్యుడు మనల్ని ఎలా మేల్కొల్పుతాడో.. అలాగే మనం కూడా మనకిష్టమైన వారిని ఆత్మీయంగా పలకరించే పిలుపే శుభోదయం.

453. ఆయన వ్యక్తిత్వం నీకు అర్థం కాకపోతే నీవు లోకం నుండి వేరు కాలేవు.

454. నేను నా స్వంత ఆప్యాయతల చేత నా హృదయాన్ని నింపుకోనా? ఆ తలంపే నాకు దూరమగును గాక!

455. మనసులో ఏది భావిస్తావో పెదాలు దానినే పల్కుతాయి. నోటికి ఏది వస్తే అది మాట్లాడే వాళ్ళతో దూరంగా ఉండడం మంచిది. ఎందుకంటే అటువంటి వారు ఎన్నాళ్ళబంధానైనా ఒక్క మాటతో తెంచి వేయగలరు.

456. మనం ఆయనలో నెమ్మది పొందితే, అన్ని పరిస్థితుల్లోను సడలని నిశ్చయతతో ఉంటాం.

457. క్రీస్తులోనే అన్నింటినీ మనం పొందగలం. ఆ గురి వద్దకే అన్ని ప్రవహిస్తాయి.

458. జీవితమంటే మనకోసం కాదు మన అనుకొనే వారి కోసం బ్రతకడం కూడా అవసరమే. ప్రేమంటే డబ్బు, అందము కాదు. ప్రేమంటే నమ్మకము. ఐశ్వర్య మంటే డబ్బు సంపాదించడం కాదు ఇతరుల నుండి ప్రేమాభిమానాలు సంపాదించుకోవడం. సంతృప్తి అంటే నచ్చినదాని కోసం వెంటబడడం కాదు. ఉన్నదానితో ఆనందించడం.

459. ఆయన మొదట దుఃఖాక్రాంతుడు కావాలి. అప్పుడు మనం పరలోక న్యాయసభలో ఆనంద గీతాలు పాడగలం.

460. ఒక చిన్న దాని నవ్వు ముందు ఆమె ప్రశ్నించిన చూపుడు వ్రేలి ముందు, ప్రజల హేళనల నడుమ, క్రీస్తు అనుచరుడు మళ్లీ అమ్మేశాడు.

461. ఆయనే మన సమస్త సంతోషం. మన సమస్త శాంతి. క్రీస్తునందే మనందరం ఆత్మీయంగా సమస్త ఆశీర్వాదాలను పొందుతాం.

462. ఎవరు యేసుక్రీస్తును స్వీకరిస్తారో వాళ్లు నిత్యజీవ వాగ్దానాన్ని పొందుతారు. మరియు నాశనం నుండి విమోచించబడతారు.

463. హవ్వకు కయీను, హేబేలును చంపిన తరువాత పాపం ఎంత నికృష్టమైనదో, మరణం ఎంత క్రూరమైనదో కొంత అర్థమై ఉంటుంది.

464. దేవుడు ప్రతివానిని పూర్తిగా ఎరిగినవాడు. ఏ మానవుడూ దేవుడ్ని మోసగించలేడు.

465. ఆరాధన విషయంలో బహు జాగ్రత్త అవసరం.

466. వినేవారు మారాలంటే వినువారి యెడల దేవుడే కృపను చూపాలి.

467. విశ్వాసి పరిశుద్ధాత్మునిపై ఆనుకునే కొలదీ పాపంపై జయాన్ని సొంతం చేసుకుంటాడు.

468. నువ్వు మాట్లాడుతుండగా వింటున్నవాడు ఆయనే. నువ్వు ఇతరులను గురించి మాట్లాడే ప్రతి మాట ఆయన చెవిలోనే చెబుతున్నావు.

469. అన్నీ చేరేది చివరికి ఈ సమాధి సమీపానికే.

470. సంఘ నిర్మాణంలో ఏక మనస్సు లేకపోవటం అపవాదికి చోటివ్వటమే.

471. ఒకని పరిచర్యకు వెలగట్టి ప్రతిఫలం ఇవ్వగలవాడు ఆయనే.

472. "మీరు మోసపోకుండా చూచుకొనుడి" అని ప్రభువు హెచ్చరించారు. ఈ హెచ్చరికను మనం హృదయపూర్వకంగా అంగీకరించాలి.

473. లోక మహిమ వ్యర్థం. కేవలం ఆవిరి, నీటిపై నురుగు యొక్క నీడలాంటిది లేదా ఇంకా తక్కువైనది ఏమీ లేనిది.

474. నీకు, మహిమకు మధ్య ఇంకేమీ ప్రవేశించకుండా తృప్తి కలిగి ఆయనతో ఉండు. ఆయన చేతిని గట్టిగా పట్టుకో, ఆయనను పట్టుకోమని అడుగు.

## క్రీస్తు అందరికీ మధుర హృదయ వైద్యుడు

475. పొలానికి తెగులు సోకితే పంట పాడౌతుంది. హృదయానికి దిగులు సోకితే శరీరము పాడౌతుంది. తెగులైనా, దిగులైనా తొలగించగలవారు యేసుప్రభువు.

476. కొన్ని వ్యాధులకు కొన్ని మందులు జీవితాంతం వాడాలి. మందులు మానేస్తే వ్యాధి తిరిగి వస్తుంది. సమస్త జ్ఞానమునకు మించిన దేవుని ప్రేమ పొందగలిగితే పరిపూర్ణమైన స్వస్థత లభిస్తుంది.

477. మన జీవితాలలో నేర్చుకోవలసినది ఉన్న దానితో సంతృప్తి పడటం. జీవితానుభవాలను సరిచేసుకొంటూ ఉండాలి. మనలో మనమే పరీక్షించుకొని ఆయాసకరమైన మార్గముంటే సరిచేసుకోవాలి. దావీదు భక్తుడు ఆ రీతిగా ఆలోచించి ఉన్నత స్థాయికి చేరాడు.

478. ఈ లోక ప్రేమ ఒకసారి ప్రేమిస్తుంది ఒకసారి విడిచిపెడుతుంది... కానీ "యేసు" ప్రేమ మాత్రం ఎన్నటికీ విడిచిపెట్టదు ఎన్నటికీ మారదు... ఎందుకో తెలుసా... శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను. అని ఆయనే మాట్లాడుచున్నాడు.. నిన్ను వీడని ప్రేమ అంటే ఈ ప్రపంచంలో ఒక్క "యేసు" ప్రేమ మాత్రమే.

479. క్రీస్తు ఎంతో మధురమైన హృదయంగల ప్రేమ వైద్యుడు. ఆయన ఆసాంతం దయచేత నిండినవాడు. గుండె చెదిరిన వారిని బాగుచేసేవాడు. కీర్తన 147:3 రోగి యొక్క ప్రతి మూల్గు ఆ వైద్యుని గుండెలోకి చొచ్చుకొని వెళ్తుంది. క్రీస్తు ఔదార్యం గల వైద్యుడు. అందరు రోగులు తమ వైద్యున్ని ఐశ్వర్యవంతునిగా చేస్తే, ఈ వైద్యుడు తన రోగులను ఐశ్వర్యవంతులనుగా చేస్తాడు. బాగు పడిన రోగి తన వైద్యుని మెచ్చుకొంటాడు. సన్మానిస్తాడు గాని క్రీస్తు రోగికి ఆరోగ్యం మాత్రమే కాదు పరలోకం కూడా ఇస్తాడు.

480. పట్టు వడికేటప్పుడు పట్టు పురుగు దాగివున్నట్లు మనం కూడా గర్వానికి, వ్యర్థమైన వాటికి దాగి వుండాలి. శ్రమలన్ని మన మంచి కొరకే. అవి మనలను క్రీస్తుకు చెందేట్లు చేస్తాయి.

481. మనపై శ్రమలకాడిని క్రీస్తు మోపితే, ఆయన హస్తం మనపై వుంటుందని మరచిపోవద్దు.

482. తుఫానులు మనల్ని త్వరగా ఇంటికి చేరుస్తాయి. కానీ ఆ తుఫానులే ఆయనను మన ఇల్లు కనుగొనేట్లు చేస్తాయి.

483. ఈ భూమ్మీద శ్రమలు అవి ఎంతటివైనా ప్రభువు వాటికి మించి మన మనుగడను భద్రపరుస్తాడు.

484. దేవుడు దర్శనమిస్తే ధనవంతుడుగా చేయమంటాడు బుద్ధిహీనుడు. ప్రశాంతమైన జీవితమిమ్మంటాడు జ్ఞానవంతుడు.

485. దినచర్య మధ్యలో తరచూ కన్నులు పైకెత్తి తండ్రి ఇదేనా నీ ప్రణాళిక అని అడుగు. రాత్రివేళ మౌనంగా వుండి దేవుని ఆలోచనతో దినచర్యను సరిపోల్చుకో.

486. క్రీస్తు సాక్ష్యాన్ని మనలో నిలుపుకోవడం, నీవు ఎక్కడికి వెళ్ళినా నీతో ఆయనను రమ్మని అడగటం. వెళ్ళేటప్పుడు ఆశీర్వదంచమని ప్రార్ధించటం, సమస్తం ఆయన మహిమ కొరకు పనిచేయటం.

487. ఆవేశం కన్నా ఆలోచన గొప్పది. ఉన్న పరిస్థితులు మారవు పరివర్తన మనలో రావాలి.

488. విశ్వాసంతో నీ అనుదిన భాగంలో ఇవ్వబడిన వాగ్ధానాలను సర్వం స్వతంత్రించుకో ప్రభువే దినదినం నీకు బోధించడం నువ్వు కనుగొంటావు.

489. ఆయన స్థలం లేనివాడిగా జన్మించాడు. పశువుల తొట్టెలో పెట్టబడ్డాడు. ఈ లోక సంబంధమైన ఏ ఆడంబరంలో ఆయన జన్మించలేదు.

490. కొన్నిసార్లు మన హృదయంలోని బాధతో మూల్గడం కూడా ప్రార్దన అవుతుంది.

491. చాలామంది కేవలం బోధకులపైన ఆధారపడతారు. అనేక కూడికలకు హాజరౌతారు. కానీ వాళ్ళందరు హృదయంలో క్రీస్తుకు ప్రధమ స్థానాన్ని ఇవ్వలేరు. ఇదే మనకున్న ప్రమాదం.

492. యేసు జీవితం వెలిగే క్రొవ్వొత్తి వంటిది. దేవుని గృహంలో అదో దీపం.

493. యేసు దోనెలో నిద్రించాడు. అప్పుడు ఆయన మానవుడు. యేసు సముద్రాన్ని, గాలిని నిమ్మళపరిచాడు అప్పుడు ఆయన దేవుడు.

494. మన ప్రభువు రక్తం చిందించి తనను తాను అర్పించుకొని మరణించాడు. పశ్చాత్తాపడి విశ్వాసముంచిన పాపి పరిశుద్ధపర్చబడి సంపూర్ణుడయ్యాడు.

495. క్రీస్తు పునరుత్థానికి ప్రేక్షకులెవరు లేరు. ఈ సృష్టిలో సమస్తం దేవుని నోటి మాట వలన జరిగిందని గ్రహించగలం.

496. ఒకనిలో గొప్పతనం ఉంటే, అతని గూర్చి ఇతరులు చెప్పుకొంటుంటారు. తనలో గబ్బుతనమున్నవాడు తన గురించి తానే గొప్పలు చెప్పుకొంటుంటాడు.

497. మానవునిలో పాపంపై క్రీస్తు జయం అనేది దేవుని అనంత ప్రణాళికలోని భాగం. అది అన్నింటినీ క్రీస్తుకు లోబరిచే ఆరంభం.

498. ఆత్మ ద్వారా మనం ఆయన తలంపుల్లోకి ప్రవేశించగలం.

499. నువ్వు సముద్రపు ఒడ్డున నిలబడితే ఇసుకలో రాళ్ళలో లోతైన రంధ్రాలు కనిపిస్తాయి. కానీ కెరటం రాగానే అవన్నీ పూడిపోతాయి. క్రీస్తు వైపు చూడు ఆయనలో కృపా కెరటం నీలోని ప్రతి బీటను ఆసాంతం పూడ్చేస్తుంది.

500. ప్రభువు నుండి వచ్చే ఒక చిన్న మాట సెలయేరై నిన్ను సేద దీరుస్తుంది. నష్టాలలో ఆయన సేవలో గుండు సూది నువ్వు నష్టపోయినా ముత్యమంత లాభం ఉంటుంది.

501. ప్రతి విశ్వాసికి అత్యవసరమైన వనరులేవనగా గంటల తరబడి ప్రార్థించే అనుభవం. నిరంతర లేఖన పఠనము. చాలినంత అనుదిన ధ్యానము, ఆత్మీయ తలంపుల అభ్యాసం అని గ్రహించాలి.

502. ఎవరిని దేవుని సేవలో నడిపిస్తాడో వారిలో ఆయన కనిపిస్తాడు. గతంలో దేవునితో నడచిన వారి అడుగు జాడలు ఆయన పోలికలను అద్దంలో చూస్తున్న మనకు మసగ్గా కాక ఆయన రూపాన్ని మన జీవితాలలో స్పష్టంగా కనిపించే రీతిగా చేయుట దేవునికే సాధ్యము.
"అందుకే మీకు దేవుని వాక్యాన్ని బోధించి మీపైని అధికారులుగా ఉన్న వారిని జ్ఞాపకము చేసుకొని వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకొనుచూ వారి విశ్వాసమునునుసరించుడి" హెబ్రీ 13:7 రూపాంతరము అనుభవం ద్వారా పొందగలము.

503. మంచి విశ్వాసులు తమ కుటుంబం కోసం, తమ గ్రామం కోసం, తమ రక్త సంబంధుల కోసం ప్రార్థించడం దేవుడు వారిలో ఉంచిన విజ్ఞాపన ప్రార్థనయే.

504. క్రైస్తవ జీవిత సౌరభము ప్రతి విశ్వాసి జీవితంలోను సత్యం కోసం, సత్యంపైన నిలబడడం. తన వారినే కాదు తన చుట్టు ఉన్నవారిని కూడా ప్రభావితం చేస్తుంది. మీరు లోకానికి ఉప్పుగా రుచినిస్తారని క్రీస్తు చెప్పారు.

505. అక్షరాలు జ్ఞానాభ్యాసం చేయడానికి లేదా అజ్ఞానం పారద్రోలడానికి పరికరాలు.

506. దున్నువాడొకడు, విత్తువాడొకడు అను మాట యధార్థము. ఎవరి పనిలో వారు ఆయన చిత్తం ప్రకారము పరలోక రాజ్య వ్యాప్తి కొరకు పని చేస్తూనే ఉంటారు. ఎవరి చేతనో హృదయ క్షేత్రాలు సిద్ధం చేయించే ప్రభువు, వెరెవరి చేతనో విత్తనాలు నాటిస్తారు. పరలోకపు యజమాని పని అదే.

507. ఇతరులను చులకన దృష్టితో చూచే వారికి ఇతరులతో శ్రేష్ఠత కనిపించి ననూ అంగీకరించుటకు అహం ఒప్పుకోదు. ఇతరులలో మంచి చూడ గలుగుటకు, ఒప్పుకొనుటకు చాలా పెద్ద మనస్సు అనగా విశాలమైన మనస్సు కావాలి.

508. దేవునియందు విశ్వాసముంచువాడు సిగ్గుపడడు. కలవరపడడు. వారికి యేమేలు కొదువ యుండదు.

509. మారుమనస్సుకు తగిన ఫలాలు కనిపిస్తే లోకానికి విశ్వాసిలో ప్రభువు కనిపిస్తారు. సాత్వికము ఎముకలను నలుగగొట్టు సుత్తి మాత్రమే కాదు, మారుమనస్సుకు కలిగే ఫలం. వారే ఈ లోకం స్వతంత్రించుకొందురు.

510. **వినయశీలి యోసేపు జీవితంలో 5 విషయములు**

1. యెహోవాయందు నమ్మికవుంచాడు.
2. యధార్థంగా ప్రవర్తించాడు.
3. నమ్మకంగా విశ్వాసంతో ప్రార్థన చేశాడు.
4. ప్రభువు చిత్తం తెలిసికొని జీవిత పాఠాలు నేర్చుకున్నాడు.
5. వాక్యం ధ్యానించి భయభక్తులను బట్టి బహు ధైర్యంగా జీవించి జీవితంలో ఫలించెడు కొమ్మగా వర్ధిల్లాడు.

**ప్రార్థనే శోధనకు శ్రేష్ఠమైన విరుగుడు.**

511. ఒక్కొక్క భక్తునికి ఒక్కొక్క ప్రార్థనానుభవం ఉంటుంది. ప్రార్థనలో సంతృప్తినిచ్చే అనుభవం దేవుని సన్నిధి.

512. ప్రార్థన దేవునికి ఇంపైన పరిమళమిచ్చే ధూపము. ప్రార్థన గూర్చిన అవగాహన గాఢమైనదిగా ఉండాలి. సైతానుకు ప్రసంగీకులంటే భయంలేదు గానీ ప్రార్థించేవారిని చూస్తే వణకుతాడు. ప్రార్థన సైతానుకు కొరడా వంటిది. ప్రార్థన విశ్వాసికి ప్రాణవాయువు. అది జీవితానికి సారమిస్తుంది.

513. నీ చేతిని దేవుని చేతికి అప్పగించుట ప్రార్థన.

514. మార్గం అంధకారంగా ఉంటే నడిపించేది ప్రార్థన.

515. అర్థంకాని విషయాలన్నీ వివరించమని అర్థించుచు దేవునిపై ఆధారపడుట ప్రార్థన.

516. జీవితంలో సంభవించే క్లిష్ట పరిస్థితులలో ధైర్యము స్థిరత్వము కొరకు దేవుని పాదాల చెంత కనిపెట్టుట ప్రార్థన.

517. హృదయం అల్లకల్లోలంలో ఉన్నప్పుడు స్థిరతనిచ్చేది ప్రార్థన.

518. జీవితపు గడ్డు సమస్యలలో దేవుని తీర్మానాన్ని నీవు అంగీకరించుటయే ప్రార్థన.

519. జీవితంలో ప్రతి విషయంలో దేవుని నమ్మడమే ప్రార్థన.

520. దేవునితో పరస్పర సహవాసం ప్రార్థన.

521. సంతుష్టిని పొందెందుకు ఆత్మీయ తృష్ణను తీర్చే స్థలము ప్రార్థన.

522. దైవాత్మలో మన ఆత్మను ఉన్నతమైన విధంగా శ్రేష్టమైన విధంగా ఐక్యపర్చు కొనుట ప్రార్థన.

523. నీ స్వచిత్తమును దేవుని చిత్తమునకు అప్పగించుకొనుట ప్రార్థన.

524. దేవునితో స్నేహసంబంధ మూలముగా కలిగే ఆనందము ప్రార్థన.

525. శోధన నుండి తప్పించుకొనుటకు మెళకువగా నుండుటయే ప్రార్థన.

526. పరిశుద్ధమైన దేవుని సన్నిధిలో నీ పాపము గ్రహించి దానిని విసర్జించి నీ జీవితం దేవుని దృష్టిలో సరిచేసుకొనుట ప్రార్థన.

527. ఆత్మల రక్షణకై సేవ ఫలించుటకై దేవుని సహాయము కోరేది ప్రార్థన.

528. ప్రతి అక్కరను దేవునిని అడిగి పొందుట ప్రార్థన.

529. వాక్యం, ధ్యానం, ఈ రెండు చాలా అవసరం. వాక్య పరిశోధన ఇది మెదడు యొక్క పని. ధ్యానం మనస్సు యొక్క పని. మొదటిది బంగారు గనిని వెదకడం వంటిదైతే, రెండవది ఆ బంగారాన్ని త్రవ్వడం లాంటిది. పరిశోధన అనేది శీతాకాలపు సూర్యుడు లాంటిది. ఇందులో వేడి తక్కువగా వుంటుంది. ధ్యానం ఆ మనిషిని పరిశుద్ధ చట్రంలో ఇమిడేట్టు చేస్తుంది. గుండె మంచుగడ్డలా అయిపోతే ఇది కరిగిస్తుంది. ప్రేమ కన్నీటి బిందువవుతుంది. దేవునితో మాట్లాడే శ్రేష్ట సమయం ప్రభువు తలుపు తట్టి ఆయనను లోపలికి ఆహ్వానించేది. రోజు మొదటి జామున నీ హృదయాన్ని పరలోకము వైపు తెరుచుకోనివ్వు. మిగిలిన రోజంతా ఆ హృదయం శ్రేష్టంగా వుంటుంది. ఉదయకాలమే తన హృదయాన్ని లోకంలో పోగొట్టుకున్నవాడు రోజంతటిలో దాన్ని కనుగొనడం కష్టమవుతుంది. ఓ క్రైస్తవుడా నీ ఉదయకాల ధ్యానం దేవునిపై వుండనివ్వు. నీ హృదయం మండేంత వరకు ప్రార్థించు.

530. కీడు చేసి శ్రమ అనుభవించుట కంటే మేలు చేసి శ్రమ అనుభవించుట మేలు. తప్పు చేసి క్షమాపణ చెప్పడం కంటే అపార్థం చేసుకున్న వానికి క్షమాపణ చెప్పుట మేలు.

531. వాక్యాహారము ఎట్టి తృప్తినిస్తుందంటే వర్షం కురిసి ఎన్నాళ్ళో అయి ఎండి పోతున్న చెట్లకు నీటివాసన తగిలినట్లు, తొలకరివాన ప్రవాహమై దప్పికను తీర్చి సంతృప్తి పర్చినట్లు అంతరంగంలో వాక్య శక్తి తృప్తిని ఇస్తుంది.

532. దేవుని యెదుట పరీక్ష నిరూపించుకునేందుకు ఓర్పుతో సహనంతో ఎదురు చూడాలి.

533. ఎన్నిక లేనివారిని వాడుకోగలడని నిరాకరించబడిన గిద్యోనును ఆహ్వానించి నాయకత్వాన్ని అప్పగించినట్లు దేవుడు నమ్మదగినవాడు.

"పవిత్రతోను, జ్ఞానముతోను, దీర్ఘ శాంతముతోను, దయతోను, పరిశుద్ధాత్మ వలన నిష్కపటమైన ప్రేమతోను, సత్య వాక్యము చెప్పుట వలనను, దేవుని బలము వలనను, కుడి యెడమల నీతి ఆయుధము కలిగి ఘనత వలనను సుకీర్తి, దుష్కీర్తి వలనను దేవుని పరిచారకులమై యుండి" అని వ్రాసారు. కొన్ని చోట్ల ఎదురింపులు తిరస్కారాలు మాత్రమే కాదు మరి కొన్ని చోట్ల ఆదరణ, గౌరవాలు కూడ దేవుని సేవలో లభిస్తాయి. వీటికంటే వాక్యంతో కడుపునిండిపోతుందనే భావన విశ్వాసికి రావాలి.

534. దావీదు గొర్రెలు కాచుకునే వ్యక్తిగా జీవించగా రాజు అవుతాడని కలలో కూడ ఊహించుకోలేదు.

535. రూతు యవ్వనంలో విధవరాలయింది. అత్తతో పొలములో పరిగె ఏరుతూ తన జీవితం ధనికుడైన బోయజుతో వివాహము, క్రీస్తు వంశావళిలో స్థానం ఉంటుందని ఊహించలేదు.

536. ప్రతి వ్యక్తి జీవితంలో మలుపు ఉంటుంది. ఏదో ఒకనాడు దైవ వాక్యం చేత పోషించబడి ప్రతిభ గల వాడిగా తీర్చిదిద్ది అతని శ్రమలు, ఇరుకులు ఇబ్బందుల గుండా మెరుగు పెట్టి ప్రకాశవంతంగా చేయగలడు. కొండ మీద కట్టబడిన పట్టణం వలె మార్చగలడు. దేవుడు తన సమయమంతా తన ప్రణాళిక చొప్పున ఆ కార్యాన్ని తప్పక చేయగలడు. దీప స్తంభముపై పెట్టబడిన వ్యక్తికే కాదు చూచువారికి కూడ ఆశ్చర్యం కలిగిస్తుంది.

537. ప్రభువును ఎరిగినవాడి కంటె ఎక్కువ బలవంతుడు ఉండడు. ప్రభువుపై ఆనుకునే వానికంటే జయవంతుడుండడు. ప్రభువుతో నేనే జీవము అనువ్యక్తి కంటే ఐశ్వర్యవంతుడు మరొకడుండడు.

538. మారుమనస్సు పొందిన వ్యక్తి సాక్ష్యం కలిగి జీవించాలి. కన్నీటి విజ్ఞాపనలు చేయాలి. సంఘంలో క్రమంగా ఉండి సహవాసం చేయాలి. అప్పుడే తనకు కలిగిన దానితో సంతృప్తిగా జీవించగలడు. శాంతితో జీవిస్తాడు.

539. రక్షణ అనే పరలోక సౌరభం ఎక్కడైన ఒకే రీతిగా గుభాలిస్తుంది. సేవకు వ్యక్తులను తర్ఫీదు చేయడం చిన్న సంగతి కాదు. సేవ కాలేజిలో మాత్రమే బోధించుట కాదు. జీవించడం అనేది అత్యంత ప్రాముఖ్యమైనది.

540. నేను అనేమాట మన ఆత్మీయ జీవితంలో వినబడకూడదు. దేవుని ద్రాక్ష తోటలో ఎందరో నిర్విరామంగా పని చేస్తూనే ఉంటారు. వారి ఐక్యత వారి సంస్కారానికి చెందింది. ఎదుటివారిలోని మంచితనాన్ని శ్రేష్టతను అంగీకరించడం క్రీస్తు యేసు యొక్క మనస్సు.

541. క్రైస్తవునికి ప్రార్ధన ఊపిరి వంటిది. భౌతిక, ఆత్మీయ అభివృద్ధికి, సంఘ అభివృద్ధికి, ఆత్మల రక్షణకు, ఉజ్జీవమునకు ప్రార్ధనయే ఆధారము. ప్రపంచంలో ఉజ్జీవాలన్ని ప్రార్ధన ద్వారా లభించాయి.

542. ప్రార్ధన అనగా దేవునితో సంభాషించుట, దేవుని మాట వినుట. చార్లెస్ స్పర్జన్ మాటలలో "నిజమైన ప్రార్ధన అనగా మానవాత్మ, పరిశుద్ధాత్మ సహాయంతో దేవుని కృపాసనం వద్దకు వెళ్ళడము.

543. ప్రార్ధన అనగా మాటల్లోనూ మౌనములోను వ్యక్తమయ్యే ఆత్మలోని తృష్ణ. ప్రార్ధన నివురుగప్పిన నిప్పువలె ఉంటూ. నిత్యము దహింపచేసేది ప్రార్ధన.

544. ప్రార్ధన ఒక హృదయ అభిలాష. అది భాషకు అందనిది. గుండెలను కదిలించే అజ్ఞాత అగ్ని జ్వాల ప్రార్ధన.

545. ప్రార్ధన అనగా దేవునిలో గాఢంగా మమేకమవుట. ఈ భూమిలో సాధించ గలిగిన అంతిమ మహా విజయము హృదయ మంతటితో, బలమంతటితో ప్రార్థించడము.

546. క్రైస్తవునికి పరిశుద్ధాత్ముడు ప్రార్ధనలో మంచి సహాయకుడు.

547. మనకున్న అన్ని ఆధిక్యతలలోను అత్యున్నతమైనది ప్రార్ధన

548. ప్రార్థన అనేది మనకున్న బాధ్యతలన్నిటిలోనికి అతి గంభీరమైనది. మన చేతులలో ఉన్న మహోన్నత శక్తి ప్రార్థన.

549. ప్రార్థన అనేది దేవుని ధన నిధి. పరలోక తలుపు తెరిచే తాళపు చెవి. మనము యేసు నామములో తండ్రియైన దేవునికి ప్రార్థించాలి.
యోహాను 14:13, 16, 23 యాకోబు 1:5

550. మనము ఎందుకు ప్రార్థించవలెననగా దేవునితో సహవాసము కొరకు. పరిశుద్ధముగా జీవించుటకు పాప క్షమాపణ కొరకు. పాపములో పడకుండా దేవుని కృపను పొందుటకు. ఇతరుల ఆత్మల రక్షణకై మనము ప్రార్థించాలి.

551. **ప్రార్థనలో ఏ సమయాలలో ఏ రిఫరిన్సులు చదవాలి?**

ప్రేమకై ఆశిస్తూ చేదైన అనుభవాలతో ఉన్నప్పుడు – **1కొరింథీ 13**

సంతోషకరమైన హృదయము కొరకు – **కొలొస్సీ. 3:12**

నిరాశలో ఉన్నప్పుడు – **రోమా 8:31**

క్రైస్తవ్యము అర్థము చేసుకొనుటకు – **2కొరింథీ 5:15–19**

శాంతి సమాధానముల కొరకు – **మత్తయి 11:28**

క్రీస్తునందు గట్టి నమ్మకము కొరకు – **రోమా 8:1–31**

పనిలో ధైర్యము అవసరమైనపుడు – **యెహోషువ 1వ అధ్యాయం**

నిరూత్సాహములో ఉన్నప్పుడు – **కీర్తనలు 27**

ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నప్పుడు – **కీర్తనలు 37**

పనిలో నిరూత్సాహము కలిగినపుడు – **కీర్తనలు 126**

భయములో ఉన్నప్పుడు – **కీర్తనలు 34:7**

దేవుడు నీకు తోడైయున్నాడని నిశ్చయత కొరకు – **కీర్తనలు 145:18**

ఏకాంతములో ఒంటరిగా ఉన్నప్పుడు – **మత్తయి 6:6 యెహె 3:22**

ప్రతివారి స్వంత గృహములో – **అపో. 12:12**

అందరూ కలిసి ప్రార్థించే మందిరములో – **అపో. 4:31**

గుంపులో ప్రార్థించేటపుడు – **అపో. 1:14**

552. **ప్రార్థనలో వేడుకునే అంశాలు**

దేవుని జ్ఞానమును బట్టి అడగాలి – **మత్తయి 6:18**

దేవుని చిత్తములో అడగాలి – **లూకా 11:11–13**

**553. మన ప్రార్థనలో ఏమి ఉండాలి**

మన పాపములు, బలహీనతలు ఒప్పుకోలు ఉండాలి. తలంపులోను, మాటలోను, క్రియలోను గత పాపములను ఒప్పుకోవాలి. కీర్తనలు 32:5, కీర్తనలు 51, యోహాను 1:9

చేసిన పాపాలు మరలా చేయకుండుటకు జాగ్రత్త వహించాలి. కీర్తనలు 119:112, నెహెమ్యా 10:29

కృతజ్ఞత స్తుతి చెల్లించుట ఉండాలి. దేవుడు చేసిన మేళ్ళను తలంచి స్తుతించాలి. ఆయన దివ్య లక్షణాలను తలపోసి స్తుతించాలి.

మన అవసరతలు, కోరికలన్నీ చెప్పుకొని అడగాలి. యోహాను 14:14

దేవుని ఆత్మ నడిపింపు కొరకు ప్రార్థన చేయాలి. ఓర్పుతో కనిపెట్టాలి. కీర్తన 37:7, యెష 40:31

**554. మనం ప్రార్థించుట ద్వారా వచ్చు ఫలితాలున్నాయి.**

ఎ. ప్రార్థన ద్వారా మనము దేవుని స్వరము వినగలము.

బి. మన హృదయ తలంపులు దేవుని హృదయంతో ఏకీభవిస్తాయి.

**555. ప్రార్థించుట వలన వచ్చే ఫలితాలు**

ఎ. ప్రార్థన ద్వారా దేవుని స్వరము వినగలము

బి. మన శారీరక, మానసిక ఆధ్యాత్మిక అవసరతలు తీరతాయి. హృదయము తేలిక అవుతుంది.

సి. పాపాలు క్షమించబడి ఆధ్యాత్మిక బలము పొందగలము, సైతాను శోధనలను జయించగలము, దేవుని చిత్తము తెలిసి కొనగలము. యోహను 8:29

డి. ఆధ్యాత్మిక మర్మములను, గూఢమైన సంగతులను గ్రహించగలము. యిర్మియా 33:3

ఎఫ్. ప్రార్థన ద్వారా దేవుని వాగ్ధానాలు నమ్మి ఆదరణ పొంది రూపాంతరము చెందగలము.

జి. ప్రార్థన ద్వారా ఎట్టి సమస్యలైననూ పరిష్కరించబడును. క్రమము, మర్యాద, చురుకుదనము, శుద్ధి, విశ్వాసము, ధైర్యము, పవిత్రత, ఐక్యత, ప్రేమ, నీతి, భక్తి అలవడును.

556. ప్రార్థన చేయునపుడు విస్తరించిన మాటలు వాడరాదు.మత్తయి 6:7 హృదయములో పాపము ఉంచుకొనరాదు. కీర్తనలు 66:19

అవిశ్వాసముతో కాక, పరిసయ్యుడి వలె కాక ధీర్ఘ ప్రార్థనలు చేయరాదు మార్కు 1:24, లూకా 18:11, మార్కు 12:38-40

557. **ప్రార్థనకు జవాబు లభించకపోవుటకు కారణాలేమనగా**

ఒప్పుకొనని పాపము **కీర్తనలు 66:18**

వేషధారణతో ప్రార్థించుట **మత్తయి 6:5**

అపనమ్మకముతో ప్రార్థించుట **యాకోబు 1:5, 6**

అభ్యంతరములు గల ప్రార్థన **1పేతురు 3:7**

గర్వముతో కూడిన ప్రార్థన **లూకా 18:10-14**

558. **బైబిలులో కొన్ని ప్రార్థనలు :**

ఎ) ఏలియా చేసిన ప్రార్థన 1రాజులు 17:20,21

బి) శతాధిపతి సేవకుని కొరకు చేసిన ప్రార్థన మత్తయి 8:59

సి) క్రీస్తు అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని బాగుచేసినపుడు అతడు స్వయంగా చేసిన ప్రార్థన. మత్తయి 9:18

డి) ఇశ్రాయేలీయులు స్వయంగా విడిపించమని చేసిన ప్రార్థన. న్యాయాధి 1:1

559. **బైబిలులోని క్లుప్త ప్రార్థనలు :**

1) **సుంకరి ప్రార్థన –** “ప్రభువా నన్ను కరుణించుము” లూకా 18:13

2) **పేతురు ప్రార్థన –** “ప్రభువా నన్ను రక్షించుము” మత్తయి 14:30

3) **కుష్టురోగి ప్రార్థన –** “ప్రభువా నన్ను శుద్ధునిగా చేయుము” మత్త 8:2

4) **దావీదు ప్రార్థన –** “ప్రభువా నన్ను పరిశోధించుము” కీర్తన 139:23

5) **దావీదు ప్రార్థన –** “ప్రభువా నన్ను కడుగుము” కీర్తన 51:2

6) **సమూయేలు ప్రార్థన –** “ప్రభువా ఆజ్ఞ ఇమ్ము నీ దాసుడు ఆలకించును” 1సమూయేలు 3:10

7) **మనోహ ప్రార్థన –** “ప్రభువా మాకు నేర్పించుము” లూకా 11:1

8) **కనాను స్త్రీ ప్రార్థన –** “ప్రభువా నాకు సహాయము చేయుము” మత్తయి 15:25

9) **సమ్సోను ప్రార్థన –** “ప్రభువా నన్ను బలపరచుము” న్యాయా 16:16

10) **సిలువపై దొంగ** – "యేసూ నన్ను జ్ఞాపకము చేసుకొనుము"

లూకా 23:42

11) **మోషే ప్రార్థన** – "ప్రభువా, నీ మహిమ నాకు చూపుము" నిర్గమ33:18

12) **పౌలు ప్రార్థన** – "ప్రభువా నేనేమి చేయవలెను" అపొ 22:10

13) **యెషయా ప్రార్థన** – "ప్రభువా నన్ను పంపుము" యెష 6:8

14) **అందరం చేయవలసిన ప్రార్థన** – "పాపినైన నన్ను కరుణించుము"

560. **ప్రార్థన ఎట్టి ఫలితాలను ఇస్తుంది :**

1) ప్రార్థన ఒక వ్యక్తిని సరిచేస్తుంది.

2) ప్రార్థన జ్ఞానము ఇస్తుంది.

3) ప్రార్థన సమస్యలకు పరిష్కారము ఇస్తుంది.

4) ప్రార్థన ప్రతి అవసరాన్ని తీర్చగలదు.

5) ప్రార్థన ఫలభరితమైన జీవితాన్ని ప్రసాదిస్తుంది.

6) ప్రార్థన మంచి ఆలోచనలు ఇచ్చి దేవుని ప్రేమతో నింపును.

7) ప్రార్థన ద్వారా దేవుని వాగ్ధానాలు నెరవేర్చబడుతాయి.

8) ప్రార్థన ద్వారా కరుణ, కృప కుటుంబాలపై కుమ్మరింపబడుతుంది.

9) ప్రార్థన ప్రతి కీడు నుండి కాపాడును, ఆత్మ సంతృప్తి నింపుతుంది.

10) ప్రార్థన ద్వారా శత్రువుపై జయము ఇస్తుంది.

11) ప్రార్థన ద్వారా దైవచిత్తమును నెరవేర్చు శక్తిని ఇస్తుంది.

561. **ప్రార్థనలో రకాలు :**

1) విధేయత కలిగి తగ్గింపు గల ప్రార్థన **కీర్తనలు 101:17**

2) ధైర్యపర్చు ఆత్మ గల ప్రార్థన **1యోహాను 5:13-15**

3) నమ్మకము కలిగిన ప్రార్థన **హెబ్రీ 1:6**

4) నిజముగా మొఱ్ఱపెట్టు ప్రార్థన **కీర్తనలు 145:18**

5) సహజమైన ప్రార్థన **మత్తయి 6:7**

6) ధీర్ఘ శాంతము గల ప్రార్థన **లూకా 18:7**

7) దేవుని చిత్తానుసారమైన ప్రార్థన **1యోహాను 5:15**

562. ఎప్పుడూ ఇతరుల తప్పులను అన్వేషించరాదు. ఎవరినీ కించపర్చి బాధించ రాదు. అందమైన పూలపై వాలే తెనేటీగ, పుండు మీద వాలే ఈగకు చాలా తేడా ఉంటుంది.

563. బెల్లంచుట్టు చీమలు చేరినట్లు ధనవంతులైనప్పుడు తెలియనివారు కూడ మిత్రులవుతారు. పేదరికము చేరినపుడు ఆప్త మిత్రులు కూడ దూరమవుతారు.

564. ప్రతివాని గుండెల్లో పచ్చని కొమ్మ ఉంచితే పాటపాడే పక్షి వచ్చి వాలిపోయి పాట పాడగలదు. అట్లే సంతోషంగా నవ్వుతూ అందరిని నవ్వించే వ్యక్తి చుట్టూ ప్రపంచంలో ఉండే అందాలన్నీ సొంతం చేసుకోగలం. దుఃఖ పూరిత మోముతో నిరాశ నిండిన వ్యక్తికి తడిసిన కన్నీళ్ళు చేరువవుతాయి. అతను చూచే అద్దం కూడ మసకబారి పోతుంది.

565. తొందరగా దొరికేది ఏదైనా ఎక్కువ కాలము మన్నిక రాదు. ఎక్కువ కాలము మన్నిక వచ్చేది అంత తొందరగా దొరకదు.

566. అవకాశాలను జారవిడువరాదు. జీవితంలో ఎదుర్కొనే దుర్దినముల సమయంలో నిజమైన స్నేహితులెవరో గ్రహించగలము. అన్ని మన మంచికే అని చెడు రోజులలో నిబ్బరాన్ని కొల్పోరాదు.
మానవులలో మూడు రకాల వ్యక్తులు ఉంటారు.
ఎ) చెట్ల ఆకుల వంటివారు.
బి) కొమ్మల వంటివారు.
సి) చెట్టు పునాది అయిన వేళ్ళవంటివారు. సరిగా గమనించి ప్రక్కవారితో స్నేహం చేయాలి.

567. ఆకులు ఎండకు వానకు, స్వల్పకాలంలో నలిగిపోతాయి. చిన్న సమస్యలకే కొందరు కుమిలిపోతారు. మనకు సహాయపడుటకు ధైర్యంగా నిలువలేరు.
రెండవ రకము స్నేహితులు కొమ్మలు వంటివారు చిన్న సమస్యలలో తోడుగా ఉన్ననూ పెద్ద అవసరాలు కలిగిన సమయంలో దూరమైపోతారు.
మూడవ కోవకు చెందిన స్నేహితులు అన్ని సమయాల్లో తోడుగా నిలిచి ఆత్మ స్థైర్యాన్నిచ్చి బలపర్చి అండగా నిలుస్తారు.

568. మనిషికి రోగాలు కుందేలులాగా వస్తాయి. తాబేలులాగా వెళతాయి. డబ్బులు తాబేలులాగా వస్తాయి, కుందేలులాగ వెళతాయి.

569. చిన్న చిన్న మాటల్లో ఆనందాన్ని వెదకడం అలవాటు చేసువాలి. ఎందుకంటే పెద్ద పెద్ద మాటలు జీవితంలో చాలా అరుదుగా చోటు చేసుకుంటాయి.

570. దేవుని ప్రార్థించినపుడు నాకు ఏమి ఇవ్వలేదని బాధపడకు, నాకు నచ్చిన చోట నీకు నచ్చిన విధంగా ఇస్తాడు.

571. నిత్యము ఎదురయ్యే అపజయాల గురించి నిరాశ చెందకు గానీ ఒక్కొక్కసారి తాళము గుత్తిలో చివరిగా ప్రయత్నించే ఆఖరి తాళము విజయానికి చేరువవుతుంది.

572. ఈ సమాజంలో నేను ఒక్కడిని అని ఏమి చేయగలను అని ప్రతి మనిషి నిరాశ చెందుతాడు గాని ఒక్కసారి తలపైకెత్తి ప్రపంచాన్ని చూసే వెలుగునిచ్చే సూర్యుడు కూడ ఒంటరివాడే.

573. బంధువులు ఎంత చెడ్డవారైనా సరే వదులు కోరాదు ఎందుకంటే మురికి నీరు దప్పిక తీర్చకపోయినా అగ్నిమంట ఆర్పడానికి పనికి వస్తాయి.

574. నమ్మక ద్రోహి స్నేహితుని కన్నా, దురాశపరుడైన స్నేహితుడు మిన్న. మట్టితో చేసిన మనుష్యులు కాగితాలకు అమ్ముడుపోతారు.

575. మనిషితో మాట్లాడుట రాకపోయిన మూగజీవుల వలె ఉండుట నేర్చుకోవాలి.

576. కష్టాల్లో స్నేహితులు దూరమయ్యారని బాధపడరాదు. నీవొక్కడివే జయించ గలవని తలంచి సంతోషించాలి.

577. సిగ్గు మర్యాదలేని ధనవంతుడి కన్నా, మానవత్వమున్న పేదవాడైన పొరుగువాడే మిన్న.

578. జీవితంలో హెచ్చు తగ్గులు రావడం మనము జీవిత సత్యాలు నేర్చుకొనుటకే సహకరిస్తాయి. గుండె జబ్బు గల వారిని పరిక్షించినపుడు ఇ.సి.జిలో హెచ్చుతగ్గులుంటే పర్వలేదు గాని సరళ రేఖగా ఉంటే ప్రమాదము వాటిల్లుతుంది.

579. జీవితంలో మంచి వారి కోసం అన్వేషించవద్దు. ముందుగా నీవు మంచిగా మారు. నిన్ను కలిసిన వ్యక్తికి మంచి మనిషిని కనుగొన్నానని అన్వేషణ పూర్తి అయి ఆనందించవచ్చు.

580. దైవ భక్తితో ధర్మం కోసం జీవించాలి. అప్పుడే విజయం సాధించగలడు. ఆ విజయం నిన్ను చూచి సంతోషిస్తుంది.

581. చిరునవ్వుతో, ఆశా భావంతో ప్రతి ఉదయాన్ని ఆహ్వానించు.

582. ఒక అందమైన ఆసుపత్రి భవనాలు చాలా ఆకర్షణీయంగా కనిపించవచ్చు కానీ ఎవరు దానిలో ఎక్కువ కాలం ఉండాలని కోరుకోరు.

583. కలలు కన్న సుందర భవనాన్ని చూడవచ్చు ఆ భవనంలో ఉండలేము గాని ప్రేమ భావాలు చాలా ప్రాముఖ్యమైనవి. పై ఆకారాన్ని బట్టి ఏది నిర్ణయించలేము. భ్రమలు మానాలి. వాస్తవాన్ని ప్రేమించాలి.

584. **మూడు బంగారు సూత్రాలను పాటించవచ్చు.**

ఎ) నీకు సహాయపడిన వారికి సహాయపడుటకు ఇష్టపడే వారిని ఎన్నడు మరువరాదు.

బి) నిన్ను నిజంగా ప్రేమించే వారిని నిర్లక్ష్యము చేయరాదు. మరియు ద్వేషించరాదు.

సి) నిన్ను నిజాయితిగా నమ్మేవారిని మోసం చేయరాదు.

585. దేవుని వాగ్దానాలు నమ్మదగినవి. నీతో వుంటాను, నీకు భద్రత కల్గిస్తాను. నిన్ను బలపరుస్తాను, నీకు జవాబిస్తాను. నీ కన్నీ సమకూర్చగలను. నేను నిన్ను సదా ప్రేమిస్తాను. నిజ జీవితంలో ఎదుర్కొనే కష్టాలు శత్రువులు కాదు. మన మనస్సును తెలిసికొనే నిజమైన మిత్రులను నమ్మాలి. నేడు క్రీస్తు సిలువ శక్తిని గుర్తించి ఆశ్రయించి పునరుజ్జీవములో మంచి విశ్వాసంతో జీవిద్దాం.

586. దేవునితో మాట్లాడుటం మన ఊపిరికి నష్టం కాదు. దేవునితో నడిస్తే మన శక్తి వృధా కాదు. దేవుని కొరకు కనిపెట్టుటకు కాలము వృధా కాదు. దేవుని నమ్ముకుంటే నీవు ఏరోజు నష్టపోవు.

587. శరీరము పై రంగులో తేడా ఉండదు. గానీ నీ ఆలోచనలు ఏ రంగు మారుచున్నవో యోచించుకో.

588. మరిగే నీటిలో మన ముఖ ప్రతిబింబాన్ని ఎలా చూడలేమో అలాగే కలత చెందిన మనస్సుతో ఉంటే సమస్యలను పరిష్కరించలేము. ప్రశాంతమైన మనస్సుతో ఉన్నప్పుడే సమస్యలను సాధించగలము.

589. కొన్ని గ్రంథాలు చూడటానికి పనికొస్తాయి. మరికొన్ని గ్రంథాలు చదవడానికి పనికొస్తాయి. కొన్ని చదివి గ్రహించి అనుభవంలోకి పనికొస్తాయన్నాడు బీకన్. బహుకొద్ది గ్రంథాలు మాత్రం తిరిగి నెమరు వేసుకొనడానికి పనికొస్తాయి.

590. జీవితంలో మనం ఎదుర్కొనే వ్యక్తుల ముఖాలలో కొన్ని ముఖాలు జ్ఞాపకముంటాయి. అందమైన వారి ప్రవర్తన చాలా కాలము గుర్తుండి పోతుంది. అన్నిటిని మంచి గుర్తుంచుకోగల విషయాలు ఆసక్తితో ప్రార్థించుట, వాక్యము, సహవాసము కన్నీరు, క్రీస్తు రక్త శక్తిని ఆశ్రయించుట సదా స్తుతి ఆరాధన కావాలి. ఈ అనుభవాల ద్వారా పొందిన సంతృప్తి ఆనందం దేవుని సన్నిధిలో పొందగలము.

591. సిలువ లేకుండా సింహాసనంలేదు. భూమి మీద సిలువ మోసేవారే పరలోకంలో కిరీటము ధరిస్తారు. క్రీస్తులేని సింహాసనము నరకమే. క్రీస్తు సంఘం ఆయన రక్తంలో బాప్తీస్మం పొంది ఆత్మతో ఎదిగి వర్ధిల్లగలదు. పెద్దయింటికి చిన్నతాళం తెరిచినట్లు విశ్వాసపు తలుపు, ప్రార్ధనా తలుపు, పరిచర్య తలుపు, దీవెన తలుపు, రాకడ తలుపు తెరుచుటకు అభ్యసించాలి.

592. క్లిష్ట సమయాలు శారీరక వ్యాయమాల వంటివి. అది చేసే సమయం చిరాకు అనిపించవచ్చు గాని భవిష్యత్తులో అవే శారీరక దృఢత్వాన్ని పెంచినట్లు ఆత్మీయంగా శ్రమలు ఆధ్యాత్మిక శక్తిని కలిగిస్తాయి. చిరునవ్వు నీ భావోద్రేకాల్ని మార్చివేస్తుంది. ఆకర్షనీయంగా చేస్తుంది. ఒత్తిడిని రూపు మాపుతుంది. ఆశాభావంతో నింపుతుంది.

593. నిరీక్షణ అనేది వ్యక్తికి శక్తినిస్తుంది. అది ఆత్మ స్థైర్యాన్ని కలిగించి అడుగువేస్తూ ప్రయత్నించు సామర్థ్యాన్నిస్తుంది.

594. పెద్దవారి మాట చద్ది మూట. జీవితగమనంలో ఉపయోగపడేవి పెద్దవారి మాటలు. సరిచేసికొన్న, వారి అనుభవాలు మన జీవితాలలో ఎంతగానో వెలుగునిస్తాయి.

595. ఎబిలిటి మంచిదే కాని స్టెబిలిటి ఇంకా మంచిది. చంచలంగా జీవించరాదు. ప్రతి రోజు దేవునికి నేను కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తాను. నా విశ్వాసం సడలిపోతున్నప్పుడు అవిశ్వాసం జొరబడకుండా స్థిరుడుగా ఉండేందుకు దేవునికి దగ్గరగా ఉంటాను.

596. మనము జీవితంలో ఎదుర్కొనే రోజులు మంచి రోజులు అని కాని చెడ్డ రోజులు అని కాని ఉండవు. మనం మాట్లాడే విధానాన్ని బట్టి మనమెలా నిర్ణయించుకుంటామో ఆ రీతిగా జీవించగలము.

597. మనకు తలాంతులు లేవని ఇతరులకే మంచి తలాంతులు, అవకాశాలు సమర్థతలు ఉన్నాయని పోల్చుకుంటూ నిరాశ పడరాదు. అలా భావిస్తే ఆత్మనూన్యతా భావమే మిగులుతుంది.

598. ప్రతి ఉదయం దేవుడిచ్చిన గొప్ప బహుమానం గనుక ఎదురుపడే ప్రతి వ్యక్తిని ప్రేమకల్గి శుభోదయంతో పలుకరించుకుంటూ మీరు అనుకున్నవి జరిగి మీకు అంతా మంచే జరుగాలని మనసారా కోరుకోవాలి.

599. ఆక్సిజన్ లేనిచో ఏ వ్యక్తి జీవించలేనట్లు దేవుని ఉనికి గుర్తించకపోతే మనలో దైవ ధ్యానం లేనిచో జీవించుట అసాధ్యము.

600. జీవితంలో ప్రతి వ్యక్తికి ఇవ్వబడిన సమయం ఒక రోజులో 24 గంటలు మాత్రమే. మనము ఉపయోగించుకొనే వివేకంతోనే గొప్ప అనుభవాలను పొందగలము. బంగాళదుంపలు, కోడి గ్రుడ్లు, కాఫీ గింజలు సమాన గిన్నెలలో సమాన కాలంలో సమాన ఉష్ణోగ్రతకు అనుమతిస్తే గట్టి దుంపలు మెత్తబడి పోతాయి. ద్రవ రూపంలో ఉన్న గుడ్లు గట్టి పడిపోతాయి. కాఫి గింజలు నీటిలో కరిగి రంగు మారిపోతాయి. నీవు ఎలా మారుతున్నావో తెలిసికొని క్రీస్తు స్వరూపంలోకి మారి సాక్షిగా ఉపయోగకరంగా జీవించుటయే జీవిత పరమార్థమని తెలిసికోవాలి.

601. 1912వ సంవత్సరములో నవంబరులో టైటానిక్ షిప్ గొప్ప భద్రత గలదని అతిశయించిన సమయంలో అదే నెలలో గొప్ప ప్రమాదం జరిగి అనేకులు మరణించారు. ఆ మరణించిన వారిని రెండు గుంపులుగా గుర్తించారు. రక్షింపబడినవారు, నాశనమైనవారు. వారిలో గొప్పవారు, పేదవారు, ప్రముఖులు అందమైనవారు, వికారులు, పెద్దవారు, చిన్నవారు, ఆడవారు, మగవారు, స్పెషల్ క్లాస్‌లో ప్రయాణించారా? ఎంత లగేజి ఉంది అని పరిగణించలేదు కానీ రక్షింపబడ్డారా లేదా? క్రీస్తు రాకడ సమయంలో రక్షణానుభవం కలిగి పరలోకానికి వారసులా? నరకానికి వారసులా? ఇదే గణనలోకి తేబడునని గ్రహించి మారుమనస్సు పొందుట అత్యవసరమని పరలోక వారసులు కావాలని తలంచి జీవించాలి.

602. ఫిలిప్పీ 4:4లో పౌలు ఆనందించుడి, మరలా చెప్పుదును ఆనందించుడి ఎల్లప్పుడు ఆనందంగా చిరునవ్వుతో జీవించాలి అన్నాడు. చిరునవ్వు కరెంటు లాంటిది నవ్వినపుడు బ్యాటరీ చార్జి అవుతుంది.

603. ప్రేమంటే కుటింబీకులతో ఓర్పు కలిగి జీవించడం, గౌరవించుట అంటే ఇతరులతో ఓర్పుగా జీవించడం, ఎవరికి వారు ఆత్మస్థైర్యంతో జీవించుట అంటే ఓర్పు కలిగి జీవించడం. విశ్వాసం అంటే దేవునితో సంబంధం కలిగి ఓర్పుతో మెలగడం.

604. దేవుడు ప్రతి వ్యక్తికి అందమైన జీవితం అందించాడు. జీవితంలో ఎన్నో చేయగల అనుకూలతలు కూడ ఇచ్చాడు. చిరునవ్వు, కలలు కనుట, ప్రేమించుట, కృతజ్ఞత చూపుట, సృజనాత్మకంగా ఆలోచించుట, క్షమించుట, నిరీక్షించుట, ఇతరుల క్షేమము కాంక్షించుట, మనస్సులో భావాలు సృష్టించుకొనుట, అభినందించుట, సమాధానము వెదకి వెంటాడుట, ఆత్మ ఫలాలు కలిగి జీవితాన్ని కొనసాగించటం దేవుడిచ్చిన గొప్ప భాగ్యం.

605. నీవేది పొందావో దానితో తృప్తి కలిగి జీవించు. ఏది అవసరమో అదే కోరుకో. అందుకున్నవన్ని అంగీకరించు. ఏది ఇవ్వగలవో ఇష్టంగా ఇవ్వు. ఏది విత్తుతావో అదే కోస్తావు సుమా!

606. విశ్వాసం అన్ని విషయాలను సాధ్యపరుస్తుంది. ప్రేమ అన్ని విషయాలను సాధ్యపరుస్తుంది. నిరీక్షణ అన్ని విషయాలను అందుకొని సంతోషించగలదు.

607. BIBLE అనే మాటకు అర్థం Basic Instructions before leaving on earth. బైబిలును చేతితో మోస్తే సాతానుకు తలనొప్పి వస్తుంది. చదువుట వల్ల సాతాను కృంగిపోతాడు. శక్తిని కొల్పోతాడు. వాక్యంతో ఆధారపడి జీవిస్తే సాతాను గాయపడి చిత్తుగా ఓడిపోతాడు.

608. తల్లి మనకు జీవితాన్నిస్తుంది. భార్య జీవితానికి అర్థాన్ని ఇస్తుంది. అమ్మ లేకుంటే జీవితం లేదు. భార్య లేకుంటే జీవితానికి అర్థం లేదు. వృద్ధాప్యంలో అమ్మ నీకు భారం కాదు. భార్య నీకు బానిస కాదు. బైబిలులో తల్లిదండ్రులను సన్మానించాలనే ఆజ్ఞను పాటించాలి. నీలో సగభాగమని భార్యను ప్రేమించాలి.

609. బిల్లిగ్రహం గారు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి. ఆ దైవజనుని మాటల్లో నేను ఎన్నో లక్షల మందికి బోధించినందున పరలోకం చేరను. అనేకసార్లు బైబిలు ధ్యానించుట వల్ల పరలోకం నాది కాదు. సిలువలో దొంగ చెప్పిన మాటను బట్టి నన్ను నీ రాజ్యంలో జ్ఞాపకం చేసుకో అని ప్రాధేయపడి క్షమాపణ కొరడం వలన. క్షమాపణ కోరిన ప్రతివిశ్వాసి నిత్యత్వం చేరగలడనే విశ్వాసం నాకు ఉంది.

610. బైబిలు చాలా విలువైన గ్రంథము ఒకే దేవుని గూర్చి ఒకరికొకరు పరిచయం లేని సుమారు 40 మంది శిష్యులు, ప్రవక్తలు ప్రవచించిన ఏకైక గ్రంథము 14వ శతాబ్దంలో అచ్చుయంత్రం ద్వారా ముద్రించబడిన మొట్ట మొదటి పుస్తకము బైబిలు. అత్యధిక భాషలలోనికి అనువదించబడిన ఏకైక గ్రంథము బైబిలు. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడుపోయే గ్రంథము చదువబడే గ్రంథము బైబిలు.

611. నిజదేవుని గూర్చి సరైన, సులువైన నిర్వచనం ఆధారము అవగాహన ఇచ్చే ఏకైక గ్రంథము. లోకమును ప్రేమించిన, ప్రేమించుచున్న దేవుని గూర్చి వ్రాయబడిన ఏకైక గ్రంథము, లోకమును ప్రేమించిన దేవుడు బైబిల్లో తప్ప ఏ గ్రంథంలో కనబడదు.

612. 70% శాస్త్రవేత్తలను ఆలోచింపచేసిన ఏకైక గ్రంథము బైబిలు.

613. విశ్వాన్ని గూర్చిన సమాచారాన్ని శాస్త్రవేత్తల కంటి ముందే లోకానికి తెలిపిన ఏకైక గ్రంథము

614. బల్బు తయారు చేసిన థామస్ అల్వా ఎడిసన్ పలికిన మాట **"బైబిలు నన్ను వెలిగించింది. నేను ప్రపంచాన్ని వెలిగించాను"** బైబిలు గ్రంథానికి ఉన్నంత మంచి బోధకులు ఇతర గ్రంథాలకు లేరు.

615. బైబిలు గ్రంథములో పరిశుద్ధత అనే పదము 1082 సార్లు వ్రాయబడింది. ఈ గ్రంథము ప్రేమించబడుతుంది. ద్వేషించబడుతుంది. ద్వేషించినవారిని రక్షించుకొని దేవునివైపు నడిపించి బోధకులుగా చేసుకుంటున్న ఏకైక గ్రంథము బైబిలు.

616. బైబిలులో తప్పులు వెదకడానికి ప్రయత్నించి మారిన దైవజనులలో బ్రదర్ భక్త సింగ్ గారు ఒకరు. బైబిలు ద్వేషించి చించి బయట అట్టను మాత్రమే దాచుకున్నాడు. అట్టమీద పరిశుద్ధత అనే పదానికి ఆకర్షితుడై ఆ గ్రంథాన్ని చదివి క్రైస్తవుడయ్యాడు.

617. భక్తసింగు గారు దాదాపు 10వేల సంఘాలు స్థాపించిన ఏకైక భారతీయుడనే పేరు పొందాడు.

618. సాధు సుందర్ నిష్ఠ గల సాధువు. దర్శన రీతిగా క్రీస్తు ప్రత్యక్షత పొంది క్రైస్తవునిగా మారి ప్రపంచ వ్యాప్తంగా క్రీస్తును ప్రకటించిన భారతీయుడు.

619. బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడైన ఆర్.ఆర్.కె మూర్తిగారు, బైబిలులో తప్పులు వెదకాలని బైబిలు చదువుటకు ప్రారంభించిననూ బైబిలు నాలోని తప్పులు పట్టుకొని నన్ను రక్షించినదని గొప్పగా సాక్ష్యమిచ్చారు.

620. రెవ. పురుషోత్తమ చౌధరిగారు రోడ్డు మీద దొరికిన బైబిల్ కరపత్రము ద్వారా బైబిలు చదువుటకు ఆసక్తి కలిగి తెలుగులో అనేక భక్తి కీర్తనలు వ్రాసి ప్రసిద్ధిగాంచిన దైవజనునిగా చరిత్ర ప్రసిద్ధుడు.

621. మంచి స్నేహితులు పుస్తకము వంటివారు. ఆ పుస్తకములను కాల్చివేయుటకు క్షణాలు పడుతుంది కానీ అది వ్రాయాలంటే కొన్ని సంవత్సరాల కాలము అవసరము. మంచి స్నేహితులు వజ్రాల వంటివారు. వజ్రాలు పొదుగుటకు బంగారం కావాలి. పాత స్నేహితులు బంగారము వంటివారు.

622. నీ స్వ శక్తితో ఆలోచిస్తే, నీ సామర్థ్యత మీద ఆధారపడితే దేవుని దీవెన గాని సమస్యల నుండి పరిష్కారాన్ని గాని పొందలేవు. కాని దేవుని సమర్థత పట్ల విశ్వాస ముంచితే గొప్ప ఫలితాలు పొందగలవు.

623. నీవు ఇతరుల కొరకు ప్రార్థన విజ్ఞాపన చేయగలిగితే తప్పక దేవుడు జవాబిస్తాడు. నీవు క్షేమంగా ఉన్నావంటే ఎవరో నీ కొరకు ప్రార్థించారని నమ్మాలి.

624. చింతించవద్దు. నీ భారము నాపై ఉంచు అని దేవుని వాక్యం తెల్పుచున్ననూ చింతించుట మానుకోలేము. చింత రేపటి బాధలను తీసివేయదు. నేటి చింతను కూడ ఈ రోజే గలిబిలి చేస్తుంది. గనుక నీ భారం పూర్తిగా దేవునిపై ఉంచాలి. ధైర్యం తెచ్చుకొనుటకు దేవుడు మానసిక శక్తినిచ్చిచింతలు భయాలను దూరం చేస్తాడు.

625. విశ్వాసిగా ఉన్న స్త్రీలు ఇతరుల బాధలను వింటారు. బాధలను అర్థం చేసుకొనుటలో ఓర్పు వహిస్తారు. ఇతరుల శ్రమలలో ఆదుకొనుటకు దయగల హృదయం కలిగి ఉంటారు. బాధితులకు ఓదార్పుగా మౌనంగా వారితో నిలిచి ప్రేమించగలరు. వారు వేసిన ప్రశ్నలకు ప్రేమతో సమాధానమిస్తే ప్రశాంతంగా ఉండగలము. కాకి కోకిల అరుస్తాయి కాని కాకి అరుపును కాకి గోల అంటారు. కోకిల అరుపును పాట అంటారు.

626. WOMAN Wonderful Out standing Marvellous adorable and nice person ఒక స్త్రీని వర్ణించినచో ఆశ్చర్యకరమైన, సృజానాత్మకంగా ఆరాధించగల మంచి వ్యక్తి అని తెలుపవచ్చు.

627. బైబిలులో గొప్ప స్త్రీలు ఎస్తేరు, దెబోరా, రూతు, ఫిబే, హన్నా, మరియ మొదలగు వారంతా ప్రార్థించేవారు. విశ్వాసం గలవారు. మహిమకరమైన విజేతలుగా జీవించారు. నేడు ప్రతి స్త్రీ వారిని ఆదర్శంగా తీసుకుని వారి విరామ సమయాల్లో ప్రార్థించే స్త్రీలుగా ఉండటం చాలా అవసరం.

628. స్త్రీలు ప్రీతి పాత్రమైన సోదరీమణులుగా, ఆదర్శ మహిళలుగా, భర్తకు సహకారిగా ఉంటూ దేవుని ఆరాధించే యోగ్యత గల తల్లులుగా జీవించాలి. ఇతరులకు గొప్ప మాదిరిగా ఉండాలి.

629. ఎ) నేనే **దెబోరాను** అయితే దేవునిని నమ్మకంగా సేవించగలను. ఇతరులను ప్రోత్సాహించగలను. శక్తితో మాట్లాడి నిర్భయంగా జీవిస్తాను.

బి) నేనే **ఎస్తేరును** అయితే దేవుని సింహాసనము కదిలించే విజ్ఞాపన నా జనుల కొరకు చేయగలను.

సి) నేనే **అభిగయీలునైతే** నన్ను నేను తగ్గించుకొని దేవుని యెదుట దేవుని సేవకుల పట్ల భక్తి విధేయత కనపర్చగలను.

డి) నేనే **హన్నాను** అయితే బిడ్డలను దేవుని సేవ కొరకు సమర్పణ చేస్తాను

ఇ) నేను **ప్రిస్కిల్లను** అయితే దేవుని సత్య మార్గాలను అన్వేషించే వారికి మార్గదర్శినవుతాను

ఎఫ్) నేను **షునేమీయురాలినైతే** శ్రమలో అంచలంచల విశ్వాసము కనపర్చగలను.

జి) నేను **లూదియానైతే** దేవుని ఆరాధిస్తూ, దైవ సేవకై నా హృదయాన్ని నా ఇంటిని తెరుస్తాను.

హెచ్) నేను **ఫీబేనైతే** నాతోటి వారికి అన్ని విధాల సహాయపడతాను.

తల్లి అయిన మరియ చెప్పిన గొప్ప మాట నా ప్రతి పరిస్థితిలో నీ చిత్తమే నెరవేరును గాక అని ప్రతి పరిస్థితిని దేవునికే అప్పగించగలను.

630. ఒక మంచి తల్లికి ఇల్లు ఇస్తే మంచి ప్రార్థనా గృహంగా మార్చగలదు. కిరాణ సరుకులను ఇస్తే మంచి భోజనము తయారు చేయగలదు.

ఎవరైనా చిరునవ్వు ఇస్తే మనఃపూర్వకముగా హృదయముతో ప్రేమించగలదు. ఏది ఇచ్చినా మార్చే స్థితి స్త్రీకి ఉందని గ్రహించాలి. భక్తి గల స్త్రీ ఆత్మ జాలరిగా నిలిచి ఘనురాలని ప్రశంశలందుకుంటుంది.

631. మనం ఆత్మీయుల కొరకు ప్రార్థించాలి. మనకు లభించే దీవెనలు కేవలము మన ప్రార్థనలు వల్లనే కాదు గాని మన స్నేహితులు సన్నిహితుల సహృదయుల ప్రార్థన వలన దేవుని దయను పొందుచున్నాము.

632. పై రూపము రూపాయల కన్నా గొప్పది. వేల రూపాయల కన్నా వినయము గొప్పది. లక్షల కన్నా లక్షణము గొప్పది. కోట్ల కన్నా కొనలేని మంచి స్నేహము గొప్పది.

633. **విజ్ఞాపన ప్రార్థన చేసిన ప్రార్థనాపరులు ఎందరో ఉన్నారు.**

ఎ) పేతురు చెరసాలలో ఉండగా సంఘము అత్యాసక్తితో ప్రార్థించింది. అపొ 12:5

బి) మోషే అహరోను పాపం చేయగా క్షమించమని కోరాడు. ద్వితి 9:20

సి) అబ్రహాము అబిమెలేకు కుటుంబం కొరకు ప్రార్థించాడు. ఆది 20:17

డి) శతాధిపతి తన స్నేహితుని పక్షవాయువు నుండి విడుదలకై ప్రార్థన చేశాడు. మత్తయి 8:5-9

ఇ) ఇశ్రాయేలీయులు పాపం చేయగా మోషే ఉగ్రత నుండి తప్పించాలని ప్రార్థన చేశాడు. నిర్గమ 32:11, 12

ఎఫ్) తిమోతి కొరకు పౌలు ప్రార్థన చేశాడు. విజయవంతమైన సేవ కొరకు దేవునికి విజ్ఞాపన చేశాడు. 2తిమోతి 1:3-6

జి) స్తెఫెను తనను చంపిన వారి కొరకు ప్రార్థన చేశాడు. యోబు తన స్నేహితుల కొరకు ప్రార్థన చేశాడు, పౌలు సంఘాల ఎదుగుదల కొరకు ప్రార్థించాడు. యాకోబు ఇతరుల స్వస్థత కొరకు ప్రార్థించాడు. మనము ఆత్మీయుల కొరకు ప్రార్థన చేయాలి.

634. అపశృతితో నిండిన జ్ఞానము విరోధులను ఆహ్వానిస్తుంది. చివరకు స్వార్థపరులుగా మార్చుతుంది. మంచి విజ్ఞాపన మానసిక వికాసాన్ని కలిగించి అనేకులు గౌరవించే స్థాయికి చేర్చగలదు.

635. శ్రమలో బాధలు సంతోషంగా స్వీకరిస్తే విశ్వాసికి మానసిక పరిపక్వతను ఇస్తాయి. విశ్వాసం అనే పునాది లేని నమ్మకంతో కూడిన సత్యాలు మనిషిలో

నిరాశ మిగల్చగలదు. విశ్వాసంతో సత్యాలను స్వీకరిస్తే ఆత్మ ఫలాలను పండించగలము.

636. స్వంత జ్ఞానంతో మనస్సు చెప్పినట్లు నడిస్తే కొన్ని నిర్ణయాలు, పొరపాట్లు ఉంటాయి గానీ హృదయంతో చేసిన నిర్ణయాలు ప్రేమతో నిండినవి. మంచి తలంపులన్నీ సంతృప్తి, సమాధానం, ఆనందం ఇస్తాయి.

637. **పాత నిబంధనలో ఉజ్జీవము నేర్పు పాఠాలు**

ఎ) మన విగ్రహాలను విడచిపెట్టాలి. ఇది యాకోబు కాలంలో ఉజ్జీవము. ఆది 35:1-15

బి) మన పాపములు మనము ఒప్పుకోవాలి. ఇది మోషే కాలములో ఉజ్జీవము. నిర్గమ 32, 33 అధ్యాయాలు

సి) మనము యెహోవాను మాత్రమే సేవించాలి. ఇది సమూయేలు కాలము ఉజ్జీవము. 1సమూ 7:1-13

డి) దేవునిని అద్వితీయునిగా కొలవాలి. ఇది ఏలియా కాలములో ఉజ్జీవము. 1 రాజులు 18వ అధ్యాయము

ఇ) మనము దేవుని సన్నిధిని వెదకాలి. ఆసా కాలములో ఉజ్జీవము. 2దిన 14-16 అధ్యాయాలు

638. 1) మనము మనఃపూర్వకముగా ప్రార్థించాలి. యెహోషాపాతు కాలములో ఉజ్జీవము. 2దిన 20వ అధ్యాయం

2) మనము దేవునివైపు తిరగాలి. హిజ్కియా కాలములో ఉజ్జీవము. 2దిన 30వ అధ్యాయము

3) యెషయా కాలములో ఉజ్జీవము దేవుని యందు మనలను మనము తగ్గించుకోవాలి. 2దిన 35:3,4

4) మనము దేవుని సేవను పునరుద్దీకరించాలి. జెరుబ్బాబేలు కాలములో ఉజ్జీవము. హగ్గయి 1, జెకర్యా 1 అధ్యాయాలు

5) ప్రభువునందు ఆనందించుచు నెహెమ్యా కాలంలో ఉజ్జీవము. నెహెమ్యా 8వ అధ్యాయం.

639. మంచి మనస్సుతో చేసిన నిర్ణయాలు ప్రేమతో నిండినవి గనుక ఆ మంచి తలంపుల వల్ల సంపూర్ణ తృప్తి, సమాధానము, ఆనందము కలిగిస్తాయి.

640. మిడి మిడి స్వంత జ్ఞానముతో చేసిన నిర్ణయాలు విషాదాంతము కాగలవు. ప్రతి ఆలోచన దేవుని చిత్తంలో జరిగించాలి. సంపూర్ణ సమర్పణతో నీ చిత్తము సిద్ధించును గాక అనే నినాదం కలిగి ఉండాలి.

641. **మంచి ఆరోగ్యమునకు మంచి కిటుకు తెలిసికోవాలి**

ధైర్యము, విశ్వాసము, నిరీక్షణ, సానుభూతి, ప్రేమ అనే మంచి భావాలు ఆరోగ్యాన్నిచ్చి జీవిత కాలాన్ని పొడిగిస్తాయి. సంతుష్టిగల మనస్సు ఉల్లాస భరితమైన శరీరానికి స్వస్థతను, ఆత్మకు బలాన్ని సమకూర్చుతాయి. కృతజ్ఞాత భావము, మనో బలము, దేవునిపై నమ్మకము మనిషి ఆరోగ్యానికి గొప్ప రక్షణ. ఆత్మ నిగ్రహము, దేవుని పట్ల అంచంచల విశ్వాసము కావాలి. అప్పుడే మనస్సులో చింతలన్నీ తొలగిపోతాయి. సంతోషము నిండిన జీవితాలలో అనారోగ్యము దూరమవుతుంది.

"ఆనందించుడి, మరలా చెప్పుదును ఆనందించుడి" ఫిలి 4:4

642. **బైబిలులో శ్రేష్టమైన సందేశములను ఎలా పొందాలి? యోహాను1:1**

ఎ) దేవుడు వాక్యమైయున్నాడు గనుక ఆయన వాక్యం ద్వారా మాట్లాడు చున్నాడని నమ్మాలి.

బి) అక్కడక్కడ చదవడం కాదు గాని బైబిలును క్రమంగా చదవాలి.

సి) బైబిలు అర్థం చేసుకోవడానికి పరిశుద్ధాత్మ సహాయాన్ని కోరాలి.

డి) భక్తి శ్రద్ధలతో ఏకాగ్రతతో చదవాలి.

ఇ) వాక్యము చదివిన తరువాత మనలో మనము ప్రశ్నించుకోవాలి.

ఎఫ్) ప్రభువును గూర్చి ఏమి తెలిసికున్నాను.

జి) నేను నా పాపాలను గ్రహించి ఒప్పుకొని విడిచిపెట్టుటకు శ్రద్ధ వహించాలి.

హెచ్) నేను నా లోపములను తెలిసికొన్న తరువాత సరిదిద్దుకొనే హెచ్చరిక ఉన్నదా? అని ఆలోచించాలి.

ఐ) నేను పాటించే ఆజ్ఞ ఉన్నదా?

జె) విశ్వసించుటకు ఏమైనా వాగ్ధానమున్నదా?

కె) వెంబడించుటకేదైనా మాదరి ఉన్నదా?

దైవ సందేశమును స్వీకరించు హృదయము కావాలి. హృదయము తెరవాలి.

అపో. 16:14 లూదియ అను దైవ భక్తి గల స్త్రీ హృదయమును ప్రభువు తెరచెను గనుక పౌలు చెప్పిన మాటల యందు లక్ష్యముంచెను.

643. **తెరువబడవలసిన అంశాలు ఏవి?**
దివ్య దర్శనము ప్రత్యక్షత కొరకు కండ్లు తెరవాలి. 2రాజులు 6:17 యెహోవా వీడు చూచునట్లు వీడి కన్నులు తెరువుము అని ఎలీషా ప్రార్థన చేశాడు.

644. **ప్రార్థన కొరకు ఇంటి కిటికీలు తెరచి యుంచాలి.**
దానియేలు యధాప్రకారము అనుదినము ముమ్మారు మోకాళ్ళూని తన ఇంటిపై కిటికి యెరూషలేము తట్టునకు తెరువబడియుండగా తన దేవునికి ప్రార్థన చేయుచూ ఆయనను స్తుతించుచు వచ్చెను. దానియేలు 6:10

645. **దేవుని మాటలు వినుటకు చెవులు తెరచుకోవాలి.**
బలులనైననూ, నైవేద్యములైననూ నీవు కోరుట లేదు. నీవు నాకు తెరువబడిన చెవులు నిర్మించియున్నావు. దహన బలులు పాపపరిహారార్థ బలులను తెమ్మనలేదు.

646. **లూదియ అను దైవ భక్తి గల స్త్రీ హృదయమును ప్రభువు తెరచెను.**
గనుక పౌలు చెప్పిన మాటలయందు లక్ష్యముంచెను.

647. **పరిచర్య కొరకు ద్వారాలు తెరవాలి.** క్రీస్తు సువార్త ప్రకటించుటకు నేను "త్రోయ"కు వచ్చినపుడు నాకు మంచి సమయము ప్రాప్తించి యుండగా ద్వారము తెరువబడినది. 2 కొరింథీ 2:12

648. **సువార్త ప్రకటించుటకు పెదవులు తెరవాలి.**
ప్రభువా నా నోరు నీ నీతిని ప్రచురపరచునట్లు నా పెదవులను తెరువుము" కీర్తనలు 51:15

649. **దాతృత్వము కొరకు చేతులు తెరవాలి.** ఇష్టముగా దేవుని కొరకు ఇచ్చేవారిని దేవుడు ప్రేమిస్తాడు. నీ చేయి ముడుచుకొనక వాని కొరకు నీ చేయి చాచి వాని అక్కరకు చాలినంత ఆవశ్యముగా వానికి అప్పియ్యవలెను. ద్వితి 15:8

650. **కీర్తనలు 84వ అధ్యాయంలో 3 ధన్యతలు**
ఎ) నీ మందిరం నందు నివసించువారు ధన్యులు. కీర్తన 84:4
బి) నీ వలన బలము పొందువారు ధన్యులు.
సి) నీ యందు నమ్మిక ఉంచువారు ధన్యులు

651. దేవునితో సహవాసము కలిగి ఆయనతో నడిచే అనుభవాన్ని పొందగలము, దురాత్మ ప్రభావము నుండి విడిపించబడుతాము. అద్భుతములను స్వస్థతలను చూడగలము.

652. నిజానికి మనము నివసించేయింటిని శుభ్రపరచుకుంటాము. అట్లే మలినము అంటకుండా మన మనస్సును పవిత్రంగా వుంచుకోవాలి. నిండుగా పండ్లున్న చెట్టు ఒదిగి వుంటుంది. అట్లే దైవజ్ఞానము గలవారు ఒదిగి వుంటారు. ప్రేమ, మర్యాద, పరోపకారము కల్గి ఉంటారు.

653. స్తుతులపై ఆసీనుడైన దేవుడు విమోచించబడినవారికి చెదరినవారు పోగు చేయబడి ఆశ్చర్య కార్యములను లెక్కించి స్తుతించగలరు. స్తుతులపై ఆసీనుడైన ప్రభువు.

ఎ) ఆపదల నుండి విడిపించగలడు బి) మేలులతో నింపి తృప్తిపరచువాడు.
సి) అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ ఇత్తడి తలుపులను పగులగొట్టువాడు.
డి) సకల రోగాల నుండి విడిపించి స్వస్థపరచువాడు.
ఇ) శత్రువుల పొగరు అణచి మిత్రులుగా చేయగలడు.

654. ఆయన ప్రేమ చేత కృపను చూపి ఆశ్చర్యకార్యములు చేయునని దేవుడు దయాళుడని కీర్తించి అందరూ కృతజ్ఞత తెలపాలి.

655. **దానియేలు ప్రార్థన పరుడని పేరు పొందుటకు కారణములు**

1) అనుసరించిన ప్రాధాన్యతలు శ్రేష్టమైనవి.
2) పాటించిన నియమాలు ఎన్నదగినవి.
3) అతడు అనుసరించిన జీవితం క్రీస్తును పోలి పరిశుద్ధమైనది.
4) అతడు ముమ్మారు ప్రార్థన చేసిన తీరు ఆదర్శవంతమైనది.

656. **విశ్వాసికి ఎట్టి హృదయము కావాలి?**

ఎ) మంచి కొరకు స్పందించే హృదయము.
బి) మంచి నేర్చుకొనే హృదయము.
సి) ప్రజ్ఞ వివేకం కొరకు తపించాలి.
డి) ఎన్నడు దున్నని బీడు భూములను దున్నాలి.
ఇ) మంచి నేలను ఫలించే రీతిగా ఆత్మ ఫలాలు సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచి తనము పండించాలి.

657. బంగారము, వెండి వంటి వస్తువులు విలువైన వస్తువులు భూ గర్భంలో లోతుగా త్రవ్వితే లభించగలవు, పగడాలు, ముత్యాలు సముద్రంలోతులో లభించును కానీ నిజమైన శాంతి సంతోషాలు నీ ఆత్మ లోతులో లభించును. నీ మనస్సులో నీ ఆలోచనలను బట్టి లభిస్తాయి. బయట ఎక్కడ అవి లభించవు. దేవుని వాక్యంలో లభించే గొప్ప శాంతిని పొందుటకు ప్రోత్సాహం ఇస్తాయి. ఎందుకంటే ఆ దైవ వాక్యము బంగారము కంటే శ్రేష్టమైనది. కోరదగినది.

658. విభిన్న పదార్థాల వేడి సమ్మేళనం కాఫీ. ఎంత రుచి? అదేవిధంగా మనమంతా విభిన్న తలాంతులు గల వ్యక్తులము. మనమంతా ఒక బంధంగా ఏర్పడితే మంచి సమాజంగా ఏర్పడుతుంది. సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు, ఎంత మనోహరము. ఐక్యం, బంధము కలిగి ఉంటే కలదు సుఖం. నవ సమాజం నిర్మించబడాలంటే మంచి వ్యక్తులంగా కలిసి సాధించాలి.

659. రోజు శరీరాన్ని శుద్ధీ చేసుకొనుటకు నీటితో స్నానం చేస్తాము. నిత్యం వాక్యం ధ్యానించువాడు ధన్యుడు అని వాక్యం బోధిస్తుంది. ఆ వాక్య ధ్యానం మన మనస్సును ప్రక్షాలన చేసి శుభ్రపరచగలదు. ప్రార్థన కూడ ఆత్మను పవిత్రంగా శుద్ధీకరిస్తుంది. అంతే కాదు ఉపవాసం చేస్తే ఆరోగ్యం శరీరానికి లభిస్తుంది. అన్నింటికి మించిన విలువైన అనుభవం క్షమ ఇతరులను క్షమించుటలో అనుబంధాలు పవిత్రపరచబడుతాయి.

660. దైవ వాక్యం చెప్పిన రీతిగా నీతిమంతుడు ఒక్కడైన లేడు గాని అందరూ పాపం చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. ఇతరుల తప్పులను మన్నించి క్షమించాలి. ఒంటరిగా జీవించలేవు కాబట్టి ఇతరులను తక్కువగా విమర్శిస్తూ ఎక్కువగా ప్రేమించడం అవసరం.

661. అత్యానంద భరితులుగా జీవించు వ్యక్తుల వ్యక్తిత్వంలో ప్రగతి సాధించుటలో విజేతలుగా నిలుచుటలో కిటుకు ఏదనగా ప్రతి విషయాన్ని విశ్లేషించి మంచి ఆలోచనలతో ముందుకు సాగిపోతారు.

662. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ నిలిచి యుంటుంది. వీటిలో శ్రేష్టమైనది ప్రేమ. 1 కొరింథీ 13:13

తప్పులు వెదకడమే పనిగా పెట్టుకుంటే బంధువులు, స్నేహితులు, ఎవరూ మిగలరు. అందుకే ఎవరినీ తప్పు పట్టరాదు. ఎవరినీ అకారణంగా

నిందించరాదు. సెల్ ఫోను చార్జింగు చేయుటకు ఎంత ప్రాధాన్యత వహిస్తామో అలాగే సంబంధాలు కాపాడుకొనుటకు చాలా ప్రయాస అవసరము.

663. దయ కలిగి జీవించటానికి గ్రుడ్డితనము, చెవిటితనము అడ్డురాలేదు. వికలాంగుడు కూడా తన దశను మార్చి ఇతరులకు దయను చూపగలడు.

ఎ) తక్కువ ఆలోచించి, ఎక్కువ భావాలు కలిగి ఉండాలి.

బి) తక్కువ భయంలో ఉంటూ ఎక్కువగా నేర్చుకోవాలి.

సి) గర్జించుట ఆపి ప్రేమించుట నేర్చుకోవాలి.

డి) తక్కువగా మాట్లాడాలి, ఎక్కువ వినుటకు ఇష్టపడాలి.

ఇ) ఇతరుల గురించి చాడీలు చెప్పుట తగ్గించి, అభినందించుట నేర్చుకోవాలి

ఎఫ్) ఇతరుల తప్పులను నాదే అని ఒప్పుకోవాలి. తీర్పు తీర్చుటకు బదులుగా తప్పులను క్షమించి అంగీకరించాలి.

జి) సమస్యలను చూస్తూ కాలయాపన చేయుటకు బదులుగా ఏదైనా పరిష్కారం ప్రయత్నించి క్రియాత్మకంగా ధైర్యంగా నీకు నీవే సాధించాలని తెలుసుకోవాలి.

664. శారీరక ఆరోగ్యము ఎల్లప్పుడూ మందులు వాడుట ద్వారా రాదు గానీ ప్రశాంతంగా ఉన్న మనస్సు ద్వారా వస్తుంది. హృదయంలో ప్రశాంతత, ఆత్మలో శాంతి, ఆనందంతో జీవిస్తూ హృదయాన్ని ప్రేమతో నింపుకొనుట వలన లభిస్తుంది. ఎప్పుడు ఎదుటివారిని చిరునవ్వుతో పలుకరించుట వలన ఆనందము దాగి ఉంటుంది. జీవితం చాలా చిన్నది. ఎవరినో ద్వేషిస్తూ కాలాన్ని వృధా చేయకు క్షమించడం నేర్చుకో సంతోషంగా గడుపుట నేర్చుకో.

665. ఇతరుల క్షేమం కాంక్షించుటకు మనసును ఉల్లాసంగా ఉంచుకోవాలి. శాంతి కరమైన ఆత్మతో నింపబడి ఉండాలి. ఆత్మీయంగా ఆరోగ్యకరమైన జీవితంతో ప్రేమానురాగాలను నింపుకొని జీవించాలి. నీ కొరకు నేను సదా మేలు కోరి ప్రార్థిస్తున్నానని రోజంతా కలిసిన వారితో మంచి మాటలతో సంతోషపరచుట అవసరం.

666. **చిన్న ప్రార్థనలు గొప్ప మేలులు చేకూర్చగలవు.**

ఎ) ఉదయాన్నే లేచి ప్రభువా నిన్నే ప్రేమిస్తున్నాను. నీకే స్తుతి మహిమకలుగును గాక.

బి) బయటకు వెళ్ళే సమయంలో ప్రభువా నా చేయ్యి పట్టుకొని నాతో రండి.

సి) ఏదైనా దుఃఖ పరిస్థితులు ఎదురైతే ప్రభువా నా దరికి ఆదరించు.

డి) సంతోష సమయాల్లో ప్రభువా నిన్ను ఆరాధిస్తున్నాను. వందనాలు.

ఇ) అవసరము వచ్చినపుడు ప్రార్థించు ప్రభువా నాకు సహాయం చేయి.

ఎఫ్) ఏదైనా పొరపాటుతో తప్పు చేస్తే ప్రభువా నన్ను క్షమించు.

జి) నిద్రించబోవు సమయంలో ప్రభూ, నీ దూతలను కావలియుంచి నీ పవిత్రమైన దుప్పటితో కప్పి దీవించు.

ప్రార్థనలన్నీ ఆలకించి ఆదుకొను ప్రభువు ప్రతి ప్రార్థనలను ఆయన చిత్తములో తగిన సమయంలో నెరవేర్చునని నమ్మి ఆయనకు దగ్గరగా జీవించాలి.

667. జీవితంలో ఇతరుల కొరకు ప్రయాసపడాలి. అయితే ఇతరులకు కూడా నీవు పొరుగువాడివని గుర్తించి వారి ప్రయాసలో నీవు కూడ ప్రయాసపడాలి.

668. **9 వివిధ ఆత్మలు ఏవనగా**

ఎ) సాత్వికమైన ఆత్మ బి) ఆకలి దప్పులు గల ఆత్మ

సి) కనికరం గల ఆత్మ డి) దీనత్వము గల ఆత్మ

ఇ) దుఃఖపడు ఆత్మ ఎఫ్) పరిశుద్ధ ఆత్మ

జి) సమాధాన పరచు ఆత్మ హెచ్) నీతి నిమిత్తము హింసించబడు ఆత్మ

ఐ) హింసలను సహించు ఆత్మ

Personality of Holy Spirit Presence of Holy Spirit -

Power of Holy Spirit Prayer of Holy Spirit

పరిశుద్ధాత్మ ఔన్నత్యము, ఉనికి, శక్తి కొరకు ప్రార్థించి ఆత్మను పొందాలి.

669. శత్రువు వరదవలె వస్తాడు. విమోచకుడు ఆ వరదను తరిమివేసే ప్రచండ వాయువువలె వస్తాడు. శ్రమ శత్రువు వచ్చినా ఆయన ఆ శ్రమను, విరోధిని పారద్రోలుతాడు.

యెహోవా పుట్టించు గాలికి కొట్టుకొనుపోవు ప్రవాహ జలమువలె ఆయన వచ్చును. యెషయా 59:19

670. దరిద్రత దోపిడిదారుడు ఆయుధదారుని వలె వస్తాయి.

ఇంక కొంచెం నిద్ర, ఇంకా కొంచెం కునుకుపాటు వలన నీకు దరిద్రత కలుగును. సామెతలు 24:33

అందుచేత దోపిడిగాడు వచ్చునట్లు దారిద్ర్యము నీ యొద్దకు వచ్చును. ఆయుధ దారుడు వచ్చునట్లు లేమి నీయొద్దకు వచ్చును. సామె 6:9-11

671. పరిశుద్ధాత్మ పావురమువలె గాలివలె మంచువలె వస్తాడు. ఇదిగో ఆకాశము తెరువబడెను దేవుని ఆత్మ పావురమువలె గాలివలె మంచువలె వస్తాడు. అగ్నివలె వస్తాడు. మత్తయి 3:16

672. సహనము మౌనము రెండు దేవుడు ఇచ్చిన శక్తులే. ఈ రెండు శక్తులు మానసికంగా దృఢపరుస్తాయి. మౌనము భావోద్రేకాలను నియంత్రించగలదు.

673. భయపడరాదు క్రీస్తు విశ్వాసి భయపడి దిగులుపడరాదు. నిన్ను దృఢపరిచే బైబిలునందు వాగ్దానములు గలవు. భయుపడకు 365 రోజులు ఏడాదిపొడుగునా వాగ్ధానములనిచ్చి నిన్ను ఆదరించగలడం.

674. **జీవితయానంలో ఆశీర్వాదము :** నేను నీతండ్రియైన అబ్రహాము దేవుడను నీకు తోడైయున్నాను గనుక భయపడకుము. నా దాసుడైన అబ్రహామును బట్టి నిన్ను ఆశీర్వదించి నీ సంతానమును విస్తరింపచేసెదను అని చెప్పెను.

675. **కరువులో కల్పవృక్షము :** భయపడవద్దు, నీవు పోయి నేను చెప్పినట్లు చేయుము. నాకొక చిన్న అప్పము చేతితో తీసుకొని రమ్ము. దేవుడే ఆ కుటుంబాన్ని పోషించాడు. 1రాజులు 17:13

676. **ప్రమాదంలో భద్రత :** అతడు భయపడవద్దు మన పక్షమున ఉన్నవారు వారికంటే అధికులైయున్నారు. 2రాజులు 6:16

677. **బలహీనతలో బలము :** నీవు నా దాసుడవనియు నేను నిన్ను ఉపేక్షింపక యేర్పరచుకొంటిననియు నేను నీతో చెప్పియున్నాను. భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను. యెషయా 41:10

678. **ఉపద్రవాలలో ఉద్ధరించును :** అయితే యాకోబు భయపడకుము పేరు పెట్టి నిన్ను పిలిచియున్నాను. నీవు నా సొత్తు. యెషయా 43:1

679. **ప్రత్యేక శ్రద్ధ కాపుదలనిచ్చువాడు :** మీ తలవెంట్రుకలన్నియు లెక్కించబడి యున్నవి గనుక మీరు భయపడకుడి. మీరు అనేక పిచ్చుకల కంటే శ్రేష్టులు.

680. **మరణ భయము నుండి తప్పించును :** భయపడకుము, నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను మృతుడనైతిని గాని యుగయుగములు సజీవుడనైయున్నాను మరియు మరణము యొక్కయు, పాతాళము యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి. ప్రకటన 1:18

681. **విశ్వాస వీరుల జీవితాల ఔన్నత్యము** : దానియేలు ఆత్మ నిగ్రహము గల జీవితం జీవించాడు. యవ్వనేచ్ఛలు జయించాడు. దీనమనస్సు, పరిశుద్ధత మంచి మాదిరి. జీవితం స్వచ్ఛ హృదయంతో ఇతరులను స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడు.

682. **హనోకు పరిశుద్ధ జీవితము :** మనుష్యుల మధ్య జీవిస్తూ దేవునితో సంబంధం కలిగి కుటుంబ యజమానిగా తండ్రిగా బాధ్యతలు నెరవేర్చి దేవునితో నడిచాడు. దేవునితో 300 సంవత్సరాలుగా దివారాత్రులు ధ్యానిస్తూ తన చుట్టు ఉన్న వ్యక్తులకు ఆ ప్రేమ తన ద్వారా ప్రసరించాలని ఎన్నో ప్రయత్నాలు చేసి సఫలుడయ్యాడు.

683. **ముగ్గురు హెబ్రీ యువకుల దృఢ విశ్వాస జీవితము :** యథార్థమైన పరిశుద్ధ క్రైస్తవ ప్రవర్తన రాబోవు పరిణామాలను లెక్క వేసికోదు. సకల శాస్త్ర ప్రవీణత వివేచన గల హెబ్రీ యువకులు ఉన్నత స్థానాలలో నిలిచిననూ దేవుని కృపా మహిమకు శక్తి సామర్థ్యాలను అప్పగించారు. గొప్ప ఘనతను వాంఛించక స్థిరమైన నమ్మికతో దృఢ భక్తి గల పరిశుద్ధ జీవితం జీవించి అద్భుతములు రుచి చూచి ఆదర్శ జీవితం జీవించారు.

684. **పరిశుద్ధాత్ముని కొన్ని పరిచర్యలు :**

ఎ) పరిశుద్ధాత్మ ఆత్మలో ప్రార్థించుటకు సహాయ పడును. అపో 8:26

బి) పరిశుద్ధాత్మ ద్వారా శక్తిని పొంది భూది గంతముల వరకు సాక్షులుగా నిలుచుటకు సహయపడును. అపొ 1:8

సి) సర్వ సత్యములు బోధించి, రాబోవు సంగతులు తెలియచేస్తారు. యోహాను 16:13

డి) దైవచిత్తానుసారముగా నడిపిస్తారు. కీర్తనలు 143:10

ఇ) క్రీస్తు మనలో గొప్ప మార్పు తెచ్చుటకు పరిశుద్ధాత్మ సహకరించును.

685. క్రీస్తు మనలో గొప్ప మార్పు తెచ్చుటకు పరిశుద్ధాత్మ సహాకరించును.

మహిమ నుండి అధిక మహిమను పొందుచూ ప్రభువగు ఆత్మచేత ఆ పోలికనే మార్చబడతాము. 2 కొరింథీ 3:18

686. పరిశుద్ధాత్మ ద్వారా మనతో మాట్లాడగలరు.
కుడితట్టయిననూ యెడమతట్టయిననూ తిరిగిననూ ఇదే త్రోవ దీనిలో నడువుడి అని వెనుక నుండి ఒక శబ్ధము నీ చెవులకు వినబడును. యెషయా30:21 ఒంటరితనములో ఆదరణకర్త తోడుగా ఉంటారు.

687. ప్రతి వ్యక్తికి అవసరమగు బుద్ధి వాక్యము, స్వష్ఠపరచు వరము, అద్భుత కార్యాలు చేయు శక్తి, ప్రవచన వరము, ఆత్మల వివేచన, నానావిధ బాషలు మాట్లాడు శక్తి, అర్థము వివరించు శక్తి లభించగలదు. 1కొరింథీ 12:8
మనలను పిలిచిన పిలుపుకు తగినట్టుగా వరములు ఇస్తాడు దేవుడు. ఆ వరాలను ఆపేక్షించాలి. ఇందును బట్టి తృష్ణతో ఆత్మను పొందాలని ఆకాంక్షించాలి. పరిశుద్ధాత్మ నింపుదలతో సదా దేవుని స్తుతించాలి.

688. **వాక్యమును మీరెట్లు వింటున్నారు.**
మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండా వాక్యం ప్రకారం ప్రవర్తించువారునై యుండుడి. యాకోబు 1:22

689. **శ్రద్ధగా వినువారు :** మెళకువతో నుండి ఆశతో విన్న వాక్యాన్ని హృదయము లోనికి చేర్చుకుంటారు. ఆ సారాంశాన్ని గ్రహించి ఆ ప్రకారము జీవితానికి అన్వయించుకొని నడకలో చూపించగలరు. అది వారిని ప్రయోజకులుగా సాక్షులుగా చేస్తుంది.

690. **జ్ఞానము కొరకు వినువారు :** కొందరు బైబిలులో జ్ఞానము పొంది ఇతరులకు చెప్పుటకు ఆశిస్తారు. తలకు ఎక్కించుకోగలరు గానీ హృదయానికి చేరదు.

691. **మత్తుగా వినువారు :** వాక్యము విన్నట్లు లోకాన్ని భ్రమపరచగలరు గానీ గ్రహించలేరు.

692. **కొంత కొంత వినువారు :** వీరు కాల క్షేపము కొరకు వింటూ పిట్ట కథలు హస్య సందర్భాలపై ఆసక్తితో పశ్చాత్తాపం గూర్చిన ప్రసంగాలను గ్రహించలేరు.

693. **విమర్శించుటకే వింటారు :** వాక్యంలో తప్పులు వెదికేవారుగా ఉంటారు.

694. **కేకలు అరుపులకు స్పందించగలరు :** అట్టహాసాలకు ఆకర్షితులై వాక్యం గ్రహించరు.

695. **గొడుగు వేసుకున్నట్టు వింటారు :** వాక్యపు జల్లులు మాకు కాదు ఎదుటి వారికని నమ్ముతారు.

696. జీవితంలో మనం సంపాదించే డబ్బు ఒక చిన్న నాణెము అని తలిస్తే, ఆరోగ్యము పెద్ద నాణెము అనవచ్చు. ప్రేమ అనేది అదృష్టము ఇచ్చే నాణెము

అనుకుంటే స్నేహాలన్ని మధురమైన తీయని నాణెములుగా పోల్చవచ్చు. వీటిని మించి ఈ బంధాలు నిర్లక్ష్యం చేయక భద్రతతో కాపాడుకోగలిగితే అదే గొప్ప బంగారు నాణెము కాగలదు.

697. **భక్తసింగు గారి పరిచర్యలో సేకరించిన ఆణిముత్యాలు :** మనమంతా పరదేశులము యాత్రికులము కద, ఆ జీవిత యాత్రను పవిత్రంగా కొనసాగించాలంటే ఆత్మకు విరోధముగా పోరాడే శరీరాశలను విసర్జించాలి. యాకోబు ఆ నియమాన్ని సక్రమంగా పాటించాడు.

నీవు అన్న నుండి పారిపోయినపుడు బలిపీఠము కట్టాలని దేవుడు తెలిపాడు. తన కుటింబీకుల ఆచారాలను అన్యులను పోలియుండుటను బట్టి మస్తకీ వృక్షము క్రింద ఆ వస్త్రములు పాతిపెట్టాడు. ఆది 35:1

ఆత్మలో మేలుకొలుపు ఉజ్జీవము ఆరంభమైనందున దేవునికి భయపడువారని ఆ స్థానిక ప్రజలు భయపడ్డారు. మనమెట్లు ఉన్నాము?

698. జీవితంలో సంభవించేవన్నీ అంగీకరించకతప్పదు. గతం వెనక్కు నెట్టివేసి భవిష్యత్తును దేవునికి అప్పగించే విశ్వాసాన్ని కలిగి ఆనందంగా జీవించాలి. ఆ చిరునవ్వు నీ చీకటిని వెలుగుగా మార్చగలదు. నీ వైఖరి మారుతుంది. ఆశాభావంతో జీవించే స్ఫూర్తినిస్తుంది.

699. ప్రకృతి జీవిత పాఠాలెన్నో నేర్పిస్తుంది. అది స్వార్థం లేకుండానే అన్నీ ఇతరులకు ఇస్తుంది. నదులలో నీరు ఇతరుల కొరకే అని తెలుపుతుంది. చెట్టు దాని ఫలాలను ఉంచుకోదు. ఇతరులకే ఇస్తుంది. పువ్వుల అందం దానిలోని మకరందాలను అందరికీ పంచిపెడుతుంది. ఇవన్నీ మనకు అందించే పాఠాలేమనగా ఇతరుల కొరకు జీవించు ప్రకృతి నేర్పించే ముఖ్య పాఠము గుర్తెరిగి అవలంబించాలి. బంగారు అనుభవాలు, బంగారు జ్ఞాపకాలు నీ హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

700. ఆత్మ నిబ్బరము అనేది ఏదో మంచి రోజు కోసం ఎదురు చూడడం కాదు. వాస్తవంలో నుండి ఉన్న వనరులలో రాజీపడి సంతోషంగా జీవించాలి. నీవు ఎదరుచూచే ప్రగతి ఆ రోజు కోసం నీవు కోరినట్లే నీకు కనిపిస్తుంది. నీవు ఎదిగే కొలది ఒదిగి ఉంటూ లోకాన్ని ఆశాభావంతో చూడడం నేర్చుకొనే కొలది నీవు మరెక్కువగా విజయాలు సాధించగలవు.

701. ఉదయాన్నే కాఫీ ఎంత రుచి, ఎంత హాయి. కాఫీ కావాలంటే కాఫీ గింజలు పొడిగా మారాలి. పాలతో కలవాలి. పంచదార చేర్చాలి. వేడి చేయాలి.

ఇవన్నీ విడిగా ఉంటే మంచి కాఫీ పొందలేము. అదేవిధంగా సరైన వ్యక్తులతో అందంగా కలిసి మెలిసి జీవిస్తే రుచికరమైన అందమైన జీవితం లభిస్తుంది.

702. నీ బిడ్డలు చాలా గొప్పవారు కావాలని ఎక్కువ డబ్బు సంపాదించాలని విజ్ఞానంతో విసికించరాదు గానీ ఆనందంగా ఎలా జీవించగలమో జీవితము విలువలను నేర్పాలి. ఎందుకంటే వారు పెద్దవారయ్యాక వస్తువులపై ఉన్న ధరలను గమనించలేరు గానీ ప్రతి వస్తువు విలువను దానిని వాడుకొనే విధానాన్ని బాగా గ్రహిస్తారు.

703. క్రీస్తు సిలువ భరించిన కాలములో కురేనీయుడైన సీమోను సిలువను మోసాడు. అరిమతయి యోసేపు క్రీస్తును సిలువ నుండి దించాడు. ప్రియ శిష్యుడు యోహాను సిలువ చెంతనిలచాడు. పౌలు సిలువ శక్తిని గూర్చి ప్రకటించాడు. నీవు నేను ఏమి చేస్తున్నామా?

704. కన్నీళ్ళలో ప్రక్షాళన చేయబడిన కండ్లు స్పష్టంగా చూడగలవు. అంతులేని దుఃఖాలని అందించిన దుఃఖ పరిస్థితులు మనకు విజ్ఞానము వికాసం కోసం నేర్పించే విశ్వవిద్యాలయాలు. ధనబలం కంటే దైవ బలం గొప్పది. భుజ బలం కంటె బుద్ధి బలం గొప్పది. ధీరత్వం కంటె వినయము గొప్పది.

705. దేవునితో స్నేహము మధురమైనది. ఆ స్నేహము దీపము వంటిది. వెలిగించడము సులభమే అది ఆరిపోకుండా కాపాడుకొనుటకు శ్రద్ధ తీసికోవాలి. ఆవేశము కంటె ఆలోచన గొప్పది. పరిచర్య కంటె ప్రవర్తన గొప్పది. ప్రసంగం కంటె ప్రార్థన గొప్పది. భూలోకం కంటె పరలోకం గొప్పది.

706. ఈ జీవితము దేవుడిచ్చిన బహుమానము. విలువైన వరఫలితము. అది అర్థము కాని వయస్సులో ఆనందమునిస్తుంది. అర్థం అయ్యేసరికి కన్నీళ్ళు తెప్పిస్తుంది. మన కన్నీరు దాచే దేవుడున్నాడు. కన్నీరంతా తుడిచే దేవుడు మనకు యిచ్చే గొప్ప అభయ హస్తాలు. “భయపడకుము నీ కుడి చేయి పట్టుకొనుచున్నాను. నిన్ను విడువను ఎడబాయను”.

707. కంటితో చూడని, చెవులతో విననివి ఎన్నడూ నమ్మరాదు. ఇతరులతో ఎక్కువ వ్యర్థ ప్రసంగాలు చేయవద్దు. అందువల్ల కొన్ని బంధాలు దూరంకాగలవు గనుక జాగ్రత్త వహించాలి. యితరులకు ఉచిత సలహాలిస్తాము గాని స్వీయానుభవంతోనే చెప్పాలి.

708. ప్రార్థన దేవునితో చేయు సంభాషణ. క్రైస్తవునికి వెన్నెముక వంటిది. ప్రార్థన ప్రతి వ్యక్తికి కేడెము. దేవునికి అర్పణ. సాతానుకు కొరడా. మన నిజ స్థితిని ఒప్పుకొనుట. పరలోకపు తలుపులు తెరిచే తాళపుచెవి.

709. **బైబిలులో ప్రవక్తల పేర్లు వాటి అర్థములు :**

1) ఆమోసు = భారము మోయువాడు / నిర్మాత.
2) ఎలీషా = యెహోవా అతని రక్షణ / దేవుడే రక్షణ.
3) ఏలియా = యెహోవాయే నా దేవుడు.
4) ఓబద్యా = యెహోవా సేవకుడు / భక్తుడు.
5) జెకర్యా = యెహోవా జ్ఞాపకము / గుర్తుంచుకొనును.
6) జెఫన్యా = యెహోవా దాచిపెట్టును.
7) దానియేలు = యెహోవా న్యాయమూర్తి / దేవుడే న్యాయం
8) నహూము = ఆదరణ.
9) మలాకీ = నా వార్తావహుడు / నా దూత.
10) మీకా = యెహోవా వంటి వారెవరు?
11) యిర్మియా = యెహోవా స్థిరపరచును / ఘనుడు.
12) యెషయా = యెహోవా స్థిరపరచును / రక్షించును.
13) యెహెజ్కేలు = దేవుడు బలపరచును.
14) యెహోషువ = యెహోవాయే రక్షణ
15) యోనా = పావురము / గువ్వ.
16) సమూయేలు = యెహోవా నామము
17) హగ్గయి = యెహోవా పండుగ, ఆశాజ్యోతి
18) హబక్కూకు = కౌగిలి, పరిశుద్ధ దేవుడు
19) హోషేయా = రక్షణ
20) జెఫన్యా = ఇశ్రాయేలు రాజు
21) జెకర్యా = నీతి కొమ్మ
25) మలాకీ = నీతి సూర్యుడు

710. అత్యంత స్వార్థపూరితమైన నేను అనే పదాన్ని మరిచిపోదాము. అత్యంత తృప్తి కరమైన మనం అనే పదాన్ని ఆచరిద్దాము. అత్యంత ప్రమాదకరమైన అహం అనే పదాన్ని విడగొడదాము. అత్యంత వేగంగా వ్యాపించే వదంతులను

అరికడదాము. అత్యంత విలువైన స్నేహాన్ని నింపుకుందాము. అత్యంత శ్రద్ధ కృషి ద్వారా విజయాన్ని సాధిద్దాము. అత్యంత ప్రమాదకరమైన పగ, ఈర్ష్య ద్వేషాలకు దూరంగా ఉందాము. అత్యంత ప్రేమలో ఆదరించే క్రీస్తును వెంబడిద్దాం.

711. జీవితంలో నిరాశతో కృంగియున్న సమయాల్లో దేవుడు మనల్ని సమీపిస్తాడు. నిరాశతో అన్ని వదిలి వేసికొనే సమయాల్లో ప్రోత్సాహమిచ్చి నిలబెట్టగలడు. కలవరం చెలరేగిన వేళల్లో మనలను చేయి పట్టుకొని ఆదుకొని నడిపిస్తూ అభయమిస్తాడు. ఆ క్రీస్తు మనపట్ల అధిక శ్రద్ధ కల్గిన ప్రేమిస్తాడు.

712. ఒక బెలూన్ గాలిలో స్వేచ్ఛగా ఎగరాలంటే ఆకాశము ఆధారము కాదు. గాలిలో నున్న గాలి పైకి ఎగిరేందుకు సహాయపడకలదు. మనకు నిత్యం సహాయపడే పరిశుద్ధాత్మ శక్తి మనకు ప్రోత్సాహము, ఉత్సాహము, అధిక ఉజ్జీవాన్నందిస్తూ ఉత్తమమైన ఉన్నత శిఖరాలకు నడిపిస్తుంది.

713. దేవుని అపార కృపలో దాగిన ఐశ్వర్యాన్ని ప్రేమతో నిండిన సంపదను దయతో కూడిన ఆదరణను, దైవ సన్నిధి వల్ల లభించే అత్యధిక బలము శక్తి ప్రభావము, ఆయన భద్రతతో తాకే అప్యాయత నిండిన స్పర్శ మనకు గొప్ప ఆశీర్వాదానందిస్తుంది.

714. ప్రార్థన అనగా క్రీస్తు నామములో మన పాపాలను ఒప్పుకుంటూ ఆయన చూపిన కృప, దయ, వాత్సల్యము కొరకు సదా వందనాలు చెల్లిస్తూ మన హృదయంలోని కోరికలు చెప్పుకుంటూ ఆయన సంపూర్ణ చిత్తాన్ని పూర్తిగా తెలిసికొనుట. ప్రార్థన అనగా రాజుల రాజు, ప్రభువులకు ప్రభువైన క్రీస్తు సింహాసనము యొద్దకు వెళ్ళుట. ఆయనను హృదయ పూర్వకముగా స్తుతించి ఆరాధించుట.

715. జీవితంలో ఎవరైనా నిన్ను ప్రత్యేకంగా గుర్తించి అభినందిస్తే అది నీ మంచితనం. నీలో సుగుణాల ఫలితమని గుర్తించి మరింత భక్తితో దేవుని కృప పొందావని గుర్తించి మరింత మంచిని నీలో పెంచుకో.

716. నీ చిరునవ్వులో నీ మంచి హృదయం ఇతరులు గుర్తించగలరు. నీలో నిబ్బరమైన ప్రవర్తన పరిణత గల దృక్పథము వల్ల కలిగినదని తెలిసికొనగలరు. ఈ రెండు లక్షణాలు కలిగిన వ్యక్తులలో సవాళ్ళను ఎదుర్కొన గల ధైర్యము పరిపూర్ణ మానవత్వం నిండిన వారిగా గౌరవిస్తారు.

717. క్రైస్తవ్యంలో చూడాల్సినది

హోదా కాదు బోధ – మందిరము కాదు మంద – ఆస్తి ఎదుగుదల కాదు ఆత్మీయ ఎదుగుదల – బట్టల్లో భక్తిని కాదు – బ్రతుకులో భక్తిని కనపర్చాలి.

718. మన ముందున్న వ్యక్తులు ఎంత ప్రగతిని సాధించే వారైనా నీ వెనుక నిలిచిన వ్యక్తులు ఎందరున్నా లెక్కగా పరిగణించలేము. గానీ ప్రస్తుతం నీతో ఉండే స్నేహితులే లెక్క.

719. మంచి సూర్యకాంతి, విశ్రాంతి, మంచి శారీరక, ఆత్మీయ వ్యాయామము, శారీరక ఆధ్యాత్మిక ఆహారము కలిగి ఆత్మ స్థైర్యంతో నిబ్బరంగా జీవిస్తూ మంచి స్నేహితులను కలిగి ఉండాలి.

720. ఇతరులను విమర్శిస్తూ, నిరంతరము సణుగుతూ, విసుగులో కాలము గడుపుచూ, ఇతరులను కించపరచువారు ఎప్పుడూ విచారంగా ఉంటారు. వారిలో ఆనందము కరువవుతుంది.

721. దేవుడు ప్రతి ఒక్కరిని ప్రత్యేక రీతిగా ప్రత్యేక పనులకై ఇష్టంగా సృష్టించు కున్నారు. అది గుర్తించాలి. ఎవరికి వారు గౌరవించుకోవాలి. విజయము తప్పక వరిస్తుంది. క్రీస్తు మన పక్షంగా ఉంటే విరోధి ఎవరు?

722. స్త్రీ ప్రేమ క్రియాత్మకమైనది. ఆమె హృదయముతో చూడగలదు. కండ్లతో భావాలు తెలుపగలదు, ఒక తల్లి అనేక వనరులను దాచగల బ్యాంకు వంటిది. కుటుంబంలోని వ్యక్తుల బాధలను మానసిక గాయాలను కోపతాపాలన్నీ భద్రంగా ఓర్పుతో తనతో దాచుకోగలదు. అంతే కాదు ఆమె కట్టడానికి సిమెంట్ ఎంత ప్రాముఖ్యతనిస్తూ బలాన్నందిస్తుందో అంతగా ప్రేమాను రాగాలను అందిస్తూ జీవితకాలము త్యాగ భావంతో అందరినీ భద్రతతో కాపాడుకుంటుంది. భక్తి గల స్త్రీగా ఆమె సామెతలు 31వ అధ్యాయంలో గల ప్రశంశలకు తగినట్లు జీవిస్తుంది.

723. ఈ జీవిత గమనంలో ప్రతి వ్యక్తి ఒకరితో ఒకరు మనస్సు విప్పి మాట్లాడు కోగలిగితే ఈ ప్రపంచంలో సమస్యలు సమసిపోతాయి.

724. ఒక పక్షి బ్రతికి ఉన్నప్పుడు చీమల్ని తింటుంది. ఆ పక్షి మరణించాక దానిని చీమలు తింటాయి. పరిస్థితులెన్నడైన తారుమారు కాగలవు గాని మన జీవితంలో మన మాటలు క్రియలు దేవుడు కోరినట్లు ఎవర్నీ తృణీకరించరాదు. దీనత్వం దయతో జీవించాలి. నేడు నీవే శక్తిమంతుడవని భ్రమపడవచ్చు గానీ కాలం మరింత శక్తి గలది.

725. ఒక చెట్టులోని కలపతో ఎన్నో అగ్గి పుల్లలను తయారు చేగలము గానీ కానీ లక్షల చెట్లను ఒక బూడిద చేయుటకు వెలిగించిన అగ్గిపుల్ల చాలు అందువల్ల దేవుడు మనలను తన రూపంలో చేయగా మంచి వ్యక్తులుగా జీవించాలని ఆశించుచున్నాడు గనుక దేవునికి సాక్షులుగా మంచిగా జీవించాలి.

726. దేవునిపై నిరీక్షించుచు ఆశాభావంతో జీవిస్తే ప్రతి శబ్ధము సంగీతంగా వినిపిస్తుంది. ప్రతి కదలిక నాట్యముగా మారి చిరునవ్వు హాస్యంగా నిలుస్తుంది. మెదడు ఆధ్యాత్మిక ధ్యానమందిరముగా మారిపోతుంది.

727. మన జీవిత గమనంలో అతి వినయంగా చెప్పగల మాట దావీదు తెలిపారు. నేనింతగా దీవించబడుటకు నేను ఏపాటివాడను ప్రభువా అన్నాడు. 2సమూ 7:18.
అయితే అతి శక్తివంతమైన మరొక మాట ఏదనగా నన్ను బలపరచువాని యందే సమస్తము చేయగలను. ఫిలిప్పీ 4:13

728. కొన్ని సందర్భాలలో మన జీవితంలో పరిచయమైన వ్యక్తులు ఎందుకు పరిచయమవుతారో తెలియదు. రక్త సంబంధులు కావాలనే కారణము దొరకదు. ఆరంభము నుండి సుపరిచితులేమి కాలేరు గానీ ఆత్మ బంధువులుగా క్రీస్తు రక్తంలో కడుగబడిన వారిగా మంచి సహవాసంలో అన్యోన్యత గల వారమై కలిసి ఆరాధిస్తూ ప్రార్థించగలము.

729. మన ప్రార్థన రోజు ఏరీతిగా కొనసాగించగలమనగా ప్రభువా, ప్రతి ఉదయము సరిక్రొత్తగా బహుమతిగా అందిస్తున్నందుకై వందనాలు మీ కృప దయ కాపుదల నా కుటుంబంపై స్నేహితులు బంధువర్గంపై నిలుపండి నా హృదయము నిండుగా పట్టగలిగిన జ్ఞాపకాలతో సంతోషపెట్టుడి.

730. దేవుడు మనకు ప్రసాదించిన శరీర భాగాలను సక్రమంగా ఉపయోగించాలి. నీ స్వరాన్ని దయతో మాట్లాడుటకు ఉపయోగించాలి. నీ చెవులు దయగల మాటలు ప్రేమగల మాటలు వినే రీతిగా యోగ్యంగా వాడుకోవాలి. నీ చేతులను మంచి పనులను చేయుటకు దాతృత్వంతో ఇతరులకు సమాయపడాలని తలంచాలి. నీ మనస్సు ఎల్లప్పుడూ సత్యాన్ని గురించి ఆలోచించాలి. నీ హృదయం నిండా ప్రేమను నింపుకొని ఆదర్శవంతంగా జీవించాలి.

731. దేవునితో సహవాసం చేసేవాడు నిర్భయంగా ఉంటాడు. దేవునితో సహవాసం చేయనివాడు అయోమయంగా ఉంటాడు.

732. నిజాయితీ లేనివాడు నీతితక్కువ వాడుగా ఉంటాడు. నీతి తక్కువ వాడు ఖ్యాతిలేని వాడుగా ఉంటాడు.

733. పాములోనున్న వివేకాన్ని నేర్చుకోమని యేసు ప్రభువు చెప్పారు. కాని మనిషి పామువలె కాటు వేయడం నేర్చుకొన్నాడు.

734. **జీవిత యాత్రలో గుర్తించుకోదగిన పది ప్రాముఖ్యమైన విలువలు**

ఎ) నీవు ప్రయాణించే కారు ఎంత ఖరీదైనది ఏ రంగులో ఉన్నదీ ముఖ్యము కాదు గాని అవసరములో ఉన్న అసహాయులెందరిని ఎక్కించుకొని సహాయ పడ్డావో ఆలోచించుకో.

బి) నీ ఇల్లు ఎంత పెద్దగా ఉన్నదీ ఎంత అందంగా ఉన్నది, ఎంత ఖరీదైనది ముఖ్యము కాదు గాని ఆ ఇంటికి ఆహ్వానించి ప్రేమించి ఎంతమందికి ఆతిథ్యమిచ్చావో అదే ముఖ్యం.

సి) నీవు క్రమంగా ఎంత సంపాదిస్తున్నావో ముఖ్యం కాదు గాని అది సంపాదించే సామర్థ్యం వెనుక ఎందరున్నారో జ్ఞాపకముంచుకొనుట అవసరము.

డి) నీవు ఏ సంస్థలో ఎంత ప్రాముఖ్యత గల ఉద్యోగిగా పేరు పొందావో ముఖ్యము కాదు గానీ ఆ ఉద్యోగాన్ని ఎంత సమర్థతతో ప్రగతి పథంలో కొనసాగిస్తున్నావో ఆలోచించు.

ఇ) నీకెందరు స్నేహితులున్నారో ముఖ్యము కాదు గానీ నీవు ఎందరికి మంచి స్నేహితునిగా ఉన్నావో గుర్తించుకో.

ఎఫ్) నీ పొరుగువారితో నీవెట్లున్నావు? నీ వెట్టి సంబంధం కలిగియున్నావో ఆలోచించుకో.

జి) నీవు రక్షింపబడిన కాలమంతటిలో ఎప్పుడైనా పరలోక రాజ్యంలో నీకు స్థానముందనే స్థిర నిశ్చయత గలదా?

హెచ్) నీ ఇంట్లో ఎన్ని జతల బట్టలు దాచుకొని వాడుచున్నావు? అది ప్రాముఖ్యము కాదు గానీ ఎందరు వస్త్రహీనులకు నీ వస్త్రములను అందించి పేదలను ప్రేమించావో ఆలోచించు.

735. క్రీస్తు నీకిచ్చిన తలాంతులను వాడుకొనుటకు గుర్తించావా? ఆయన చిత్తాన్ని గ్రహించి నీ ధనము నీ సమయము తలాంతులన్నీ దేవుని కొరకే వాడుచు క్రీస్తు దేవుని ప్రేమను రుచి చూచి తెలిసికొని మౌనంగా ఉన్నావా? సాక్ష్యమిస్తున్నావా ఆలోచించు.

736. **విశ్వాసి అభివృద్ధికి ఏడు మెట్లు**

జ్ఞానము ఇల్లు కట్టుకొని ఏడు స్తంభములు కట్టుకొన్నది. సామె 9:11

737. **ఆత్మానుసారముగా నడచుకొనుట నేర్చుకోవాలి**

యెహోవాయందలి భయభక్తులే జ్ఞానమనియు, దుష్టత్వము విడచిపెట్టుట వివేచన. యోబు 28:28

కోపము, ద్వేషము, అసూయ, అబద్ధము, అన్యాయము బదులుగా ప్రేమ, సంతోషము వంటి ఆత్మ ఫలాలు పండించాలి. వాక్యం ప్రార్థన సహవాసాలు కోరుకోవాలి.

738. నీటి బాప్తిస్మము రక్షణ పొందిన తరువాత తీసికొనవలసిన అనుభవం తండ్రి కుమార, పరిశుద్ధాత్మ పేర బాప్తిస్మము తర్వాత క్రమంగా ఆలయానికి వెళ్లి ఆరాధించి స్తుతించి కానుకలు చెల్లిస్తూ ఆధ్యాత్మికంగా వర్ధిల్లాలి.

739. ప్రేమలో పరిపూర్ణులు కావాలి. నీ ఇంటి వారిని స్నేహితులను మాత్రమే కాక నిన్ను ద్వేషించువారిని నీకు హాని చేయువారిని కూడ ప్రేమించాలి. ప్రేమ లేని భక్తి వ్యర్థము. 1 కొరింథీ 13:1,2

740. **నీ హృదయము పవిత్రంగా కాపాడుకోవాలి:** మన మనస్సాక్షిని అపవిత్ర పరిచే ప్రతి చిన్న పాపమును ఒప్పుకొని సరి చేసుకుంటూ దేవుని ముందు మనుష్యుల ముందు నీ మనస్సాక్షి పవిత్రంగా కాపాడుకోవాలి. అపో 24:16 అట్టివారిని సైతాను కదల్చలేదు.

741. **ప్రతి చోట సాక్షిగా జీవించాలి** : నశించిపోతున్న ఆత్మల కొరకైన భారం కలిగి ఉండాలి. కత్తికి పదును పెట్టుట అనగా వాడాలి లేనిచో తుప్పుపడు తుంది. నీ సాక్ష్యము వినువారికి మేలుకరంగా ఉంటుంది. యోహాను 4:1-42

742. **దేవునికి ధారాళంగా ఇవ్వాలి :** పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యత. దేవుని సేవకు దేవుని నామంలో పేదలకు కొరతలో ఉన్న వారికి ఇవ్వడం నేర్చుకోవాలి. అపో 20:35

743. **దేవుని రాక కొరకు సిద్ధపడాలి :** మన భక్తి మన బ్రతుకు ఈ లోక జీవితమునకు పరిమితం కాదని ప్రభుని రాకడకై సిద్ధపడుచు ఉన్న వాటిపై మనస్సు ఉంచాలి. ఎఫెస్సీ. 4:15 కొలొస్సి 3:1-3 క్రీస్తు స్వారూప్యంలోనికి ఎదగాలి.

744. **విశ్వాసి అనుసరించదగినవి**

| | |
|---|---|
| 1) ధర్మ శాస్త్రమా? | భయంతో వణకాలి |
| 2) లేఖనమా? | పరిశీలించు |
| 3) ప్రవచనమా? | సాగిలపడి అంగీకరించు |
| 4) తండ్రి స్వరమా? | భయభక్తులతో చెవియొగ్గుము |
| 5) క్రీస్తు స్వరమా? | ప్రేమతో వెంబడించు |
| 6) పరిశుద్ధాత్మ స్వరమా? | వెంటనే లోబడుము |
| 7) కీర్తనలా? | సంతోషముగా పాడుము |
| 8) సువార్తయా? | విశ్వసించి మారుమనస్సు పొందు |
| 9) సత్యమా? | మారుమనస్సు పొందు సాక్షిగా జీవించు |

745. మిషనరీ అనగా ఎవరు? లక్షణాలు ఏవి?

ఒక ప్రత్యేక పని కొరకు ప్రత్యేకమైన ప్రదేశానికి ప్రత్యేకమైన ఉద్ధేశ్యంతో పంపబడినవాడు. సంపూర్ణ సమర్పణ రక్షణానుభవం తరువాత పొందిన పిదప భారంతో ప్రార్థన చేస్తే దేవుని పిలుపు పొందెదరు. దేవుని వాక్యము ద్వారా భక్తుల ద్వారా పరిస్థితుల ద్వారా ప్రభువు తన పనికి పిలుచును

**లక్షణములు :**

| | |
|---|---|
| 1) మారుమనస్సు పొందాలి | యోహాను 3:3 |
| 2) ప్రేమ కలిగి ఉండాలి | 1 కొరింథీ 5:14 |
| 3) సమర్పణ కలిగి ఉండాలి | రోమా 12:12 |
| 4) క్రమ శిక్షణ కలిగి ఉండాలి | 2 కొరింథీ 9:17 |
| 5) ఆత్మల పట్ల భారం ఉండాలి | మార్కు 6:34 |
| 6) విశ్వాసము ఆసక్తి ఉండాలి | రోమా 1:17 |
| 7) నిస్వార్థ ప్రార్థనా జీవితము ఉండాలి | లూకా 9:23, మార్కు 1:35 |

408. మన పేర్లు దేవుడు గుర్తుంచుకోగలడు ఆది 6:13

| | |
|---|---|
| దేవుడు మన కొరకు ఆలోచన చేస్తూ ఉంటారు | కీర్తనలు 139 |
| మన పక్షముగా యుద్ధము చేస్తారు | నిర్గమ 14:14 |

మనకు ఆశ్రయమైయున్నారు కీర్తనలు 62:6
మన గూర్చి ప్రత్యేక ప్రణాళికలు కల్గి యున్నాడు యిర్మియా 29:11
ఆయన సదాకాలము మనకు తోడుగా ఉంటారు మత్తయి 28:20
నిన్ను విడువను, నిన్ను ఎడబాయను, నిబ్బరము కలిగి ధైర్యము ఉండాలని అభయమిస్తారు. యెహోషువ 1:6

746. **ప్రార్థన గొప్ప ఫలితాలను ఇస్తుంది**

1) ప్రార్థన పరిస్థితులను మార్చును.
2) ప్రార్థన భద్రత ఇస్తుంది.
3) దేవుని చిత్తంలో ఇమిడిపోవుటకు సహకరిస్తుంది.
4) ప్రార్థన దేవునికి అతి సన్నిహితులనుగా చేస్తుంది.
5) ప్రార్థన సంతోషభరితులను చేస్తుంది.
6) ప్రార్థన నిరీక్షణ కలిగిస్తుంది.
7) ప్రార్థన ద్వారా స్వార్థమును విడనాడి నిస్వార్థపరులుగా మార్చును.
8) అన్ని బాధల నుండి ప్రార్థన నెమ్మది ఇస్తుంది.
9) ప్రార్థన ద్వారా ఆధ్యాత్మిక ఉన్నతిని చేరగలము.

747. నేను రిక్తుడనని చెప్పు మాట వినయముతో కూడినది. దేవుని సన్నిధి నాతో లేనిచో నేను వ్యర్థుడను. దేవుని సహాయముతో సమస్తము చేయగలను అను మాట అతి శక్తివంతమైనది.

748. సముద్రములో నీరెంతుందో – శాస్త్రవేత్తలు కొలవలేరు. సముద్రపు ఒడ్డున ఇసుకెంతుందో – తత్వవేత్తలు తూచలేరు వాటినక్కడ ఉంచిన దేవుడెంతటి వాడో – మతఛాందస్సులు గ్రహించలేరు.

749. దేవాలయము మన కళాశాల. పరలోకము మన విశ్వ విద్యాలయం. పరిశుద్ధాత్ముడు మన ఉపాధ్యాయుడు. దేవదూతలు మన తోటి విధ్యార్థులు. బైబిలు మన పాఠ్య గ్రంథము. శ్రమలు శోధనలే మన పరీక్షలు. ఆత్మల సంపాదన. మన ఇంటి పని. జీవ కిరీటము మనము పొందు డిగ్రీ. ప్రార్థన క్రమంగా చేయుట మన హాజరు పట్టీ స్తుతి ఆరాధన తరగతి గదిలో మన అభ్యాసం.

750. **వివిధ విశ్వాసములేవనగా**

| | |
|---|---|
| 1) గొప్ప విశ్వాసము | మత్తయి 8:10-28 |
| 2) అల్ప విశ్వాసము | రోమా 4:1 |
| 3) స్వల్ప విశ్వాసము | లూకా 12:28 |
| 4) రక్షించే విశ్వాసము | ఎఫెస్సీ. 2:8 |
| 5) స్వస్థపరచు విశ్వాసము | మార్కు 10:52 |
| 6) మృతమగు విశ్వాసము | యాకోబు 2:17 |
| 7) బలమైన విశ్వాసము | రోమా 4:20 |
| 8) సంపద నిండిన విశ్వాసము | యాకోబు 2:5 |
| 9) ఆవగింజ విశ్వాసము | మత్తయి 17:20 |
| 10) జయించగల విశ్వాసము | 1యోహాను 5:4 |
| 11) అభివృద్ధి చెందు విశ్వాసము | 2 థెస్స 1:3 |
| 12) సృజనాత్మక విశ్వాసము | హెబ్రీ 11:3 |
| 13) ప్రార్థించే విశ్వాసము | యాకోబు 5:14 |
| 14) ప్రయత్నించు విశ్వాసము | 1పేతురు 1:7 |
| 15) విశ్వాస పరిణామం | రోమా 12:3 |
| 16) తీర్పు తీర్చగల విశ్వాసము | రోమా 5:1 |
| 17) పరిపూర్ణ విశ్వాసము | యాకోబు 2:22 |
| 18) వాక్య రూపకమగు విశ్వాసము | రోమా 10:8 |
| 19) పరిశుద్ధపరచు విశ్వాసము | అపో 15:8, 9 |
| 20) పరిపూర్ణ శుద్ధత ఇచ్చు విశ్వాసము | అపో 26:18 |
| 21) ఆత్మీయతనిచ్చే విశ్వాసము | 2కొరింథీ 4:13 |
| 22) విశ్వాసము నడక | 2 కొరింథీ 5:7 |
| 23) కవచము గల విశ్వాసము | ఎఫెస్సీ. 6:16 |
| 24) గుండెకు తగిలించుకొనే ఇత్తడి కవచం వంటి విశ్వాసము | 1థెస్స 5:8 |
| 25) ఐక్యతనిచ్చు విశ్వాసము | ఎఫెస్సీ. 4:13 |

| | |
|---|---|
| 26) అచంచల విశ్వాసము | కొలస్సీ 2:5 |
| 27) విశ్వాస బహుమానము | 1కొరింథీ 12:9 |
| 28) విశ్వాస రాహిత్యము | మత్తయి 4:40 |
| 29) కనబడే విశ్వాసము | మత్తయి 9:2 |
| 30) అపజయం లేని విశ్వాసము | లూకా 22:32 |
| 31) సంపూర్ణమైన విశ్వాసము | అపో 6:5 |
| 32) విశ్వాస ద్వారము | అపో 14:27 |
| 33) పరస్పర విశ్వాసము | రోమా 1:12 |
| 34) విశ్వాసమునకే విశ్వాసము | రోమా 1:17 |
| 35) జీవించే విశ్వాసము | రోమా 1:17 |
| 36) విశ్వాస నియమము | రోమా 3:27 |
| 37) మాట్లాడు విశ్వాసము | రోమా 10:6 |
| 38) నిలిచే విశ్వాసము | రోమా 11:20 |
| 39) విశ్వాస గృహము | గలతీ 6:10 |
| 40) ఏకైక విశ్వాసము | ఎఫెస్సీ 4:5 |
| 41) పునాదిగా ఉన్న విశ్వాసము | కొలస్సీ 1:23 |
| 42) విశ్వాస క్రియ | 1థెస్స 1ం3 |
| 43) మొదటి విశ్వాసము | 1తిమో 5:12 |
| 44) విశ్వాస పోరాటము | 2తిమో 1ం5 |
| 45) విశ్వాసములో నిలచుట | 2తిమో 4:7 |
| 46) సామాన్య విశ్వాసము | తీతు 1:4 |
| 47) నిశ్చల విశ్వాసము | తీతు 2:2 |
| 48) గురి చూచే విశ్వాసము | ఫిలిప్పీ 1:6 |
| 49) అమూల్య విశ్వాసము | 2పేతురు 1:1 |
| 50) పరిశుద్ధ విశ్వాసము | యూదా 20 |

751. మనము ప్రార్థించే సమయంలో మనము చెప్పిన దానికన్నా ఎక్కువగా వింటారు. అడిగిన దాని కన్నా ఎక్కువగా వింటారు. అడిగిన దాని కన్నా ఎక్కువగా జవాబు ఇస్తారు. ఊహించిన రీతిగా ఎక్కువ ఫలితము అందిస్తారు ఆయన తగిన సమయంలో తగిన రీతిగా జవాబిచ్చి ఆదరిస్తారు.

752. ఒక చెట్టును గమనిస్తే పువ్వులన్ని రాలిపోవుటను బట్టి లక్ష్యపెట్టక పోవచ్చు గాని క్రొత్త పూలు పూయించే ప్రయత్నంలోనె ఉంటుంది. అదే రీతిగా నిజ జీవితంలో గతంలో కోల్పోయిన విషయాలు కాదు గాని భవిష్యత్తులో సాధించవలసినవి గమనించాలి.

753. నవ్వడం నవ్వించడం అలవాటయితే జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు ఏమి చేయలేవు. భక్తితో ప్రార్థన జోడిస్తే జీవితము సఫలము కాగలదు. ప్రభూ నా జీవితం సులభతరం చేయాలని ప్రార్థించను గానీ నేనెదుర్కొనే శ్రమలు, శోధనలు బాధలను తట్టుకోగలిగే ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదించండి అని ప్రార్థించాలి.

754. ఒకసారి ఒక వ్యక్తి దేవుని సూటిగా ప్రశ్నించాడట ప్రభూ నీవు చూపే ప్రేమకు నా ప్రేమకు తేడా ఏమి? నా ప్రేమ ఆకాశంలో విహరించే పక్షి వంటిది. నీ ప్రేమ పంజరంలో దాచి బంధించిన పక్షి వంటిది. నా ప్రేమ అపరిమితం విశ్వమంత విశాలమైనది. నీవలె సంకుచితమైనది కాదు.

755. మన జీవితంలో మన ఇంటి వారిని, సమాజంలో వారిని, సంతోష పెట్టాలంటే మన చేతిలో పని కాదు. కాని, అందరిని ప్రేమిస్తూ పలుకరిస్తూ ఆనందంగా ఉంటూ ఆనందంపంచు. ఇతరులకు నీవిచ్చే సంతోషం నీలోనూ కలుగుతుంది.

756. స్నేహ భావాలు హృదయానుభూతితో సత్సబంధం కలిగి అద్భుతాలు చేయగలదు. ఆ మధుర తలంపులు ఎప్పుడు ఆరంభము కాగలవో అర్థం కాదు గాని ఆ స్నేహ మధురిమ సాధారణమైనది కాదు గాని దేవుడు మనకందించిన గొప్ప బహుమతి అని తెలిసికోగలము.

757. ఈ ప్రపంచంలో అనేక ఋగ్మతలను ఉచితంగా స్వస్థపరచగల ఏకైక ఔషధము మీ చిరునవ్వు. పౌలు చెప్పినట్లు ఎల్లప్పుడూ ఆనందించండి. అనే ఆదేశాన్ని పాటించాలి. దేవుడు నిత్యమైన అమూల్యమైన మూలరాయిగా ఉన్నారు. ఆయన దయ, ప్రేమ, మంచితనము అనిర్వచనీయం. ఎడతెగని వాత్సల్యముతో నిరీక్షణనందించి నిత్యరాజ్య వారసులను చేయగల సమర్థుడు దేవుడే. నిత్యత్వములో చేరు వరకు నిత్యం ఆనందంగా ఉంచగలడు.

758. మన స్నేహితుల కోసం ప్రార్థన విధి ఏమనగా ప్రభూ! నా స్నేహితులంతా క్షేమంగా ఉండి ఆనందంగా జీవించాలి. ఎన్నో ఒత్తిడిలను, శోధనలను తట్టుకునే ధన్యత లభించాలని నిన్ను ప్రాధేయపడి అడుగుచున్నాను. నావారంతా నీపై ఆధారపడి జీవిస్తూ ఆనందంగా జీవించు భాగ్యాన్ని అందించండి. ఆమెన్

759. చెత్త విస్తారముగా ఉన్నచోట, గోడకట్ట లేమని చెప్పెను నెహెమ్యా 4:10. దైవసేవకై నెహెమ్యా బలమైన కట్టడకు చెత్త తొలగించాలని తలంచాడు. చెత్త అనగా మానవ కల్పితములైన పద్దతులు, ఆచారములు అని భావించాలి. ఈ చెత్త మానవ కల్పితములైన పద్ధతులను ఆచారములను అలవాట్లను సూచిస్తుంది.

దేవుని పని బలముగా జరుగవలెనన్న మనము లోపల బలహీనత అనే చెత్త తొలగించాలి. వాక్యమును నిర్లక్ష్యము పెట్టిన మానవ కల్పిత పద్ధతులు ఆచారాలు అలవాట్లు అలవరచరాదు. కొన్ని సంఘములలో స్థానముల కొరకు దేవుని ఇంటిలో కలహములు, విభజనలు గుంపులు అనే చెత్తను ప్రోగు చేస్తున్నారు. ఐక్యత లేక భేదభావము కలిగియుండుట అను చెత్తకు కారణమగును. ఈ కష్టము జయించుటకు సహవాసం ప్రార్థన ఉజ్జీవం కొరకు ప్రయాసపడాలి.

760. మనము దేవుని రాజ్యాన్ని నీతిని ముందు వెదకాలి. అన్నియు మనకు సమకూర్చి అందించి ఆదుకొనే క్రీస్తును ఆశ్రయించాలి. మన స్థాయిని బట్టి మాట్లాడకూడదు గాని మన మాటలకే ఒక స్థాయి వచ్చేలాగా మన జీవితం దేవుని కేంద్రంగా ఉంచుకొని జీవించాలి.

761. ఆత్మీయతలో ఏ స్థాయిలో ఉన్ననూ కొన్ని ప్రశ్నల ద్వారా స్వపరీక్ష అవసరము.

1) ప్రార్థన జీవితంలో క్రమమున్నదా? అపొ 3:1 లూకా 5:15
2) బైబిలు ధ్యానంలో క్రమమున్నదా? ఎజ్రా 7:10, లూకా 4:16
3) పరిశుద్ధంగా ఉండాలనే తలంపు నీలో ఉందా? సామె 4:23
4) నీ నోటి మాట, హృదయ ధ్యానం అంగీకారంగా ఉందా? యాకోబు 3:1,2
5) ఆడంబరాలకు, లోకాశలకు అతీతంగా ఉన్నావా? ఫిలిప్పీ 4:11-13

762. అద్భుతమైన ఆదర్శాలు గల ఉత్తమ వ్యక్తి లక్షణమేమనగా ఆ వ్యక్తి ఇతరులలో మంచిని స్పష్టంగా చూడగలరు. అట్టివారే దేవునికి ఇష్టమైనవారు. వారే రీతిగా ఉండాలి?

1) వాక్యాన్ని పట్టుకొని నడిచేవారు కాదు వాక్య ప్రకారము నడిచేవారు దేవునికి ఇష్టం.
2) సువార్త ప్రకటించేవారు కాదు వారి ప్రవర్తన ద్వారా సువార్త ప్రకటించడం దేవునికి ఇష్టం, ఆత్మ శక్తితో ప్రకటించాలి.

3) దశమ భాగాలు ఇచ్చేవారికన్నా దరిద్రులను ఆదరించేవారు దేవునికి ఇష్టం.

4) ఉపవాసం ఉండేవారు కాదు ఆకలిగొన్న వారికి పెట్టేవారు దేవునికి ఇష్టం.

5) ప్రభువా ప్రభువా అంటూ ప్రాకులాడేవాడు కాదు, ప్రభువు చిత్త ప్రకారము నడచుకొనేవాడు దేవునికి ఇష్టం.

6) రొట్టె ద్రాక్షరసం తీసుకొనేవాడు కాదు పరిశుద్ధాత్మ దేవుడు మనలో ఉన్నాడని భయభక్తులతో నడచుకొనేవాడు దేవునికి ఇష్టం.

7) బాప్తిస్మం తీసుకునేవాడు కాదు తన హృదయాన్ని శుద్ధి చేసుకొని పరిశుద్ధంగా జీవించాలని ప్రయత్నించేవాడు దేవునికి ఇష్టం.

8) క్రైస్తవుడు అని పిలిపించుకునేవాడు కాదు గానీ క్రీస్తును పోలి నడచుకునేవాడు దేవునికి ఇష్టం.

763. నీ ప్రత్యేకతను గుర్తించాలి. చేతి వ్రేళ్ళతో చిటికెన వ్రేలును చులకనగా మాట్లాడుట గమనించగా చక్కని ముగింపు పలికిందట.

**బొటన వ్రేలు :** ఏదైనా పట్టుకోవాలన్నా నా సహాయము లేనిదే యేమి చేయలేరు.

**చూపుడు వ్రేలు :** ఏదైనా చూపించుటకు హెచ్చరించుటకు ఉపాధ్యాయులు, రాజకీయవేత్తలు ఉపన్యాసాలకు నన్నే ఉపయోగిస్తారు.

**మధ్య వ్రేలు :** మీ అందరికంటే ఎత్తుగా పెద్దగా నేనే కనబడతాను.

**బలహీన వ్రేలు :** రింగులు పెట్టుకొని వీలు కలిగించే ఆభరణాలు నేనే ధరిస్తాను

**చిటికెన వ్రేలు :** ఎవరికైనా వందనాలు చెప్పినపుడు గాని నమస్కారం చెప్పినపుడు గాని అందరికంటే ముందు నేనే ఉంటాను. ఈ లోకంలో ప్రజలు ఎవరి గొప్పతనాలు వారు చూచుకొని మురిసిపోతూ ఇతరులను చులకన చూస్తారు. ఎన్నడూ మనకున్న స్థితిని బట్టి గర్వించక నిరూత్సాహ పడక దేవుని మహిమపరుస్తాను.

764. మంచి క్రైస్తవుడనగా దేవుని కొరకు బ్రతుకుతున్నానని చెప్పడము కాదు. ఈ బ్రతుకు దేవునిదని చూపించేవారు. ఆయన స్వరూపంలో మారి ఆత్మఫలాలు ఫలించేవారు. ఎక్కువ ప్రార్థించేవారు. పవిత్రపరచబడుట కాశించేవారు. సాక్షిగా జీవించేవారు. నిజ క్రైస్తవులు ఎవరైతే యేసు ప్రభువు యొక్క సిలువయందు విశ్వాసముంచెదరో వారు తమ స్వంత సామార్థ్యములపై

ఆధారపడకుండా విశ్వాసంతో యేసు క్రీస్తు ప్రభువు యొక్క విజయమును తమ హక్కుగా పొంది స్వాస్థ్యములో క్రీస్తు పాలి భాగస్తులను చేస్తూ తగిన ప్రతి ఫలమిస్తారు.

765. క్రీస్తును రక్షకునిగా స్వీకరించిన వ్యక్తిలో కొన్ని మార్పులు జీవితంలో కన్పిస్తాయి. వారి సత్ప్రవర్తన ద్వారా నాలుక, కోపము కోరికలు అదుపులో ఉంచుకోగలడు. గురువును, తల్లిదండ్రులను దైవాన్ని గౌరవించగలడు. సోమరితనము, అబద్ధము పరనింద విడిచిపెట్టగలడు. ధైర్యము కీర్తి ప్రశాంతతకై శ్రమిస్తాడు. వాగ్దానము, స్నేహము, వాత్సల్యము నిలబెట్టుకో గలడు, మాట, నడవడిక పని నిరంతరం నేర్చుకోగలడు. సత్ప్రవర్తన, దానగుణము సేవ పెంచుకోగలడు. ఈర్ష్య అహంకారము ద్వేషం వదులుకోగలడు.

766. డేవిడ్ బ్రైనార్డ్ జీవిత రహస్యము, సేవపట్ల తపన ఎట్లుండెదనగా ఆయన స్వీయ చరిత్ర నుండి సేకరణ.

నా దృష్టి అంతా దేవుని మీదే. నా ఆలోచనలన్నీ ఆయన కొరకే. ఇదేనా ప్రార్థనా జీవితము నా సమయాన్ని సువార్త సేవకై వినియోగించనిచో నా మనస్సుకు నెమ్మది ఉండదు. నా పని అంతా ఇతరులకు మేలు చేయుట. సువార్త ప్రకటించుట. ఆత్మలను రక్షించు భారము కలిగి కృషి చేయుటయే. దేవునికి మాత్రమే భయపడి కష్టపడి పని చేయుచూ దేవునిని సంతోష పరచుటయే నా ధ్యానం. ఆత్మల రక్షణకై ఎటువంటి శ్రమలనైననూ బాధలనైననూ లెక్క చేయను. ఏ సమస్యలెదురైనా ఎదుర్కొనుటకు వెనుకాడను. క్రీస్తు సేవార్థము నా జీవితం చివరి వరకు అరిగిపోవునట్లు పని చేయుట నా హృదయవాంఛ.

767. క్రీస్తు బోధకుడు ఎట్టివాడనగా మన మేలు కోరి మనకు హెచ్చరికలు హితోపదేశాలు చేసే బోధకుడు. గొఱ్ఱెల మంద చుట్టు పచార్లు చేస్తూ వాటి క్రూర మృగాల బారి నుండి దొంగల నుండి సంరక్షించే కాపలా కుక్క లాంటివాడు. అంతే కాదు రాబోవు ప్రమాదాన్ని పసిగట్టి కంగారు పడుచూ కొక్కోరొక్కో అంటూ కూతలు పెడుతూ వాటిని తన రెక్కల చాటున చేర్చి ప్రమాదము కలుగకుండా తప్పించి కాపాడే పిల్లల కోడి వంటివాడు.

768. **బోధకుడు పాటించు నియమాలు :**

ఎ) తన దేహము దేవుని ఆలయమని ఎరిగి జాగ్రత్తగా కాపాడుకోవాలి.

బి) పగలు నిద్రపోకుండా పెందలకడ లేచి ప్రార్థించువాడు డబ్బు విషయంలో దేవునికిచ్చుటలో నమ్మకంగా ఉంటాడు.

సి) వ్యక్తి గత ప్రార్థన వాక్యధ్యానంలో క్రమము పాటిస్తూ ప్రసంగము ముందు తరువాత ప్రార్థనలో గడుపుతాడు. పొగడ్తలకు దూరంగా ఉంటాడు.

డి) పొగడ్తలు, విమర్శలకు కదల్చబడడు.

ఇ) తన ప్రేమ పవిత్రంగా ఉంచుకొని శరీర ప్రేమ నిలువనీయక కలువరి ప్రేమ కనబరచును.

769. **పేతురు అందించే అనుభవ సందేశము :**

ఎ. లోకపు మంట వద్ద చలికాచుకొనకుడి. అవిశ్వాసులతో జోడి కట్టకూడదు. 1పేతురు 1:14-17

బి) సైతాను మీతో రాజీపడు స్థితి రానీయకుడి శోధనకు చోటియ్యకుడి. 1పేతురు 2:9-11

సి) సోమరితనం నిద్రమత్తు వల్ల దిగజారకుండా జాగ్రత్త వహించుడి.

1 పేతురు 1:13

డి) మీ మీద మీరు ఆధారపడవద్దు, మిమ్మును మీరు పొగడుకొనవద్దు నేను బొంకను అని చెప్పి అదే తప్పు చేశాను. 1పేతురు 5:5

ఇ) సైతాను మిమ్మును పడద్రోసి పాపము చేయకుండునట్లు మెళకువతో ఉండుడి. 1పేతురు 5:8

ఎఫ్) విశ్వాసమందు స్థిరులై సైతానును ఎదురించుడి. 1పేతురు 5:9

జి) మీ విశ్వాసము కాపాడుకొని ఆసక్తితో అడుగువారికి చక్కని సమాధానము చెప్పుటకు సిద్ధంగా ఉండండి. 1పేతురు 3:15-16

హెచ్) మీతోటి వారిని నిష్కపటముగా ప్రేమించండి. 1పేతురు 1:22

ఐ) క్రీస్తు నిమిత్తము నిందలపాలైనపుడు ఆనందించండి. 1పేతురు 4:14

జె) పరుల జోలికి పోరాదు మరియు తిరిగి పడిపోకుండ మీ హృదయముల యందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి.

770. **దేవుని చిత్తము కనుగొనుటలో మెళకువలు :** కీర్తనలు 32:8,9

నీకు ఉపదేశము చేసెదను. నీవు నడువ వలసిన మార్గమును నీకు బోధించెదను. నీ మీద దృష్టి యుంచి నీకు ఆలోచన చెప్పెదను. బుద్ధి జ్ఞానము లేని గుఱ్ఱమువలెనైనను, కంచరగాడిద వలెనైనను మీరు ఉండకుడి. ఎందువలెననగా గుఱ్ఱము హుషారుగా ముందుకు పరుగెత్తును. గాడిద సంశయముతో వెనుకకు లాగును. దేవుని చిత్తము తెలిసికొని ఆయన అనుమతి పొంది ముందుకు సాగాలి. అవిశ్వాసంతో పిరికితనంతో గాడిదవలె వెనుకాడకూడదు. పరిపూర్ణమైన దేవుని చిత్తాన్ని చేసేవాడు ప్రభువుతో నడిచేవాడు ఏ రీతిగా దేవుని చిత్తాన్ని తెలిసికొనగలడు.

ఎ) దేవుని చిత్తాన్ని వాక్యం ద్వారా తెలుపుతుంది.

బి) కొన్నిసార్లు ఆయన స్వరం ద్వారా బయలుపడుతుంది.

సి) కొన్నిసార్లు మనస్సాక్షి ద్వారా గ్రహింపుస్తుంది.

డి) దైవజనుల ద్వారా దేవుని చిత్తము బయలుపడుతుంది.

ఇ) ప్రసంగముల ద్వారా దేవుని చిత్తము బయలుపడుతుంది.

ఎఫ్) పరిస్థితుల ద్వారా దేవుని చిత్తము బయలుపడుతుంది.

జి) హృదయం పరిశుద్ధంగా ఉన్నపుడు దేవుని చిత్తము బయలుపడుతుంది.

771. ఈ జీవితము దేవుడిచ్చిన దానము. అది అందమైనది. ఒక్కొక్క గంట, ఒక్కొక్క నిమిషము, జారిన గడియ, పారిన నీరు తిరిగిరావు. అందువల్ల మానసిక బాధలు పోరాటాలు, కోపతాపాలు తగ్గించుకొని మృదువుగా ఇతరులను నొప్పించక ప్రతి వ్యక్తిని యోగ్యులుగా ఎంచి నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించాలి. ప్రశాంతమైన ప్రవర్తన మండె గుండె ఒత్తిడిని పెంచుతుంది. ఇస్త్రీ పెట్టె వేడి బట్టల మడతలను సరిచేస్తుంది. నెమ్మదితో శాంతితో జీవించుటకు సిద్ధపడాలి.

772. నిజ జీవితంలో దిగులు, చింత, బాధ, శోధనలు, ఒత్తిడి, కన్నీరు ఇవన్నీ పక్షుల వంటివే. అవి మన తలపై నిలిచి స్థిరంగా గూడు కట్టుకొని నిలిచి ఉండు స్థితి ఎన్నడూ రానియ్యవద్దు. క్రీస్తుని నమ్మి ఆశ్రయించు ప్రార్థించు.

773. **ప్రతి ఉదయ కాల ప్రార్థన :** ప్రభూ ఈ దినము నాకు బహుమతిగా ఇచ్చి నందున వందనాలు. సజీవంగా లేచి స్తుతించు భాగ్యమిచ్చినందుకు కృతజ్ఞతలు. జీవితంలో ప్రతి క్షణము ఒక ఫోటోగా నిలిచిపోతుంది. అది

తిరిగిరాదు మంచి ప్రశాంతతో చిరునవ్వుతో నియంత్రించబడిన భావోద్రేకాల తో మనస్సునిండా నిండైన కృతజ్ఞత భావంతో నిన్ను స్తుతిస్తున్నాను. ప్రతి కీడు నుండి భద్రపరచి సంరక్షించండి. ప్రతి దినము నీ సన్నిధి నాకు తోడుగా ఉంచి కుడి చేయి పట్టుకొని నడిపించండి. ఆమెన్.

774. ప్రతి సంఘటన జీవితంలో సంభవించినపుడు దానికి ఒక కారణము ఉంటుంది కానీ దానిని అంతరంగ పరిశీలన చేసుకుంటే జవాబు పొందే అవకాశము దేవుడే అనుగ్రహిస్తాడని నమ్మాలి. ప్రతి దినము ఇతరులను ప్రేమించడానికి మరొక అవకాశముందని ఆలోచించాలి. మన గొంతెత్తి ప్రేమ వచనాలు పలుకుటకు సిద్ధపడాలి.

775. కొన్నిసార్లు కొందరికి నిరాశలో దేవుడే నిరీక్షణగా ఉంటారు. చీకటి అనుభవాల్లో దేవుడే వెలుగుగా నిలిచి కాంతినిస్తారు. చింత దరిచేరినపుడు గొప్ప ఆదరణ ఆప్యాయతనందిస్తారు.

776. దేవుడిచ్చిన ప్రతి దినము చాలా మంచిదిగా ఉంటుంది. ఆ రోజు మంచి నిర్ణయాలు తీసుకొనుట వల్ల మంచి విలువైన పాఠాలు నేర్చుకొని చాలా మంచి రోజని ఆనందించగలము. కీర్తన 118:24, రోమా 8:28

777. ప్రతి రోజు మన మాటల్లో ఏదైనా బాధ కలిగించే హాస్యస్పద తలంపు లున్నాయా? ఆలోచించి ఆనందంగా గడపాలి. విశ్వాసము ప్రార్థన ఈ రెండు అదృశ్యంగానే ఉంటాయి. కాని అసాధ్యాలన్నీ సుసాధ్యం చేయగలవు.
విశ్వాసమనేది నిరీక్షించబడేది తప్పక జరుగునని నమ్ముటయే. హెబ్రీ 11:1

778. జీవితంలో అద్భుతమైన మాటలున్నాయి. విజయవంతమైన జీవితానికి రెండు కిటుకులు ఉన్నాయి. కనీస అవసరతలకు పరిమితమగుట ఎక్కువగా సర్దుకుపోవు వ్యక్తిత్వము కలిగియుండుటయే. అందుకే అన్ని పోగొట్టుకున్న తరువాత దు:ఖపడుట కన్నా బాధపడి ప్రయోజనం లేదు గనుక దేవుడిచ్చిన కుటుంబ సభ్యులలో ఆనందంగా గడపాలి. స్నేహితులతో మంచిగా ప్రవర్తించాలి. ఈ జీవితాలు కేవలము దేవుడిచ్చిన దానము. ఆనందంగా జీవిస్తూ ఎందరికో ఆనందింపచేసే ముందు మీ కుటుంబానికైనా ఆనందం అందే రీతిగా జీవించండి. అలా జీవిస్తే నీతోనే ఆనందం మిగులుతుంది.

779. దేవుని చిత్తములో మనస్సు పెట్టి ఆలోచిస్తే శ్రద్ధగా పని చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మనస్సు పెట్టి శ్రద్ధగా పని చేస్తే విజయము వరిస్తుంది.

మనస్సులో ప్రార్థిస్తే, దేవుడు ఆలకిస్తాడు. అందుకే కళ్ళలో చూచేది లోకంకాదు మనస్సునే వాడుకోవాలి తెలివిగా మాట్లాడడం గొప్పకాదు తెలిసినంత అవసరమైనంత వరకే మాట్లాడాలి.

780. సువార్త ప్రకటన చేయుటలో తప్పక బాధ్యత కలిగి ఉండాలి. విశ్వాసి ప్రధమ కర్తవ్యంగా భావించాలి. మీరు భూదిగంతముల వరకు సాక్ష్యముగా ఉండాలి. అపో 1:8 మొదటిగా క్రీస్తు రక్షకునిగా స్వీకరించి స్వీయానుభవంలో క్రీస్తు శక్తిని పొందాలి. క్రీస్తు మంచితనాన్ని స్వయంగా అనుభవించాలి. ఆ తరువాత రెండవదిగా నీ స్వకీయులకు సువార్త అందించాలి. మూడవదిగా నీవున్న ప్రాంతంలో ఇరుగు పొరుగువారికి సువార్తను తెలపాలి. నీలో క్రీస్తు ప్రేమ ఉందని అందరూ గుర్తించాలి.

781. నీవు ప్రతి చోట సాక్షిగా జీవించుట వల్ల నిన్ను ప్రార్థించమని అర్థించే స్థాయికి నీ ఆత్మీయ స్థితి అధిక శక్తితో నింపబడాలి. ఆ స్థితికి చేరితే ధన్యుడవు కాగలవు. ఆ తరువాత భూదిగంతాల వరకు సాక్షిగా నిలిచి ఉండగలవని గుర్తించాలి. పరలోకంలో ఎన్ని కార్లు ఎన్ని మేడలు ఎంత ధనం సంపాదించావని అడగరు కానీ నీవెన్ని ఆత్మలను క్రీస్తు కొరకు సంపాదించావో అని ప్రశ్నించగలరని తెలిసి మెళకువతో నీ ఆత్మీయ స్థితిని ఉజ్జీవంగా నిలపాలి.

782. మనము జీవించే జీవితము చాలా తాత్కాలికమైనది. ఉదయమున గడ్డి పువ్వు పూచి సాయంత్రము వాడిపోయిన రీతిగా కొనసాగే ఈ అనుభవంలో దేవుడు కోడి తన పిల్లలను కాపాడినట్లు కాపాడుచున్నాడు అనే వాగ్ధానము నమ్మి జీవితాన్ని కొనసాగించాలి.

783. గడచిపోయిన నిన్నటి కంటే రూపే లేని రేపటి కంటే గడుపుచున్న ఈ రోజు ఎంతో విలువైనది. అందుకే అందరితో ఆనందంగా ఉండాలి. అందరికి ఉపకారము చేద్దాము. అందరితో సమాధానంగా జీవించి ఆనందాన్ని పంచుదాం. పరలోక ప్రార్ధన నిత్యము చేసుకుందాం.

784. క్రీస్తే ఆది అంతమైన దేవుడు. ఆయనే మన బలము. ఆయనే ప్రతిరోజు మనకందించు భద్రత. మనము ఎక్కువ ప్రేమించి కృతజ్ఞత చూపించలేనప్పటికీ ఆయనే మనలను అవధులు లేని ప్రేమతో ప్రేమించగలరని దృఢంగా నమ్మాలి. ప్రతి దినము అందమైనదే మనము ఏది అవసరమో అడగనప్పటికీ ఆయన ప్రతి విషయము గ్రహించగలరు. ఆయన ప్రార్థన ఆలకించువాడు గనుక ప్రతి ప్రార్థనను ఆలకిస్తాడని నమ్మాలి. ప్రార్థించి అద్భుతాలను పొందాలి.

785. ప్రతిరోజు జన్మ దినమే. మనకు క్రొత్త దీవెనలు అందించే రోజు ఆనందంగా నిరీక్షణతో ఏదో మంచి మేలు దాగి ఉంటుందనే రోజు. మన గృహాలను మంచి ప్రేమానుభావాలతో నింపగలదు. కాలము గడచిపోతూనే ఉంటుంది. కొన్నిసార్లు మనము కోరుకున్నపుడు ఆలస్యమని తలస్తాము. కాలము చాలా త్వరితంగా నడుస్తుంది. ఆలస్యం చేయక సమయాన్ని పోగొట్టుకొనక జ్ఞానంతో సాగిపోవాలి.

786. దిగులుగా ఉన్న సమయాల్లో కాలము బరువుగా గడుస్తుందని తలస్తాము. బాధలో ఉన్నప్పుడు కాలం కదలట్లేదని భావిస్తాము. చాలా బోరు కొడుతుంది. కాలము జరుగుట లేదని తలస్తాము, కాలమెపుడు ఒకే రీతిగా ఉన్ననూ మన మానసిక మార్పులు పరిస్థితులను బట్టి విభిన్న తలంపులు కలుగుతాయి. ఎడతెగక ప్రార్థన చేసి నెమ్మదితో జీవిద్దాం.

787. **ప్రార్థనలో విజ్ఞాపన ఉండాలి :**
నీతిమంతుని ప్రార్థన మనఃపూర్వకమైనది. బహు బలము గలదిగా ఉండును. అట్టి ప్రార్థన ఆత్మలను రక్షించును. ఇతరుల కొరకు మనము సమయం వెచ్చించి వారి భారము కొరకు వారి స్థానములో మనలను ఉంచుకొని దేవునికి మొఱ్ఱపెట్టుట విజ్ఞాపన ప్రార్థన.
ప్రార్థనలో సహవాసం ఉండాలి. దేవునితో సంభాషించుట దేవుని స్వరం వినుట మన విషయాలను ఆయనతో చెప్పుకొని ఆయన ఇచ్చే జవాబుల కోసం ఎదురుచూడాలి.

788. దేవుని వాక్యానుసారముగా నూతన పర్చుకోగల మనస్సు కావాలి. సత్యాన్ని కలుషితం చేసే సైతాను ఆరోగ్యకరమైన ఆశావాద భావాలు గుండెల్లో నింపుకోవాలి. రోమా 12:1,2

789. **సంపూర్ణ ప్రార్థన ఏది?**
ఆత్మ వలన ప్రతి సమయమందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచూ, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తము పూర్ణమైన పట్టుదల తో విజ్ఞాపన చేయుచూ మెళకువగా ఉండుడి ఎఫెస్సీ. 6:18

790. ప్రార్థన అనగా కొద్ది సమయము కొన్ని మాటలు ఉచ్ఛరించడం కాదు గానీ ప్రార్థన మనస్సు కలిగి ప్రార్థనాత్మతో నింపబడి యెడతెగక ప్రార్థించు అనుభవాన్ని కలిగి యుండాలి. ప్రార్థనలో ఒప్పుకోలు, సమర్పణ, ఆరాధన, విజ్ఞాపన, సహవాసం, కృతజ్ఞత, స్తుతి ఉండాలి.

791. **ప్రార్థనలో ఒప్పుకోలు ఉండాలి :** ప్రభువు నామమంలో శక్తి, ప్రేమ, గొప్పతనం ఒప్పుకోవాలి. మన బలహీనత దోషాలు పాపాల గురించి ఒప్పుకోవాలి. అప్పుడే క్షమాపణ పొందగలం.

792. **సమర్పణ ఉండాలి :** ఇదిగో దేవా నా జీవితం ఆపాదమస్తకం నీకంకితం అని ప్రార్థించగలగాలి.

793. **ఆరాధన ఉండాలి :** దేవుని ఔన్నత్యాన్ని గొప్పతనాన్ని దయ, కనికరం గుర్తుకు తెచ్చుకొని హృదయాంతరింద్రియాలతో కృతజ్ఞత చెల్లించాలి. ఆత్మతో సత్యముతో ఆరాధించాలి. యోహాను 4:24

794. మన జీవితం ఒక చిన్న కథలో బోధించగలము ఒక వ్యక్తికి నలుగురు భార్యలుండేవారంట మొదటి భార్యను చాలా ప్రేమించేవాడు, రెండవ భార్యను శ్రమలలో అవసరం కోరేవాడు. మూడవ భార్య విడిచిపెడుతుందనే భయంతో కనిపెట్టేవాడు. నాలుగవ భార్య ఎంత ప్రేమగా దగ్గరకు వచ్చినా నిర్లక్ష్యం చేసేవాడు. చనిపోయే ముందు భార్యలను దగ్గర ఉండమని అడిగితే అందరూ సాకులు చెప్పి తప్పించుకున్నారు. ఒక భార్య నేను ఉంటాను అన్నది దీని అర్థమేమనగా మన శరీరాన్ని బాగా ప్రేమిస్తూ బట్టలు నగలతో అలంకరిస్తూ గొప్పగా ప్రేమిస్తూ జీవితాన్ని గడుపుతాము. రెండవ భార్య సూచించేది కుటుంబం, స్నేహితులు సమాధి వరకే వచ్చి వారి దారిన వారు వెళతారు. మూడవ భార్య సంపాదించిన సంపద, హోద, ఘనత మరణంతో సమసిపోతాయి. నాలుగవ భార్య మనము చేసిన మంచి పనులు త్యాగ జీవితము మంచి పేరు మనిషి మరణించినా నిలిచిపోతుంది. ఆత్మను పోషించాలి దైవ భక్తితో జీవించాలి.

795. కొన్ని జీవిత సత్యాలు చాలా ఆహ్లాదాన్ని కలిగిస్తాయి జీవితానికి మించి అర్థాన్ని ఇస్తాయి.

ఎ) అర్థమయ్యేలోపు దూరమయ్యేది కల.

బి) అర్థమయ్యేలోపు ఒప్పుకోలేనిది వాస్తవం.

సి) అర్థమయ్యే కొలది దగ్గరయ్యేది స్నేహం.

డి) అర్థమయిన క్రొత్త అర్థము వెదికేది ప్రేమ.

ఇ) అర్థమయినట్లు అనిపించిన ఎన్నటికీ అర్థం కానిది జీవితం.

ఎఫ్) అర్థవంతమైన వాగ్ధానాలతో నిరీక్షణ కలిగించేది. క్రైస్తవ జీవితం క్రీస్తుతో ప్రయాణము.

796. నీ కొరకు మంచి ఉద్దేశ్యములు కలిగియున్నాను, అవి నీకు గొప్ప ప్రయోజనాన్ని కలిగిస్తాయి. అభయమిచ్చిన క్రీస్తును ఆశ్రయించుట మేలు. తప్పులు చేస్తున్నారని ప్రేమించడం లేదని సన్నిహితులను దూరం చేసు కోరాదు. ఎవరూ పూర్తిగా పరిపూర్ణులు కారు. కలిసి ఉంటే కలదు సుఖం అని గ్రహించాలి.

797. జీవితంలో అలవర్చుకోవల్సిన శక్తివంతమైన మాటలు ఏవనగా
మన తోటివారికి ఎల్లప్పుడు ఉత్సాహమిస్తూ ఉత్సాహంగా ఉండాలి. విమర్శించి ఎవరిని దూరం చేసికోరాదు. ఇతరుల అభిప్రాయం అర్థం చేసికొని అవగాహనతో స్ఫూర్తినిస్తూ తీర్పు తీర్చరాదు. ఎవరో ఏదో సహాయం చేయాలని కనిపెట్టె బదులుగా నీవే సహకారిగా చేతినందిస్తూ నీడవలె జీవించాలి.

798. యెహోవా ఉదయమున నా కంఠ స్వరము నీకు వినబడును. ఉదయమున నా ప్రార్థన నీ సన్నిధిని సిద్ధం చేసి కాచియుందును. శుభోదయం అని అందరిని పలుకరించుట పరిపాటి. గుడ్ మార్నింగ్ అనే మాటలో అమూల్యమైన సందేశం దాగి ఉందని ఆశ్చర్యం కలుగుతుంది.

799. G - Get up. ఉదయాన్నే మేలుకో

O - Open your heart. నీ హృదయం తెరచి దేవుని కొరకు కనిపెట్టు

O - Open your mind. నీ మనస్సును కూడ విశాలపరచి క్రొత్త అనుభవాలను నేర్చుకొనుటకు సిద్ధపడు

D - Dedicate your day to God. ప్రతి దినం దేవునికి ప్రాధాన్యత ఇస్తూ జీవితం అంకితం చేయాలి.

M - Meditate. దైవ వాక్యాన్ని అనుదినం ధ్యానించాలి.

O - Optimise your resources. నీ ఆశయాలను అనుభవాలను ఉపయోగించుటలో ఆశావాదం చూపాలి.

R - Rebuke all negative thoughts.
నిరాశా భావాలు నీ దరికి చేరకుండా పారద్రోలాలి.

N - Never underestimate your potential.
నీలో ఉన్న శక్తి సామార్థ్యాలను తక్కువగా అంచనా వేయకు

I - Inspire someone. ఎవరో ఒకరిని నీ జీవితం ద్వారా, మాటల ద్వారా ప్రభావితం చేయాలి

N - Never loose faith. విశ్వాసాన్ని విడనాడకు

G - Go out with joy & confidence. ఆనందంగా నిబ్బరంగా జీవించు

800. బైబిలులోని వ్యక్తులను దేవుడు ఎన్నుకొని అభ్యున్నత స్థాయిలో నిలిపి మహిమ పర్చుకున్నారు.

ఎ) మోడు బారిన జీవితం గల రూతు విధవరాలైననూ గొప్ప జీవితాన్ని అందుకొని తల్లి కాగలిగింది.

బి) పేద స్థితిలో చేపలు పట్టే జాలరి పేతురును క్రీస్తు మనుష్యులను పట్టే జాలరిగా చేశారు. బండపై నా సంఘము కడతావని అభయమిచ్చి దీవించారు.

సి) అనాథగా మిగిలిన ఎస్తేరు పరదేశి అయిననూ ప్రార్థనా శక్తితో రాజ్యానికి మహారాణి అయింది.

డి) హానికరుడు, హింసకుడు అయిన సౌలు పౌలుగా మార్చబడి గొప్ప సువార్తను ప్రకటించుచూ బంగారు పాదాలు గలవాడై విలువైన పత్రిక సందేశాలను అందించి గౌరవం పొందాడు.

ఇ) మోషే నత్తివాడయినప్పటికీ మోషేను దేవుడు వాడుకున్నాడు.

ఎఫ్) దావీదు గొఱ్ఱెల కాపరి గాని గొప్ప రాజయ్యాడు.

జి) యోసేపు అన్నలచే హింసించబడి అవమానాలకు గురి అయ్యాడు. తోటి జైలు స్నేహితులు మరిచారు. దేవుడు గొప్ప ప్రధానిగా చేశాడు.

హెచ్) నిన్ను నన్ను దేవుడు ఎన్నుకొని ఉన్నత స్థానంతో నిలుపుటకు ఆశిస్తున్నాడు. దేనికి ఆందోళన పడరాదు. విశ్వాసంతో ప్రార్థిస్తే దేవుడు మనకు చేసిన మేలు కనుగొని పిలుపు గ్రహించి జీవిత పరమార్థము తెలిసికొని ఆనందించి దేవుని మహిమ పరచగలము.

801. మన విహార యాత్రలో ఎంతో ఆనందం, అనుభూతి చెందుతుంటాం. ఈ యాత్రలో ప్రకృతి అందచందాలు నీవు అనుభవించే ఆనందాల్లో అందమైన పూల చెట్లు, వృక్ష సంపద, కొండలు, కోనలు, లోయలు, పశు పక్ష్యాదుల కుహుకుహు రాగాలు తనివి తీరే అనుభూతి చెందుతాము. ఈ అనుభూతిలో దేవుని అనంతజ్ఞానాన్ని నెమరువేయాలి. ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలి.

802. మనమాశ్రయించిన దేవుడు మనకందించే విలువైన అనుభవం. ఏమనగా ప్రేమ, ఆనందము, సమృద్ధి. శాంతి చిరునవ్వు ఇవన్నీ ప్రార్థన అనే ఎకౌంటులోనే దాగి ఉన్నాయి.

803. ఆతృతతో ప్రతి పనిని ఆసక్తితో కొనసాగిస్తే చాలా సులువుగా సమర్థతతో చేయగలము. సోమరితనంతో యాధృచ్చికంగా చేసికొని పోయే పనిలో ఏది సాధించలేము, ఏదీ పొందలేము, ఏదీ అందుబాటులో లభించదని తెలిసికోవాలి.

804. ఆశీర్వాదాలనందుకొనుటకు నీ చిరునవ్వు చాలు. అది ప్రకాశిస్తుంది. అది మనస్సును ఉత్తేజపరచగా నీ చేతులు పని చేసి అనేకులకు సహకారాన్ని అందిస్తాయి. నీ హృదయం తెరువబడి దాని ద్వారా కాంతిని విరజిమ్మి చీకటిలో ప్రకాశాన్నందించి ఉజ్జీవాన్ని కలిగిస్తుంది. నీ సర్వ సంపదలో గుప్తమైన స్థానమేమనగా మంచి సహృదయులైన స్నేహమందించే మిత్రులను కలిగి ఉండటం. అంకిత భావంతో చేసే పని అంచలంచల విశ్వాసం అకుంఠిత దీక్షతో కొనసాగే ఆత్మ స్థైర్యం, ప్రేమ మాత్రమే.

805. ప్రతి సంవత్సరము మే నెలలో జరిగే మదర్స్ డే వేడుకలలో తల్లిని గౌరవించే ప్రక్రియకు గొప్ప చరిత్ర ఉంది. అమెరికా 20వ శాతాబ్ధి ఆరంభంలో ఒక సామాన్య కుటుంబంలో తల్లికి పదమూడు మందిలో ఒకరైన అన్నా జార్విస్ తల్లి బిడ్డల పెంపంకంలోని ప్రేమను గుర్తించి గణనీయమైన రీతిగా అధికారులతో సంప్రదించి గుర్తింపు పొందగల రోజును ఆ దేశ వ్యాప్తంగా ఆచరించుట 1914 వ సంవత్సరంలో ఆరంభమైనది నేడు అన్ని ప్రాంతాలలో ప్రపంచ వ్యాప్తంగా మే రెండవ ఆదివారం జరుగుట పరిపాటి.

806. అమ్మ అన్నది కమ్మని మాట. అనురాగానికి ప్రతినిధి. ప్రతి జీవికి జీవాన్ని పోసిన తల్లి. దేవుని ప్రతి బింబముగా ఒక రూపాన్ని ఆకారాన్ని లోకానికి చూపించి నొప్పుల బాధను ఆనందంగా భరించిన త్యాగశీలి. దేవుడి ఆజ్ఞతో గర్భంలో పిండము ఏర్పడుట దేవుడు మాత్రమే వీక్షించగలడు.

807. మన సృష్టికర్త వాగ్ధానాలలో అమూల్యమైనది తల్లి వంటి ప్రేమ చూపగలనన్న అభయ వాక్యము అపురూపమైనది.

"ఒకని తల్లివాని ఆదరించునట్లు నేను మిమ్ములను ఆదరించెదను, యెరూషలేములోనే మీరు ఆదరించబడెదరు" యెషయా 66:13

"స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటి పిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను. యెష 49:15

1) తల్లి దైవ వాక్యాల ఆధారంగా మంచి సందేశాలనందించి అర్థమయ్యేల వివరిస్తుంది.

2) అజేయమైన ప్రేమ పొంగి పొర్లే రీతిగా ప్రేమించగలదు.

3) దేవునిపై అంచంచల విశ్వాసం గలది.

4) భూ లోకంలో దేవదూతలను పోలినవారు మన బిడ్డలు. ఆ బిడ్డలు దారి తప్పిన ప్రతిసారి బిడ్డలను మంచి మార్పు గలవారిగా చేయగలదు.

5) భూమి మీద అమూల్య పెన్నిధి అమ్మ. బాధలను, విచారాలను, కన్నీటి లోయల్లో కష్టాల కౌగిలిలో దాచుకొని చిరునవ్వుతో సదా ప్రోత్సహించేది అమ్మ.

808. సృష్టికి జీవం పోసిన ప్రేమ రెండక్షరాల మాట. నెత్తురును పాలుగా మార్చి బలాన్నందించి బ్రతికించేది అమ్మ. లోకంలో సమస్యలతో పోరాడి బ్రతికించేది అమ్మ. గతంలో గోరు ముద్దలు తినిపించి గుండెలపై చేర్చుకొని జోల పాటలు పాడి అలరించేది అమ్మ. లోకమంతా ఏకమై ద్వేషించిన నిన్ను ప్రేమించేది తల్లి ప్రేమ. అందరి ఉనికికి కారణము అమ్మ.

809. ఈ సమస్త సృష్టిలో అందమైనది పువ్వు. అంతకు మించి అందమైనది తల్లి ప్రేమతో నిండిన చిరునవ్వే. అమ్మ ఆర్థికంగా నిరుపేద కావచ్చు. కానీ కూలికి పేద కావచ్చు కానీ ప్రేమకు కాదు. పదాలు తెలియని పెదవులకు అమృత వాక్యమే అమ్మ.

అట్టి తల్లి, తండ్రిని ప్రేమించి సేవ చేయుటలో అర్థముంది. అందరూ ఉన్ననూ అమ్మ అనాథగా మిగలరాదు. మనిషిగా పుట్టినందుకు తల్లి ఋణం తీర్చుకొనుటకై కొందరినైనా ప్రేమించి వారికి ఉపయోగపడాలి.

810. మార్పుకు మార్గదర్శి తండ్రి అయితే ఓర్పుకు మారు పేరు అమ్మ. మనిషికే మరణము మానవత్వానికి, అమ్మ జ్ఞాపకాలకు మరణము లేదు. అమ్మ నీతికి నిదర్శనం. ప్రగతికి సోపానం. తల్లి ప్రేమ ముందు నీవు మోసే బరువు బరువేకాదు.

సాగారాన్ని అడిగితే దాని లోతు చెప్పగలదు. కానీ తల్లి ప్రేమ లోతు తెలుపలేము. ఆకాశమెంత ఎత్తు విశ్వమెంతో విశాలము సముద్రమేంతో లోతైనది. అది వింతైన దేవుని ప్రేమ. ఆ దేవుడు తల్లి ద్వారా చూపే ప్రేమ కూడా అంతే అని అందరూ గుర్తించాలి.

811. ఈ లోకంలో అమూల్యమైనది, మధురమైనది అనంతమైనది అమ్మ అనురాగమే. అమ్మ మొదటి స్నేహితురాలిగా హృదయాన్ని తాకుతుంది. స్నేహమనగా భుజము మీద చేయి వేసి నడవడం కాదు గానీ నీ కెన్ని కష్టాలు వచ్చిననూ నీవెనుక నేనున్నానని భుజము తట్టి చెప్పగలిగేది అమ్మ. అధిక విలువ చెల్లించగలిగేది తల్లి ప్రేమ. తల్లి మాట స్వచ్ఛమైనది. మాటతో పాటు హృదయం నిర్మలమైనది. అమ్మ ప్రేమ పొందిన జీవితం ప్రశాంతం.

812. ఎన్ని యుగాలు తరాలు మారినా మారని మాధుర్యము అమ్మ ప్రేమ. ఏ దేశమేగిన, ఏ తీరం దాటిన మరువని మమకారం అమ్మ ప్రేమ. ప్రకృతి చేసిన బంగారు ప్రతిమ అమ్మ. ప్రతి గుండె చేసే సవ్వడిలో భావన అమ్మ. అమ్మకు ప్రతిబిడ్డా రుణస్థుడే.

813. **పసగల ప్రసంగాలెట్లుండాలి?**

1) మోకాళ్ళపై శ్రమించి వాక్య లోతుల్ని శోధించి, ధ్యానించి సున్నితంగా ఆత్మలను స్పర్శించే శక్తివంతులుగా ఉండాలి.
2) మహోన్నతుని ప్రతినిధిగా మనుష్యుల ముందు ధైర్యంగా సువార్త ప్రకటించే పాదాలు సుందరమైనవనే నమ్మకంతో నిలబడే అర్హత పొందాలి.

814. పేరుకు ముందు వెనుక డిగ్రీలు చూచి అతిశయించి గర్వించరాదు. మూడు జోకులు 6 బైబిలు రిఫరెన్సులు వల్లిస్తూ, నవ్విస్తూ, జోల పాడే పాటవంటి సందేశాలందించరాదు. ఎండిన ఎముకలలో సంచలనం కలిగించి ఆత్మను తెజరిల్లచేయు, ఉజ్జీవం రగిలించే, జీవంతోనిండిన ఊపిరందించే ప్రసంగికులు కావాలి. లేవాలి.

815. ఎవరో నిన్ను వాడుకుంటున్నారని భ్రమపడకు. నీవు ఇతరులకు ఉపయోగ పడుచున్నాననే నమ్మకంతో ఆనందించు. ఒకవేళ నీవు ఇతరులకు సహాయ పడగలిగినపుడు సంతోషించుటతో పాటు, నీ కొరకు నీ ఆత్మీయ భద్రతకై ఎవరో ప్రేమించి విజ్ఞాపన చేస్తున్నారని నమ్మి దేవుని స్తుతించు.

816. సలహా చెప్పే మాటల కన్నా సాయం చేసే చేతులు మిన్న. సహాయము చేయుటలో తప్పక తృప్తి మిగులుతుంది.

817. **దేవుడు మనకొరకు నిత్యము చేసే 5 పనులు**

ఎ) దేవుడు చేసిన వాగ్ధానాలను మర్చిపోయేవాడు కాదు. కీర్తనలు 89:34
బి) మనం చేసిన పాపాలు క్షమించువాడే గానీ జ్ఞాపకం చేసుకొనువాడు కాదు. యెషయా 43:25

సి) నిన్ను శాశ్వత ప్రేమతో ప్రేమించువాడను. విడువనివాడను ద్వితీ. 31:6.

డి) దేవుడు మనలను గూర్చి చింతిస్తున్నాడు. గనుక మన గూర్చి ఆలోచించక మానడు. మర్చిపోలేనివాడు. కీర్తన 139:17,18

ఇ) దేవుడు ప్రేమామయుడు ప్రేమించుట మానుకోలేడు. యిర్మియా 31:3

818. దేవుడు సృష్టిలో స్త్రీలను అసమాన ధైర్యవంతులుగానూ, తల్లిదండ్రులకు మంచి కుమార్తెలుగానూ, తోబుట్టువులకు మంచి సోదరీమణులుగానూ, భర్తలు కొనియాడదగిన భార్యలుగానూ, అందరూ ప్రేమించే సన్నిహిత స్నేహితులుగానూ, ముఖ్యంగా ఆరాధించే మాతృమూర్తులుగా సమాజానికి గొప్ప బలమైన ఉన్నత సైన్యముగా నిలువగలరు. సువార్త ప్రకటించు స్త్రీలు, ప్రార్థించే స్త్రీలు ఎందరో ఉన్నారు.

819. స్త్రీల లక్షణాలలో మంచిగా వినేవారు, అర్థం చేసుకొనే ఓర్పుగలవారు, ఎందరికో స్ఫూర్తినిచ్చే గుండె ధైర్యము గలవారు స్త్రీలు. అమ్మ మనకు జన్మనిస్తే భార్య ఆ జన్మకు అర్థాన్నిస్తుంది. అమ్మ లేకుంటే బ్రతుకు దుర్భరము. బ్రతుకు శూన్యము. భార్య, తల్లి బరువు కారాదు. బానిసగా మిగలరాదు. ప్రేమను పొంది కడవరకు జీవించాలి. అనాథ ఆశ్రమాలకు పంపి దూరం చేయరాదు. తల్లి ప్రార్థనలు కుటుంబాలకు అగ్నికంచెగా బలాన్నిస్తాయి.

820. దార్శనికుడు బీదరికములో ఉన్న సౌభాగ్యాన్ని చూడగలడు. సంస్కారవంతుడు సంపదలలోనున్న సమస్యలను చూడగలడు.

821. **ఒక భక్తి గల స్త్రీని ఇంటర్వ్యూ చేయగా ఆమె చెప్పిన జవాబు ప్రతి స్త్రీ ఆదర్శంగా తీసుకోవచ్చు.**

నా పెదవులకు సత్యమును పూసుకుంటాను.

నా స్వరం ప్రార్థన ద్వారా సరి చేసికోగలను.

నా కండ్లలో కరుణ నింపుకుంటాను.

నా చేతులతో దానం చేస్తాను.

నా హృదయము అనేకుల జీవితాలకు ప్రేమనందించే నిలయంగా ఉంచుతాను.

నా ముఖములో చిరునవ్వు చెరుగనియ్యను.

822. **తల్లి గురించిన అర్థం**

M - Messanger receiving on God's Love

తల్లి దేవుని వాక్యాధారంగా సందేశాలందించునది.

O - Out pouring genune love

స్వచ్ఛమైన ప్రేమ పంచగలిగినది అమ్మ

T - Trust in God

దేవునిపై అచంచల నమ్మకం గలది అమ్మ

H - Heart set on things above

దేవునిపై ధ్యానమున్న హృదయం గలది

E - Earthly Saint

భూలోకంలో దేవదూత అమ్మ

R - Restore the way of prodigal kids

దారి తప్పిన బిడ్డలను సంరక్షించేది అమ్మ

శ్రమల గుండా దాటిన తల్లులంతా అభినందించ గల ధన్యురాలు అమ్మ

823. **ఆత్మీయ సౌందర్యానికి కొన్ని కిటుకులు**

1. ప్రతి దినము స్వపరీక్ష ద్వారా ఆయాసకరమైన హృదయముందేమోనని తెలిసికొని శుద్ధి చేసుకోవాలి.
2. వాక్యం చేత ఉదకస్నానం చేసికోవాలి
3. క్షమ అనే క్రీము రాసుకొంటే ముఖంపై మడతలు సమసిపోతాయి
4. ప్రార్థన అనే పదార్థంతో తడి చేసుకోవాలి
5. ప్రేమ అనే అత్తరు (సెంటు) శరీరమంతా జల్లుకోవాలి
6. చింత, కోపము తొలగించుకుంటే అన్ని రోగాలు దూరమవుతాయి.
7. ఓర్పుతో నీగదినంతా స్ప్రే చేసుకోవాలి
8. విశ్వాసంను గుండెల్లో నింపుకొని ఊపిరి పీల్చాలి
9. ముఖవర్చస్సు తేజస్సుతో వెలుగొందాలంటే చిరునవ్వు చెరగనియ్యరాదు

824. మనకు శత్రువులున్నారని తెలుసునా?

మన శరీరము, లోకము, పాపము, కోపము, అపవాది, అబద్ధ ప్రవక్తలు, వీటి గురించి చాలా జాగ్రత్త వహించాలి. ఒక్క నిమిషం కోపపడితే దాని ప్రభావము 4 లేదా 5 గంటల వరకు శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. మిగతావి దారితప్పితే సర్వనాశనం.

ఒక్క నిమిషం హాయిగా నవ్వగలిగితే ఒక రోజు అనగా 24 గంటలు శరీరం ఆరోగ్యంగా ఉండేలా నియంత్రిస్తుంది.

825. **క్రీస్తును నమ్మిన మనం వివిధ రీతులుగా పిలువబడుట**

1. పవిత్రులు అనగా ప్రత్యేకించబడినవారు, పరిశుద్ధంగా జీవించేవారు.
2. పిల్లలము అనగా క్రొత్తగా జన్మించి, వాక్యమనే పాలు స్వీకరించు శిష్యులము.
3. శిష్యులు అనగా క్రీస్తు బోధను నేర్చుకొనుచూ వెంబడించే అనుచరులం.
4. క్రైస్తవులు అనగా కేవలం క్రీస్తుకు చెందినవారం.
5. సహోదరులు అనగా ప్రభువునందు సోదరీ సోదరులు అనగా ఏక ఉదరము అనగా గర్భములో సంజాతులము, క్రీస్తు రక్తములో కడుగబడిన ఏక భావంతో కడుగబడినవారము.

1పేతురు 2:9 వీటితో పాటు ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తైన ప్రజలునైయున్నాము.

నిజానికి క్రైస్తవులమంటే నటించడం కాదు, జీవించి చూపించడం, మన సంభాషణలో ఈమైల్, ఉత్తరాలలో ప్రేమగల పలుకరింపు ఉండాలి. వాక్యము వినేవారుగా గ్రహించి అంగీకరిస్తూ దేవుని నమ్మిన విశ్వాసులు దేవునితో ఎక్కువ సమయం గడిపినపుడు మనుష్యులతో తక్కువ సమయం గడుపుతాము.

826. **క్రీస్తులో లేని చెడు విషయాలు**

ఎ. ఆయన యందు ఏ కపటము లేదు. **యెషయా 53:9**

బి. ఆయన యందు ఏ పాపము లేదు. **యోహాను 1:5, 3:5**

సి. ఆయన యందు ఏ చీకటి లేదు. **యోహాను 1:5**

డి. ఆయన యందు ఏ దోషము లేదు. **యోహాను 19:4**

ఇ. ఆయన యందు ఏ చెడుతనము లేదు. **కీర్తన 92:14**

ఎఫ్. ఆయనలో ఏ దుర్నీతి లేదు. **యోహాను 7:18**

జి. ఆయన యందు ఏ క్రోధం లేదు. **యెషయా 27:4**

827. 1) దేవుడు కోరేది ఆత్మ సంబంధమైన ఫలాలు గాని వట్టి విత్తనాలు కాదు.

2) నిష్కల్మషమైన మనసాక్షి కన్నా హాయిగా నిద్రపుచ్చు మందులేదు.

3) చాలా మంది అనుమానాలను నమ్మి నిజాలను దూరం చేసుకుంటారు.

4) దర్శన ప్రత్యక్షత కొరకై మన కండ్లు తెరవాలి. ఆత్మీయ నేత్రాలతో దేవుడిచ్చిన దర్శనం చూచే పవిత్రత కావాలి.

యోహెూవా వీడు చూచునట్లు దయచేసి వీడి కండ్లు తెరువుము అని ప్రార్థన చేయగా తరువాత అన్ని రథాలను చూడగలిగాడు. 2 రాజు.6:17

5) ప్రార్థనకై కిటికిని తెరువాలి. దానియేలు కిటికి తెరచి ప్రార్థన చేశాడు. దాని 6:10

6) దేవుని మాటలు వినుటకు చెవులు తెరువాలి. బలులు నైవేద్యములు కోరుటలేదు, నీవు నాకు చెవులు నిర్మించావు. కీర్తనలు 40:6

7) దైవ సందేశము స్వీకరించుటకు హృదయం కావాలి.

లూదియా హృదయం తెరచి దేవుని నమ్మింది. అపొ 16:14

8) దైవ పరిచర్యకై ద్వారాలు తెరవాలి పౌలు పరిచర్యకై ద్వారాలు తెరువబడ్డాయి. 2కొరింథీ 2:12

9) దేవుని స్తుతించుటకు పెదవులు తెరవాలి. కీర్తనలు 51:15

10) దాతృత్వంకై ముడుచుకొనిన చేతులు తెరవాలి. ద్వితి 15:8

828. **అంతా ఇంతే కాదు** (యోహాను 21:25)

యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతి దానిని వివరించి వ్రాసినయెడల అట్లు చేయబడిన గ్రంథములకు భూలోకమైననూ చాలదని నాకు తోచుచున్నది.

ఆజ్ఞలు పదేనని, ఆత్మ ఫలాలు తొమ్మిదేనని, ధన్యతలు తొమ్మిదేనని అంతా ఇంతేనని అనుకోవడానికి వీల్లేదు.

క్షయమైన ఈ అక్షరము గ్రహించగలిగితే అక్షయమైన పరిశుద్ధాత్మ నడిపింపు ఉంటుంది. బైబిలు సృష్టిని గూర్చి తెలియచేస్తుంది. కాని సృష్టి గ్రంథము కాదు. బైబిలు కేవలము ఆత్మీయ గ్రంథము. బైబిలు మానవున్నీ సంతోషంగాను, సమాధానకరంగాను, సమృద్ధికరంగాను, జీవింపచేస్తుంది.

829. బైబిలు క్షేమకరమైన, శాశ్వతమైన, శ్రేష్ఠమైన మానవ జీవితమును అనుగ్రహింప చేస్తుంది. బైబిలు మానవ శాప విమోచననూ అనుగ్రహిస్తుంది. దేవుడే వాక్యమై యున్నందున దేవుని స్తుతించి కీర్తించవలెను. మహిమ పరచవలెను. ఆయన గుణ గణ అద్భుత ఆశ్చర్య కార్యములను మేలులను ఉపకారాలను తలంచి స్తుతించి ఆరంభించాలి. యెహోవాను స్తుతించుట మంచిది.

830. జీవితం అనేది రైలు ప్రయాణంలాంటిది. వచ్చేవారు వస్తుంటారు, పోయే వారు పోతుంటారు. రైలు తన ప్రయాణాన్ని ఆపదు. జీవితం కూడ అంతే దానిని ఓర్పుతో, నిరీక్షణతో కొనసాగించాలి. దేవునిని ధ్యానిస్తూ ఇదే ప్రపంచంలో నిరాశలను దిగమింగి పయనించాలి.

831. మంచి వ్యక్తిగా జీవిస్తే చాలు ఇతరుల దగ్గర నిరూపించుకోనవసరం లేదు. ప్రభువు ప్రేమ బలవంతం చేయగా పౌలు తిమోతికి ఎన్నో హెచ్చరికలు చేస్తూ సైనికునివలె సిద్ధపాటుతో జీవించాలి. నీవు సిగ్గుపడనక్కర లేని వ్యక్తిగా ఆదర్శంగా జీవించాలని తెలిపాడు.

832. మనము ఆనందం పొందడము కన్నా ఇతరులకు ఆనందం పంచడంలోనే ఎక్కువ ఆనందం ఉంటుంది. క్రీస్తు అదే మాట తెలిపారు. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు అని, స్నేహితుని కొరకు ప్రాణం పెట్టగలగాలి. నేను నీకు మంచి స్నేహితుడను అన్నారు.

833. జీవితంలో కొన్ని మెళకువలను తెలిసికొని, దేవుడిచ్చిన జ్ఞానావగాహనములతో మంచి విలువలు పొందుకోవాలి. లేనిచో ఎప్పటికీ ఏమి సంపాదించుకోలేము. నిలబెట్టుకొనలేము. కష్టపడి సంపాదించిన, స్నేహమయిన, ప్రేమ అయినా డబ్బు అయినా వృథా చేయరాదు. చేజారితే తిరిగి సంపాదించుకోలేము.

834. మనలను సృష్టించిన దేవుని వాగ్ధానాలు చాలా అద్భుతమైనవి.
"నేను నీ గూర్చి ఉద్దేశించిన తలంపులను ఎరుగుదును. అవి క్షేమకరమైనవి మేలుకరమైనవని దేవుడే వాగ్ధానమిచ్చారు. అయితే కొందరి భావనలో జీవితం అంటే సస్పెన్స్ థ్రిల్లర్ నవలలాంటిది. ఏ పేజిలో ఏమి జరుగుతుందో తెలియదు. నిజమైన ఆనందం కావాలంటే చివరిదాక వేచియుండాలి. దేవుని మాటలను బట్టి ఓర్పుతో కనిపెడుతూ మెళకువగా ఉండి ప్రార్థించాలి.

835. యెహోవా యందలి భయభక్తులు జ్ఞానమునకు మూలము. జ్ఞాన వివేకములు దేవునియందే గలవు. కనుక ఆ జ్ఞానము పై నుండి కలిగినది. మృదువైనది,

పవిత్రమైనది. మూర్ఖుడు తాను ఇతరులను మోసం చేస్తూ తెలివి గలవాడిని అని అనుకుంటాడు. అది తన పిచ్చితనమని తన నాశనానికి దారి తీస్తుందని గ్రహించడు.

836. జీవితంలో మనం చేసే పనులు మంచివా లేక చెడువా అని ఎప్పటికప్పుడు తేల్చి చెప్పేది జయాపజయాలే. బైబిలు గ్రంథములో చెప్పిన నిజాలేవనగా క్రీస్తుయేసునందు మనమెన్నడూ విజేతలమే. మరణమైన, హింస అయినా ఏ వేదనలయినా క్రీస్తు యేసు ప్రేమ నుండి వేరు చేయలేవు. మనలను జయించువారిగా దీవించగలరని భక్తితో నమ్మి జీవించాలి.

837. ప్రభువు పలికిన అమూల్య మాటలలో ఇతరులను మీకంటే యోగ్యులుగా ఎంచుకోవాలన్న మాటను బట్టి ఎదుటివారి మాటలను, ఆలోచనలను గౌరవించకపోయినా అపహస్యం చేయరాదు. గొప్ప తనం గుర్తించి అభినందించాలి.

838. దేవుని హృదయం గ్రహించగలిగితే గొప్ప సత్యాలు గోచరం కాగలవు. దేవుడు, మనుష్యులను, ప్రకృతి వనరులను మనకొరకు సృష్టించి, సృష్టిని ఆధీనంలో ఉంచుకొనే ఆధిపత్యము ఇస్తూ, మనుష్యులను ప్రేమించమని ఆదేశించారు. కాని మనం భౌతిక సంపదను ప్రేమించి మన అవసరాలకు సంతోషాలను మనుష్యులను యుక్తిగా ఉపయోగించుకుంటున్నాము.

839. క్రీస్తు చెప్పిన మాట నేను లోకానికి వెలుగై యున్నాను. సృష్టిలో మొదట వెలుగు కమ్మని దేవుడు పలికాడు. మన జీవితాల్లో వెలుగు చీకటి గుప్తమైయుంటుంది. మనము దేనిని ఎన్నుకుంటామో దానిని అనుసరిస్తాము. మన జీవిత గమనాన్ని బట్టి మనం వెలుగు సంబంధులమో, చీకటి సంబంధులమో గుర్తించగలము. కొన్నిసార్లు మన తోటివారు విచారాలలో, చీకటి ఘడియలలో ఉండగా నీలో ఉన్న వెలుగు చిన్న క్రొవొత్తి కాంతినైన అందించి మార్గము చూపితే అంతులేని ఆనందం లభిస్తుందని గ్రహించు.

840. జీవితంలో చాలాసార్లు విచారాలు, నిరాశలు, నష్టాలు, సమస్యలు, దుఃఖాలు భయాలు ఎదురవుతూనే ఉంటాయి. అవన్ని మనము దేవునిపై వేయుట చేత కానందువలననే. ప్రయాసపడి భారము మోయుచున్న వారలారా నా యొద్దకు రండి అని పిలిచి క్రీస్తు ఇస్తానన్నా అభయమును నమ్మి ఆశ్రయిస్తే దుఃఖం నీకు దూరమవుతుంది. ఆనందం నీ సొత్తవుతుంది. చిరునవ్వు

చిందిస్తూ క్రీస్తును హత్తుకున్నట్లయితే జీవితం ఆహ్లాదంగా కొనసాగిపోతుందని దృఢంగా నమ్మి జీవించాలి.

841. దేవుడు సృష్టించిన ప్రకృతి మనకు జీవిత పాఠాలు బోధిస్తుంది. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన పనిని ప్రచురము చేయుచున్నది. అడవిలో ఠీవిగా నిలిచిన బలమైన చెట్లు ఒంటరిగా నిలిచి సందేశాలను ఇస్తాయని నమ్మాలి. నా తల్లి తండ్రి ఎవరో తెలియదు. నా నుండి రుచి గల ఫలాలను విత్తనాలను అందించగలను. వేలాది చెట్లను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. నాలో దేవుడున్నాడు. నాకు నా పని పవిత్రమైనదని తెలుసు. సమర్థత ఇచ్చాడని తెలుసు.

842. బాధలెవరికైనా తప్పవు. ధైర్యము తెచ్చుకోవాలి. దావీదు మహారాజయినా ఎన్నో కన్నీటి లోయలను ఎదుర్కొన్నాడు. నీ కట్టడలు నేర్చుకొనుటకు శ్రమనొందుట నాకు మేలాయెను. అంతేకాదు నా ప్రాణమా ఎలా కృంగియున్నావు? యెహోవాయందే ఇంకను నిరీక్షణ కలిగియుండాలని నేర్పాడు. బాధలనేవి ఆకాశములో చందమామలాంటివి. ఒకరోజు ఎక్కువ బాధ కలుగవచ్చు, తక్కువగా ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు కాలము వృధా చేయవద్దు. కానీ దేవునివైపు నిరీక్షణ ఉంచి ధైర్యంగా చింతలన్నీ తీర్చే యేసు సేద తీర్చునని నమ్మాలి.

843. అవిశ్వాసులతో జోడుగా ఉండరాదు. శత్రువు కొట్టే దెబ్బకంటే నమ్మిన స్నేహితులు అని సంతోషించే సమయంలో వెన్నుపోటు పొడిచి దూరమగుట బాధిస్తుంది. ఇస్కరియోతు యూదా క్రీస్తుతో ఉండి శత్రువులకు అప్పగించ లేదా? ఈ లోకంలో మంచితనం చచ్చిన వ్యక్తులను గుర్తించి అవగాహనతో జీవించుట నేర్చుకోవటం అట్టి వివేకం కొరకు దేవునిని ఆశ్రయించాలి.

844. ఆహారము లేకపోవడము పేదరికం కాదు. కుటుంబంలో ఆప్యాయత లేక పోవడం అసలైన పేదరికము. రెండు చెవులు ఒకే శబ్దం చూడగలవు. రెండు ముక్కు రంధ్రాలు ఒకే వస్తువు యొక్క వాసనను ఆఘ్రాణించగలవు. నాలుక అగ్నియై చిచ్చుపెట్టగలదు. రెండు రకాలుగా మాట్లాడగలదు. వీటినిబట్టి మన మాట ఉప్పు వేసినట్లు రుచికరంగా కృపాసహితంగా ఉండాలి. సమ యోచితంగా పలుకబడిన మాట వెండి పళ్ళెంలో పెట్టిన బంగారు పండ్ల వంటివి. ప్రేమలో అవగాహనతో మాట్లాడాలి. మంచినే తెలివిగా మాట్లాడాలి. అన్ని విన్నాక మాట్లాడాలి.

845. ఎవరైనా సాధించాలన్న పని ఈ రోజు కాకపోవచ్చు రేపు కాకపోవచ్చు ఏదో ఒకరోజు నెరవేరక తప్పదు. ఆగక సాగిపోవాలి. ఏ పని చేయకుండా ఉండడమే కష్టమైన పని. కష్టమైన పని ఇష్టంగా చేయడం నేర్చుకోవాలి. నన్ను బలపర్చువానియందే నేను సమస్తమును చేయగలను. ఫిలిప్పీ. 4:13.

846. దేవుని ఆశ్రయించిన వారికి ఆపత్కాలములో సహాయకుడు. అగ్నిలో పడవేసినా, సముద్రము ముంచి వేసినా రక్షించే దేవుడు తోడుండగా భయమెందుకు? దేవుడు ఎన్నుకున్న వ్యక్తి సముద్రంలో పడినా అదృష్టవంతుడే. యోనా చేప సహాయంతో తిరిగి రాగలిగాడు.

847. నేడు సాధించిన ప్రగతి, ప్రఖ్యాతులు, విలువలు మనము చేసిన పనుల వల్ల గాని, మనము తీసుకున్న బాధ్యతల వల్ల గాని దేవుని చిత్తంలో ప్రతి పని సాధించుట వల్ల కావచ్చు. ఏ బాధ్యత లేని వారికి ఏ పేరూ రాదు కొన్ని విలువైన సత్యాలు తెలిసికొని ఉండాలి.

1) తొలి దైవ సమానులు దేవుడిచ్చిన తల్లిదండ్రులు.

2) మంచి రోజు ఏదనగా ప్రతి రోజు దేవుడిచ్చిన బహుమానమే.

3) మంచి గుణము ఏదనగా శత్రువుని సహా క్షమించే మంచి మనస్సు.

4) నీతో ఎన్నడు రాకూడనిది విరక్తి.

5) ప్రతి వ్యక్తిలో నిలిచి సాధించేది ఓర్పు అనే గుణము.

6) ఎవరికీ ఉండరాని గుణము అత్యాస.

7) అందరూ అసహ్యించుకొనే గుణము ఈర్శ్య, అసూయ.

8) ఎన్నడూ నమ్మకూడనివి వదంతులు.

9) విస్తారమైన మాటలలో దోషముండక మానదు అదే అతివాగుడు.

10) ఎవరికైన చివరకు శత్రువుకైన చేయకూడనిది ద్రోహము.

11) ఎప్పటికైనా నిలిచి గౌరవాన్నిచ్చేది స్నేహం.

12) అందరికీ చేయదగినది సహాయము.

13) కీడు చేత కాక మేలు చేసి జయించాలని బైబిలు బోధిస్తుంది. అందరికీ మేలు చేయాలి.

848. చిన్న మాటైన మనసును గాయపరుస్తుంది. ఒక చిన్న అబద్ధము అను బంధాలను తెంచుతుంది. నీతో కాలం గడిపి ప్రేమ నటించేవారంతా నిజమైన స్నేహితులు కాలేరు. లోకమంతా ఏకమై నిన్ను విడిచిననూ విడువక నిలిచి మంచి స్నేహితుడు మంచి కాపరి రక్షకుడు మన ప్రభువైన క్రీస్తు అని నమ్మాలి.

849. మనం చేసే పనులపై దాని ఫలితాలపై ఎంత శ్రద్ధ చూపిస్తారో దాన్ని పొందే పద్ధతులలో అంతే శ్రద్ధ పాటించాలి. ఒంటరిగా ఉన్నప్పుడు మన ఆలోచనల మీద అదుపును, నలుగురిలో ఉన్నప్పుడు మన నాలుక మీద అదుపును ఉంచుకుంటే మన జీవితం సఫలమవుతుంది. నాలుక అగ్ని వంటిది చిన్న మాట గొప్ప విపత్తును కలిగించగలదు. చెడ్డ మాటలు పలుకకుండా నీ పెదవులను, నాలుకను కాపలా కాచుకోవాలి. సమాధానము వెదకి వెంటాడాలి. సమయోచితంగా పలుకబడిన మాటలు వెండి పళ్ళెంలో బంగారు పండ్లవంటివి.

850. ప్రతివాని జీవితంలో బాధించే రోగాలలో టి.బి., ఎయిడ్స్, క్యాన్సర్ రోగాలు వంటివి సంభవించినపుడు, ఎవరు మమ్ములను పట్టించుకొనుట లేదు, ప్రేమించుట లేదు, కోరుకొనుటలేదన్న బాధ, చింత హృదయాన్ని కలచివేస్తుంటాయి. బాహ్యంగా బాధించే వ్యాధులు, బాధలకు మందులున్నాయి గాని ఒంటరితనము, నిస్పృహ, నిరాశ, నిరీక్షణ లేని స్థితి వీటికి విరుగుడు. కేవలము నిర్మలమైన ప్రేమ మాత్రమేనని గ్రహించాలి.

851. జీవితంలో గతం తలచుకొని గతం లోపాలను తలంచుకొని చింతించరాదు. గడిచిన కీడు చాలును. గతంలో చేసిన తప్పులు సరిచేసికొని మంచిని ఆశ్రయించాలి. మనిషి సదాకాలము మార్పు కొరుతూ మంచి వైపు అభివృద్ధి చెందాలని కోరాలి. ఎదగాలి. నేర్చుకోవాలి. నిరాశావాదం వీడి ఆశావాదంతో సమాజానికి ఉపయోగపడే రీతిగా జీవించాలి. ఆధ్యాత్మిక చింతనతో గడపాలి. అప్పుడే గమ్యం చేరేది. విజేతవు కాగలవు. జీవిత యాత్ర ఆహ్లాదంగా కొనసాగుతుంది.

852. మనవి కాని వాటిని ఆశించి తీసుకుంటే మనకు దక్కవలసిన మంచి వాటిని దేవుడు మనకు ఇవ్వడు. దేవునికి నీవు ఎంత దూరంలో ఉంటే దేవుడు నీకు అంతే దూరంలో ఉంటాడు.

853. కనిపించే దైవం మాతృమూర్తి. వీరి ప్రేమ త్యాగమయం. గొప్ప నిధి, వాడని మరుమల్లె. ఎన్నో బంధాల కలబోత. అమ్మ అనుభవంతో నేర్పిన పాఠాలకు విలువెక్కువ. అమ్మ ఇష్టంతో చేసే పనులకు విజయమెక్కువ. ఎదుటివారిలో మంచిని చూచే అమ్మ మనస్సుకు ప్రశాంతత ఎక్కువ.

854. ఇచ్చుట, పుచ్చుకొనుట జీవితంలో భాగములే గాని పుచ్చుకొనుటకంటే ఇచ్చుట శ్రేష్టమైన అనుభవమని బైబిలు బోధిస్తుంది. కోల్పోయే దాని వల్ల వచ్చే విషాదము కన్నా ఇచ్చేదాని వల్ల వచ్చే ఆనందం ఎక్కువైతే దానిని దాతృత్వం అంటారు. కొల్పోయే దాని వల్ల విషాదం ఎక్కువైతే దానిని మోహమాటం అంటారు. దాతృత్వం విలువైన అనుభవం. మంచి పంచవచ్చు, ప్రేమను పంచవచ్చు డబ్బు మాత్రము కాదు.

855. క్రీస్తు నేనే మార్గం, సత్యం, జీవమని చెప్పారు. మార్గం తెలిసినవాడు దేవుడిచ్చిన జ్ఞానంతో మేధావి కాగలడు. మార్గం చూపేవాడు నాయకుడు కాని మార్గం తెలిసి చూపించక దాటించనివాడు అసమర్థుడు. మార్గం తెలిసిన క్రీస్తును వెంబడించుట అవసరం. ప్రతి మనిషికి అవసరమైనవి కొన్ని ఉన్నవి మర్యాదగా వినడం, వివేకంతో సమాధానం ఇవ్వడం ప్రశాంతంగా ఆలోచించడం. నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకొనుట అందరికీ అవసరం.

856. ఇతరుల కష్టాలను చూచి తప్పించుకొని పోరాదు చేయుతనివ్వాలి. వారి కష్ట నష్టాల అన్నిటిలో పాలి భాగస్థులు కావాలి. వారి బాధలలో పాల్గొని విజ్ఞాపన ప్రార్థనలు చేయాలి.

857. జీవించడం అందరికి తప్పదు గాని దేవుని రాజ్యాన్ని, నీతిని ముందుగా వెదకితే మనకు కావాల్సినవన్నీ ఇస్తానన్న అభయం అందుకొని దేవుని నిరంతరం ధానిస్తూ పావురాల వలె నిష్కల్మశంగా జీవిస్తూ పాముల వలె వివేకంగా జీవించడం నేర్చుకోవాలి. ప్రత్యేకంగా జీవించాలి. ఆలోచించి మాట్లాడితే జీవించగలము. అబద్ధాలు మాట్లాడితే ప్రేమను కోల్పోతాము.

858. జంతువు యొక్క మూగ వేదన మాంసం తినేవాడికి తెలియదు. మోసపోయిన వాడి మనోవేదన మోసగించినవాడికి తెలియదు.

859. ప్రతి ఉదయం లేచి ఉల్లాసంగా పని ఆరంభించాలి. గుండె బరువు తొలగించు కోవాలి. హాయిగా నవ్వుకోవాలి ప్రతి క్షణము దేవుడిచ్చిన జీవానికై కృతజ్ఞత చెల్లించాలి. దేవుడు మనలను విడువక కనిపెట్టి చూస్తున్నాడని పూర్తిగా నమ్మాలి. నీ వ్యధలన్ని మరచి ఇతరులను సంతోషపెట్టడానికి సృజనాత్మకంగా ఆలోచించి కృషి చేయాలి. నీ కొరకు నీవు చేసే కష్టం వృథా కావచ్చు గాని ఇతరులకు సహాయపడుచూ అందరి బంధువగుట వలన నీవు లేనపుడు కూడా నీవున్నట్లే తలపిస్తారు.

860. దేవుని దయ కటాక్షములు గొప్పగా నీకై దాచబడినవని నమ్మాలి. దేవుని గూర్చిన సత్యము సదా నిలిచేది. నీవు వెలుగులో నడిస్తే ప్రపంచం నీవెంట వస్తుంది. చీకట్లో నడిస్తే నీ నీడ కూడ నీవెంట రాదు.

861. ఇతరులలో ఆత్మ సౌందర్యాన్ని చూడగలిగితే నీలో సౌందర్యం ఇతరులు గుర్తిస్తారు. ప్రార్థన మానవునికి దేవుడిచ్చిన వరం. అది భద్రతనిస్తుంది. ఇహలోక ఒత్తిడిలన్ని తొలగించి నెమ్మదినిస్తుంది. నీ గుండె గదిలో వెలుగు ప్రేమను నిండుగా నింపుకోవాలి. విశ్వాసాన్ని విడనాడరాదు. అది కారడవిలో కాంతి రేఖలా దీపకాంతినిస్తుంది. అడవంతా ఒక్కసారిగా చూడలేవు. ప్రతి అడుగు వేసే వేళలో తగిన వెలుగిచ్చి దారి చూపగలదు.

862. ప్రపంచంలో మీ దగ్గర లేకపోయిన అందరికి పంచగల విలువైనది సంతోషము. విశ్వాసం అనేది ఒక చిన్న పదము దీనిని చదవడానికి ఒక సెకను పడుతుంది. అర్థం చేసుకొనుటకు ఒక నిమిషం కావాలి. నిరూపించుకోవడానికి మాత్రం జీవిత కాలం కావాలి. అయినా విశ్వాసం విలువైనది.

863. నీకిష్టమైనది ఎన్నుకొని స్వతంత్రంగా నీవు చేస్తున్న పనిని ఇష్టంగా యధార్థమైన మనస్సుతో చేస్తే అది నిజమైన ఆనందాన్ని ఇస్తుంది.

864. ప్రతి ధనాత్మక ఆలోచన ఒక మౌన ప్రార్థన కాగలదు. అది నీ మనస్సులో ఆశయాలకు పదును పెట్టి ప్రగతి సాధించే ధన్యత ఇస్తుంది. నీలో మార్పును ఇస్తుంది. ఆశావాదంతో జీవించాలి. మంచి రోజు కాని రోజు అని ఉండదు. అది నీవు ఏ మనస్సుతో స్వీకరిస్తావో దానిపై ఆధారపడి ఉంటుంది.

865. ఎవరినీ తక్కువగా అంచనా వేయరాదు ఎలక్ట్రిక్ బల్బు తయారు చేసిన థామస్ ఎడిసన్ బాల్యంలో తల్లిని చేరి ఒక చీటీ ఇచ్చాడు. ఎవరు ఇచ్చారు అని అడిగితే మా టీచరు ఇచ్చారు అని చెప్పాడు. అది ఆ తల్లి కంటిలో నీరు నింపుకుంది. అమ్మ ఎందుకు ఏడుస్తున్నావు అని ప్రశ్నించగా "మీ అబ్బాయి అతి తెలివైనవాడు అది తట్టుకొని బోధించే టీచర్లు లేరు వేరే స్కూలులో చేర్పించి చదివించండి" అని వ్రాసి ఉందని తెలిపింది. అతను ఆ మాటలను నమ్మాడు. తల్లి మరణించాక ఆమె పర్సులో ఉన్న ఆ కాగితాన్ని చదివాడు దానిలో నీ కుమారుడు మానసికంగా సరిగ్గా లేడు, రేపటి నుండి స్కూలు మానిపించాలి అని వ్రాసి ఉంది. దానిని బట్టి గంటల తరబడి కన్నీరు కార్చాడు. కాని తల్లి కంటికి అతనొక హిరో చిన్నతనంలో సరిగ్గా లేడు అయితేనేమి జీనియస్‌గా ఆ తరంలో ప్రపంచ ఖ్యాతిని సంపాదించాడు.

దీనిని బట్టి ఎవరినీ తక్కువగా అంచనా వేయరాదు. అందరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. అది తల్లి మాత్రమే గుర్తించగలదు. అది దేవుడు దాచిన నిధి.

866. **క్రైస్తవ్యంలో చూడవలసినవి**

ఎ) హోదా కాదు బోధ. బి) మందిరము కాదు మందను.

సి) ఆస్తిలో ఎదుగుదల కాదు ఆత్మీయతలో ఎదుగుదల.

డి) బట్టలలో భక్తిని కాదు బ్రతుకులో భక్తిని చూడాలి.

867. నాటకం గానీ విడియో గాని చూస్తే ఏదో తలంపు ఒక దగ్గర ఉపయోగ పడుతుంది. సబ్బు తయారీలో నూనె అవసరం. అది పోగొట్టాలంటే మరలా నూనె కావాలి. జీవితం కూడ అంతే.

ఒక సమస్య వస్తే ప్రపంచంలో ఇద్దరే హాయిగా, ఆనందంగా ఉండగలరు . ఒకరు పిచ్చివాళ్ళు, మరొకరు చిన్న పిల్లలు. గమ్యాన్ని చేరుకోవాలంటే పిచ్చి వాళ్ళుగా గాని, చిన్న పిల్లలవలె గాని మారాలి. పిల్లలే అన్ని ఆనందించగలరు. తాళంతో పాటు తాళం చెవి తయారు చేయబడుతుంది. ఒకటి లేకుంటే రెండవది తయారు కాదు. అట్లే పరిష్కారం లేకుండా సమస్య ఉండదు. మాట కంటే తూట శక్తివంతమైనది. ఒక్క మాటతో సంబంధము తెంచు కోగలము. పెంచుకోగలము. మనిషి సమాజంలో సూదిలా బ్రతకాలి గాని కత్తెరలా కాదు. సూది ఎప్పుడు కలుపుటకు జోడించుటకు సహకరిస్తుంది. కత్తెర పని విడగొట్టుటమే.

868. ఒక చిన్న బాలుడు బ్రతికున్న చేపను చూచి కావాలి తినాలి అని యేడ్చాడు. తల్లి కనిపెట్టాలి అని చెప్పింది. దేవుడిచ్చేవి పొందుకోవాలంటే త్వరపడరాదు. తగిన సమయం కొరకు వేచి యుండాలి. జీవితం కొన్నిసార్లు కఠినమైన పరీక్ష వంటిది చాలా మంది అపజయాన్ని ఎదుర్కొంటారు. కొందరు ప్రక్కవారి నుండి కాపీ చేస్తారు. ఒక్కొక్కరికి కొన్నిసార్లు విభిన్న ప్రశ్నలు వ్రాయవలసిన పరిస్థితి ఎదురవుతుంది. ప్రతి పరీక్ష సమయంలో విజయమిచ్చు శక్తిమంతుడు యేసు ప్రభువని తెలిసికొని సహాయం కోరాలి

869. దేవుని హస్తము మన బలహీన స్థితిలో పట్టుకుంటుంది. నీ కన్నులు ఆయన వైపు చూడాలి. ఆయన కన్నులు చీకటిలో చూస్తాయి. బలహీన స్థితిలో నీ గుండెను ధైర్యపర్చగల శక్తి దేవునికే ఉంది. ప్రేమించే విలువైన సమర్థుడు క్రీస్తు.

870. జీవితం కుస్తీ పోటీ వంటిది. క్రిందపడితే అపజయమగును. కానీ తిరిగి లేవకపోతేనే దుర్భరం. తిరిగి లేవాలి అనే తలంపుతో విజేత కాగలరు. కొన్నిసార్లు సరైన వ్యక్తిత్వం లేనివారు కూడా సరైన పాఠాలు నేర్పగలరు. ఇదే జీవితానుభవం. ఇతరుల ఆలోచనలలో ఉండుట క్షేమకరమైన అనుభవం. ఇతరుల విజ్ఞాపన ప్రార్థనలో మనము భాగమై యుండుట అని తెలిసికోవాలి. భయమునకు రెండు అర్థాలున్నవి అన్ని మరచి పరుగెత్తుట లేదా ఎదురు తిరిగి సమస్తం ఎదుర్కొని విజేతలై ఆనందించాలి. ఎలా జీవించాలో నిర్ణయం మన ఆధీనంలోనే ఉంటుంది.

871. కాలమనేది స్వేచ్ఛ గలది అమూల్యమైన విలువ గలది. దానిని అందరం స్వంతం చేసుకోగలము. దానిని దాచలేము వాడుకోవాలి. ఒక్కసారి పోగొట్టుకుంటే తిరిగి పొందలేము. నీవు చేసే పని స్వేచ్ఛగలదే గాని నీవిష్ట పడేదే నీవు చేసే పనిగా ఉండాలి.

872. **బైబిల్‌లో ప్రముఖులు**

ఎ) రాయిని బుల్లెట్టుగా వాడిన మొదటి వ్యక్తి దావీదు రాజు.

బి) అంతరిక్షంలో విహరించిన మొదటి వ్యక్తి ఏలియా.

సి) భూగర్భంలో కాక సముద్రగర్భంలో ప్రయాణం చేసినవాడు యోనా.

డి) రాకేట్ లేకుండా ప్రయాణించిన వ్యక్తి హనోకు.

ఇ) మొదటి గొప్ప ఇంజనీరు నోవహు.

873. జీవితంలో సులభమైనవి క్లిష్టమైనవి ఏమనగా మనం చేసిన పొరపాట్లు. యితరులు పొరపాటు చేసే చాల తేలిగ్గా విమర్శించగలము. మన తప్పులు మనము గ్రహించుటకు చాలా కష్టముకాగలదు. అందుకే మన మేమిటో మనకే తెలియాలి సరిచేసికోవాలి. దావీదు దేవా, నా హృదయాన్ని బాగా పరిశీలించు. ఆయాసకరమైన మార్గం నాలో ఉంటే అది తొలగించమని ప్రార్థించాడు.

874. మనం ప్రేమించి సేవించే యేసు ఎవరు?

1. జంతు శాస్త్రజ్ఞులు యూదా సింహము అని పిలుస్తారు.
2. వృక్ష శాస్త్రజ్ఞులు జీవ వృక్షము అంటారు.
3. జియాలజీ శాస్త్రజ్ఞులు తరతరాల కొండ (రాక్ ఆఫ్ ఏజెస్) అంటారు.
4. పాక శాస్త్ర నిపుణులు జీవాహారామంటారు.

5. గణిత శాస్త్రజ్ఞులు ఆది అంతము, అల్ఫా, ఓమెగా అంటారు.
6. ఇంజనీర్లు మూలకు తలరాయి అంటారు.
7. డాక్టర్లు గొప్ప స్వస్థత ఇచ్చే ప్రభువు అంటారు.
8. పాపులంతా మంచి రక్షకుడు అంటారు.
9. విచారంలో మునిగినవారు శాంతికి రాజు అంటారు.
10. విశ్వాసులంతా నిజమైన దేవుడని ఒప్పుకొని సేవిస్తారు. యేసు నామము దివ్య నామము అన్ని నామముల కంటె పైనామము యేసుని నామము. ఆయనకే సదా స్తుతి మహిమ కలుగును గాక.

875. నీ జీవితం నిన్ను ఎంతగా కృంగదీసిననూ నిన్ను దిగజారిపోనీయకు. ఎల్లప్పుడూ చిరునవ్వు చెరుగనీయకు. ఆరోగ్యంగా లేచి దీవించగల ధన్యత దేవుడిచ్చాడని కృతజ్ఞత కలిగి ఉండాలి. చిన్న చిన్న పనులు ఇతరుల కొరకు చేస్తే ఇతరుల హృదయాలలో చాలా గొప్పగా పని చేస్తాయి. చిన్న పనులు శ్రద్ధగా చేయడానికి సమయాన్ని వినియోగించు.

876. ప్రతి పనిలో సమస్యలు ఎదురవుతాయి గనుక అవి అంగీకరించు లేదా మార్పు చేయి లేదా వదిలివేయాలి. అంగీకరించలేకపోతే మార్పు చేసుకో, మార్పు చేయకపోతే వదిలి ప్రశాంతత కాపాడుకో. ప్రభువుతో సదా మాట్లాడు దు:ఖంలో, వేదనలో సరైన జవాబు రానపుడు నెమ్మదిగా దేవునిని తోడుగా సదా ఉండాలని కోరుకో. ఆయన నీ మాటలు వింటాడు నీవు అడిగినపుడు ఆయన నిన్ను విడువడు. నీవంటే దేవునికి ఇష్టం.

877. **నేటి యువతకు ప్రత్యేక హెచ్చరికలు**
సరదాగా కాలం గడపడం అంటే ఏమిటి? బీర్లతో బార్లలో గడపడమా? బాయ్ ఫ్రేండ్ గర్ల్ ఫ్రెండ్‌తో తిరగడమా? ఛాటింగ్, డేటింగ్ చేయడమా? బైక్ మీద చక్కర్లు కొట్టడమా? సినిమాలు చూసి షికార్లు చేయడమా? పొగ త్రాగి, గుట్కాలు తినే చెడు అలవాట్లకు బానిస అవడమా? యవ్వనం తిరిగి రాదనే ఆలోచన ఉందా? మంచివారైన, చెడ్డవారైనా తీర్పు నుండి తప్పించుకోలేరు.

878. యవ్వనుడా, నీ యవనమందు సంతోషపడుము, నీ యవన కాలమందు నీ హృదయము సంతుష్టిగా ఉండనిమ్ము. నీ కొరిక చొప్పున, నీ దృష్టియొక్క ఇష్టము చొప్పున ప్రవర్తింపుము అయితే వీటన్నిటిని బట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపకం చేసుకొనుము. ప్రసంగి 11:9

879. మీ చూపులు ఎలా ఉన్నవి? మీ కోరికలు ఎలా ఉన్నవి?

ఎ) అమ్నోను చూపులు చెల్లెలి మీదకు వెళ్ళాయి. చివరకు ప్రాణాలు కోల్పోయాడు 2 సమూ 13:2

బి) తప్పిపోయిన కుమారుని చూపులు రంగుల ప్రపంచం మీదకు వెళ్ళాయి. ఫలితం పందుల పొట్టు ఆహారమయింది. లూకా 15:6

880. దేవునిచే ఏర్పరచబడిన సంసోను చూపులు వేశ్య మీదకు వెళ్ళాయి. సింహాన్ని చీల్చాడు, పచ్చి గాడిద ఎముకతో 1000 మందిని చంపినవాడు 300 నక్కలను పట్టుకొని శత్రువుల పొలాలు నాశనం చేశాడు కానీ ఏ కళ్ళు అయితే వేశ్యను చూచాయే ఆ రెండు కళ్ళు పెరికి వేయబడినవి. దాకోను దేవతకు బలి పశువుగా నిలబడ్డాడు. న్యాయా 16:1.

881. దీనా చూపులు లోకం మీదకు మళ్ళాయి. ఆ దేశ రాజకుమారుడు ఆమెను చూశాడు, పాడు చేశాడు తద్వారా దీనా అన్నలు హంతకులుగా మారారు. వీరంతా లోకాశలకు లొంగి ఆనందించాలని ఆశపడ్డారు. వారి అంతం ఏమయింది. నేడు నీ జీవితం సంతోషంగా సాగిపోతుంది అనుకుంటున్నావా? కాని దాని అంతము ఘోరంగా ఉంటుంది. అల్పకాల సుఖ భోగాలను చూచుకొని నిత్య రాజ్యాన్ని కాళ్ళతో తన్నేస్తావా?

882. యోసేపు పవిత్రమైన జీవితాన్ని జీవించగలిగాడు. ఇస్సాకు దేవుని కొరకు అర్పణగా మారడడానికి సిద్ధపడ్డాడు. యొప్తా కుమార్తె దేవుని కోసం అర్పణగా మార్చబడింది. వారి జీవితాలు ధన్యమయ్యాయి. చివరకు జీవిత గమనంలో ఆనందం ఎక్కడ లభించగలదు. అది యేసయ్యలోనే ఆనందం, ఆయనలోనే సమాధానం, నెమ్మది ఈ అనుభవాలే ప్రేమతో నిండినవై శాశ్వతంగా అద్భుత అనుభవాలను ఇస్తుంది.

883. **క్రైస్తవ్యము అంటే ఏమిటి?**
క్రైస్తవ్యము ఒక కులమో, మతమో కాదు క్రీస్తును పోలిన నీతివంతమైన జీవితము క్రైస్తవ జీవితము క్రీస్తులో పరిపక్వత చెందినపుడు నిజమైన క్రైస్తవుడు అని పిలువబడతావు. క్రీస్తును అనుసరించినవాడే క్రైస్తవుడు. క్రీస్తు మార్గమే క్రైస్తవ్యం.

884. **ఇంగ్లీషు అక్షరాలలో C H R I S T I A N అనే ప్రతి లెటర్ యొక్క వివరణ**

**C - Compassion = దయ**

దయను, సత్యమును ఎన్నడునూ విడిపోనీయకుము. వాటిని కంఠ భూషణముగా ధరించుకొనుము నీ హృదయమను పలక మీద వ్రాసికొనుము. సామె. 3:3,4.

**H - Humble = సాత్వీకము, అణకువ**

అణకువ అనేది వ్యక్తిని ప్రయోజకుని చేయును. ఆధిక్యత, పతనమునకు దారి తీస్తుంది.

ఉదా : మోషే ఐగుప్తులో ఆధిక్యత కలిగియున్నప్పుడు దేవుడు ఎంపిక చేసుకొనలేదు. అణకువ కలిగిన సమయంలోనే ఎంపిక చేసికున్నాడు.

**R - Righteousness = సత్య ప్రవర్తన**

సత్య ప్రవర్తన అందరికీ అవసరం రూతును బోయజు అభినందించాడు. నీ మునుపటి సత్ప్రవర్తన కంటే వెనుకటి సత్ ప్రవర్తన మరి ఎక్కువైనది. రూతు 3:10.

దేవుని చిత్త ప్రకారము బాధపడేవారు సత్ ప్రవర్తన గలవారై నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకోవాలి. 1పేతురు 4:19

ఒకని నడత యెహోవా చేతనే స్థిరపరచబడును. వారి ప్రవర్తన చూచి ఆయన ఆనందించును. కీర్తనలు 37:23

**I - Innocence = నిష్కపటము**

యేసు – నతానుయేలును చూచి ఇతనియందు ఏకపటము లేదు. యోహాను 1:47 క్రైస్తవుడు కపటం లేనివాడుగా ఉండాలి. పవిత్ర హృదయము నుండియు మంచి మనస్సాక్షి నుండియు నిష్కపటమైన విశ్వాసమునుండియు కలుగు ప్రేమ గలవారై క్రైస్తవులుండాలి. 1తిమోతి 1:5 పౌలు తిమోతి వారి అమ్మ, అమ్మమ్మలో ప్రేమను కనుగొన్నాడు. దుర్మార్గతయు, దుష్టత్వమును అను పులిపిండితోనైనను కాక నిష్కాపట్యమును సత్యమును పులియని రొట్టెలతో పండుగ ఆచరింతము. పౌలు బోధ నిష్కపటముగా బోధించాడు.

**S - Sympathetic = కనికరము**

నీ దేవుడైన యెహోవా కనికరం గల దేవుడు. ద్వితి 4:31, మత్తయి 5వ అధ్యాయంలో కనికరం గలవారు ధన్యులు వారు కనికరింపబడుతారు. ఆయనకు భయపడువారి వారియెడల ఆయన తరతములకు కనికరం చూపును. లూకా 1:50

**T - Tolerance = సహించుట**

అంతము వరకు సహించువాడు రక్షింపబడును. మత్తయి 10:22 ప్రేమ ధీర్ఘకాలము సహించును. 1కొరింథీ 13:4 శోధన సహించువాడు ధన్యుడు యాకోబు 1:12 ఎవడైననూ తనకు హాని చేసెనని ఒకడనుకొనినయెడల ఒకనినొకడు క్షమించుడి. కొలొ 3:13. విశ్వాసములేని మూర్ఖతరమువారలారా నేనెంత కాలము మీతో కూడ ఉండి మిమ్మును సహింతును

**I - Immaculate = పరిశుద్ధమైనది**

నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులైయుండుడి. లేవి 11:44. పరిశుద్ధుడు ఇంకను పరిశుద్ధుడుగా ఉండనిమ్ము. ప్రక 22:11

**A - Amnesty = క్షమాపణ**

పరలోక ప్రార్థనలో మా యెడల అపరాధములు చేసినవారిని మేము క్షమించునట్లు మా అపరాధములను క్షమించుము. క్షమించుడి అప్పుడు మీరు క్షమించబడుదురు. లూకా 6:38. ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్ణీతి నుండి మనలను పవిత్రులుగా చేయును. 1యోహాను 1:9

**N - Nobility = ఔదార్యము**

ఔదార్యము గలవారు పుష్టినొందుదురు. సామెతలు 11:25. ఇట్టి ఔదార్యము ద్వారా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించబడును 2కొరింథీ 9:11. దానధర్మములు చేయు లక్షణము క్రైస్తవులు అలవర్చుకొనుట ఆవశ్యము.

885. ప్రతి దినము దేవుని కొరకు ఆలోచించాలి. **కీర్తన 68:18**
ప్రతి గంట దేవుడు నిన్ను చూస్తాడు **2 థెస్స 3:3**
ప్రతి నిమిషము నిన్ను కాపాడుతాడు. **1పేతురు 3:7**
ప్రతి సెకండు నిన్ను ప్రేమిస్తున్నాడు. **యిర్మీయా 31:3**

886. దేవుని సన్నిధిలో మౌనంగా కనిపెట్టుట సహనముతో ఉండుట మంచిది. మౌనము ఒక శక్తి స్నానము దేహాన్ని శుద్ధి చేస్తుంది.
ధ్యానము బుద్ధిని శుద్ధి చేస్తుంది. ప్రార్థన ఆత్మను శుద్ధి చేస్తుంది. దానము సంపదను శుద్ధి చేస్తుంది. ఉపవాసము ఆరోగ్యమును శుద్ధి చేస్తుంది. క్షమాపణ సంబంధాలను శుద్ధి చేస్తుంది. దేవుని సన్నిధిలో కనిపెట్టుట ఆనందించుట విశ్వాసికి కావాలి. ఆనందమే జీవిత మకరందము

887. దేవుని పేర మనము చేసే చిన్న పని గొప్ప కార్యాలను చేయగలదు. చాలా గొప్పగా జీవితాలను ప్రభావితం చేస్తుంది. జీవితం సముద్రం వంటిది దాని

అంతము కనిపించనట్లు ఉంటుంది. అలలు అవిరామంగా చలిస్తూ ఉంటాయి. అవి తాకిన వెంటనే దూరమయినట్లే కొందరు వ్యక్తులు జ్ఞాపకాలుగా మిగిలిపోతారు.

888. జీవితంలో డబ్బు నన్ను సంపాదించు అంటుంది.
క్యాలెండరు కాలం చూపిస్తూ నన్ను మార్చు అంటుంది.
ఒక రోజు 24 గంటలు నన్ను నియంత్రించి ప్లాను చేసుకో అంటుంది.
భవిష్యత్తు నన్ను జయించు అంటుంది. కానీ,
దేవుడు రోజు నన్ను జ్ఞాపకం చేసుకో అంటాడు. వాక్యం, ప్రార్థన సహవాసం ద్వారా దినదినము నాకు సన్నిహితంగా ఉండాలని దేవుడు బోధిస్తాడు.

889. మనిషి జీవితంలో ఎక్కువగా బాధించేది వివిధ రోగాలలో టి.బి, ఎయిడ్స్, క్యాన్సర్ వంటి రోగాలు కాదు. ఇతరులచే ప్రేమించబడని బాధ కలిగించే మానసిక స్థితి. నన్ను ఎవరు కోరుకొనుట లేదనే చింత. నన్ను లక్ష్యపెట్టుటలేదనే హృదయ వ్యధ. బాహ్యంగా బాధించే రోగాలకు మందులున్నవి గాని ఒంటరి తనము, నిస్పృహ నిరీక్షణ లేని స్థితి, నిరాశ. ఇదే అదే మానసిక రోగం. దీనికి విరుగుడు కేవలము నిర్మలమైన ప్రేమయే.

చాలా మంది రొట్టె లేక భోజనంపై బాధపడేవారున్నారు కానీ చిన్న పాటి ప్రోత్సాహము, చిన్న చిరునవ్వు చిన్న ప్రేమను కనపర్చు మంచి మాట వీలైతే చేతి స్పర్శ వీటినందించే వారుంటే ఊరట పొందగలరు. ఆత్మీయంగా పేదలున్నారు. ఆధ్యాత్మిక జ్ఞానం కరువై భక్తిగల వాతావరణం అందనివారు సహవాసం కరువైనవారు ప్రార్థన లేమితో, చింత, వ్యధతో నిరీక్షణ లేనివారెందరో ప్రేమకై ఆకలిదప్పులు గలవారున్నారు. నీతి కొరకు ఆకలిదప్పులు కావాలి. దుప్పి నీటివాగుల కొర్కై ఆశపడేవారిగా ఉండాలి. గతాన్ని లోపాలను తలంచుకొని చింతించరాదు. గడిచిన కీడు చాలు. పొరపాటుగా చేసిన తప్పునుండి మంచిని తెలుసుకోవాలి.

మనిషి సదాకాలము మార్పు చెందుచూ ఎదుగుచూ నేర్చుకుంటునే ఉండాలి. నిరాశావాదంతో నిలిచిపోరాదు. ఆశావాదంతో పైపైకి ఎదిగి సమాజంలో అందరికీ ఉపయోగపడేలా ఆధ్యాత్మిక చింతనతో గడపాలి. అప్పుడే మన గమ్యమును సులభంగా చేరుకోగలము. జీవితం ఆహ్లాదంగా సాగిపోతుంది. పాప భీతి, దైవ ప్రీతి, సంఘ నీతి ప్రతి వ్యక్తికి అత్యవసరాలు. ఎంత గొప్ప పోరాటాలు ఉంటే అంత గొప్ప విజయాలు దాగి ఉంటాయి అని ప్రతి విశ్వాసీ గ్రహించాలి.

890. విశ్వాసం అనేది చిన్న పదము. దీనిని చదవడానికి ఒక సెకండు పడుతుంది. ఆలోచించడానికి ఒక నిమిషం పడుతుంది. అర్థం చేసుకొనుటకు ఒక రోజు పడుతుంది. నిరూపించుకొనుటకు మాత్రం జీవితకాలం పడుతుంది. విశ్వాసం చిన్న చిరు దీపం. కాంతినిచ్చేదిగా అడవి మార్గంలో దారినిస్తుంది. మొత్తం అడవి అంతా చూపించలేదు గాని ఒక్క అడుగు వేసెంత చిరుకాంతిని అందిస్తుంది. విశ్వాసం కూడా అంతే అంచంలంచెలుగా నేర్పిస్తుంది.

891. క్రైస్తవ్యంలో చూడాల్సినది హోదా కాదు బోధ. మందిరంలో చూచేది మందను మాత్రమే. నీవొక త్యాగపూరితమైన వ్యక్తిగా ఇతరులలోని ఆత్మ సౌందర్యాన్ని చూచి వారిని అభినందించ గలిగినపుడు మాత్రమే నీలో క్రీస్తును చూడగలము.

892. **పూర్వకాలంలో బైబిల్ ముద్రించిన తీరు:** పురాతన కాలంలో రాతి పలకలపై వ్రాత వ్రాయగా చెరిగేది కాదు. చెట్టు బెరడుపై వ్రాయుటకారంభించారు. రాతి పలకల ఆధారంగా డికోడు చేసి కొన్ని సత్యాలు సేకరించారు. మూడు రకాలుగా బైబిలు సత్యాలు వ్రాయబడ్డాయి. పైపరస్ మొక్క కాండమును తీసి ముక్కలుగా చేసి ప్రెస్ చేసి పేపరుగా చేసి జిగురు వేసిన రసాయనాలతో వ్రాయగా అది చెక్కుచెదరక నిలిచిఉండేది. ఇది ప్రప్రథమ ప్రయోగము.

రెండవదిగా జంతు చర్మాలు సేకరించి వాటిపై వ్రాసారు.

893. వెల్లుమ్ అనే పేరున లేత జంతువుల చర్మంపై దైవవాక్యాన్ని వ్రాసేవారు. ఈ కాగితపు చుట్టలకు బిబ్లోస్ అనే పేరుండేది అనగా పుస్తకముల చుట్ట. చరిత్రలో ఇదే ఏకైక దైవ గ్రంథము. పైపరస్ పై వ్రాసిన పతి లభ్యమగుట గొప్ప విశేషము.

ఈ రీతిగా బిబ్లోస్ అను పదం నుండి బైబిలు పదము వాడుకలోకి వచ్చింది. నాటి నుండి నేటి వరకు బైబిల్ ప్రసిద్ధిగాంచిన పవిత్ర పదంగా వ్యవహరించ గలుగుట దేవుని కృపగా స్తుతించి ఘనపర్చి ఆరాధిస్తున్నాము.

894. ఇసులా కరిగిపోయే ఐశ్వర్యముకన్నా అక్షరంలా నిలిచిపోయే మంచితనమే మిన్న. చిరునవ్వు అనేది మనుషులను సామాన్యంగా తాకుచూ ప్రభావితం చేస్తూ చిరస్మరణీయంగా ఇతరుల హృదయాన్ని స్పందించేది.

మన దిన చర్యలో ప్రార్థన ఎట్లుండాలనగా ప్రభూ, నీవు నాకిచ్చిన ఈవులన్నిటికీ వందనాలు. కొన్ని పరిస్థితులను నేను కళ్ళతో చూడలేను కృతజ్ఞతతో నిన్ను

మహిమ పర్చగలను. నా చీకటిని వెలుగుగా చేయగలవు. నా రోగాలు భరించి నా బాధను నా నొప్పిని తీసి వేసి ఆరోగ్యాన్ని ప్రసాదించావు. నన్ను ప్రేమించే వ్యక్తులను నా జీవితంలో నిలిపావు. నాకున్న ఆస్తిని లెక్కించుటకు డబ్బు రూపంగా ఉన్న స్థితి కాదు గాని నా కన్నీరు తుడిచే చేతులు గల వ్యక్తులు నాకు ఆస్తి అని నేర్పించావు. నేను నడుస్తూనే నిన్ను స్తుతించగలను. నా నడకలలో మలుపులు ఊహించరానివైన నీ చేయి నన్ను పట్టుకొని నడిపిస్తూ నాకు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

895. ఒక్కరోజులో తారుమారైన సంఘటనలు బైబిలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. ఒక్కరోజులో నయామాను అను సైన్యాధిపతి కుష్టురోగిగా ఉండి దైవజనుని సలహా మేరకు యోర్దానులో 7సార్లు మునిగి ఒక్కరోజులో పూర్తిగా స్వస్థత పొందాడు. 2రాజులు 5:9

దావీదు గొర్రెల కాపరిగా అమాయకంగా పొలంలో ఉండగా సమూయేలు ద్వారా పిలువబడి అభిషేకించబడిన రాజైన స్థితి అదే రోజు సంభవించింది. 1సమూ 16:13

ఒక రోజు మొర్దెకై నిద్రించు వేళ రాజు అతని సేవలు గుర్తించి గొప్పగా సన్మానించబడ్డాడు. ఎస్తేరు 6:10

ఒక్క రోజులో అనుకోని రీతిగా గ్రుడ్డివాడైన బర్తలోమయి అను వ్యక్తి క్రీస్తును కనుగొని అరచి వేడుకొనగా చూపు పొంది ధన్యుడయ్యాడు. మార్కు 10:46

దానియేలు సింహపుబోనులో ఉండగా దేవునిచే కాపాడబడి ఒక్క రోజులో ప్రధాన మంత్రిగా దీవెన పొందాడు. దాని 6:16–28

విధవరాలైన స్త్రీ అప్పుల బాధ నుండి ప్రవక్త ద్వారా విడుదల పొందింది. ఒక్క రోజులో అద్భుతము చూచింది. 2రాజులు 4:1–7

లాజరు చనిపోయిన తరువాత ఒక్కరోజులోనే బ్రతికించి ఆశ్చర్యం కలిగించాడు యోహాను 11:43

రక్త స్రావం గల స్త్రీ ఒక్కరోజులోనే స్వస్థత పొందింది. లూకా 8:43

యోసేపు చెరసాలలో బందీగా ఉండి రోజులు గడిపే రోజులలో అదే రోజు సాయంత్రం దేశ ప్రధాన మంత్రిగా దీవించబడ్డాడు. ఆది 41:15

యెబ్బేజు ప్రార్థన ద్వారా ఆ రోజే జవాబు పొంది తన సరిహద్దు విశాలపర్చగలిగాడు. 1దిన 4:9–10

షోమ్రోనులో ఎలిషా ప్రవచనం నెరవేర్పుగా కరవు ఒక్క రోజులో సమసిపోగా సమృద్ధి గల ఆహారం లభించింది. నిత్య జీవితంలో అనుదిన అద్భుతాలు ఎన్నో పొంది స్తుతించి ఘనపర్చుట విశ్వాసి విధిగా చేయు కర్తవ్యమని గుర్తించాలి. యెహోవాకు అసాధ్యమేమైనా ఉన్నదా? ఆది 18:14

896. దేవుని దృష్టిలో మానవులు ఎలాఉన్నారు?
**దేవుని దృష్టిలో :** మనలను సదా ప్రేమించే ప్రభువు మనలను నేను కాపరిని మీరు గొఱ్ఱెలు అంటాడు. నేను ద్రాక్షవల్లిని మీరు తిగేలు అంటారు. నేను మీకు స్నేహితుడను ప్రార్థనలను ఆలకించువాడను నాకు మీరు రాజులు, యాజక సమూహమును పరిశుద్ధ ప్రజలు ఆశీర్వదించబడిన జనమా అని పిలుస్తాడు.

897. బైబిలులో గొప్ప వ్యక్తులు వారి జీవిత గమనాన్ని బట్టి గుర్తించబడ్డారు. సాక్షి సమూహాన్ని అనుసరిస్తూ మంచి ప్రార్థనాపరులైయుండాలి.

నోవహు వంటి నీతి నాకు కావాలి.

అబ్రహాము వంటి విధేయత కావాలి.

యోసేపు వంటి పవిత్రత అలవర్చుకోవాలి.

మోషె వలె నమ్మకమైనవాడిగా జీవించాలి.

సమూయేలు వంటి యధార్థత కావాలి.

ఏలియా వంటి విశ్వాసం అలవర్చుకోవాలి.

యోబు వంటి ఓర్పు కావాలి.

దానియేలు వంటి ప్రార్థనాత్మ కావాలి.

దావీదు వంటి క్షమాపణ కోరే హృదయం కావాలి.

సొలోమోను వంటి జ్ఞానము కావాలి.

మంచి సమరయుని వంటి ప్రేమ కావాలి.

పౌలును పోలిన ఆత్మల భారం కావాలి.

తిమోతి వంటి యోగ్యమైన పరిచర్య చేయాలి.

కొర్నేలీ వంటి దాతృత్వం నేర్చుకోవాలి.

కుష్టురోగికి గల కృతజ్ఞత కావాలి.

బుద్ధిగల కన్యకల వంటి సిద్ధపాటుతో, రాకడలో ఎత్తబడు ధన్యత కలిగి జీవించాలి.

898. నూతన నిబంధనలో ఆశ్చర్యకరమైన సంగతి. ఆయన స్వస్థపరచినవారిలో ఒక్కరు కూడా ఆయనకు బహుమానమిచ్చిన సంఘటన కనపడదు.

899. సంగీతం నేర్పించే పరికరాలు ఎలా వాయించాలో నేర్చుకోవాలి. ఆ నియమాలు పాటించాలి. ఆ విషయాలు నేర్చుకున్న తరువాత హృదయ స్పందనను బట్టి శ్రావ్యమైన సంగీతం వినిపించగలదు. అదేవిధంగా జీవితంలో అనేక పాఠాలను నేర్చుకొని జీవిత సంబంధాలను మెరుగుపరచుకోవాలి.

900. ప్రతి దినము మనము ఎదుర్కొనే అనుభవాలన్నీ అద్భుతాలే. ప్రతి క్షణము కృపతో నిండినదై యుండును. ప్రతి హృదయం యొక్క శబ్ధము దేవుడందించే ఆశీర్వాదాలు. మనము పీల్చే ఊపిరి ఆయన దానము.

901. మనము ప్రార్థించే శక్తిగల ప్రార్థనల యొక్క విలువను బట్టి దేవుడు మన ప్రార్థనలను వింటాడు. కాని అంతకుమించి దేవుడు చెప్పేది ఏమిటో మనమే వినగల అవకాశం ప్రార్థనలో లభిస్తుంది.

902. జీవితంలో స్వతంత్రంగా చేసే నిర్ణయాలు దేవుని కృపకు పాత్రులుగా చేయవు. ప్రశాంతంగా సాగిపోతున్న జీవితానికి చిక్కులు వస్తాయి. అంతలో గాయము చేసి అపార్థాలుగా మిగిలిపోతాయి.

దేవునికంకితం చేసిన నిర్ణయాలు జీవితంలో ఆయన బలముతో శక్తితో చేయగలనని పౌలువలె చెప్పగల్గాలి. అవి ఆహ్లాద పరుస్తాయి. దేవునిలో నిత్య సాంగత్యము వ్యక్తికి గొప్ప ధైర్యమిచ్చి నడిపించి కాపాడి దీవిస్తుంది.

903. మీరంటే ఇష్టపడే వారిని అవసరాలకు మాత్రమే వాడుకోరాదు. మీ అవసరం కోరిన వారికి బిజిగా ఉన్నానని చెప్పరాదు. మిమ్ములను నమ్మిన వారిని మోసం చేసి బాధించరాదు. మిమ్ములను తలంచుకొని అభిమానించేవారిని కించపరచక మరచిపోకుండా హత్తుకోవాలి

904. మనము కార్చే ప్రతి కన్నీటి బిందువు రాజీపడుతున్నామని గుర్తు. ప్రతి చిరునవ్వు ఒక మధుర బంధానికి గుర్తు. ప్రతి సందేశంలో విలువైన జ్ఞాపకాలు గుర్తుంటాయి. అవినాభావ సంబంధాలు పెరిగి విలువలు దాగి ఉంటాయి.

905. ఈ రోజు కన్నా మరొక మంచిరోజు లభించగలదన్న ఆలోచన విరమించు కోవాలి. ఈ రోజే నీవు కోరుకునే మంచి ఫలితం లభిస్తుందన్న ఆనందంతో జీవించు.

906. నీవు ఎదిగే కొలది ఒదిగి ఉండాలనీ తెలిసికో ఎన్నో అనుభవాలను చూడగలవు. ఎంతో జ్ఞానాన్ని పొందగలవు. ఎన్నో విషయాలు తెలిసికోగలవు. ఎన్నో గొప్ప కార్యాలు సాధించగలవు. ఏదైనా గమ్యం నిర్ణయించుకొని సాగిపోవాలి. విజేతలు కావాలి.

907. **చార్లెస్ స్పర్జన్ :** ప్రార్థనలో గడిపిన ఒక్క రాత్రి చాలు. మనల్ని నూతన పర్చడానికి, ఆత్మ దరిద్రం నుండి ఆధ్యాత్మిక సిరులలోనికి, భయకంపం నుండి అభయానందంలోకి నడిపించుటకు శ్రద్ధగా ప్రార్థించాలి. మితాను భవంతో జీవించాలి.

908. ప్రార్ధనా పరులుగా మితానుభవం వున్నవారు కావాలి. బజారులో కేకలు వేస్తూ, ప్రార్ధనా గదిలో మౌనముద్ర దాల్చిఉండడం దేవ దూషణ. లోక సంబంధమైన వాటికి మన శక్తినంతా వినియోగిస్తాం గాని దేవుని కార్యాలపట్ల అశ్రద్ధగా ఉంటాము.

909. ప్రార్ధన శక్తి వర్ణించ వీలుకాదు. ఒకడు ప్రార్థించడం నేర్చుకుంటే అతడు ఏమైనా చేయగలడు. ప్రార్ధనలో దేవునితో పోరాడగలవానికి భూమ్యాకాశాలు సమీపంగా వుంటాయి.

910. ప్రార్ధనాపరుల చేతులతో ఉయ్యాల ఊపబడ్డాను అంటారు. ప్రార్ధనలకు విజ్ఞాపన వెన్నెముక వంటిది. దేవునికి ప్రార్ధన చేయడం తెలిసినవాడు పరలోకాన్ని, భూలోకాన్ని జయిస్తాడు.

911. **సెయింట్ ఫ్రాన్సిస్ :** ఆయన ఎన్నో రాత్రులు ప్రార్థించారు. బోధించుట కంటే దేవునితో సహవాసము చేయుటకు ఇష్టపడేవారు.

912. ఈ భూమి మీద ఆయన ఏమి చేయాలని కోరుతున్నాడని మనం కను గొంటామో దానిని చేయవలసిందిగా మనము దేవుని ఆహ్వానించడమే విజ్ఞాపన.

913. మన ప్రార్ధనలో శక్తి ఉండాలని మనం ఆశించినట్లైయితే మిగిలిన సమయాలలో మనం నీతి నిజాయితీల ననుసరించి నడవాలి.

914. **చార్లెస్ ఫిన్నీ :** ప్రపంచమంతయు నా హృదయంపై వున్నందున నా ఆత్మ భారముతో నలిగిపోతూవుంది. ప్రపంచ రక్షణకై ప్రార్థించకుండా నేనేట్లా వుండగలను?

915. లోకమంతా ఎదురు తిరిగినా, పిశాచాలన్నీ చుట్టుముట్టినా నేను మోకాళ్ళపై నుండి లేవను. ఫిన్నీ గొప్ప ప్రార్థనాపరుడు. పరిశుద్ధాత్మతో నింపబడినవాడు.

916. **అగస్టీన్ :** మాటల ప్రార్థన కంటే మూల్గుల ప్రార్థన ఎక్కువగా పనిచేయును. ప్రార్థనపైకి వెళ్ళును. కృప క్రిందికి వచ్చును.

917. నా తల్లి కన్నీటి ప్రార్థన ప్రవాహముతో నేను దేవుని రాజ్యములోనికి కొట్టుకొని వచ్చితిని అని సాక్ష్యమిచ్చారు.

918. **జాన్ పిచ్చర్ :** ఒకని ప్రార్థనాభ్యాసం అతనికి సన్నిహితంగా ఉన్నవారి మీద తన ప్రభావం చూపుతుంది.

919. ప్రార్థనా గదిలోని గోడలన్నియు ప్రార్థలనెడి శ్వాసచే అద్దబడెను. కొన్ని పర్యాయములు రాత్రంతా ప్రార్థించెను.

920. **మార్టిన్ లూథర్ :** బాగుగా ప్రార్థించ గలిగినవాడే బాగుగా చదువుకున్నవాడు. దినమునకు 3 గంటలు ప్రార్థించితినేగాని ప్రార్థన నుండి లేవగలిగెడి వాడనుకాను. ఆత్మపూర్ణమైన జీవితానికి రహస్యం పసిబిడ్డలాంటి అమాయకత్వం.

921. **డేవిడ్ బ్రెనార్డ్ :** ఈయన అపారమైన ప్రార్థనా ఫలితం రెడ్ ఇండియన్ల మార్పు. రేయింపగలు ప్రసంగమునకు ముందు వెనుక గంట గంటకు దినదినము ప్రార్థించెడివాడు. ఆడవిలోను ఉదయమున వేకువ జామున మరియు చాలా రాత్రి వరకు గడ్డి పరుపుపైన ప్రార్థించుచు ఉపవాసముండేడి వారు. ఆత్మల రక్షణకై వేదనతో ప్రార్థించగా దేహమంతా తడిచి పోయెను. నాదృష్టి అంతా దేవుని మీదనే వుంది అదే నా ప్రార్థనా జీవితం. నా చిన్న ఇంటిలో ఒంటరిగా ప్రార్థనలో గడుపుటయే నా కిష్టము. ఎంతటి పవిత్రత గలవాడంటే 6 నుండి 7 గంటలపాటు మంచులో పడి ప్రార్థించేవారు.

922. **డిక్.ఈస్ మన్ :** ఏ హృదయాల్లో ప్రార్థన ఉంటుందో అక్కడే ఉజ్జీవ జ్వాలలు ఉంటాయి. సాతానును ఓడించడానికి బలమైన సాధనం ప్రార్థన ఒక్కటే.

923. ప్రార్థించేవాడు పరిశుద్ధతను కూడ కలిగిఉండాలి. ప్రార్థన, పరిశుద్దత కవల పిల్లలు. ప్రార్థనా వీరులు విరిగి విలపించే హృదయాలు కలిగి ఉండాలి. సాతానుకు ఇది గట్టి దెబ్బ.

924. **జాన్ వెస్లీ :** పట్టు విడువక ప్రార్ధనా బలాన్ని పొందుము. విశ్వాస ప్రార్ధనలలో పట్టు విడిచే హస్తములను బలపరచండి. వణికే కాళ్ళను నిలబెట్టండి. ఉపవాస ప్రార్ధనలతో కృపా సింహాసనాన్ని ముట్టడించండి. నాకు ప్రార్ధనా కుటుంబం అంటే చాలా ఇష్టం.

925. **ఇ.యం.బౌండ్స్ :** వ్యక్తిగతముగా ఎక్కువసేపు ప్రార్థించుకునేవారు బహిరంగముగా క్లుప్త ప్రార్ధనలు చేస్తారు. ప్రార్ధనాశక్తి మాత్రమే మనుష్యులను పరిశుద్ధులుగా మార్చగలదు.

926. ప్రార్థించే సంఘాలు ప్రార్థించే వ్యక్తులను కంటాయి. విశ్వాసి మోకరించినపుడు అతనిని ఎవరు జయించలేరు. ప్రార్ధనలేని సంఘము శక్తిలేని సంఘమవుతుంది.

927. **జాన్ బన్యన్ :** ప్రార్ధన–పాపం ఎప్పుడు పోటీపడుతూనే ఉంటాయి. పోటీలో ప్రార్ధనకే విజయం దొరుకుతుంది. ప్రార్థన పాపం చేయకుండా ఆపుతుంది. ఆ విధంగానే పాపం ప్రార్థన చేయకుండా ఆపుతుంది. గొప్పపేరు పొందిన యాత్రికుని ప్రయాణం అను పుస్తకమును జైలులో వ్రాశారు. శ్రేష్టమైన ప్రార్థనలో మూల్గులేగాని, మాటలుండవు.

928. **విలియం కేరి :** బైబిలును, ప్రపంచ పటమును ఎదురుగా పెట్టుకొని ప్రార్థించేవారు. ఈనాడు మన చేతుల్లో వున్న తెలుగు బైబిల్ అయన కృషి ఫలితమే.

929. **అదోనీరామ్ జడ్సన్ :** ఈయన రోజుకు 7 సార్లు ప్రార్థించగలిగే క్రమశిక్షణ అలవర్చుచుకున్నారు.

930. **నేటి కొందరు వ్యక్తుల ఆత్మీయ స్థితి**

1. బీరువాలో డబ్బులపై ఉన్న శ్రద్ధ హృదయంలో దేవునిపై ఉండదు.
2. వార్తా పత్రికల పట్ల ఉన్న శ్రద్ధ వాక్యంపై ఉండదు.
3. ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ ఆత్మీయతపై ఉండదు.
4. ఆహారంపై ఉన్న శ్రద్ధ ఆత్మీయతపై ఉండదు.
5. ప్రసంగంపై ఉన్న శ్రద్ధ ప్రార్ధనపై ఉండదు.
6. పాటలపై ఉన్న శ్రద్ధ పరిచర్య మీద ఉండదు.
7. పబ్లిసిటీపై ఉన్న శ్రద్ధ ప్రవర్తనపై ఉండదు.

8. ఘనత కొరకు ఉన్న శ్రద్ధ సమర్పణపై ఉండదు.

9. సంపాదన మీద ఉన్న శ్రద్ధ సమర్పణపై ఉండదు.

10. గతంలో దైవ సేవకులు ఆత్మీయంగా గొప్పవారైననూ ఆర్థికంగా పేదవారుగా క్రీస్తును సేవించేవారు. క్రీస్తును ఆశ్రయించి సిద్ధపడితే పరలోకంలో మెప్పు ఉంటుంది లేదా జీవితంలో ముప్పు తప్పదు.

931. ప్రార్థన లేకుండా ప్రభువు కొరకు జీవించలేము.
పవిత్రత లేకుండా పరిచర్య చేయలేము.
ఆతిథ్యము ఇవ్వకుండా ప్రతిఫలం పొందలేము.
నిరీక్షణ లేకుండా సంతోషించలేము.
దేవుని పిలుపు లేకుండా సేవ చేయలేము.
విశ్వాసం లేకుండా దేవుని నుండి ఏమి పొందలేము.
యేసు లేకుండా పరలోకం చేరలేము.
ఆత్మఫలాలు లేకుండా క్రీస్తువలె జీవించలేము.
విధేయత లేకుండా దుష్టుని ఎదురించలేము.
ప్రేమ లేకుండా ఆత్మలను సంపాదించలేము.

932. నూతన సంవత్సరంలో ప్రవేశించడానికి 7 తలుపులు కలవు.
పెద్ద ఇంటిని చిన్న తాళము తీయగలిగినట్లే మంచి మాటల ద్వారా గడ్డు పరిస్థితులను, సమస్యలను ఎదురించాలి.

1) విశ్వాసపు తలుపు
2) ప్రార్థనా తలుపు
3) సహవాసపు తలుపు
4) రక్షణ తలుపు
5) పరిచర్య తలుపు
6) దీవెన తలుపు
7) రాకడ తలుపు

933. **క్రీస్తు వంశావళిలో ఉన్న స్త్రీలు ధన్యులు**

**తామారు** అనగా ఖర్జూరము, **రాహాబు** అనగా విశాలత
**రూతు** అనగా ఆత్మ సౌందర్యం, **బెత్సెబా** అనగా వాగ్దాన పుత్రిక
**మరియ** అనగా దయా ప్రాప్తురాలు

934. అందరినీ కలుపుకుంటూ బ్రతకాలి నీవు సంతోషంగా ఉన్నావంటే నీకు సమస్య లేదని కాదు వాటిని ఎదుర్కొన గల శక్తి ధైర్యం నీకున్నాయని అర్థం. స్నేహితుడిని దుఃఖ సమయంలోను, యోధుడిని యుద్ధములోను, భార్యను పేదరికంలోను, గొప్ప వ్యక్తిని వినయంలోను గుర్తించగలం. ఓటమి లేనివానికి అనుభవ జ్ఞానం రాదు. గెలుపు ఓటమిల పాఠాన్ని స్వీకరించాలి. ఎవరికైనా ఉండేది దేవుడందించే కాలము 24 గంటలు మాత్రమే. గెలిచేవాడు 24 గంటలు కష్టపడుతూనే ఉంటాడు. ఓడేవాడు ఎలా కష్టపడాలి అని ఆలోచిస్తూ ఉంటాడు. ప్రయత్నించుటలో గెలుపుంది. స్వయం కృషితో పైకొచ్చిన వారికి ఆత్మ విశ్వాసం ఉంటుంది గాని అహంకారము ఉండదు. వివేకముతో జీవించాలి.

935. నూతన సంవత్సరం అగమ్య గోచరంగా కనిపించవచ్చు కాని దేవుడు నడిపించగలడు, క్రొత్త అవకాశాలను వెదకాలి, క్రొత్త అవకాశాలు ధైర్యంగా ఢీకొనాలి, క్రొత్తగా ధనం దానం చేస్తూ ప్రేమను కనబర్చాలి. జీవితానుభవాలు తీపి చేదు కలిసే ఉంటాయి. పర్వాతానుభవాలు సంతోషాలు విజయాలతో పాటు లోయానుభవాలు కష్టనష్టాలు తప్పవు. ఉప్పొంగే ఉత్సాహంతో క్రొత్త దినానికి స్వాగతం చెప్పాలి.

936. ఈ జీవిత గమనంలో నష్టంలేని వ్యాపారం లేదు. ఒత్తిడిలేని ఉద్యోగం లేదు. కష్టం లేని వ్యవసాయం లేదు, బాధలు లేని సంసారం లేదు సమస్యలు లేని లేని వ్యక్తులు ఉండరు. వీటిని జయించగలుగుటకు దేవుని తోడు కావాలి. దేవునికి అసాధ్యమైనదా కలదా? సమస్తము దేవునికి సాధ్యం.

937. మారుమనస్సు అనుభవం సాక్షిగా జీవించు తరుణం ప్రతి వ్యక్తికి కావాలి. దేవుని నడిపింపు సహయంతో ప్రపంచాన్ని మార్చగలం. చదువు లేకపోయినా సంస్కారం ఉండాలి. దైవభక్తి ద్వారా మంచి ప్రవర్తన అలవడుతుంది.

938. **క్రైస్తవ జీవితంలో తగ్గింపు కావాలి**

1) అబ్రహాము మాటలలో "ధూళివంటివాడను" **ఆది 18:27**

2) దావీదు రాజు మాటలలో "నేను పురుగును" **కీర్తనలు 22:6**

3) పౌలు మాటలలో "పాపులలో ప్రధాన పాపిని" **ఎఫెస్సీ. 3:8**

4) బాప్తీస్మమిచ్చు యోహాను "క్రీస్తు చెప్పుల వారు విప్పుటకు యోగ్యుడను కాదు. అన్నాడు" **యోహాను 1:27**

5) శతాధిపతి స్వస్థత కొరకు వచ్చినపుడు "క్రీస్తు నా ఇంటికి వచ్చుటకు యోగ్యుడను కాదు" **లూకా 7:6**

6) సుంకరి ప్రార్థనలో "పాపినైన నన్ను కరుణించుము" **లూకా 18:13**

7) యోనాతాను కుమారుడైన మెఫీబోషెతు దావీదునొద్దకు వచ్చి "నేను చచ్చిన కుక్క వంటివాడను" **2సమూ 9:8**

939. సృష్టి మనకు ఎన్నో జీవిత సత్యాలు బోధిస్తూనే ఉంటుంది. కీర్తనలు 19లో ఆకాశములు దేవుని మహిమ వివరించుచున్నది. అని దావీదు మహారాజు తెల్పాడు. వ్యక్తులకు ధనం యిచ్చే ధైర్యము కంటె మనిషి యిచ్చే నమ్మకం గొప్పది.

940. పలు భయాలు ఆవరించిన వేళలో దేవుని అభయ వాక్కులను నమ్మాలి. నిన్ను విడువను. నిన్ను ఎడబాయను అన్న వాగ్దానాలు అభయమిస్తాయి. వెలుగే లేదని చీకటిలో నిలిచిపోగలమా? నేనే వెలుగును అని ధైర్యం చెప్పిన క్రీస్తును ఆశ్రయించాలి. చిరునవ్వు రాదని బాధలలో సర్దుకొని పోగలమా? ప్రతి పనిలో కష్టం ఎదురవుతుంది గనుక భయపడరాదు.

941. జీవితంలో బాధలు కష్టాలు తప్పవు గనుక నా ప్రాణమా నాలో నీవు ఎందుకు కృంగియున్నావు? యెహోవా యందు ఇంకను నిరీక్షణ ఉంచాలని దావీదు నిరాశలో ధైర్యం తెచ్చుకోలేదా? కష్టాలు ఎదురైనపుడు వైరుధ్యాలు ఎదురయినపుడు వాటి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించకు. దేవుని సహాయం కొరకు వేచి చూడాలి.

942. దేవుని యందలి భయ భక్తుల ద్వారా జ్ఞానము, వివేకము, ఆనందము లభిస్తాయి. జ్ఞాన సమూపార్జన, వివేకము ఒక నిధిని పొందినంత సఫలత లభిస్తుంది. అభ్యాసం ద్వారా వాటిని సాధించగలము.

943. **డేవిడ్ లివింగ్స్టన్ :** తెల్లవారుజామున 4 గంటలకు నిద్రలేచి తనమంచం ప్రక్కన మోకరించి ప్రార్థించేవారు.

944. **అంద్రుముర్రే:** ప్రపంచంలో ప్రతి అక్కర తీరాలంటే ప్రార్థన చేయాలి. కోటాను కోట్ల ప్రజానీకానికి రక్షణ కలగాలంటే ప్రార్థన విజ్ఞాపననే ఏకైక నిరీక్షణా మార్గం.

945. **స్మిత్ విగ్గిల్స్ వర్త్ :** ప్రార్థించకుండా నేను ఉండలేను, ప్రార్థనే నా జీవితం, ప్రార్థనే నా ఊపిరి అన్నారు.

946. **చార్లెస్ టి.స్టడ్:** నేనే తెల్లవారు జామున 3:30 గంటలకు నిద్రలేచి వాక్యధ్యానమందును, ప్రార్థనయందును గడుపుదును.

947. **భక్తసింగ్ :** అయన గంటల తరబడి మోకాళ్లపై ప్రార్థించేవారు. రాత్రులు, నిద్రపోక ప్రార్థించిన సంఘటనలు ఎన్నో. ప్రతి అక్కర తీర్చేది. మోకాళ్ల ప్రార్థనా జీవితం.

948. **వాచ్ మెన్ ని :** ప్రార్థనలో దేవుని సహాయం కొరకు వేడుకునే వారు. సమస్యను పట్టుదలతో కూడిన ప్రార్థనలో దేవుని హస్తాలకు అప్పజెప్పేవారు విజయాన్ని పొందుతారు.

949. **టి. వాల్కర్:** ఎక్కువ సేవచేసి తక్కువ ప్రార్థంచుట కంటే. తక్కువ సేవచేసి ఎక్కువ ప్రార్థంచుటయే మంచిది. ఎందుకంటే ప్రార్థన లేని సేవలో ఫలితముండదు.

950. **ఫిలసిపర్ :** ఆకాశం శాస్రవేత్తలకు ఎత్తైన భవనం యొక్క చివరి అంతస్తుగ అనుకోవచ్చు, ప్రార్థనాపరునికది పందిరిలాంటిది.

951. **యస్. వాయిస్ :** మన ప్రార్థన సాతాను పాలిట మారణాయుధం.

952. **ఎస్.డి.గోర్డెన్ :** నిజమైన జ్ఞానయుక్తమైన ప్రార్థన, సాతానును వాని బృందాన్ని కూకటి వేళ్ళతో కూల్చివేస్తుంది.

953. **ఫిలిప్స్ హెన్రి :** ఒంటిగా ప్రార్థించు, రేయింపవళ్లు ప్రార్థించు పాపంతో పోరాడటానికి తగిన సాధనం మోకాళ్లమీదే లభిస్తుంది.

954. **జోసఫ్ పార్కర్ :** ప్రార్థించే హృదయం లేనివాని మేధస్సు, జ్ఞానం , నైపుణ్యం ఎందుకు పనికిరావు. సంఘము చేసే ప్రార్థనను బట్టి దానిని గుర్తించాలి.

955. **మాథ్యూహెన్రి :** ప్రార్థన ఉదయకాలపు తాళపు చెవిగాను, సాయంకాలపు గడియగాను ఉండనిమ్ము.

956. **గ్రెగరీ :** నేను దినమునకు 2 గంటలైనా ప్రార్థించకపోతే ఆ దినమున సైతానుదే విజయం.

957. **శామ్యూల్ రతన్ పోర్టు :** సైతాను మన విశ్వాసమునకు, ప్రార్థనకు, సహనానికి సానపట్టే రాయివంటిది.

958. ప్రార్థన కూటములో మౌనముగా నుండుట ప్రార్థనలేని జీవితమునకు సూచన.

959. ప్రార్థనా కూటములో నీవు నోరు తెరువక మునుపే వేరొకరు ప్రార్థన చేయుచున్నారని ఆలోచిస్తూ చివరి వరకు ప్రార్థించలేక పోవుట నీ బలహీనత. ప్రార్థన ప్రాముఖ్యత శత్రువులకు తెలుసు గనుక. "ప్రార్థన లేమి" అనే వ్యాధితో సంఘములోని 99.9% విశ్వాసులను సైతం మొత్తుతుంటాడు.

960. ప్రార్థించునప్పుడు నిద్రమత్తువచ్చుటను బట్టి ప్రార్థనలేమి యొక్క గురుతు కనబడుచున్నది. ప్రార్థనలో ఏకాగ్రత లేకపోవుట ప్రార్థనలేని జీవితము యొక్క స్వభావము.

969. "ప్రార్థన లేని జీవితము" అవిశ్వాసపు హృదయము అనునవి ఒకదాని చేయి ఒకటి పట్టుకొని నడుచును.

970. "ప్రార్థనలేమి" "పాపము" భాగస్వాములు.

లోకమును "ప్రార్థనలేమి"ని రెండిటిని వేరుపరచలేము.

"ప్రార్థనాలేమి" భయంకరమైన పాపము.

"ప్రార్థనాలేమి"ని దేవుడు (యేసు) అంతం చేసెను. నీవు కూడా "ప్రార్థనాలేమి" ని అంతం చెయ్యి.

971. **సి.హెచ్.స్పర్జన్ :** "దేవుని సంఘము రక్తములో బాప్తిస్మము పొందిన సందర్భములో తప్ప, మరి ఏనాడు నిజముగా ఆత్మలో ఎదిగి అభివృది చెందలేదు. దేవుని సంఘమనే ఓడ పై భాగమున హత సాక్ష్యాలుంటారు.

972. **జాన్ కాల్విన్ :** "ఓ దేవా నీవు నన్ను కొట్టితివి, కానీ నాకు విస్తారమైన తృప్తి కలిగింది. ఎందుకంటే ఆ శిక్ష నీ చేతి నుండి వచ్చింది."

973. **టి.ఆస్టిన్ స్పార్క్స్ :** "క్రీస్తును గూర్చి నీవు తెలిసికొనిన దానికి విధేయత చూపితేనే తప్ప ఆయనను గూర్చి యింకను తెలుసుకొనలేవు".

974. **జాన్ వెస్లీ :** "కష్టపడి ఆత్మల రక్షణకై ప్రయాసపడినపుడే మనుషుల యొక్క రక్తాపరాధము నుండి విడుదల పొందుదము."

975. **బిల్లీ గ్రాహం :** "పాపములను ఒప్పింప జేయడం పరిశుద్ధాత్ముని బాధ్యత, న్యాయపు తీర్పు తీర్చుడం దేవుని బాధ్యత. నాకివ్వబడిన బాధ్యత ప్రేమించడమే."

976. **డేవిడ్ బ్రేనార్డ్ :** "దేవుని మహిమ పరచుటయే నాకు పరలోకము, అటువంటి పరలోకాన్ని నేను కోరుకుంటున్నాను. అదే నా భక్తి అదే నాకు సంతోషము.

977. **జాన్ మాక్స్ వెల్ :** "ఒక మనిషి తన తప్పులను ఒప్పుకునేంత ఉన్నతముగాను, వాటి నుండి లబ్ధిపొందేంత వివేకముగాను, వాటిని సరిదిద్దుకునేంత బలముగాను ఉండాలి."

978. **చార్లెస్ అలెన్ :** ప్రార్థనలో మనకు నమ్మకం వుంది. అయినా మన ప్రార్థచుటలేదెందుకు?

979. **లియేనార్డ్ రేవన్ హిల్ :** పరిశుద్ధతను కలిగియుండుటయే సాధారణ క్రైస్తవ జీవితము. దాని కంటే తక్కువైనదంతా అనారోగ్యమే.

980. **జార్జి హెర్బర్ట్ :** నిరీక్షణతో జీవించేవాడు సంగీతం లేకుండానే నాట్య మాడుతాడు.

981. **రాయ్.విల్స్మిత్ :** క్రీస్తును తన హృదయములో కలిగి యుండనివాడు సంతోషాన్ని, పరలోకాన్ని ఎన్నటికీ ఎక్కడ కనుగొనలేడు.

982. **సర్ థామస్ బ్రౌన్ :** ఈ లోకం బ్రతకడానికి పనికొచ్చే భోజనశాల కాదుగాని, చావడానికి పనికొచ్చే ఆసుపత్రి లాంటిది.

983. **థామస్ వాట్సన్:** ఒకడు తనదృష్టికి తాను తగ్గిపోవడమే సరైన ఎదుగుదల.

984. **డేవిడ్ బ్రేనార్డ్ :** క్రీస్తు విడిచిపెట్టిన పనిని ముగించుటయే ఒక వ్యక్తి ఈ లోకములో చేయవల్సిన వెలివైన పని.

985. **మార్టిన్ లూథర్ :** "క్రీస్తుతో కూడిన చెరసాల సింహాసనము వంటిది. కానీ, క్రీస్తు లేని సింహాసనము నరకము వంటిదే."

986. **ఒక మిషినరీ :** గెత్సేమనే తోట నుండి తీసి నాటబడకుండా పరలోకములో ఏ పువ్వు పుష్పించదు.

987. **హడ్సన్ టేలర్ :** దేవుడు తన మీద ఆనుకొనే బలహీనులను, దీనులను వాడుకుంటాడు.

988. **ఎన్.దానియేలు :** పాపము నుండి తప్పించుకొనుటకు జాగ్రత్త పడువారు లోకమునకు దీవెనగా నుందురు.

989. **కోరి టెన్ భూమ్:** మన అనుదిన జీవిత సమస్యలే యేసు ప్రభువు చేసే అద్భుతాలకు ముడి సరకు.

990. **ఒక మిషినరీ :** ఒక క్రైస్తవునికి శ్రమల ద్వారా ఎల్లపుడు గొప్ప ఆనందము కలుగును.

991. **స్పర్జన్ :** శ్రేష్టమైన ప్రభువు సైనికులందరు శ్రమలనే అనుభవముల నుండి వచ్చినవారే.

992. **ఎన్.దానియేలు :** మనం దేవుని చిత్తము నుండి తొలిగిపోతే దాని దుష్ఫలితాలు అనుభవించాల్సిందే.

993. **ఒక మిషినరీ :** నీవు మాట్లాడితే దేవుడు నీ తరుపున మాట్లాడతాడు. నీవు పోరాడితే దేవుడు నీ తరపున పోరాడుతాడు.

994. **బెంజిమిన్ ఫ్రాంక్లిన్ :** మంచి మనస్సాక్షి గలవానికి నిత్యము క్రిస్మస్ పండుగే.
**ఎన్. దానియేలు :** "సంపూర్ణముగా క్రీస్తుకు లోబరిచిన జీవితమే సంపూర్ణముగా క్రీస్తుచే నడిపించబడే జీవితము".

995. **అలెగ్జాండర్ మెన్ లారెన్ :** కల్వరి చెట్టు యొక్క ఫలములను రుచి చూడనివాడు జీవ వృక్షఫలములను రుచి చూడలేడు.

996. **అలెగ్జాండర్ పోప్ :** తొట్రిల్లడం మానవ నైజం క్షమించడం దేవుని నైజం.
**సి.టి స్టడ్ :** క్రీస్తుకు కావాల్సింది అందేవాటిని పొందేవారు కాదుగాని అందనివాటిని సాధించేవారే.

997. **హడ్సన్ టేలర్ :** వెయ్యి జీవితాలు నాకుంటే వాటన్నిటిని చైనా కొరకే సమర్పిస్తాను.
**డేనియల్ :** "దేవుడు నియమించిన స్థానములో నిలిచి యుండుటను మించిన గొప్ప కార్యసాధన మరియొకటి లేదు.

998. **తోజర్ :** దెయ్యానికి మనందరికంటే వేదాంతం బాగా తెలుసు కానీ అదింకా దెయ్యమే కదా!
**దానియేలు :** సిలువలేకుండా సింహాసనం లేదు.

999. **వాచ్ మాన్ ని :** "నా కోసం నేనేమి కోరను. నా ప్రభువు కోసం నేనంతా కోరుదును."

1000. **సి.హెచ్. స్పర్జన్ :** "దీపములు మాట్లాడవు కానీ ప్రకాశిస్తాయి. ఒక లైట్ హౌస్ భీకర శబ్ధము చేయదు  కానీ సుదూర జలముల మీద నున్న దాని మిణుకులు నావికుని మార్గానికి దారి చూపించగలదు."

**సి.హెచ్ . స్పర్జన్ :** "భూమి మీద శ్రమలు పడనివారెవ్వరు పరలోకంలో కిరీటదారులుగా కనబడరు."

**డి.యల్.మూడీ :** "బైబిలు గ్రంధమును క్రమముగా పూర్తిగా చదువు. ధ్యానించు. కొంత ఇక్కడ, కొంత అక్కడ కాదు. విరిగిన కత్తితో ఎవరు యుద్ధము చేయలేరు కదా!

1001. జీవితంలో ఎన్నో అనుభవాలను ఎదుర్కొంటూ ఉంటాము. వాటిలో సంతోషము కలిగినపుడు పొంగిపోవుడం, దుఃఖం ఎదురైతే కృంగిపోవడం, కన్నీళ్ళకు కరిగిపోవడం, భయానికి చెదిరిపోవడం తప్పని అనుభవాలే. అయితే, మన బంధాలు మరువరాదు, అందరినీ గ్రుడ్డిగా నమ్మరాదు, ఎవరికీ లొంగిపోరాదు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిపోవాలి. దేవునికి ప్రాధాన్యత నిచ్చుట మరువరాదు.

1002. ఈ ప్రపంచంలో బ్రతకాలంటే యుక్తి కావాలంటారు. మాటల గారడీ తెలిసుకోవాలంటారు. నటనలో ప్రావీణ్యత కావాలంటారు. అయితే బైబిలులో చెప్పినట్లు పాముల వలె వివేకంగాను, పావురాల వలె నిష్కల్మషంగా జీవిస్తూ నీతి, నిజాయితీ యథార్థత అనే పునాదితో జీవిస్తే మనలను మాదిరిగా పునాదిగా ఎంచుకొని స్వకీయులు, సమాజము అత్యున్నత స్థాయికి ఎదుగుతారు.

1003. అద్దం అబద్ధం చెప్పదు. నీడ మనల్ని వదలిపోదు. మన బంధాలు కూడా అంత పవిత్రంగా ఉండాలి.

1004. మీ సత్ప్రవర్తన అనే సుగంధాన్ని అన్ని దిక్కులా వెదజల్లాలి అని బైబిలు బోధిస్తుంది. ఆ ప్రవర్తన అనగా మనల్ని ఎవరూ చూడటంలేదు అని అనుకొనే సమయంలో మనం నడుచుకొనే తీరునే ప్రవర్తన అంటారు.

1005. కోపపడుడి గాని పాపం చేయరాదని బైబిలు బోధిస్తుంది. కోపగించుకొనే హక్కు ఎవరికైనా ఉండవచ్చు. అయితే కోపంలో క్రూరంగా ప్రవర్తించే తీరు ఉండరాదు. పగగా మారే రీతిగా కోపం పెంచుకోరాదు. సూర్యుడు అస్తమించే లోపే మనలో కోపం సమసిపోయేలా జాగ్రత్త వహించాలి.

1006. జీవితంలో మొత్తము అనుకోని సంఘటనలే సంభవిస్తు ఉంటాయి. కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి కావచ్చు. అందుకే ప్రతిదానిలో దేవుని పాత్రను మరిచిపోక విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించు క్రీస్తును చూస్తూ ఓపికగా సాగిపోవాలి.

1007. మనిషికన్నా మనసు మిన్న, ఆవేశము కన్నా ఆలోచన మిన్న, ప్రాణంకన్నా త్యాగము మిన్న. కానీ అన్నిటికన్నా ఎల్లకాలము ఉండే స్నేహం మిన్న. దానికి మించి క్రీస్తులో నిత్యజీవముకై తపన కలిగి మిన్నగా ఉండాలి.

1008. మిత్రులు తోడుంటే ఓటమి కూడా ఓదార్పునిస్తుంది. ఎవరూ లేకుంటే విజయము కూడా వెక్కిరిస్తుంది. నీవెన్నడూ ఒంటరి కావు. సదాకాలము దేవుడు నీ తోడుంటాడు. నిన్ను విడువడు, ఎడబాయడు దేవుని వాగ్దానములు నమ్మాలి.

1009. ఈ లోకంలో మనం కార్చే కన్నీటిని ఎవరూ గమనించలేకపోవచ్చు, మన బాధల్ని గుర్తించకపోవచ్చు. మన కష్టాలలో ఆదుకొని తీర్చకపోవచ్చు. చాలామంది మన తప్పుల్ని వెదికే పనిలో ఉంటారు. అయితేనేమి తప్పులను క్షమించి ఆదుకుని, ప్రేమించే క్రీస్తు మనకున్నాడు.

1010. మనము ప్రగతి సాధించిన వేళల్లో చప్పట్లు కొట్టేవారుండవచ్చు. ఏమీలేని వేళలో మనతో సన్నిహితంగా మెలిగే మన నిజమైన స్నేహితులే ప్రేమించే బంధువులు.

1011. మన జీవిత యాత్రలో యవ్వన కాలంలో మనతో ఉండేవి సమయము, శక్తి, ఆరోగ్యమే. మధ్య వయస్సులో సంపాదించిన డబ్బు, సమర్థత, శక్తి ఉన్నను సమయము చాలదు. చివరకు వృద్ధాప్యములో సమయము, డబ్బు రెండూ ఉంటాయి కానీ శరీరంలో ఆరోగ్యము ఉండదు. సమయమున్నప్పుడే సద్వినియోగం చేసుకుంటూ అన్ని సమయాల్లో స్తుతిస్తూ దైవ ధ్యానంలో ఉండాలి.

1012. ఇతరుల నుండి ఆశించడము ఆపితే నిజమైన ఆనందము మిగులుతుంది. శాసించడం, పెత్తనం చేయడం మానుకొంటే అనేకులు మిత్రులు కాగలరు. అప్పుడే నిజమైన ఆనందం మనలో నిలిచిపోతుంది.

1013. జీవితంలో ఎన్నో బంధాలు ఎదురవుతాయి. కష్టాలలో, బాధలలో, సమస్యలలో తోడుండి ఊరటనిస్తూ ప్రోత్సహించేవారు కొందరే ఉంటారు. గమనిస్తే క్రీస్తును ప్రేమించే విశ్వాస్యతేనని తెలుస్తుంది. క్రీస్తు ప్రేమలో అట్టివారిని, దేవున్ని ఆనుకొని సాగిపోవాలి.

1014. ఒక అస్తిపంజరము కనిపించగా ఒక వ్యక్తి ప్రశ్నించాడట. అమ్మా, అయ్యా ఏది నీ అందము? ఎక్కడ నీ బలము? ఎక్కడ నీ ఆస్తి? ఎక్కడ నీ అంతస్తులు? ఎక్కడ నీ కులము? ఎక్కడ నీ మతము? ఎక్కడ నీ అహం? ఏది నీ గురి? ఏది నీ గమ్యము? దేనికోసం ప్రయాసపడ్డావు? నేడు నీ స్థితి ఎట్లుందని గ్రహించావా? ఇది జీవించుచున్న మన అందరకూ ప్రశ్నలుగా గ్రహిద్దాం.

1015. మన బైబిలులో గలతీ.5:22 చెప్పిన ఆత్మ ఫలాలలో మంచితనము అనేది ఒకటి. సహజంగా మంచితనమునకు విలువ ఎంత ఉన్నా, మన మంచితనమే మనలను కాపాడుతుంది అనేది నిత్యసత్యము. విలువ అనేది ఇచ్చి పుచ్చుకొనేది. మనం ఏదైనా ఇవ్వగలిగినప్పుడే దానిని తిరిగి పొందుకోడానికి అర్హులము అవుతాము.

1016. నిన్నంతా గతము, నేడంతా సుఖము. ఇక రేపటికెందుకు భయము? నీదే జయమని నమ్మాలి. సాగించుము దేవునితో అలుపే లేని పయనం. ఇది విశ్వాసికి ఉండవలసిన లక్షణం.

1017. ◈ నీతులు నీడనివ్వవు. ◈ సామెతలు సంపదలనివ్వవు.
◈ ఆణిముత్యాలు ఆకలి తీర్చవు. ◈ సుభాషితాలు సుఖాలివ్వవు.
◈ కొటేషన్లు కోర్కెలు తీర్చవు. ◈ శ్లోకాలు స్తోమతలను ఇవ్వవు.
◈ ప్రవచనాలు ప్రపంచాన్ని మార్చవు. ◈ తత్వాలు తలరాతలు మార్చవు.
కాని వాటిలోని సత్యాలను గ్రహించి క్రీస్తును పోలి జీవించటం అలవర్చుకోవాలి.

1018. ఆకలిగా ఉన్నవారికి ఆకలి తీర్చుట, ఆపదలోనున్నవారికి ఊరటనిస్తూ కొంత సహాయం చేయుట, కష్టాలు, సమస్యలు, బాధల్లో ఉన్నవారికి ఓదార్పును అందించుట మానవత్వం. సరియైన మానవత్వం పొందాలంటే దేవుని పట్ల భయభక్తులు కలిగియుండాలి. ఇట్టి జ్ఞానావగాహన, తెలివి దేవుడే అందించగలడు.

1019. ఉద్యోగం, డబ్బు, పని పాట, కుటుంబ జీవితం, బంధాలు అనుబంధాలు, మానవ సంబంధాలు ఇవన్నీ మనిషికి ఎప్పుడో ఒకప్పుడు ఆందోళన కలిగిస్తాయి. ఎప్పుడూ దేవునితో సంబంధాన్ని కలిగిఉంటే ఆందోళన దూరం అవుతుంది.

1020. బైబిల్లోని ఆమోసు గ్రంథం 6వ అధ్యాయంలో... నిర్విచారము, నిశ్చింత, గర్వము, స్వాతిశయము, అన్యాయము, దుర్మార్గము వీటిని మన ప్రభువు సహించలేరు. ఇది జాగ్రత్తగా తెలుసుకొని జీవించాలి.

1021. మన స్వరాలు దయతో నిండి ఉండాలి. మన చెవులు, మన చేతులు సదా దాతృత్వ భావంతో సేవ చేయాలి. మన మనస్సు సత్క్రియలతో నిండిపోవాలి. చివరగా మన హృదయము నిండా నిర్మలమైన ప్రేమ ఉప్పొంగాలి. ఆ ప్రేమ ప్రవాహంగా అందరినీ తాకాలి.

1022. ప్రార్థన మన బలము కావాలి. ప్రార్థన మన ఆయుధం కావాలి. సాతాను శక్తులను ఎదురించటానికి సర్వాంగ కవచం ధరించాలి. ప్రార్థన మన ఊపిరై యుండాలి. ఊపిరున్నంత వరకు సువార్త బోధిస్తూ, ఊపిరి ఆగాక మనం దేవుని సన్నిధానంలో ఉండాలి.

1023. దేవా, నా సమస్యలను అధిగమించే శక్తిని నాకు అనుగ్రహించు. వాటిని తొలగించు అని ప్రార్థించకూడదు.

1024. ◈ శ్రమ శరీరానికి మంచిది. ◈ ప్రేమ మనస్సుకు మంచిది.
◈ నవ్వు నలుగురికి మంచిది. ◈ దేవునితో నిత్యత్వం అందరికీ మంచిది.

1025. నిజం నిష్టూరంగా ఉండవచ్చు. కాని కటువుగా మాట్లాడువారు ఎప్పుడు మనల్ని మోసం చేయరు. తీయగా మాట్లాడుతూ అసూయన పెంచుకొనే వారుంటారు. వారు పెదవులతో ప్రేమిస్తారు. నొసటితో ఎక్కిరిస్తారు. మనం జాగ్రత్తపడాలి.

1026. బైబిలు గ్రంథములో క్రీస్తు చెప్పిన విలువైనమాటల్లో మీరు లోకానికి ఉప్పుగా ఉండాలి మరియు వెలుగుగా ఉండాలన్నారు. అందుకే మన నోటి నుండి వచ్చు వాక్కులన్నీ ఇతరులకు వెలుగు చూపేదిగా ఉండాలి. చీకట్లో అగాధంలోకి, నిరాశలోకి నెట్టేదిగా ఉండరాదు.

1027. సత్యము, నిజము ఒకే అర్థమిస్తాయి. క్రీస్తు మాటల్లో నేనే మార్గమును, సత్యమును, జీవమునైయున్నానన్నారు. ఆ నిజాన్ని మార్చే శక్తి ప్రపంచములో ఎవరికీ లేదు. కానీ ఈ ప్రపంచాన్ని మార్చే శక్తి మాత్రము సృష్టికర్త అయిన దేవునికే ఉంటుంది. నిజానికే ఉంటుందని నమ్మాలి.

1028. మన జీవితానికి అనేక వనరులు ఆత్మీయులు, కుటుంబము, ఉద్యోగము, సంపద ఉచితంగా దేవుడిచ్చాడని ఆనందించి కృతజ్ఞతతో జీవించాలి. మన దగ్గరలేనిది దేవునిని వినయముతో, హృదయ శుద్ధితో అడిగితే తప్పక దయచేయునని నిరీక్షణతో అడగాలి.

1029. మానవ సహజంగా కొన్ని అబద్ధాలను ఆలోచించకుండా నమ్ముతాము. కొన్ని నిజాలు నమ్ముటకు ఆలోచిస్తాము. క్రీస్తులో అసాధ్యాలన్నీ సుసాధ్యాలు. నమ్ముట నీవలననైతే నమ్మువానికి సమస్తము సాధ్యంకాగలదు. అపనమ్మకము లేకుండా నమ్మాలని క్రీస్తు ధైర్యం చెప్పారు. చూచి నమ్మినవాని కంటే చూడక నమ్మినవారు ధన్యులని తన శిష్యుడైన తోమాతో అన్నారు.

1030. శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును. సోమరి వెట్టిపనులు చేయును. యుక్త వయసులో నుండగా పనిచేయాలి. పనిలో నిపుణత గలవాడు రాజుల యెదుట సన్మానింపబడును. యవ్వనంలో కష్టపడి పనిచేయుటకు సిగ్గుపడితే వయస్సు దాటాక అందరి ముందు బ్రతుకుటకు సిగ్గుపడాలి.

1031. ఆరోగ్యమే మహా భాగ్యము అని పెద్దలన్నారు. ఆరోగ్యము పట్ల జాగ్రత్త వహించాలి. అతినిద్ర, అతిగా తినడం, తగదు. బంధాలు, విలువగలవి. నిర్లక్ష్యంగా అనాలోచనతో మాట్లాడి మనస్సులు నొప్పిస్తూ ఎవరినీ దూరం చేసికోక ప్రేమ కనబరుస్తూ బంధాన్ని కాపాడుకోవాలి.

1032. చిమ్మచీకట్లో చిరుదీపం లేదా కారుచీకట్లో కాంతిరేఖ ప్రతి జీవితానికి ఊరటనిచ్చి ధైర్యాన్నిస్తుంది. బాధల్లో, నిరాశలో, కష్టాల్లో, దుఃఖాల్లో కుమిలిపోవు వేళలో ఒక చిన్న ఓదార్పు మాట, ఒక స్పర్శ కన్నీరు తుడిచి, భుజంతట్టి ఓదార్పునిచ్చే హస్తం కోసం ప్రతి హృదయము కోరుకొని ఆరాటపడునని గుర్తించి ప్రతి వ్యక్తి అట్టి పరిచర్య చేయుటకు ఆశించాలి.

1033. జ్ఞానుల ఉపదేశంలో ఐశ్వర్యవంతులు కావాలని పౌలు భక్తుడు తెలిపాడు. జ్ఞానము, అవగాహన, వివేకం, మంచితనంతో ఉత్తమ లక్షణాలు కలిగి క్రీస్తు సారూప్యములో నుండిన వారి వ్యక్తిత్వం విలువైనది. అందుకే మనిషికి

ఆభరణము వ్యక్తిత్వము. అది విలువగలది. దాని విలువ మన జీవన విధానాన్ని మార్చేస్తుంది. అది కోల్పోతే సర్వం కోల్పోయినట్లే. అందుకే అట్టి వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలి. నిర్లక్ష్య భావనతో జారవిడుచుకొని అపఖ్యాతిని పొందరాదు.

1034. ఒకని జీవితమెన్నడూ సాఫీగా కొనసాగదు. జీవితమొక సమస్య. సాధించాలి. కష్టాలు, సమస్యలు, శోధనలు అడ్డంకులను ఎదుర్కొంటూనే ఉంటాము. ఆ సమస్యల సాధనలోనే విజ్ఞానము, మానసిక వికాసం లభిస్తుంది.

1035. ఈ జీవితంలో మనము పోరాడినా, నటించినా, నిర్లక్ష్యంగానున్నా అది మనకు దేవుడిచ్చిన అపురూప వరంగా నున్న మన స్వంత జీవితము. జయాపజయాలు గెలుపు, ఓటమి, ఆనందం, దుఃఖము అన్నీ మనము అందుకొనే ఫలితాలే. గనుక ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటిమీద ధ్యానముంచాలి.

1036. ప్రతి వ్యక్తి భవిష్యత్తయినా వారు వర్తమానములో చేసే పనులపై ఆధారపడి ఉంటుంది. అందుకే మనలను ప్రేమించేవారితో జీవించు సమయంలో ఒదిగి మాట్లాడాలనియు, ద్వేషించేవారి దగ్గర ఎదిగి మాట్లాడాలని గ్రహించాలి.

1037. దేవుడు విలువైన జీవితాన్నిచ్చాడని నమ్మాలి. కృతజ్ఞతగా జీవించాలి. జీవితంలో తల్లిదండ్రులు, తోబుట్టువులు, స్నేహితులు, సమాజము, గురువులు మనలను ప్రభావితం చేసిన వ్యక్తులు. వారందరినీ నమ్మటమే నిజమైన ప్రేమ అనగలము. నమ్మి బ్రతకడములో ప్రేమ ఉంటుంది.

1038. నమ్మిస్తూ బ్రతకడములో స్వార్థముంటుంది. నమ్మాలిగాని నమ్మిస్తూ ఉండరాదు. ఎదురుదెబ్బలు, అవమానాలు, కష్టాలు, అపనిందలు, నిరాదరణ ఎదురైనప్పుడు త్వరపడరాదు. శ్రమనొందుట మేలు అన్న దావీదు మాటల్లో దేవుని కట్టడలు, జీవిత సత్యాలు తెలుసుకోగలము.

1039. ఇతరుల కష్టం తెలుసుకోవాలంటే వాళ్ళు చేసే పని చేయుటకు మనం ప్రయత్నించినప్పుడే ఆ కష్టం మనకు తెలుస్తుంది. ఇతరులు భారమైన పనులు చేయవలసివస్తే వారికి తోడుగా ఉండి తోచిన సహాయం చేయుటకు ఆసక్తి చూపుట మంచిది. ఇంటి పనులలోగాని, ఆఫీసు పనులలోగాని, శ్రమపడే వారికి వారి పిల్లలకు అవసరాల్లో తోడ్పడుటకు ప్రయత్నించి మంచివారిగా జీవించాలి.

1040. జీవితంలో సమస్యలు ఎదురయినపుడు తప్పించుకోరాదు గాని, పరిష్కారం కోసం తీవ్ర ప్రయత్నం చేయాలి, విజేతలు కావాలి. నీటిలో పడ్డ ప్రతివారు చనిపోరు. ఈత రానివారు మాత్రమే చనిపోవుట గమనిస్తాము. సమస్యలున్న ప్రతివారు ఓడిపోరుగాని, శోధించి సాధించాలి. అదే ధీర గుణము. ఒక పాటలోని మాటల్లో సత్యముంది– **"అగాధమగు జలనిధిలోన ఆణిముత్య మున్నటులే, శోకాల మరుగున దాగి సుఖమున్నదిలే, ఏదీ తనంత తానే నీ దరికిరాదు శోధించి సాధించాలి".** ఇది కేవలము దేవునివలనే సాధ్యము.

1041. ఒక మేధావి మాటల్లో దైవ ప్రేమ ఎట్టిదో తెలిపాడు. ఎక్కువ కాలము జీవించాలనుకుంటే తక్కువ తినాలి, రెండు రెట్లు నడవాలి. మూడు రెట్లు నవ్వుతూ గడపాలి, లెక్కలేనంత ప్రేమను పంచాలి. నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించాలి. ముందుగా దేవుని ప్రేమించాలి. పొంగి పొరలే ప్రేమతో తోటివారిని, కుటుంబాన్ని పేదలను ప్రేమించిన విశ్వాసి సంతుష్టి సహితమైన దైవభక్తి గల విశ్వాసి కాగలడు.

1042. జీవితంలో దుఃఖాలు తప్పవు. అనంతమైన దుఃఖం సమసిపోవాలంటే చిన్న చిరునవ్వు చెరిపివేయగలదు. నవ్వులో ఆదరణ ఉంటుంది. భయంకర మౌనాన్ని ఒక మాట చెరిపివేయగలదు.

1043. పుచ్చుకొనుటకంటె ఇచ్చుట మేలని బైబిలు బోధిస్తుంది. కలిమి విస్తరించిన వేళలో పేదలను గుర్తుకు తెచ్చుకొని అవసరతలోనున్నవారికి తోచిన సహాయం చేయాలి. దోపిడీ చేయాలన్న మనస్సు, మోసం చేసి ఆస్తి పెంచుకోవాలన్నవారు ఎక్కువయ్యారు. దోచుకున్న వారిదగ్గర కోల్పోయినవారి బాధ తెలిసిన వారు ఇతరులను దోచుకోలేరు. ప్రేమతో అవసరాల్లో ఇతరులను ఆదుకొని ఇవ్వడంలో అపరిమిత తృప్తి ఆనందం తెలిసినవారు వారికున్నది దాచుకోలేరు.

1044. పౌలు ఫిలిప్పీయులకిచ్చిన హెచ్చరికలో ఒకటి ఏదనగా–అందరూ స్వంత కార్యాలు చూచుకొంటారేగాని ఇతరుల కార్యాలను మనస్కరించరు. మంచి సమరయుని ప్రేమ మనము కలిగి ఉండాలి. యాజకుడు లేవీయుల వలె పట్టించుకోని పరిస్థితికిరారాదు. లోకానికి ఇతరులవల్ల ఆనందం, లాభం కలగాలన్న తపన గలవారై ఇతరుల బాధలను, ఆనందాన్ని పట్టించుకోని బిజీ జీవితంలో వ్యర్థంగా గడిపేస్తున్నారు కొందరు. అట్టివారివలె కాక విశ్వాసులుగా ఇతరుల బాధలను పట్టించుకొనే ప్రయత్నం చేయాలి.

1045. దేవుని యందలి భయభక్తులు జ్ఞానమునకు మూలమని సామెతల గ్రంథములో వ్రాయబడింది. భయము, భక్తితో నున్న విశ్వాసి ఆలోచనలలో బలము కలిగి ఉండి దృఢమైన చిత్తంతో దేవుని చిత్తం గ్రహిస్తూ నిబ్బరంగా ఆనందంగా విశ్వాసయాత్ర కొనసాగించగలరు.

1046. మన సన్నిహితులంతా సాధారణంగా మంచి సద్భావంతో కలిసిమెలిసి ఉన్న తరుణాల్లో మనసువిప్పి అన్ని విషయాలూ పంచుకొని ఆనందిస్తూనే ఉంటారు. పొరపాటున మిత్రులే శత్రువులయినప్పుడు పంచుకొన్న విషయాలకు కొంత కలిపి అందరికీ చేరవేస్తూ పేరు పోగొట్టగలరు. జాగ్రత్త వహించాలి. పాముల వలె వివేకంగా పావురాళ్ళవలె నిష్కల్మషంగా ఉండాలి.

1047. దేవుని కృపలో మనకెందరో విశ్వాసులతో బంధాలు ఏర్పడగలవు. ఆ బంధం మనకు బరువు కాకుండా జాగ్రత్తపడాలి. ప్రేమ విరక్తి కారాదు. మాటల్లో విసుగుదల రానివ్వరాదు. మన ప్రవవర్తనలో జాగరూకత కావాలి. లేనిచో పరువు పోతుంది. హద్దు దాటితే ప్రమాదాల నెదుర్కోగలమని గ్రహించి వివేకంతో జీవించాలి.

1048. దేవుడు మనకెన్నో దీవెనలిచ్చారు. వాటిలో సదవకాశాలెన్నో ఉంటాయి. బిజీ జీవితంలో గమనించలేము. అయితే, అవకాశము పక్షి లాంటిది. ఒక ప్రదేశంలో ఉండేలేదు. ఒకచోటునుండి మరో చోటుకు పోతుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

1049. మంచి ఆలోచనలు సన్మార్గంలోకి నడిపిస్తాయి. కొన్నిసార్లు కష్టాలు, బాధలు, నష్టాలు భరించే సమయాల్లో గొప్ప పాఠాలు, సత్యాలు, సూక్తులు తెలియకుండానే నేర్చుకోగలము. అందుకే కొందరి మాటల్లో, ఒక్కోసారి కొన్ని కష్టాలు తలరాతనే మార్చగలవంటారు.

1050. ఆప్యాయంగా పలకరించేవారిలో మంచి మనస్సు చూడగలము. అది ఎంతో ఆనందం కలిగిస్తుంది. అందుకే మనం కూడా ఆప్యాయత, ఆర్ద్రత, దయ కనికరము, ప్రేమతో వ్యవహరిస్తే తిరిగి అదే అనుభవాలు ప్రతిబింబిస్తాయని గుర్తుంచుకోవాలి. చాలామంది అర్థంచేసుకొనుటలో వెనుక ఉంటారు, అపార్థం చేసుకొనుటలో ముందుంటారు.

1051. నిత్యజీవితంలో నాలుకతో అందుకొనే రుచులు క్రొత్త అర్థాన్నందిస్తాయి.

1) తీపి ఆనందాన్నిస్తుంది. 2) ఉప్పు ఉత్సాహాన్ని రగిలిస్తుంది.

3) చేదు నోటికి బాధ కలిగిస్తుంది. 4) కారం మంట పుట్టిస్తుంది.

5) వగరు ఓర్పునిస్తుంది. 6) పులుపు అసహనాన్ని కలిగిస్తుంది.

వీటినే షడ్రుచులు అంటారు. ఇవి అనేక సవాళ్ళను ఎదుర్కొనే శక్తినిస్తాయి.

1052. ఒక దైవసేవకుని మాటల్లో–మీరు దానము చేయదలిస్తే నిరుపేదలకు అన్నవస్త్రాలిస్తూ దయతో మాట్లాడండి. అదో గొప్ప ప్రతిఫలమిస్తుంది. గిన్నెడు చల్లని నీళ్ళిస్తేనే ప్రతిఫలమన్నాడు దేవుడు.

1053. కొన్నింటి విలువ కోల్పోయినప్పుడు, దొరకనప్పుడు కొన్నింటి విలువ, కాలము గడిచేకొద్దీ తెలుస్తుంది. ఏశావు జ్యేష్టత్వం విలువ కోల్పోయి ఏడ్చాడు. నయోమి బేత్లెహేము విలువ కాలం గడిచాక తెలిసికొన్నది.

1054. జీవితంలో కొన్ని బాధలు అనుభవించినప్పుడే గుండె ధైర్యం వస్తుంది. మన కన్నీరు మనమే తుడుచుకోవాలి. మన భుజాలు మనమే తట్టుకొని ఊరట చెందవలసి వస్తుంది. కొంత నిరాదరణ, అవమానము, నిరుత్సాహం కలిగించే మాటలు, మన అనుభవంలో ఉండేవాటి ద్వారా సహనము, ఓర్పు సంపాదించగలము. క్రీస్తు సిలువ శ్రమలు తలిస్తే మనము పడే బాధలు స్వల్పమని తెలుస్తుంది.

1055. దైవభక్తిలో జ్ఞానావగాహన, తెలివి దాగి ఉంటాయి. జీవిత గమనంలో కుటుంబీకులతో, స్నేహితులతో, సహ విశ్వాసులతో ఏదైనా మనస్సునకు గాయం కలిగించే సందర్భాలు తప్పవు. ఆ బంధాలలో వచ్చే గొడవలలో మౌనంగా సర్దుకుపోవడం, అర్థంచేసుకోవడం చాలా ముఖ్యము. ఎందుకనగా సర్దుకోకపోతే మళ్ళీ మళ్ళీ గొడవలు వస్తూనే ఉంటాయి. అవి అర్థం చేసుకొంటే ఆ బంధాలు సుఖమయం కాగలవు.

1056. పనిలో గుర్తింపు పొందేవాడు ఆనందంగా ఉంటాడు. చేతకానివాడు విచారంగా ఉంటాడు. రెండూ శాశ్వతం కాదని తెలిస్తే సుఖంగా వుండవచ్చు.

1057. మనిషిలో గొప్పతనము సాయము చేయడంకంటే, పొందిన సాయాన్ని జీవితాంతము గుర్తుపెట్టుకోవడంలో ఆనందము తృప్తి దాగి ఉంటుంది. దావీదు పేదరికంలో సౌలురాజు కుమారుడు యోనాతాను తన వస్తువులు, ప్రేమను అధికంగా ఇచ్చి ఆదరించేవాడు. తన స్నేహితుని కుమారుని గుర్తుంచుకొని గౌరవమిచ్చి తన సంపద అందజేశాడు.

1058. ఏదైనా చేయాలన్న పట్టుదలతో ఒక నిర్ణయము తీసుకున్న తర్వాత ఎన్ని అవరోధాలున్నా, చిక్కుముడులు ఛేదించే అవసరత వున్నా అన్ని అడ్డంకులు ఓర్పుతో తప్పించుకొని గమ్యము చేరవలసి వస్తుంది. శ్రమ నీ ఆయుధం అయితే విజయము నీకు లోబడుతుంది.

1059. మనచుట్టూ ప్రేమ ఉంటుంది. దానిలో స్వచ్ఛత తక్కువ. ఎన్నో బంధాలుంటాయి గాని విలువలుండవు. అందుకే ఎవరి ప్రేమను ఆశించరాదు. ఏ బంధానికి లొంగరాదు. పైనున్న దేవుని పూర్తిగా నమ్మితే శాశ్వత ప్రేమ పొందగలవు.

1060. జీవితంలో మనకెదురయ్యే వ్యక్తుల్లో కొందరు ఎప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంటారు. నీ కీడు కోరేవారు నిన్ను పొగుడుతూ ఉంటారు. ప్రశ్నించి, వివరంగా నీ యోగక్షేమాలు తెలిసికొనేవారే నిజస్నేహితులని నమ్మాలి. మన జీవితంలో ఈ క్రింద చెప్పబడిన ముగ్గురు విలువైనవారు.

**అభినందించేవారు–** నమ్మకాన్ని నేర్పిస్తారు, **అసూయపడేవారు–** ఆత్మగౌరవాన్ని నేర్పిస్తారు, **తప్పుపట్టేవారు–** మనలో క్రొత్త ఆలోచనలను రేకెత్తించగలరు.

1061. చాలామంది జీవితంలో ఓడిపోతున్నారని తలుస్తాము. బలంలేక కాదు, తెలివిలేక కాదు. అబద్ధం చెప్పలేక, మోసం చేయలేక. క్రీస్తుని నమ్మిన విశ్వాసులు అబద్ధమాడని దేవుని, మోసం చేయవద్దన్న రక్షకుని చిత్తప్రకారం జీవిస్తూ, దేవుని సారూప్యానికి దగ్గరగా బ్రతుకుతూ ప్రయాసపడు వారెన్నడూ అబద్ధం, మోసం రెండు పనులు చేయరు, చేయలేరు.

1062. ఒక నిజము కొద్దికాలము బాధిస్తుంది. అబద్ధము జీవితకాలము వేధిస్తుందని గ్రహించు. అబద్ధాలకు దూరంగా నీతి, యథార్థతలతో జీవించాలి. బాధ్యత తెలిసినవారికి బాధలెక్కువ, నీతిగా ఉన్నవారికి నిందలెక్కువ. నీతిన్యాయాలు పాటించువారికి దేవుని ఆశీర్వాదాలుంటాయి. మాటకు మాట సమాధానం చాలామంది చెప్పగలరుగాని, బంధాల విలువ అర్థంకానివారికి మాటలు అర్థము కావు.

1063. దేవునిపై నమ్మకము లేనివానికి స్నేహము, ప్రేమ అనే ఈ బంధాలేమీ మొలకెత్తవు. చెడు ఎక్కువ ప్రభావితమవుతుంది. ఆశ్రయమిచ్చినవాడి తలకెక్కుతారు, ఉపదేశమిస్తే ముఖం త్రిప్పుకుంటారు, గౌరవము చూపిస్తే

బానిసగా చూస్తారు. ఉపకారము చేసినవారికి అపకారము చేస్తారు. విశ్వాసము చూపిస్తే వెన్నుపోటు పొడుస్తారు. క్షమ చూపిస్తే బలహీనతగా తలుస్తారు. ప్రేమను చూపిస్తే మోసగిస్తారు.

1064. ప్రార్థన అనగా నీకు నచ్చినది కాదు దేవునికి నచ్చే జీవితము కావాలి. అలా జీవిస్తానని తీర్మానం చేసుకోవాలి. ఒక విద్యార్థి ఎంత నేర్చుకున్నాడో పరీక్షలు తెలుపుతాయి. ఒక విశ్వాసి ఎంత ఎదిగాడో శోధనలు తెలుపుతాయి.

1065. శ్రీమంతులను, జ్ఞానవంతులను యేసుక్రీస్తు తన శిష్యులుగా ఎన్నుకొనలేదుగాని కేవలము చేపలు పట్టు జాలరులను ఎన్నుకొని లోకాన్ని తలక్రిందులు చేయగల విశ్వాసులుగా తీర్చిదిద్దినందున, క్రీస్తు ప్రేమకు ప్రేమతో హతసాక్షులయ్యారు.

1066. **యేసు ఎవరు? :**

**J = Joy giver – ఆనందమిచ్చేవాడు.**
**E = Eternal Life giver – నిత్యజీవమిచ్చువాడు.**
**S = Strength giver – శక్తినిచ్చువాడు.**
**U = Un Conditional Lover – షరతులేని ప్రేమ చూపువాడు**
**S = Sins forgiver – పాపములు క్షమించువాడు.**

యేసుక్రీస్తు దేవుడుగా గల నరుడు ధన్యుడు.

1067. **మనము పరుగెత్తే పరుగు ఎట్లున్నది? :**

1) హాగరు పరుగు గమ్యము లేనిది (ఆది. 16:9).
2) అబ్రాహాము పరుగు పునాదులు గల పట్టణమును స్వతంత్రించుకొనుట కొరకు (హెబ్రీ 11:10).
3) యోసేపు పరుగు పరిశుద్ధత కాపాడుకొనుటకు (ఆది.39:12)
4) మోషే పరుగు దేవుని పర్వతము యొద్దకు చేరుటకు (నిర్గమ.3:1–4).
5) కోరహు పరుగు ఆధిక్యత, అధికారము కొరకు (సంఖ్యా.16:1–32).
6) ఫీనెహాసు పరుగు పాపము పరిహరించుటకు (సంఖ్యా.25:10).
7) బిలాము పరుగు బహుమానము కొరకు (సంఖ్యా.22:21–33).
8) గేహజీ పరుగు ధనము కొరకు (2రాజులు 5:20–26).
9) ఎలీషా పరుగు సేవ కొరకు (1రాజులు 19:20,21).
10) పేతురు పరుగు పునరుత్థానుడైన యేసు కొరకు (లూకా 24:12).

11) పౌలు పరుగు గురియొద్దకు (ఫిలిప్పీ 3:12).

12) దేమా పరుగు లోకాశల కొరకు (2తిమోతి 4:10).

13) ఫిలిప్పు పరుగు ఆత్మల సంపాదన కొరకు (అపొ.కా. 8:30)

మన పరుగు దేనికొరకో ఆలోచించుకోవాలి?

1068. **మన ప్రార్థన ఎట్లుండవలెననగా ?**

దేవా! నోవహు వంటి నీతి, అబ్రాహాము వంటి విధేయత, యోసేపు వంటి పరిశుద్ధత, మోషే వంటి నమ్మకత్వం, సమూయేలు వంటి యథార్థత, ఏలియా వంటి విశ్వాసము, యోబు వంటి ఓర్పు, దానియేలు వంటి పట్టుదలతో కూడిన ఏకాంత ప్రార్థన, దావీదు క్షమ, సొలొమోను జ్ఞానము, సమరయుని ప్రేమ, పౌలు ఆత్మల భారము, తిమోతి పరిచర్య, కొర్నేలు దాతృత్వం, కుష్టరోగి కృతజ్ఞత, బుద్ధిగల కన్యకల సిద్ధపాటు దయచేయుము.

1069. ప్రతిరోజూ బైబిలు ధ్యానంతో వ్యక్తుల జీవితాలు మారగలవు.

1) చీకటిలో నుండి వెలుగులోనికి రాగలరు.

2) దైవజ్ఞానాన్ని పెంచుకోగలరు.

3) పరలోకరాజ్యం చేరు మెళకువలు పొందగలరు.

4) హృదయంలో శాంతి, సమాధానం పొందగలరు.

5) హృదయంలో అధిక నెమ్మది పొందగలరు.

6) ఎదురయ్యే శోధనలు విజేతగా మార్చగలవు.

7) లోకాశలపై, లోకంపై ముఖ్యంగా పాపాన్నెలా జయించాలో గ్రహించగలరు.

8) ప్రియ క్రీస్తు త్యాగము, ప్రేమ, కనికరము, దయ తెలుసుకోగలరు.

9) నేనే మార్గం, సత్యం, జీవం అనే సత్యాన్ని గ్రహించగలరు.

10) ఆత్మలో నెమ్మది పొందగలను.

1070. మన వినయానికి మించిన ఆభరణం ఉండదు. ఆత్మ విశ్వాసానికి మించిన వస్త్రాలంకరణ లేదు. ఈ అంశాలు ధ్యానిస్తే వివేకం లభిస్తుంది.

1071. ఎన్నో రంగాలలో ప్రగతి సాధించినవారు ఉంటారు. సన్మానాలు పొందుతారు చప్పట్లు, అభినందనలకు కొదువుండదు. అయితే అతిముఖ్యంగా గ్రహించ వలసిన సత్యము అది పొందడానికి ఆ వ్యక్తికున్న అర్హతలోనే గొప్పదనం దాగి ఉందని తెలుసుకోవాలి.

1072. నశించే ఆత్మల పట్ల ఆసక్తితో కృషి చేయాలి. లోకం వైపు చూచే ఎవరైనా దిగులు పడక తప్పదు. క్రీస్తు వైపు చూస్తే శాంతి నెమ్మది దొరకును. ఓటమి ఒంటరితనంలో జీవితం అనుభవం నేర్పిస్తుంది. ఒకటి ఎలా గెలవాలో నేర్పిస్తే, మరొకటి ఎవరిని నమ్మాలో, ఎలా బ్రతకాలో ఒంటరి తనము నేర్పిస్తుంది. నీవు ఒంటరిగా లేవు. దేవుడు సదాకాలము తోడైయుంటాడు గనుక భయం లేకుండా బ్రతకగలవు.

1073. ప్రతి వ్యక్తి పావురాల వలె నిష్కల్మషంగా, పాముల వలె వివేకంతో జీవించాలి. ఒదిగి సందేశం వినుట, వివేకంతో జవాబివ్వడము, ప్రశాంతంగా ఆలోచించడము, పక్షపాత ధోరణి పాటించక నిర్ణయాలు చేసికొనుటలో జ్ఞానం కలిగి మెలుగుచూ ఉండాలి. మన జననము సామాన్యమైనదైనా మన మరణము ఒక చరిత్ర సృష్టించేదిగా ఉండే రీతిలో జీవించాలి.

1074. ఎవరికైనా మంచి చెప్పేవారు లేకపోవడం దురదృష్టము. మంచి చెప్పినను విసక చెడిపోతే వారిని మూర్ఖులు అనవచ్చు. అట్టి మూర్ఖులను రోకటిలో వేసి దంచినా మూర్ఖత పోదని సామెతల గ్రంథములో వ్రాయబడింది. ఒకరికి మేలు చేసి ఎప్పుడూ జ్ఞాపకము పెట్టుకోరాదు. కానీ ఎవరైనా మనకు మేలు చేస్తే ఎప్పుడూ మర్చిపోరాదు. దావీదుకు మంచి హృదయముంది. దేవుడు చేసిన మేళ్ళను ఎన్నడూ మరువరాదన్నాడు.

1075. ప్రతి వ్యక్తి మంచి వ్యక్తిత్వంతో జీవించాలంటే దైవభక్తి చాలా అవసరము దానితోపాటు కొన్ని మెళుకువలను తెలిసికోవాలి.

1) నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించి, గౌరవించాలి.
2) కష్టాలను తట్టుకొనే శక్తి గలవారిగా జీవించాలి.
3) కోపావేశాలలో తగిన సహనం కనబరచాలి.
4) మాటలలో మృదుత్వము, సరళత్వము ఉండాలి.
5) పేద స్థితిలో నీతి, నిజాయితీ పాటించాలి.
6) ఓటమిలో కృంగిపోకుండా ప్రయత్నించాలి.
7) నీకున్న సంపదలో పేదలను ప్రేమిస్తూ అవసరాల్లో ఆదుకొనే దాతృత్వము చూపాలి.

1076. **దేవునికి కోపం పుట్టించే సందర్భాలు గమనించాలి :**

1) దేవునిపై సణుగుట తగదు **(సంఖ్యా.11:1).**

2) దేవుడు ఆజ్ఞాపించినది చేయక స్వంత జ్ఞానం ఉపయోగించరాదు **(2సమూ.6:7).**

3) దేవుని వాక్యము తృణీకరించరాదు **(2దినవృ.36:16).**

4) దేవుని గూర్చి యుక్తముగా మాట్లాడలేని స్థితి తగదు **(యోబు 42:7).**

5) ఏ స్వరూపము ఉన్న విగ్రహము ఉండరాదు **(ద్వితీ.4:25).**

6) దైవ సేవకునికి విరోధముగా మాట్లాడరాదు **(సంఖ్యా.12:9).**

7) విశ్వాసుల హృదయాన్ని బలహీనపరచరాదు **(సంఖ్యా.32:9).**

8) ఇతరుల పాపానికి నీవు కారణం కారాదు **(1రాజులు 16:2).**

9) శకునాలు, ముహూర్తాలు నమ్మరాదు **(2దినవృ.33:6).**

10) భక్తిహీనులతో స్నేహము తగదు **(2దినవృ.19:2).**

11) అన్యుల విందులలో పాలివారు కారాదు **(సంఖ్యా.23:1).**

12) దుర్నీతి భక్తిహీనతకు దూరంగా జీవించాలి **(రోమీ 1:18).**

1077. జీవితంలో దెబ్బలు తగిలిన సమయాల్లో మన ధైర్యమెంతో గుర్తించగలము. ఒకసారి పొరపాటున తప్పు చేస్తే గ్రహించిన సత్యమేమనగా ఇంకా సరిగా నేర్చుకోవలసిన జీవిత విలువలున్నాయని, ఓటమి ఎదుర్కొనే సమయాల్లోనే శ్రద్ధతో ప్రయత్నించి ఏ రీతిగానైనా విజేతగా నిలవాలనే పట్టుదలతో సాధించే కృషి చేయు స్ఫూర్తిని పొందవచ్చు.

1078. మన జీవితాలలో భావోద్రేకాలు తప్పవు. ఆవేశంలో ఆపలేని, అణచుకోలేని వ్యర్థ కోరికల ద్వారా క్షణికోద్రేకంతో మనం చేసే తప్పు జీవితాన్ని మార్చేస్తుంది. అంతవరకు కాపాడుకున్న నైతిక విలువల్ని అగాధములోకి నెట్టేస్తుంది. కొంచెము ఆలోచించి అడుగు వేయాలి. దావీదు పాపం చేసిన తర్వాత ఎన్నో గాయాలు, బాధలు ఎదుర్కొనేలా చేశాయి. విలువైన జీవితాన్ని వ్యక్తిత్వాన్ని అందంగా మలుచుకోవాలి. దేవుని నుండి క్షమ పొందిన దావీదు వంశంలో రక్షకుడగు క్రీస్తు జన్మించాడు.

1079. మనకు మంచి చెప్పే వాళ్ళు లభించుట మన భాగ్యమయితే, వినిపించుకోక పోవడం దౌర్భాగ్యము. దుఃఖంలో మూగబోయిన మాటలు గొంతులోనే

యింకిపోతే ఆ మాటలు కన్నీళ్ళుగా ఉబికి వస్తాయి. దుఃఖితులను ఓదార్చే దేవుడని ఆశ్రయించి ప్రార్థించాలి.

1080. నీటిలో నిలిచినప్పుడు అల వచ్చినప్పుడు తల వంచితే ప్రాణం నిలుస్తుంది. మనస్పర్థలు తలెత్తినప్పుడు ఒక అడుగు వెనక్కి తగ్గితే బంధము నిలుస్తుంది. కొన్నిసార్లు ఎంతో ఎత్తుకు ఎదిగిపోవాలని ఆలోచిస్తూ కూర్చుంటే లాభం లేదు. అందుకే బైబిలులో **"లెమ్ము తేజరిల్లుము వెలుగు వచ్చింది"** అనే హెచ్చరిక ఉంది. లేచి వెలుగులో అన్వేషించాలి, ఆలోచించాలి, ఆచరించాలి.

1081. నిర్లక్ష్య భావంతో అనాలోచనగా సమస్యను వినరాదు. లోతు తెలియకుండా ఉచిత సలహాలివ్వరాదు. విషయము పూర్తిగా తెలిసికోకుండా నిర్ణయాలు తెలుపరాదు. విధానము తెలియకుండా పరిష్కరించరాదు. రెండు వైపులా వినకుండా నమ్మినదే నిజమని జడ్జిమెంటు ఇవ్వరాదు.

1082. సాయము చేసినవాడు కృతజ్ఞత కోరుకోవడము ఎంత తప్పో, సాయము పొందినవాడు కృతజ్ఞత చూపకపోవడం అంతే తప్పు. పదిమంది కుష్టరోగులకు క్రీస్తు స్వస్థతనిస్తే ఒక్క కుష్టరోగి క్రీస్తును చేరి కృతజ్ఞత తెలిపాడు. క్రీస్తు ఆనందించారు.

1083. సొలొమోను వ్రాసిన సామెతలు చాలా అర్థవంతమైనవి. దేవుడే అతనడిగిన వరాలకు అదనంగా ఐశ్వర్యం ఘనత జ్ఞానంతోపాటు అందించాడు. అడుగుడి యివ్వబడును, వెదకుడి దొరుకును, తట్టుడి మీకు తీయబడునన్న క్రీస్తు మాటలు అక్షరసత్యాలు.

1084. సాధ్యమైనంత వరకు అందరితో సమాధానంగా ఉండాలి. సమాధానం వెదకి వెంటాడాలి అని బైబిలు బోధిస్తుంది. వాడకము లేనిచో నీరు కూడా పాచిపట్టి వాసన వస్తుంది. ఇనుము తుప్పు పడుతుంది. అప్యాయతతో మాట్లాడుతూ, అవసరాలను గమనిస్తూ, చిన్న చిన్న సహాయాలు చేస్తూ, ఇతరులను అభినందిస్తూ, చేసిన మేలుకు కృతజ్ఞత చెప్పటం మరిచిపోక సమయోచితంగా మాట్లాడి సత్ప్రవర్తనతో జీవిస్తే బంధువులు, స్నేహితులు, సమాజంలో వ్యక్తులలో బంధాలు స్థిరపడగలవు.

1085. క్రీస్తు జీవితంలో ప్రేమ, క్షమ విలువలు విరివిగా పాటించి ఘనమైన సేవలు చేశారు. ఆయనను ఘోర మరణంపాలు చేసినవారిని సిలువలో బాధలో ఉండి **"వీరేమి చేస్తున్నారో వారికి తెలియదు, క్షమించు"** అన్న గొప్ప క్షమను

చూపారు. క్షమాపణ అడిగేది ఎదుటి వారిని సమాధానపరచుటకే కాదు, మనలోని అహంకారాన్ని విడిచి సత్సంబంధాలను మెరుగుపరిచే రీతిగా ప్రభావితం చేస్తుంది.

1086. ప్రేమతో పేదవారిని ఆదుకొని చేసిన సహాయంలో దైవప్రేమ దాగి ఉంటుంది. బీదలను కటాక్షించాలని బైబిలు బోధిస్తుంది. ఆలోచించి తీసుకున్న నిర్ణయము కష్టపడి తెచ్చుకొన్న అవకాశము, ఓటమి తర్వాత వచ్చే అనుభవము, గొప్ప వ్యక్తిత్వం వల్ల లభించే గౌరవాభిమానాలు విలువైనవే గనుక దేవునియందేదీ వ్యర్ధము కాదని ఎరిగి స్థిరులును, కదలనివారుగా నుండి దేవుని కార్యాలపట్ల సేవ పట్ల ఎల్లప్పుడూ ఆసక్తితో జీవితాన్ని కొనసాగించాలని పౌలు భక్తుడు తెలిపాడు.

1087. ఆలోచన గొప్పదా? ఆకలి గొప్పదా? ఆలోచన మంచిని ఎన్నుకొనుటకు సహకరిస్తుంది. అయితే ఆకలి అవసరాన్ని చూపిస్తుంది. మంచి ఆలోచనలు తృప్తిగల జీవితాన్ని ఎన్నుకొనుటకు సహాయపడుతుంది. జీవితంలో తృప్తి వుంటే జీతం, జీవితం రెండూ బాగుండాలి. జీవితంలో అసంతృప్తి ఉంటే, జీతం బాగున్నా, జీవితం శూన్యమే. పౌలు భక్తుడి మాటల్లో గొప్ప సత్యముంది. సంతుష్టి సహితమైన దైవభక్తి లాభదాయకము.

1088. మన సంకల్పాలు పవిత్రంగా ఉండాలి. మన భావాల్లో పరిణితి ఉండాలి. భావవ్యక్తీకరణలో మార్పు, ఆలోచనా విధానాల్లో మార్పు, ఇచ్చిపుచ్చుకొనే గౌరవంలో మార్పు, మన ప్రవర్తనలో మార్పు కేవలము మారుమనస్సు పొంది, క్రీస్తు రక్తంలో కడుగబడిన అనుభవంలో స్పష్టంగా కనిపిస్తాయి. సౌలు పౌలుగా మారి గొప్ప భక్తిపరుడై అనేక పుస్తకాల్లో గొప్ప సందేశాలను అందించి ధన్యుడయ్యాడు. నన్ను పోలి నడుచుకోవాలన్న క్రీస్తును వెంబడించి గురియొద్దకే పరుగెత్తుచున్నాను. నన్ను పోలి అనుకరించమని ధైర్యంగా చెప్పి మార్గదర్శకుడయ్యాడు.

1089. మనుష్యులు మనల్ని నిందించి చెడ్డమాటలెల్ల పలికినపుడు సహిస్తే ధన్యులని క్రీస్తు చెప్పారు. వేలసార్లు బాధపెట్టిననూ మరిచి తిరిగి ప్రేమించుటకు మాట్లాడి దగ్గరగుటకు తపించు మనస్సు గలవారిదే నిజమైన ప్రేమ. ఒక చెంపపై కొట్టిన వారికి రెండవ చెంప చూపే ప్రేమ అట్టిదే. అట్టి సహనం గలవారితో స్నేహం చేయుట ద్వారా మనలో కూడా ఆ సహనమనే లక్షణం నిలుస్తుంది.

1090. అతి చిన్న అనుమానం అతిపెద్ద పెనుభూతమై ఏ బంధానికైనా అడ్డుబండగా నిలుస్తుంది. సముద్రమంత ప్రేమను కూడా ఆ చిన్న అనుమానం ద్వేషంతో దూరం చేయు ప్రమాదానికి దారితీస్తుందని ఎరిగి ఆ చేదు అనుభవాన్ని తొలగించుకోవాలి. కొన్నిసార్లు మన తప్పులేకున్నా అపార్థాలకు గురై మాట పడవలసివస్తుంది. కొన్నిసార్లు అవమానం ఎదుర్కోవలసి వచ్చిన సందర్భాల్లో క్రీస్తు శ్రమలు అవమానాన్ని తలుస్తూ మౌనంగా భరిస్తే శత్రువులు మిత్రులగుట వల్ల ఒకరోజు వెదకుచూ మిమ్ము చేరి క్షమాపణ కోరగలరని నమ్మాలి.

1091. మనలను సృష్టించి, కాపాడు దేవుని స్మరించుట ఎన్నడూ మర్చిపోరాదు, జన్మనిచ్చిన కన్నవారిని మరువరాదు, విద్యనేర్పిన గురువును మరువరాదు, భర్త లేదా భార్య వచ్చాక కన్నవారిని మరువరాదు, స్థాయి హెచ్చయిన తర్వాత గతం మరిచిపోరాదు, అవసరము తీరాక సహాయపడిన వారిని మరువరాదు, మనకు మేలు చేసిన అనుభవాలందించిన ప్రతి వారిని గుర్తుంచుకొని దేవునికి కృతజ్ఞత తెలపాలి.

1092. ఊసరవెల్లి రంగులు మార్చుకొనే స్వభావం గలది. అట్లే మనషి అవసరాన్ని బట్టి మనస్సును, మాటను మార్చగలడని గమనించుకోవాలి. అహంకారులను ఎదిరించి దీనులను ఉన్నత స్థలాల్లో నిలబెట్టుదునన్న దేవుని మాటను నమ్మి గర్వము రానీయక దేవుని బలిష్టమైన చేతిక్రింద దీనమనస్సు, వినయము, సాత్వికమైన మనస్సుతో జీవిస్తూ ప్రభువు కోరిన ఆత్మ ఫలాలు మన జీవితంలో పండించాలి. ప్రేమ, సంతోషము, సమాధానం, మంచితనము మనలో నిలిచి ఉండేలా చూచుకోవాలి.

1093. ప్రసంగిలో తన భావాలు తెలిపిన సొలొమోను రాజు అనుభవంతో జీవితంలో అన్నీ వ్యర్థమన్నాడు. ఆకలితో ఉన్నప్పుడు దొరకని అన్నము, అలసిపోయినపుడు దొరకని నీడ, దుఃఖంలో రాని బంధువులు, కష్టంలో తోడుండని స్నేహాలు, చనిపోయాక తర్వాత చూపే ప్రేమ అన్నీ వ్యర్థమని ఒక జ్ఞాని తెలిపాడు. అందుకే బ్రతికిన రోజుల్లోనే అందరిని ప్రేమిస్తూ, సమయోచితంగా ఉప్పు వేసినట్లు రుచిగా సంభాషిస్తూ, అందరి ప్రేమను పొందుకొనే ఉత్తమ జీవితం జీవించాలి.

1094. క్రీస్తును పోలి నడుస్తూ, మంచితనంతో, మంచి మనస్సుతో ఆలోచిస్తూ జీవించాలి. ఎవరినీ తృణీకరించరాదు, బాధించరాదు. నేడు నీకు శక్తి సామర్థ్యాలుండవచ్చు కాలగమనంలో నీ శక్తి సమసిపోవచ్చు. అశాశ్వితమైన

ఈ లోకంలో శాశ్వతంగా ప్రేమించే దేవుని ఆనుకొని దేవుని చిత్తానుసారంగా జీవించుటకు నిర్ణయిస్తే నిత్యజీవము ఉచితంగా పొందుకొని సదాకాలము క్రీస్తుతో జీవించు భాగ్యం పొందగలము.

1095. నిజమైన ప్రేమంటే మనకోసమే కాదు, మన అనుకొనే వారికోసం బ్రతుకుటయే జీవితం. ప్రేమంటే డబ్బు, అందంకాదు నమ్మకము. ఐశ్వర్యమంటే డబ్బు సంపాదించడంకాదు ఇతరులనుండి ప్రేమాభిమానాలు సంపాదించు కొనుటయే. సంతృప్తి అంటే నచ్చినదానికై వెంటపడటంకాదుగాని ఉన్నదానితో ఆనందించడము. తృప్తి ఒక సంపద. సంతుష్టి సహితమైన దైవభక్తి లాభదాయకము.

1096. డబ్బు ఈ లోకంలో నన్ను సంపాదించి సుఖపడు అంటుందట. కాలమయితే, ఆగకుండా పరుగెత్తు అని బోధిస్తుందట. గమ్యం చేరమని లక్ష్యం తెలుపు తుందట. నమ్మకము మాత్రము నీ వెంటే ఉంటానని ధైర్యం చెబుతుందట. నమ్మిట నీవలనైతే నమ్మువానికి దేవునిలో సమస్తము సాధ్యము. అవిశ్వాసముతో కాక విశ్వాసంతో జీవిస్తే, విశ్వాసమే నీ విజయము అది నిజము.

1097. జీవితంలో నమ్మకముగాని ప్రేమగాని చాలా శ్రద్ధతో కాపాడుకోవాలి. అది పోగొట్టుకొనుటకు నిమిషము చాలు. మళ్ళీ సంపాదించాలంటే జీవితకాలము సరిపోదు. నమ్మకమే జీవితం. మాటలు చెప్పేవారుంటారు గాని, గెలవాలి, శ్రమించాలి, నినాదాలు జోరుగా చెప్తారు. పోరాడాలని హెచ్చరించేవారు కనీసం మనకు తోడుగా ఉండరు. క్రియలతో కూడిన విశ్వాసం కావాలి. దారి చూపమని అడిగితే ఆ దారిలో వెళ్ళు అనగలరు గాని వెంట ఉండి గమ్యం చేరే వరకు తోడుండరు. ఎవరినో నిందించక మనమే దగ్గరుండి దారి చూపి ఆదుకొని ఒక మైలు రమ్మంటే రెండు మైళ్ళు వెళ్ళే ప్రేమ చూపగలగాలి. అదే క్రీస్తు అనుచరుల కర్తవ్యమని గ్రహించాలి.

1098. ఎక్కువగా నమ్మటం, ఎక్కువగా ప్రేమించటం, ఎక్కువగా ఆశించడం, వీటివల్ల బాధ కూడా ఎక్కువగా వుంటుంది. దుఃఖితులను ఓదార్చి కన్నీరు తుడిచేవారుంటారు. కన్నీరు తుడుచుటకు చేయి చాలు. కానీ, కన్నీళ్ళ వెనుక మూలాన్ని గ్రహించుటకు మంచి మనస్సుండాలి. అలా గ్రహించేవారిని గమనించి వారిని ప్రేమతో కాపాడుకోవాలి. కొందరు కష్టాల్లో మంచి సలహానిచ్చి శ్రమలలో తోడుంటారు. అందరికన్నా క్రీస్తు మనకు ఆదరణ కర్తగా ఉంటాడు.

1099. మనసు మంచిదైతే, నోరు మంచిదవుతుంది. నోరు మంచిదైతే ఊరంతా బాగుంటుంది అంటారు. తప్పు ఎవరిదైనా తగ్గి బ్రతకడంలో ఆనందం దాగి ఉంటుంది. అది వెయ్యి మాటలతో సమానమంటారు. శరీరానికి మరణము ఒక్కసారే. పునరుత్థానంలో ఆత్మకు మరణము లేదు గాని తప్పు చేసి ప్రతి ఫలము ఎదుర్కొంటే మరణ వేదన తప్పదు.

1100. దేవుని దృష్టిలో మన నీతి కార్యాలన్నీ మురికిగుడ్డలతో సమానమని బైబిలు చెబుతుంది. అయితే మన దుస్తులు తప్పక మాసిపోతాయి, మన దేహంలో మనస్సు గాయపడడం తప్పదు. దుస్తులు ఉతికి శుభ్రపరచినట్లే మన మనస్సులో కల్మషాన్ని పశ్చాత్తాపం ద్వారా మన కన్నీటితోను క్రీస్తు కార్చిన రక్త ప్రభావంతో శుద్ధీకరిస్తే ఆనందంగా జీవించగలము.

1101. ప్రపంచాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదు కేవలము నిజానికే వుంది. నేను చెడ్డ వాడిని కాదు అని భ్రమపడరాదు. మంచిని చేయలేక పోతున్నానని చింతించాలి. ఆత్మల సంపాదన ఆస్థి సంపాదన కంటె విలువైన పని. శరీరానికి అను దినాహారము అవసరమైనట్లే ఆత్మకు ఆధ్యాత్మిక తలంపులు ఆహారము కావాలి.

1102. పాలల్లో ఒక్క మజ్జిగ చుక్క వేస్తే పెరుగవుతుంది, పెరుగు చిలికితే వెన్న వస్తుంది, వెన్న కాస్తే నెయ్యి వస్తుంది. గమనిస్తే ఒక్క రోజులో పాడయ్యే పాలలో ఎప్పుడూ పాడవని నేయి దాగి ఉన్నట్లే మన మనస్సు కూడా లెక్కలేనన్ని నిగూఢ శక్తులతో నిండి ఉంటుంది. మంచి ఆలోచనలతో నింపితే మనస్సుకు శాంతినిస్తూ, ధైర్యాన్ని నింపుతుంది.

1103. ఏదైనా మంచి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకోవడము సహజమే గాని మరచి పోకుండా ఉండుట గొప్ప. గుర్తుకురావడము మనస్సు పని, గుర్తుంచుకోవడము మెదడు పని. మనము ఉండవలసినది ఇతరుల మనస్సులో కాదు వారి హృదయాలలోనే. మనము నమ్మిన క్రీస్తు మనల్ని హృదయంలో దాచుకొని, అరచేతిలో చెక్కుకొని చూచుకొనునని నమ్మాలి.

1104. వ్యక్తిత్వం అంటే ఎప్పుడూ ఒకే రీతిగా జీవించుటకే కాదుగాని, నీ మాట తీరు, నీ ప్రవర్తన, ఆలోచన, నడవడి ఉత్తమంగా ఉండేలా జాగ్రత్తపడాలి. గెలుపంటే అందరినీ తొక్కిపట్టి పైకి ఎదుగుట కాదుగాని, అందరి మనస్సులను గెలుచుకోవాలి. బంధమంటే కలసి ఉండుట కాదుగాని, కష్టాలు, బాధలు నిరాశలలో తోడుండమే. ఈ భావాలు చాలా జాగ్రత్తగా ధ్యానించి ఆచరించాలి.

1105. ప్రేమ చాలా విలువైన అనుభవము. దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించాడు. ప్రేమలో సహనముంది. ప్రేమ ఉప్పొంగదు, అమర్యాదగా నడువదు. త్వరగా కోపపడదు. ప్రేమ దోషాలన్నీ కప్పివేస్తుంది. అట్టి ప్రేమంటే అందాన్ని ఆకర్షించడం కాదు మనసు లోతుల్ని ఇష్టపడుట. నిజమైన స్నేహమంటే చెట్టాపట్టాలు వేసుకొని తిరగడం కాదు, చికాకులు కలిగినప్పుడు నేనున్నానని అభయమివ్వడమే. వారసులంటే ఆస్తులను ప్రేమించేవారు కాదుగాని కుటుంబ విలువలను నిలబెట్టేవారు. ఈ భావాలు హృదయములో నిలుపుకోవాలి.

1106. మనం మాట్లాడే మాటలు రుచికరంగా ఉప్పు వేసినట్లుండాలి, సమ యోచితంగా పలకాలి. అనాలోచనగా మాటల్లో త్వరపడుట మంచిది కాదు. నరం లేని నాలుక అన్న మాటకు నరాలన్నిటికీ జీవము పోసే హృదయము తీవ్రంగా గాయపడుతుందని గుర్తుంచుకోవాలి. మనము నమ్మిన దేవుని ఆశ్రయిస్తే తనువు గాయాలు, మానసిక గాయాలు స్వస్థపరచు యెహోవా రాఫా అని నమ్మాలి.

1107. మనము సాగుచేసిన నేలలో విత్తనము నాటగా అది భూమిని చీల్చుకొని మొక్కగా ఎదిగే సమయంలో నిశ్శబ్దంగానే ఉంటుంది. కాని అది ఎదిగి వృక్షమైన తర్వాత తుఫానుల ధాటికి నేలపై కూలిన సమయాలలో గొప్ప శబ్దం చేస్తుంది. ఇది నేర్పించే పాఠమేమనగా ఎదగడంలో మాత్రం నిశ్శబ్దం పాటించాలి. పతనములో శబ్దముంటుంది. ప్రకృతి గాని జీవితంలో కష్టసుఖాలు గాని మనకెన్నో జీవిత పాఠాలు నేర్పిస్తాయి. నేర్చుకుంటూనే ఉండాలి. ఉత్తమ వ్యక్తిగా జీవించాలి.

1108. సమాజములో మార్పు ఎందుకు రాలేదని సరిగా ఆలోచిస్తే, పేదవారికి ధైర్యం లేక, మధ్యతరగతి వారికి సమయం లేక, ధనవంతులకు అవసరం లేక అని గ్రహించగలము. మన ప్రయత్నంలో మార్పు తేలేము. క్రీస్తును పోలి జీవిస్తూ సాగిపోతే మనమే నడిచే బైబిలుగా లోకం చదివే స్థితిలో ఉంటాము. మన ప్రసంగాలు వినేవారు తక్కువ. మన జీవిత వైఖరి, మన క్రియాత్మకమైన క్రైస్తవ విలువల్ని గమనించే లోకం దృష్టిలో నమ్మకం కలిగించాలి.

1109. ఆత్మీయ జీవితంలో అభివృద్ధి లేక సహజ జీవితంలో పరిణతి అనగా మెచ్యూరిటి. భావ వ్యక్తీకరణలో, ఆలోచనా విధానములో, ఇచ్చిపుచ్చుకొనే పరిస్థితుల్లో, గౌరవంలో, మన ప్రవర్తనలో మార్పు ఇవే దేవుడు సమాజము సదా కోరుకొనేవి. మారుమనస్సు అనుభవంలో నూతన మనస్సులో కొంత గమనించగలము. దేవుడే ఆ గొప్ప మార్పునిచ్చి కృప ద్వారా నడిపించగలడు.

1110. జీవితంలో వ్యక్తుల మాటల్లో కొన్ని విభిన్న భావాలు గమనించవచ్చు. ప్రేమతో ఉన్నవారు చనువుగా మాట్లాడగలరు. మంచివారు మార్పుకై మాట్లాడతారు, అసూయతో ఉన్నవారు చులకనగా మాట్లాడతారు, నవ్వుతూ ఉన్నవారు నాలుగు రకాలుగా మాట్లాడగలరు. కాని జ్ఞానము గలవారు మౌనంగా ఆలోచించి మాట్లాడగలరు. నిజానికి మాట మనిషిని మార్చగలదు. మౌనము మనస్సును మారుస్తుంది. సమయోచితంగా పలుకబడిన మాట వెండిపళ్ళెంలో నుంచిన బంగారుపళ్ళెం వంటిది.

1111. మన మాటల్లో జాగ్రత్త అవసరం, కోపంతో సమాధానం చెప్పరాదు. సంతోషంలో వాగ్దానాలు త్వరపడి చేయరాదు, ఒత్తిడి సమయంలో నిర్ణయాలు తీసుకోరాదు. ఏ చోటైనా, ఎప్పుడైనా అబద్ధం చెప్పరాదు. అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయము. సత్యవర్తనులు దేవునికి ఇష్టమైనవారు.

1112. ఏ బంధమైనా కలుపుకొనుటలో కాదు, నిలుపుకొనుటపై ఆధారపడి ఉంటుంది. శరీరానికి అలసట తప్పక కలుగుతుంది. దేహానికి విశ్రాంతిని ఇచ్చినట్లే, మనస్సుకు విశ్రాంతిని ఇచ్చేది, ఊరట నిచ్చే సాత్వికముతో కూడిన చల్లని మాట. ఆప్యాయత, ఆదరణతోనిచ్చే మాటలు మనస్సుకు హాయిని చేకూర్చి సేదతీర్చగలవు.

1113. పేదరికంలో నుండగా నిజాయితీగా ఉండాలి. సంపద దరిచేరగా సామాన్యంగా ఉండాలి. అధికారం చేతికివస్తే వినయంగా ఉండాలి. కోపంలో ఉన్నప్పుడు మౌనంగా ఉండాలి. మనమున్నా లేకున్నా కాలము ఆగదు. మనమున్నప్పుడు మంచిని బ్రతికించాలి. మనం లేకపోయినా మనలను గుర్తుంచుకొనే రీతిగా మంచి మాదిరి మిగిల్చేలాగ జీవించాలి.

1114. గొప్పగా సంపాదన ఆర్జించినవారుగాని, గొప్ప హోదాలో దర్జాగా కనిపించేవారు గొప్పవారు కారు. మాటలవల్లగాని, క్రియల వల్లగాని ఎవరినీ నొప్పించక, చులకనగా చూడక అందరి మన్నన, ప్రేమ పొందగలవారే గొప్పవారు. గనుక ఆ విధమైన గొప్ప మనస్తత్వంతో జీవిద్దాము.

1115. నీ చెంత దేవుడు ఎల్లప్పుడూ వుంటాడు గనుక వర్థిల్లు. ఇతరులను చూచి వ్యసన పడరాదు. ఎవరికి దేవుడు ఎంత ఇస్తే, ఏ తలాంతునిస్తే దానిలో నమ్మకంగా కృషి చేయాలని కోరుకుంటాడు. మన కృషికి ఫలితం దేవుడు ఇస్తాడు.

1116. మన మాటల్ని వక్రంగా తీసికొని అల్లరి చేసేవారుంటారు. మన మౌనాన్ని గమనిస్తూ మన కన్నీటిని గుర్తించేవారు మనవారు. ఆత్మీయులు, ఆధ్యాత్మికత గలిగి దేవుని ప్రేమ గలవారే మనవారని నమ్మాలి.

1117. వంద వంకర మాటలకన్నా సూటిగా మాట్లాడే ఒక్క మాట మిన్న. అది మన వ్యక్తిత్వాన్ని పెంచగలదు. విస్తారమైన మాటల్లో దోషముండకపోదు. మంచి మాట బంగారు పండ్లు గల వెండి పళ్ళెం వంటిదంటారు.

1118. ఒక చెడ్డ గుణము వంద సమస్యలకు కారణం కాగలదు గానీ, ఒక మంచి గుణం వంద సమస్యలను పరిష్కరించగలదు. మంచితనము దేవుడు కోరుకున్న తొమ్మిది ఆత్మ ఫలాలలో ఒకటి. గనుక ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, ఆశానిగ్రహము, సాత్వికము. ముఖ్యమైనది ప్రేమ, విశ్వాసముతో కూడిన మంచితనం.

1119. అన్నీ నాకే తెలుసు అని తలంచటం కేవలము మూర్ఖత్వము. నీకు తెలిసినా ఎదుటివారిని గౌరవిస్తూ వారు చెప్పింది విని మౌనంగా వినడం సంస్కారం. పెద్దలను గౌరవించడం, పేదలను ప్రేమించి సహాయపడడం కూడా సంస్కారమే.

1120. నీ నడక నలుగురికి బాటవ్వాలి, నీ మాట మంచిదవ్వాలి, నీ చేయి పదిమందికి సాయపడాలి, అన్ని పనులు బాధ్యతగా నిర్వహిస్తూ నీవెన్నడూ గర్వానికి చోటివ్వరాదు. దేవుడు అహంకారులను ఎదిరించి దీనులను పైకి లేవనెత్తువాడు.

1121. గొప్పతనము అంటే ఏదో సాధించడము సంపాదించడం కాదు. మన చేతల వల్ల గాని, మన మాటల వల్ల గాని, ఎవరికీ బాధ కల్గించకుండా, ఉండుట చాలా గొప్పతనము.

1122. మనం కష్టపడి సాధించుకున్న ఇష్టమైనదాన్ని వదులుకోలేము. అది డబ్బయినా, మనిషైనా కావచ్చు. సముద్రం ఒడ్డున వచ్చే తాత్కాలిక అలల వలె కాకుండా సముద్రమంత లోతుగా ఆలోచిస్తే కష్టాల కడలి పొంగుకు పరిష్కారం కనుచూపు మేర కనిపిస్తుంది. దైవచిత్తంలో సముద్రమెంత లోతైనదో, ఆకాశమెంత ఎత్తయినదో మన దేవుని ప్రేమ అంత గొప్పదని నమ్మాలి.

1123. మనం చేసే కృషిలోగాని ప్రయత్నంలోగాని కోరిన విజయం సాధించలేక పోవచ్చు. కాని మన ఆంతర్య భావాల్ని చేసే ప్రయత్నాన్ని నిర్మల హృదయాన్ని గుర్తించే దేవుడు తప్పక ప్రతిఫలమిస్తాడు.

1124. వాదించాలంటే జ్ఞానులతో వాదించాలి. కొంతైనా జ్ఞానార్జన పొందగలము. మూర్ఖులతో వాదిస్తే వున్న విజ్ఞత కోల్పోతాము. సజ్జన సాంగత్యము మంచి నడవడినిస్తుంది. అవిశ్వాసులలో విజ్ఞోడుగా నుండరాదు. పైవారితో గౌరవంగా సాటివారితో స్నేహంగా ఉంటే సరిపోదుగాని, మనకన్నా తక్కువ స్థాయిలో ఉన్నవారితో మెలిగే తీరు మన అసలైన మనస్సు, సంస్కారము, వ్యక్తిత్వము స్పష్టంగా బయటపడుతుంది.

1125. మీరు తృప్తిగా, ఆనందంగా జీవిస్తున్నారు అంటే మీకు సమస్యలేమీ లేవని కాదు గాని దైవప్రీతి, సంఘనీతి, పాపభీతి గలవారిగా ధైర్యంగా అన్ని కష్టాలు, సమస్యలను ఎదుర్కొని ఛేదించే దృక్పథాన్ని కలిగి ఉన్నారని అర్థం. దేవుని చిత్తంలో ఆధారపడిన వారెవరైనా జీవితంలో మెళుకువలను అందుకోగలరు.

1126. ఒక మంచి పుస్తకము వందమంది మిత్రులకు సమానము. కాని ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయముతో సమానము. బైబిలు గ్రంథము దిక్సూచి వలె జీవితంలో మార్గాన్ని చూపగలదు. దుఃఖితులను ఓదార్చి అభయము ఇవ్వగలదు. అనుదినాహారంగా జీవవాక్కులతో ఆత్మను పోషించగలదు. నిత్యజీవ వారసులుగా పరమునకు చేర్చేది ఈ గ్రంథమే. తగిలిన దెబ్బనైనా మరిచిపోవచ్చుగాని జీవితంలో పొందిన మేలును మాత్రం ఎప్పటికీ మర్చి పోకూడదు. బాధ అనేది లేకపోతే నవ్వుకి విలువుండదు. కోపం అనేది లేకపోతే ప్రేమకు విలువుండదు.

1127. మనము సంపాదించిన ఆస్తిని ఏడు తరాల వరకు అందించాలని అహర్నిశలు శ్రమించేవారున్నారు. అలా ఇవ్వకపోయినా పేద స్థితిలోనున్నవారైనా సద్గుణాలు, మంచి దైవభక్తి గల జీవితానుభవాలు జీవిత ఉత్తమ విలువలన్నీ ఒక్క తరానికి అందించినా అది చాలా ఉన్నతమైన పని.

1128. డబ్బుపోతే పర్వాలేదు సంపాదించగలము. ఆరోగ్యంకోల్పోతే తిరిగి పొంద లేము. నైతిక విలువలు, విచక్షణా జ్ఞానము దైవిక జ్ఞానావగాహనలు కోల్పోతే చాలా నష్టపోతాము.

1129. కొన్నిసార్లు మన తప్పులేకున్నా, మనల్ని బాధపెట్టినవారు ఎదురైనా ప్రతికారము తీర్చుకోరాదు. తీర్పు తీర్చు దేవుడు తగిన కాలములో వారికి శిక్షతో పాటు గ్రహింపునిస్తాడని నమ్మాలి. కనిపెట్టి తగిన కాలము కోసం వేచి ఉండాలి.

1130. మనకు ఎప్పుడు ఏది కావాలో మనల్ని సృష్టించిన సృష్టికర్తకి తెలుసు. దేవుడు ముందే అన్నీ నిర్ణయించే ఉంటాడు. మనము కోరింది లభించలేదని దేవుని

ఏనాడు నిందించరాదు. ఒకటి దక్కలేదంటే అంతకంటే మంచిది నీకు దాచియుంచి సంతోషపెట్టగలడు. అడుగు వాటికంటే, ఊహించు వాటికంటే అధికముగా యిచ్చువాడు మన రక్షకుడైన యేసుక్రీస్తేనని నమ్మాలి.

1131. బురద నీటిలో స్నానం చేయలేము. చెడ్డవారితో చెలిమిచేస్తే గౌరవం పొందలేము. కేవలము మన శ్రేయస్సు కోరేవారితో మాత్రమే స్నేహం కొనసాగిస్తూ కీడు చేయువారికి దూరంగా ఉండాలి.

1132. విలువ కోసం విలువలేనిచోట ప్రయత్నించడం ఉన్న విలువను వదులుకొనుట అని గ్రహించాలి. ఎవరైనా తగ్గించుకున్నారని గమనిస్తే వారు బంధాలకు విలువనిచ్చేవారని తెలుసుకోవాలి. ఎవరైనా దూరంగా ఉంటే మర్చిపోతారు అని తలుస్తూ ఉంటారు. దూరం ఎక్కువైతే ప్రేమ పెరిగిపోతుంది. దూరంగా ఉంటే దగ్గరగా ఉన్నవారి విలువ తెలుస్తుంది. శిష్యులు దగ్గరగా క్రీస్తును చేరి ప్రేమతో హతసాక్షులగుటకు ఇష్టపడ్డారు.

1133. విలువలు లేని ప్రేమ చక్కెరలేని కాఫీ వంటిది. ఎంత త్రాగినా తృప్తి ఉండదు. జీవితంలో కష్టాలు ఎదురయ్యాయంటే ఏదో దేవుడు విలువైన పాఠాలు నేర్పుతారని నమ్మాలి. తిరిగి ఓర్పుతో ప్రయత్నిస్తే ఖచ్చితంగా విజేత కాగలవు.

1134. మంచి పనికి మించిన ఆరాధన లేదు, మానవత్వానికి మించిన సంపద లేదు. మనిషికి మరణం ఉంటుంది గాని మానవత్వానికి మరణంలేదు.

1135. ప్రపంచంలో విలువైనది దేవుని అనుగ్రహం పొందుటకు దేవుని సంపూర్ణ చిత్తము చేయడం. దేవుని ప్రేమ పొందుచూ, నమ్మిన విశ్వాసులతో దేవుని మందిరంలో ఆరాధిస్తున్న అనుభవం చాలని దావీదు సదా కోరినట్లు దైవవాక్యాన్ని సదా ధ్యానించినవాడే ధన్యుడు.

1136. కాకులతో కలిసి తిరిగిన పావురమునకు రంగు మారదుగాని, బుద్ధి మారవచ్చు. మనము స్నేహం చేసేవారు కాకులా? పావురాలా? అని ఆలోచించాలి. గమ్యం అనేది ఒక అవకాశంకాదు, అది ఎన్నుకోవలసిన లక్ష్యం. అది ఎదురు చూడవలసిన వస్తువు కాదు, కృషితో సాధించాలి.

1137. కోటీశ్వరులు కావడము అందరికీ సాధ్యముకాదు గాని, నిజాయితీపరులుగా, ఉత్తమ వ్యక్తులుగా మంచి ఆదర్శాలతో జీవిస్తూ కుటుంబాన్ని సంరక్షిస్తూ, మంచి విలువలు సంతానానికిచ్చి సమాజంలో ఉత్తములుగా, అందరూ

ప్రశంసించే స్థాయికి చేర్చువారే ఉత్తములు. స్వంత శక్తితో చేయలేరు. అసాధ్యాలు సుసాధ్యాలు చేయు దైవశక్తిని ఆశ్రయించి దైవభక్తితో సాధన చేసి సాధించగలరు. వారే విశ్వాసులు.

1138. పరిశుద్ధ గ్రంథములో ప్రతి పదము కూడా దైవావేశంతో దేవుని నుండి స్ఫూర్తిపొందిన వ్యక్తుల పుస్తకాల సముదాయము. చదివిన ప్రతి అక్షరము ఏదో ఒకచోట ఉపయోగపడుతుంది. అదే రీతిగా మంచి పనులు కూడా ఏదో రీతిగా దేవుడు గుర్తుంచుకొని తగిన రీతిగా ప్రతిఫలం తప్పక ఇస్తారు.

1139. మనకు తెలిసిన వారెందరినో జీవితంలో ఎదుర్కొంటాము. కాని మనస్సున మనసై మన గుండెలోతుల్లో బాధను, వ్యధను గ్రహించి ఊరటనందించే కొందరైనా ఆత్మీయులు కావాలి. అందరిని మించి ఒంటరితనంలో కూడా మనం నమ్మిన దేవుడు పలు భయములు బలంగా ఆవరించిన వేళలో నిను విడువని ఎడబాయనని వాగ్దానమిచ్చాడు.

1140. బ్రతకాలంటే ధైర్య ఉండాలి. బాగుపడాలంటే పద్ధతుండాలి. దేవునియందలి భయభక్తులు బహు ధైర్యము పుట్టిస్తుందని బైబిలు చెబుతుంది. ఆహారము కరువైతే శరీరము బలహీనమవుతుంది. ఆత్మీయ జీవితానికి జీవాహారమైన వాక్యము కరువైతే ప్రార్ధనలో బలహీనమవుతాము. ఆత్మను ఆర్పరాదు. పరిశుద్ధాత్మ అనే నూనెలో ఆత్మదీపము మన హృదయాల్లో నిండుగా వెలగాలి. వాక్య ధ్యానం హృదయంలో మంట కలగించాలి. ఉజ్జీవంగా, ఉత్తేజంగా జీవించాలి.

1141. జీవితంలో ఎప్పుడూ సాహసోపేతంగా ఉండాలి. గెలిస్తే ఒక లీడరువు కాగలవు. ఓడితే నీ అనుభవాలు ఇతరులకు మార్గంచూపుతాయి. బ్రతకాలంటే ధైర్యం ఉండాలి. బాగుపడాలంటే నిర్ధిష్ట ప్రణాళికతో పద్ధతులను అనుసరించాలి. అస్థిర స్థితిగతులకతీతంగా మన ఆలోచనలు ఉన్నతంగా ఉండాలి. క్రీస్తు పాదాల దగ్గర నిలిచి క్రీస్తు మధుర వాక్కులు గుండెల్లో భద్రపరచువాలి.

1142. స్టీవ్‌జాబ్స్ అనే వ్యక్తి కొన్ని వందల కోట్ల డాలర్లుకు అధిపతి. 56 సంవత్సరాల వయస్సులో క్లోమ గ్రంధి క్యాన్సర్ వ్యాధితో మరణించక ముందు తన సాక్ష్యాన్ని వివరించాడు. **"అందరి దృష్టిలో నా జీవితం విజయానికి చిహ్నం. నా జీవితానికి అలవాటైనది పని, సంపాదన. మరణము ముందు నా సంపాదన,**

**పేరు ప్రఖ్యాతలు కొరగానివేనని చెప్పగలను. డబ్బుతో ఇహలోక సుఖాల్ని పొందగలము. ఆరోగ్యం పొందలేము. అందుకే మంచిగా జీవిస్తూ అందరినీ సంతోషపెట్టాలి".**

1143. 30 డాలర్ల గడియారమైనా, 300 డాలర్ల గడియారమైనా ఒకే సమయాన్ని చూపిస్తుంది. 30అయినా, 300అయినా సమయంలో తేడా ఏమీ ఉండదు. అలాగే ఎంత విలువైన కార్లయినా ప్రయాణించే దూరం, బాట ఒక్కటే. ఒకే గమ్యానికి చేరగలము. ఇల్లు 300 గజాలైనా, 3000 గజాలైనా ఒంటరితనం నీదే కాగలదు. మనలో సంతోషము బాహ్య ప్రపంచ వస్తువులతోరాదు. మాట్లాడి, ప్రేమించే బంధువులు, స్నేహితులుంటే అదే నిజమైన సంతోషము.

1144. మన పిల్లలకు ధనవంతులయ్యే కాంక్షకన్నా ఆనందమే ముఖ్యమని నేర్పాలి. వస్తువుల ధరకంటే వాటి విలువ గ్రహించాలి. ఆహారాన్ని ఔషధంగా వాడాలి లేకపోతే ఔషధమే ఆహారమవుతుంది. వెలుతురు, ఆహారము, విశ్రాంతి, వ్యాయామము, స్నేహితులు, నీపైన నీకు విశ్వాసం, భక్తి గుర్తుంచుకో.

1145. ఎప్పటికైనా మన స్థాయిని నిర్ణయించేది మన సత్ప్రవర్తన మాత్రమే గాని ఇతరుల పొగడ్త కాదు. మంచి బంధాలు, ధనము దేవుని అనుగ్రహముంటే అవే మన దగ్గరకు చేరగలవు. దేవుడే హృదయ వాంఛలు తీర్చు సమర్థుడు. సర్వశక్తిమంతుడి అండ వుంటే కొదువే ఉండదు.

1146. అన్నీ కోల్పోయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరాదు. అది ఉంటే దేవుని కృపలో పోగొట్టుకున్నవన్నీ పొందవచ్చు. పిరికి మాటలు మాట్లాడరాదు. మన అభివృద్ధికి అట్టి మాటలు వినుటం కూడా ఆటంకమని జాగ్రత్తగా మాట్లాడాలి. పిరికివారికి పరలోకము ఉండదు. నీ కట్టడలు నేర్చుకొనుటకు శ్రమనొందుట మేలాయెనని గొప్ప చక్రవర్తి అయిన దావీదు చెప్పినట్లు, ప్రతి బాధ కూడా ఒక గుణపాఠం నేర్పుతుంది. ప్రతి గుణపాఠం మనం మారేందుకు బంగారు బాట కాగలదు.

1147. "సోమరీ చీమలను చూచి నేర్చుకో" అని సొలొమోను సామెతల గ్రంథంలో తెలిపాడు. క్రమము, ఐక్యత, ముందు జాగ్రత్త అనే పాఠాలను నేర్పగలవు. భూమి అందరినీ భరిస్తున్న ఓర్పు చూచి నేర్చుకోవాలంటారు. చెట్టు మౌనంగా ఎదిగే నేర్పు నేర్చుకోవాలి. గురువుని చూచి సుగుణాలు, జ్ఞానం నేర్చుకోవాలి. కోపంలో మనిషి అసలు వ్యక్తిత్వం బయటపడుతుంది. కోపంలో హృదయాంత

రంగములో ఉన్న నిజమైన భావాలన్నీ బయల్పడతాయి. ఏదైనా ప్రయత్న లోపం చేయరాదు. ఆ ప్రయత్నం చిన్నదైనా ఉన్నత స్థానాన్ని ఇస్తుంది. కోపపడుడిగాని పాపం చేయకుడని బైబిలు తెలుపుతుంది.

1148. ఇహలోక బాధ్యతలు, చిరు ఆర్థిక సహాయాలు ఇతరుల నుండి పొందగలము. గాని నీ గుండెల్లో దాగిన మానసిక గాయాలు, చేసిన బాధలను పంచుకొనుటకు ఎవరూ దొరకరు. ఆ భారం కన్నీటిద్వారా దేవుని దగ్గర మొఱ్ఱపెట్టినప్పుడు ఆయన ప్రార్థనలు ఆలకించువాడు గనుక ప్రతి ప్రార్థనను ఆలకించి ప్రతిఫలము ఇచ్చువాడు. జీవితమనేది నడిచే దారిలాంటిది. మనకు తోడుగా నడిచే వారుంటారు గాని మనకు బదులుగా నడిచేవారుండరు. ఈ ఒంటరి ప్రయాణంలో నిజమైన తోడు క్రీస్తే.

1149. సమయాన్ని సద్వినియోగం చేసుకొనేవారికి ఎప్పుడు దైవధ్యానం చేయాలో, పనులెట్లు చేయాలో సరిగ్గా ప్రణాళికతో ఉంటారు. గనుక మంచి అలవాట్లు, మంచి సాక్ష్య జీవితం, మంచి గౌరవము అవే వస్తాయి. నీవల్ల ఒకరు బాధపడి కన్నీరు కారిస్తే అది పాపమే గాని, నీ కోసం, నీ మంచికోసం నీ బాధలో భాగంగా నీతోపాటు కన్నీరు కారిస్తే అది ప్రేమ. అది దేవుడందించే ప్రేమ. దేవుడు అనుమతించిన ప్రేమ అమూల్యము.

1150. సంతోషంలో అందరూ తోడుంటారు దుఃఖంలో, నిరాశలో, బాధల్లో ఎవరూ తోడురారు. మనలను సృష్టించి కనుపాపలాగా కాపాడుకొనే దేవుడు సదా కాలము మీతో ఉంటానన్నాడు. ప్రయాసపడి భారము మోసేవారంతా నా దగ్గరకు రండి, విశ్రాంతి, శాంతి, నెమ్మది నా నుండి పొందండన్న క్రీస్తు మాటలు శ్రద్ధగా పాటించాలి.

1151. జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగే వరకు విమర్శలకు చెవులు మూసుకోవాలి. ఎదిగిన తర్వాత తగ్గింపులో ఒదిగి వుంటూ నోరు మూసుకోవాలి. మంచి విషయాలన్నీ వినటానికి చెవి తెరవాలి. చెవిగలవాడు వినునుగాక.

1152. ఈ లోకంలో ఆకర్షించేవి శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము. ఆ తర్వాత ఆకర్షించేవి అజ్ఞానము, మోహము. ఇవన్నీ జయించగలిగితే జ్ఞానోదయమై క్రీస్తు అనుచరుడిగా స్థిరపడి నిత్యత్వం చేరగలవు. మనలో గర్వాన్ని వదలి అందరినీ గౌరవించుట ఆరంభిస్తే మన గౌరవం పెరుగుతుంది.

1153. ఏదైనా మంచి పని చేయడానికి సంకల్పము చాలు. చెడ్డపని చేయడానికి తోడు కావాలంటారు. అనుభవంతో నేర్పే గుణపాఠాలు నేర్చుకొనక, నిర్లక్ష్యంగా

ఉంటేనే ఓడిపోగలము. తప్పులు చేస్తాము. విజయం విలువ తెలియాలంటే కష్టాల దారి దాటవలసిందే, లేదా ఒక్కసారైనా అపజయం రుచి చూడాల్సి వస్తుంది. ఎన్ని పొరపాట్లు చేసినా దేవుని చెంత చేరి కన్నీటితో పశ్చాత్తాపపడితే క్షమిస్తాడు.

1154. కష్టాల్లో ఉన్నప్పుడు మనల్ని ఆదుకొని ఒడ్డుకు చేర్చేవారిని ప్రేమించాలి. వారి విలువలను సంపాదించాలి. వారే తగిన ధైర్యాన్నిచ్చి, వెన్నుతట్టి ఆదుకొంటారు. అందరిని మించి దేవుని ఆశ్రయిస్తే చేయిపట్టి నడిపిస్తాడు. భయపడకుడి అని అభయమిస్తాడు.

1155. సంఘ ఐక్యతకు పాటు పడాలి కలహాలకు దూరంగా ఉండాలి. నేడు సిలువను మోస్తే ఆతర్వాత జీవ కిరీటము మోస్తావు.

నీటిలో రాయిలా కాదు గాని నీటి ఓరన నాటబడిన చెట్టులాగా వుండాలి. దేవుడు పని చేసే వారితోనే పని చేస్తాడు. సాగిపోవు వారితో సాగిపోతాడు. సోమరి వారిని యిష్టపడడు.

1156. మన శరీరాలు సజీవ యాగముగా సమర్పించు విధమేమనగా స్వార్ధంగా స్వచిత్తములో జీవించక దేవుని చిత్తం పూర్తిగా నెరవేర్చాలి. త్యాగ సహిత జీవితాలు జీవించాలి. ఇతరుల జీవితాన్ని మనమే దీపంగా వెలిగించాలి. మనకు దేవుడిచ్చిన అవగాహనతో సమయాన్ని సరిగా సద్వినియోగం చేసికోవాలి.

1157. మనము ఆశించిన ప్రగతి సాధించడంలోనే ఆనందం దాగి ఉంటుందని భ్రమ వద్దు. మనం ఆనందంగా ఉంటేనే అన్నీ సాధించగలము. పౌలు జైలులో శ్రమల మధ్యన ఉంటూ వ్రాసిన ఫిలిప్పీ పత్రికలో ప్రభువు నందు ఆనందించుడి, మరల చెబుతున్నాను ఆనందంలో ఉండండి అన్నాడు.

1158. భయము, అభద్రతా భావాలు సాతాను కల్పించే బలహీనతలు, వాటికి దూరంగా ఉండాలంటే దైవవాక్య ధ్యానము భయాలను పారద్రోలగలదు. భయములు చుట్టుకొనగా దేవుడిచ్చిన అభయ వాక్కులు జ్ఞాపకము చేసుకోవాలి. నిన్ను విడువను, ఎడబాయను అన్న వాగ్దానము చేపట్టాలి. మనలను కాపాడు దేవుడు మనకు అండ, కొండగా ఉంటాడు. కునుకక కాపాడువాడు.

1159. నన్ను బలపరచువానియందే నేను సమస్తము చేయగలను అని బైబిలునందు వ్రాయబడింది. సమస్తము అంటే చిన్నవి, పెద్దవి అనే తేడాలేదు అన్నీ. ఏదైనా

క్రీస్తు అందించే స్ఫూర్తితో జ్ఞానంతో శక్తితో చేయగలము. సదా నమ్మాలి. నావల్ల కాదని నిరాశకు గురికారాదు. అన్ని అవకాశాలు మౌనంగా తలుపు తట్టినపుడే తీయాలి. అవి సరిగా ఉపయోగించుటలో శ్రద్ధకావాలి.

1160. జీవితంలో బంధాలన్నీ తగిన దూరములోనే ఉంచుకోవాలి. పుస్తకాన్ని కళ్ళకు ముందుగా అతి సమీపంలో ఉంచితే ఏమీ కనిపించదు. కాస్త ఎడంగా, తగిన దూరంలో వుంచినచో సరిగ్గా చూడగలము కదా! అతి స్నేహం, అతి ప్రేమ, అతి చనువు మనశ్శాంతికి హానికరము. అతిగా అనుబంధం పెంచుకుంటే అదే స్థాయిలో బాధను కూడా భరించాలి. ఇస్కరియోతు యూదాని క్రీస్తు ప్రేమించలేదా? అయితే ఎంత ద్రోహిగా మారాడో గ్రహించగలుగుతున్నాము.

1161. ఒత్తిడి లేని ఉద్యోగం లేదు, నష్టం లేని వ్యాపారం లేదు. కష్టం లేని వ్యవసాయం లేదు, బాధలు లేని సంసారం లేదు. కాని దేవుని ఆశ్రయించిన వారికి ఏ చింత దిగులు లేదు. తల్లిదండ్రులనిచ్చిన దేవుడు ఆయన అందించే స్వకీయులంతా అందమైన అనుబంధము, అంతులేని ఆదరణనిస్తారు. మరపులేని విలువైన జ్ఞాపకాలనిస్తారు. అందరి యెడల కృతజ్ఞత చూపాలి. దేవుని యెడల కృతజ్ఞత చూపాలి. దేవునికి కృతజ్ఞత చెల్లించుట మరువరాదు.

1162. జీవితమంటే ఒక సమస్యలోనుండి మరొక సమస్యలోకి ప్రయాణించడమే ఏ సమస్యలు లేని జీవితం ఉండదు. ప్రతి సమస్యకు పరిష్కారము మనలను సృష్టించిన దేవుని అధీనంలో ఉంటుంది. ఎటువంటి సమస్యలైనా, శ్రమయైనా క్రీస్తు ప్రేమ నుండి ఎడబాపనేరదని నమ్మాలి. ప్రయాసపడి భారము మోసే సమస్త ప్రజలను రమ్మని ఆహ్వానించే దేవుని చేరి విశ్రాంతి పొందాలి. మన ముఖాలు చూడకపోయినా మన గొంతు వినకపోయినా, మన గుణం తెలియకపోయినా మనలను ప్రేమించే కన్నతల్లులు విలువ కట్టలేని వారు కావచ్చు, కాని తల్లిలాగా ప్రేమిస్తాను, తండ్రిలాగా లాలిస్తాననియు, కన్నతల్లి మరచినా నిన్ను మరువనని వాగ్దానం చేసిన దేవుని సదా ఆశ్రయించి సేవించాలి.

1163. అకారణంగా వచ్చే కోపం, బాధ్యతలేని యవ్వనం, గౌరవము లేని బంధం, అలంకరణతో వచ్చే అందం శాశ్వతంకావు. శాశ్వతమైన క్రీస్తు అభయము, ప్రేమ అనంత విలువైనది. దానినే కాంక్షించి, ఆశ్రయించి, క్రీస్తు స్వభావ లక్షణాలన్నీ రూపాంతర అనుభవంగా మనలో నిలిచి ఉంచాలి. ఆత్మఫలాలు ఆచరించి క్రీస్తు శిష్యులుగా జీవించాలి.

1164. విమర్శలన్నింటిలోనికి ఉత్తమమైనది ఆత్మ విమర్శ. మంచి అందంతో ఉండడం కన్నా మంచి మనస్సున్నవారితో ఆనందంగా గడుపుట తృప్తినిస్తుంది. జీవితంలో ఆశలు, ఇష్టాలు, అవసరాలు వస్తూ ఉంటాయి గాని, ఆశావాదంతో జీవించుట మనిషిని బ్రతికిస్తుంది. ఇష్టత మనిషికి సహాయం చేయాలని నేర్పుతుంది. అవసరత మనిషికి ఎన్నో అనుభవాలు నేర్పిస్తుంది. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ ఇవి జీవితంలో చాలా ముఖ్యమని బైబిలు బోధిస్తుంది. వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమ. దేవుని పూర్ణ హృదయంతో ప్రేమించుట, నిన్నువలెనే నీ పొరుగువానిని ప్రేమించమన్న విలువైన బైబిలులో చెప్పబడిన ఆజ్ఞలు పాటించాలి.

1165. విశ్వాసిగా జీవిస్తూ కారణం లేని కోపంలో లీనం కారాదు. మనకు ఎదురైన వ్యక్తులతో ప్రేమ కనబరచాలి, బాధ్యత కలిగి ఉండాలి. అప్పుడే క్రీస్తు అనుచరులం కాగలము. మనకు ఎదురయ్యే వ్యక్తులను, మనతో జీవించే వ్యక్తులను కొందరిని గుర్తుంచుకోగలము కాని కొందరు మన గుండెల్లో నిలిచిపోతారు. అట్టివారు కష్టాల్లో, సుఖాల్లో, ఆందోళనలో, బాధల్లో మనకు సదా తోడుంటారు. ఎవరైనా కొన్నిసార్లు అందుబాటులో లేకపోయినపుడు మన ప్రభువు మాటల్లో సదాకాలము మీతో ఉంటాను. కుడిచేయి పట్టుకొను చున్నాను భయపడకు, దిగులుపడకు అన్న యెషయా గ్రంథంలోని వాగ్ధానాలు నమ్మాలి.

1166. ప్రతి వ్యక్తి జీవిత గమనంలో దేనికో అన్వేషిస్తూనే ఉంటాడు. కాలము ఆగదు. మనస్సు లోకాశలను ఆకర్షిస్తూనే ఉంటుంది. అతి జాగ్రత్తలతో నేత్రాశ, శరీరాశ జీవపు డంబము ద్వారా క్రీస్తునే సాతాను శోధించగా, మనము త్వరగా తప్పిపోవు సందర్భంలో యేసును ఆశ్రయిస్తూ ప్రార్థించాలి. రూపంకన్నా రూపాయిలకన్నా దేవుని సన్నిధి గొప్పది. లక్షలకన్నా లక్షణం గొప్పది. కోట్ల కన్నా దేవుని నమ్మి ఆయన ఇచ్చే ఆశీర్వాదం గొప్పది, ఐశ్వర్యం పొందిన యాకోబు చెప్పిన సత్యం నమ్మాలి.

1167. బైబిలు గ్రంథంలో విలువైన పత్రికలు వ్రాసిన పౌలు చెప్పినదేమనగా, ఏది సంభవించినా దేవుని చిత్తంలో సమకూడి జరుగునని నమ్మాలి. ప్రతి అనుభవం క్రీస్తు అధీనంలో ఉంటుంది. జరిగింది మన మంచికే, జరుగుతున్నది మన మంచికే అని ఆ రీతిగా ధనాత్మక ఆలోచనతో, ఆశావాదంతో జీవితాన్ని కొనసాగించాలి.

1168. మన జీవితంలో గమనించదగిన 3 విషయాలు-సమయము, ఆరోగ్యము, బంధము. వీటిపై ధర వ్రాసి ఉండదు. అజాగ్రత్తగా ఉండి ఈ మూడు పోగొట్టుకున్నప్పుడే వాటి విలువ తెలుస్తుంది.

1169. మనం జీవించే జీవితం ఒక పాఠశాల ఒక్కొక్క తరగతిలో ఒక్కొక్క జ్ఞానం పొందుకోగలము. ప్రతిరోజు క్రొత్త పాఠాలుంటాయి. అలా రోజూ ఎదుర్కొనే అనుభవాల్లో విలువైన పాఠాలుంటాయి. ఆకలి కడుపు, ఖాళీ జేబు, విరిగిన మనస్సు కూడా పాఠాలు నేర్పిస్తాయి. క్రీస్తు సాక్ష్యంలో- నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను. గనుక నా దగ్గర చేరి నేర్చుకొనండి అన్నాడు. కొండమీద చేసిన ప్రసంగ సారాంశము గొప్ప విలువలనిస్తాయి. మీరు లోకానికి ఉప్పు, వెలుగు వంటివారు అన్నాడు. మీ సత్క్రియలు ద్వారా దేవునిని మహిమపరచాలన్నాడు.

1170. మనము ఎదురుచూసే ప్రేమకన్నా మనకోసం ఎదురుచూసే ప్రేమ గొప్పది. తప్పిపోయిన కుమారుని కోసం కుమారుడు ముందుకు రాలేకపోయాడు. తండ్రే పరుగున వెళ్ళి ఆలింగనం చేసుకొని ప్రేమ చూపాడు. జక్కయ్య యేసును చూడగోరి చెట్టెక్కి కూర్చుని యుండగా క్రీస్తు పేరుపెట్టి 'జక్కయ్యా' అని పిలిచి నేనే నీ యింటికి వస్తానని రక్షణ అందించి, ఆనందపరచి, జీవితాన్ని మార్చాడు.

1171. కష్టపడి ఎత్తైన కొండ ఎక్కితే ప్రకృతి అందాల్ని స్పష్టంగా చూడగలము. ఆకాశములు దేవుని మహిమను వివరిస్తాయి, అంతరిక్షము ఆ దేవుని పనిని ప్రచురపరుస్తాయి. జీవితంలో కష్టపడి పని చేస్తూ దేవునికి ప్రథమ స్థానాన్నిస్తూ ఆయన చిత్తము చేసే విశ్వాసికి ఆనందం ఉంటుంది. ద్వేషాన్ని ప్రేమగాను విరోధాన్ని స్నేహంగాను, చీకటిని ప్రకాశంగా మార్చుకోగల కృషి చేస్తే ఉత్తమ జీవితాన్ని అనుభవిస్తాము.

1172. మంచి పుస్తకము, మంచి వ్యక్తి త్వరగా అర్థం కారంటారు. ఆ పుస్తకము బైబిలు గ్రంథమైతే, ఆ మంచి వ్యక్తి క్రీస్తు. ఆ క్రీస్తు ప్రేమను, ఆయన లక్షణాలను తెలిసికొనుటకు జీవితం చాలదు. క్రీస్తు రక్త విలువను గ్రహించి మారుమనస్సు పొందిన వ్యక్తికి పరిశుద్ధాత్మ శక్తి ద్వారా బైబిలులో సత్యాలు సులువుగా అర్థం కాగలవు. ఆ వాగ్దానాలు, అనిత్యసత్యాలు జుంటితేనెధారల కన్నా మధురంగా ఉంటాయి. జీవితము జీవించు మెళుకువు నేర్పిస్తాయి.

1173. బంధాలను ప్రేమతో కాలం గడిపిన తర్వాత కొందరు దూరమై అనంతలోకాలకు పయనించాక వారు చూపించిన ప్రేమ, వదిలివెళ్ళిన జ్ఞాపకాలే శాశ్వతం. వారంతా దేవుని నమ్మిన విశ్వాసులైతే నిత్యత్వంలో దేవుని సన్నిధిలో

ఆనందిస్తున్నారనే నిరీక్షణా భావం ఊరటనిస్తుంది. ఎవరైనా మనస్సును గాయపరిస్తే అది జ్ఞాపకంగా మిగిలిపోతుంది. మనస్సు రంజింప చేస్తే అది కథగా మిగులుతుంది. మనస్సు చేత వ్రాయబడినవన్నీ తీయని జ్ఞాపకాలు మిగులుతాయి.

1174. చెట్టు నుండి క్రింద పడిన పువ్వులు అందాన్ని కోల్పోతాయిగాని వాటి సువాసన మిగిలే ఉంటుంది. మనవారంతా దూరమైనను, మనస్సులు దూరమైనను జ్ఞాపకాలు దూరంకావు. మానవులందరు సహజ బలహీనతలు, అతిగా ఆలోచించుట, అతిగా ప్రేమించడం, అతిగా నమ్మడం. అదే అనుభవాలు మనలను సృష్టించి కాపాడి నడిపించే దేవునిపై ఉంచితే ఈ లోకంలో పరలోకంలో ఆనందంగా తృప్తిగా జీవిస్తామని నమ్మకంతో జీవించాలి.

1175. మనము నమ్మిన దేవుడు ప్రార్థించిన విన్నపాలకు వెంటనే జవాబివ్వవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. ఆలస్య చేసినా మంచి ఈవులనిచ్చి న్యాయము చేస్తాడు, అన్యాయము చేయడు. ఆలస్యం వెనుక అద్భుతాలు దాగి ఉంటాయి. లాజరు చనిపోయినపుడు 3 రోజులు ఆలస్యంగా వచ్చాడని క్రీస్తు పట్ల అలక వహించిన మరియ, మార్తల జీవితంలో అద్భుతంగా లాజరును బ్రతికించి ఆ సోదరీమణులకు ఆనందం, ఆశ్చర్యం కలిగించి ఆ ప్రాంతం వారికి ఆయన శక్తిని కనబరిచాడు.

1176. మనలను జగత్తు పునాది వేయబడకముందే ఏ తల్లి గర్భంలో జన్మిస్తామో, ఏ రూపంలో ఉంటామో, ఏ తలాంతులనిస్తారో, ఎలా జీవించాలని కోరుచున్నారో, ఎప్పుడు పుట్టగలమో పుట్టినతేదీ, మరణపుతేదీ దేవుని అధీనంలోనే ఉంటుంది. మనము ఎక్కడ, ఎలా చనిపోతామో, ఎప్పుడు చనిపోతామో మనకుగానీ, ఎవరికీ గాని తెలియదు. ఏదీ నిర్ణయించలేము. మనకివేమీ తెలియకపోయినా ఎలా ఉత్తమ ఆశయాలు, ఆదర్శాలతో జీవించాలో నిర్ణయించుకొనుట పూర్తిగా మన అధీనంలో ఉంటుంది గనుక జాగ్రత్తగా జీవించాలి.

1177. మన జీవితంలో మన మాటలను గమనిస్తే అవి మన ఆలోచనల ఆధారంగా మారతాయి. ఆ మాటలను గమనించే కొలది అవి క్రియగా మారతాయి. ఆ చేతలన్నీ గమనిస్తే అలవాట్లుగా మారిపోతాయి. ఆ అలవాట్లను బట్టి మన వ్యక్తిత్వము ఉంటుంది. ఆ వ్యక్తిత్వము బట్టి నీవెట్టివాడవో లోకము గమనిస్తుంది. మన హృదయమనే ధన నిధి నుండి మంచివి చూడగలము, చెడు హృదయములో చెడును చూడగలము. నీ హృదయము దేవుని ఆలయము గనుక పవిత్రంగా, శుచిగా ఉంచుకోవాలి.

1178. ఆస్తులు అంతస్తులున్నా తృప్తి, ఆనందము లభించవు గాని మనస్సుకు ఆనందాన్నిచ్చే మంచి విశ్వాసుల సహవాసము దేవుని తోడు నీడా కోరుకొని ధ్యానిస్తూ గడిపితే తృప్తి, శాంతి , ఆనందం నిండుగా లభిస్తాయి. ఎన్ని ఉన్నా సుఖం ఉండదు. బంగారు పళ్ళెముకైనా ఆనుకొనుటకు గోడ కావాలి. ఎవరి మనస్సు దేవునిపై ఆనుకొంటుందో వారిని పూర్ణ శాంతిగలవానిగా వుంచగలనని దేవుని వాగ్దానముంది.

1179. జీవితంలో విద్యాభ్యాసం ముఖ్యమే. బైబిలు చదవాలన్నా, ఆధ్యాత్మిక సంపద సంపాదించాలన్నా, బ్రతుకుతెరువు కొరకైనా విద్య అవసరము. చదువు ద్వారా నేర్చుకొనిన అక్షరాలు, కష్టపడి నేర్చుకున్న పని ఎప్పటికైనా మనలను ఉన్నత స్థాయికి చేరుస్తాయి. విద్య లేనివాడు వింత పశువు అంటారు. పామరులైన జాలరులను క్రీస్తు ఆధ్యాత్మిక జ్ఞానంతో జ్ఞానులనుగా, ఆశ్చర్యపరిచే రీతిగా మార్చి విలువైన సందేశాలిస్తూ, పత్రికలు వ్రాసే ఉన్నత స్థాయికి చేర్చిన క్రీస్తు గొప్ప దేవుడు.

1180. ఒక పక్షి ఎగిరితే పక్షులు కూడా దానితోపాటు ఎగిరి ఆనందించగల మూగజీవులు. చీమలలో, కాకులలో ఉన్న ఐకమత్యం నేర్చుకోదగిన పాఠం. అదే మానవుల జీవితాలలో ఒకరు ప్రగతి సాధించినా, ఆర్థికంగా అభివృద్ధి సాధించినా మనస్ఫూర్తిగా ఆనందించలేరు. అసూయతో ఉంటారు. వారిని నిరుత్సాహపరిచేవారే ఎక్కువ. నిస్వార్థంగా ప్రేమించేవారు క్రీస్తు ప్రేమను నిండుగా నింపుకొనేవారే ఆనందంతో పంచుకోగలరు.

1181. లక్షల ఆస్తి గలవారి వెంటపడుటకంటే, లక్షణమైన లక్షణాలు గల దైవభక్తిగల విశ్వాసుల వెంటపడితే ఆధ్యాత్మికంగా వర్ధిల్లగలము. లక్షలు పోయినా తిరిగి సంపాదించుకోగలము. మంచి లక్షణాలు నేర్పించేవారిని పోగొట్టుకొంటే నష్టపోతాము. జీవితానికి విలువైనది ఆత్మ. ఆత్మ వర్ధిల్లాలి. నిత్యత్వంలో నిత్యమూ జీవించేది ఆత్మే అని నమ్మండి.

1182. ఎక్కడ విన్నమాటలు అక్కడే మరిచిపోవాలి లేదా జీవితాలు పాడయిపోతాయి. పరిస్థితులను బట్టి ప్రవర్తన మారుతూ ఉంటుంది. ప్రవర్తనను బట్టి ప్రేమ కూడా మారిపోతుంటుంది. మనం ఇతరుల లోపాలను వెదకడం ఆరంభిస్తే ఈ సృష్టిలో ఎవరినీ ప్రేమించలేము. గనుక లోపాలు వెదుకుట మానుకోవాలి.

1183. ఎదుటివారిని నిన్నువలె ప్రేమించు అన్న ఆజ్ఞలో వారి అవసరాలు గుర్తించి సహాయపడడమేకాదు, మనస్సు గాయపడి దుఃఖంలో ఉన్నప్పుడు అర్థంచేసుకొని ఊరటనిచ్చే ప్రేమ వాక్కులతో ఆదరించుట చాలు. దేవుని ప్రేమించుటలో ఇది ఒక భాగము.

1184. వ్యక్తి ఔన్నత్యానికి లేదా ఉత్తమ గుణ సంపదకు కొలబద్ద మేధస్సుకాదు, సున్నిత మనస్సాక్షి గల హృదయము ప్రేమించే మంచి లక్షణమని తెలుసుకో. సహాయము చేయుటకు నీ దగ్గర కేవలము డబ్బుండనవసరం లేదు. దాతృత్వ గుణంతోపాటు దుఃఖితులను ఓదార్పుగా, సడలిన మోకాళ్ళు బలపరిచే మనస్సు కలిగి కారుచీకటిలో కాంతి రేఖలాగా మనము అనాథలకు, పేదలకు అండగా ఉండుట ఖర్చులేని మంచి పని.

1185. మనం చేసే దానం ఒక చేతితో ఇచ్చేది, రెండవ చేతికి తెలియనట్లు రహస్యంగా చేయాలని బైబిలు బోధిస్తుంది. అన్నదానం, వస్త్రదానం చేస్తే దేవుడు ప్రతిఫలమిస్తానన్నాడు. ఎంత డబ్బు దానం చేశామనే లెక్కకన్నా, ఎంత ప్రేమతో ఇస్తున్నాము అనేది ముఖ్యం? గొప్పలు చెప్పడానికి కాదు. గుర్తింపు పొందడానికి కాదు. ప్రేమతో వారి కష్టాల్లో సహాయపడాలి. ఇవన్నీ మనుష్యులు చూడకపోయినా పరలోకపు తండ్రికి తెలుసునని నమ్మాలి.

1186. మనకు దేవుడిచ్చిన  చిన్న జీవితంలో ఎందరినో స్వకీయులను, స్నేహితులను, అపరిచితులను మరెన్నో ఆకర్షణీయమైన వస్తువులు పరిచయం చేసే ధన్యతను పొందుతాము. ఖాళీగా ఉండే రోజులు, పని ఒత్తిడిలో తినడానికి సమయము లేని రోజులు ఈ రీతిగా ఎన్నో వస్తాయి. ఘనమైన గెలుపుని, ఘోరమైన ఓటమి, నిరాశ, నిద్రపట్టని రాత్రులు, ఆకాశానికి అందలమెక్కించే అభిమానాన్ని, పాతాళానికి త్రొక్కే మోసం, బాధలో తోడుగా ఉండే బంధాన్ని, బాధించే విమర్శించే బంధువులు ఇవన్నీ తప్పవు. కాస్త ఓర్పుతో దైవబలంతోనే ఎదుర్కోగలము. భక్తిని పెంచుకోవాలి.

1187. జీవితంలో కష్టించి సంపాదించిన డబ్బు దేవుని అనుగ్రహంతో సంపాదిస్తే, అవసరం ఉన్నవారిని గుర్తించి దానం  చేయవచ్చు. మంచి హోదాలో ఉంటే నలుగురికి జీవనోపాధి కలిగించవచ్చు. మంచి పరపతి ఉంటే నలుగురికి మంచి మాటల సహాయంతో ఆదరించు. ఇవేమీ లేకున్నా బాధల్లో ఉన్న వారికి ఓదార్పునిచ్చే మాటసహాయం చేయాలి. కొన్నిసార్లు మౌనంగా ఉన్నా ఉండిపోవాలి కానీ ఎవరికీ అపకారం తలపెట్టకూడదు.

1188. జీవితంలో ఉత్తమ ఆదర్శాలు గలవారు బాధలో ఓదార్పునిస్తారు. అయితే కొందరు జీవితంలో మంచి చేయాలన్న అవగాహన లేనివారు ఏదోరీతిగా గాయపరుస్తూ సూటిపోటి మాటలతో అవహేళన చేస్తూ పైశాచిక ఆనందం పొందేవారు లేకపోలేదు. ఇతరుల ఆనందాన్ని తమ ఆనందంగా భావించి

అభినందిస్తూ, వారి సంతోషాల్లో మనస్ఫూర్తిగా ఏకీభవించేవారు చాలా కొద్దిమందే ఉంటారు. వారు దైవభక్తి గల విశ్వాసులుగా గుర్తించగలము.

1189. మనం శ్రమించే రోజులలో ఎవరూ సహాయం అందించరు. గాని, ఇల్లు కట్టే శ్రమలో రానివారు గృహప్రవేశ సమయంలో బహుమతులతో వచ్చి ఆనందించి వెళ్ళిపోతారు.

1190. బైబిలులో యాకోబు పత్రికలో నాలుక అగ్నివంటిది. అది కార్చిచ్చు రగిలిస్తుంది. అదుపులో ఉంచాలని బోధిస్తుంది. ఆయుధం లేకుండా చంపేది నాలుక. మంచివారిని పిచ్చివారిని చేసేది ద్రోహం, మోసము. అందుకే జాగ్రత్తగా మాట్లాడి మన్ననలు పొందాలి.

1191. దేవుడు మనకిచ్చిన జీవితంలో దేవుని అనుగ్రహము, తల్లిదండ్రుల సంరక్షణ లోనే చదువు సంస్కారము లాంఛనంగా ఉత్తమ జీవితాన్ని పొందుతారు. మనము ఎల్లప్పుడూ ఆనందంగా వుండడము సాధ్యంకాకపోవచ్చు గాని ఇతరులకు ఆప్యాయతను, ఆనందాన్ని పంచడము సాధ్యమగును.

1192. అవసరాలకు వాడుకొనేవాడు ఎప్పుడూ కష్టాల్లో తోడు రాడని తెలుసుకోవాలి. జీవితంలో నటించేవాడు జీవితాంతం నిలువలేడని తెలుసుకోవాలి.

1193. మనము ఎదుర్కొనే కష్టాలు, అనుభవాలు అన్నీ దేవుని చిత్తంలో ప్రత్యేక ప్రణాళికాపరమైనవని నమ్మాలి. అవి మనల్ని బాధించుటకు కాదుగాని ఎంతమంది నీతో నిజాయితీగా ఉన్నారో, ఎందరు కపటంగా ప్రవర్తిస్తున్నారో మనము గ్రహించి పాముల వలె వివేకంగానూ, పావురాలవలే నిష్కల్మషంగా జీవిస్తూ, దేవునితో అతి సన్నిహితంగా జీవనాన్ని కొనసాగించుట మంచిది.

1194. ఒక వ్యక్తి ప్రశ్నలకు జవాబు దేవుడే ఇవ్వాలి. దారిచూపే సమర్థత చీకటికి ఉంటే వెలుగెందుకు? అన్ని ప్రశ్నలకు జవాబు దొరికితే కాలమెందుకు? మనము కోరినవన్నీ లభిస్తే కన్నీరెందుకు? అన్ని పరిస్థితులు మనము కోరినట్లు జరిగితే అసలు దేవుడెందుకు? ఎందుకనగా– కన్నీరు తుడిచి ఆదరించి జీవిత పరమార్థాన్ని బోధిస్తే బైబిలు పఠనం ద్వారా క్షయమైన జీవితం నుండి అక్షయమైన నిత్యరాజ్యంలో స్థానం కలిగియుండు ధన్యత కోరుకోవాలి, దానికై శ్రమించాలి.

1195. మన జీవిత గమనములో నేటి తరములో మార్పు కోరుతూనే ఉంటారు. ఇంటిని మార్చుతూ ఉంటారు. నడిపే బండిని మారుస్తారు. మాట్లాడే ఫోనును మార్చేస్తూ ఉంటారు. చివరికి స్నేహితులను, దర్శించే సంఘాల్ని మార్చగలరు

గాని, తమ లోపాల్ని సవరించుకొని మంచి మార్గంలో జీవితాన్ని మార్చుకోలేని బలహీనులుగా ఉంటారు. ఒకసారి దేవుని సన్నిధిలో పశ్చాత్తాపంతో తమ మనస్సు మార్చుకొని మారుమనస్సు పొందితే సమస్తము నూతనముగా మార్చే దేవుడు, మార్పులేని దేవుడు మతి గతి మార్చి ఉత్తమ వ్యక్తిగా చేయగలడు.

1196. ప్రతిరోజూ ఉద్యోగం చేసే సమయంలో ధనమే జీవనమనిపించిననూ సాయంత్రం ఇల్లు చేరాక ప్రశాంతత, తృప్తి, ఆనందమే జీవితానికి అవసరమని తెలుస్తుంది. ఏది క్షణికమైన ఆనందం, ఏది శాశ్వతమైన ఆనందం ఇస్తుందో ఆధ్యాత్మిక జీవిత లోతుల్లోనే అవగాహన కాగలదు. ఎవరి మనస్సు దేవునిపై ఆనుకొంటుందో వారిని పూర్ణ శాంతిగలవానిగా దీవించగల దేవుడు "నా శాంతినే మీకనుగ్రహిస్తాను" అని వాగ్దానం చేశాడు గనుక మరువరాదు.

1197. పై రూపం అందంగా ఉంటే ఆకర్షణ ఉంటుంది. అంతఃకరణలో అందం కనిపించకపోయినా మనసులకు ఆహ్లాదాన్నిస్తుంది. దేవుడిచ్చే అవకాశాలు అరుదుగా ఉంటాయి. అందిపుచ్చుకొని శ్రద్ధగా వాడుకొంటే విజయ తీరాలు చేర్చగలవు. సమయస్ఫూర్తితో సందర్భానుసారంగా వివేకంతో వేచి ఉండాలి. ఎక్కడ నిరాడంబరత్వము, నిస్వార్థము ఉంటుందో అక్కడే విజయాల్ని చూడగలము. గొప్పగా జీవించడమంటే ఆడంబరంగా జీవించడం కాదుగాని ఆనందంగా, తృప్తిగా జీవించడము.

1199. మన మనస్సు దైవ భయంతో ప్రశాంతంగా వుంచుకోగల్గిన సందర్భాలలో మంచి ఆలోచనలు వస్తాయి. నిజాయితీకి ఎప్పుడూ విలువ ఉంటుంది. కష్టమొస్తే కన్నీళ్ళు కాదు, ఆలోచన రావాలి. ఆ కష్టాల్ని అధిగమించే మనోధైర్యము కావాలి. మన ఆనందాన్ని పంచుకొనే వారికంటే మన బాధల్ని పంచుకొనేవారే ఆత్మీయులు. సంస్కారం వున్నవాళ్ళు ఎవరినీ బాధించరు. ఏమీ లేనివారమయినప్పుడు ఆప్యాయంగా వెన్నుతట్టి ఆదరించేవారే ఆత్మీయులు, స్నేహితులు, విశ్వాసులు.

1200. జీవితంలో నిర్ణయాలు చేసే సమయంలో స్పష్టమైన దైవచిత్తము గ్రహించాలి. దావీదు రాజు, యెహోషాపాతు, మోషే, యెహోషువాయు సాధించిన అన్ని విజయాల్లో దేవునిని ముందుగా సంప్రదించేవారు. వివాహ సమయాల్లో ఉద్యోగ సమయాల్లో, ప్రయాణ సమయాల్లో, ప్రతి నిర్ణయాల్లో చిన్న ప్రార్థన ద్వారా ధైర్యం తెచ్చుకొని ముందుకు సాగాలని తెలుసుకుందాం. చదువురాని వాని చేతిలో పుస్తకము ఉంచుటగాని, మనస్సు లేని సంస్కారం లేని చేతిలో జీవితాన్ని ఉంచరాదు. ఇద్దరూ ఆడుకుంటారుగాని గౌరవించరు.

1201. ధనవంతునికిచ్చే బహుమతి వ్యర్థము. కడుపు నిండిన వారికి పంచభక్ష్య పరమాన్నాలు వ్యర్థము. పగలు దీపం వెలిగించుట వ్యర్థము. బంధాలలో ఆప్యాయతలేని జీవితం వ్యర్థము. అసమర్థులతో, అవిశ్వాసం గల వారితో స్నేహము వ్యర్థము. నిజాయితీ లేని ప్రేమ వ్యర్థము. క్రీస్తు ప్రేమలో నిలిచి ఉండే జీవితం ఎన్నడూ వ్యర్థం కాదు.

1202. క్రీస్తు స్వయంగా పలికిన మాటల్లో ఈ వాక్యం ద్వారా ఎందరో అన్యజనులు క్రీస్తే నిజ రక్షకుడు అని నమ్మారు. సవాలు చేసినట్లు నేనే అన్నారు. నేనే మార్గమును, సత్యమును, జీవమును అన్న అద్భుతమైన మాటల్లో గొప్ప సత్యము దాగివుంది. ఆ సత్యాన్ని త్రికరణశుద్ధితో నమ్మితే విజయము తథ్యము. నెమ్మదిగానైనా సరే మనము విజేతలము కాగలము. ఆ క్రీస్తు మనల్ని తన బిడ్డలుగా స్వీకరించి ప్రేమిస్తారు.

1203. విద్యలేనివాడు వింత పశువంటారు. సఫలతనిచ్చే విద్య సంస్కారవంతుల్ని చేస్తుంది. విద్య యొసగును వినయము అన్నారు. విద్యావంతులలో వినయము సద్భావాలు, సచ్ఛీలత కనిపించగలదు. మన జీవిత గమనంలో తారసపడే వ్యక్తులతో స్నేహంగా, సన్నిహితంగా జీవిస్తూ మంచిని పంచుతూ, దైవ బోధకులను గౌరవిస్తూ, విధేయత చూపిస్తూ, బోధల్ని పాటిస్తూ దైవభక్తితో జీవించేవారిని సమాజం గౌరవించగలదు. దేవుని దీవెనలకు అర్హులు కాగలరు.

1204. బైబిలు గ్రంథములో ప్రేమ పొందినవారు కోల్పోయినవారు అనగా దేవుని సన్నిధి పోగొట్టుకున్నవారు జాబితా ఉంది. దావీదు దేవుని క్షమాపణ పొంది దేవునికి దగ్గరయ్యాడు. అతని కుమారుడు స్త్రీ సాంగత్యము కోరుకొని హెబ్రీ 11లో విశ్వాసవీరుల జాబితాలో ఉనికి కోల్పోయాడు. అట్లే పేతురు క్షమాపణ కోరి దగ్గరయ్యాడు. అది చేయక ఇస్కరియోతు యూదా పతనమయ్యాడు. అందుకే ఈ లోకంలో కోల్పోయిన తర్వాత రానివి స్వచ్ఛమైన ప్రేమ, పెట్టుకున్న నమ్మకమని నమ్మాలి.

1205. మన చేతికి వచ్చిన పని శ్రద్ధగా నమ్మకంగా చేస్తే రాజుల దగ్గర ప్రశంసలు ఉంటాయని బైబిలు చెబుతుంది. ఇష్టం లేకుండా చేస్తే ఫలితం అసంతృప్తిగా ఉండి అశాంతినిస్తుంది. మనలో మంచి ఆప్యాయత భక్తిని గుర్తించినవారు ఆప్తులవుతారు. చెడు మనస్సు, వ్యర్థ మాటలు గమనించి శత్రువులుగా మిగిలిపోతారు. డబ్బు, ఆరోగ్యము, ప్రేమ, స్నేహము, సత్సంబంధాలు, చిన్న, పెద్ద, మంచి నాణెములంతటి విలువ గలవి. అవి అతి జాగ్రత్తగా కాపాడు కోవాలి. అన్నింటిని మించి ప్రభువు సన్నిధి పెన్నిధిగా సదా నిలుపుకోవాలి.

1206. మన మనస్సు దేవునిపై ఆనుకొన్నప్పుడు పూర్ణ శాంతిగా ఉంటుంది. అది నిస్వార్థ హృదయము, నిష్కల్మషం గల హృదయము, నిర్మల హృదయాలకు వర్తిస్తుంది. జ్ఞానమును ఆశ్రయిస్తే అది బుద్ధినిస్తుంది. దైవ సేవ చేసినను, మానవ సేవ చేసినను ఆత్మ వికసించగలదు. దేవుని యందలి భయభక్తులే జ్ఞానమునకు మూలము.

1207. మంచి సంస్కారము, వ్యక్తిత్వముగల స్నేహము ఇతరులను ఆకర్షిస్తుంది. తీపి ఉన్నచోట చీమలు చేరగలవు. డబ్బులున్న చోట బంధువులు చేరతారు. బాధల్లో మాత్రం బంధువులు దూరమయి తప్పించుకోచూస్తారు. గాని నిజమైన క్రీస్తు ప్రేమ నిండిన విశ్వాసులు కష్టాల్లో ఆదుకుంటారు. రెక్కలు లేని దేవదూతల్లాగా సహాయపడతారు. మంచి సమాజం మనిషి శరీరము వంటిది. అందుకే సమాజమైనా, శరీరమైనా అందులో ఒక భాగానికి గాయమైతే నివారణకు అందరూ సహకరించి ఆదుకోవాలి. క్రీస్తే మన శిరస్సు. అవయవాలన్నీ సహకరించి ఘనపరచాలి. శిరస్సుపై ఆధారపడినవారే సంఘము.

1208. మనము మాట్లాడే మాటలన్నీ ఇతరులు ఎంతో ఇష్టంగా, ప్రేమగా వినేటట్లుగా ఉండాలి. మన సంభాషణ ఉప్పు వేసినట్లు రుచిగా ఉండాలి. సమయోచితంగా పలుకబడిన మాట వెండి పళ్ళెంలో ఉంచిన బంగారు పండ్లంత విలువైన దన్నారు. మనము మాట్లాడటంతోపాటు ఇతరుల మాటల్ని మనసుపెట్టి శ్రద్ధగా వినేవారిగా ఉండాలి. వినిన తర్వాత అభిమానించి వారితో ప్రేమతో మాట్లాడ గలగాలి. మన మాటలు స్వచ్ఛంగా, నిజాయితీగా ఉన్నప్పుడు మనం నమ్మిన దేవుడు సదా మనకు తోడుగా ఉంటాడు.

1209. గతం మనకు విలువైన జ్ఞాపకాలనిస్తుంది. గడుస్తున్న కాలం తాత్కాలిక ఆనందాన్నిస్తుంది. మనము ఎన్నేళ్ళు బ్రతికామన్నది కాదుగాని బ్రతికి వున్న కాలంలో ఎంత సహకారులుగా ఉండి ఆనందాన్ని అందిచగలిగామో ఆలో చించాలి. ఇక భవిష్యత్తు మన చేతిలో ఉండదు. దేవునిచిత్తంలో అవకాశాలు ఉంటాయి. సద్వినియోగం చేసుకొనేలా సిద్ధపడాలి. ఆది, అంతము ఎరిగిన దేవునికి భవిష్యత్తు తెలుసు. భక్తితో బ్రతకాలి.

1210. రేపటి వెలుతురును చూడాలంటే నేటి చీకటి భరించాలి. అలాగే రేపటి ఆనందాన్ని పొందాలంటే నేటి బాధను భరించాలి. కన్నీటితో విత్తువారు సంతోషంగా పంట కోస్తారు. క్రీస్తు నేనే వెలుగును అన్నారు. సృష్టిలో మొదటిగా వెలుగు కలుగుగాక అని పలికాడు దేవుడు. మనల్ని ఉప్పుగా, వెలుగుగా

ఉండమన్నాడు. రాత్రి భరిస్తే ఉదయము వెలుగు వస్తుంది. కష్టాలు కన్నీరు కలకాలముండవు, లెమ్ము తేజరిల్లు, నీకు వెలుగు వచ్చియున్నదన్న వాగ్దానంతో క్రీస్తు వాగ్దానాలతో సాగిపోవాలి.

1211. సంతోషం సగం బలమన్న పాత సామెత అక్షరాలా నిజం. సంతోషము, సమాధానము, చెప్పనశక్యమైనది. క్రీస్తుని రక్షకునిగా స్వీకరిస్తేనే సంతోషం లభిస్తుందని విశ్వాసి ధైర్యంగా సాక్ష్యం ప్రకటించగలడు. ఎవరు మనకు సంతోషాన్నివ్వలేరు. ఇచ్చినా అది తాత్కాలికమైనదే. మన సంతోషం మనలోనే ఉంటుంది. పౌలు గారు ఫిలిప్పీ పత్రికలో ఆనందించండి, మరలా చెప్పుదును ఆనందించండి. మీ సంతోషము సకల ప్రజలకు తెలపండి అన్నాడు.

1212. మనం చేసిన తెలివితక్కువపని జాబితా తయారుచేసుకొని మనల్ని మనమే విమర్శించుకోవాలి. నిష్పక్షపాతమైన, నిర్మాణాత్మకమైన విమర్శఉంటే వాటిని సరిచేసుకోవాలి. చేతనైనంత చక్కగా పనిచేయండి. పాత గొడుగును తెరచి విమర్శల వర్షం నీ ఒంటిని తడవకుండా చూసుకోండి.

1213. తన బాధలు ఎవరికి చెప్పకుండ బ్రతికేవాడు గౌరవనీయుడు. ఇతరుల బాధలను అర్ధం చేసికొని ఆదరించేవాడు అభినందనీయుడు. ఇతరుల బాధలను తన స్వలాభం కొరకు మల్చుకొనేవాడు దుర్మార్గుడు.

1214. మన జీవితాల్లో ఓర్పు చాలా అవసరము. ఓర్పు నిరీక్షణనిస్తుంది. విశ్వాసము గొప్ప ఆత్మ వరము గనుక నిరీక్షణలో విశ్వాసముంది. అందుకే ఓర్పులో సత్ఫలితముంది. తేనె ఎంత మధురంగా ఉన్ననూ దాహం తీర్చలేదు. ఈలోక బంధాలు బంధుత్వాలు కూడా తేనెవలె దాహం తీర్చలేనట్లే ఆదరించి తృప్తినిచ్చి అవసరాల్లో ఆదుకోలేదు. మనకున్న ఆత్మ విశ్వాసము, దైవభక్తి మంచినీరు వంటిది. అది తపన తీర్చి దాహం తీర్చి తెప్పరిల్లజేస్తుంది.

1215. శాశ్వతమైన ప్రేమనిచ్చే దైవ సన్నిధికి మించిన పెన్నిధి లోకంలో ఏదీ సరికాదు. లోకంలో వ్యక్తులు ఒకరు సంపాదిస్తున్నారంటే ఓర్వలేరు. ఏమీ లేకపోతే చులకనగా చూస్తారు. మంచి పేరుతో బ్రతుకుతుంటే బురద పూసే మాటలతో పేరు చెడగొట్టాలని ప్రయత్నించగలరు. సంపద, జీవితం అశాశ్వితమే. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములకు దూరముగా ఉంటూ, దేవుని చేయి విడువక విశ్వాస యాత్ర కొనసాగించాలి.

1216. అజ్ఞానంతో నీ పొరుగువాని నుండి ఏదీ ఆశించకు అని బైబిలులో ఉంది. ఏ అవసరమైనా ఎవరినీ ఏదీ అడుగరాదు. ఎవరినీ ఎక్కువగా నమ్మరాదు.

ఎవరిపైన ఎక్కువగా ఆధారపడరాదు. సంతుష్టిసహితమైన దైవభక్తియే ఎల్లప్పుడూ ఉత్తమ ఫలితాలు లాభాలనిస్తాయి. మనము తీసుకొనే నిర్ణయాలు ఆకాశమందున్న దేవుని చిత్తములో ప్రార్థించాలి. ఆకాశమంత ఉన్నతంగా ఉండాలి గాని, గాలికి ఊగే రెల్లువలె లేదా కదిలిపోయే మేఘాల్లా ఉండకూడదు. స్థిరంగా బండమీద కట్టిన ఇల్లువలె ఉండాలి.

1217. ఓ మానవుడా, ఏది ఉత్తమమో నీవు తెలుసుకోవాలి, కనికరాన్ని ప్రేమించాలి, దాతృత్వం కలిగి ఉండాలి. ప్రేమతత్వం సదా నిలుపుకోవాలని బైబిలు బోధిస్తుంది. కష్టమైనా, సుఖమైనా, ఎట్టి సమస్యలైనా దైవశక్తి ఆధారంగా ఎదుర్కొనుట తప్పదు. జీవితంలో గెలుపోటములు సహజము. కుటుంబములో గొడవలు, ప్రేమలు సహజం. అలాగే లోకంలో కష్టాలు సుఖాలు సహజం. నన్ను బలపరచువానియందే సమస్తము చేస్తానని దేవుడు అంటున్నాడు.

1218. బైబులు బోధలలో నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించాలి అని చెప్పబడింది. పూర్ణ హృదయముతో, పూర్ణ ఆత్మతో, పూర్ణ వివేకముతో దేవునిని ఆరాధించి ప్రేమించాలి. స్వార్థంతో నాకేమి నేను బ్రతుకగలను, అన్నీ నాకు సమృద్ధిగా ఉన్నవని ఒంటరి పోరాటములో నిలిస్తే తప్పక పడిపోతారు. అప్పుడు ఆదుకొని లేపేవారుండరు. నీ చుట్టూనున్న వారికోసం నిలబడితే వారి అవసరాలు గమనించి ఆదుకొంటే నిన్నెవరూ పడిపోనీయరు.

1219. మనం త్వరపడి తీసుకొనే తప్పుడు నిర్ణయాలవల్ల పరిస్థితులు కలవరం కలిగిస్తాయి. అదృష్టం సరిలేదు, నా ఖర్మ యింతే అని నిరాశలో నిలిచిపోరాదు. ఆ నిర్ణయాలలోని లోపాలు సవరించుకోవాలి. తప్పు చేస్తే దేవుని వద్ద క్షమాపణ కోరి మరొక ఉన్నత మెట్టు చేరాలి. ఒక మేధావి మాటల్లో నిజమైన సంపద ఏదనగా–ఆకలి కలిగినప్పుడు కడుపు నిండుగా భోజనం చేయగలగటం, కంటినిండా ప్రశాంతంగా నిద్రించడం.

1220. మన దేవుడిచ్చే ఆనందం చెప్పలేనిది, సంతోషము పట్టలేనిది. కోపము పనికిరానిది. ప్రేమ చెరిగిపోనిది. దేవుని సన్నిహిత సహచర్యము మరువరానిది. మన ప్రతి చిరునవ్వు, ప్రతి ప్రేమగల మాట, ప్రతి దయగల మాట ఇవన్నీ దేవుని అపురూప ప్రేమ హృదయానికి ప్రతిబింబాలు.

1221. ప్రతి వ్యక్తియొక్క ఉనికి సృష్టించిన దేవునిదే. ఎప్పుడూ తగ్గింపుతో, వినయంతో జీవిస్తూ అందరి మన్ననలూ పొందాలి. కానీ 'నేను' అనే అహంకారంతో జీవించ తగదు. ఒక వేదాంతి మాటల్లో– భూమికి మనం అరువుగా వచ్చాము. కొన్నాళ్ళకి ఈ భూమికే ఎరువుగా మారిపోతాము. అనగా మరణించక తప్పదు.

అందుకే పరువుగా బ్రతకాలి. వేగంగా మారే మనుష్యుల మధ్య బ్రతుకుతున్నాము. అందుకే ఎవరితో ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి. వివేకంతో ఉండాలి. ఒకరి జీవితము మరొకరికి అందంగా కనబడుతుంది. కాని ఆ జీవితంలో దాగి ఉన్న కష్టాలు కన్నీరు ఎవరికీ కనిపించవు. కన్నీరు తుడిచే దేవుడిని నమ్మాలి.

1222. మనలను సృష్టించిన దేవుడు శాశ్వత ప్రేమతో ప్రేమిస్తూ, నీవు నా సొత్తు అంటారు. మనకున్న బంధాన్ని నాదీ అని మనస్ఫూర్తిగా స్వీకరించిన తర్వాత ఎన్ని కష్టాలు వచ్చినా సరే ఆ బంధాన్ని మధ్యలో వదిలేయరాదు. అలా వదిలేస్తే నిజమైన ప్రేమ ఎలా కాగలదు? మానవ ప్రేమలు శాశ్వతం కాదని నమ్మి వివేకంతో ఉండాలి. నీకు సహాయము చేయువాడను నేనే. దిగులుపడకు నీకు సహాయమే కాదు, నీ చేయి పట్టుకొని నడిపించువాడను నేను అంటున్న దేవుని హస్తాన్ని పట్టుకొని, ఆయన చూపించే మార్గములో సాగిపోతూ నిత్యత్వం చేరే ఆశతో ఉండాలి.

1223. మనకు నచ్చింది తినాలి, తెలిసింది చెప్పాలి. గొప్పగా బ్రతుకక పోయినా తృప్తిగా జీవించాలి. డబ్బుంటే అన్నీ వస్తాయి కానీ, అది ప్రధానం కాదు. నిన్ను నిజంగా ప్రేమించే నలుగురు విశ్వాసుల సహవాసంలో, దైవమందిరంలో దేవుని సన్నిధిలో ప్రార్థన, వాక్యధ్యానంతో గడిపే ప్రశాంత జీవితం శ్రేష్ఠమైన సంతృప్తి, నెమ్మదిని ఇస్తాయి. మన జీవితంలో ఆనందంగా జీవించాలంటే మన ఆలోచనలు సరిగా ఉండాలి. మంచి ఆలోచనలు ఇచ్చేది దేవుని యందలి భయభక్తులిచ్చే జ్ఞానాధారం వలనే అని నమ్మాలి.

1224. దేవుడు ప్రేమతో సృష్టించిన మొదటి దంపతులు ఆదాము హవ్వలు. దేవునితో అన్యోన్యతతో ఆనందించేవారు. సాతాను వారి అన్యోన్యతను పాడుచేసిన తర్వాత ఒకరినొకరు నిందించుకొని దేవునిపై నెపములు చెప్పుకున్నారు. అందుకే మనము మనల్ని కాపాడుకొనుటకు ఇతరులపై నిందలు మోపరాదు. కాలానికి నిజాన్ని నిరూపించే శక్తి ఉంది. అంతేకాదు, దేవుని దృష్టి అంతటా సంచారము చేస్తూ గమనించగల శక్తి గలది అని తెలుసుకోవాలి.

1225. మనము జీవితంలో ఎదుర్కొనే బాధ నుండి సంతోషమైనా, ఓటమి నుండి గెలుపు అయినా స్వీకరించాలి. దేవుని సంకల్పములో పిలువబడినవారికి సమస్తము సమకూడి జరుగునని ఎరిగి అంతా మనమంచికే దేవుడు ఏర్పరచుననే దృఢ విశ్వాసంతో ముందుకే దూసుకొని పోవాలి. దేవుడు సదా తోడుగా ఉంటానన్నాడు. నిన్ను విడువను, ఎడబాయనన్న వాగ్దానము విశ్వాసి ఎన్నడూ మరువరాదు.

1226. దేవుని చేతితో సృజించిన సృష్టి ఎంతో అందమైనది. అది మంచిగా ఉన్నట్లుగా చేశాడు. ఆకాశములు దేవుని మహిమను వివరిస్తున్నాయని కీర్తన గ్రంథంలో చెప్పబడింది. అడవి పుష్పము అందాన్ని గమనించి వాటిని చూడమని క్రీస్తు చెప్పారు. చూసేవాళ్ళు చుట్టూ ఉన్నా లేకున్నా సరే పుష్పము వికసించి సువాసనలను వెదజల్లుటం మానదు. అందుకే మనకున్న పనులన్నీ మౌనంగా చేస్తూ నమ్మకంగా జీవిస్తే, మనలను ఇష్టపడేవారు మన నుండి స్ఫూర్తి కావలసినవారు, తమకు తాముగా మనల్ని వెతుక్కుంటూ వస్తారు.

1227. జీవితంలో ఎన్నో చేదుజ్ఞాపకాలు ఎదురవుతాయి. అవమానాలు, ప్రియులను కోల్పోయిన రోజులు, ఆర్థిక ఇబ్బందులలో, బాధలలో ఆదుకోనివారి నిర్దయ నెదుర్కొన్న రోజులు ఎవరికైనా తప్పవు. కాలాన్ని నిందిస్తూ, కృంగిపోతూ నిరాశ, నిస్పృహలతో సమయాన్ని వ్యర్థపరచక కన్నీటిని తుడిచి ఆదుకొని, ఆదరించే సృష్టికర్తయైన దేవుని ప్రార్థించాలి. గతాన్ని మరిచిపోయి వెనుకనున్నవి మరచి ముందున్నవాటికై వేగిరపడుచు మనముందున్న పరుగు పందెంలో ఓపిగ్గా పరుగెత్తాలని పౌలు చెబుతున్నాడు.

1228. దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించాడు. మనలను ఒకరినొకరు ప్రేమతో జీవించాలని నేర్పారు. అట్టి ప్రేమ వున్న స్థలాల్లో గర్వం, అహంకారమునకు తావులేదు. గర్వమనే గుణమును దేవుడు అసహ్యించుకుంటాడు. దీనులకు అండగా ఉండి ఉన్నత స్థలములో నిలుపుతానన్నాడు. క్రీస్తు నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని మీకు మంచి స్నేహితుడనన్నాడు. స్నేహమున్న చోట విలువలు అడ్డు రాకూడదు. ఆర్థిక విభేదాలుండరాదు. ప్రశాంతంగా జీవితాన్ని క్రీస్తు ధ్యానంతో కొనసాగించాలి.

1229. జీవితంలో ఎన్నో మార్పులు ఎదుర్కొనక తప్పదు. అవి చాలా సహజమైనవి. వివేకము, జ్ఞానము దేవుడిచ్చే వరము. అవి మన దృక్పధాన్ని మార్చి మనలో మార్పు తెస్తుంది. దేవుడిచ్చిన విలువైన అనుభవం ద్వారా ఎప్పుడు? ఎందుకు? మారాలన్న జవాబును తెలియజేస్తుంది. అవసరములు వచ్చిన సందర్భములో దేవుడే సమయోచిత జ్ఞానమిస్తాడు. జ్ఞానము, తెలివి, వివేకము కేవలము దేవుని యందు భయభక్తుల వలన పొందగలమని సామెతల గ్రంథములో చెప్పబడింది.

1230. జీవితంలో మనం చేసే పనిలో నిజాయితీ ఉంటే దానికి తగిన ప్రతిఫలము దేవుడిస్తాడు. నీతిమంతులను కాపాడే దేవుడు యోబును, నోవహును, మరెందరో నీతిమంతులను విశ్వాసవీరులుగా, చరిత్రలో మరపురానివారిగా

హెబ్రీ పత్రిక 11వ అధ్యాయములో పొందుపరిచి తరతరాలుగా ఆదర్శ వంతులుగా జ్ఞాపకార్థముగా నిలిపాడు.

1231. జీవితంలో అన్నీ కోల్పోయినా ఒక్కటి మాత్రం మనకొరకు సిద్ధంగా ఉంటుంది. దాని పేరు భవిష్యత్తు. మానవ జీవితము మేడిపండు వంటిది. అది పైకి చాలా అందంగా కనిపిస్తుంది. కాని లోపల పురుగులుంటాయి. ఒకని జీవితం మరొకరికి అందంగా కనిపిస్తుంది. వారి గుండెల్లో దాగిన బాధ, కన్నీరు ఎవరికీ కనిపించవు. ఎదురైన కష్టాలు దేవుని కట్టడలను నేర్చుకొనుటకు మేలాయెనని దావీదు మహారాజు అనుభవంతో వ్రాశాడు. మనమెదుర్కొనే ఆటంకాలన్నీ విలువైన పాఠాలెన్నో నేర్పించి ఉత్తమ విశ్వాసులుగా, అను భవజ్ఞులుగా తీర్చిదిద్ది, అట్టి సమస్యలలోనున్న వారిని ఆదరించే మార్గ దర్శకులుగా తీర్చిదిద్దగలవు.

1232. జీవితంలో ప్రతి ఒక్కరికి మానసిక గాయాలు తప్పవు. లోపాలు లేని మనుష్యులు గాని, లోటులు లేని జీవితం ఎవరికీ ఉండవు. కష్టాలకెదురీదటం నేర్చుకోవాలి. బ్రతికివున్న చేప ప్రవహించే నీటికి వేగంగా ఎదురీదుతుంది. చచ్చిన చేప ప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. లోకంతో రాజీపడి చచ్చిన చేపలాగా కొట్టుకు పోవటం కాదు, బ్రతికిన చేపలాగా ధైర్యంగా ఎదురీదాలి. ఇతరుల కత్తిపోటు వంటి మాటల ద్వారా గాయాలను తలంచుకొని దుఃఖిస్తూ కర్తవ్యం మరచి నిరాశలో మునిగిపోరాదు. ఆ బాధను ప్రక్కకు నెట్టివేసి ఆశావాదంతో సాగిపోవాలి. మంచి ఆహ్లాదకరమైన జీవితం కోరాలి.

1233. దేవుడు మనకు విలువైన జీవితాన్ని బహుమతిగా ఇచ్చారు. అవకాశాలెన్నో ఎదురవుతాయి. సమయము పోనీయక సద్వినియోగం చేసికొన్న రీతిగా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. పొరపాటున అవకాశం చేజార్చినప్పుడు ఎక్కువగా ఆలోచించి దిగులులో మునిగిపోకుండా క్రొత్త అవకాశాలు వినియోగించుకొనుటలో మన ఆధ్యాత్మిక ఎదుగుదల కనిపిస్తుంది. దేవుని చిత్తం కనిపెట్టి ప్రార్థించినచో గొప్ప అవకాశాలిచ్చి దీవిస్తారు.

1234. జీవిత యాత్రలో మనల్ని ఎంతో ప్రేమించి ఆప్యాయంగా మాట్లాడే వారుంటారు. కొన్ని పొరపాట్లు చేసినప్పుడు ప్రేమించే ప్రేమగలవారు విపరీతంగా కోపంగా మాట్లాడే అవకాశాలు తప్పవు. మనస్సుకు గాయ మయిందని మనుష్యులను దూరం చేసుకోరాదు. ఎట్టి పరిస్థితులలో కోపం వచ్చిందో ఆ కారణము తెలుసుకోగలిగితే అపార్థాలు తొలగిపోతాయి. బంధాలు బలాన్ని ఇవ్వగలవు. సమాధానం వెదకి వెంటాడాలి.

1235. జీవితంలో మనము నిర్వహించవలసిన కర్తవ్యాలెన్నో ఉంటాయి. జీవితం పూలపాన్పు కాదు. బాల్యము, యవ్వనములో విద్యాభ్యాసము, పరీక్షల ఒత్తిడి, ఆర్థిక పరిస్థితులు, వివాహ వ్యవస్థ, బంధువులు, తోబుట్టువుల బాధ్యతలు, బిడ్డల కనడం, వారి సంరక్షణ, ఉద్యోగ వేట, ఉద్యోగంలో పోరాటాలు ఇవన్నీ సక్రమంగా నిర్వహించాలంటే మన శక్తి చాలదు. దైవశక్తిని ప్రతి దినం అందుకోవాలి. క్రీస్తుకు మొదట స్థానమిచ్చి ఆయన రాజ్యాన్ని, నీతిని వెదికితే ప్రభువే మనలను నడిపిస్తారు.

1236. మనము అవిశ్వాసులతో రాజీపడక ప్రత్యేకించుకోవాలి. అవిశ్వాసికి విశ్వాసితో ఏమి పొత్తు? మన జీవిత యాత్రలో పిరికివారు, ద్వేషించేవారు, మనస్సును గాయపరిచేవారు, మోసగాళ్ళు ఎదురవుతారు. మోసపోయినా ఫర్వాలేదుగాని మోసం చేయడం చాలా పెద్ద తప్పు. తెలిసి అవసరాల కోసం, బలహీనతల్లో మోసం చేస్తే తప్పక శిక్షార్హులము.

1237. మన జీవితంలో చాలామంది అతి తేలికగా సలహాలిస్తారు. అన్నిటికంటే కష్టమైనపని ఆప్యాయతతో నిజాయితీగా సహాయమందించడమని గ్రహించాలి. వెయ్యిమందిని సహాయమడిగితే ఒక్కరే చేయగలరు. కొన్నిసార్లు కొన్ని శోధనల వల్ల శ్రమల వల్ల కృంగిపోయి పడిపోయిన స్థితికి రావచ్చు.

1238. దేవుడు ఘనులను సిగ్గుపరచుటకు వెర్రివారిని ఎన్నుకుంటాడని యాకోబు పత్రికలో వ్రాయబడింది. మనము సామాన్యులమైనా అసమానమైన అద్భు తాలను మనతో చేయించగలడు. ఎవరైనా పొగిడితే పొంగిపోరాదు, విమర్శించారని కృంగిపోరాదు. జీవితంలో ఓటమి ఎదురైతే దిగజారి పోరాదు.

1239. సమస్యలెన్నో ఎదురవుతూనే ఉంటాయి. ఎదురొడ్డి సాధించే ధైర్యంతో తలపడాలి. అవసరమైతే క్రిందపడినా ఠీవిగా లేచి నిలబడాలి. అపజయాలు, కష్టాలు ఎదురవుతాయి. మోసగాళ్ళు, ద్రోహులు ఎదురవుతారు. నిరాశలో కృంగిపోరాదు. ఇవన్నీ ఎదుర్కొనే విజయాలన్నిటికీ సవాళ్ళని నమ్మాలి. నన్ను బలపరచు వానియందే సమస్తము చేయగలనని పౌలు ధైర్యంగా చెప్పి స్ఫూర్తినిచ్చాడు.

1240. దేవుని దృష్టిలో అనుకూలంగా ఆయన చిత్తములో ఏమి కావాలో దేవునికి సర్వం తెలుసు గనుక యుక్తంగా దేవునికి తెలపాలి. అవి నీకు అవసరమని దేవునికి తెలిస్తే వెంటనే దయచేస్తాడు. అందుకే మీ కోరికలు విపరీతమై అంతు లేనివిగా ఉండకూడదు.

1241. జీవితంలో ముందుకు సాగాలంటే దుఃఖిస్తూ కాలయాపన చేయకూడదు. దైవశక్తితో బైబిలు వాగ్దానాల ఆధారంగా గొప్ప స్ఫూర్తితో సాధించాలి, పోరాడాలి. దానికై అహర్నిశలు శ్రమించాలి. అకుంఠిత దీక్షతో, విశ్వాసముతో నిర్విరామ కృషి సత్ఫలితాలనిచ్చి నిన్ను తృప్తిపరుస్తాయి.

1242. మనమెంత ప్రయత్నించినా కావాలని కోరుకున్నను తిరిగిరానిది గతము. మనం కోరకపోయినా, వద్దనుకున్నా వచ్చేది మరణము. ఎంత ఉన్నా చాలనిది ధనము. ఖర్చుపెట్టినా కొనలేనిది దైవ భక్తి. మంచి స్నేహం దైవానుగ్రహం.

1243. బంధువులెందరున్నా ఆదుకునేవారెవరుండరు. సముద్రములో నీరు సమృద్ధిగా ఉన్ననూ త్రాగడానికి పనికిరాదు. మనము బాధలో ఉండగా, మన బరువులు భారంతో మోయు వేళలో ఆదుకొనేవారు ఉండరు. మన కన్నీరు మనమే తుడుచుకోవాలి. మన భుజం మనమే తట్టుకోవాలి. నీవు ఒంటరిగాలేవు, నేను సదా నీకు తోడుగా ఉండి నీ కుడి హస్తం పట్టుకొని నడిపిస్తానన్న దేవుడినే ఆశ్రయించి సాగిపోవడం నేర్చుకోవాలి.

1244. మంచితనము అనేది మహా వృక్షములాంటిది. ఎంత నరికినా అది మళ్ళీమళ్ళీ చిగురిస్తూనే ఉంటుంది. గుండె లోలోతుల్లో నుండి జీవం పోసుకుంటూనే ఉంటుంది. కొందరు నిలకడ లేనివారే ఇతరులపై నిందలు మోపుతూ మనస్సుకు గాయం చేస్తారు.

1245. దైవశక్తిలో స్థిరత కోల్పోరాదు. దైవకార్యాలకు లక్షలు ఖర్చుపెట్టి, పేపర్లలో, టి.వి.లలో ప్రకటించేకన్నా ప్రక్కనున్న భిక్షగాళ్ళకు కడుపునింపడం మిన్న.

1246. మన జీవితంలో ఎందరో తారసపడుతుంటారు. వారిలో అమూల్యమైన రత్నాలు, ముత్యాల వంటి విలువైన అద్భుత ఆశయాలు, తలాంతులు, సమర్థతలు దాగి ఉంటాయి. ఈ బిజీ జీవితంలో కనిపెట్టి గమనించి అభినందిస్తూ వారిలో ఉన్న విజ్ఞాన సంపద గ్రహించి నేర్చుకొనే సమయము తీసుకోనివారిగా ఉంటున్నాము. ఎప్పుడూ సముద్ర గర్భంలో తిరిగే చేపలకు తమ చుట్టూ ఉండే ముత్యాలు విలువైనవని తెలియదు. జీవితంలో క్రొత్త సంగతులు నేర్చుకొనుటకు సమయం తీసుకొని సమర్థులుగా జీవించాలి.

1247. జీవితంలో ప్రతివారికి అవసరాలు వస్తాయి. అవి పట్టించుకోము. కానీ అదే అవసరము మనకే వస్తే సరిగ్గా అర్థం కాగలదు. అవకాశానికి, అవసరానికి మనుష్యులకు, మానవత్వానికి మధ్య తేడాలు ఉంటాయి. సూక్ష్మ దృష్టితో మనుష్యుల ఆంతర్యాలను గ్రహించే అవగాహన అవసరము. జ్ఞాన వివేకములిచ్చే దేవుని పట్ల భయభక్తులతోనే లభిస్తాయి.

1248. ఈ లోకంలో చాలామంది స్వార్థపరులుగా జీవిస్తారు. ఇతరుల బాధల్ని పట్టించుకోరు. పౌలు – ఫిలిప్పీ పత్రికలో అందరూ స్వంత కార్యాలు చూచుకుంటారు, దేవుని కార్యాలు పట్టించుకోరన్నాడు. ధనం చూసి వచ్చే బంధువులు, కీర్తి చూసి వచ్చే స్నేహితులు, అందం చూసి అకర్షితులయ్యేవారు, కట్నం చూసి వచ్చే భాగస్వామి ఏదో ఒకరోజు అసలు రంగు బయటపెట్టి మనల్ని ఒంటరి వారిని చేస్తారు. లోకంలో శ్రమ కలుగుతుంది. ధైర్యం కలిగి ఉండాలి. సదా నీకు తోడై ఉంటానన్న దేవుని వాగ్దానాలను నమ్మాలి.

1249. ఉపయోగము లేని వస్తువులన్నీ చెత్తలో పడవేసినట్లే ఇతరుల అర్థంలేని, బాధపెట్టే మాటలు, విమర్శలు, కత్తిపోటు వంటి పనికిరాని మాటల్ని వదిలిపెట్టాలి. మనసులోకి తీసుకుంటే గుండె బరువెక్కిపోతుంది. మన నీడ మనతో ఎప్పుడూ రాదు. మనము ప్రేమించిన వారు మనతో ఎప్పుడూ ఉండరని తెలిసికొని మనలను సదా ప్రేమించి నడిపిస్తానన్న దేవుని వాగ్ధానాలు హత్తుకోవాలి.

1250. దేవునికి ఇష్టంలేని గుణాలు రెండు ఉన్నాయి. ఒకటి– గర్వము, రెండవది– పిరికితనము. గర్విష్టులను గద్దె దించి దీనులను పైకి ఎత్తువాడు. పిరికితనము గలవారికి పరలోకముండదు. గర్వం గలవారు తామే గొప్పవారని అతిశయిస్తూ తక్కువవారిని చులకనగా చూస్తారు. పిరికివారు ఆత్మన్యూనతాభావంతో నేను పనికిరానివాడినని అనుకుంటూ కృంగిపోతారు. దేవుడు ప్రతి వ్యక్తిని సృష్టించడంలో ప్రత్యేక ప్రణాళిక కలిగి ఉండి ఏదో పని తనకొరకు చేయాలని ఆశతో పుట్టించగా దేవునిని సంతోషపెట్టేలా జీవించుటకు ప్రయత్నించి సాధించాలి.

1251. మన జీవితంలో అందరూ మనల్ని పూర్తిగా నమ్మలేరు. నమ్మదగినవాడైన దేవుని నమ్మడం మన కర్తవ్యం. మనల్ని ప్రేమించలేనివారిని, నమ్మలేనివారిని ఎదుర్కొంటూనే ఉంటాము. ఆదరణతో, ఆప్యాయతతో గౌరవించే వారిని దూరము చేసుకోరాదు. ఈ మాయలోకాన్ని నమ్మద్దు. అది ఆశ చూపి మోసంచేస్తుంది. గనుక దేవుని నమ్మాలి. ఈలోక యాత్రలో ఎన్నెన్నో అనుభవాలు ఎదుర్కొంటాము. కొన్నిసార్లు ప్రేమించే వారే ద్వేషించేవారిగా మారిపోగలరు. అసూయతో కత్తిపోటు వంటి మాటలతో మానసిక గాయాలు చేయువారెదురవుతారు. ఆదరించి, ఆప్యాయతనందించి, కష్టాల్లో ఆదుకుంటూ అవమానించబడి, తృణీకరించబడిన సమయాల్లో ఊరటనిచ్చి మంచి మాటలతో శాంతినందించే వారుంటారు. అందుకే సన్మానాలను, అవమానాలను ఎన్నటికీ పట్టించుకోరాదు. కాని నీ సహజ వ్యక్తిత్వాన్ని ఆత్మాభిమానాన్ని వదులుకోరాదు. తల ఎత్తుకొని నిలబెట్టేది అదే.

1252. పొరపాటున దారితప్పితే జి.పి.ఎస్. (నావిగేషన్ మ్యాప్) మనల్ని సరియైన దారికి నడిపిస్తుంది. మనం మాట తప్పితే మన నావిగేషన్ దేవుడే. కాని మంచిమాట, చెడ్డమాట, కోపపుమాట ఎన్నో అనుభవాలకు, అర్థంలేని అనుభవాలకు గురిచేసి అవమానాలపాలు చేస్తుందని ఎంచి ఆచి తూచి మాట్లాడాలనియు నాలుక కొరుక్కొని జాగ్రత్తగా మాట్లాడాలని పెద్దలు చెప్తూ ఉంటారు.

1253. మనమెదుర్కొనే ఆపదకు సంపద నచ్చదు. బంధానికి బాధ నచ్చదు. బాధకు బ్రతుకు నచ్చదు. చావుకు పుట్టుక నచ్చదు. మన జీవితంలో అన్నీ అనుభవించాలి. దేవుడు తన ప్రత్యేక ఉద్దేశ్యముతోనే మనలను సృజించాడు. ఆయన కోరిన తలాంతులనిచ్చాడు. అది గుర్తించి దేవుడు కోరినట్లు జీవించుటకు ప్రయత్నించాలి.

1254. మన జీవితంలో ఎదుర్కొనే అపజయాలను బట్టి తప్పటడుగులని అనుకోరాదు. అవి తప్పులుకావుగాని, భవిష్యత్తులో మనం ఏమిచేయాలో, ఏమి చేయకూడదో మెళుకువలను తెలుపుతాయి, జీవిత పాఠాలు నేర్పిస్తాయి.

1255. గతాన్ని మర్చిపోయినా ఫరవాలేదు గాని గతం నేర్పిన గుణపాఠము ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. జీవితమనే పొలములో సమస్యలనే కలుపు మొక్కలు పెరుగుతూనే ఉంటాయి. అలాగని పొలం వదిలి వెళ్ళలేముకదా! అవి ఏరిపారవేసి పంటను కాపాడుకోవాలి. చెడు ఆలోచనల్ని తొలగించుకొని జీవించాలి.

1256. మన జీవితంలో యవ్వనం, సౌందర్యం సమసిపోతాయి. జీవితము, సంపద మాయమవుతాయి. పేరు, ప్రఖ్యాతి అంతరిస్తాయి. సత్యం ఒక్కటే శాశ్వతంగా నిలుస్తుంది. బైబిలు ఆధారంగా సత్యం మనలను స్వతంత్రులను చేస్తుంది. నేనే మార్గము సత్యము జీవమని క్రీస్తు తెలిపారు. డబ్బున్నవాడు డబ్బుతో పైకి వచ్చినవాడికే విలువనిస్తాడనియు, కష్టపడి పైకి వచ్చినవాడు తనలాగా కష్టపడి పైకి వచ్చినవారినే గుర్తించి అభిమానిస్తూ, అభినందిస్తారు.

1257. మన జీవితంలో బాధలు కష్టాలు తప్పవు. దావీదు రాజు ఎన్నో శ్రమలు ఒంటరితనము ఎదుర్కొనగా తన ప్రాణంతో మాట్లాడి ధైర్యం తెచ్చుకొన్నాడు. “నా ప్రాణమా నాలో నీవు ఎందుకో కృంగియున్నావు?”. యెహోవా యందే ఇంకనూ నిరీక్షణ కలిగి యుండాలన్నాడు. ఒక భక్తుడు కూడా చెప్పినదేమనగా నీకు ఎవరూలేరన్న దిగులువద్దు. “నీ కోసము ఏడవడానికి నీ కళ్ళు ఉన్నాయి.

ఆ కన్నీళ్ళు తుడవడానికి నీ వ్రేళ్ళున్నాయి". ఈ లోకంలో శ్రమ కలుగును. ధైర్యం తెచ్చుకోవాలని క్రీస్తు అభయము సదా గుర్తుకు తెచ్చుకొని నిర్భయంగా జీవించాలి.

1258. మన జీవితంలో ఉన్నత వ్యక్తులుగా మారాలంటే ఉన్నతమైన ఆలోచనలు, భావాలు ఉన్నప్పుడే ధీరులుగా, నాయకులుగా సమాజం గుర్తించగలదు. దైవచింతన, సత్సాంగత్యము, కలిగి దేవునికి ప్రథమ స్థానము ఇచ్చినప్పుడు అనగా దేవుని నిత్యరాజ్యాన్ని వెదకితే కోరిన సంపదలనిస్తూ ఆధిక్యతలను, తగిన గుర్తింపును తగిన సమయములో దేవుడే ఇస్తాడు. బైబిలులో దావీదు, యోసేబు, దానియేలు, ఎస్తేరు ఎన్నికలేనివారిగా బాల్యంలోనున్నను గొప్ప అధికారులుగా దేవుడు ఉన్నత స్థానమిచ్చి వారి భక్తికి ప్రతిఫలమిచ్చి ఆదర్శంగా నిలిపాడు.

1259. దేవుని వాక్కు శక్తిమంతమైనది. సర్వ సృష్టిని మాటతోనే కలుగుగాకని పలికి సృష్టించాడు. మానవునికి ఆలోచించే శక్తియుక్తులనిచ్చాడు. ఆ మాటలతో సంబంధాలన్నీ పంచుకోవచ్చు, పెంచుకోవచ్చు. ఆ మాటతోనే తెంచుకోవచ్చు. మన మాటలు ఉప్పు వేసినట్లు రుచికరంగా ఇతరులను ఆకర్షించేదిగా ఉండుటకు జాగ్రత్తపడాలి.

1260. మన జీవితంలో ఇతరులు మనలను గూర్చి ఏమనుకుంటున్నారోనని బాధపడుట అనవసరము. మన గురించి మనకు కావలసినవారి క్షేమము గురించి మనమింకా మంచి సమర్థత గలవారిగా కష్టించు విధము గూర్చి ఆలోచించాలి. మనపై నిందలు వేస్తూనే ఉంటారు. అవి నిజమైతే సంతోషంగా స్వీకరించాలి. సరిదిద్దుకోవాలి. అవి అబద్ధమైతే ఉపేక్షించి నవ్వేసి మరచిపోవాలి. మనస్సులో శాంతిని కాపాడుకోవాలి. దైవ చింతన ప్రశాంతత నిస్తుంది.

1261. ఎవరినీ మోసం చేయరాదు లేదా చేయుటకు ప్రయత్నించకు. ఓడిపోయినా ఫర్వాలేదు. ఓటమి అంగీకరించడంలో గౌరవముంటుంది. విజయం తప్పక వరిస్తుంది. మనలో నిజాయితీ, ప్రేమ, ఓర్పు ఉండాలి. దేవుడు కోరిన ఆత్మ ఫలాలలో కొన్నింటినైనా మనలో ఫలింపజేస్తే విజేతలుగా నిలుస్తాము. ఏ దుష్టశక్తి ఆటంకాలు కలిగించినా ధైర్యంగా ఎదుర్కొని ఆనందంగా జీవించగలము.

**మదర్స్ డే గూర్చిన తలంపులు :**

1262. దేవుని ప్రేమ తెలియుటకు అమ్మను సృష్టించాడు. అమ్మలో, నాన్నలో దేవుని ప్రేమ కనిపిస్తుంది. దేవుని సున్నిత స్వభావము వీరిలో గల ఉన్నత లక్షణాలైన పోషణ చేయుటలో, ఆప్యాయత ఆదరణను అందించుటలో, కష్టాలకు స్పందించుటలో, క్షమ చూపి, తప్పులు ఓర్చుకొని ప్రేమించుటలో చూడగలము. ఎంత వద్దనుకొని త్రోసిపుచ్చినా జీవితాంతము తోడు వచ్చేది తల్లిదండ్రుల ప్రేమ గనుక వారిని సన్మానించాలి.

1263. మాతృ దినోత్సవ శుభాకాంక్షలతో అమ్మను గూర్చిన తీయని పదాలెన్నో కనిపిస్తూనే ఉంటాయి. క్రీస్తు సిలువలో అమ్మ బాధ్యత యోహానుకి ఇస్తూ 'అమ్మా' అని ఆప్యాయంగా సంబోధించాడు. పాపపు స్త్రీని చూచుచూ అమ్మా ఇకను పాపము చేయకు అన్నాడు. మీకోసం, మీ బిడ్డలకోసం ఏడ్చి ప్రార్థించమని చెప్పాడు. తల్లి ప్రేమ ఈ లోకంలో అమూల్యమైనది, అతి మధురమైనది, అనంతమైనది. అనురాగంతో నింపబడిన తల్లి ధన్యురాలు.

1264. అమ్మను గూర్చి వివరించుటకు భాష చాలదు. చెప్పాలన్న ఆశ ఆగడంలేదు అన్నాడొక కుమారుడు. దేవుని ప్రేమ తల్లి ప్రేమ. ఆకాశాన్నడిగితే వారి ప్రేమ తన కంటే విశాలమంది. సాగరాన్ని అడిగితే వారి మనస్సు తనకంటే లోతని తెలిపింది. కొండ తేనెను అడిగితే వీరి మమత తనకంటే తియ్యనైనది అని చెప్పింది. సరాగాల కోయిలనడిగితే వీరి పిలుపు తన పాట కంటే మధురమంది. క్రొవ్వొత్తినడిగితే తన కంటే కోటిరెట్లు ఎక్కువ వెలుగైంది అంది. దేవునికి, తల్లికి నాకంటే ఓర్పు ఎక్కువ అని భూమి తెలిపింది.

1265. అమ్మంటే అంతులేని సొమ్ము. అది ఏనాటికీ తరగని భాగ్యము. అమ్మ మనస్సు అమృతము, అమ్మ ఒడి ఒక స్వర్గము. ఆమె విలువ గ్రహించుట తన సంతానము కర్తవ్యమని భావించి ప్రేమించాలి. అమ్మ తియ్యని మాటలు నేర్పిస్తుంది. ప్రతి కలనీ తన కలగా భావిస్తుంది. ఎన్ని యుగాలు మారినా, ఎన్ని తరాలు దాటినా మారనిది అమ్మ మధుర ప్రేమ. మరువని మమకారమే అమ్మ ప్రేమ.

1266. ఆకలి తీరాక అన్నాన్ని, అవసరం తీరాక మనిషిని అలుసుగా చూడవద్దు. ఆకలి మళ్ళీ వేస్తుంది, అవసరము మళ్ళీ వస్తుంది. జీవితం వింతైనది నిజాయితీపరులను ఏడిపిస్తుంది. నిందలు వేసేవారిని నవ్విస్తుంది. మాటకు

కట్టుబడి ఉండేవారిని అవమానిస్తుంది. మాటలు మార్చేవారిని గౌరవిస్తుంది ఈ లోకం యుక్తిగలది శరీరాశ, నేత్రాశ జీవపుడంబమునకు దూరంగా జీవించాలి.

1267. చీకటికి చంద్రుడు రాజు. పగలుకు సూర్యుడు రాజు. ఒక్కొక్క రోజే ఒకరిది కానప్పుడు అన్ని రోజులు మనవికావు. అది దేవుడు దానంగా, బహుమతిగా ఇచ్చాడు. కృతజ్ఞతగా జీవించాలి. నీటిలో మునగాలి, దైవసన్నిధిలో ఎదగాలి. బాప్తిస్మ అనుభవం విశ్వాసికి కావాలి.

1268. ఒక వృక్షానికి ఉన్న ఠీవి, ఉదయకాలపు నీటిబిందువుకున్న సొగసు, ప్రశాంతంగా నిలిచిన సముద్రపు అందము, ఇవన్నీ కలబోసి తల్లిలో దాగి ఉన్నాయన్నారు. మనుష్యులలో దేవుడు కోరిన మార్పు అలా రావాలి. అదే మారుమనస్సు క్రీస్తు క్షమ ద్వారా పొందగలము. అది వివేకము ద్వారా పొందగలము. ఎప్పుడూ మారేది అనుభవం అనుభవం చెప్పగా, ఎలా మారాలో పరిశుద్ధాత్మ బోధిస్తుంది.

1269. తల్లి ప్రేమను ఒక భక్తుడు తన మాటల్లో ఏమన్నారంటే గర్భంలో గుడి కట్టి రక్తంతో అభిషేకించి, తన పేగు బంధాన్నే పూలమాలగా మార్చి తొమ్మిది నెలలు కడుపులో పెట్టుకొని భద్రంగా కాపాడిన మాతృమూర్తికి నా నిండు కృతజ్ఞతలు అని తెలిపాడు.

1270. కష్టమనేది నిజ జీవితంలో కనిపించే దయ్యం అనవచ్చుగాని, కోపము మాత్రము ఇలా వచ్చి అలా వెళ్ళిపోయే భూకంపం లాంటిది. ఒక్క క్షణం కంటే ఎక్కువ ఉండదు. అయితే జీవితము రైలు ప్రయాణము వంటిది. అందరూ మనతో ఉన్నట్లే ఉంటారు. మనకోసం ఎవరూ ఆగకుండా దిగిపోతారు. కష్టము, కోపం, జీవితము మన అదుపులో ఉండవు. కష్టాలు, జీవిత ప్రయాణంలో తోడుగా ఉంటానన్న దేవుని అశ్రయించాలి.

1271. దేవుడు మన క్షేమము కోసమే కొన్ని బంధాలను దగ్గర చేస్తాడు, కొన్ని బంధాలను దూరం చేస్తాడు. దగ్గర చేసే బంధాలను చులకనగా చూడరాదు. దూరమైన బంధాలను గూర్చి అధికంగా ఆరాటపడరాదు. చదువుకొని నేర్చుకొన్న అక్షరము కష్టించి నేర్చుకొని నైపుణ్యత పొందిన పని జీవితంలో ఉన్నత స్థితికి చేరుస్తాయి. డబ్బుంటే వుండవచ్చు ఎదుటి మనిషిని చులకనగా చూచే జబ్బు ఉండరాదు. నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలి.

1272. మనకు సహాయపడేవారి సహాయాన్ని గుర్తించి అభినందించి కృతజ్ఞత చెప్పుట మరువరాదు. ప్రేమిస్తున్న వారిని ప్రేమతో కాపాడుకోవాలి. ద్వేషించి తృణీకరించరాదు. మనల్ని నమ్ముకున్న వారిని మోసం చేయరాదు, వారిది ఆశించరాదు. ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే ఒక్క క్షణం అసహనం జీవితాన్ని నాశనం చేస్తుంది. నాబోతు భార్య అబీగయేలు దావీదు ఆగ్రహాన్ని ఆపి భర్త మరణం కాకుండా కాపాడింది. కయీను ఆగ్రహం తమ్ముడిని చంపింది.

1273. మనం చేసే తప్పును సరిదిద్దుకోకపోతే అది మరింత పెద్ద ఆపదను తెచ్చిపెడుతుంది. సంసోను స్త్రీతో సాంగత్యమనే తప్పు దిద్దుకోలేక గొప్ప ఆపదను ఎదుర్కొని విలువైన జీవితాన్ని పోగొట్టుకొన్నాడు.

1274. మనలో ఏ బలహీనత ఉందో తెలుసుకొనుట వివేకము. అది సరిచేసుకొనుట జ్ఞానము. ప్రేమ, నిజాయితీ, పవిత్రత దేవుని ధ్యానంతోనే లభిస్తాయి. క్రీస్తులోనున్న లక్షణాలను ధ్యానిస్తూ రూపాంతర అనుభవంలోకి రాగల్గితే మనము ఎన్నటికీ విజేతలమయి శాంతితో సుఖంగా జీవిస్తాము.

1275. మన జీవితంలో ఇతరులను ప్రభావితం చేయాలంటే, తెలివిగా ఉండనవసరం లేదు, ధనికులు కానవసరంలేదు, అందంగా ఉండనవసరంలేదు, పర్‌ఫెక్ట్‌గా ఉండనవసరంలేదు గాని ఆప్యాయతతో శ్రద్ధతో గౌరవంగా మనిషిని మనిషిగా చూడాలి. దైవభక్తితోనే సాధు స్వభావం గాని, ఆత్మఫలాలు గాని వ్యక్తిలో కనిపిస్తాయి.

1276. జీవితంలో ఎన్నో సుఖాలు, కష్టాలు, నష్టాలు ఎదుర్కోక తప్పదు. ఒకసారి దెబ్బతింటేనే తెలుస్తుంది. ఎంత ధైర్యం వుందో. ఒకసారి తప్పు చేస్తే తెలుస్తుంది ఎంతో నేర్చుకోవలసింది ఉందని. ఒకసారి ఓడిపోయిన తర్వాతే తెలుస్తుంది గెలవాలని. దైవ చిత్తం తెలుసుకొని ప్రార్థన ద్వారా దేవుని సంప్రదిస్తూ ప్రతి పని కొనసాగించుటలో గొప్ప తృప్తి, నెమ్మది, శాంతి ఉంటాయి.

1277. ఈ లోకంలో డబ్బు ఎన్నో అనర్థాలనిస్తుంది. నోరు లేకుండా పలికిస్తుంది, కళ్ళు లేకుండా శాసిస్తుంది, చేయి లేకుండా ఆడిస్తుంది, కాళ్ళు లేకుండానే నడిపిస్తుంది, లేని బంధాలు కలిపేస్తుంది. మనసు లేని డబ్బు, మనషి చేసే డబ్బుపట్ల జాగ్రత్త వహించాలి. ఈ లోక ధనం కాదు, పరలోకం ధనంకోసం ఆశిస్తే దానికి చిమ్మెట పట్టదని బైబిలు బోధిస్తుంది.

1278. చెడు తలచేవారు ప్రశాంతత కోల్పోతారు. దేవుడిచ్చిన వెలుగును చూడలేరు. చర్చించేవారిలో విజ్ఞానము, వాదించేవారిలో అవివేకము కనిపిస్తుంది. ప్రజలకు నాయకులైనవారు తగ్గింపులో జీవిస్తూ స్వార్థం విడనాడి కృషి చేయాలి. క్రీస్తు మన మంచి నాయకుడు. సిలువలో మరణించేంతగా తగ్గించుకున్నాడు, ప్రేమ చూపాడు, క్షమ కనబరిచాడు, శ్రమ సహించాడు.

1279. ఆలోచించి పనులు చేయాలి. ఆలోచనకర్తయగు దేవునినే సంప్రదించి దేవుని చిత్తం కనుగొనవలెను. ఒక విజ్ఞాని చెప్పినదేమనగా చావుబ్రతుకులు ఎక్కడోలేవు. బలంలో బ్రతుకుంది, బలహీనతలో చావుంది. అందుకే పౌలు– నన్ను బలపరచు దేవునియందే సమస్తము చేయగలను అంటున్నాడు. ప్రేమ, శక్తి ఇచ్చిన దేవుడు పిరికితనము ఇయ్యలేదు. దేవుని యందు విశ్వాసము, ఆత్మ విశ్వాసము దేవుడు నరునిలో పెట్టిన ఐశ్వర్యనిధులు.

1280. సీతాకోకచిలుక అందంగా విభిన్న రంగుల రెక్కలతో హాయిగా ఎగిరే ముందు గొంగళిపురుగుగా ఉన్న రోజుల్లో తన జీవితమంతా అసహ్యంగా ఉందని చింతించవచ్చు. అయితేనేమి ఓర్పుతో కనిపెట్టిన తరువాత క్రొత్త జీవితం పొందినట్లు విశ్వాసి కూడా శ్రమలలో ఓర్పుగా నుండిననూ గొప్ప ఆనందము, అందముతో జీవిస్తారని నమ్మాలి. మనమెలా జీవించాలంటే, మనల్ని వదిలి వెళ్ళినవారు మనల్ని మరిచిపోలేనంత బాధతో, ఎందుకు వదిలివేశానా అనే రీతిలో గొప్పగా జీవించాలి.

1281. ఎల్లప్పుడూ దేవుడిచ్చిన స్ఫూర్తితో, సృజనాత్మక ఆలోచనలతో సాగిపోవాలి గాని పిరికిగా ఎవరో అడుగుజాడల్లో ఇతరుల సలహాలపై సదా ఆధారపడి జీవించరాదు. కొంతవరకు గెలుపు కనిపించవచ్చు గాని మనకంటూ ప్రత్యేకత గుర్తింపురాదు. క్రీస్తుపై ఆధారపడిన వ్యక్తిగా గుర్తింపు పొందాలంటే క్రీస్తు అనే ద్రాక్షావల్లిలో కొమ్మగా అంటుకట్టబడి జీవించి ఫలించాలి. ఆ ఫలాలు నిలిచి ఉండాలి. సమృద్ధిగా ఫలించాలి. క్రీస్తులో ఉన్నవారికి ఎల్లప్పుడూ జయమే.

1282. హద్దులకు మించిన ఆశలు ఉన్నట్లయితే శక్తికి మించిన కష్టాలు పడాల్సి ఉంటుంది. గేహజీ ఎలీషా భక్తుని వద్ద ఉంటూ భక్తిగా ఉండుటకు బదులు నయమాను దగ్గర వస్త్రాలు, వస్తువులు ఆశించి కుష్ఠును పొంది బాధల పాలయ్యాడు. స్వార్థం లేకుండా ఉండుటయే ఉత్తమ నీతి. నిజాయితీ నిలబెట్టు కొనుటకే ప్రయాసపడాలి. మనశ్శాంతి మనలోనే ఉంటుంది. ఈ లోకంలో

వేరే శత్రువులు, మిత్రులు ఉండరు. మన ప్రవర్తనయే శత్రువులను, మిత్రులను కలిగిస్తుంది. వివేకంతో జ్ఞానంతో దైవభక్తితో జీవించాలి.

1283. మనలను తీర్చిదిద్దేది మన మంచి ఆలోచనలే. చెడు తలిచేవారు ప్రశాంతత కోల్పోతారు. చర్చ విజ్ఞానం పెంచుతుంది. వాదన అజ్ఞానాన్ని సూచిస్తుంది. దేవుని యందు భక్తి, విశ్వాసము, ఆత్మనిగ్రహము ఇవే ఔన్నత్యానికి కీలకము. చేసే పనులన్నీ తమకు ఇష్టంగా మలుచుకొనేవాడు జ్ఞానవంతుడు. దేవునియందు భయభక్తులు జ్ఞానమునకు మూలము. అజ్ఞాని సోమరిగా జీవిస్తాడు. సోమరీ చీమల దగ్గర నేర్చుకో అంటున్నాడు దేవుడు.

1284. క్రీస్తునందున్నవారికి ఎల్లప్పుడూ జయమే. కొందరు విశ్వాసులను చులకనగా చూస్తారు. ఈ సమాజములో అట్టివారికి మనము క్రీస్తులో పొందే విజయాలు, పొందిన శాంతి తప్పక ఒక సమాధానమును మనము నమ్మిన దేవుడు ఇస్తాడని నమ్ముదాం. చాలాసార్లు మంచి వ్యక్తులు మన జీవితంలోకి వచ్చినప్పుడు వారి విలువ తెలిసికోలేక ఆధ్యాత్మికత నేర్చుకోలేకపోవచ్చు. జ్ఞానావగాహనలతో సమయము ఉండగానే జీవిత మెళుకువలను ఉత్తముల సహచర్యంలో నేర్చుకోవాలి.

1285. కటువైన మాట రాయి వంటిది. దాని వల్ల మనస్సు ముక్కలవుతుంది. అద్దంపై రాయి దెబ్బ తగిలితే పగిలిపోతుంది కదా! అతికించినా మొదటి స్థితి రాదు. బంధాలైనా అంతే. దూరమయితే సరిచేయటం కష్టము. ఎంత పాపినైనా సంపూర్ణంగా క్షమించి ఆదుకొనే దేవుడిని ఆశ్రయిస్తే పేతురును, దావీదును క్షమించిన క్రీస్తు సిలువలో బాధించిన వారిని క్షమించే క్షమ మనము నేర్చుకోవాలి. క్రీస్తుప్రేమ దోషాలను తొలగిస్తూ భయాలన్నీ పారద్రోలుతుంది.

1286. సూటిగా మనసు విప్పి చెప్పగలిగిన వారికి విరోధులెక్కువగా ఉంటారు. కపటముగా మాట్లాడేవారికి మిత్రులుంటారు. మనమెవరితో సహవాసం కలిగి ఉండాలో జాగ్రత్తగా వివేకంతో ఎంచుకోవాలి. అవిశ్వాసులతో విజ్జోడుగా నుండరాదు. సజ్జనుల సాంగత్యం భక్తిని పెంచుతుంది. శాంతినిస్తుంది. మంచి మనస్సుతో చెప్పే మాటలన్నీ విలువైనవే. మంచి హృదయము కలిగిన ప్రతి వ్యక్తి మనస్సు నిర్మలమైనదే కాగలదు. నీతిమంతులను బలపరచుటకు దేవుని కనుదృష్టి సంచారము చేస్తుంది.

1287. మన చివరి మజిలీ మట్టిని చేరుతుందని లోకం చెబుతుంది. క్రైస్తవుడయితే మన చివరి మజిలీ నిత్యజీవమునిచ్చే పరలోకం అని నిరీక్షణతో జీవిస్తాడు.

పరలోక గమ్యం తెలిసి ఉంటాడు. ఎంత వేగంగా పరుగెత్తినా, ఎన్నో ఆస్తులు నావి అనుకున్నా వదిలి వెళ్ళాలి, ఎంత ఆప్యాయతను పంచిన వ్యక్తులనైనా వదిలి పెట్టుట తప్పదు. కళ్ళు మసకగా కనిపిస్తే కళ్ళు శుభ్రపరచుకుంటాము. అందరూ తప్పుగా కనిపిస్తే శుభ్రపరచుకోవలసింది అంతరంగాన్ని. అది ఎప్పుడూ పవిత్రంగా ఉంచుకొనే బాధ్యత మనదిగా ఉండాలి.

1288. అనాలోచితంగా త్వరపడి ఏ పనీ చేయరాదు. చిత్తశుద్ధి, పట్టుదల, ఓర్పు ఈ మూడు అనుభవాలు కార్యసిద్ధికి తోడ్పడతాయి. వీటిని మించి ప్రేమ ఆవశ్యకము. ప్రేమ కలిగి ఉండాలి. దేవుడు ప్రేమామయుడు. నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలన్నాడు. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ ఈ మూడింటిలో ప్రేమ గొప్పది. దేవుని ప్రేమ ఆకాశమంత ఎత్తైనది, సముద్రమంత లోతైనది. ఆ ప్రేమతత్వంలో జీవించాలని బైబిలు బోధిస్తుంది.

1289. పవిత్రత, సత్యసంధత్వము, వినయము కావాలి. అవి భూషణం వంటివి. స్వార్థమును చంపుకోవాలి. అదే నిజమైన సౌఖ్యము ఓర్పుతో అసాధారణ కార్యాలు సుసాధ్యము కాగలవు. ఆత్మ విశ్వాసము అన్నిటిని సాధించగలదు. దేవుని శక్తితో నేను సమస్తము చేయగలనని పౌలు చెప్పాడు. మన బలహీనతలలో చింతిస్తాము. దేవుడు దేనికీ చింతిచవద్దు. నాపై మీ భారం పెట్టి నేనిచ్చే శాంతిని పొందమన్నాడు. మనలో దేవుడు దాచిన బలమును నమ్మి ధైర్యంతో బాగా చేయగలననే ధీమాతో బ్రతకాలి.

1290. ఈ లోకంలో సత్సాంగత్యము మేలైనది. బైబిలులో వాక్యము, ప్రార్థన, సహవాసం అంటేనే సత్సాంగత్యము. వీటివల్ల భక్తిభావం పెంపొంది ఉత్తమ వ్యక్తిత్వము అలవడుతుంది. మనిషికి నిజమైన ఆనందము కలిగేది మంచి ఆలోచనల ద్వారానే అని తెలిసి మంచి పుస్తకాలు చదవడం, అలవాటు చేసికొని ధ్యానం చేస్తే ఆనందంగా ఉండగలము. ఈ లోకంలో మంచి పుస్తకము పరిశుద్ధ గ్రంథము, అదే బైబిలు గనుక దైవభక్తిని పెంచి ఆనందం ఇచ్చేది ఈ గ్రంథమే.

1291. ఎప్పుడూ భయపడుతూ, దిగులుపడుతూ, బాధపడుతూ ఉంటే బ్రతుకు భయం కలిగిస్తుంది. అదే తలుస్తూ ఉండక, హాయిగా తృప్తిగా జీవిస్తూ ఆనందంగా ఉంటూ ఇతరులను ఆనందంగా ఉండేలా జాగ్రత్తగా జీవిస్తే నిజమైన శాంతి సమాధానాలు, కృపాక్షేమాలు మన వెంట పరుగెత్తివచ్చి చేరతాయి. పౌలు చెప్పిన మాట మరలా చెప్పుదును ఆనందించుడి. ఆనందంగా దేవుడు చేసిన కృపలను తలంచుచూ సర్వ సమయాల్లో స్తుతి గీతాలు పాడుతూ జీవితాన్ని ఆహ్లాదంగా దైవధ్యానంలో గడుపుటకు నేర్చుకోవాలి.

1292. ఈ జీవితం తాత్కాలికమైనది. ఏదీ శాశ్వతము కానిది. అశాశ్వతమైన ఈ లోకంలో పవిత్రంగా, నీతిగా జీవిస్తూ ఆ లోకంలో చేరుట ప్రతి జీవి కర్తవ్యం. అయితే ఎందరో, ఎన్నో సూక్తులు వివరిస్తారు. సంతోషానికి మించిన సంపద లేదు, ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు, చిరునవ్వుకు మించిన ఆభరణం లేదు, స్నేహితునికి మించిన ఆప్తుడు లేడు. క్రీస్తు నేను మంచి స్నేహితుడను, ప్రాణం పెట్టగలనన్నాడు. అదే మన ఆస్తి.

1293. ధైర్యమే నీతిమంతుల ఆయుధము. నోవహు ధైర్యము జలప్రళయాన్ని ఓడించింది. మోషే ధైర్యము ఐగుప్తీయులను ఓడించింది. సంసోను ధైర్యము ఫిలిష్తీయులను ఓడించింది. దావీదు ధైర్యము గొల్యాతును ఓడించింది. దానియేలు ధైర్యము సింహాలనోడించింది. బాప్తిస్మమిచ్చు యోహాను ధైర్యము అరణ్యాన్ని ఓడించింది. యేసుక్రీస్తు ధైర్యము మరణాన్ని ఓడించింది. దెబోరా ధైర్యము బారాకుకు ధైర్యమిచ్చింది. యాకెబెత్ ధైర్యము మోషేకు ధైర్యమిచ్చింది. అకుల, ప్రిస్కిల్లల ధైర్యము పౌలుకు ధైర్యమిచ్చింది. మగ్దలేని మరియ ధైర్యము శిష్యులకు ధైర్యమిచ్చింది.

1294. **తల్లికి గల లక్షణాలు అనేకమని చెప్పవచ్చు :**

1) తల్లి నిర్మిస్తుంది (ఆది.3:20; 7:8).

2) తల్లి పోషిస్తుంది (నిర్గమ.2:9; మత్తయి 6:26).

3) తనతోనే బిడ్డలను ప్రాణ సమానంగా పెంచుతుంది, ప్రేమిస్తుంది. (1రాజులు 3:20,16).

4) తల్లి జ్ఞానమిస్తుంది. (సామె.31:26; కొలస్స.2:3).

5) తల్లి కంటికి రెప్పగా కాపాడుతుంది. (మత్తయి 23:37; కీర్తన 121:7).

6) తల్లి ఆదరిస్తుంది. (యెషయా 66:13; 2కొరింథీ.1:4; యోహాను 14:6).

7) తల్లి వేదన పడుతుంది. (యోహాను 16:21; యెషయా 5:37).

8) తల్లి కనిపెట్టుకుంటుంది. (సామె.31:27; సామె.15:3).

9) తల్లి తన బిడ్డలను బట్టి సంతోషిస్తుంది. (యోహాను 16:21).

**దేవునికిష్టురాలిగా జీవిస్తుంది :**

10) జ్ఞానవంతురాలిగా ఇల్లు కడుతుంది (సామె.14:1).

11) అవధులు లేని రీతిగా ప్రేమిస్తుంది.

12) క్రమశిక్షణతో బిడ్డలను పెంచగలదు.

13) ఆతిథ్యమియ్యగలదు (Host) షూనేమీయురాలు

14) ప్రార్థనాపరురాలు (విలాప. 2:21).

15) త్యాగశీలి, ఓర్పు గలది, ప్రేమామయి.

16) ధైర్యంగలది, సౌశీల్యవతి, ఉత్తమ ఇల్లాలు.

17) భర్త, బిడ్డలతో ధన్యురాలని పొగడబడుతుంది.

1295. గతంలో కరోనా బాధల్లో ప్రపంచానికి లాక్‌డౌన్,
క్రైస్తవునికి నీల్‌డౌన్, కరోనాకి కౌంట్‌డౌన్, సాతానుకి గో డౌన్.
క్రైస్తవ్యంలో చూడవలసినవి కొన్ని ఉన్నాయి :
హోదా కాదు బోధ, అలంకారమైన మందిరము కాదు ఆత్మీయమైనమంద.
ఆస్తి కాదు, ఆత్మీయ ఎదుగుదల, వస్త్రాలలో కాదు వ్యవహారాలలో.
ఆచారాలలో భక్తి కాదు, బ్రతుకులో భక్తి కావాలి.

1296. మదిలో క్రీస్తు ఉండాలి. గదిలో ప్రార్థన ఉండాలి.
ఊరిలో సాక్ష్యముండాలి. చదువులో శ్రద్ధ ఉండాలి.
ఇంట్లో పొదుపు ఉండాలి. సంఘములో అదుపు ఉండాలి.
ఉద్యోగంలో నీతి ఉండాలి. వ్యవసాయంలో ఓర్పు ఉండాలి.
దైవ సేవలో పిలుపు ఉండాలి. హృదయంలో క్రీస్తు ఉండాలి.
చేతిలో బైబిలు ఉండాలి. ముఖంలో కాంతి ఉండాలి.
మాటల్లో నిజము ఉండాలి. చూపులో స్వచ్ఛత ఉండాలి.
క్రియల్లో యథార్థత ఉండాలి. పరిచర్యలో జాగ్రత్త ఉండాలి.
పాటించుటలో ముందు ఉండాలి. రాకడలో ఎత్తబడాలి.
ఇవన్నీ ఉన్నవాడే నిజ క్రైస్తవుడు.

1297. మనము ఎదుర్కొనే కష్టాల్లో మనమే కృంగిపోతే లోకాన్ని ఆదరించేదెవరు? బెదిరిపోతే బలపరిచేదెవరు? లోకాన్ని చేయిపట్టి లేపేదెవరు? లోకాన్ని స్థిరపరిచేదెవరు? అంధకారంలో ఉంటే వెలుగిచ్చేదెవరు?

ఒక బాలుడు మాకెన్నో భూములున్నాయి, మాకెన్నో అపార్ట్‌మెంట్‌లున్నాయి, గొప్ప సెల్‌ఫోన్‌లు, నగలు, విలువైన వస్త్రాలు చెప్పగా, తన స్నేహితుడైన మరో బాలుడు మాకు దేవుడు తండ్రిగా ఉన్నాడు. మీకు విగ్రహాలున్నాయన్నాడు. నిజానికి యెహోవా దేవుడుగా గల జనులు ధన్యులు.

1298. సోమరీ, చీమల యొద్దకు వెళ్ళు క్రమశిక్షణ నేర్చుకోవాలని బైబిలు బోధిస్తుంది. భూమిని చూచి ఓర్పును నేర్చుకోవాలి. చెట్టును చూచి ఎదుగుదల నేర్చుకోవాలి. ఉపాధ్యాయుని చూచి సరియైన విద్య నేర్చుకోవాలి. దైవజనుల సుగుణాలు చూచి మంచి ఆదర్శాలు అలవరుచుకోవాలి. క్రీస్తును చూచి ఆత్మీయ ఫలాలు ఫలిస్తూ ఆయనలో రూపాంతర అనుభవంతో క్రీస్తు లక్షణాలన్నీ అలవరచు కోవాలి, క్రీస్తు పోలికలోకి మారాలి.

1299. భయపడరాదు, క్రీస్తు విశ్వాసి భయపడి దిగులుపడరాదు అని ప్రభువు తెలిపాడు. 366 రోజులు 366 వాగ్దానాలు దేవుడు మనకు ఇచ్చాడు. భయపడకుడి. భయపడుచూ కూర్చుంటే బ్రతుకులో ముందుకు సాగలేము. ఓటమి ఎదుర్కొన్నా ఫరవాలేదు. తరువాత ఏమి చేయాలో ప్రార్థిస్తే పరిశుద్ధాత్మ బోధించి విజయాన్నిస్తాడు.

1300. పది ఊర్లు తిరిగినా, పదివేలు ఖర్చుపెట్టినా నిజమైన శాంతి, నిజమైన సంతోషము అనేవి స్వంత ఆలోచనలతో పొందలేము గాని, దేవుని వాగ్దానము బట్టి ఎవరైతే దేవునితో ఆనుకొని, ఆయన చిత్తానుసారముగా జీవిస్తే పూర్ణశాంతి గలవారిగా, నా శాంతినిస్తానని వాగ్దానము చేశాడు. పౌలు చెప్పినట్లు మరల చెప్పుదును– ప్రభువు నందే ఆనందించాలి, అదే నిజమైన సంతోషము.

1301. తోటమాలి రోజూ నీరుపోస్తూ తోటలో చెట్లను గమనిస్తూ కలుపు మొక్కల్ని తీసివేస్తూ శ్రద్ధ వహించిననూ తగిన కాలములో పూలు, పండ్లు యిచ్చేవరకు కనిపెట్టు రీతిగా మనమంతా ఓర్పుతో మంచి పనులు చేస్తూ మంచి ఆశయాలు పాటిస్తూ చెడు బోధలను ద్వేషిస్తూ, పెరికివేస్తూ ప్రతిఫలములు ఇచ్చే దేవుని చిత్తములో గుర్తింపుకై కనిపెట్టినప్పుడు భళా నమ్మకమైన మంచి దాసుడా, కొంచెములో నమ్మకముగా ఉన్నావు అని అభినందించగలడని బైబిలు బోధిస్తుంది.

1302. దేవుడిని ప్రార్థించి, సమయోచిత సహాయము కొరకు సంప్రదించుట శ్రేష్ఠమైన అనుభవము. అలాకాక పెద్దలను, బంధువులను, స్నేహితులను సంప్ర దించినను సరియైన నిర్ణయము లభించదు. మంచిని నమ్మి, చెడును చెంతకు చేరనీయక నీతిగా జీవిస్తే నీతిపరులను కనికరించుటకు దేవుని కన్నులు నిరంతరము వెదకుచూ, ఆలోచనకర్తయగు దేవునిని దావీదు ఆశ్రయించినట్లు మనము కూడా ఆశ్రయించాలి.

1303. జీవితంలో ఎన్నో శోధనలు, పొరపాట్లు తప్పవు. వంద అబద్ధాలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేయడం కంటే ఒక్క నిజమును ధైర్యంగా చెప్పి క్షమించమని దేవునిని ముందుగా క్షమాపణ అడిగి, ఎవరిని బాధించామో వారిని కూడా అహం వదులుకొని కాస్త వినయంతో, తగ్గింపుతో సారీ అని చెప్పగలిగిన ఆనందము, నెమ్మది గొప్పది, ఉత్తమమైనదని నమ్మి ఆచరించాలి.

1304. ఒక మనిషిని నమ్మడంలోగాని, నమ్మించడంలో గొప్పతనం లేదు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో గొప్పతనం ఉంటుంది. నిజం చెప్పేసి బాధపెట్టినా ఫర్వాలేదు గాని అబద్ధాలు చెప్పి మోసం చేయరాదు. అబద్ధాలు చెప్పే పెదవులు యెహోవాకు హేయములు అని బైబిలులో ఉంది. బుద్ధి మనలను కాపాడు తుంది. వివేకము మనకు కావలి ఉంటుంది.

1305. ఎవరైనా అపహాస్యం చేసి హేళన చేసినా ఓర్పుతో సహించడం నేర్చుకోవాలి. తగిన కాలములో దేవుని బలిష్ఠమైన చేతిక్రింద దీన మనస్కులమైతే తగిన కాలములో హెచ్చించగలడు. సంసోను హేళనల మధ్య ప్రార్థించి జయము పొందాడు.

1306. ఎవరో విలువ ఇవ్వలేదని నీ విలువ తగ్గిందని కాదు, నీ ముందున్న జీవితం విలువైనది. విలువలు లేని, విలువ ఇవ్వని వ్యక్తులకు దూరంగా ఉండాలి. అప్పుడే తగిన కాలంలో మన విలువ గుర్తించే సమయం వస్తుందని నిరీక్షణలో ఉండాలి. మనల్ని నిజంగా ప్రేమించే వారికి ఇవ్వవలసినది ఖరీదైన కానుకలు కాదు, వట్టి మాటలతో వాగ్దానాలు కాదు. ఇవ్వవలసినది నేను నీకున్నానన్న ధైర్యం, అపార్థాలు, అనుమానాలనే అడ్డంకులు వచ్చినా పట్టుకున్న చేయిని ప్రాణం పోయినా విడిచిపెట్టనన్న నమ్మకమివ్వాలి.

1307. ఇష్టంలేని బంధం ఎక్కువకాలం నిలవదు. ప్రేమ లేనిచోట ప్రయాణం నడవదు. సమ్మతింపక ఇద్దరు కలిసి నడువలేరు. హనోకు అనే భక్తుడు దేవునిలో చాలా కాలము నడిచాడని బైబిలు చెబుతోంది. అహంకారులతో నడువలేము, నొప్పించి మాట్లాడేవారితో స్నేహం చేయలేము. దేవుని ప్రేమిస్తూ, తోటి వ్యక్తులను ప్రేమతో ఆదరించి, సడలిన మోకాళ్ళు బలపరచు గొప్ప హృదయం గలవారితో స్నేహం చేయాలి.

1308. విలువ కోసం విలువ లేనిచోట ప్రయత్నించడము ఉన్న విలువను వదులుకోవడమే అవుతుంది. చేజారిన బంధము, నోరు జారిన మాట ఎన్నటికీ

తిరిగిరావు. నిజము ఎంత నిజమైనదైనా, ఎంత విలువైనదైనా నిజము నిప్పు లాంటిదని తెలిసినా సమాజంలో కొందరు అబద్ధాన్నే నమ్ముతారు. నిజము ఒప్పుకోలేని బలహీనులుగా పిరికివారిగా ఉంటారు. దేవుని నమ్మినవారు బహు బలము కలిగి ఉంటారు, ధైర్యంగా ఉంటారు.

1309. మనల్ని ప్రేమించేవారు ఎప్పుడూ ఒకేరీతిగా ఉండలేరు. ఈ ప్రపంచంలో అన్నిటికన్నా వేగముగా మారేది మనిషి మనసు, ఆలోచనలు. గనుక మారుచున్న లోకమందు మనుషులెంత మారినా, ప్రభు యేసు ప్రేమ మారదు. నమ్మకము ఉంటే మౌనం కూడా అర్థమవుతుంది. నమ్మకము లేనిచోట అపార్థాలు వస్తాయి. నమ్మకమనేది అనుబంధాలకు ఆత్మలాంటిది. ఆశపడి బాధపడుట కంటే ప్రశాంతంగా ఉండటం మంచిది.

1310. స్వచ్ఛమైన బంగారము కూడా పరిపూర్ణమైన ఆకారము పొందాలంటే అగ్నిలో కాలక తప్పదు, కరగక తప్పదు, సుత్తి దెబ్బలతో నలగక తప్పదు. మనిషి కూడా ఉన్నత స్థానం చేరాలంటే రకరకాల శ్రమలు, శోధనలు, కష్టాలు, బాధలు తప్పవు.

1311. ఇతరులకు చెప్పేటందుకే నీతులు ఉంటాయి. చెప్పడము సులభము అయితే ఆచరించడము కష్టము. అలా ఆచరించుటకు కావలసింది నైతిక బలము. అది పెద్దలను గౌరవించడంలోను, నీతిగా బ్రతుకుటలోనే లభించగలదు. ఆచరించి చూపాలి.

1312. గాలి యొక్క ఉధృతిని ఆపలేముగాని, తెరచాపను ఆ గాలికి అనుగుణంగా తిప్పుకొని నావను నడిపించవచ్చు. అలాగే వచ్చే కష్టాలను ఆపలేము గాని దైవబలంతో, స్వచిత్తంతో, తగిన పరిష్కారము ఆలోచించి ధైర్యంగా అధిగమించవచ్చు. ప్రేమను చూపడంలో ఆలస్యం చేయరాదు. శవానికి మందుబిళ్ళ వేసి ప్రయోజనం లేదు.

1313. మనము చేసే మంచి పనులు దేవుని దృష్టికి సరైనవి, యోగ్యమైనవి అయినప్పుడు ఇతరుల మెప్పు బాహాటంగా పొందాలని ప్రశంశలు, గుర్తింపు కావాలనుకోరాదు. మనము పీల్చుటకు గాలిలో ఆక్సిజన్ బ్రతికిస్తుంది. అది కనబడకపోయినా ప్రాణం పోస్తుంది. మనం చేసే మంచి పనులు అందరికి తెలియాలని లేదుగాని మనము మాటవల్ల గాని క్రియల వల్ల గాని ఇతరులకు ఊరట లేదా ఆనందాన్ని అందించుట దేవునికిష్టమైన పని.

1314. మనము ఎదుర్కొన్న శ్రమలవల్ల, మాటలవల్ల శారీరక, మానసిక గాయాలు ఏర్పడతాయి. ఎదుర్కొన్న గాయాలన్నీ జ్ఞాపకంపెట్టుకొంటే అది బాధను కలిగిస్తుంది. ఆ రీతిగా తగిలిన ప్రతి గాయాన్ని పాఠంగా మార్చుకుంటే అది మార్పునిస్తుంది. పొరపాటున ముల్లును తొక్కిన కాలులా బాధపడుతూ అక్కడే నిలిచి ఉండిపోరాదు. అతి జాగ్రత్తగా అడుగులు వేయుటలో మెళుకువలు పాటించాలి, ఆత్మవిశ్వాసముండాలి. ఆ శక్తితో ఒక్కో అడుగు వేస్తూ ధైర్యంగా నిబ్బరంగా సమస్యలనెదుర్కొని విజేతలం కావాలి.

1315. నిత్యజీవితంలో ఎన్నో శిఖరానుభవాలు, లోయానుభవాలుంటాయి. ఆనందించే సమయాలు విజయాలనెదుర్కొనుటయే కాక ఆకస్మికమైన శోధనలు శ్రమలు, లోయానుభవాల్లో నిబ్బరంగా ఉండటం నేర్చుకోవాలి. పెద్ద చెట్టును గమనిస్తే చెట్టు ఆకులు రాలినను రెట్టింపు ఆకులతో అందంగా చిగురిస్తుంది. ఏ అనుభవమెదురైనా నూతన అనుభవాలు ఉజ్జీవాన్నిస్తాయి. దేవుని కొరకు ఎదురు చూచువారికి నూతన బలము లభిస్తుందని నమ్మాలి.

1316. మన జీవితాలను నిర్దేశించేది దేవుడే. ఏ తల్లిదండ్రుల పెంపకంలో పెరగాలి? ఏ రూపంతో ఉండాలి? ఏ ఏ తలాంతులనివ్వాలి అన్నది దేవుని వశం.

1317. ఈ లోకంలో అబద్ధాలు చెప్పడము చాలా తేలికైపోతుంది. అది అర్థమయినంత త్వరగా నిజము అర్థంకాదు. నిజము నిలకడమీద తెలుస్తుంది. నిజాయితీకి చాలా విలువ ఉంది. నిజాయితీకి గౌరవముంటుంది. మన చేతిలో ఉన్న నిర్ణయాలు మన విలువను, నిజాయితీని నిలుపుతాయి. నిజాయితీపరులకు దేవుని దీవెన ఉంటుంది.

1318. జీవితమనగానేమిటోనని ఒక వేదాంతి రెండు మాటల్లో చెప్పాడు. జననం నుండి మరణం వరకు సాగే పయనంలో మనల్ని నమ్ముకొన్న వారికోసం బాధ్యతతో బ్రతకడమే జీవితము. మన నిరంతర ప్రార్థనా విధానము ఎలా ఉండాలంటే **"దేవా, నేనెవరినైనా గాయపరిస్తే క్షమాపణ అడిగే శక్తినివ్వు, నన్నెవరైనా గాయపరిస్తే క్షమించే గుణమివ్వు".** మన జీవితాలు చాలా చిన్నవి. ఎన్నో బాధలు, కష్టాలు భరించాలి గనుక ఆ భారాన్ని దేవునిపై వేద్దాం.

1319. విత్తనము పాతినపుడు భూమిని పగులగొట్టుకొని మొలకెత్తి హాయిగా నవ్వుతూ మారాకు తొడుగుచూ సూర్యుని చూస్తూ చకచకా ఎదిగిపోతూ లోపలి వ్రేళ్ళను అతి దూరంగా విస్తరింపజేస్తూ నిటారుగా ఠీవిగా ఎదుగుట మౌనంగా జరిగిపోతుంది. దైవసృష్టి రహస్యమని సృష్టికర్తను స్తుతిస్తున్నామా? సంకల్ప బలం ఉండాలేగాని పరిస్థితులు ఎలా ఉన్నా, మన ఎదుగుదలను ఎవరూ ఆపలేరు.

1320. పరువు నలుగురిలో ఉండాలి, కష్టం గడప లోపల ఉండాలి, దుఃఖం మనసులో ఉండాలి. చిరునవ్వు పెదవులపై ఉండాలి. కొన్ని పరిచయాలు మంచి స్నేహితులనిస్తాయి. అయితే కొన్ని పరిచయాలు హృదయాన్ని తాకి ఆత్మీయులను చేస్తాయి. నిన్న, నేడు, రేపు ఒకేరీతిగా ఉండే దేవునిని నమ్మితే నిన్న ఉన్న సంతోషం రేపు ఉంటుందో లేదో అన్న భయాలు దూరం కాగలవు.

1321. **మనిషి పైకి ఎదగడానికి కొన్ని ముఖ్య విషయాలు చూద్దాము :**

1) నీకున్నదానిలోనే ఇతరులకు చిరు సహాయం చేయాలి.
2) ఓటమిలో కృంగిపోకుండా ప్రయత్నించాలి.
3) పేదరికంలో నిజాయితీ కనబరచాలి.
4) మాట తీరులో సరళత్వం ఉండాలి.
5) కోపంలో సహనం చూపాలి.
6) కష్టాలను తట్టుకొనే శక్తి నిలుపుకోవాలి.
7) ప్రతి మనిషికి తగిన గౌరవమివ్వాలి.

1322. ఈ జీవితంలో జయాపజయాలు దేవుని అధీనంలోనే ఉంటాయి. విజయము పొందుటకు ఇరుకు మార్గంగుండా పయనించక తప్పదు. అపజయమునకు విశాల మార్గం ఉంటుంది. అందుకే పరిష్కారము లేని సమస్యకై చింతించ రాదు. మంచి పరిష్కారమిచ్చి సమయోచితంగా నడిపించే ఆలోచనకర్తయు, ప్రార్థనలు ఆలకించు యేసు నేనే మార్గం అని చెప్పిన దారిలో సాగిపోవాలి.

1323. జాన్ హైడ్ గారికి ఒంటి మోకాళ్ళ ప్రార్థనా వీరుడని పేరు. ఆయన గంటల తరబడి మోకాళ్ళపై ప్రార్థించేవారు. రాత్రులు నిద్రలేక ప్రార్థించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అనేక దైవజనులు మన ప్రతి అక్కరను తీర్చేది మోకాళ్ళ జీవితం అన్నారు. వాచ్‌మేన్‌నీ గొప్ప భక్తుడు దేవునిని ప్రార్థించే సమయంలో సమస్య కొరకు వేడుకొనేవారు, ఆ సమస్యను పట్టుదలతో కూడిన ప్రార్థనలో దేవుని హస్తాలకు అప్పజెప్పేవారు.

1324. ఏ దేవుడైతే గొల్యాతును ఓడించడానికి దావీదుకు సహాయము చేశాడో, దారి లేని చోట మోషేకి దారి చూపాడో అదే దేవుడు నీ పరిస్థితిలో విజయము ఇవ్వబోతున్నాడు. మీ పరిచర్య యొక్క రహస్యమేమిటని అనేకులు అడిగితే మూడు విషయాలు చెప్పారు. ఒకటి ప్రార్థన, రెండు ప్రార్థన, మూడు ప్రార్థన. కష్ట కాలమందు దేవుని ప్రార్థించాలి. అభివృద్ధి కలుగజేయునపుడు ప్రార్థించాలి, ఆపదలో ప్రార్థించాలి, ఆపద తొలగినపుడు భద్రతకై ప్రార్థించాలి.

1325. శిఖరాగ్రాన ఉన్నవారిని చూచి నిరాశ చెందరాదు. వారు కూడా మజిలీని మొదటి మెట్టు నుండి ఆరంభించి అంచెలంచెలుగా పైకి ఎక్కారు. కెరటాలు కాళ్ళ దగ్గరకు వచ్చాయని సముద్రాన్ని చులకనగా చూడటం ఎంత తప్పో ఎదుటివారి మంచితనాన్ని చేతకానితనంగా చూడడం అంతే తప్పు. నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించాలి. నీకంటే ఎదుటివానిని గొప్పగా ఎంచుకొని గౌరవిస్తే తిరిగి నీకే గౌరవం దక్కుతుంది.

1326. అబద్ధం చెప్పడం శాపం లాంటిది, అది తప్పించుకొనే ధోరణి పెంచుతుంది. నిజం వరం లాంటిది, ఎదుర్కొనే శక్తిని పెంచుతుంది. చెడు తొందరగా ఇతరులను ఆకర్షిస్తుంది. నిలచి ఆలోచించినట్లయితే నిజమే నిన్ను గొప్పవాణ్ణి చేస్తుంది. మనకు ఏ సమయానికి, ఏ పరిస్థితికి ఏమి ఇవ్వాలో మనలను సృష్టించిన దేవునికి బాగా తెలుసు గనుక మన జీవితాన్ని దేవునికి సంపూర్ణంగా సమర్పించుకొని ప్రశాంతంగా జీవించుట నేర్చుకోవాలి.

1327. ఒక కాకి నేను నల్లగా ఉన్నందున నన్నెవరూ పట్టించుకొనుటలేదని ఏడ్చిందట. రామచిలుక నేను అందంగా ఉన్నానని పట్టి బంధిస్తున్నారని చెప్పిందట. దీని నీతి ఏమనగా మనకు ఏది కలిగితే, ఏది ఉంటే అదే ఆనందం కాని లేనివాటిని కోరుకోకూడదు. సంతుష్టి సహితమైన దైవభక్తి లాభదాయకము.

1328. పిలుపు వుంటేనే దైవ సేవకు రావాలి. లేనిచో సామాన్య విశ్వాసిగా ఉండుట మేలు. యోగ్యత లేకుండా పెద్దగా నుండుటకంటే, పరిచారకునిగా నుండుట మేలు. సామర్థ్యము లేకుండా ప్రసంగించుట కంటే సాగిలపడి ప్రార్థించుట మేలు. సామర్థ్యము లేకుండా ఇతరుల మీద ఆయాసపడుచూ ఆరాధించుట కంటే సమాధానపడి సహవాసములో నుండుట మేలు. ఇతరులపై కక్షతో మిషతో ఆరాధించుటకంటే ప్రేమ కలిగి సహవాసంతో నుండుట మేలు. ఇతరులకు ఉన్న సమర్పణను చూచి సణుగుట కంటే విమర్శించుటకంటే సంతోషించుట, ప్రశంసించుట మేలు.

1329. ఒక భర్త నిజాయితీ గల లక్షణము భార్య రోగిగా ఉన్నపుడే గ్రహించవచ్చు. భార్యలో నిజాయితీ ఆర్థికంగా భర్త బాధలోనున్నప్పుడే గమనించవచ్చు. కన్నబిడ్డల ప్రేమ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడే తెలుస్తుంది. తోబుట్టువుల లక్షణము తల్లిదండ్రుల ఆస్తి పంపకాల సమయంలో తెలుస్తుంది.

1330. స్నేహితుల ఔన్నత్యం బాధల్లో ఉన్న సమయాల్లో గుర్తించవచ్చు. బంధువుల ప్రేమ మన ఒంటరితనంలో గాని, రోగము వచ్చిన సమయాల్లో గాని,

దూరంగా ఉన్నపుడే తెలుస్తుంది. నిజ విశ్వాసులను కష్ట సమయాల్లో గుర్తించగలము. నిజమైన ప్రేమ ప్రతిఫలం కోరనిది.

1331. బ్రతుకుటకు డబ్బు ఎంత అవసరమో, మనవాళ్ళు అనుకొనుటకు బంధాలు కూడా అంతే అవసరము. గుర్తుకురావడం గొప్పకాదు, మరువకపోవడం గొప్ప. గుర్తుంచుకొనేది మైండ్ చేస్తుంది. మరువలేనిది హృదయం చేస్తుంది.

1332. నీతి నిజాయితీ గలవారు సింహం వలె ధైర్యంగా ఉంటారు. ఎవరికీ వంగి దండాలు అకారణంగా పెట్టి మంచి చేసుకోరు. భట్రాజుల్లాగా భజనలు చేసి ప్రసన్నం చేసుకోరు. మనుష్యులను నమ్ముకొనుట కంటే దేవుని ఆశ్రయించుట మేలు అంటారు. వారికి దమ్ము, ధైర్యం దేవుడిస్తాడు. అందరూ ఆలోచిస్తారు, ఎందరో ప్రారంభిస్తారు, కాని కొందరే ముగిస్తారు. ఆది అంతమైన క్రీస్తు అంతము వరకు మన జీవిత ప్రయాణంలో తోడుంటారు.

1333. ఆకలితోనున్నవారికి ఆహారం పెట్టడం, వస్త్రాలు లేని వారికి వస్త్రాలు దానం చేయడం, దుఃఖితులను ఓదార్చడము, సడలిన మోకాళ్లను బలపర్చడము, కారు చీకట్లో కాంతి రేఖగా నుండి బాధలో నున్నవారికి ఊరటనిచ్చే మనస్సు గలవారికి తిరిగి దేవుడు గొప్ప మేలు చేసి ప్రతిఫలమిస్తాడన్నది నిజం.

1334. సింహము వెనుక ఎన్ని కుక్కలు మొరిగినా సింహము విలువ తగ్గిపోదు. మన వెనుక ఎంతమంది ఎన్ని విమర్శలు చేసినా దేవుడు మనలో ఉంచిన సామర్థ్యం, విలువ, తలాంతుల సమర్థత తగ్గిపోదు. నారు, నీరు పెట్టకుండా పెరిగేవి రెండు. ఒకటి పొలములో కలుపు మొక్కలు, రెండవది మనిషిలో గర్వం అహంకారము. కలుపు మొక్కలవల్ల పొలము నాశనమైతే, గర్వము అహంకారము మనిషి పతనమవుతాడు. నాశనమునకు ముందు గర్వము నడుస్తుందని బైబిలు చెబుతుంది.

1335. మౌనంగా ఉన్నామంటే నిశ్శబ్దం కాదు. మనలో మనం మాట్లాడుకొనుట. ఏకాంతమంటే ఒంటరితనంకాదు. మనలో మనం యుద్ధం చేయుట. ఆధ్యాత్మిక పెంపుదలకు దేవునిలో సహవాసానికి ఏకాంతం మౌనము చాలా అవసరం. తాను కూర్చున్న కొమ్మ విరిగిపోతుందన్న భయం పక్షికి ఉండదు. పక్షి తాను వాలిన కొమ్మను నమ్ముకోదుగాని తన రెక్కల్ని నమ్ముకుంటుంది. విశ్వాసి దేవుని రెక్కల క్రింద ఆశ్రయిస్తాడు.

1336. జీవితంలో మన వెనుక ఏమీరాదు. మనము సంతోషంగా గడిపిన క్షణాలే విలువైనవి. మనము సంపాందించింది ఏదీ మనకు కాదు. ఒక్క మంచి

తనము, ఇతరులపట్ల చేసిన మంచికార్యాలు, దానధర్మాలు చూపించిన కరుణను బట్టి ఎదుటివారు మనలను గుర్తుంచుకోగల్గిన ప్రేమ అపురూపమైన సంపద.

1337. జరిగిపోయిన గతం కలలాగా మర్చిపోవాలి. జరుగుచున్న దానిని ఎంతో శ్రద్ధగా గమనించినప్పుడు అంతా మంచి జరుగుతుంది. జీవితం ఒక తరగతి గది. ప్రతి పూటా ఒక క్రొత్త పాఠము నేర్చుకోగలము. రోజు రోజుకో క్రొత్త అనుభవం నేర్చుకోగలము. 100 పేజీల పుస్తకములో తప్పులున్నప్పుడు, వంద సంవత్సరాల జీవితంలో అనేక తప్పులుంటాయి. చదువుతూ సరిదిద్దు కోవాలి. సరిదిద్దుకుంటూ చదువుకోవాలి. అది పుస్తకమైనా, జీవితమైనా అంతే.

1338. ఏదైనా జీవితంలో సాధించాలంటే తగిన వాతావరణంకాదు గాని మంచికోసం తపించే మనస్సు, ఏకాగ్రత, శ్రద్ధ కావాలి. సంకల్ప బలం మనలో ఉంటే వాటంతట అవే అన్ని సమకూరుతాయి. దేవుని చిత్తంలో ప్రార్థించువారికి సమస్తము సమకూడి జరుగునని బైబిలు చెబుతుంది. నడక నేర్పిననాన్న, మాట నేర్పిన అమ్మ, తోడు నిలిచిన అన్న, నీడలా నడిచిన స్నేహితులు దేవుడిచ్చిన కానుకలు. దేవునికి కృతజ్ఞతలు చెప్పి వారిని కాపాడుకోవాలి.

1339. ఆనందకరమైన జీవితము అందరికీ ఉండదు. కష్టాలలో, దుఃఖములో అండగా నిలిచే విశ్వాసుల సహవాసంలో దైవజనుని సంఘ ప్రార్థనలలో నిబ్బరంగా జీవించగలము. మనిషికి కాలము విలువ తెలుసు, డబ్బు విలువ తెలుసు, ప్రాణము విలువ తెలుసు కాని మనిషిని మనిషి నిజమైన ప్రేమతో ప్రేమించడం ఇతరుల అవసరతలు గుర్తించడం, ఆపదలో ఆదుకోవడం కొంతసమయం వారికోసం కేటాయించాలి.

1340. సహనమునకు మించిన ఆయుధము లేదు. విశ్వాసాన్ని మించిన భద్రత లేదు. అలాగే చిరునవ్వును మించిన ఔషధం లేదు. మనస్సుకు నీతి, నిలకడ చాలా అవసరము. నిలకడ లేని మనస్సుకు నీతి తప్పిన మనిషికి సమాజంలో విలువ ఉండదు. చిమ్మ చీకట్లో ఉన్నప్పుడు చిన్న వెలుగు కనిపిస్తే ఎంత ధైర్యంగా ఉంటుందో, కష్టాల్లో ఉన్నప్పుడు ఓదార్చే వ్యక్తి మనతో వుంటే ఎంతో ధైర్యంగా ఉంటుంది.

1341. సంతోషము నేర్పలేని ఎన్నో విషయాలు కన్నీళ్ళు నేర్పుతాయి. గెలుపు నేర్పలేని ఎన్నో పాఠాలు ఓటమి నేర్పగలదు. స్నేహము నేర్పలేని ఎన్నో జాగ్రత్తలు దైవ చిత్తంలో దేవుడు నేర్పగలడు, అనుభవాలు నేర్పుతాయి. బ్రతుకుటకు డబ్బు

ఎంత అవసరమో మన అని అనుకోవడానికి బంధాలు కూడా అంతే అవసరము. నిజాన్ని నమ్మించాలంటే ఆధారాలు కావాలి. అబద్ధాన్ని నమ్మించాలి అంటే నటిస్తే చాలు. అనవసరముగా మాట్లాడరాదు. అనర్థాలు వస్తాయి. అర్థము గల విలువైన మాటలు ఇతరులకు ఊరట, స్ఫూర్తినిచ్చే మాటలే మాట్లాడాలి.

1342. కొన్ని జీవిత సత్యాలు మనకు మెళుకువ నేర్పిస్తాయి. మన ఇష్టాలు మారుతూ ఉంటాయి కానీ ప్రేమ మారకూడదు. కష్టాలు వస్తూ ఉంటాయి కానీ నమ్మకాన్ని కోల్పోరాదు. మాటలు మారుతూ ఉంటాయి కానీ ఇచ్చిన మాట మరువరాదు. నీ మాట అవునంటే అవును, కాదంటే కాదు అని ఉండాలి. ద్వి మనస్సుతో రెండు నాలుకలతో మాట్లాడరాదు. నలుగురిలో ఉన్నప్పుడు నాలుకను, ఆవేశంలో ఉన్నప్పుడు ఆలోచనలను అదుపులో ఉంచుకోవాలి.

1343. సముద్రము అందరికీ ఒక్కటేగాని శ్రమించేవారి పరిమితిని బట్టి లాభించ గలదు. ఈత వచ్చినవారికి లోనికి వెళితే ముత్యాలు లభిస్తాయి. వల వేసేవారికి చేపలు లభిస్తాయి. నిలబడినవారికి కాళ్ళు మాత్రమే తడుస్తాయి. అందరికీ ఒకే జీవితము, కాకపోతే మన ప్రయత్నాన్ని బట్టి ప్రతిఫలాలు లభిస్తాయి. వయసులో ఉన్నప్పుడు కష్టపడుటకు సిగ్గుపడితే, వయసు దాటాక బ్రతుకుటకు సిగ్గుపడవలసి వస్తుంది.

1344. ఎదుటివారివలె బ్రతకాలని ఎన్నడూ ప్రయత్నించరాదు. ప్రతి ఒక్కరి వేలిముద్రలు విభిన్నంగా సృష్టించాడు. విభిన్న తలాంతులనిచ్చిన దేవుని చిత్తములో ఆయన కోరిన పాత్రగా జీవించుటకు ఆయన చిత్తమును కనుగొనుట ఉత్తమము. ఎదుటివారిలో బ్రతికేందుకు వారి వద్ద ధనమున్నట్లు, తలాంతులు ఉన్నట్లు మనవద్ద లేకపోయినా ఫరవాలేదు. దేవుడు మనకిచ్చిన దానిలో తృప్తిపడుచు, ధైర్యంగా జీవించాలి.

1345. మన గౌరవాన్ని, మన స్థాయిని నిర్ణయించేది మనలోనున్న సద్గుణాలు, ప్రవర్తన తప్ప ఎదుటివారి పొగడ్త కాదు. వెలుగే లేదని చీకటిలోనే స్థిరపడిపోరాదు. వేదన, బాధలలో సర్దుకుపోరాదు. ప్రతి పనిలో కష్టమెదురవుతుందని వెనుకడుగు వేయరాదు. భయము పారద్రోలి ధైర్యంగా సమస్యల సాధనకై దైవంతో ప్రార్థన ద్వారా సంప్రదిస్తూ సాగిపోవాలి. యెహోవా యందలి భయభక్తులు బహు ధైర్యం పుట్టించును కదా? నీతిమంతులు సింహమువలె ధైర్యముగా ఉంటారు. ఎవరి కష్టాలు వారే ఓర్పుగా, నేర్పుగా, సహనంతో సమస్యలను సాధించుకోవాలి.

1346. జీవితంలో సర్వస్వం కోల్పోయినా ఒక్కటే స్థిరంగా ఉండేది భవిష్యత్తు. నిన్న, నేడు, రేపు ఒకేరీతిగా ఉండే దేవునికి మాత్రమే మన భవిష్యత్తు తెలుసు. మన గురించిన తలంపులు నిరీక్షణ గలవిగా దేవుడు చేస్తానని వాగ్దాన మిచ్చాడు. నిన్ను విడువను, ఎడబాయను సదాకాలము నీతో ఉంటానన్నారంటే భవిష్యత్తులో నిత్యత్వములో దేవుడు మనతో ఉంటాడు. స్వర్గాన్ని నరకంగాను, నరకాన్ని స్వర్గంగా చేసేది మన స్వంత నిర్ణయాలే గనుక పరలోకం చేరుటకు ఆశించి సాగిపోవాలి.

1347. దినములు చెడ్డవి గనుక సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మంచిగా సమయాన్ని వినియోగించగలిగితే మంచి అలవాట్లు వస్తాయి. మెలకువగా ఉండి ప్రార్థించాలి. ధనమున్నవారికి దానగుణము ఉండదు. దానగుణమున్న వారికి తగినంత ధనము ఉండదు. కోరికలతో జీవించేవారికి సేవాభావము ఉండదు. సేవాభారంతో ఉండేవారికి కోరికలు ఉండవు.

1348. మన అనుదిన ప్రార్థనలలో ఎల్లప్పుడూ కృపకై వేడుకోవాలి. మరియు ఇతరులను గాయపరచినప్పుడు క్షమాపణ అడిగే వినయము, విధేయత, తగ్గింపు నాకు ఇవ్వండి అని అడగాలి. ఇతరులు తప్పు చేస్తే క్షమించమని అడగాలి. నన్ను నా కుటుంబాన్ని బంధువర్గాన్ని స్నేహితులను భద్రంగా చూడాలని అందరూ నిత్యత్వంలో జీవించు కృపకై భారంతో ప్రార్థించాలి. ప్రతి పనిని ప్రయత్నించడం నీ ధర్మం. కానీ, ఫలితము దైవనిర్ణయము. పరిస్థితులు కాల నిర్ణయము ఎదుర్కొనుట మన మనోధైర్యము.

1349. ఒక్క నిమిషంలో ఏమీ జరగదు, జీవితమేమీ మారదు. ఒక్క నిమిషము ఆలోచించి తీసికొన్న నిర్ణయము మాత్రము జీవితాన్నే మార్చేస్తుంది. జీవితం చిన్నది, స్వల్పమైనది. జీవించు ప్రేమ అమూల్యమైనది. అరుదుగా లభించేదాన్ని వశపరచుకొని ఆనందించు. కోపం చాలా చెడ్డది త్రొక్కిపెట్టు. భయం భయంకరమైనది. ఎదుర్కో, జ్ఞాపకాలు తీయనివి. ఆస్వాదించు.

1350. మన జీవితంలో ఎంతగా ఒదిగి, తగ్గించుకొని జీవిస్తే అంతగా దేవుడు హెచ్చిస్తాడు. వినయానికి మించిన ఆభరణము లేదు, ఆత్మ విశ్వాసానికి మించిన అలంకరణ లేదు, చిరునవ్వుకు మించిన అందం లేదు. జీవితంలో ఎందరో పరిచయమవుతారు. నిన్ను పైపైనే అర్థంచేసుకొని నిష్క్రమిస్తారు. సరిగా అర్థం చేసుకొని, హత్తుకొని కష్టాల్లో, బాధల్లో తోడుగా ఉండేవారు చాలా కొద్దిమంది ఉంటారు. వారిని గుర్తించి కాపాడుకొని ప్రేమించాలి. క్రీస్తును ప్రేమిస్తే మనలో ప్రేమ ఉంటుంది.

1351. ప్రేమ, స్నేహం విలువైనవి. ఈ రెండూ కవలలుగా ఉంటాయి. బాధల్లో, సంతోషంలో, ఐశ్వర్యంలో, పేదరికంలో ఎవరు ఉన్నా, లేకున్నా చివరి వరకు తోడుగా నిలిచేది దైవము, దైవ సన్నిధి. దైవాన్ని ప్రేమించే విశ్వాసులు కూడా తోడుండగలరు. సహవాస ప్రార్థన బలమైనది. అలసిపోయే సమయాలు వస్తాయి. అలసిపోయి ఆగిపోవాలి. అనుకున్నప్పుడల్లా ఇంకొక అడుగు ముందుకు వేసి ధైర్యం తెచ్చుకోవాలి. భయం బందీని చేస్తే ధైర్యం దారి చూపుతుంది.

1352. మరిగే నీటిలో ప్రతిబింబము కనబడనట్లే ఆవేశంలో ఉన్న మనస్సుకు పరిష్కారము కూడా కనిపించదు. సమస్యలు ఎన్ని ఉన్నా ప్రశాంతమైన మనస్సుతో ఆలోచిస్తే పరిష్కారం లభిస్తుంది. ఎవరి మనస్సు దేవునిపై ఆనుకొంటుందో ఆ ప్రశాంతమైన మనస్సు అప్పుడే లభిస్తుంది. పూర్ణ శాంతిని ప్రసాదించే దేవుడినే ఆశ్రయించాలి. అప్పుడు ఎట్టి సమస్యలకైనా దేవుడే పరిష్కారాన్ని తెలియజేస్తాడని నమ్మి ప్రార్థించాలి. ఇతరుల దారిలో గాజుపెంకులు జల్లేవాడు చివరకు అవి తనకే గుచ్చుకొని బాధపడతాడు. చెరపకురా చెడేవు అన్నారు పెద్దలు.

1353. మనకు కష్టం వస్తే నవ్వేవాడు శత్రువు. మనకు ధైర్యం చెప్పి ఆలోచనలిచ్చేవారు బంధువులు. మన కన్నీరు తుడిచేవారు దైవంతో సమానునలు. దైవాన్ని నమ్మిన విశ్వాసులు, స్నేహితులు మనకు కనబడకుండా మన బాధల్ని గుండెల్లోకి చేర్చుకొని మౌనంగా కన్నీరు కార్చేవారు. అవధులు లేక నియమాలు పాటించక నిర్మలమైన మనస్సుతో ప్రేమించే కన్న తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బిజీ అని తూలనాడరాదు. మనకున్న విలువైన సమయాన్ని డబ్బు సంపాదనలో తన భార్యాబిడ్డలకై మాత్రమే కాక వృద్ధ తల్లిదండ్రులతో ఆప్యాయంగా గడపాలి.

1354. మంచు అనేది స్ఫటికములాంటిది. రోజు రోజుకు కరిగిపోతుంది. మంచును చూస్తే స్వచ్ఛంగా హిమము కంటే తెల్లనిది. దావీదు రాజు తన పాపాలు పోగొట్టాలంటే హిమము కంటే ఎఱ్ఱని రంగు పాపాలు తొలగించి పరిహరించ మని ప్రాథేయపడ్డాడు. చెడు అనేది చెత్తలాంటిది. రోజు రోజుకు పెరిగిపోతుంది. హృదయంలో చెత్త తొలగించుకొనే ప్రయత్నం చేయాలి. ధనవంతుల ప్రత్యేకత ధనము వల్ల తెలియనివారు దగ్గరవుతారు. పేదరికము దరిచేరినప్పుడు ఆప్తమిత్రులు కూడా దూరమవుతారు. కాని పేదరికంలో ఆప్యాయతలకు లోటుండదని నమ్మాలి.

1355. ఇనుమును ఎవరూ నాశనం చేయలేరు. దానికి పట్టిన తుప్పు దానిని చెడగొడుతుంది. అలాగే మనిషికి తనలోనున్న చెడు ఆలోచనలే అతనిని అగౌరవపరచి నాశనం చేస్తాయి. ఇక ముగిసిపోయింది అనుకున్నప్పుడు ఆశను వదులుకోరాదు. దేవుడు చివరి నిమిషంలో అద్భుతాలు చేయ సమర్థుడని నమ్మి ఆధారపడాలి. మనలో నుండే ప్రతి మంచి ఆలోచన మనలో మంచి ఆశయాలన్నీ ఇతరులకు వెలుగును చూపించేలా ఉండాలి. చీకట్లోకి నెట్టేదిగా ఉండకూడదు. మన చేతికి ఉన్న వ్రేళ్ళన్నీ ఒకేలా ఉండనట్లే వ్యక్తుల మనస్సులు ఒకేరీతిగా ఉండవు. తెలియక తప్పులు చేసేవాడు అమాయకుడు. తెలిసి తప్పులు చేసేవాడు మూర్ఖుడు. అలాంటి మూర్ఖుడిని మార్చలేము.

1356. కొన్నిసార్లు గతంను గూర్చిన చేదు అనుభవాలు, గాయాలు తలిస్తే కన్నీరు వస్తుంది. భవిష్యత్తు గూర్చి తలిస్తే భయమేస్తుంది. చిరునవ్వుతో వర్తమానాన్ని ఆస్వాదిస్తే సంతోషము నీ సొంతం కాగలదు. ఎంతో బాధలో ఉండి పౌలు అనే భక్తుడు ఆనందించండి, మరల చెప్పుదును ఆనందించండి. మీ సహనం అందరికీ తెలియనియ్యండి. ప్రభువు నందు ఆనందించమని చెప్పాడు. ఆనందం ఒక ఐశ్వర్యం. ప్రేమించండి గానీ మీ ప్రేమ అపహాస్యం కాకుండా చూసుకోండి. నమ్మండి గానీ ఇతరుల ప్రవర్తన నమ్మదగినదా, కాదా? సరిచూసుకోండి. ఇతరులు చెప్పేది వినండిం గానీ పరిశుద్ధాత్మ ప్రేరణ మీకు ప్రబోధించే మెల్లని స్వరమును మీరు నమ్మండి.

1357. జీవితము అనే పుస్తకములో ఒక్కొక్క పేజీ, ఒక్కొక్క అనుభవాన్ని నేర్పిస్తుంది. కొన్ని తీయని మధురానుభూతులు కలిగిస్తాయి, కొన్ని చేదు జ్ఞాపకాలనిస్తాయి. మంచి, చెడు సుఖం, దుఃఖం అన్నీ ఎదురవుతాయి. అన్ని అనుభవాలు అందరితో పంచుకోలేము. క్రీస్తు అనే మంచి స్నేహితునితో మనసులోని భావాలు పంచుకోగలిగితే గొప్ప మనశ్శాంతి లభిస్తుంది.

1358. క్రీస్తును కీర్తించుటలో దేవుడు మనకివ్వగల గొప్ప అనుభవాలున్నాయి.

1) మన ఉద్రేకాల్ని, చేతల్ని నియంత్రిస్తాయి.
2) బైబిలు సత్యాల్ని బోధిస్తాయి.
3) ప్రార్థనా వాతావరణాన్ని కలుగజేస్తాయి.
4) స్తుతి ఆరాధనను, ప్రార్థనను ప్రేరేపిస్తాయి.
5) భక్తి భావాలను వ్యక్తపరుస్తాయి.
6) మనస్సును ఉత్తేజపరుస్తాయి.
7) సాక్ష్యాన్ని పంచగలవు.

8) జ్ఞాపకశక్తిని పెంచుతాయి.
9) ఐక్యతను, విశ్వాస్యతను ఏకీభవింపజేస్తుంది.
10) దెయ్యాలను తరుముతుంది. దేవుని మహిమపరచగలవు.

1359. మనం వినే మాటలు మూడు రకాలు. కొన్ని మరచిపోయేవి. కొంతకాలం గుర్తుంచుకొనేవి. కొన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలసినవి. క్రీస్తు కొండమీద పలుకులు ఎప్పటికీ గుర్తుంచుకోగలిగినవి.

1360. జీవితంలో ఎందరితోనో ఎన్నో మాటలు మాట్లాడుతూ ఉంటాము. కొన్ని ఆప్యాయతతో, కొన్ని కఠినమైన రీతిగా, పదునైన మాటలుగా అనాలోచితంగా మాట్లాడుతుంటాము. మనము మాటలు ఆలోచించి మాట్లాడటంతోపాటు ఆలోచనాత్మకంగా ఉండాలి. అవమానించే, బాధపరిచే మాటలు మాట్లాడరాదు. ఎదుటివారిని ఉత్తేజపరిచే మాటలు, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించే మాటలు మాట్లాడాలి. అర్థంచేసుకొనే విధంగా ఉండాలి. కించపరిచేవిగా ఉండరాదు.

1361. ఒక మేథావి గమనించిన విషయాల్లో సమాజంలో తగిన మార్పు రావడము లేదు. ఎందుకని ఆలోచిస్తే పేదవారికి ధైర్యములేక, మధ్యతరగతి వారికి సమయము లేక, ధనవంతులకు అవసరం లేక పట్టించుకోనందువల్ల మార్పు లేదు. నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించాలన్న దైవాజ్ఞ గ్రహించి, పాటించకపోవడంలేదేమో ఆలోచించు.

1362. దేవుడు జీవితంలో సంపాదించే సామర్థ్యం ఇచ్చాడని గుర్తించువారెందరు? నా స్వశక్తి, నా తెలివి, నా అదృష్టమని పొంగి గర్విస్తూ ఉంటారు. ఉన్నదంతా వదిలేసి ఖాళీ చేతులతో దేవుని సన్నిధికి చేరాలని గుర్తుంచుకోవాలి. ఆ ఇచ్చేది పేదవారికి, ప్రేమించిన కుటుంబానికి ఆప్తులకు ఇచ్చివేసి వారి ప్రేమను, తృప్తిని పొందడం నేర్చుకోవాలి. అప్పుడే నిజమైన ఆనందం లభిస్తుంది. ఆనందం నీ స్వంతంకాగలదు. వారసులు కాదు.

1363. జీవితంలో వ్యక్తులను, సంపదను, ఉద్యోగాల్ని కోల్పోయినప్పుడు చింతిస్తూ కాలము వ్యర్థపరచరాదు. ఏమైనా మిగిలి ఉంటే అవి కూడా కోల్పోతాము. కొమ్మనుండి రాలిపోయిన పువ్వులను తిరిగి కొమ్మకు అతికించలేము కదా? ఆ కొమ్మ జీవంతో బలంగా ఉంటే మళ్ళీ చిగురించి పువ్వులు, ఫలాలనిస్తుంది. దేవుడు మనము ఆశతో అడిగిన కోరికలన్నీ తీర్చడు గానీ అవసరాలు తీర్చగలడు.

1364. పేదలను ఆదుకొనువాడికి దేవుని దయ అధికంగా ఉంటుంది. డబ్బు ఇచ్చింది దేవుడు తనకంటే అభాగ్యులను ఆదుకోవాలని. నలుగురికీ తగిన సహాయం చేయడం, దానం చేయడం, మంచి హోదాలో ఉంటే దేవుడు దీవించాడని దీనమనస్సు కలిగి నలుగురికీ జీవనోపాధిని అందించడం మానవత్వం కలిగి, దైవభక్తితో జీవించడంలో తృప్తి ఉంటుంది.

1365. సూటిగా మాట్లాడేవారికి శత్రువులెక్కువ. మాయమాటలు చెప్పేవారికి మిత్రులెక్కువ. మిత్రులు ఇహలోకపరంగా లేకపోయినా, సజ్జనులలో కొందరితో లేదా ఒంటరిగా జీవించినా నీతి, నిజాయితీ కలిగి జీవిస్తే చివరకు గౌరవ మర్యాదలు దక్కుతాయి. బండలు మోయగలిగే కండబలము ఉన్నవాడికంటే, బాధ్యతలు మోయగలిగిన గుండె బలము ఉన్నవాడే నిజమైన బలవంతుడు. ఆ గుండెబలము దేవుడందించే గొప్పవరముగా భావించి, కృతజ్ఞతతో జీవించాలి.

1366. ప్రపంచానికి నీవు అర్థంకాకపోయినా బ్రతికేయవచ్చు. కానీ ప్రపంచం నీకు అర్థం కానపుడు ఎక్కడా బ్రతుకలేవు. బైబిలు సత్యాలలో పాములవలే వివేకంగా, పావురాళ్ళవలె నిష్కల్మషంగా పరిశుద్ధంగా జీవించడం మేలు. మనలో ఉన్న భయాన్ని మనలోనే దాచుకొనుటను నేర్చుకోవాలి. ధైర్యాన్ని సాక్ష్యాన్ని, మంచిని నలుగురితో పంచుకోవాలి. దేవుని ప్రార్థించే సమయంలో సుఖమయమగు జీవితం అడగడంకన్నా, కష్టాలను తట్టుకొని భరించే ఓర్పు శక్తికై అడగాలి.

1367. కోట్లలో ఉన్నామా? కోటలో ఉన్నామా? అనేది ముఖ్యంకాదు. సంతృప్తిగా ఉన్నామా లేదా అని ఆలోచించాలి. సంతృప్తి సహితమైన దైవశక్తి గొప్ప లాభదాయకము సంకల్ప బలము ఉంటే పరిస్థితులెలా ఉన్నా మన ఎదుగుదలను ఎవరూ ఆపలేరు. దేవుని ఎడల భక్తి కలిగి ఆయన ప్రబోధాల ఆధారంగా జీవించిన వారికి విలువైన ఆలోచనలతో పాటు సంకల్ప బలము మెండుగా లభిస్తుంది.

1368. అగ్నిలో కాలిన బంగారము నుండి మస్టు తొలగి కాంతులు ప్రసరిస్తాయి. కష్టాల కొలిమిలో దేవుడు స్వర్ణకాంతితో ప్రకాశింపజేస్తాడు అనేది జీవిత సత్యము. రాపిడి లేనిదే రత్నం ప్రకాశించదు. కష్టాలు తట్టుకోగలిగితే మనిషి పరిపూర్ణత సాధించగలడు. మధ్యతరగతి వ్యక్తుల జీవితాలు గమనిస్తే తీరని కోరికలుంటాయి.

1369. జీవితంలో తృప్తి లేనివాడు అడ్డదారిలోనైనా సంపాదించి, సంపాదనకు మించి ఖర్చుచేయాలని ఇష్టపడతాడు. అట్టి అనుభవం చివరకు అప్పులపాలు చేస్తుంది. తనకంటే దర్జాగా తన పొరుగువాడు ఉన్నాడని ఆశ కలిగి ఉంటే నిజమైన సంతోషం దూరం చేసి అశాంతి కలిగిస్తుంది. విద్య, జ్ఞానం, సంపద ఎంత ఉన్నా వినయం, విధేయత మానవత్వం లేకపోతే మనిషికి విలువ ఉండదు.

1370. ఈ దినాల్లో ఆప్యాయతలు బంధాలకు విలువ తగ్గిపోయి, డబ్బుకు, పలుకుబడికి ప్రాధాన్యత కలుగుతుంది. తోటివారి సమస్యలు, బంధుప్రేమలు, నమ్మకాలు దూరమవుతున్నాయి. కొందరు అనుభవంతో చెప్పినదేమనగా డబ్బు లేకుంటే మన సొంతవాడు కూడా పరాయివాడవుతాడు. డబ్బులుంటే పరాయివాడు కూడా మనవాడవుతాడు.

1371. పేదరికము, వ్యాధి, డబ్బు, వస్తూ పోతూ పలకరిస్తాయి. తీరా వచ్చి చేరాక వదిలించుకోలేనివి. కీర్తి, జ్ఞానం, విద్య ఒకేవేళ మననుండి దూరమయ్యాక తిరిగి రానివి కాలము, యవ్వనం, పరువు. మనతో నీడలా వెన్నంటి ఉండేవి పాపము, పుణ్యము. ఈ జీవిత సత్యాలు జీర్ణించుకోవాలి. నిజము మనల్ని రక్షిస్తుంది. దేవుని చిత్తంలో లేనిదేమీ సంభవించదు. మనం కావాలనుకొంటే ఏదీరాదు. రావాలని ఉంటే ఏదీ ఆగదు. రాలేదని కృంగిపోక వచ్చిందని పొంగిపోరాదు. నిబ్బరంగా జీవించాలి.

1372. మన జీవిత గమనములో ఎవరి వద్ద ధనం ఉంటుందో వారు ఉన్నతులు, ఉత్తములు కానేరరు. ఎవరివద్ద మంచి గుణము, సత్ప్రవర్తన ఉంటే వారే ధన్యులు. మనశ్శాంతి ఇవ్వలేని సంపద, ఆరోగ్యం ఇవ్వలేని ఆయుష్షు. అర్థంచేసుకోలేని బంధం, అక్కరకు రాని స్నేహము. అవసరానికి ప్రయోజనం ఇవ్వవని గ్రహించే జ్ఞానావగాహన దేవునియందు భయభక్తుల ద్వారా మాత్రమే లభిస్తాయి.

1373. జీవితం అంటే జీవ మరణముల మధ్య ప్రయాణమే. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరడమే. దేవుడిచ్చిన కుటుంబము, సంపద, సమయము, తలాంతులు బహుమతిగా నుండగా సద్వినియోగం చేసుకోవాలి. గౌరవము వయస్సు, హోదాని బట్టికాదు సంస్కారమును బట్టి ఉంటుంది. ధనంతో దానం చేసేది మంచిదే గాని మనస్సుండాలేగాని నాలుగు మంచి మాటలతో కూడా ఎంతోమందికి స్ఫూర్తినిస్తూ వెలుగు నింపే జీవితాలుగా ప్రోత్సహించవచ్చు.

1374. నిజాయితీ అనేది ఒక వ్యక్తి తనకుతానుగా మలుచుకున్న అమూల్యమైన అలవాటు. విలువ లేనివారి దగ్గర ఆశించలేము. ఇతరులతో మన సంబంధ బాంధవ్యాలు మన మాట తీరును బట్టి ఆధారపడతాయి. కఠినమైన పరిస్థితుల్లో మనిషికి అండగా నిలిచేది విశ్వాసము.

1375. ప్రతి సమస్యకు మూడు దారులుంటాయి. అవి ఆలోచించడము, మార్చు కోవడం, వదిలివేయటం. దేవుడు వరాలనివ్వడు, శాపాలు కూడా ఇవ్వడు. అవకాశాలిస్తాడు, అభయమిస్తాడు. వాటిని వరాలుగానో, శాపాలుగానో మార్చుకోవడం మనం చేసే ఎన్నిక, నిర్ణయాలలోనే ఉంటుంది. ఆలోచనకర్త, ఆశ్చర్యకరుడైన యేసుపై చింతలన్నీ వేసి, అవి తీరిపోయి సేదతీర్చే ప్రేమామయుని ఆశ్రయించాలి.

1376. జీవితంలో అతి ప్రమాదకరమైనది దుఃఖం. **"దుఃఖపడువారు ధన్యులు వారు ఓదార్చబడుదురు"** అని బైబిలు బోధిస్తుంది. దాన్ని దిగమ్రింగుకొని యేసు వైపు చూడాలి. ఇంకా భయంకరమైనది నిరాశ. ఏలియా భక్తుడెదుర్కొన్నాడు. దేవుడే బలపరిచి పని ఇచ్చి విజేతగా మార్చాడు. ఇక నీచమైనది అసూయ. దీన్ని లక్ష్యపెట్టరాదు. హామాను అసూయ ద్వారా తన దుర్గతిని ఎదుర్కొన్నాడు. అందుకే ఈ మూడింటిపై జయం పొందేలా ప్రార్థించాలి.

1377. ఇష్టంతో చేసే పని శక్తిని పెంచుతుంది. కష్టంతో చేసే పని శక్తిని తగ్గిస్తుంది. అందుకే చేతికి వచ్చిన పనిని శక్తివంచన లేకుండా చేయగలిగితే రాజులు లేదా అధికారులమధ్య ఘనత దేవుడిస్తారు. మనకి హానిచేసిన వారిపై ప్రతీకారం తీర్చుకొనే ప్రయత్నం మానుకోవాలి. పగతీర్చుట నా పని అని దేవుడే తెలిపాడు. శత్రువులను క్షమించి, ప్రేమించాలని క్రీస్తు సిలువపై చేసి చూపారు.

1378. ప్రజల ముందు గొప్ప ఆధిక్యత గలిగిన స్థాయిలో ఉన్నా లేకున్నా పర్వాలేదు గాని మనస్సాక్షి ముందు గర్వంగా తలెత్తుకొని బ్రతికిన జీవితమే ఉత్తమమైనది. దీపము మౌనంగా ఉంటూ చుట్టూ కాంతిని ప్రసరింపజేస్తుంది. తనను తాను పరిచయం చేసికోగలదు. గొప్ప వ్యక్తిత్వం గలవారు మౌనంగా ఉంటారు.

1379. వారు సాధించిన విజయాలు ప్రకాశిస్తాయి. మనకు అందని వాటికై ఆశ పడరాదు. నచ్చని దానికోసం కష్టపడరాదు. మనకొరకు కష్టపడేవారు ప్రేమించేవారిని మరచిపోరాదు. మనము కొన్నిసార్లు మోసపోయినా ఫర్వాలేదు కాని, మనం నమ్మించి మోసం చేయరాదు.

1380. ఈ లోకంలో ఏ బంధము గూర్చి బాధపడరాదు. ఏడిపించేవారికి కన్నీటి విలువ తెలియదు. కన్నీటి విలువ తెలిసినవారు ఎప్పుడూ ఏడిపించరు. మనము సంతోషంగా జీవిస్తూ ఇతరులను సంతోషపెట్టాలి.

1381. కొన్నిసార్లు గతంలో చేదు జ్ఞాపకాలను తలుస్తూ ఉంటే కన్నీరాగదు. అర్థంలేని భవిష్యతుపై గురి పెట్టినప్పుడు భయం కలుగుతుంది. చిరునవ్వుతో, ఆత్మ బలంతో వర్తమానమును ఆస్వాదిస్తే ఆనందంగా జీవించగలము. నిన్న, నేడు, రేపు ఒకేరీతిగా ప్రేమించి, ఆదరించి, నడిపించే క్రీస్తును ఆశ్రయించు. ఎవని మనస్సు దేవునిపై ఆనుకొని జీవిస్తుందో వారిని పూర్ణమనస్సుతో, శాంతితో నింపగలడు.

1382. ఈ జీవితయాత్రలో వెలకట్టలేని సంపదలు రెండే రెండు. ఒకటి మనశ్శాంతి, రెండవది సంతృప్తి. ఇవి పొందగలిగితే ఆనందం మన స్వంతం కాగలదు. సంతుష్టి సహితమైన దైవభక్తి లాభదాయకం.

1383. జీవితంలో అనేక విభిన్న వ్యక్తులను కలుస్తూ ఉంటాము అలాంటప్పుడు

1) యవ్వనస్తులను కలిస్తే వారిని మంచికై ప్రోత్సహించాలి.
2) చిన్నారులను కలిస్తే విజ్ఞానపరంగా నేర్పించాలి.
3) వృద్ధులను కలిస్తే తగిన ప్రేమ సహాయం అందించాలి.
4) తెలివైన వ్యక్తులను కలిస్తే వారిని గమనించి అనుకరించాలి.
5) అధికారులు ఎదురైతే గౌరవించాలి.
6) మూర్ఖులు, సోమరులు ఎదురైతే వారిని తప్పించుకోవాలి.
7) వినయము గలవారు కలిస్తే వారి తగ్గింపును ప్రశంసిస్తూ వారి నుండి నేర్చుకోవాలి.
8) గర్విష్ఠులు ఎదురైతే లక్ష్యపెట్టకు.
9) దైవభక్తి గలవారు కనిపిస్తే ఆదరించి గౌరవించు.
10) కష్టించి పనిచేయువారు కనిపించినపుడు ప్రోత్సహించాలి.

1384. మనతో అతి సన్నిహితంగా జీవిస్తూ ప్రేమించేవాడు మంచి మిత్రుడు. తల్లిదండ్రుల ప్రేమను అంచనా వేయలేము. వారి అవధులు లేని ప్రేమకు విలువకట్టలేదు. విశ్వాసమే విజయము ఆ విశ్వాసము చిన్న పదమే కావచ్చు. ఆలోచించగలిగితే ఒక్క నిమిషంచాలు. అర్థం చేసికొనుటకు రోజు కావాలి. విశ్వాసము దేవునిపై ఉంచి జీవించాలంటే సంపూర్ణ జీవితం అవసరము.

1385. ప్రశాంతంగా జీవించాలంటే అనవసరమైనవాటి జోలికి పోరాదు. పనికిరాని విషయాల్ని పట్టించుకోరాదు. పైకి దీవెనలు లోపల శాపనార్థాలుంటాయి. పైకి ప్రేమగా మాట్లాడినా లోపల ద్వేషం దాగి ఉంటుంది. పైకి మంచి ఆదర్శాలున్న మంచి మనిషిగా వుంటూ లోపల రాక్షసత్వం కలిగి ఉంటారు కొందరు. పైకి నిజాయితీగా ఉంటూ లోపల నటనా జీవితము నేటి మానవులలో తరచుగా కనిపిస్తుంటాయి. సహృదయంతో స్వచ్ఛమైన ప్రేమతో కపటము లేని జీవితం జీవించాలి.

1386. నిన్ను హీనంగా చూస్తూ, తక్కువ చేసి మాట్లాడిన వారిముందు మౌనంగా ఉంటూ తిట్టినప్పుడు కోపం ప్రదర్శించక పొగిడిన వారి ముందు గర్వంతో విర్రవీగరాదు. ఈ అనుభవాలతో ప్రగతిపథంలో ఒక్కొక్క మెట్టు అధిరోహిస్తూ ఉత్తమ వ్యక్తివి కాగలవు. జీవితంలో అతి ప్రమాదకరమైది దుఃఖం. దాన్ని దిగమ్రింగాలి. నిరాశ, భయంకరమైనది పట్టించుకోరాదు. అన్నిటికన్నా అసూయ నీచమైనది. దరిరానీయరాదు.

1387. జీవితంలో మంచి మార్పులు జరిగినప్పుడు ఆనందించాలి. చెడు మార్పులకు కృంగిపోయి, నిరాశ చెందరాదు. అంతా దేవుని చిత్తంలో ఆయన ఆజ్ఞ ప్రకారమే జరుగుతుందని నమ్మాలి. అప్పుడే మనస్సు శాంతితో నిండిపోతుంది. మనిషి చూపులకు అందంగా ఉంటే సరిపోదు, మనస్సూ అందంగా ఉండాలి. చదువు గొప్పగా ఉంటే సరిపోదు, చక్కని సంస్కారము ఉండాలి.

1388. కష్టము చేసిన దానిలో గౌరవము దాగి ఉంటుంది. మోసం చేస్తే అది మనకు పతనావస్థనిస్తుంది. మనము నిజాయితీగా ఉన్నంతవరకు ఇతరుల గుర్తింపుకై తాపత్రయపడరాదు, నటించరాదు. బాల్యంలో నడక నేర్చినపుడు ఏదైనా ఆసరాగా పట్టుకున్నట్లు, పెద్దయ్యాక పెద్ద సమస్యలను కూడా తట్టుకొని నిలబడాలి.

1389. కొందరు వ్యక్తులు ఏ పనీ చేయకుండా సోమరిగా ఉండేవారు, చేయకుండా చేశాననేవారు అధములు. కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్విష్టి. ఎంతో చేసి కొంచమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు. జీవితంలో గురి కలిగి జీవించాలి, గురి క్రీస్తే. నిత్యజీవంలో ప్రతిఫలం పొందుదునన్న నిరీక్షణతో పౌలు నేర్పిన రీతిగా లక్ష్యాన్ని చేరే క్రమంలో తప్పులు ఎదుర్కొంటామని నిరుత్సాహాలు ఎదురవుతాయని బాధపడరాదు. లక్ష్యం లేనివాడు వంద తప్పులు చేస్తాడు. అందుకే మంచి లక్ష్యాలు కలిగి ఉండాలి.

1390. అస్తమిస్తున్న సూర్యుడు నా పని ఇక ఎవరు చేస్తారనంటే, వెంటనే కారుచీకటిలో కాంతినిచ్చే చిరుదీపం నేనున్నానన్నదట. సూర్యకాంతి పగలుకే పరిమితము. ఆత్మవిశ్వాసము, దైవచింతన, అన్నివేళలా ధైర్యమునిచ్చి, జీవితాన్ని నిర్భయంగా కొనసాగించే స్ఫూర్తినిస్తుంది.

1391. ప్రతి అనుభవము జీవితంలో ఎక్కడో ఒకచోట ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఏ అనుభవము సులువుగా రాదు, అనుభవంతోనే వస్తుంది. మంచివారితో మంచిగా స్నేహంచేయాలి. కొన్నిసార్లు ముంచేవారే ఎదురు అవుతారు గనుక జాగ్రత్తపడాలి. క్రీస్తే వెలుగన్న మాటను బట్టి ఆ వెలుగుతో నింపుకుంటే పాపమనే చీకటి పారిపోతుంది.

1392. నేటి సంఘాలలో ఉజ్జీవము కనిపించడంలేదు. కొన్ని కారణాలుంటాయి. ఆరాధన ఉంటుందిగాని అర్పించే మనస్సు తక్కువ. ప్రార్థన ఉంటుందిగాని పరిశుద్ధత ఉండదు. అలంకరణ ఉంటుందిగాని నిజమైన దీనమనస్సు కావాలి. ఉద్రేకము ఉందిగాని ఆత్మల భారము లేదు. భక్తి ఉందిగాని శక్తి ఉండుట లేదు. వాక్చాతుర్యము ఉందిగాని, ఆత్మ నడిపింపులేదు. వాక్యజ్ఞానము ఉంది గాని క్రీస్తు మనస్సు కావాలి. మంచి విశ్వాసులముగా జీవించాలి.

1393. నీ బలము చూపి ఎదుటివానిని గెలవడం సులభంగాని, నీ గుణం చూపించి ఎదుటివారి మనస్సును గెలవలేవు. దేవుని చిత్తంతోనే మన జీవితంలో వ్యక్తులు మనలను ప్రేమిస్తారని గ్రహించాలి. దేవుని ప్రేమించే వారికి అనేక ఆశీర్వాదాలు ఉంటాయి. **"వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుతుంది"** (రోమా 8:28) **"వారు జీవకిరీటమును పొందెదరు"** (యాకో 1:12). **"ఆస్తికర్తలుగా చేయుదును వారి నిధులు నింపుదును"** (సామె. 8:21).

1394. దేవుని వాగ్దానాలు నమ్మదగినవి. అందుకే దేవుడు మనకు బలము, శైలము, కోట, కేడెము, రక్షణశృంగము, ఉన్నత దుర్గము మన దేవుడు. నా దేవుడని చెప్పగలగాలి. ఒక దీపం వేయి దీపాలను వెలిగిస్తుంది. ఒక విద్యావంతుడు వేలమంది విద్యావంతుల్ని తయారుచేయగలడు. ఒక కోటీశ్వరుడు తోటివారిని కూడా కోటీశ్వరుడిని చేయలేడు, చేయడు. పంచుకుంటూపోతే ధనం తరిగిపోతుంది. పంచిన విద్య అనేకమందిని విజ్ఞానవంతులుగా మార్చగలదు.

1395. గెలుపు, ఓటములు మనకు తప్పదు. గెలుపు ఒక దగ్గర ఆగిపోదు. ఓటమి ఎప్పుడూ నీతో ఉండిపోదు. గురి కలిగి జీవిస్తూ అనుకున్నది సాధించేవరకు ప్రయత్నలోపం రాకుండా శ్రమించాలి. పౌలు–నా ముందున్న పందెములో

గురి కలిగి ఓపికగా, సహనంతో సాగిపోతున్నానన్న మాదిరి చూచి మనం నేర్చుకోవాలి. గతాన్ని మార్చుట ఎవరితరము కాదు. భవిష్యత్తులో జాగ్రత్తలు తీసుకొని సాధించే అవకాశాలు జారవిడువకూడదు.

1396. ఆవేశంలో కోపంతో మాటకు మరొక మాట మాట్లాడితే గొడవలు పెరుగుతాయి. అదే మాటకు మౌనం తోడైతే శాంతి లభిస్తుంది. కొందరు అభిమానంతో ఆకట్టుకొని, కట్టిపడేసి బంధాన్ని పెంచుతారు. అవమానించి నిర్లక్ష్యంగా మనస్సును నొప్పించేవారుంటారు. వివేకంతో గమనించి దేవుడిచ్చిన జ్ఞానావగాహనను ఉపయోగించాలి. ఎంత అందంగా ఉన్నా పరిమళం లేని పువ్వుకు విలువ తక్కువ. ఎన్ని బంధాలున్నాయని అక్కున చేర్చుకున్నా ప్రేమ లేనిచో వ్యర్థము. ప్రేమ అన్నింటిని సహిస్తుంది, తాళుతుంది.

1397. మన జీవితాల్లో సంస్కారవంతమైన ప్రవర్తన కలిగి ఉంటే గౌరవించబడగలము. మాటలు బాగుంటే మర్యాద పెరుగుతుంది. నడవడిక బాగుంటే నమ్రతతో జీవిస్తాము. అందరి అభిమానం పొందగలము. మంచి మిత్రులు మన చెంతకు రాగలరు.

1398. కష్టపడుచు పైకి ఎదిగినవారికి మంచి విలువలున్న సంస్కారం అలవడుతుంది. ఒక్కసారిగా పైకి వస్తే అహంకారిగా మారగలడు. అంచెలంచెలుగా స్వయంకృషితో దైవమును గుండెల్లో దాచుకుంటూ తోటివారిని ప్రేమిస్తూ జ్ఞానవివేకముతో ప్రవర్తించాలి. రక్తబంధువులకు అవసరములోనున్న వారిని ఆదుకోవాలి.

1399. ప్రతి ఉదయము దైవధ్యానంతో ఆరాధిస్తే దైవసన్నిధి సదా మనతో ఉంటుంది. ప్రతి అక్షరము ఏదో ఒకచోట ఉపయోగపడుతుంది. ఆ విధంగా చేసిన ప్రతి పనికి మనకు మంచి ప్రతిఫలము దేవుడిస్తాడు. అర్హతలేని వారికందించేది దేవుని కృప. మనము పొరపాట్లు చేసినప్పుడు క్షమించేది, తప్పించేదానిని దయ అంటాము. కృప, దయ సమృద్ధిగానిచ్చేది దేవుడే. దేవుడు సదా మంచి ఈవులను ఇచ్చి దీవిస్తారని నమ్మి సదా ధ్యానించాలి.

1400. వినేవారికి నచ్చింది చెప్పడంకాదు గాని, నమ్మకమనేది నిజం చెప్పడంలోనే ఉంది. నిజమైన ఆనందము ఎలా లభిస్తుందనగా నలుగురిని ప్రేమిస్తూ ఆప్యాయత పంచుకోవాలి. ఒంటరిగా నిందిస్తూ, సణుగుతూ గడుపుట నిరాశ కలిగిస్తుంది. ఎవరో తోడుంటే వచ్చే ధైర్యంకన్నా, ఎవరికి వారే దావీదు

రాజు వలే ప్రాణంతో మాట్లాడుతూ, నా ప్రాణమా, నాలో ఎందుకు కృంగియున్నావు? దేవునియందు ఇంకనూ నిరీక్షణతో ధైర్యంగా జీవించు అని ప్రార్థించాలి.

1401. పేదలను ఆదుకోవాలని దేవుని అభీష్టము. లేమిలోనున్న వారిని, అవసరతలో ఉన్నవారిని ఆదుకొని సహాయపడి మేలుచేస్తూ ఎప్పుడు అట్టి అవకాశ మొస్తుందో దేవుని సంతోషపెట్టగలనో అని ఆలోచన కలిగి ఉండాలి. గతంలో అట్టి అవకాశాలు పోగొట్టుకొనుటవల్ల ఆశీర్వాదాలు పోగొట్టుకొంటే నేటి నుండి మంచి చేయుటకు త్వరపడుదాము. ఆత్మగౌరవమనగా ఎవరికీ తలవంచక జీవించడము. ఆత్మాభిమానమనగా ఎవరిముందూ చేయి చాప కుండుట. ఎవరినీ కాదనలేక ప్రేమించే మనసును ఆత్మీయత అంటారు. క్రీస్తు విశ్వాసులలో ఇది ఉంటుంది.

1402. సూర్యుడు పగలే దారిచూపగలడు. ఆత్మవిశ్వాసము శూన్యములో కూడా దారిచూపగలదు. జీవితము చిన్నదా, పెద్దదా అని ఆలోచించరాదు. సాధ్యమైనంత వరకు ఇతరుల సంతోషము కాంక్షిస్తూ మనము సంతోషంగా జీవించాలి. గొప్ప వ్యక్తిత్వం ఆదర్శాలు గల వ్యక్తి ఎప్పుడైనా విజేతగా జీవిస్తాడు.

1403. జ్ఞానం గలవాడు సంపద ఆశించడు. దయగలవానికి దయ ఆయుధం కాగలదు. పరిశుద్ధ గ్రంథమైన బైబిలును చదివేకొలది, వినేకొలది, ప్రకటించేకొలది, ప్రార్థించేకొలది ఎన్నో ప్రయోజనాలు పొందగలము. వినయము, తగ్గింపు, ఇంగితజ్ఞానము, నిరాడంబర స్వభావము, నిస్వార్థము దైవభక్తిని పెంచుతాయి. ఎంత ఎక్కువగా బైబిలు చదువుతామో అంత ఎక్కువ దైవ విలువ తెలుసుకొని గొప్ప ఆరాధికులము కాగలము.

1404. కొన్నిసార్లు చిక్కుముడిగా ఉన్న సమస్యలు వేధిస్తూనే ఉంటాయి. గెలిచిన మార్గాలను దాటుకుంటూ రైలు తన మార్గములో దూసుకుపోయినట్లే మనము ఎదుర్కొనే అంధకార పరిస్థితులు అద్భుతమైన పరిష్కారము దేవుడే కలిగించగలడు. మనల్ని విజేతలుగా చూడాలని మనలను ప్రేమించే దేవుని అభీష్టమైయున్నది. మన చింత వదలి సేద తీర్చుకోగలము.

1405. కొన్నిసార్లు జీవిత గమనంలో విజయాలే కాదు. పరాజయాలు కూడా ఎదురవుతాయి. చిరునవ్వుతో చూస్తూ ఉపేక్షించాలి. అవే రేపు విజయాలకు బాటలువేస్తాయి. ఎక్కడ అపజయము ఎదురైతే అక్కడే తల ఎత్తుకొనేలా

దేవుడు మనకు మేలు చేస్తాడు. ఎవరు తప్పుచేసినా సర్దుకుపోయే మనస్సుతో గొడవలు రావు. మనల్ని బాధపెట్టినవారిపై ప్రతీకారం తీర్చుకొనే ప్రయత్నం చేయరాదు. శత్రువులను ప్రేమించాలి, వారికై ప్రార్థించాలని క్రీస్తు తెలిపాడు.

1406. ఏ గమ్యానికైనా చాలా దార్లుంటాయి. నీకేవి సరైనవో వెతికిపట్టుకోవడమే జీవితం. క్రీస్తు చెప్పినది నేనే మార్గము, నేనే సత్యము, నేనే జీవము. నేనే అన్న నిశ్చయత చూపించే మార్గము గొప్పది. అది నిత్యజీవమునకు మార్గము చూపించేది. మరొక రెండు దారులున్నాయి. ఇరుకు మార్గము, విశాల మార్గము. విశ్వాసి ఇరుకు మార్గము ఎన్నుకోవాలి. లోకస్తులు వెళ్ళే దారి విశాలముగాను, నాశనానికి దారి చూపును.

1407. జీవితంలో కష్టాలు పోవాలని ప్రార్థించుటకన్నా కష్టమైనా, నష్టమైనా ఎదుర్కొనేందుకు తగిన ధైర్యం ప్రసాదించమని దేవుని నియమంతో ప్రార్థించాలి. గెలవగలిగేవాడు గెలుపుపై గురి పెడతాడు. ఓడిపోయేవాడు గెలిచేవానిపై దృష్టి పెడతాడు. కాని పౌలు– నన్ను బలపరచు దేవునియందే గురి నిలిపి నా ముందున్న పందెములో ఓర్పుగా పరుగెత్తుచు నిత్యత్వం వరకు సాగిపోతానన్నాడు. బాధ్యతగా ఉన్నవారికి బాధలెక్కువ. నీతిగా ఉన్నవారికి నిందలెక్కువ. అయినా దేవుడు హృదయంలో శాంతిని ప్రసాదిస్తాడు.

1408. జీవితంలో విజేతలుగా జీవించాలన్న ఆశావాదంతో ఉన్నవారు ఎట్టి పరిస్థితులనైనా తట్టుకుంటారు. విజయము వారి స్వంతమవుతుంది. దేవుని శక్తిని ఆశ్రయించిన వారి పక్షంగా దేవుడే సమస్యలన్నీ పరిష్కరించే సమర్థతను ఇస్తాడు. మనము ఎలా ఉండాలో, ఏకాంతంలో దైవధ్యానంలో దేవుడే విలువైన పాఠాలు నేర్పుతాడు. మనమెలా ఉన్నామో స్వకీయులు, సమాజము సాక్ష్యం చెప్పగలరు.

1409. జీవితంలో కష్టపడి డబ్బులు సంపాదిస్తూ పరిస్థితులు మరిచిపోతారు. తర్వాత డబ్బులున్నాయని స్వకీయులను, స్నేహితులను హేళన చేస్తూ చిన్నచూపు చూస్తారు. మనిషి వంద సంవత్సరాలు బ్రతికినా స్మశానం చేరాలి. వందకోట్లు కూడబెట్టినా పొట్టకూటికోసమేనని తలంచి ఉన్నదానితో తృప్తిపడుతూ దాతృత్వంతో పేదలను అసరతలోనున్న వారిని ఆదుకోవాలి.

1410. జీవితంలో నీతి నిజాయితీలతో జీవించుట చాలా అవసరము. నీతి నిమిత్తము ఆకలిదప్పులు కలిగి ఉండాలి. పరలోక ప్రాప్తి లభిస్తుంది. నీతి నిమిత్తము

హింసించబడిననూ పరలోకంలో ప్రతిఫలం దేవుడు దాచి ఉంచుతాడు. మోసాలతో, అబద్ధాలతో కీర్తిప్రతిష్టలను సంపాదించిననూ, అవన్నీ పేకమేడల్లా కూలిపోక తప్పదు. నిజాన్ని అనుసరించడం అలా బ్రతుకుట మనిషికి ఉత్తమ మార్గము. క్రీస్తు నీతిగల పవిత్ర జీవితాన్ని అనుకరించాలి.

1411. కష్టాలు ఏడ్చినాపోవు, సుఖాలు నవ్వినారావు. అలవాటైన కష్టాలే సుఖాలవుతాయి. కష్టాల లోయలో కన్నీటి చీకటిలో కీర్తించి పాడుటను దేవుడు నేర్పించగలడు, కన్నీరు తుడిచి ఆదరించగలడు. కన్నీరు పన్నీరుగా, ముత్యాలుగా మార్చగలడు.

1412. దేవుని యందు భయభక్తులు బహు ధైర్యము పుట్టిస్తుంది. ధైర్యమంటే ప్రమాదాన్ని లెక్కచేయకపోవడం కాదు. ప్రమాదాన్ని సరిగా అంచనా వేయడం. దాన్ని అధిగమించడం, సోమరితనం దేవునికి అయిష్టము. కాలము సద్వినియోగం చేసుకోవాలి. సోమరి చీమల వద్ద విలువైన క్రమము, ఐక్యత నేర్చుకోవాలని బైబిలు బోధిస్తుంది. బద్ధకమే మనకు అసలు శత్రువు. అదే ఎదుగుదలకు అడ్డంకిగా ఉంటుంది. పేదరికానికి మూల కారణము. శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును. సోమరి వెట్టి పనులు చేయును.

1413. కొందరు స్వార్థపరులు, మూర్ఖులు ప్రవర్తనలో వారు చెప్పిందల్లా ఒప్పుకోవాలనియు, వారు కోరుకొన్నది దొరకాలనియు, మాకు నచ్చినట్టే ఉండాలని పెత్తనం చేసేవారికి దూరంగా ఉండాలి. దీనులకు, వినయము గలవారికి దేవుడు అండగా ఉంటాడు. మనమెంత చదివాము అనేది డిగ్రీ కాగితాల్లో ఉంటుంది. నీవు ఎంత నేర్చుకున్నావు అనేది నీ ప్రవర్తనలో ఉంటుందని ఒక మేథావి తెలిపాడు.

1414. నడిస్తే పడిపోతామని భయపడితే నడకరాదు, ఓడిపోతామని భయపడితే విజయము రాదు. ప్రయత్నించుచూ సాగిపోతే ఫలితం వస్తుంది. కొన్ని సత్యాలను తప్పుగా అర్థంచేసుకొని అపార్థం చేసుకోరాదు. అర్థం కాకపోతే అడిగి తెలుసుకోవాలి. కొన్ని అపార్థాలు తలెత్తితే అండగా నిలబడేవారుగాని, అర్థంచేసుకొనేవారు దూరమవుతారు. తనమీద తనకు నమ్మకము లేనివారే చేతిగీతలు, నుదిటి రాతలపై ఆధారపడి భంగపడగలరు. చిలకజోస్యాలు, సోది అడుగుట బైబిలు సిద్ధాంతాలకు వ్యతిరేకము. దేవుని నమ్ముట మేలు.

1415. నీతికోసం బ్రతకాలి. నిజాయితీ మనల్ని బ్రతికిస్తుంది. సత్యకోసం బ్రతకాలి. బ్రతుకు ధర్మం నిన్ను కొంతవరకు బ్రతికిస్తుంది. దేవునిపై ఆధారపడి

బ్రతకాలనేది నిత్యత్వం వరకు నడిపిస్తుంది. మంచికోసం, ప్రజల క్షేమం కొరకు ఆలోచిస్తూ మంచి ప్రణాళికలతో జీవితంలో ఉత్తమ ఆదర్శాలతో జీవిస్తే చిరస్మరణీయులుగా సాక్షులము కాగలము.

1416. అందరికీ దాహాన్ని తీర్చేది మంచినీటి బావి. మౌనంగా ఉంటుంది. అదే ఉప్పునీటి సముద్రం ఎప్పుడూ గర్జిస్తూ ఉంటుంది. అజ్ఞాని వదరుబోతుగా అరుస్తాడు. అయితే జ్ఞాని మౌనముగా ఉండి నలుగురికి ఉపయోగపడగలడు. యెహోవా యందు భయము, భక్తి రెండూ ఉంటే జ్ఞానమునకు మూలము అంటాడు సొలొమోను.

1417. శత్రువు గాని, గిట్టనివారు గాని కత్తిపోటు వంటి మాటలతో మన సంతోషాన్ని, సహనాన్ని దొంగిలించగలరు. ఆ సమయంలో వివేకంగా, మౌనంగా ఉండాలి. క్రీస్తు కూడా తన జీవితంలో, శ్రమలో వధకు తేబడిన గొఱ్ఱెపిల్లలాగ మౌనంగా భరించలేదా! శత్రువుకు మన సహనం మరింత ఆనందమిస్తుంది. కనికరం కలిగించదు. ఆ మౌనం వారి గుండెల్లో మంటగా మారుతుంది. ఏదైనా గొడవ జరిగిన సందర్భాన్ని పరిస్థితిని అవగాహన చేసికొని సమాధాన పరచుటకు వివేకం, తెలివి కావాలి. సమాధానపరచువారు ధన్యులు వారు దేవుని కుమారులనబడుదురు.

1418. పౌలు ఫిలిప్పీ 2వ అధ్యాయములో చెప్పిన సత్యమేమనగా అందరూ స్వంత కార్యాలే మనస్కరిస్తారు. దైవకార్యాలు చూడరన్నాడు. కనీసం కనిపించే తోటివారికి చేయూతనిచ్చే ఔదార్యముండాలి. డబ్బు లేని వ్యక్తికి సమాజం విలువనివ్వదు. ఓడిపోయిన వారిని లక్ష్యపెట్టరు. ఫలాలు లేని చెట్టును పక్షులు చేరవు. మననుండి ఏదైనా ప్రతిఫలము లభించినప్పుడే వ్యక్తులు మనలను చేరి గౌరవిస్తారు. పేదలు తిరిగి ఇవ్వలేరని తెలిసి వారిని పరామర్శించాలి, ఆకలి తీర్చాలి, వస్త్రాలు ఇవ్వాలి, ఆదరించి కన్నీరు తుడవాలని క్రీస్తు బోధించారు.

1419. జీవిత యాత్రలో చేదు అనుభవాలు, మానసిక గాయాలు తప్పవు. అందుకని గతాన్ని, కలిసిరావడం లేదని కాలాన్ని నిందించరాదు. ప్రతి నదికి ఒక మలుపు ఉంటుంది. ప్రతి జీవితానికి గెలుపు లేదా విజయం దేవుడు నిర్ణయించి తన రూపంలో మనల్ని సృష్టించారు. ఒక భక్తుడు పాటలో జీవనదిని నా హృదయంలో ప్రవహింపజేయుము, నూతన శక్తి కావాలన్నాడు.

1420. యాకోబు భక్తుడు నాలుక గూర్చి వివరించిన సత్యమేదనగా? నాలుక అగ్నియే. చిచ్చు పెడుతుంది. జాగ్రత్తగా లోపరచుకోవాలి. ప్రపంచంలో ఎక్కువ

ప్రమాదకరమైనది నాలుక. ఏ బంధమైనా తెంచగలదు, ఏ బంధమైనా కలుపుకోగలదు. ఆ నాలుక జగడాన్ని రేపగలదు. సమాధానపరచగలదు. సౌమ్యంగాను మాట్లాడగలదు. నీ నోరు, నీ నాలుక జాగ్రత్త.

1421. నాకేమీ తెలియదు, చేతకానివాడిననే ఆత్మ న్యూనతా భావాలున్నవాడు అమాయకుడు. మూర్ఖుడు. నాకు అన్నీ తెలుసు అనుకుంటాడు. మనిషి నిరంతర విద్యార్థిగా నేర్చుకోవాలి. అందుకే చాలా తెలిసుకోవాలని ఆలోచిస్తాడు. తెలుసుకొన్నవాటిలో సత్యాసత్యాలను గ్రహించేవాడు మేథావి. నిందించడము అలవాటైనవారికి నిజాలు తెలుసుకొనే తీరిక ఉండదు. దేవుడు తన ప్రేమను అపార శక్తిని మనకిస్తాడు. వాటిని సద్వినియోగం చేయుట ఉత్తమ లక్షణము.

1422. మన జీవితాల్లో ప్రతి ఒక్కరిలో అనేక భావాలు దాగి ఉంటాయి. కొందరు వ్యక్తీకరించగలరు, కొందరు గుండెల్లో దాచుకోగలరు. కళ్ళతో చూచేది ఒక్కోసారి నిజం కాకపోవచ్చు. ప్రతి చిరునవ్వు వెనుక సంతోషము ఉందని భ్రమపడరాదు. ఆ చిరునవ్వు వెనుక భరించలేని బాధ ఉండవచ్చు. మన అంతరంగాలను పరిశీలించే సృష్టికర్త మన కన్నీరు తుడవగలడు, నిట్టూర్పులు వినగలడు. ఒక వ్యక్తిని అపార్థము చేసుకొనుటకు త్వరపడి నిర్ణయాలకు రారాదు. గతంలో ఎలాంటివాడో ఆలోచించాలి. గిట్టనివారు కొన్ని కల్పించి పేరు చెడగొట్టే ప్రయత్నంలో అసూయ వల్ల చెడు చెప్పవచ్చు. జాగ్రత్తగా గమనించి జీవించాలి.

1423. జీవితంలో మనల్ని కలిసికొనేవారందరినీ గుడ్డిగా నమ్మితే మోసపోగలము. ఎక్కువ ఎవరి గూర్చి ఆలోచించరాదు. అలుసైపోతాము. దైవధ్యానంలో కాలాన్ని గడుపుట మేలు. ఎక్కువ అదనపు ప్రశ్నలతో వేధించకు శత్రువుగా మారగలవు. అంతా నావాళ్ళేనని ప్రేమించవచ్చు గాని ఎవరి నుండి ఏ ప్రతిఫలము ఆశించక ప్రశాంతత కాపాడుకోవాలి.

1424. మనం ఎదుర్కొనే వ్యక్తులను కష్టపెట్టి వారు మనల్ని ఇష్టపడేలా మార్చలేము. బాధపెట్టి బంధాన్ని నిలపలేము. అందుకే నిన్ను కోరి నీ మాటల్ని, ప్రేమను అర్థంచేసికొని నీవు ప్రేమించే దేవుని గూర్చి తెలిసికోవాలని ఆశించేవారికి తగిన సువార్త బోధిస్తూ, వారి కష్టాల్లో ఆదుకొని, వారిని సంతోషపరిచే పనులు నిర్వహించుట విశ్వాసి కర్తవ్యం.

1425. చెట్టుమీద ఉన్న పక్షికి పడిపోతాననే భయం గానీ, ఆలోచన గానీ ఉండదు. ఎందుకంటే దాని రెక్కలపై నమ్మకం గలది. విశ్వాసి కూడా మహోన్నతుని చాటున నివసించువాడు సర్వశక్తుని నీడను విశ్రమిస్తాడు. తన రెక్కల క్రింద ఆశ్రయముంటుంది. ఆయన రెక్కలతో కప్పి అభయమిస్తాడని నమ్మి కన్నీటి

లోయల్లో కష్టాల చీకటిలో కీర్తించి పాడగల నిబ్బరము క్రీస్తును నమ్మిన విశ్వాసికి దేవుడే కలిగించి అభయమిస్తాడు. మంచి విశ్వాసిగా సాగిపోవాలి.

1426. దైవ వాక్యము నీ జీవితాన్ని మారుస్తుంది. ప్రార్థన అసాధ్యాలను సుసాధ్యము చేస్తూ పరిస్థితులన్నీ తారుమారు చేయగలదు. స్తుతి ప్రతి పరిస్థితిని మార్చగలదు. మనము ఎదుటివారి మంచిని కోరుకుంటే ప్రభువు మన మంచిని కోరు కుంటాడు. సంతృప్తి పేదవానికి సంపదనిస్తుంది. అసంతృప్తి ధనవంతుడిని పేదవానిగా చేస్తుంది.

1427. నిజాయితీతో జీవించేవారు. వినయంతో ఉంటారు. వంచించేవారు వినయము నటిస్తారు. మోసం చేసేవారు మంచితనం నటిస్తారు. ప్రేమించేవారు కొంత అతిశయం చూపించినా మంచివారే. కాలక్షేపం చేసే కొన్ని వేల స్నేహాలు, చెత్త కబుర్లతో సమయం వ్యర్థం చేస్తారు. మంచి సూక్తులు చెప్తూ క్షేమం కోరే మంచి క్రీస్తు విశ్వాసులు భక్తి భావాల్ని హృదయంలో నాటేలా అనుభవం ద్వారా ఆత్మీయ పాఠాలు బోధిస్తారు. పౌలు తిమోతికి వ్రాసే లేఖలలో సంతుష్టి సహితమైన దైవభక్తి లాభదాయకమని తెలిపాడు.

1428. సమయము సద్వినియోగం చేయాలని బైబిలు తెలుపుతుంది. పని నిర్లక్ష్యం చేస్తూ ఆలస్యం చేస్తే సులభమైన పని కష్టము అవుతుంది. అలాగే కష్టమైన పని మరింత కష్టము అవుతుంది. అలాగే కష్టమైన పని అసాధ్యంగా మారుతుంది. మనము చేసే దానమైనా, మంచి పనైనా గుప్తంగా చేస్తే విలువ ఎక్కువ. పదిమందీ మన ప్రతి పనీ, ప్రతి ఆలోచననూ ప్రశంసించాలనీ, గుర్తించాలనీ ఆరాటపడితే మన వ్యక్తిత్వము విలువ తగ్గి మన బలహీనతగా ఉంటుంది. కాలము విలువ తెలియకపోతే జీవితము అర్థం చేసుకోలేడు. నష్టపోతాడు.

1429. మన బాధ్యతలను మనం సరిగ్గా గ్రహిస్తే మన ఆశయాలను పూర్తి చేసుకోవాలనియు శోధించి సాధించాలనే పట్టుదల మనలో కనిపిస్తుంది. మనము మన గురించి గొప్పగా చెప్పుకున్నంత మాత్రాన గొప్పవారం కాలేము. మన వ్యక్తిత్వమును గొప్పగా చెప్పుకొని మనలను ఆదర్శంగా తీసికోగలిగితే అనేక తరాలకు చరిత్రగా మిగిలిపోతాము. ఒక మంచి ఆలోచన నాటితే అది మంచి పనిగా ఎదుగుతుంది. ఒక పనిని నాటితే అలవాటుగా ఎదుగుతుంది. ఒక వ్యక్తిత్వాన్ని నాటితే అదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

1430. ఈ ప్రపంచంలో కష్టమైన పని అంటూ ఏదీలేదు. ఆ పని మనికిష్టం లేకపోవడం వల్ల కష్టమనిపిస్తుందని నమ్మాలి. మనకు వ్యతిరేకంగా మాట్లాడేవారంటే అర్థమేమనగా జీవితంలో వాళ్ళు చేయలేని పని మనము దేవుని శక్తితో చేయటమే. చీకటిగదిలో కూర్చొని దీపం గురించి ఆలోచిస్తే ఏం లాభం. ఏదైనా దీపం వెలిగించుకోవాలి. ఓడిపోయావంటే నీకేమీ రాదనికాదుగాని, నేర్చుకోవాల్సింది ఇంకా వుందని అర్థము.

1431. దేవుడు ఈ జీవితాన్ని అద్భుతమైన బహుమతిగా ఇచ్చాడు. ఎప్పుడూ అందుకోవలసిన అవసరాలు ఆయన చిత్తంలోనే ఉంటాయని నమ్మితే నిశ్చింతగా జీవించగలము. ఎంతకాలము వస్తువులు, వ్యక్తులు నీతో ఉంటారో దేవుడే నిర్ణయిస్తాడు. దేనినీ మనము ఆపలేము. ఉన్న పరిస్థితులలో ఉత్తమ మార్గాలను ఎన్నుకొని దేవుని హస్తము తోడుండగా ఈ సుదీర్ఘ జీవిత పయనము ఓర్పుతో, దీక్షతో, యథార్థతతో జీవించాలి.

1432. తమకేమి కావాలో అది ఎక్కడ లభిస్తుందో తెలిసినవారు జీవితంలో పైకి రాగలరు. శాంతి కావాలి గనుక **"నా శాంతినే మీకిస్తాను"** అన్న క్రీస్తును ఆశ్రయించితే సర్వం లభిస్తుంది. పరలోక ప్రాప్తి కూడా దక్కుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉంచుకోదలచిన వారికి రెండే దారులున్నాయి. అన్ని సమస్యలు ఇతరులతో చెప్పరాదు. ఇతరుల సమస్యలలో తల దూర్చరాదు.

1433. **సహోదర ప్రేమ కలిగి జీవించుటకు కొన్ని సూత్రాలు :**

1) క్రీస్తు మిమ్ములను చేర్చుకొనిన ప్రకారము మీరును సహోదరులను చేర్చుకోవాలి (రోమా 15:7).
2) దేవుడు మిమ్ములను పిలిచిన కారణాన్ని సరిగ్గా గ్రహించాలి (ఎఫెసీ.4:3).
3) మాటతోను, నాలుకతోను కాక క్రియలతో, సత్యముతో ప్రేమించాలి (1యోహాను 3:18).
4) ఒకరినొకరు ప్రార్థించుకోవాలి (యాకోబు 5:16).
5) సత్యమే మాట్లాడాలి (ఎఫెసీ.4:25).
6) మేలైనది అనుసరించి నడుచుకోవాలి (1థెస్స.5:15).
7) నిస్వార్థముగా ప్రవర్తించాలి (1థెస్స.11:33,34).
8) నీ సహోదరునితో పోల్చుకోరాదు (2కొరింథీ.10:12).
9) ప్రాచీన స్వభావము విడిచి నవీన స్వభావం ధరించుకోవాలి (కొలస్స.3:10)

10) సహోదరుని చూచి సణగరాదు (యాకోబు 5:9).
11) సహోదరుని లోపాలు చూడరాదు (మత్తయి 7:3)
12) విరోధము కలిగిన వారితో సమాధానపడాలి (మత్తయి 5:20).
13) క్షమాపణ కోరితే ఎన్నిసార్లయినా క్షమించాలి.
14) భక్తియందు సహోదర ప్రేమ, దయ కావాలి (మత్తయి 8:22).

1434. జీవితము, కాలము మంచి గురువులు. కాలాన్ని ఎలా ఉపయోగించుకోవాలో జీవితం నేర్పిస్తుంది. జీవితం ఎంత విలువైనదో కాలం నేర్పిస్తుంది. పొలములో పంట వేయకపోతే గడ్డి పెరుగుతుంది. అలానే మనసులో మంచి ఆలోచనలకు చోటివ్వకపోతే చెడు ఆలోచనలు వృద్ధిచెందుతాయి. జీవితం వృధా అవుతుంది. మనకు నచ్చినట్లు చేయక దైవ వాక్యాన్ని అనుసరించి చేసేదే నిజమైన భక్తి.

1435. నమ్మకం అయినా, ప్రాణం అయినా ఒకసారిపోతే మళ్ళీ తిరిగిరావు. బ్రతకడం గొప్పకాదు. నిజాయితీగా బ్రతకడమే గొప్ప. ప్రసంగించడం కన్నా పాటించడం మిన్న. సువార్త చెప్పుటకన్నా సువార్తగా మారడం మిన్న. ఎలుగెత్తి పాడటంకన్నా ఏడుస్తూ ప్రార్థించడం మిన్న. అంతర్జాతీయ సేవకన్నా అంతరంగ సేవ మిన్న. అధికారదాహంకన్నా ఆత్మల భారం మిన్న. లోకాన్ని ప్రేమించడంకన్నా దైవాన్ని ప్రేమించి పరలోకం చేరడం మిన్న.

1436. పౌలు భక్తుడు జైలులో బాధల్లో ఉండి ప్రభువునందు ఆనందించండి మరల చెప్పుదును అనందించమని తెలిపాడు. జీవితంలో లభించేది, లభించబోయే మంచి సంపద చిరునవ్వు. ఆ నవ్వుతో కష్టాలను అధిగమించాలి. నీటిలో ఏడ్చే చేప కన్నీరును ఎవరూ గుర్తించలేరు. కొందరి గుండెల్లో దాగిన అవేదనను ఎవరూ గుర్తించలేరు. అయితే సృష్టించిన దేవుడు మన నిట్టూర్పులు వినగలడు. హృదయ భారం గుర్తించి సేదతీర్చగలడు.

1437. ఎవరైనా మిమ్ములను నిందిస్తే, క్రీస్తు కొండమీది ప్రసంగం గుర్తుంచుకోవాలి. జనులు మిమ్ములను నిందించి అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునపుడు మీరు సంతోషించి ఆనందించాలి. పరలోకమందు మన ఫలము అధికము కాగలదు. బాధ ఉంటేనే సంతోషము విలువ తెలుస్తుంది. కోపం ఉంటేనే ప్రేమ విలువ తెలిసికోగలము. స్నేహం అంటే దశలు మారేకొద్దీ దిశలు మార్చుకొనేది కాదు. దశాబ్దాలు మారినా శాశ్వతంగా నిలిచేది నిజమైన స్నేహము. క్రీస్తు చెప్పిన మాటల్లో నేను మంచి స్నేహితుడను, ప్రాణంపెట్టగల మంచి స్నేహితుడనని తెలిపిన క్రీస్తును ఆశ్రయించాలి.

1438. మన మాటలు నిరాశతో నిండి చావాలని తలంచే వారిని బ్రతికించే రీతిగా ఉండాలి. కానీ, బ్రతికున్న వారిని చంపేలాగ ఉండరాదు. మన సద్గుణమే మనల్ని అధికులను చేస్తుంది. మన మూర్ఖత్వం బానిసలను చేస్తుంది. దైవ వాక్యం మన జీవితాల్ని మార్చగలుగుతుంది, ప్రార్థన పరిస్థితిని మార్చగలదు. స్తుతి ఆరాధన మన స్థితిని మారుస్తుంది. మన మనస్సుకు నచ్చిన నిర్ణయము తీసుకోవచ్చు. అది నీ భవిష్యత్తులో బాధపడకుండా చూచుకోవాలి. ఏది చేసినా దేవుడు తీర్పులోకి తెస్తాడని జాగ్రత్తపడాలి, వివేకంతో జీవించాలి.

1439. నిజమైన ఆశీర్వాదానికి గుర్తు ధనవంతునిగా మారుట కాదు గాని, పరిశుద్ధునిగా మారడం. లోకాశలు, ధనాశ పెరిగేకొలది ఆరోగ్యము, బంధాలు, ప్రేమ, ఆప్యాయతలు దూరమవుతాయి. తూటా కంటే శక్తిమంతమైనది మాట. సంబంధాలు పెంచుకొని నిలుపుకోవచ్చు, లేదా తెంపుకోవచ్చు. ప్రశాంతత అనేది మానవుడు మాత్రమే కలిగిఉన్న అద్భుత శక్తి ప్రతి సమస్యకు అతిగా స్పందించడం, వ్యక్తిగతంగా స్వీకరించడం ఎంత తగ్గించుకొంటే మనస్సుకు అంత మంచిది. హృదయానికి నెమ్మది కలుగుతుంది.

1440. గెలవాలనే ఆశతో కాదు, గెలవగలననే నమ్మకంతో ప్రయత్నించాలి. ఎప్పటికైనా విజేతలం కాగలము. పౌలు భక్తుడు– నన్ను బలపరచు దేవునియందే సమస్తము చేయగలనన్నాడు. డబ్బు లేనివాడెన్నడు పేదవాడు కాదు. జీవితంలో ఒక ఆశయమంటూ లేనివాడే నిజమైన పేదవాడు. తప్పు చేయని వ్యక్తులుండరు. కానీ తప్పును సమర్థించుకొనేవాడు మూర్ఖుడు. ఇతరుల తప్పును వేలెత్తి చూపువారు అత్యంత మూర్ఖులు. చేసిన తప్పును సరిదిద్దుకొనేవాడు ఉత్తముడు.

1441. దేవుని చిత్తములో ప్రతి వ్యక్తిని ఎన్నుకొని, గర్భంలో పిండంగా చూచిన దేవుడి బహుమతిగా ఇచ్చిన విలువైన జీవితాన్ని వ్యర్థంగా జీవించరాదు. ఒక పరమార్థము, అర్థం కలిగేలా ఉత్తమ ఆశయాలతో ఒక గురిని కలిగి జీవించాలి. ధీరులు అపజయాలను చూచి కృంగిపోరు. విజయము సాధించేవరకు పోరాటం చేస్తారు. సంపద, జీవితం శాశ్వతంకాదు. మంచితనము, ఉత్తమ ప్రవర్తన శాశ్వతంగా నిలిచిపోతాయి.

1442. మనము జీవితంలో పొందినవన్నీ దేవుడే ఇచ్చాడని నమ్మి ఆనందంగా ఉండి దేవునికి సదా కృతజ్ఞత చెల్లించాలి. ఏదైతే లేదో, అది దేవుడు తప్పక ఇస్తాడని నమ్మకముంచి ఆశాభావంతో ఎదురుచూడాలి. మనము చేస్తున్న పనిలో నిజాయితీ ఉండాలి. మన మాట తీరులో నిజము ఉన్నంతవరకు ఎదుటివారు

ఎంతటివారైనా భయపడరాదు. మన క్షేమం కోరేవారు చనువుగా కోప్పడగలరు. మనల్ని మోసం చేసేవారు మాత్రం నవ్వుతూ చుట్టూ తిరుగుతారు. సూటిగా మాట్లాడేవారికి శత్రువులు ఎక్కువ. తియ్యని మాటలు చెప్పేవారికి మిత్రులు ఎక్కువని గమనిస్తాము.

1443. మన మనస్సులో మాట ఎవరితోనయితే నిర్భయముగా, నిస్సంకోచంగా, నమ్మకంగా పంచుకోగలమో వారే నిజమైన స్నేహితులు. మనము చేసే ప్రతి పని ఎదుటివారికి ఇబ్బంది కలుగకుండా ఉంటేచాలు. ఇంతకన్నా మంచి పని ఇంకొకటి లేదు. జీవితం చాలా చిన్నది. మనకిష్టమైన వారితో వీలున్నంత వరకు ఆప్యాయతతో ప్రేమతో మాట్లాడాలి. ఒకరి మనస్సులో స్థానం సంపాదించడం గొప్ప విజయం కావచ్చు గాని చిరస్థాయిగా నిలుపుకోవడమే అసలైన విజయం.

1444. మనము వెళ్లు దారి అగమ్యగోచరంగా ఉంటే నేనే మార్గము, సత్యము, జీవము అని తెలిపిన క్రీస్తు మార్గం చూపి ఇరుకు మార్గమైనా గమ్యం చేర్చునని విశ్వసించాలి. క్రొత్త మార్గం చూపి చేయిపట్టి నడిపించే దైవాన్ని ఆశ్రయించాలి. దబ్బును పొదుపు చేసేవాడు నిర్భయంగా జీవిస్తాడు. మాటను అదుపు చేసేవాడు సమాజంలో ఎదుగుతాడు. మంచివాని కోపం మంచులాంటిది. వెంటనే కరిగిపోతుంది. చెడ్డవాని కోపం నిప్పులాంటిది ఎప్పుడైనా దహించివేస్తుంది. జాగ్రత్త పడాలి.

1445. మన జీవితాల్లో విభిన్న వ్యక్తులను కలుస్తూ ఉంటాము. మాట తీరు చక్కగా, ఆప్యాయత నిండినదై చక్కని చిరునవ్వుతో ఉండాలి. అది ఇతరులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, ఊరట కలిగించే మాటలతో ధైర్యపరుస్తుంది. అయితే నొప్పించే మాటలు, వ్యంగ్యంగా హేళన చేస్తూ మాట్లాడే మాటలు, కత్తిపోటు వంటి మాటలు తగవు. మన మాటల ద్వారా క్రీస్తు ప్రేమను కనబరిచేవారిగా జీవించాలి.

1446. చదువు వల్ల సంస్కారము నేర్చుకొన్నవాడు, అనుభవాల ద్వారా గుణపాఠం నేర్చుకొన్నవాడు, గొప్ప భక్తుల సాక్షానుభవాల ద్వారా స్ఫూర్తిని పొందగలరు. క్రీస్తు ఉత్తమ పవిత్ర జీవితాన్ని ఆదర్శంగా పెట్టుకొని ఆయన స్వారూప్యము లోనికి రూపాంతరం చెందుట మన కర్తవ్యం కావాలి. ఎవరైనా మనముందు ఏ రీతిగా ప్రవర్తిస్తారో, మాట్లాడతారో అనే దానికన్నా, మన వెనుక మాట్లాడే తీరు ఎట్లాంటిదో గ్రహించగల వివేకం కావాలి. ఆశించడం ఆపితే ఆనందం మొదలవుతుంది. శాసించడం ఆపితే నిజమైన ఆనందం మిగులుతుంది.

1447. తెలివిగా మాట్లాడుట గొప్పకాదు. తెలిసినంత వరకు అవసరమైనంత మాట్లాడుట గొప్ప విషయం. మన సంభాషణలు ఉప్పు వేసినట్లు రుచిగా ఉండాలి. సమయోచితంగా పలకబడిన మాటలు వెండిపళ్ళెంలో ఉంచిన బంగారు పండ్ల వంటివి. ఒక అబద్ధం చెప్పుట వల్ల పోయిన నమ్మకము వేయి నిజాలు చెప్పినా రాదు. అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు.

1448. జీవితంలో గౌరవము, స్నేహము, ప్రేమ అడుక్కొని ఆశిస్తే వచ్చేవి కావు. మనము వాటిపై మక్కువతో ఆశిస్తూ ఉంటే చాలదు. మనల్ని మెచ్చి వాటంతటవ అవే మన దరికి రావాలి, అప్పుడే మనకు విలువ. చేయబోయే పనిని తెలుసుకోవడమే వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడమే నైపుణ్యము. దానిని పూర్తిగా చేయడము సద్గుణము. అవసరమైతేతప్ప అనవసర విషయాలను ఎప్పుడూ వాదించరాదు, ఎప్పుడూ వివరణ కోరరాదు. క్షమాపణలు వద్దు. ఇవి సుఖమయ జీవితానికి సోపానాలు మాత్రమే కాదు, ఉత్తమ వ్యక్తిత్వమునకు గొప్ప లక్షణాలు.

1449. దేవుని ఆలయానికి వెళ్లునప్పుడు చెప్పులు వేసుకొని వెళ్ళరాదంటారు. చెప్పుడు మాటలు విని గొడవలకు వెళ్ళడము రెండూ ఒక్కటే. దీని అర్థము చెప్పుడు మాటలు హానికరములు. జీవితము విలువైనది. అనుభవం అనేది జుట్టంతా ఊడిపోయాక దువ్వెనతో పని ఉండదు. అనుభవం పొందాక జీవించే జీవితం ఉండదు. జీవితంపట్ల జాగ్రత్త వహించాలి.

1450. దేవుడు గర్విష్టులను ఇష్టపడక దీనులకు అండగా ఉంటానన్నాడు. అన్ని వ్యాధులకన్నా భయంకరమైన వ్యాధి అహంకారము. అది ఉన్నవారు సంతోషముతో, శాంతితో జీవించలేరు. ఎదుటివారిని శాంతి, సంతోషాలతో జీవించనియ్యరు. దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరిపివేస్తుంది. సత్సాంగత్యము తగ్గింపునిస్తుంది. బాధల్లో బాగా అవసరమయ్యేది ఓర్పు. శక్తివంతమైన అనుభవంతో మాటలు వస్తాయి. ఆకలి మీద కోపం వస్తే కడుపు మాడేది మనకే. ఇష్టమైన వారిపై కోపం వస్తే ఒంటరి అయిపోతాము.

1451. నీతో ఎవరూ మాట్లాడకపోతే అది వారి తప్పు. నీవు ఎవరితోనూ మాట్లాడకపోతే అది నీ తప్పు. అందరితో స్నేహభావంతో, ప్రేమతో మెలగాలి. మనిషికి బాధ కలిగినప్పుడు కన్నీరు కార్చుట పరిపాటి. అయితే ఆ కన్నీటికి కారణమైన బాధల్ని వదిలివేయుట ఉత్తమము. దేవుడే కన్నీరు తుడిచి ఆదరిస్తాడని నమ్మి

ఆయనను ధ్యానిస్తూ, ప్రార్థిస్తూ ఊరట పొందటం నేర్చుకోవాలి. ఆయనపై ఆధారపడుట ఉత్తమ అనుభవం.

1452. జీవితంలో అవకాశాలు ఎప్పుడూ రావు. చేజారిన అవకాశాల గురించి చింతించక, క్రొత్త అవకాశాలను సద్వినియోగం చేసుకొనుటపై మన ఆత్మీయ స్థితి ఎదుగుదల ఆధారపడుతుంది. లోపాలు లేని మనిషి, లోటు లేని వ్యక్తులు ఉండరు. మనస్సు గాయాలను తలుస్తూ కాలాన్ని వృథా చేయరాదు. తనువు గాయాలు, మానసిక గాయాలు స్వస్థపరచు దేవునిని ఆశ్రయించాలి.

1453. ఇతరుల గెలుపును చూసి అసూయపడని వారు అందరి కంటే ఆనందంగా జీవిస్తారు. మనము జీవించడానికే సంపాదించాలిగాని సంపాదనే జీవితము కాకూడదు.

1454. ఒక వ్యక్తి బాధ మరొక వ్యక్తి మాత్రమే తీర్చగలడు. ఎన్ని కష్టాలు ఉన్నా మనస్సుకు నచ్చిన వారితో పంచుకొనుటకు ప్రయత్నించాలి గాని స్వార్థంగా ఉండరాదు. జీవితము, గడియారము ఒక్కటే అంటారు. రెండూ వేగంగా పరుగెత్తేవి. ఒకవేళ ఆగిపోయితే ప్రయోజనం లేదు. జీవితాన్ని గురివైపు చూస్తూ నిత్యత్వం గుర్తుంచుకొని యేసు వైపు చూస్తూ, కాలం సద్వినియోగం చేస్తూ సాగిపోవాలి.

1455. బాధ్యతగా ఉన్నవారికి బాధలెక్కువ. నీతిగా ఉన్నవారికి నిందలెక్కువ. నిజాయితీగా ప్రేమించేవారికి కన్నీళ్ళు ఎక్కువైనా ఆ కన్నీళ్ళు గుర్తించి కవిలెలో దాచి దేవుడు ప్రతిఫలమిస్తాడు. భాష్పబిందువులు తుడిచి ఓదార్చువాడు దేవుడే. చీకటిని చూచి భయపడరాదు. చిన్న క్రొవ్వొత్తి వెలిగిస్తే చీకటి పారిపోగలదు. అలాగే ఆశాభావంతో ఉంటే నిరాశ పారిపోతుంది.

1456. నిరంతరము ఆనందంగా ఉండాలంటే మనస్సు బాధపరచే విషయాలనుండి దూరంగా ఉండాలి. తప్పులు వెదకుట ప్రారంభిస్తే ఆనందం కోల్పోతాము. క్రీస్తు మన తప్పులు క్షమించి ఎప్పటికి గుర్తుంచుకోరు గనుక ఆయన ప్రేమ, క్షమలో మనము జీవించాలి. ఏ పనినైనా ఎలా చేయాలో తెలిసికొనుట వివేకము. దానిని సక్రమముగా పూర్తిచేయడమే సద్గుణము.

1457. కష్టసుఖాలు సీజన్ల వంటివి. అవి రావలసిన కాలంలో వస్తాయి. ఉండవలసిన సమయంలో ఉంటాయి. ఓర్చుకోవడం అలవాటు చేసుకోవాలి. ఏమి చేసినా ఆత్మ విశ్వాసంతో చేయాలి. శ్రద్ధగా పనిచేయువాడు ఐశ్వర్యవంతుడు కాగలడు.

1458. తేనె ఎంత మధురంగా ఉన్ననూ దాహం తీర్చలేదు. సముద్రములో ఎంత నీరు ఉన్నా దాహం తీర్చలేదు. మన బంధాలు, బంధుత్వాలు మానసిక వ్యధకు ఉపశమనమివ్వలేవు. మన బాధలు, కష్టాలలో ఆదుకోగలిగిన దేవుని పాదసన్నిధి అమూల్యమైన పెన్నిధి. సమస్యలను పరిష్కరించే సమర్థుడు కూడా మన సృష్టికర్తయే. మనోధైర్యమే మంచినీరుగా నిలబెట్టగలదు.

1459. మన బాధలను పట్టించుకోవాలని ఆలోచించేవారు లేకపోవచ్చు. మన కన్నీరు తుడుచుటకు కూడా ఎవరూ లేకపోవచ్చు గాని మన పొరపాట్లు ఎత్తి చూపుటకు చాలామంది ఉంటారు. మన ప్రతి పాపాలను క్రీస్తు దగ్గర ఒప్పుకొని క్షమ పొందగలిగితే హిమము కంటే తెల్లగా మన పాపాలు పరిహరించగలరు. శుద్ధ హృదయము కలిగించి, శాంతినిచ్చి, ఆదరించు క్రీస్తును సదా ధ్యానించాలి.

1460. ఉన్నత స్థాయిలో ఉన్నవారంతా కష్టపడ్డవారే. మన పొరపాట్లు, మనపైని విమర్శలు, లేనిపోని అపోహలు, అవహేళనలు, అపనిందలు, అవమానాలు, అవేదన ఇవన్నీ మన గెలుపుకు నిచ్చెనల వంటివి. వాటినుండే ఒక్కొక్క మెట్టు ఎక్కుకుంటూ, ఈ తప్పులన్నీ తొక్కుకుంటూ, తగ్గించుకుంటూ ముందుకు సాగిపోతే విజయము తప్పదు.

1461. ఒక బాధ వంద సంతోషాలను దూరం చేస్తుంది. అదే వేయి సంతోషాలను బాధ తొలగించలేదు. ఇంటి కప్పులోని రంధ్రం ఎండలో కనిపించదు. వర్షం వచ్చిన రోజు బయటపడినట్లే, స్వకీయుల, స్నేహితుల ప్రేమ బయటపడి వారి మనస్సును అర్థం చేసుకోగలం. ఎట్టి సహాయం అందించినా స్వీకరించాలి. అది సహాయమైనా, బాధయైనా నమ్మకద్రోహమైనా ప్రేమ అయినా, తిరిగి వారికి వడ్డీతో సహా అందించవలసి ఉంటుంది.

1462. నోటిని రెండు విషయాల్లో కాపాడుకోవాలి. తినేటప్పుడు, మాట్లాడే సమయాల్లోను గుర్తుంచుకోవాలి. మొదటిది– ఆరోగ్యాన్ని కాపాడితే, రెండవది– బంధాన్ని కాపాడగలదు.

1463. కష్టపడకుండా వచ్చిన డబ్బు కడదాకా నిలవదని తెలుసుకోవాలి. అవసరానికి మించిన ఆస్తి నిరుపయోగం. అసత్యము సత్యమును సమాధి చేయదని తెలుసుకో. అవినీతి సుళువైనా నిజాయితీ విలువైనదని తెలుసుకోవాలి. అతిగా అరవడం వల్ల మాట విలువ, అనవసరంగా ఏడవడం వల్ల కన్నీటి విలువ

తగ్గిపోతాయి. ఏకాంతంలో ఏకాగ్రతతో దైవధ్యానం చేస్తే ఎన్నో సమస్యలకు దేవుడు సరియైన పరిష్కారం అందిస్తాడని నమ్మాలి.

1464. నిజాయితీగా ఉండడం కూడా ఒక యుద్ధం లాంటిదే. యుద్ధములో ఒంటరిగా నిలుచుట ఎంత కష్టమో, సమాజంలోని నిజాయితీగా ఉండడం కూడా అంతే కష్టము. ఎదగాలంటే ఒదిగి ఉండడం నేర్చుకోవాలి. గెలవాలంటే ఓటమి ఒప్పుకోవడం నేర్చుకోవాలి. క్షమించేవాడికి క్షమించే గుణం ఉంటుంది. పెట్టే వాడికి మనల్ని తిట్టే హక్కు ఉంటుంది. తగ్గితే తప్పులేదు. బైబిలు సత్యాలలో తన్నుతాను తగ్గించుకొనేవాడు హెచ్చింపబడును.

1465. పరిచర్యలో జాగ్రత్త ఉండాలి. పాటించుటలో పట్టుదల ఉండాలి. మనస్సులో క్రీస్తు ఉండాలి. ఒంటరితనంలో ప్రార్ధన ఉండాలి. అన్ని స్థలాల్లో సాక్ష్యముండాలి. ఊపిరి ఉన్నంత వరకు సువార్త చెప్పాలి.

1466. మనల్ని నలుగురు ప్రశంసించాలని ఆశించరాదు. లోకంలో ఏదీ శాశ్వతం కాదు. శాశ్వత ప్రేమలో ప్రేమించే క్రీస్తు ప్రశంస మనకు కావాలి. మనము జీవించే తీరు అందరూ ప్రశంసించగల్గాలి. మంచి పనులు చేస్తే అదే శాశ్వతము మన వ్యక్తిత్వం దేవునిలో, మనుష్యులలో శాశ్వతం కాగలదు. దైవ భక్తి పాపభీతి, సంఘ నీతి ఈ మూడింటినీ పాటిస్తే ఉత్తమ వ్యక్తులము కాగలము. భళా నమ్మకమైన మంచి దాసుడా అనే ప్రశంసలు అందుకోగలము.

1467. మన జీవితాన్ని దుఃఖం పాలు చేసేవి మూడున్నాయి. గర్వము, కోపము, క్షమించలేనిస్థితి వీటికి దూరంగా ఉండాలి.
మంచి వ్యక్తిత్వాన్నిచ్చేవి మూడున్నాయి. నిజాయితీ, అకుంఠిత దీక్షతో చేయు కృషి, అంకిత భావంతో చేయు పని

1468. కన్నీటి విలువ గాయపడ్డ మనస్సుకే తెలుస్తుంది. మనిషి విలువ కష్టాల్లో అనుభవం కల్గిన వారే తెలిసికోగలరు. మన కన్నీరు నిట్టూర్పు గుర్తించిన క్రీస్తు ప్రతి వాని కన్నీరు తుడుచువాడు.

1469. మనము జీవించే జీవితము భారము అనుకుంటే నిరుత్సాహము తప్పదు. జీవించడము పెద్ద బాధ్యతగా స్వీకరిస్తే అది సవాలు విసురుతుంది. పట్టుదల ఉంటే సమస్తము సాధ్యము. సంతోషంగా, ఉత్సాహం మన జీవిత గమనమే జీవించే జీవితానికి అర్థం చెబుతుంది.

1470. **జీవితంలో జాగ్రత్త వహించవలసినవి**

జీవితంలో ఎక్కువ విలువైనవి కుటుంబము, ప్రేమ, స్నేహితులు వీటిని బంగారం కంటె విలువగా భావించి గాజు సామాను వలె భద్రంగా కాపాడుకోవాలి. జీవితంలో స్థిరము కానివి మూడు భవిష్యత్తు, విజయాలు, కాలము ఊహించినట్లుండవు. పూర్తిగా నమ్మరాదు.

1471. గెలువక పోవడం ఓటమికాదు మళ్ళీ ప్రయత్నించక పోవడమే ఓటమి. నీతిమంతుడు ఎన్నిసార్లు పడిననూ దేవుడు లేపగలడనే వాగ్దానాన్ని నమ్మాలి.

ప్రతి మనిషి చుట్టూ ప్రేమ, ద్వేషం, అన్ని ఉంటాయి. మంచి, చెడు, కష్టం, నష్టం దేన్ని దాన్నిగా వదిలేస్తాము. కాని దేనిని ఇష్టపడి సెలెక్ట్ చేసికోగలమో దాన్ని బట్టి మన ఆనందం దాగిఉంటుందని గ్రహించాలి.

1472. సంపాదించే ధనాన్ని, పితరులిచ్చిన స్వాస్థ్యానికి ప్రాధాన్యత నిచ్చే యీలోకంలో రక్తబంధాలకు కాస్త చోటిస్తే మానవత్వం బ్రతికే వుంటుంది. బైబిల్ సూటిగా చెప్తుతుంది. రక్త సంబంధికి నీ ముఖం త్రిప్పుకోకుసుమా తగిన సహాయము చేయి. ప్రేమ అందుకోగలవు.

1473. మనల్ని ఆనందింపచేయగల ప్రయత్నాలు ఏదైనా  గొప్పదే. మనం కూడా మన క్రియల ద్వారా ప్రేమ ద్వారా ఆనందం కల్గిస్తే మన పొరుగు వారు స్వకీయులను ఎంతో ఆనందించి దీవిస్తారు. ఈ జీవితం చాలా చిన్నది. దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించాడు. దానిలో కొంతైనా ఆ ప్రేమ గ్రహించాలి.

1474. జీవితంలో ప్రతి కష్టానికి ఒక సరియైన కారణమేదో వుంటుంది. దానిని అధిగమించుటకు సరియైన సాధనతో పాటు అవకాశాము కూడా వుంటుంది. దేవుడెంతో గొప్ప మిత్రుడు ప్రతి సమస్యకు పరిష్కారమిస్తాడు.

1475. తెలుగు సామెతలలో ఎంతో విలువదాగి వుంటుంది. జీవితానికి అర్ధవంతంగా ఉపయోగం కల్గిస్తాయి.

పెద్దలమాట చద్దిమూట.

కలిమి లేములు కావడి కుండలు.

అడుసుత్రొక్క నేల కాలు కడుగనేల.

జారిన ఘడియ, పారిన నీరు తిరిగిరాదు.

అక్కరకు రాని చుట్టాన్ని వదిలెయ్యాలి.

వియ్యానికి కయ్యానికి సమజోడికావాలి.

1476. కాలము కలిసిరాక పోతే కర్రే పామై కాటు వేస్తుంది
కాలు జారితే తీసికోగలము, కాని నోరు జారితే తీసికోగలమా?
కీడెంచక మేలు చేయాలి.
కొంత తెలిసికొనుట సులువేగాని
అంతా తెలిసికోవడం కష్టము.

1477. మానవత్వం మన మధ్య వుండాలి, దేవుడు దర్శనమిస్తే నమస్కరించగలము. గాని పేదవాడు కనబడితే విసుక్కోవడం సహజము. పేదవాడి ఆకలితీర్చాలి క్రీస్తు సందేశంలో ఆకలి గొన్న వారికి అన్నం పెట్టాలి దాహంగా ఉంటే దాహం తీర్చాలి. చెరసాలలో ఉంటే విడిపించాలి. వస్త్ర హీనుడికి వస్త్రదానం చేయాలి. ఎవరికైనా చేస్తే దేవునికి చేసినట్లే అన్నారు.

1478 బాల్యంలో ఏదో ఆధారాన్ని పట్టుకొని నిలబడతాము. పెద్దయ్యాక ఎంత కష్టమైన, బారాలైనా తట్టుకొని సాధిస్తాము. జీవితం ప్రశాంతంగా కొనసాగాలంటే ఎదుటి వారు మనం కోరినట్లు మారాలని ఆశించరాదు. అలా మార్చాలని కూడా ప్రయత్నించరాదు. మనమే మారాలి. మన కాళ్ళకు ఏమీ గ్రుచ్చుకోకుండా వుండాలంటే మనము చెప్పులు వేసికుంటాము. కాని వీధిలో తివాచీ పరచము.

1479. ధనం పెరిగే కొలది ఆశ పెరిగిపోతుంది. ధనం పెరిగే కొలది ఆరోగ్యము క్షీణిస్తుంది. ధనం పెరిగే కొలది బంధాలు, ప్రేమ అప్యాయతలు అన్ని దూరమవుతాయి.

1480. మన జీవిత వైఖరిని వేలెత్తి చూపిస్తే దాని కర్ధము వారికి నచ్చినట్లు మనము ఉండుట లేదని అర్ధము. అంతేకాని మన కారెక్టరు సరిలేదని కాదు. వేలెత్తి విమర్శించేవారంత అంత నీతిమంతులు కానేరరు.

1481. బంధమనేది మన ఎదుట నిజాయితీగా ఉండడముకాదు. మన వెనుక కూడా అంతే నిజాయితీగా జీవించాలి.

1482. తప్పు చేసేవాళ్ళు రెండురకాలు, తప్పు చేసాము అని ఒప్పుకొనేవారు. ఎవరూ చేయుటలేదా? నేను చేస్తే ఏమి? అని సమర్ధించుకొనే వాళ్ళుంటారు. తప్పుఒప్పుకున్న వారిని మన్నించాలి. సమర్ధించుకుంటే సరిదిద్దాలి. మనిషి తప్పు చేయడం సహజము చేసిన తప్పును తెలుసుకొనే మానసిక పరిజ్ఞానం లేకపోవడమే నిజమైన తప్పు అని గ్రహించాలి.

1483. పుట్టుట ఒక్క క్షణము మరణించుట కూడా ఒక్క క్షణం. ఈ క్షణాల మధ్యలో జీవితం నరకపూరితమైన స్వర్గము అంటారు కొందరు. మంచి నడవడిక అనేది ఎవరో యిచ్చే కానుక కాదు. ఎవరికి వారు అనుసరించి సాధించవలసిన విజయం. అవగాహనతో శ్రద్ధ కల్గి జీవించుట అందరికీ అవసరము.

1484. శత్రువుకు ఒక అవకాశమియ్యాలి. స్నేహితునికి రెండు అవకాశాలివ్వాలి. కాని దేశ ద్రోహికి ఒక్క అవకాశము కూడా యివ్వరాదు. కాదని యిస్తే మన వినాశానికి మనమే కారకులుకాగలము. ఎవరు ఎట్టివారో గ్రహించే అవగాహన కావాలి.

1485. మనకు చదవడం తెలియక గాని ప్రతి వ్యక్తీ ఒక పుస్తకమే. ఒక మంచి విత్తనము మట్టితో పోరాడి దానిని పెకళించుకొని మొక్కగా మొలచి పెద్ద చెట్టు కాగలదు. మొక్క చెట్టుగా ఎదిగి ఫలాలు ఫలిస్తుంది. అట్లే ఆటూ పోట్లూ ఎదురు దెబ్బలకు తట్టుకు నిలబడితేనే ఏ వ్యక్తి అయినా పరిపూర్ణుడు కాగలడు.

1486. ఒక వ్యక్తి ఎదుగుతూ వుంటే ఎదగనిద్దాం. అతను ఎదిగితే నలుగురికీ ప్రయోజనకారి కాగలడు. అవకాశాలు పదిమందికి యివ్వగలడు. ఓడిపోయే వ్యక్తికి మన భరోసా అవసరము. వాడు పడిపోతే వాడు నమ్ముకున్న వారు కష్టాలపాలవలేరు. బాధలు గొప్పవా, బంధాలు గొప్పవా అని అడిగితే బాధ్యత గొప్పది అని చెప్పాలి. అవసరాలకు వాడుకొని వదిలేసే బంధాలు కన్నా అను క్షణంతోడుండే బాధ్యతే గొప్పది.

1487. జీవితానికి పోరాడేవారు కొందరుయితే, పోరడటానికే జీవించేవారు కొందరుంటారు. జీవితంలో నటించేవారు కొందరు. నటిస్తూ జీవించేవారు కొందరు. జీవించినా, పోరాడినా, నటించిననూ దేవుడిచ్చిన విలువైన జీవితం ఒక బహుమతి. దానికి భద్రంగా కాపాడుకొని ఉత్తమ ఫలితాలనందించుట మన కర్తవ్యమని మరువరాదు.

1488. విశ్వాసము లేని జీవితానికి విజయములేదు. విధేయత లేని జీవితానికి విలువలేదు. ప్రభువు లేని జీవితానికి పరలోకం లేదు. అందుకే సిద్దెలలో నూనె ఉండాలి. మనమే జీవజల ఊటగా మారాలి. ఆరాధన ప్రార్ధన. ఉండాలి. విధేయత, విశ్వాసం నిండుగా నిలబెట్టుకోవాలి. ప్రభువుతోడుంటేనే పరలోక ప్రాప్తి అని నమ్మాలి.

తల్లి ప్రేమ ఆదరిస్తుంది. తండ్రి ప్రేమ జాలి చూపిస్తుంది. దేవుని ప్రేమ తల్లిదండ్రుల ప్రేమకు మించిన ప్రేమ చూపగలదు.

1489. ఏదైతే కోరుకొంటామో దానిలో స్వార్ధము కనబడుతుంది. కొన్ని సార్లు దేనినయితే కోల్పోతామో అప్పుడే జీవిత విలువలు అర్ధంకాగలవు. జీవితంలో చాలాసార్లు నిందలెన్నో ఎదుర్కొవలసి వస్తుంది. ఆనింద నిజమైతే మరల మనస్సుతో సరిదిద్దుకోవాలి. అబద్ధమయితే ఉపేక్షించి దానికై చిరునవ్వుతో వదిలిపెట్టాలి.

1490. బాధలు గొప్పవా బంధాలు గొప్పవా అని చూస్తే బాధలే గొప్పవని చెప్పాలి. అవసరాలకు వాడుకొని వదిలేసిన బంధాలు కన్నా అనుక్షణము తోడుండే బాధలే గొప్పవి. ప్రతిరోజూ మన ఆప్యాయతలను ప్రత్యక్షంగా పలుకరించలేకపోయిన ప్రతి ఉదయము అభిమానంతో యితరుల క్రమాన్ని తెలిపే గుడ్‌మార్నింగ్ అనే పలకరింపులో ఆప్యాయతతో పాటు మంచి రోజుగా గడపటంలో దీవెనుంది.

1491. బాల్యం నుండి మంచి అలవాట్లతో పెరిగిన వారే ఉన్నతులు కాగలరు. ఒక సన్మానం పొందడం గొప్పకాదు. అది పొందడానికి నీకు గల అర్హతలోని గొప్పతనముంది. మనము చీకటిలోనున్నామని గుర్తించి వెంటనే వెలుగు వైపు చేసే ప్రయత్నం గొప్పది.

1492. జ్ఞానం యొక్క లక్ష్యం సుఖాన్ని పొందడంకాదు. దు:ఖాన్ని తొలగించుకొని, ఆనందంగా ఉండటం అనే విషయము మన పైనే ఆధారపడి వుంటుంది.

1493. అబ్రాహము లింకన్ గారి కుమారుడు మొదటిగా స్కూల్లో చేరిన సందర్భంలో ఆ టీచరు ఎలా ఆ కుమారుడిని తీర్చిదిద్దాలో మెళుకువ తెలిపిన తీరు వైరస్ అయింది.

అమ్మా! టీచరు గారు, దయచేసి మీరు దగ్గరుండి ప్రేమతో వాడు నేర్చుకోవలసినవన్నీ నేర్పిస్తారా? అవన్నీ వీలైతే సున్నితంగా నేర్పగలరా?

1. ఒక మిత్రుడుంటే ఒక శత్రువు కూడా ఉంటాడని నేర్పండి.
2. అందరు మనుష్యులూ న్యాయంగా ఉండరనీ అందరూ సత్యసంధులు కారని వాడికి తెలియాలి
3. ఒక దుష్టుడున్న చోట ఒక వీరుడు కూడా ఉంటాడని, జిత్తుల మారి రాజకీయనేత ఉండే చోటే అంకిత బావంతో పనిచేసే నేత కూడా ఉంటాడని చెప్పండి.

4. ఉచితంగా దొరికిన 100రూ కన్నా స్వంతంగా సంపాదించుకొన్న 10రూ. ఎక్కువ విలువగలవని నేర్పండి.
5. స్కూల్లో టీచర్‌ని మోసం చేసి పాసవడం కన్నా ఫెయిల్ అవడం గౌరవముగా వుంటుందని నేర్పండి.

1494. 1. ఓడిపోయినపుడు చక్కగా దాన్ని అంగీకరించడం, గెలిచినపుడు మనస్ఫూర్తిగా ఆనందించడము నేర్పండి.
2. అందరితో మృదువుగా ప్రవర్తించమనీ కఠినంగా ఉన్న వాళ్ళతో కఠినంగా ఉండమని నేర్పండి.
3. అసూయకు వాడిని దూరంగా ఉంచగల్గితే బావుంటుంది. చప్పుడు చేయకుండా నవ్వడం నేర్పండి.
4. వాడు విచారంగా ఉన్నప్పుడు నవ్వడము నేర్పగల్గితే నేర్పండి. కన్నీళ్ళు కార్చడము అవమానమేమి కాదని నేర్పండి.

1495. మన కోసమే కాదు, మన అనుకొనే వారి కోసం కూడా బ్రతకడం జీవిత మనవచ్చు.

ప్రేమంటే డబ్బు అందం కాదు, ప్రేమంటే ఒక నమ్మకం.

ఐశ్వర్యముంటే డబ్బు సంపాదించడం కాదు. ఇతరుల నుండి ప్రేమాభిమానాలు సంపాదించుకోవడం.

సంతృప్తి అంటే నచ్చిన దానికోసం వెంట పడడం కాదు. ఉన్నదానిలో ఆనందించడము.

1496. ఓటమిలో కూడా కీర్తి ప్రతిష్టలు ఉండవచ్చనీ గెలుపులో నిరాశ కూడా వుండవచ్చని తెలిసొకోవాలి.

పుస్తకాలు ఎంత అద్భుతంగా ఉంటాయో ఆసక్తితో తెలిసికోవాలి.

అందరు ఒకరి ఆలోచనలు తప్పని విమర్శించినను, అవి దేవుని దృష్టిలో ఉత్తమమని నమ్మి గౌరవించాలి.

అందరు దేన్ని అనుసరిస్తారో అలా చేయక వ్యక్తిత్వం కాపాడుకుంటూ, ధైర్యంగా నమ్మిన ఆశయాలను నిలబెట్టుకొనే మనోబలాన్ని కాపాడుకోవాలి.

అందరూ చెప్పేది వినాలి. సత్యమని నమ్మి జల్లెడలో వడబోసి మంచిని మాత్రమే గ్రహించమని యితరులకు నేర్పాలి.

తమ జ్ఞానాన్ని మేదస్సును ఎక్కువ ధర చెల్లించేవారికి అంకితం చేయాలి. కాని హృదయాన్ని ఆత్మకు వెల నిర్ణయించరాదు అని గ్రహించాలి.

1497. ఉన్నతమైన ఆత్మ విశ్వాసం ఉండాలి. అప్పుడే మానవాళి మీద వాడికి ఉదాత్తమమైన విశ్వాసం ఏర్పడగలదని తెలిసికోవాలి.

అసహనం ప్రదర్శించే ధైర్యంకన్నా, ధైర్యంగా ఓర్పును కలిగి ఉండటం మిన్న. నీతో ఉన్న వారు నిన్ను ఎందుకు కలిసామా అనేలా బ్రతకకూడదు. నిన్ను విమర్శించే వారు కూడా నిన్ను ఎందుకు వదులుకున్నామా అనేలా బ్రతకాలి.

1498. పాతనిబంధనలో గెహాజీ ధనాపేక్షతో రథం వెంట పరుగెత్తగా, క్రొత్త నిబంధనలో వ్యక్తి ఆత్మల రక్షణ కొరకై రథము వెనుక పరుగెత్తాడు. యిద్దరూ పరుగెత్తిన వారేగాని, ఒకరు శరీర అవసరతలకోసం పరుగెత్తారు. ఒకరు దేవుని కోసము మాత్రమే ఇంతకూ మన భక్తి జీవితంలో మన పరుగు దేని కోసము? శరీరము కోసమా దేవుని కోసమా ఆలోచించండి.

1499. ఎ) ఒర్పు నేర్పు వ్యక్తికి అవసరము. ఒర్పు పట్టిన హృదయం విసిగిపోతే వాళ్ళు తీసికొనే నిర్ణయాలు చాలా తీవ్రంగా ఉంటాయి.

బి) కావలసిన వారికోసం కారణము లేకుండా కార్చే కన్నీటి చుక్క చెబుతుంది. ఆ వ్యక్తి నీకెంత విలువైన వాడో గ్రహించగలము.

సి) నీ మనస్సుకు నచ్చిన నిర్ణయము తీసికో, కాని నిర్ణయానికి భవిష్యత్తులో ఎప్పుడూ బాధపడకుండా ఉండేలా చాలా జాగ్రత్తగా చూచుకోవాలి.

1500. ఎ) సంపద ఉప్పునీరు లాంటిది. తాగిన కొద్దీ దాహము పెరుగుతుంది.

బి) ప్రతి మనిషికి ఎదగాలని ఉంటుంది గాని ఒదిగి ఉండుట యిష్టము వుండదు. మనము పిండంగా ఉన్నప్పుడే ఒదిగి ఉండమని తల్లి గర్భంలో ఉండగానే నేర్పించారు. తర్వాత అన్ని అవయవాలలో పరిపూర్ణమయిన పసిపాపలా ఎదిగి అందమయిన ఈ సృష్టిలోకి వస్తున్నాము. అందుకే ఎదగాలి అంటే ఒదిగి ఉండుట మొదటిగా నేర్చుకోవాలి.

1501. ప్రపంచములో అతి ఖరీదయినది నమ్మకము. ఆ నమ్మకము సంపాదించు కొనుటకు సంవత్సరాలు పట్టవచ్చు. ఆ నమ్మకం పోగొట్టుకొవడానికి ఒకే ఒక్క నిమిషము చాలు.

1502. ఎ) మనము మాట్లాడేమాటలు స్వీటుగా, మనస్సు సాఫ్ట్‌గా, భోజనము టేస్టుగా, కోపం షార్టుగా, ద్వేషము లాస్ట్‌గా, స్నేహము బెస్ట్‌గా ఉండాలి.

బి) విషాన్ని ఎన్ని సార్లు వడబోసినా అమృతము అవదు. అలాగే మనల్ని అర్థం చేసికోలేని వాళ్ళకు మన గూర్చి ఎంత చెప్పినా వ్యర్థమే కొన్ని సార్లు బంధాలు అర్థం కావు. కొన్ని సార్లు కొండంత ప్రేమ చూపిస్తారు. తర్వాత ఉన్నామా లేదా అని కూడా పట్టించుకోరు.

1503. ఎ) ఉన్నదానిలో ఆనందం వెతుక్కోవడం మనశ్శాంతి. తనదానికోసం ఆరాట పడడం అశాంతి గనుక సంతృప్తి సహితమైన దైవభక్తి లాభదాయకము.

బి) కొన్నిసార్లు మన మనస్సుకు నచ్చిన నిర్ణయాలు తీసుకోవాలి. కాని నిర్ణయానికి భవిష్యత్తులో ఎప్పుడూ బాధపడకుండా ఉండేలా చూచుకోవాలి.

సి) ప్రపంచంలో అతి ఖరీదైనది నమ్మకం. ఆ నమ్మకాన్ని సంపాదించు కోవాలంటే కాలము చాలా సంవత్సరాలు పట్టవచ్చు. ఆ నమ్మకం పోగొట్టు కోవాలంటే ఒకే ఒక్క నిమిషము చాలు గనుక జాగ్రత్త పడాలి.

1504. **నూతన సంవత్సరంలో బైబిలులో అభయమిచ్చే వాగ్ధాన దీవెనలు**

1. ఆది 12:2 నిన్ను దీవిస్తాను.
2. యెహోషువ 1:5 నీ ముందు ఎవరూ నిలువలేరు.
3. 2 రాజులు 20:5 నిన్ను స్వస్థ పరిచెదను.
4. కీర్తనలు 32:8 నీ మార్గమును నీకు బోధించెదను. నీకు ఉపదేశము చేసెదను. నీకు ఆలోచన చెప్పెదను.
5. కీర్తనలు 20:15 నిన్ను విడిపించెదను.
6. కీర్తనలు 132:15 ఆహారముతో నిన్ను తృప్తిపరచెదను.
7. యెషయా 41:10 నీకు సహాయము చేయువాడను నేనే.

1505. **దేవుని వాగ్ధానాలలో అభయ ముంటుంది.**

ఎ) యెషయా 41:10 నిన్ను బలపరుతును నీకు తోడైయున్నాను.

బి) యెషయా 42:6 నీ చేయి పట్టుకొనియున్నాను. నిన్ను మరువను.

సి) యెషయా 66:13 నిన్ను ఆదరించెదను.

డి) యిర్మియా 31:34 నీ దోషములను క్రమము చేసెదను.

ఇ) యిర్మియా 30:17 నీకు ఆరోగ్యము కలుగ జేసెదను.

ఎఫ్) యెహెజ్కేలు 36:28,29 నేను మీ దేవుడనై యుందును.

జి) నేను మిమ్ము రక్షించెదను.

1506. ప్రార్థించే సంఘాలు ప్రార్థించే వారిని లేపి ప్రోత్సాహించి ఉజ్జీవింప చేయును. నశించే ఆత్మలపట్ల భారములేని క్రైస్తవుడు ఆత్మలో దిగజారిన పోతాడు.

1507. గెలుపు ఎలా పట్టుకోవాలో తెలిసిన దాని కంటె ఓటమిని ఎలా తట్టుకోవాలో తెలిసిన వాడు గొప్పవాడు. దేవుని పట్ల నమ్మకము అనేది అనుబంధాలకు ఆత్మలాంటిది.

1508. **సమర్పణ చేసికొనే భావాలు :**

ఎ) నా జీవితము తీసికో ప్రభువా అది నీకే సమర్పిస్తాను.

బి) నా కాలము నా దినములు స్వీకరించు ప్రభువా, నిన్నే స్తుతించుటకు నా సమయాన్ని, కాలాన్ని వ్యయపర్చగలను. అరిగిపోతాను కరిగిపోతాను.

1509. మహాజ్ఞానియైన సొలోమోను ప్రసంగి గ్రంథంలో వ్రాసిన రీతిగా ఈ లోకంలో సమస్తము వ్యర్ధము. దేవుని పట్ల చూపే భక్తి ముక్తి నిస్తుందన్న సత్యము నిజమైనది. అది వ్యర్ధము కానేరదు.

1510. **నిత్య జీవితంలో అలవర్చుకొనే అలవాట్లు.**

పరమాత్ముని యందు సంపూర్ణ నిష్ఠ ఆత్మలో దృఢత, ఆలోచనలో పరిపక్వత, మనస్సులో సంతుష్టత, వ్యవహారాల్లో సరళత, సంస్కారంలో శ్రేష్ఠత, దృష్టిలో పవిత్రత, మాటల్లో మధురత, క్రియల్లో కుశలత వ్యక్తిత్వంలో రమణీయత అలవర్చుకోవాలి

1511. జీవిత సత్యాల సేకరణ ద్వారా ఎన్నో ఆత్మీయ మెళుకువలను అన్వయించకొని "ఆత్మీయ సత్యవాక్య పరిగెలు" రూపంగా అందించే ఈ పుస్తకము ఎందరికో జ్ఞానావగాహన కల్గించగలదు. చురుగ్గా ఆలోచించే నేర్పు నివ్వగలదు. మాటలలో మాధుర్యాన్ని నింపగలదు. ఆధ్యాత్మికంగా చైత్యన్యాన్ని కల్గించే ప్రసంగాలలో వాడులుకు స్ఫూర్తిని పొంది నేర్పు కల్గించగలదు.

### ప్రజాగాయకుడు
# గద్దర్ నోట శిలువపాట

సిలువ మీద నెత్తుటి దీపమా... మరణము లేని శాంతి రూపమా..
గలగలపారె గంగమ్మలాగ, సెలయేటిలో ఊరే సెలయేరులాగ

పసిపిల్లల నవ్వువోలె నునిమెత్తని హృదయమా..
కన్నుల్లల్లోనా, కన్నీటి ధార గుండెల్లల్లోనా, గునపాల గాయం
సిలువ మీద నెత్తుటి దీపమా... మరణము లేని శాంతి రూపమా..

శత్రువునే క్షమించమని తపించిన రూపమా
అరసేతులల్లో నెత్తుటి ఆరతులు పాదాల మీద పొడిసే పొత్తిళ్ళు
సిలువ మీద నెత్తుటి దీపమా... మరణము లేని శాంతి రూపమా..

దయాగుణమే ధర్మమని సర్వ ధర్మ సారమా.
ఆకలేలేని లోకాల కోసం దుఃఖమేలేని జీవాల కోసం
సిలువ మీద నెత్తుటి దీపమా... మరణము లేని శాంతి రూపమా..

నెత్తురు మడుగులోని నిలువెత్తు దీపమా
నెత్తురును పీల్చే రాచరికాన్ని నడివీధికీడ్చి అవినీతిని చీల్చి
సిలువ మీద నెత్తుటి దీపమా... మరణము లేని శాంతి రూపమా..

మేకులు దించిన చెరిగిపోని సత్యమా
సిలువ మీది నెత్తుటి దీపమా.. మరణంలేని శాంతిరూపమా...
సిలువ మీద నెత్తుటి దీపమా... మరణము లేని శాంతి రూపమా..



ఈ పుస్తకాన్ని మీతోనే ప్రయాణం చేయనివ్వండి.
మీ తలకు దగ్గరగా ఉంచుకోండి.
మీ ఆందోళనలో, అశాంతిలో, నిరాశలో,
నిస్పృహలో ఒక్క పేజీనైనా చదవండి.
సుఖశాంతులతో ప్రశాంత రాత్రిని గడపండి.
“ఆత్మీయ సత్యవాక్య పరిగెలు”లోని అమూల్య సత్యాలు
అనేకులకు దీవెన కరంగా ఉండాలని నా దీన ప్రార్థన.
ఇసులా కరిగిపోయే ఐశ్వర్యము కన్నా
ఈ మాటలు పుస్తక రూపంలో నిలిచిపోయే
అద్భుత అక్షర సత్యాలు.
మనిషిలో మంచిని పెంచి దీవెనకరంగా
క్రీస్తు స్వారూప్యంలోకి మార్చి
దేవుని సదా మహిమపరచు కృప
మీకు లభించును గాక.



# ప్రార్థన

ప్రభూ! నన్ను నీ శాంతికి సాధనంగా చేయి!
ఎక్కడ ద్వేషం ఉందో అక్కడ నన్ను ప్రేమను నాటని!
గాయం ఉన్న చోట క్షమని స్థాపించని!
సందేహం ఉన్నచోట నమ్మకాన్ని వెలుగించని!
నిస్పృహ ఉన్నచోట ఆశను వెలిగించని!
అంధకారం ఉన్న చోట జ్యోతిని రగిలించని!
దుఃఖం ఉన్నచోట సంతోషాన్ని నెలకొల్పని!
అని ఎవరు ప్రార్థిస్తారో వారి జీవితాల్లో
దేవుని మహా వెలుగు ఉంటుంది.
ఆమేన్!!